RNI No. APTEL/2003/12253

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

ज्ञान-विज्ञान विमुक्तये
UGC
University Grants Commission
UGC Care List Group - 1
Journal Sl. No 34 under
Arts and Humanities
Category

Vol : 17 Issue No. 7 Monthly July 2020 ISSN No. : 2456-4702 Rs. : 15/-



యు.జి. సాజన్య

మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు



BHAVA VEENA (భావ వీణ)

Journal of Arts, Literary, Culture & Language Study

(కళలు - సాహిత్య-సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)

Editor : Kolla Sri Krishnarao
E-mail : parisodhanatelugu@gmail.com

7989781963,
9490847482.
Rohini Towers,
2/11 Brodipet,
GUNTUR-2.

Vol. 17 - Issue. 7 - July 2020 - ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 - Rs. : 15/-

EDITORIAL BOARD

Chief Editor

PITTA SANTHI

M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu),(Ph.D).,

C/o. Dr. Busi Venkataswamy

Holy Homes Apartment, Postal colony ,
4 Th Line,- 522 002, Guntur Dist., A.P. Cell no : 7386529274, 7989781963.

ADVISORY COMMITTEE

1. **Prof. G. Yohan Babu,** M.A., PhD.
   Dept. of Telugu,
   Andhra University, Visakhapatnam.
2. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
   Dept. of Telugu,
   Sri Padmavathi Mahila University,
   Tirupathi.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
   Dept. of Telugu, Faculty of Arts,
   Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
   HOD & Research Guide, Dept. of Telugu
   PAS College, Pedanandipadu.
5. **Thottempudi Sree Ganesh,** M.A., M.Phil (Computational Linguistics) (Ph.D)
   Research Scientist, Centre for Applied Linguistics and Transalation Studies, Universityof Heidelberg, Germany.
6. **Dr. Ponnama Reddy Kumari Neeraja** M.A., Ph.D.
   HOD, Dept. of Telugu,
   Govt. Degree College, Puttur, Chittor Dist.

ASSOCIATE EDITORS

1. **Dr.N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
   Asst. Professor,
   Dept. of Telugu & Comparative Literature,
   Sri Krishna Deva Raya University,
   Ananthapuram, Andhra Pradesh.
2. **Prof. V.SANKARA RAO**, M.A.,M.A.,M.Phil,PhD.
   HOD, Dept. of Telugu,
   Madras University,
   CHENNAI, Tamilnadu.
3. **Dr. D. SESHUBABU**, M.A.,M.Phil,PhD.
   Asst. Professor, Dept.of Hindi,
   Moulana Azad National Urdu University,
   HYDERABAD, Telangana.
4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
   Board of Studies Chairman,
   Telangana University, Dichpally,
   Nizamabad, Telangana.
5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
   Dept. of Telugu & O.L.,
   Acharya Nagarjuna University,
   Nagarjuna Nagar, Guntur District.
6. **Dr. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
   Associate Professor, Dept. of Telugu,
   Kakatiya University, Warangal District.
   Telangana.

7. **Dr. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept.of Modern Indian Languages,
Madhurai Kamaraj University, Madhurai,
Tamilnadu.

8. **Dr. N. Eswar Reddy,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Yogi Vemana University, Kadapa.

9. **Prof. P.R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
Dept. of Telugu,
Regional Institute of Education (NCRT)
Manasa Gangothri, Mysore, Karnataka.

10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Dravidian University, Kuppam, Chittor Dist.

11. **Dr. T.SATYANARAYANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept. of Telugu,
Adikavi Nannaya University,
RAJAMUNDRY, East Godavari, A.P.

12. **Mr. D.ESWARA RAO,** M.A.,
Principal,
P.A.S.College, PEDANANDIPADU-522 235,
Guntur, A.P.

13. **Dr. P. VIJAYA KUMAR**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

14. **Dr. K. RAVI**, M.A., M.Phil,PhD.
HOD, Dept. of Telugu, C.R. Reddy College,
West Godavari District. A.P.

15. **Dr. G. Swarnalatha,** M.A., PhD.
Asst. Proffesor, Dept. of Telugu,
Govt. Women's College (A), Guntur.

16. **Dr. V. Naga Rajyalakshmi,** M.A., PhD.
Rt Principal,Govt .Degree College,
Chebrole , Guntur, A.P.

17. **Dr. Guntupalli Gowri,** M.A., PhD.
Dept. of Telugu,
Govt. College for Women, Guntur - 522 002.

18. **Dr. Kakani Sudhakar,** M.A., M.Phil., PhD.
Dept. of Telugu,
S.S.N. College, Narasaraopet - 522 601.

19. **Dr. K. Pushpamma,** M.A., PhD.
HOD, Dept. of Telugu,
SVRM College,
Nagaram - 522 035.

20. **Dr. P. Srinivasa Rao,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Andhra University, Visakhapathan.

21. **Dr. Ch. Praveen Kumar,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Kakatiya University, Warangal.

22. **Dr. N. Rambabu,** M.A., M.Phil., PhD.
Project Senior Fellow, Dept. of Classical
Literature, Nellore.

23. **Dr. G. Sailamma,** M.A., M.Phil., PhD.
Editorial Assistat,
Centre for Publications Dravidian University,
Kuppam, Chittor Dist.

24. **Dr. M. Sangeetha Rao,** M.A., M.Phil., PhD.
Guest Faculty, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

25. **Dr. M. Prasad,** M.A., M.A.(San)., PhD. Diploma in Maliyalam.
School Assistant (Telugu)
Govt. High School,
Rapuru, SPSR Nellore.

26. **Dr. V. Triveni**
Head & Assistant Professor,
Dept. of Telugu Studies,
Telangana University, Dichpally, Nizamabad.

27. **Dr. Mark Poloneyes,** M.A., M.Phil., PhD.
Principal & HOD,
P.G. Centre, Gadwal,
Palamuru University, Mahabobnagar, Telangana.

LEGALADVISER

Dr. A. GURAVAIAH, ***M.A., L.L.M., PhD.,***
Principal & Research Guide, Dept., of Law, A. C. Law College, GUNTUR - 522 002, A.P.

DTP & PRINTING

TENALI PRAKASH, G.L.S. GRAPHICS, LEMALLE, Guntur. 94 94 660 509.

గమనిక : రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - **ఎడిటర్.**

Edited, Printed, Published and owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet,
GUNTUR - 522 002. Andhra Pradesh. Cell : 7386529274, 7989781963.
E-mail : parisodhanatelugu@gmail.com.Printed at : GLS Enterprises, Kavitha Nagar, Guntur - 522 002. Ph. 94 94 660 509.

BHAVAVEENA
Vol. 17, Issue. 7, July 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

నాయని కృష్ణకుమారి

జానపద వాఙ్మయానికి

- సంపాదకవర్గం

BHAVAVEENA
Vol. 17, Issue. 7, July 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

Contents (విషయ సూచిక)

1. దళిత సాహిత్యం - సాంఘిక జీవన స్థితి	- సారంగపాణి బండి	5
2. సినిమా మసుగులో నవ్యసంప్రదాయం	- డా॥. పి.ఎ. సత్యనారాయణ	8
3. మహాభారతం - మానవీయ విలువలు	- డా॥. బశెట్టి ఉపేంద్ర	10
4. గిరిజన జీవితాల్లోని విధ్వంసాన్ని చిత్రించిన ఫణికుమార్ గోదావరి గాథలు	- డా॥. గంగు కిషన్ ప్రసాద్	13
5. రేచర్ల సర్వజ్ఞ సింగభూపాలుడు (ద్వితీయ) - సాహిత్యసేవ	- ఇడికోజు శ్రీనివాసాచారి	20
6. దాశరథి రంగాచార్య నవలలు - ఇతివృత్త వైవిధ్యం	- డా॥. కొప్పు సుభాష్ చంద్రబోస్	26
7. ప్రసార మాధ్యమం భాషలో మార్పుల ప్రభావాల విశ్లేషణ	- యం.సి. కేశవ మూర్తి	30
8. మినీ కవితకు సరికొత్త రూపం 'రవ్వలు'	- డా॥. ఎన్. ఈశ్వరరెడ్డి	36
9. ఆంధ్ర మహాభారతం - స్త్రీ పాత్రల విశ్లేషణ	- డా॥. యస్. చిన్నరెడ్డయ్య	40
10. అనంతపురము జిల్లా కురువల జీవన సంస్కృతి - ఒక పరిశీలన	- కొంకా మల్లికార్జున	54
11. శ్రీ తిరుమల రామచంద్ర చారిత్రక దృష్టికోణం	- డా॥. సనుగుల సునిల్ కుమార్	57
12. తెలంగాణ స్త్రీల కవిత్వం - సామాజిక చిత్రణ	- డా॥ వి. త్రివేణి	61
13. తెలంగాణ రాష్ట్రంలో దళిత ఉద్యమ కవిత్వం	- గైని రవి	74
14. బంజారాల సంస్కృతి జీవన వ్యవస్థ	- డా॥. నెహ్రూనాయక్	78
15. పులుమద్ది పెద్దమ్మ జాతర - వైశిష్ట్యం	- మోత్కురి అనిల్‌కుమార్	81
16. జాషువా కవిత్వం - మానవత్వం	- సైదయ్య మల్లెపాకుల	86
17. ప్రజా జీవన చిత్రానికి దర్పణం వట్టికోట రచనలు	- మేరోజు బ్రహ్మాచారి	89
18. కానూరి బదరీనాథ్ 'జుత్తిగ' రచన - పరిశీలన	- నెమ్మలూరి భవాని	93
19. విద్యార్థి రచనలు సామాజికత	- ఎస్. గోదావరి	95
20. దాశరథి రంగాచార్య జీవన రేఖలు - నవలల ప్రస్తావన	- పి. ఉమా భార్గవి	98
21. జానపద సాహిత్యంలో స్త్రీ పాత్ర చిత్రణ	- రొండి అర్జున్	102
22. రాచపూటి రమేష్ కథలు - జీవన చిత్రాలు	- యస్. చంద్రయ్య	106
23. నిర్మల్ జిల్లా కవుల రచనలలో సామాజిక కోణం	- గడ్డం సత్యపాల్ రెడ్డి	110
24. నిజామాబాద్ జిల్లాలో జానపదుల ప్రదర్శన కళారూపాలు	- తిరునగరి వెంకటేశ్	113
25. మానవజీవనంలో ఆధ్యాత్మిక సోపానాలు	- డా॥. వేదాంతం బి.యమ్.యమ్.ఆర్. యస్.టి.కె. ఆచార్యులు	117
26. తెన్నేటి లక్ష్మీనరసింహమూర్తి గారి కథా సంపుటి - పరిశీలన	- వై. అరుణ ఝాన్సీరాణి	120
27. ఎరుకుల పుట్టుక - జీవన విధానం	- ఎన్. రాజేష్‌కుమార్‌రెడ్డి	121
28. సామాజిక, మత, సాంస్కృతిక అంశాలపై కోవిడ్-19 ప్రభావం	- కందగట్ల శ్రవణ్ కుమార్	133
29. రెండు విభిన్న వాక్యాలు	- డా॥. వెల్దండి శ్రీధర్	137
30. తెలుగు సాహిత్యంలో శంకరనారాయణ	- చొప్పరపు శ్రీనివాసరావు	141
31. శ్రీనాథుడు పోతనల వ్యక్తిత్వం	- డా॥. వి. పళని	151
32. యం.కె దేవకి గారి కథలు - స్త్రీలపై జరిగే అన్యాయాలు	- జి. శోభన కుమారి	154
33. స్త్రీ నవలల్లో 'పునరుత్పత్తి' 'మాతృత్వం' భావనలు	- డా॥. పంతంగి వెంకటేశ్వర్లు	157
34. Critical Appraisal of Narrative techniques	- Dr. V. Nirmala	161
35. Fictionalizing biography : Eighth Hue by Himanshi	- Prashantkumar Mafatlal Chauhan	167

BHAVAVEENA
Vol. 17, Issue. 7, July 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

దళిత సాహిత్యం - సాంఘిక జీవన స్థితి

- సారంగపాణి బండి, పొట్టి శ్రీరాములు, తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్, తెలంగాణ.

మన సమాజం నుండి అస్పృశ్యత కారణంగా వెలివేయ బడిన, సాంఘిక దోపిడీకీ, అణచివేతకూ గురవుతున్న వారిని దళితులు అని సాహితీవేత్తలు వివరిస్తున్నారు. ప్రత్యేకించి ఒక్క కులం లేదా కొన్ని కులాలను కలిపి దళితులు అని అనడంగాని దళిత పదాన్ని ఉపయోగిం చడం కానీ సరికాదని కూడా సాహితీ వేత్తలు వాదిస్తున్నారు. 1971న బొంబాయి నుండి వెలువడిన మరాఠీ "దళిత పాంథర్స్ మ్యానిఫెస్టో"లో దళిత శబ్దాన్ని ఈ విధంగా వివరించారు. షెడ్యుల్డు కులాలు, షెడ్యుల్డు తెగలు, నయా బౌద్ధులు, భూమిలేని పేదరైతులు, శ్రామికులు, స్త్రీలు మతం పేరుతో రాజకీయంగా ఆర్థికంగా దోపిడీకి గురయిన వారందరినీ దళితులుగానే సంభోదించారు. అన్ని రంగాల్లోనూ వెనుకబాటుతనం ఉంది. కానీ ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, మైనారీటీలపై హిందూమతం యొక్క ఆధిపత్యం ఉంది. సామాజిక వ్యవస్థలో సరైనస్థానం లభించని, వివక్షకు గురవుతున్న వారిని, మతాన్ని ఆధారం చేసుకొని సమాజంలో నిమ్న స్థాయిలో బ్రతుకీడుస్తూ, సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక రంగాల్లో జరిగే వివిక్ష, హేతువాదభావనా బలంతో పోరా డుతూ, దేవుడు, విధి, స్వర్గ-నరకాలు, జన్మ-పునర్జన్మ: ఆత్మ-అతరాత్మ: అదృష్టం-దురదృష్టం వంటి భావనలన్నీ దళితులను బానిసలుగా మారుస్తున్నాయని భావిస్తూ, వీటన్నిటికీ 'దళిత' అనే పదాన్ని ఆపాదిస్తున్నారు. సామాజి కంగా తక్కువస్థానంలో (నిమ్నస్తానంలో ఉన్నవారు "దళిత" అనే పదం ఆత్మ గౌరవానికి ప్రతీకగా భావిస్తు న్నారు. చారిత్రక ఆధారాలను బట్టి చూస్తూ వీరిని అతి శూద్రులు, దాసులు, అసురులు, హీనులు, అంటరాని వాళ్ళు, పంచములు, హరిజనులు వంటి వివిధ నామము లతో పిలుస్తున్నారు.

అయితే పంచములు, హరిజనులు అనే పదాలతో కొన్ని వందల సంవత్సరాలుగా వీరిని పిలిచేవారు. స్వాతం త్రోద్యమ కాలంలో నర్సీమెహతా అనే ఓ రచయిత పెట్టిన "హరిజన" పేరును మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీ విస్తృతంగా ప్రాచుర్యంలోకి తెచ్చారు. మతపరంగా దేవుని బిడ్డలనీ అర్థంలో ఆ పదాన్ని వాడారని, అతి తమ ఆత్మ గౌరవం భంగపరచే విధంగా ఉందని దళితులు నిరశిం చారు. అప్పటినుండి "దళిత" అనే పదం ఆత్మగౌరవానికి సమైక్య శక్తికీ ప్రతీకగా ప్రయోగంలో ఉంది.

దళితుల గురించి తొలిసారిగా మంగిపూడి వేంకటశర్మ రాసిన 'నిరుద్ధ భారతం"లో అస్పృశ్యతను నిరిసస్తూ. . . .

> "మాలలని, పంచములటంచు, మాదిగలని
> శ్వపచులని, చెప్పగారాని వారటంచు
> మరియు చండాలురని తోడి మానవులను
> దురతి వేయుట సాంఘిక ధర్మమగునే"

అని సంఘాన్ని ప్రశ్నించారు.

"దళిత" పదంతో పిలిపించుకోవడానికి ఇష్టపుడతూ, ఆ పేరుతోనే తమ భావాలను వివిధ సాహిత్య ప్రక్రియ లుగా అందిస్తున్నారు. అన్ని భారతీయ భాషల్లోనూ "దళిత సాహిత్యం" పేరుతోనే రచనలు చేస్తున్నారు.

దళితుల జీవన విధానాన్ని చైతన్యవంతంగా వర్ణించిన సాహిత్యం దళిత సాహిత్యమవుతుంది. దళితుల అభ్యు న్నతి కోసం ఎవరు రాసినా అది దళిత సాహిత్యంగానే పరిగణించవచ్చునని విమర్శకులు భావిస్తున్నారు. దళితులే తమ సమస్యలకు స్పందించి రాస్తే దాన్ని **"ఆత్మాభిమానం"** గానూ, దళితేతరులు దళితుల పక్షాన్ని వహించి రాస్తే దాని "ఉదార వాదం" గాను వారిని దళిత సానుభూతి పరులగానూ పిలుస్తున్నారు. దళిత సాహిత్యం మరాఠీ భాషలో ముందుగా స్థిరపడి, తరువాత భారతీయ

భాషలన్నింటిలోను విస్తరించినది. దళిత సాహిత్యంలో జ్యోతిబాపూలే, పెరియార్, అంబేద్కర్ భావజాలంతో పాటు, మార్క్సిజం ప్రభావం కూడా కనిపిస్తుంది. "దేశీయ మార్క్సిజం అనే భావన దళితసాహిత్యంలో చర్చలో కొచ్చింది. అందువలన దళిత సాహిత్యాన్ని కాలం, స్వభావాలను అనుసరించి గుర్తించవలసి వుంది. దళిత సాహిత్యం ఆవిర్భవించడానికి శతాబ్దాల సామాజిక పీడనను ఎదుర్కొన్న చారిత్రక నేపథ్యం ఉంది. ఆ నేపథ్యం నుండే "దళిత సాహిత్యం'స్పష్టమైన అంబేద్కర్ తాత్విక భావజాల భూమిక ఆవిర్భవించింది.

జ్యోతిరావుపూలే నిమ్నజాతుల ఉద్ధరణ కోసం సత్య శోధక సమాజం'(1873) స్థాపించారు. హిందూమతంలోని లోపాలను వివరిస్తూ అనేక పుస్తకాలను రాశారు. 1910లో కలకత్తా కాంగ్రేస్ సమావేశం అంటరానితనాన్ని వ్యతిరేకిస్తూ తీర్మానం చేసింది. 1918 సం॥లో అశికభారత దళిత జాతుల సమావేశాలు బొంబాయిలో జరిగాయి. 1924 సం॥లో డా. బి.ఆర్. అంబేద్కర్ అస్పృశ్యత నివారణోద్యమాన్ని ప్రారంభించారు. ఈ ప్రభావం భారతదేశంలో ప్రధానంగా కర్ణాటక, గుజరాత్, తమిళనాడు, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో బలంగానే కనిపించింది. అప్పటినుండి దళిత ఉద్యమాలు ఊపందుకున్నాయి. మన తెలుగు వారికి ఈ ఉద్యమాలు మార్గదర్శకం చూపినాయి. 1967 సం॥లో జ్యోతిబాపూలే, సాహూ మహారాజ్, సిద్ధాంతాలు నీగ్రో సాహిత్యంలోని తిరుగుబాటు కలగలిపి అంబేద్కర్ భావజాలాన్ని ప్రధానంగా చేసుకొని 'దళిత సాహిత్యం' ఆవిర్భవించింది. 1981సం॥లో భారతీయ దళిత సమాచార పత్రికా సంపాదకుల సదస్సు జరిగినది. 1984 సం॥లో భారతీయ దళిత సాహిత్య అకాడమీనీ స్థాపించారు. కాన్సీరామ్ 1984 సం॥ నాటికి అంబేద్కర్ భావజాలంతో బహుజన సమాజ్‌పార్టీనీ స్థాపించారు. వీటి ప్రభావం వలన రాజకీయంగా కూడా దళితులతో చైతన్యం వెల్లువెత్తినది. ఈ ప్రభావం కూడా తెలుగు సాహిత్యంపై కనిపించినది.

సాహిత్య చరిత్ర పరంగా చూసినపుడు 12వ శతాబ్దంలో శివకవులు నిమ్న జాతీయులని పిలువబడుతున్న దళితులను శైవమతం వైపు ఆకర్షించేటట్లు చేసిన కొన్ని రచనలు కనిపిస్తాయి. 13వ శతాబ్దం నుండి 16వ శతాబ్దం వరకు భక్తి ఉద్యమం పేరుతో హిందూ మతంలో సంస్కరణ దిశగా చాలా రచనలు వచ్చాయి. 16వ శతాబ్దంలో శ్రీకృష్ణ దేవరాయలు 'ఆముక్తమాల్యద'లో మాల దాసరికథ రాయడంలోనూ కుల ప్రభావం గుర్తించారు. 17వ శతాబ్దంలో పోతులూరి వీరబ్రహ్మం, వేమన వంటి కవులు కులం వలన కలిగే నష్టాలను నిరసిస్తూ రచనలు చేశారు. తెలుగు రాష్ట్రాలలో 18,19వ శతాబ్దాలలో జమీందారీల పెత్తనం, అంధికారం క్షణించటం, పాశ్చాత్య విద్యకుల ద్వారాలు తెరిచాయి. క్రైస్తవ సాహిత్యం, ఉన్నత వర్గాలు, వర్ణాల వారి గురించి రాయడం అనివార్యంగా మారినది. భారతదేశంలో జరిగిన పాలన, ఆర్థిక అంశాల కారణంగా సామాజికంగా చాలా ఉద్యమాలు వచ్చాయి. ఈ ప్రభావం వలన వెలువడుతున్న సాహిత్యంలో దళిత సాహిత్యం ఒక ప్రత్యేకతను సంతరించుకుంది. 1960 నుండి దళిత సాహిత్యం ప్రాచుర్యాన్ని సంపాదించుకుంది. ఈ పరిణామాలను ప్రముఖ విమర్శకులు ఆచార్య కె.కె. రంగనాధాచార్యులు విశ్లేషించారు. 1970సం॥లో మారాఠీ, కన్నడ భాషలలో నిర్ధిష్ట లక్ష్యాలతో దళిత సాహిత్యం పురోగమించింది. 1980 సం॥లో దళితచైతన్యం నిర్ధిష్ట రూపాన్ని పొందినది. ఆ తరువాత 1990 స॥ మొదలయ్యే టప్పటికీ "దళిత సాహిత్యం" సాహిత్యంగా నిలదొక్కుకునే ప్రయత్నం చేసింది. ప్రాచీన, ఆధునిక సాహిత్యాన్ని ప్రశ్నిస్తూ తనదైన శైలిలో ముందుకొస్తూ, వేమనతత్వ కవులు మానవతా దృక్పథంతోనూ, గురజాడ హేతువాద దృక్పథంతోనూ దళితుల సమస్యలను సృజనీకరించారు. సంఘసంస్కరణోద్యమాలు ప్రధానంగా స్త్రీ సమస్యలపైనే కేంద్రీకరించినా కొంతవరకు కుల సమస్యను కూడా గుర్తించాయి. అభ్యుదయ సాహిత్యం శ్రామిక, పీడిత వర్గ సమస్యలలో భాగంగానే దళిత సమస్యలకు పరిష్కారాన్ని

సూచించినది. విప్లవ సాహిత్యం గిరిజన సమస్యలతో పాటు దళిత సమస్యలను వర్గ దృష్టితో ప్రాధాన్యత నిచ్చింది. వర్గం కంటే దళిత సమస్య ''కులం''తోనే ముడిపడి ఉందని గుర్తించినది.

1909 సం॥లో ఒక అజ్ఞాతకవి రాసిన ''మాలవాండ్ర'' పాటను తొలి దళిత గేయంగా పరిశోధకులు భావిస్తున్నారు. ఇది ఆంధ్రభారతీ మాసపత్రికలో అచ్చయినది. ఆ తరువాత 1911 సం॥లో గురాజడ అప్పారావు కుల సమస్యలను గుర్తిస్తూ ''ముత్యాల సరాల్లో''రాశారు. మంగపూడి వేంకటశర్మ 1915 సం॥లో 'నిరుద్ధ భారతం'' అనే పద్య కావ్యాన్ని రాశారు. అస్పృశ్యతను నిరశిస్తూ దళితేతరులు రాసిన తొలి పద్యకావ్యంగా దీనిని విమర్శకులు భావిస్తున్నారు. 1921 సం॥లో కొండపల్లి జగన్నాథ రావు రాసిన ''మేలుకొలుపు'' గీతం పురాణాల్లో దళితుల యొక్క గొప్పతనాన్ని కీర్తించే విధంగా రాశారు. జాలా రంగస్వామి 1930 సం॥లో రాసిన ''అంటరాని వాడెవ్వడు'' పాట, 1933 సం॥లో కుసుమ ధర్మన్న రాసిన ''హరిజన శతకం'' దళితుల మనోభావాలను బాగా తెలియజేశారు. 1933 సం॥లోనే కుసుమదర్మన్న రాసిన ''మా కొద్దీ నల్ల దొరతనము'' గేయము చాలా ప్రసిద్ధి చెంది ఒక ఊపు ఊపినది. గుర్రం జాషువా రాసిన ''గబ్బిలం'' 1941 సం॥లో దళితుల వేదనాభరిత జీవితాలను అపుడే మొలకెత్తుతున్న తిరుగుబాటు తనాన్ని శక్తివంతంగా వ్యక్తీకరించారు. నా కథ దళిత ఆత్మకథకు ప్రేరణ నిచ్చే రచనని గుర్రజాషువా రాసుకున్నారు. బోయి భీమన్న పురాణేతిహాసాల సమగ్ర అవగాహనతో గాంధీ, అంబేద్కర్ తాత్విక భావాల సమ్మేళనాలతో గొప్ప రచనలు చేసినారు. ''గుడిసెలు కాలిపోతున్న రచనలలో ముఖ్యమైనవి. ఈ రచనలు దళితులకు ప్రేరణనిచ్చాయి. దళిత సాహిత్యం ప్రధానంగా ''దళిత కవిత్వమే'' అన్నంతగా కవిత్వం వెలువడింది. కథలు కూడా ఎక్కువ గానే వచ్చాయి. నవలలు, నాటకాలు కూడా వచ్చినా సంఖ్యాపరంగా చెప్పుకోదగినన్ని రాలేదు. 1985 సం॥ తరువాత వచ్చిన రచనల్లో జీవితానుభావాలతో కూడిన దళిత చైతన్యం ప్రతిఫలిస్తుంది.

సాహిత్య వికాసంలో వివిధ భావజాలాల పాత్ర ఎంతో ఉంది. దళితులు కులపరంగా ఎదుర్కొనే అణచివేత, దళిత సంస్కృతి చిత్రించే కథలు వర్గవాదకోణంలో వచ్చిన, మొత్తం సాహిత్యంలో చాలా తక్కువ.

భావాద కాలంలోని సాహిత్యాన్ని, దళితుల భావవాద సాహిత్యంగాను, సంస్కరణ వాద కాలంలో వచ్చిన సాహిత్యాన్ని, దళితుల సంస్కరణ వాద సాహిత్యంగానూ, అభ్యుదయ వాదకాలంలో వచ్చిన సాహిత్యాన్ని దళిత అభ్యుదయ సాహిత్యంగానూ స్త్రీవాద కాలంలో వచ్చిన సాహిత్యాన్ని, దళిత స్త్రీ వాద సాహిత్యంగానూ, విప్లవ వాద కాలంలో వచ్చిన సాహిత్యాని దళిత విప్లవ సాహిత్యంగానూ పరిగణించినా అభ్యంతరం లేదు. భిన్న కాలాల్లో దళిత సాహిత్య జీవితానికి ఈ కథానికలు అద్దం పడుతున్నాయి.

ఉపయుక్త గ్రంథాలు :

1. దళిత సాహిత్య నేపథ్యం-డా।. ఎస్వీ సత్యనారాయణ
2. తెలంగాణ సమాజం సంస్కృతి- సాహిత్యం-రాగిరి లక్ష్మణ్
3. దళిత కథానిక-పరామర్శ-డా।.కె. లక్ష్మీనారాయణ

BHAVAVEENA
Vol. 17, Issue. 7, July 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

సినిమా మసుగులో నవ్యసంప్రదాయం

– డా॥. పి.ఎ. సత్యనారాయణ, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ కళాశాల (అ), రాజమహేంద్రవరం.

ప్రాపకం కోసం రాజుల చుట్టూ, రంభల చుట్టూ తిరుగుతూ ఏలికల్ని ఏకేశ్వరుణ్ణి చేసే రాతలే ఆధునిక యుగంలో కూడా పునరావృత్తం కావటమే నవ్య సంప్రదాయం. రాజులు, రాయసగాళ్ళు కలసి ప్రజల్ని గొడ్డు చాకిరీకి పరిమితం చేసి వాళ్ళకోసం వాళ్ళు స్వర్ణయుగం నిర్మించుకున్నారు.అంతఃపురాల్లో, అప్సరసలతో పల్లకీల్లో, తూగుటుయ్యాలలో మత్తిల్లారు. ప్రజల్ని అక్షరం ముక్కకు దూరంచేసి అనాగరికులని, పామరులని ముద్రవేసి వాళ్ళ స్వేదంతో పురుడోసుకున్న సంపదను స్వాధీనం చేసుకుని వదిలించుకోలేని పీడగా పరాన్నజీవులుగా బతికారు. వాళ్ళ మాయమాటల, రాతల మంత్రతంత్రాలతో ప్రజల్ని నోరెత్తకుండా చేసారు.

వాళ్ళ కరపెత్తనాన్ని గప్పు ఔదార్యంగా నమ్మబలికారు ప్రజలపట్ల వాళ్ళ కర్తవ్యాన్ని ప్రజల పై వాళ్ళు కురిపించే దయాభిక్ష అని భ్రమింపజేసి ఊడిగం చేయించుకున్నారు. వాళ్ళ బాధ్యత త్యాగంగా చలామణిఅయ్యింది. వాళ్ళ వైభవ కాముకత్వం ప్రజలకన్నీళ్ళు చూడలేని గుడ్డి వాళ్ళుగా వాళ్ళను తయారుచేసింది. ప్రజలకు పరలోకం గురించి చెబుతూ ఇహంలోని వాళ్ళు రుచిమరిగిన భోగాలు వాళ్ళను కఠినుల్ని చేసాయి. వాళ్ళ కళ వాళ్ళను కరుణలేని వాళ్ళుగా తయారుచేసింది. వాళ్ళ కత్తులు, కలాలు మానవత్వాన్ని తుడిచిపెట్టేసి ఆధిపత్యమే పరమార్థం అని పరమధర్మం అని ప్రవచించాయి.

సంపద కత్తి చుట్టూ, కలంచుట్టూ తిరుగుతుందని కనిపెట్టి ప్రజల్ని కష్టాల్లో, కడగండ్లలో నిలువునా ముంచేసి పారలౌకిక మత్తులో ఉంచి వాళ్ళు మాత్రం లౌకిక భోగభాగ్యాలతో మునిగి తేలారు. భోగం, భాగ్యం వీరభోజ్యం అని వంచించారు. జగద్ధితం అంటే వాళ్ళ ఉద్దేశంలో వాళ్ళకు అనుకూలంగా జగమంతా ఉండటం; వాళ్ళ కర్మ ఫలితాలను ఉపశ్రేణివర్గాల వాళ్ళు భరించే వాతావరణం ఉండటం వాళ్ళ క్షేమమే జనం క్షేమం కాని అందరూ బాగుంటేనే మనమూ బాగుంటాం అని కాకుండా తేనె టీగల్ని చెదరగొట్టి తేనెపట్టు ఎత్తుకు పోయే బాటసారిలా అందరి శ్రమలోను తమసౌఖ్యం వెతుక్కోవటం అన్నమాట.

సామ్మొకడిది సోకొకడిది అన్నట్టు శ్రమ ఒకరిది, సౌఖ్యం మరొకరది. ఈ విధమైన వాళ్ళయధేచ్ఛ దోపిడీ విధానానికి అనుగుణమైన శాసనాలు, చట్టాల తయారీలో భాగంగా వీళ్ళ సాహిత్యం పుట్టుకొచ్చింది. హితేనసహితం సాహిత్యం హితంతో కూడినది సాహిత్యం, అంటే వాళ్ళకు మాత్రమే అది హితాన్ని కలిగిస్తుంది. బహు జనులకు మాత్రంకాదు. దానికనుగుణమైన వ్యవస్థను నిరంతరం కొనసాగే క్రమంలోకి చాతుర్వర్ణాలను, చతుర్వేదాలను చతుర్పురుషార్థాలను కనిపెట్టారు. వాటికి అనుగుణమైన సామాజిక, పాలనావ్యవస్థల్ని నిర్మించారు.

అయితే ఈ సాలిగూడు చిక్కుముళ్ళ వ్యవస్థ పారిశ్రామిక విప్లవం, తద్వారా భావవిప్లవం అందుబాటులోకి వచ్చాక బీటలువారటం మొదలెట్టింది. బహుజన హితాయ బహుజన సుఖాయ, సర్వేజనా సుఖినోభవంతు లాంటి సూత్రాలు సిద్ధాంతాలుగానే మిగిలిపోయాయి. ఆచరణకు ఆమడదూరంలో నిలిచి పోయాయి. అందరూ చదువుకోవడం మొదలెట్టాక, అందరూ ఎదగడం ప్రారంభించారు. ఈ ఎదిగే సామాజిక అభివృద్ధిలో వర్గదృక్పథం అనివార్యం. ప్రత్యేకతకోసం పలుకుబడికోసం ప్రతివర్గం అవిశ్రాంతంగా ప్రయత్నిస్తూనే ఉంటుంది. ఈ క్రమంలో వర్గ సంఘర్షణ మొదలవుతుంది.

చిన్నగీత ప్రక్కన, పెద్దగీత పెట్టే ప్రక్రియ అవిచ్ఛిన్నంగా సాగుతూనే ఉంటుంది. ఈ నేపథ్యంలో ఆయా వర్గ

దృక్పథాలు వాదాలు తెరమీదకొస్తాయి. అవి అదనపు హంగులతో తమదైన సృజనతో సమకాలీన సంకేతికతను రంగరించుకుని వేదికమీదకొస్తాయి.

పాతకాలపు అరిష్టదాయక చట్టాలు సమకాలీనతలో సంప్రదాయాలుగా నిగూఢంగా చాపకిందనీరులా కొనసాగుతాయి, అందుకే వాటికనుగుణంగా సమాజం స్పందిస్తుంది. పారిశ్రామిక విప్లవం గొడ్డుచాకిరీ నుంచి విముక్తి కల్పించింది, ఫలితంగా మనిషికి విరామం దొరికింది. సమాచారాన్ని దొరకబుచ్చుకునే వీలు కలిగింది. ఆలోచించే అవకాశాన్ని కల్పించింది. ఈ శాస్త్ర, సాంకేతిక, సమాచార, భావ విప్లవాల పరంపరలో వ్యవస్థలోని వ్యక్తి సామాజిక అంతస్తు ప్రశ్నించబడింది. పరిణామం చెందడం ప్రారంభించింది.

ఫలితంగా కొత్త చట్టాలు కొత్త సంప్రదాయాలు ఉపశ్రేణివర్గాల భౌతిక, మానసిక ఆర్థికస్థాయిల్ని మెరుగుపరచాయి. శాస్త్ర సాంకేతిక విప్లవం, అక్షరాస్యతకు అక్షరాస్యత భావవిప్లవానికి, భావవిప్లవం స్వేచ్ఛా సమానత్వాలకు దారితీస్తుంది. సమానత్వ భావన ప్రత్యేకంగా, గొప్పగా కనిపించాలనే వాళ్ళ మధ్య పోటీ తీవ్రతరం అవుతుంది. తత్ఫలితంగా ఈ పోటీ సృజనరూపంలో అభివ్యక్తం అవుతుంది. మాధ్యమాలను అందిపుచ్చుకున్న పరస్పర వైరుధ్య వర్గ దృక్పథాలమధ్య ప్రజాస్వామ్యం పరిధిలో ప్రచ్ఛన్నయుద్ధం అవిచ్ఛన్నం అనివార్యం.

ఇవాళ వాళ్ళ వారసులు అదే భావజాలాన్ని, అదే చారిత్రక చేదు సత్యాన్ని అందంగా, వాళ్ళదైన కథనంలో వోల్డు గోల్డు అని మళ్ళీ ఆధునికయుగాన్ని నమ్మించడానికి వంచించడానికి తయారై కాసుల్నికొల్లగొట్టే సఫలయత్నాల్లో దృశ్యకావ్యాల్ని తెరకెక్కించే పనిలో తలమునకలవుతున్నారు. రాజుల దర్పాన్ని, వైభవాన్ని కొనియాడే 'బాహుబలి' సంపద పంపకానికి సమతూకాలీన ప్రాతిపదిక కావాలని ఎలుగెత్తే 'శ్రీమంతుడు' భావజాలం సమాంతరంగా అవిచ్ఛిన్నంగా కొనసాగుతూనే ఉంటాయి. సంపద పంపిణీని మోచేతినీళ్ళు తాగిబతకడంగా అభివర్ణించిన చినరాయుడు, పెదరాయుడు లాంటివి ఉదారవాద భావజాలాన్ని పేదల పరమార్థంగా నూరిపోసాయి.

ఈ సినిమాలు సమాజాన్ని పాలకుడు - పాలితులు అనే రెండు ముక్కలుగా నిమ్నోన్నత తరగతులుగానే చూస్తాయి. కాకపోతే ఇక్కడ బడుగులకు పీడనకు బదులు కాస్త స్వాంతన ఉంటుందంతే కాని బడుగులు పేదరికం ఊబిలోంచి బయటపడినట్టు మాత్రం కనిపించదు. బడుగులు అసమానతల్లోంచి సమానత్వంలోకి రావటం మాత్రం వాటికి ఇష్టం ఉండదు. ఇవి బడుగుల బతుకుల్ని పాలకుల బిక్షగా చూపిస్తాయి. బడుగుల్ని పాలకుల కీర్తిపతాకల్ని ఎత్తిపట్టుకుని, జన్మధన్యం చేసుకోమంటాయి. ఇవి ఉన్నతవర్గాలకు నిమ్నవర్గాలు సేవ చేసుకుని బ్రతకడానికే వాటిని బ్రహ్మపుట్టించాడని నమ్మబలికిన మనువు వారసత్వాన్ని పుణికి పుచ్చుకున్నాయి.

రాజుల ఘనతను, రాణుల సౌందర్యాన్ని, సౌశీల్యాన్ని గానం చేయడమే దేశభక్తి అనే భ్రమలో జనాన్ని ముంచుతాయి. ఎంతసేపూ అవి పాలకుల సౌధాల్ని, సౌందర్యాన్ని శౌర్యాన్ని, పరాక్రమాన్ని, దాతృత్వాన్ని స్తుతిస్తూ పాతివ్రత్యాల చుట్టూ తిరుగుతూ, గతించిన వాటి గతకాలపు వైభవాల్ని తిరగదోడుతూ వర్తమాన కాలానికి పులిమే పనిలో నిమగ్నం అయి ఉంటాయి. మధ్య యుగాల బురుజుల శిధిలాలను బూజుపట్టిన బూర్జువా భావజాలాన్ని గొప్పసాంస్కృతిక చిహ్నంగా చూపించే ప్రయత్నం చేస్తాయి. వీటికి భిన్నంగా ప్రతిదృశ్యం ప్రజలపక్షం వహిస్తూ "ఒకే ఒక్కడు", అపరిచితుడు, భారతీయుడు ఇటీవల "భరత్ అనే నేను" లాంటి సినిమాలు పాలకులకు ప్రజల పట్ల భక్తి శ్రద్ధల్ని నేర్పటానికి అంకితమయ్యాయి. అయినా సమకాలీనత ఆహార్యంగా సంప్రదాయం పడగ విప్పుతూనే ఉంది.

ఆధార గ్రంథాలు :

1) తెలుగు సాహిత్య చరిత్ర - డా॥ ద్వానా శాస్త్రి 2) ఒక వస్తువు భిన్న సందర్భాలు - డా॥ పి.ఎ. సత్యనారాయణ

BHAVAVEENA
Vol. 17, Issue. 7, July 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

మహాభారతం - మానవీయ విలువలు

- డా॥. ఒళెట్టి ఉపేంద్ర, అతిథి అధ్యాపకుడు, ఎ.పి. ట్రిపుల్ ఐటి, ఆర్.కె.వ్యాలీ, కడప.

ప్రపంచ వాఙ్మయంలో తొలిగ్రంథం ఋగ్వేదం. ఆ తర్వాత పరిమాణంలో విశ్వసాహిత్యంలోనే ప్రప్రథమ స్థానాన్ని ఆక్రమించింది మహాభారతం. హరివంశం దీనిఖిల సంహిత. ఇక్కడ 'ఖిల' యంటే ముందు చేసిన గ్రంథానికి అనుబంధంగా చేర్చబడిన గ్రంథం. అంతా కలిసి లక్ష శ్లోకాలు. చంద్రవంశ సంజాతులు, అన్న దమ్ముల బిడ్డలు అయిన కురు పాండవులు రాజ్యభాగ పరిష్కారం కుదరక కురుక్షేత్రంలో తారసిల్లి దారుణ రణం చేయటం. అందులో పాండవులు విజేతలుగా నిలవటం ఇందులోని ప్రధాన కథ. మహాభారతం మొదటి ప్రాచీన ఆర్యావర్తంలోని సమస్త ప్రజల సమైక్యతకై చేసిన ప్రయత్నాన్ని విశదపరుస్తుంది. తర్వాత దాని ప్రభావం దేశమంతా వ్యాపించింది. సమైక్యతకు బాట వేసింది. ఇందుకు కురు పాండవుల కలహగాథను ఆసరా చేసుకొని వాక్యోపవాక్యంగా చెప్పుకుంటూ వచ్చిన అనేక ఉపాఖ్యానాల్ని, వాటి విశిష్టతను, ధర్మాల్ని, ధర్మసూక్ష్మాల్ని, మానవతా విలువలను ఉన్నతుల దగ్గర నుండి అతి సామాన్యుని దాకా అందరికీ చెవికెక్కేటట్టు సంప్రదాయం విస్తృతంగా ప్రచారం చేసింది. దీన్నే వేదోప బృంహణం' అన్నారు. ఇందులో మానవతా విలువలు కోకొల్లలుగా ఉన్నాయి.

మానవ కల్పితాలైన వర్ణ, వర్గ, జాతి విభజన విషయాలెట్లున్నా, పరమాత్మ దృష్టిలో మానవులంతా సమానమే. ఇక ఈ భూమిపై పుట్టిన మానవుల్లో ఉండే జాతులు రెండు. ఒకటి స్త్రీజాతి, రెండు పురుషజాతి. ఈ రెండు జాతులు ఎలా అన్యోన్యంగా ఉండాలో, ఎలా ఉండగూడదో భారతం నిగూఢంగా చెబుతున్నది. ఇందులో అడుగడుగున మానవీయ విలువలు చెప్పబడ్డాయి. దీనికి వ్యాస మహర్షి చక్కని ఉపాఖ్యానాలను ఊటంకించాడు. భారతం కథా ప్రారంభంలోనే జనమేజయుని తమ్ములు చేసిన నిష్కారణ ప్రాణి హింసవల్ల మనకు ఒక సందేశం అందుతుంది.

హింస వద్దు :

జనమేజయుడు దీర్ఘసత్రయాగం చేస్తుంటాడు. ఆయాగ ప్రాంగణానికి సారమేయుడనేవాడు క్రీడార్థం వచ్చి అక్కడ తిరుగుతూ ఉండగా జనమేజయానుజులు శ్రుతసేన, భీమసేన, ఉగ్రసేనులనేవారు దాన్ని కొట్టారు. అది ఆక్రందన చేస్తూ తల్లి సరమ (ఇది దేవతల ఆడకుక్క) దగ్గరకు వచ్చి విషయం చెప్పింది. అప్పుడు సరమ జనమేజయుని వద్దకు వచ్చి ఇలా అంటుంది.

కం॥ క్షితినాథ కడు న కారణా న్వితులైన
నీతమ్ములతి వివేక విదూరుల్
మతిదలపక నాపుత్రకు నతి బాలకు ననపురాధు
నడచిరి పెలూరన్

కం॥ తగునిది తగదని యెదలో వగవక సాధులకు
చేదవాడల కెగ్గుల్
మొగిజేయు దుర్వినీతుల కగు ననిమత్తా
గమంబులయిన భయంబుల్

(ఆదిపర్వం - ప్రమథాశ్వాసం - 85, 86 పద్యాలు)

కష్టాలొచ్చినపుడే గదమనిషిలో త్వరగా ఆలోచించటం, ఆందోళన పడటం, మతిమరుపు వంటి అవలక్షణాలు చోటుచేసుకునేది. అందువల్ల అధికార మదాంధులు సాధువుల్ని, బీదవాళ్ళను హింసిస్తే ఏదో ఒకనాటికి చిక్కుల్లో పడక తప్పదు అని సరమ హెచ్చరిస్తుంది. తొందరపడే తత్వం జనమేజయునిలో లేదు గానీ అతని తమ్ముళ్ళలో ఉంది. ఇది వీళ్ళకు వీళ్ళ అమ్మమ్మ తండ్రి వైపు వారి నుండి సంక్రమించిందనవచ్చు. ఉత్తర గోగ్రహణ సమయంలో కంకుభట్టు పదేపదే బృహన్నలను కీర్తిస్తున్నా

డని కోపంతో విరాటరాజు అతనిపై పాచిక విసిరి గాయ పరిచాడు. అలాగే అతని దేహాత్రుడు పరీక్షిత్తు శమీకుడు తనకు సమాధానం చెప్పలేదని చచ్చిన పామును అతని మెడలో వేశాడు. అసలు కథకంతా కారణం పరీక్షిత్తు దుందుడుకు చర్యేనని చెప్పవచ్చు. అందుకే ప్రారంభం లోనే వ్యక్తి వ్యక్తిత్వంలోని ఒక లోపాన్ని గురించి చెప్పి, దాని వల్ల వ్యక్తికి కలిగే నష్టం ఎలాంటిదో చెప్పటం జరిగింది. ఈ రెండు సంఘటనలు మనిషి నడుచు కోవాల్సిన తీరుతెన్నులకు నిదర్శనంగా నిలుస్తున్నాయని చెప్పవచ్చు. నేడుకొందరు ఇతరులను వేధిస్తుంటారు, బాధిస్తుంటారు. అది ఎంత నేరమో ఘోరమో సరమ వృత్తాంతం తెలియజేస్తున్నది. అదే విధంగా కోపపడితే కలిగే కష్ట నష్టాలు, దాని ద్వారా జరిగే పరిణామాలు ఎంత దారుణంగా ఉంటాయో పరీక్షిత్తు వారసుల వృత్తాంతం తెలియజేస్తున్నది.

ఇలాంటి విషయాలను ప్రబోధించే ఘటనలు, సన్నివేశాలు మహాభారతంలో కోకొల్లలుగా ఉన్నాయి.

అహంకారం :

సవతి దాస్యం నుంచి విడిపించిన మాతృభక్తిపరా యణుడుగా, నుపర్ణుడుగా ఖ్యాతి పొందినవాడై కనిపిస్తాడు. కానీ ఉద్యోగపర్వం తృతీయాశ్వాసంలో అహం కారిగా కనిపిస్తాడు. మనస్సు ఒక్కోసారి ఎంతటి వారినైనా దురహంకార పూరితమవుతుందని అనటానికి ఇదొక చక్కని ఉదాహరణ.

ఇంద్రుని సారథియైన మాతలికి గుణకేసి అనే కూతు రుంది. ఆమెకు యవ్వనం రాగానే వివాహం చెయ్యాలని మాతలి ప్రయత్నించగా ఆర్యకుడు అనే నాగరాజు మను మడు, చికురుడు అనేవాని కుమారుడు అయిన సుము ఖుడు అనేవాడు తగిన వరుడుగా తోచి తాతను సంప్ర దించాడు. ఆర్యకుడు బాధతో ఇతని తండ్రిని కక్షతో యింతకు పూర్వమే చంపేశాడు. యింకొక నెలలో ఇతన్ని కూడా చంపేస్తాడు. కాబట్టి మేము తెలిసి తెలిసి ఎలా ఈ సంబంధం చేయగలం? అన్నాడు. అప్పుడు మాతలి వారిద్దరిని వెంటబెట్టుకొని ఇంద్రుని వద్దకు వెళ్ళాడు.. ఆ సమయానికే విష్ణుమూర్తి కూడా అక్కడ ఉన్నాడు. మాతలి ఇంద్రునికి విషయమంతా చెప్పాడు. ఇంద్రుడు సుముఖునికి అభయమిచ్చాడు. ఈ విషయం తెలిసి గరుడుడు అతి కోపావేశంతో వచ్చి ఇంద్రుని తూల నాడాడు. అంతేకాదు, అక్కడే ఉన్న విష్ణువును చూచి యీ ఆదివంశాన్నంతా ఒక సన్న ఈక మీదనే ధరించ గలను అన్నాడు. అప్పుడు విష్ణువు నవ్వుతూ నా అను గ్రహంతో నీవు నన్ను మోయగులుగుతున్నావు. దీనికింత అహంకరించటం తగదు. ఏదీ ఇప్పుడు నా ముంజేయి మొయ్యి చూద్దాం అంటూ తన ముంజేయిని గరుడుని మూపుపైన పెట్టాడు. అంతే ఆ భారానికి గరుత్మంతుడు గిజగిజలాడిపోయాడు. ఆర్తనాదం చేశాడు. అప్పుడు విష్ణువు దయదలచి అతన్ని వదిలేశాడు. కాబట్టి అహం కారం పనికిరాదు. మనిషి ఎంత ఉన్నత స్థితిలో ఉన్నా, పదవిలో ఉన్నా, హోదాలో ఉన్నా అహంకార పూరితంగా నడుచుకోరాదు. అలా అహంకరించేవారు ఎప్పుడో ఒక రోజు గర్వభంగం చెందక తప్పదనవచ్చు.

స్థిత ప్రజ్ఞత :

మానసికంగా, శారీరకంగా దృఢమైన వ్యక్తి తన కెదు రయ్యే అన్ని కష్టాలనూ సమర్థవంతంగా ఎదుర్కొని తాను నిలవటమేగాక, తనను నమ్ముకున్న వారిని కూడా ఒడ్డుకు చేర్చగలడు అనే విషయాన్ని మనకు మహాభారతంలోని శ్రీకృష్ణుని పాత్ర తెలియజేస్తుంది.

కృష్ణుడు యదువంశంలోని వృష్ణిశాఖకు చెందిన వాడు. సొంత మేనమామే ఇతన్ని పుట్టిన వెంటనే చంపెయ్యాలని నిర్ణయించటంతో ఈయన కష్టాలు ఎలాంటివో ప్రత్యేకించి చెప్పవలసిన పని లేదు. వసు దేవునికి పుట్టి నందుని యింట్లో పెరిగాడు. కేమారదళ దాటుతూ ఉండగా మేనమామను చంపాడు. అంతటితో ఈయన కష్టాలు తొలగలేదు. సరికదా, కష్టాల పరంపర ప్రారంభమయింది. కంసుని మామ జరాసంధుడు

ఇతనిపై పగబట్టాడు. మధురపై దండయాత్రలు సాధించాడు. జరాసంధుడి దాడుల నుండి యాదవుల్ని కాపడ దలచి కృష్ణుడు సముద్రం మధ్యలో ఉన్న దీవిలో ద్వారకా నగరం కట్టించాడు. తనలాగే కష్టాల పాలవుతున్న మేనత్త కుమారులు పాండవులకు బాసటగా నిలిచాడు. అందులో పాండవ మధ్యమునికి తన చెల్లెలు సుభద్రునిచ్చి పెళ్ళి చేశాడు. ఆమె సంతతి వారికే కురురాజ్యసింహాసనం దక్కేట్లు చేశాడు. ఎక్కడ, ఎప్పుడు ఎలా ప్రవర్తించాలో అలా ప్రవర్తించాడు. అందువల్లనే యదుకులంలో పుట్టి పేరు ప్రఖ్యాతులు సంపాదించటమే కాదు, మొదట మహావీరునిగా ఆరాధింపబడి తుదకు భగవంతుడుగా నేటికీ నీరాజనాలందు గుంటున్నాడు.

ఇలా మహాభారతం మనిషి వ్యక్తిత్వాన్ని పెంపొందించు కోవాల్సిన అవసరాన్ని, నిత్యజీవితంలో మానవతా విలువలతో నడుచుకోవలసిన తీరు తెన్నులను అడుగడు గునా ప్రబోధిస్తున్నది. వీటిని అవగాహన చేసుకొని తదనుగుణంగా నడుచుకోవాల్సిన బాధ్యత మనపై ఉంది.

ఉపయుక్త గ్రంథాలు :

1. కవిత్రయ భారతం - కవిత్రయం
2. మహాభారతం - సామాజిక ప్రబోధం - వి. గిరిధర్ కుమార్
3. కవిత్రయం - నండూరి కృష్ణమాచార్య
4. మహాభారత సారసంగ్రహం - పుల్లెల శ్రీరామ చంద్రుడు

BHAVAVEENA
Vol. 17, Issue. 7, July 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

గిరిజన జీవితాల్లోని విధ్వంసాన్ని చిత్రించిన ఫణికుమార్ గోదావరి గాథలు

- డా॥. గంగు కిషన్ ప్రసాద్, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్.

ఈ వ్యాస ఉద్ధేశ్యం నాలుగు సామాజిక వర్గాల సాహిత్యంలో తక్కువగా నృజించబడినది గిరిజన సాహిత్యం. గిరిజనేతరులు రాసిన 16 గిరిజన నవలలు, కొమురం భీం, అతడు అడవిని జయించాడు .... లాంటివి వచ్చాయి. ఇటీవలనే యానాది (ఎ) కులస్తుడు రాసిన దగడు నవల వచ్చింది.

ఇక కథల విషయానికి వస్తే, చింతాదీక్షతుల కాలం నుండి అటవీ ప్రాంత జీవితంతో పరిచయమూ, సంబంధమూ ఉన్న గిరిజనేతరులే వాళ్ళను గురించిన కథలు రాశారు. గిరిజనులలో 33తెగలున్నా ఒకటి, రెండు తెగల మీదనే కథలు వచ్చాయి. 1921లో చింతాదీక్షితులు రాసిన 'సుగాలి కుటుంబం' ఇప్పటిదాకా లభించిన గిరిజన కథల్లో మొదటిది. "చెంచి" అనే కథను గూడూరు రాజేంద్రరావు రాశారు. ఇపుడు అసామాజిక వర్గం నుంచి వచ్చిన గోపి భాగ్యలక్ష్మి (జంగుబాయి-కథ) వంటి వారు కథలురాస్తున్నారు.

దళిత, గిరిజన, మైనారిటీ, బహుజన వృత్తాలతో వేలాదిగా వెలువడిన కథల్లో గిరిజన జీవితాలను చిత్రించిన కథలెన్ని? సాహిత్యంలో, విశ్వవిద్యాలయాల పరిశోధనలలో వాటిస్థానమెక్కడ అన్న ప్రశ్నకు ఈ సదస్సు ద్వారా ఒక అంచనాకు రావచ్చు. నేనెన్నుకున్న "గోదావరి గాథలు" రచయిత శ్రీ ఫణికుమార్ కూడా గిరిజనేతరుడే. కానీ ఒక ప్రభుత్వ అధికారిగా మన తెలంగాణలో అందునా వరంగల్, ఆదిలాబాద్, అడవులలో తండాలతో గిరిజనులతో మమేకమై, వరదల్లో పర్యటించి, గోండులు, కొలాముల జీవితాలను వాస్తవికంగా చిత్రణచేశాడు. మన ప్రాంతానికి చెందిన గిరిజనుల జీవితంలోని విధ్వంసాన్ని పరిచయం చేయడం, పరిష్కార ఆలోచనలు కలుగ చేయడం నా పత్ర ఉద్ధేశ్యం.

శ్రీ ఫణికుమార్ రెవిన్యూ డివిజనల్ ఆఫీసరుగా, స్పెషల్ డిప్యూటీ కలెక్టరుగా పెద్దాపురంలో, ఖమ్మంలో, ఏటూరు నాగారంలో ఉట్నూరులో సుమారు ఎనిమిది సంవత్సరాలు పనిచేశాడు.

తూర్పుగోదావరి జిల్లా రాజవమ్మంగి నుంచి ఆదిలాబాద్ సీతాగొండి దాకా గిరిజన ప్రాంతం. ఈ రెంటిమధ్య పశ్చిమగోదావరి, ఖమ్మం, వరంగల్లు, కరీంనగర్ జిల్లాలు ఒదిగి వున్నాయి. ఫణికుమార్ ఈ ప్రదేశాలన్ని కలియ తిరిగాడు. గోండులు, కోలాములూ, కోయవారు, నాయకపువారు, కొండరెడ్లు, బంజారాలు నివసించే ప్రాంతమిది.

ఫణికుమార్ రచించిన ఈ "గోదావరి గాథలు" ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధంలో ప్రచురింపబడినాయి. వీటిని జీవిత చరిత్ర శకలాలని, ఆదిలాబాద్ జిల్లా ఒక అజ్ఞాతప్రదేశమైతే, అక్కడి గిరిజన ప్రాంతాలు మరింత చీకటి కోణాలని గోదావరి గాథలు ఆ చీకటి కోణాలలోకి ప్రసరించిన కాంతి కిరణాలు[1] గా కితాబు నిచ్చారు ప్రముఖ కథారచయిత, కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత మధురాంతకం రాజారాం. ఆదిలాబాద్, వరగల్ జిల్లాలో ఆదివాసుల జీవితాలను, వారి సు:ఖ దు:ఖాలను పదిహేను కథలుగా ఫణికుమార్ రాశారు.

ఈ గాథలన్నీ ఫణికుమార్ తానుగా చెపుతుంటాడు. గిరిజనులు తమకు కావలసిన అవసరాలకోసం మూడు రకాలుగా పోరాటం చేస్తుంటారు. 1). ప్రకృతితో పోరాటం 2). సంప్రదాయాలతో పోరాటం 3) గిరిజనేతర వ్యవస్థ

లతో పోరాటం. ఆదివాసులు దైనందిన జీవితంలో ఎదుర్కొనే కష్టాలగురించిన అవగాహనను గోదావరి గాథలు కలపిస్తాయి. ఈ పుస్తకంలోని 15 కథలలో పత్రపరిమితి దృష్ట్యా నేను పదికథల విశ్లేషణ చేశాను.

ప్రకృతితో పోరాటం :

వరదలు వచ్చినపుడు తండాలలో నెలకొనే భీభత్స పరిస్థితులను ''వరదలలో నాగారం'' గాథ తెలియజేస్తుంది. ఫణికుమార్, ప్రాజెక్టు ఆఫీసరైన చావలి వెంకట శివరామకృష్ణశర్మ ఏటూరునాగారం వెళుతూ వరదలలో అడుగుపెడుతారు. పస్రా గ్రామం వద్ద పొంగుతున్న దయ్యాలవాగు దాటి తాడ్వాయి, చినబోయిపల్లి గ్రామాల మీదుగా ఏటూరునాగారం చేరుకుంటారు. చుట్టు ప్రక్కల గ్రామాలన్నీ జలమయమైన వుంటాయి. వీరు పడుకున్న మంచాలను నీళ్ళు ముంచే పరిస్థితుల్లో వీరికి ప్రమాద తీవ్రత తెలిసొస్తుంది. వెంటనే నీళ్ళలోకి దూకి, ఘనపూర్, చేరుకొని సహాయక చర్యలు ప్రారంభిస్తారు. బస్సులు, ఇతరవాహనాలు ఆగిపోయి వున్నాయి. వాగు ఓడ్డు వెంట వున్న ఇళ్ళవారందరినీ సినిమాటాకీసుకు తరలించి భోజన ఏర్పాట్లు చేస్తారు. రామన్నగూడెం నీళ్ళలో మునిగి పోతుంది. చాలామందిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తారు. కానీ ముప్పైమంది వరకు గిరిజనులు ప్రాణత్యాగమైనా చేస్తాం కానీ ఊరొదలి వెళ్ళమంటారు. అడవి మృగాలతోనైనా తలపడే గిరిజనులు దేశంకాని దేశంలో చావాలి. మేము ఇక్కడే ఉంటాం. అనే గిరిజనులను చూస్తే తాము గిరిజన ప్రాంతాల్లోనే బ్రతుకాలనుకోవడం. చావాలనుకోవడం వారికి అడవిపై ఉన్న మమకారాన్ని వ్యక్తం చేస్తుంది.

అయితే ఫణికుమార్ వారి పునరావాసానికి, జరిగిన నష్టాన్ని పూడ్చడానికి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుందని చెప్పడం, వారు అరెస్టులో వున్నారని బలవంతంగానైనా తీసుకెళ్ళాల్సి వస్తుందని హెచ్చరించడంతో వాళ్ళు లాంచీ ఎక్కుతారు. కథ సుఖాంతమవుతుంది. అలాకాక మేము రాము, ఏం చేసుకుంటారో చేసుకోండి అనివుంటే అతడు ఏమి చేయలేక పోయేవాడు. అతని వెంట ఉన్నది కూడా ఇద్దరు పోలీసులే. సువ్యవస్థితమైన చట్టబద్ధమైన పాలనలో పౌరుల పాలన ఇలా వుంటుంది. దీనిని వారు కోల్పోతే అరాచకమే అనే ముగింపుతో రచయిత గిరిజనుల ఉత్తమ సంస్కారాన్ని ఆవిష్కరించాడు.

వరదలు గిరిజనుల జీవితాలను ఏ విధంగా చీకటి మయం చేస్తాయో పరాకాష్ట స్థాయిలో తెలిపిన గాథ ''నువ్ మంచిగుండు మామా'' మానసపల్లి, రామన్నగూడెం మొదలైన గ్రామాలప్రజలకు నాగారం హైస్కూల్‌లో శిబిరం ఏర్పాటు చేయగా 1986 ఆగస్టు 14న గోదావరి మరింత ఉధృతంగా ఉప్పొంగి శిబిరాన్ని ముంచేస్తుంది. ధాన్యం, పప్పులు వరదలో కొట్టుకొని పోతాయి. నిర్మాణం పూర్తికాని ఐ.టి.డి.ఏ కార్యాలయానికి తరలించబడతారు. ఈ సమస్యలు ఇలా వుండగా తమ విషయాలను పోలీసులకు చేరవేస్తున్నాడన్న అనుమానంతో తీవ్రవాదులు చిన్న బోయిన పల్లెలో ఒకరిని హత్య చేస్తారు. హృదయాన్ని ద్రవింపచేసే సంఘటన అంతకుముందు జరుగుతుంది. లక్ష్మీపురం గ్రామం పూర్తిగా మునిగి పడవ ప్రమాదంలో పధ్నాలుగుమంది చనిపోతారు. అతిసార, కలరా, మలేరియాలతో మరికొంతమంది చావుద్వారం దగ్గర వుంటారు. అక్కడిప్రజలు అన్నం తిని వారమై ఉంటుంది. వైద్య సదుపాయాలు లేక అకాల మరణాలు పొందే గిరిజనుల దీనస్థితికి ఇది అద్దం పడుతుంది. పడవ ప్రమాదం జరిగి నీళ్ళలో పడినపుడు ఎవరు ఉన్నారో ఎవరులేరో తెలియని స్థితి.

కిష్టయ్య అనేయువకుడు పడవ మునిగిన వెంటనే తన భార్య, ఆర్నెల్ల పాపను రక్షించి ఒడ్డుకు చేర్చడానికి తీవ్రంగా ప్రయత్నించి నిస్సహాయుడవుతాడు. పరిస్థితిని గమనించిన కిష్టయ్య భార్య అతడిని బలంగా తన్ని తననుతాను విడిపించుకొని వరద గోదావరిలో కలిసిపోతూ ''మామా మేం బతకం.. . . నువు మంచిగుండు'' అంటుంది. ఒడ్డుకు చేరి శిబిరంలో ఎవరితో మాట్లాడక విషాదానికి ప్రతిరూపంలా ఒంటరిగా ఉండే కిష్టయ్య

గురించి తెలిసి వచలితుడైనా ఫణికుమార్ "నువు మంచి గుండు మామా" గాథను రాశారు.

ప్రస్తుతం గుర్తింపు పొందిన 33 గిరిజన జాతుల్లో 20 జాతులు అత్యంత పేదరికంలో మగ్గుతూ, అభివృద్ధి, నాగరికత పదాలకు దూరంగా ఉన్నారు. ఆ 20 జాతుల్లో గోండులు, కొలాములు, సాధారణంగా నాగరికులను నమ్మరు. ఎన్ని కష్టనష్టాలెదురైనా తమ సంప్రదాయ జీవన విధానాన్ని మార్చుకోరు. క్రూర మృగాలతోనైనా కలిసి జీవిస్తారు. ప్రమాదాల బారిన పడతారు, ప్రాణాలు కోల్పో తారే తప్ప మైదాన ప్రాంతాలకు రారు. వారికి విద్యా, వైద్య సౌకార్యాలే ప్రభుత్వాలు గిరిజన జీవితాల బాగోగుల పట్ల దృష్టిసారిస్తున్నాయి. అదే సమయంలో గోండులు, కొలాముల లాంటి తెగలప్రజలు చైతన్యం అలవరచు కోవలసిన, విద్యావంతులు కావలసిన అవసరాన్ని, "రాజుల మడుగు గాథ" తెలయజేస్తుంది.

ఊట్నూరుకు పదికిలోమీటర్ల దూరంలో అడవి మధ్యలో ఉన్న "రాజుల మడుగు" అనే చిన్న గ్రామాన్ని విభజిస్తూ వున్న ఏటికి, ఒకవైపు గోండులు మరోవైపు కొలాములు, గుడిసెలు వేసుకొని నివసిస్తుంటారు. ఫణికుమార్ తనతో కలిసి పనిచేసే రాజనర్సయ్యతో కలిసి రాజులమడుగు వెళ్తాడు. ఏ సహాయమూ అందని ఆదివాస గ్రామాలను సందర్శించి, ఆ గ్రామాలకు ముందుగా సహాయము అందిచాలన్నది ఆ పర్యటన ఉ ద్దేశ్యం. కొలాముల గ్రామంలో వృద్ధులు, స్త్రీలు తప్ప ఎవరూ ఉండరు. అమ్మడానికి జిగురూ, తినడానికి దుంపలు కుందేళ్ళూ తీసుకురావడానికి వెళ్ళిన కొలాములు రాగానే ఏం కావాలో నిర్భయంగా అడగ మనగా ముందు 4,5 బళ్ళూ, ఎడ్లూ కావాలంటారు. జిగురు అమ్ముకొంటే ఫరవాలేదు. పనిలో పనిగా కలప అక్రమ రవాణా చేస్తారా అన్న ఫణికుమార్‌తో కొలాము వృద్ధుడు "మేము కలప అమ్మదలచుకుంటే మీరిచ్చే బళ్ళే కావాలా? ఇప్పుడు కలప లారీలలో వెళ్ళడం లేదంటారా? మీరేం చేస్తున్నారు? మేము కలప రవాణాలో తోడ్పడుతా మంటే ఎన్ని లారీలయినా వస్తాయి"అని బదులివ్వంగా ఫణికుమార్ ఏమి మాట్లాడలేక పోతాడు. పోడు వ్యవ సాయానికి, పోయిలో కట్టెలకు తప్ప గిరిజనులు వృక్షా లను నరకరు. వారి నిజాయితీ అయిన జీవితాలకు ఇటువంటివే నిదర్శనాలు. ఆకలికి మాడతారే తప్ప అక్ర మాలు చేయరు. ఇక పూరిళ్ళలోనే గోండులు చేపలు పంచుకుంటూ దుంపలు ఉడకబెడుతుంటారు. ఉప్పు, పులుసు, కారం, ఉండవు. తమకు ఇళ్ళు కావాలంటారు గోండులు.

ఊట్నూరులో ఐ.టి.డి.ఏ. అధికారులు కవ్వల్ అభయా రణ్యం మధ్యలో కొలాములు, గోండులు నివసించడం చట్టవిరుద్ధమని, ఆ ప్రాంతం వదిలి ఊట్నూరులాంటి ప్రదేశానికి వెళితే ఏదైనా సహాయం చేస్తామంటారు. అదే విషయం వారితో చెప్తే తరతరాలుగా అడవి మధ్యే బతుకుతున్నామని, తమ భూమి నుంచి పెకలించి వేస్తే బ్రతకలేమంటారు. వాళ్ళ అజ్ఞానానికి ఫణికుమార్ బాధపడుతాడు. ఆదిలాబాద్ నుంచి బదిలీ అయి వెళ్ళి ఏణ్ణార్ధం తరువాత ఏటూరునాగారం ఐ.టి.డి.ఏకు వచ్చి రాజులమడుగు నుండి కొలాములు, గోండులు వెళ్ళిపోయారని తెలిసి సంతోషిస్తాడు.

సంప్రదాయాలతో పోరాటం :

కొత్తగూడకు చెందిన గిరిజన యువకుడు చలవాయి గ్రామానికి చెందిన గిరిజనేతర అమ్మాయిని ప్రేమించి పెళ్ళాడాలనుకోవటం, పెళ్ళి ప్రాజెక్టు ఆఫీసర్ శర్మగారి అధ్వర్యంలో జరగాలని పట్టుబట్టడం, కొత్తగూడ మండ లాధ్యక్షుడు గిరిజనుడు అభ్యుదయవాది వెంకటయ్య గారు "ఇనేళ్ళూ మన అమ్మాయిలు వాళ్ళకి భోగవస్తువు లయితే, ఇప్పుడు వాళ్ళమ్మాయి మన ఇంటికివస్తుంది. ఈ మార్పును అంగీకరించాలి. ప్రోత్సహించాలి అనటం, ఇది మరోరూపంలో జరగబోయే దోపిడికి నాంది అని ఫణికుమార్ హేతుబద్ధమైన వివరణ ఇవ్వటం "వాళ్ళ అల్లుళ్ళూ వద్దు - కోడళ్ళూ వద్దు" గాథలోని విషయం.

గిరిజన ప్రాంతాల్లో గిరిజనేతరులు వారిని ఎలా లోబరుచుకుంటారో బలవంత పెడతారో - గిరిజన మహిళలు ఎలా మోసపోతారో సమాజానికి అర్థం కాని దేమీ కాదు. హరిజనులు ఇతరులనూ, ఇతరులను హరిజనులు వివాహం చేసుకోవడం అభినందించదగింది. చారిత్రక అవసరం కూడా, కానీ గిరిజనులను ఇతరులు పెళ్ళాడటం ఈ చారిత్రక దశలో మంచిది కాకపోవచ్చది ఫణికుమార్ అభిప్రాయం.. గిరిజనేతరులు గిరిజన స్త్రీలను పెళ్ళి చేసుకున్నా ఆ స్త్రీని కుటుంబ సభ్యురాలిగా ఇతరులు అంగీకరించక పోవడంతో అమెకు పనిమనిషి హోదాను కలిపించారు. ఇది తరతరాలుగా జరుగుతున్న దోపిడీలో భాగమని, ఇప్పుడు గిరజనుడు గిరిజనేతర అమ్మాయిని చేసుకోవడమంటే మరో రూపంలో దోపిడీకి గురికావటమేనంటూ అది ఎలాగో రచయిత వివరించాడు. అమ్మాయితో పాటు ఆమె తరపు తమ్ముళ్ళూ అక్కా చెల్లెళ్ళూ వస్తారు. వారి భూములనో, ఇతరుల భూములనో కొలుకు తీసుకొన్నా, బలవంతగా ఆక్రమించినా, కొన్నా బంధువులు గిరిజనులు వకాల్తా తీసుకోవలసివస్తుంది. నష్టపోయిన గిరిజనులది ఒక పక్షం. గిరిజనేతరుల బంధువులైన గిరిజనులు మరో పక్షమై వారిలో చీలిక వచ్చి, గిరిజనేతరులే లాభపడతారు. ఈ విషయాన్ని గురించి గిరిజనాభివృద్ధిని కాంక్షించే ప్రతి ఒక్కరూ ఆలోచించాల్సివుంది. పెళ్ళి యధావిధిగా జరిగిపోవట మన్నది కథకు సంబంధించిన విషయం.

గొండు తెగకు చెందిన ఆదివాసులు మధ్యప్రదేశ్ బస్తర్ జిల్లాలో, మహారాష్ట్ర కిన్వట్ జిల్లాలో తెలంగాణాలోని ఆదిలాబాద్ జిల్లాలో నివసిస్తారు. రాజగోండులలో ఆత్రాం వారిది రాజకుటంబం. గోండు సమాజంలో భీష్ముడుగా పరిగణింపబడే 80 ఏళ్ళ వృద్ధుడు ఆత్రా భీమ్‌రావు. ఫణికుమార్ ని కలిసి దేవధన్‌కమిటీల గురించి చర్చిస్తాడు. గోండులలో కులపంచాయితీలకు ప్రాధాన్యత ఎక్కువ. కుల పంచాయితీల కంటే ఒక గ్రామానికి చెందిన గోండు సర్వజన సమావేశానికి ఎక్కువ ప్రాధాన్యత వుంటుందని ముఖ్యమైన నిర్ణయాలూ ఇలాంటి సభలలోనే తీసుకోవడం వారి సంప్రదాయం.

'దేవధన్' కమిటీ అంటే ధాన్యం నిలవ, పంపిణీలకు సంబంధించిన పంచాయితీ, తలాకొంత వేసి ఒక చోట పోగు చేస్తారు. దేవుని సొమ్మన్న మాట, ధాన్యం అవసరమైనవారు ధరఖాస్తు పెట్టుకుంటే వారి అవసరాన్ని బట్ట కమిటీ ధాన్యాన్ని పంచి పెడుతుంది. పంటరాగానే తీసుకున్నవారు పదిశాతం ధాన్యం వడ్డీకింద కలిపి వాపసు ఇవ్వాలి. ఫణికుమార్ బృందం ముప్పై (30) కమిటీలు గాదెలు ఏర్పాటు చేస్తుంది. అటువంటి కార్యక్రమాలకు ఒకరూపు ఇచ్చిన ఆత్రాభీమ్‌రావుగారి గ్రామం గాడి గూడంలో దేవధన్ గాదెలు ప్రారంభిస్తారు.

ధాన్యానికి లాగానే డబ్బువిషయంలో కూడా దేవధన్ కమిటీని ఏర్పాటు చేయాలనే సూచన చేస్తాడు గోండ్వానా భీష్ముడు ఆత్రం భీమ్‌రావు. సమస్యను కూలంకషంగా అర్థం చేసుకొని సమస్యకు గాంధేయమార్గాన్ని, పరిష్కారాన్ని సూచించిన దృష్టగా ఫణికుమార్ భీమ్‌రావు గురించి భావించడంలో ఆశ్చర్యమేమీ లేదు. తరువాత ఆదివాసీ పిల్లల చదువు విషయంలో కూడా భీమ్‌రావు పటేల్ మంచి సలహా ఇస్తాడు. పటేల్ అనేది అతని బిరుదు.

ఆశ్రమ పాఠశాలలు ఎక్కడెక్కడో ఉండటం వల్లన అందరూవెళ్ళలేకపోతున్నారు. ప్రభుత్వం నియమించిన గిరజనేతరులైన ఉపాధ్యాయులు ఉండరు. ఉన్న కొందరికి ఆదివాసీ పిల్లలంటే సానుభూతి ఉండదు. చిన్న పిల్లలకు చదువు చెప్పడానికి పెద్ద డిగ్రీలు అవసరం లేదు. పదవతరగతి చదివిన ఆదివాసీ కుర్రాడిని వాడి గ్రామం లోనే పాఠాలు చెప్పమంటే శ్రద్ధగా చెబుతాడు. విద్యార్థులు కూడా సారు తమవాడు కనుక శ్రద్ధగా వింటాడన్న గోండ్వానా భీష్ముడి సలహామేరకు ముందుగా మేటిగూడ, బాచీపేట గ్రామాలలో ఐ.టి.డి.ఏ. అలాంటి పాఠశాలలను ప్రారంభించి మంచి ఫలితాలను సాధిస్తుంది. ఆ సత్ఫలితాల ప్రాతిపదికగా "8" ఐ.టి.డి.ఏలలో స్పెషల్

టీచర్లను నియమిస్తారు. అందరూ మెచ్చుకుంటారు. అయితే ఇది గాడిగూడ ఆత్మ భీమ్‌రావు ఆలోచన అన్నది కొద్దిమందికే తెలుసు.

ఫణికుమార్ వాళ్ళు ఆదివాసులకు సంబంధించిన అన్ని విషయాలు ముందు ఆగోండ్వానా భీష్ముడితో చర్చించే వాళ్లు. ఆ తరువాత బదిలీ పై వెళ్ళిన ఫణికుమార్ వేరే పనుల మీద ఆదిలాబాదు వెళ్ళి అధికారులను, మేధావులను కలుస్తాడు. యువకులు తీవ్రవాదం వైపు ఆకర్షితులవుతున్నారని తెలిసి మన సచివుడు, మన సారథి మన బంధువు ఆత్రాం భీమ్‌రావ్‌గారిని కలిస్తే పరిష్కారం లభించేది కదా అని, ఆయన చనిపోయారని తెలుసుకొని అవాక్కవుతాడు. సంప్రదాయపద్ధతులకు ఆధునికతను మేళవించి అదివాసుల జీవితాల్లో వెలుగులు నింపాడు. కనుకనే రచయిత ఆయనను "గోండ్వానా భీష్ముడు"గా కీర్తించాడు.

గిరిజనేతర వ్యవస్థలతో పోరాటం :

గిరిజనుల ప్రధాన జీవనాధారం భూమి. తెలుగు నేల లోని గిరిజనులు మాత్రమే కాకుండా దేశమంతటా గిరి జనులు రెక్కలు ముక్కలు చేసుకొని పోడు చేసుకొన్న భూమి అన్యక్రాంతమవుతుంది. భూమిని కోల్పోతున్న గిరిజనుల కోసం ప్రభుత్వం చట్టాలు చేసింది. శ్రీకాకుళం నక్సలైట్ ఉద్యమం తరువాత గిరిజన భూముల రక్షణ కోసం ప్రభుత్వం చేసిన కఠినమైన సవరణ రెగ్యులేషన్ 1 ఆఫ్ 1970 దీని ప్రకారం షెడ్యుల్డ్ ప్రాంతంలో భూమి కలిగి ఉన్న గిరిజనేతరులు తాము ఆ భూమిని చట్ట బద్ధంగా సంపాదించామని వారే బుజువులు చూపాలి. షెడ్యుల్డ ప్రాంతాలలో గల భూములను గిరిజనులు, గిరిజనేతలరులకు అమ్మకుండా 1/1971, భూములు అమ్ముకోలేని గిరిజనులకు తగిన పరిహారం ఇచ్చి ఆ భూముల్ని ప్రభుత్వం భూమిలేని గిరిజనులకు ఇవ్వ డానికి, సహకార సంస్థలు గిరిజనుల భూములను తనఖా ఉంచుకోవడానికి 1/1970, గిరిజన భూములను గిరి జనేతరుల పేరుమీద రిజిస్ట్రేషన్ చేయడాన్ని నిషేదించ డానికి, గిరిజన భూములను ఆక్రమించిన గిరిజనేతరు లను తొలగించడానికి వారికి జరిమానా లేదా కారాగార వాసం విధించడానికి 1/1978, ఈ భూమార్పిడి చట్టం సవరణలు అవకాశం కల్పించాయి. అయినా గిరిజనులు భూమి అన్యక్రాంతమవుతుంది[2]

గిరిజనుల భూములను గిరిజనేతరులు ఏవిధంగా తీసుకుంటున్నారో, గిరిజనులే తమ భూమిని చేజేతులా పోగొట్టుకుంటున్నారో గిరిజనుల వెతల్ని చూసి స్పందిం చిన కొంతమంది రచయితలు దాన్ని వస్తువుగా స్వీకరిం చారు. అకోవకు చెందినదే ఫణికుమార్ రాసిన "చింతా సాలక్కగాథ" వరద బాధితులకు మొదటి పునారావాస గృహసముదాయాన్ని ఫణికుమార్ తదితరులు కంతనపల్లి గ్రామంలో ప్రారంభిస్తారు. ప్లానింగ్ కమీషన్ ఉపాధ్య క్షులు డాక్టర్ మన్‌మోహన్‌సింగ్ ప్రారంభించిన కాలనీ కంతనపల్లిలోనిదే. కంతనపల్లిలోనే గిరిజనులు ప్రథమంగా పొగాకు తోటలు ఐ.టి.డి.ఏ సహకారంతో వేస్తారు. బావులే, గొట్టపు బావులూ కాకుండా గోదావరి నీటిని పొలాలకు ప్రవహింప చేయవచ్చునన్న ఫణికుమార్ తదితరుల ఊహలకు కంతనపల్లిలోనే రూపకల్పన జరుగుతుంది.

ఆ కంతనపల్లిలో ఫణికుమార్ కోయలతో వారి సమస్య లను గురించి చర్చిస్తుండగా చింతా సాలక్క అనే గిరిజన మహిళ భూ సమస్యగురించి ప్రశ్నిస్తుంది. తన ఎనిమిది ఏకరాల భూమిని గుంటూరు వాళ్ళు లాకున్నారని తనకు న్యాయం చేయమని అడుగుతుంది. చింతా సాలక్క భర్త గుంటూరు వాళ్ళు దగ్గర భూమి తనఖా పెట్టి అప్పు తీసుకోవటమే కాకుండా కొంత భూములను చట్ట వ్యతి రేకంగా అమ్ముతాడు. ఆ గుంటూరువ్యక్తి ఇట్లాంటి భూములను దాదాపు డెబ్బై ఎకరాలదాకా కొంటాడు. అందులో రెండెకరాల భూమి కేవలం డెబ్బైరూపాయలకే కొన్నాడంటే గిరిజనుల అమాయకత్వం, అవసరాలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థమవుతుంది. అర్థబలం అంగ బలంతో పొలాలను రక్షించుకుంటుంటాడు.

ఆ గ్రామం మొత్తం మీద గిరిజనేతరుడు అయినా తామేం చేయలేమని సర్పంచే అన్నాడంటే వారి అశక్తత, గిరిజనేతరుల ఆధిపత్యం చెలాయింపు తెలిసి వస్తుంది. సాలక్కభర్త వాళ్ళతో పోట్లాడలేమంటూ ఊరొదిలి వెళ్ళిపోగా భూమి మళ్ళీ తమకు ఇప్పించాలంటూ దరఖాస్తులు పెడుతూ ఉంటుంది. ఫణికుమార్ న్యాయం జరిగేలా చూస్తానని సాలక్కకు హామీ ఇచ్చి నోటీసు లిస్తాడు. భూమి సాలక్కకు చెందేట్లుగా తీర్పు ఇస్తాడు. తహశీల్దారు తీర్పును అమలు చేస్తాడు. సాలక్క దణ్ణం పెడుతుంది. అది మూణ్ణాల్ల ముచ్చటే అవుతుంది. రకరకాల కారణాలు చూపించి గుంటూరు కబ్జాదారుడు హైకోర్టు నుంచి స్టే తెచ్చుకుంటాడు. తీర్పు వచ్చే వరకూ వేచి చూడక తప్పని పరిస్థితి. ఆ కేసు అలా ఉండగానే ఫణికుమార్ నాగారం వలివస్తారు.

ఫణికుమార్ రచించిన గోదావరిగాథలు ఆదిలాబాద్, వరంగల్ ప్రాంతాలకు చెందినవి. ఆదిలాబాద్, ఖమ్మం శ్రీకాకుళం, ఉభయ గోదావరి జిల్లాల్లోను గిరిజనులు సాగుచేసుకున్న భూమిని గిరిజనేతరులు స్వాధీనం చేసు కున్నారు. అడవిని సాగులోకి తెచ్చిన గిరిజనుడు రెవెన్యూ డిపార్ట్‌మెంటుకు ఎన్ని ఆర్జీలు పెట్టుకున్నప్పటికి ప్రయో జనం లేక భూమినే కోల్పోతున్నారనే వాస్తవాన్ని ఈ గాథలు తేటతెల్లం చేస్తున్నాయి.

గిరిజన ప్రాంతాల్లో మొత్తం భూమి గిరిజనుల చేతిలో ఉంటే కుటుంబానికి సరాసరి 3.69 ఎకరాల భూమి చెందుతుంది. అయితే 48% పైగా గిరిజన భూములు గిరిజనేతరుల స్వాధీనంలో ఉన్నాయి. వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల ఏజెన్సీ ప్రాంతాల్లో 50% పైగా గిరిజన భూములు గిరిజనేతరుల ఆధీనంలో ఉన్నాయి. కోర్టులో దాఖలైన మొత్తం కేసుల్లో 23,702 కేసుల ద్వారా 1,18,468.51 ఎకరాల భూమిని (2012 వరకు) గిరిజనేత రులు గెలుచుకున్నారంటే గిరిజన చట్టాలు నేతి బీర కాయలో నేయి చందంగా అమలవుతున్నాయన్న విష యాన్ని స్పష్టంచేస్తుంది.

ఆదిలాబాద్‌లో గోండుల భూములను ఆక్రమించు కున్న గిరిజనేతరులను ఐ.టి.డి.ఏ ఆఫీసర్‌గా ఫణికుమార్ నిర్ధాక్షిణ్యంగా తొలగించిన వైనమే "కృష్ణాష్టమి" గాథ. గిరి జనేతరులలో మధురజాతికి చెందినవారు, మరాఠాలు మహారాష్ట్రనుంచి వలసవచ్చిన లంబాడీలుంటారు. మిత్రుడు రవీంద్రశర్మతో కలిసి కృష్ణాష్టమికి మధురలు చేసే రాసలీల చూడటానికి వెళ్ళి మరచిపోలేని మధురమైన ఆతిథ్యం పొందుతాడు. ఆతిథ్యం ఇచ్చిన మధురల పెద్ద తమ ఆచార వ్యవహారాలు తమకే ప్రత్యేకమని, లంబాడీ లైనా అంతే కాబట్టి వారు ఆది వాసులైతే తామూ ఆది వాసులమేనంటాడు. తాము ఆదివాసులం కాకపోతే వారూ కాదని వాదిస్తాడు.

కర్తార్ సింగ్ తాను ఏ గోండు భూమినీ ఆక్రమించ లేదని, డబ్బులు ఇచ్చి కొన్నానని దానికి సంబంధించిన కాగితాలు తమ వకీలుకిచ్చానని, ఏమైనా సహాయం చేస్తారా అంటూ తీర్పు ఇచ్చే అధికారి ఫణికుమార్ అని తెలియక అతడినే సహాయం కోరతాడు. తీర్పు ఇచ్చేరోజు కుర్చీలో ఫణికుమార్‌ను చూసి సంతోషపడతాడు. అతని మెహమంతా కృష్ణాష్టమి కళ అలముకొంటుంది. కానీ ఫణికుమార్ కర్తార్‌సింగ్ భూమి కొనడం చట్టవిరుద్ధమనీ, అందుచేత కర్తార్ సింగ్‌ని, భూమినుంచి తొలగిస్తున్నానని తీర్పిస్తాడు. తీర్పిచ్చిన తరువాత కర్తార్ సింగ్‌వైపు చూసే ధైర్యం చేయలేక పోతాడు.

"పసిపిల్లవాడు బళ్ళో నుంచి జారిపోయినట్లూ ప్రాణ ప్రదమైన మిత్రుని జ్ఞాపకానుభవం, కస్తూరి వాసన ఆవరించి వుంటుంది. వారిని వదిలి రాగానే బొడ్డు చేరు తెగినా తల్లికీ పిల్లకూ తెగని అనుబంధాన్ని కొందరు (శ్రీఫణికుమార్ లాంటివారు) కాపాడుకుంటారు. కర్తార్ సింగ్ కేసులో ఆస్తినాస్తి వివాదంలో యిరుక్కున్నట్లు జైలుకు పొక్కలేదు. అలాగిరిజనులతో పెనవేసుకున్న బంధాలను ఫణికుమార్ "గోదావరి గాథలుగా" రాశారు.

ఇంకా, ఉర్దూ మరాఠీ సాహిత్యాల్లో పండితుడు తెలుగు సాహిత్యంపై గట్టిపట్టున్న సదాశివ మాస్టార్

గురించి "సదాశివ మాస్టార్" అంటూ రాశారు. ఇందులో తెలుగు రచయితలు విమర్శకులపై సునిశిత విమర్శ చేశారు.

ఇక " ఎలిజబెత్ హేమండార్ఫ్" గురించి రచయిత మాటల్లో చెప్తేనే అర్థవంతంగా వుంటుంది. నిరాడంబరత్వం, నిష్కల్మషత్వమూ, ఎంతో జ్ఞానమూ, ఆదివాసులంటే అపారమైన అభిమానమూ మానవాకృతిదాల్చి ఈ మహిళగా అవతరించింది. లండన్‌లో పుట్టి పెరిగినా తన భర్తతో పాటు 1940 నుండి ఏళ్ళతరబడి ఆదిబాబాద్ అడవుల్లో గుర్రం మీద కాలినడకన తిరిగింది. హేమాండార్ఫ్ గార్కి రీసెర్చిలో తోడవటమే గాక ఆదిలాబాద్ ఆదివాసుల సమస్యలను మాతృదృష్టితో అవగాహన చేసుకొని ఆ సమస్యల పరిష్కారానికి అప్పటి హైదరాబాద్ స్టేట్ రెవెన్యూ మెంబర్ విలియం గ్రిగ్ సన్‌గారికి తగు సూచనలిచ్చి ఆదివాసులకు తనవంతు కంటే ఎక్కువ సేవచేసిన బంగారుతల్లి ఎలజబెతమ్మ. లండన్‌లో సంపన్న కుటుంబంలో పుట్టి పెరిగి హేమండార్ఫ్‌తో యవ్వనమంతా ఆదిలాబాద్, శ్రీశైలం, నాగార్జునసాగర్ నేపాల్ ఆదివాసుల అభివృద్ధి కోసం ఎలిజబెత్ హేమండార్ చేసిన కృషి అనన్య సామాన్య మైనది.

ఒక విషాద గాధ రాకితల్లి, ఒక గోండు తెగవారు. ఒరిస్సా ప్రాంతం నుంచి వలసవచ్చి కమలాపురం రేయాన్స్ ఫ్యాక్టరీ దగ్గర గుడిసెలు వేసుకొని నివసిస్తుంటారు. వరదలు వచ్చి వారి గుడిసెలు దెబ్బతింటాయి. దాచుకున్న కొన్ని తిండిగింజలూ తినడానికి పనికిరాకుండా తడిసిపోతాయి. ఫ్యాక్టరీ మూత పడటంతో ఎవరికి పని వుండదు. వాళ్ళకు ఇళ్ళకాలనీ ఇవ్వడానికి ఐ.టి.డి.ఏ నిర్ణయం తీసుకుందన్న శుభవార్తను ఫణికుమార్ చెప్పినపుడు వాళ్ళు చాలా సంతోషిస్తాడు. ఒక ఇంటిముందు గోండుమహిళ తన పాపతో కూర్చొని తృప్తిగా ఎటో చూస్తున్న దృశ్యాన్ని రచయిత ఫోటో తీసాడు. ఇంట్లో తిండిగింజలు లేకపోయినా మాతృత్వమిచ్చే హాయి ఆమె మొహమంతా నిండివుంటుంది. "గోదావరి గాథలు" పుస్తకం ముఖచిత్రంగా ఉన్నది అదే ఫోటో. ఆ ఫోటోనే ఫణికుమార్ అఖిలభారతస్థాయి ఫోటో ఎగ్జిబిషన్‌కు "మదర్ అండ్ చైల్డ్" శీర్షికతో పంపగా రెండు ప్రైజులొస్తాయి. ఒక రాత్రి గూడెం పై రెండు ఎలుగుబంట్లు దాడిచేసి బయట తిరుగుతున్న రాకీని పట్టుకొని మొహం, వక్షస్థలం కొరికేస్తాయి. రాకీకి మొహమన్నది లేకుండా పోతుంది. ఫణికుమార్ జీపులో వరంగల్ ఎమ్.జి.యం.కు పంపిస్తాడు. ఎలుగుబంట్ల దాడికి ప్రాణాలు కోల్పోయిన ఎందరో గిరిజన తల్లుల, అనాథలైన వారి పిల్లల స్మరించే సాహసం కూడా చేయలేక పోయానంటూ రచయిత ముగించిన ఈ కథలో వరదలు, అభద్రత నిండిన గిరిజన జీవితాలు చిత్రితమైనాయి.

గిరిజన జీవితాలను వారి బతుకు వెతలను ఆవిష్కరించిన ఈ "గోదావరి గాథలు" తెలంగాణ కథా సాహిత్యానికి ఒక మంచి చేర్పు.

పాదసూచికలు :

1. కాంతికిరణాలు (ముందుమాట) - మధురాంతకం రాజారాం ఫణికుమార్ 'గోదావరి గాథలు" పుట. 10
2. గిరిజన కథ -భూమి సమస్య (వ్యాసం) - డా॥ జి. శైలమ్మ ద్రావిడ విశ్వవిద్యాలయం, తెలుగు కథ- దళిత, మైనారిటీ, గిరిజన, బహుజన జీవితం(వ్యాస సంకలనం), పుట.. సంపాదకత్వం-డా॥ వి.ఆర్.రాసాని.
3. అడవి మనిషి (అష్టవాక్యాలు) - సి.వి కృష్ణారావు గోదావరి గాథలు-పుట.

BHAVAVEENA
Vol. 17, Issue. 7, July 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

రేచర్ల సర్వజ్ఞ సింగభూపాలుడు (ద్వితీయ) - సాహిత్య సేవ

- డా॥. ఇడికోజు శ్రీనివాసాచారి, తెలుగు ఉపన్యాసకులు, నల్లగొండ.

రాచకొండ రాజైన ఒకటవ అనపోతనాయకుని కొడుకు ఇతడు కృష్ణదేవరాయలవలె బహుముఖ ప్రజ్ఞాశాలి. సంగీత నాట్య మర్మజ్ఞుడు, కవి, నాటకకారుడు, అనేక మంది కవి పండితులను పోషించాడు. ఒకవైపు రాచకొండ పరిపాలన మరోవైపు సాహిత్యపాలన గావించాడు. ప్రముఖ లాక్షణికుడు విశ్వేశ్వరుడు, బొమ్మకంటి అప్పయాచార్య, నాగనాథుడు, శాకల్యమల్లభట్టు, శాకల్య అయ్యలార్యుడు ఇతని ఆస్థానంలోని వారే. ముఖ్యంగా విశ్వేశ్వరకవి ఇతని సాహిత్యవైభవంను చాటుటకే అన్నట్లు 'చమత్కారచంద్రిక' అనే అలంకారశాస్త్రగ్రంథాన్ని రచించి, సింగభూపాలుని ఆ మహాప్రబంధసామ్రాజ్యానికి అధిపతిని గావించి బహుధా అతని సౌజన్యశీలాన్ని కిందివిధంగా కొనియాడెను.

"రూపకం దశధాప్రోక్తం నాటకాది విభేదితః
మహాప్రబంధ సామ్రాజ్య మధికర్తుమిదం క్షమం
సింగభూపాలరచితే రసార్ణవ సుధాకరే
అస్యప్రపంచో విజ్ఞేయః కేతధా వక్తుమీశతే"

సింగభూపాలుడు సంస్కృతంలో 'రసార్ణవ సుధాకరం' అనే అలంకార శాస్త్ర గ్రంథం, సంగీత సుధాకరం అనే నాట్యగ్రంథం, కందర్పసంభవం అనే బాణం, కువల యావళి (రత్నపాంచాలిక) అనే నాటిక రాశాడు. ఇతని గురించి అనేకచాటు పద్యాలు కలవు.

రసార్ణవ సుధాకరం :

సంస్కృత వాఙ్మయంలో గల అలంకార గ్రంథాలలో రసార్ణవ సుధాకరం ఒకటి. దీనినే సింగభూపాలీయం అనికూడా అంటారు. ఇందులో ఎన్నో పూర్వకావ్యనాటకాల నుంచి, సమకాలికుల రచనల నుంచి, తన రచనల నుంచి సందర్భోచితంగా విస్తృతంగా ఉదహరించినాడు. ఇప్పుడు లభించని అనేక గ్రంథాల గురించి ఈ పుస్తకం వల్ల తెలుస్తుంది. లక్షణోదాహరణలతో సహా వివరించ బడింది. ఏ ఇతర అలంకారశాస్త్ర గ్రంథం రూపకాల గురించి ఈ గ్రంథమంత విపులంగా చెప్పలేదని అంటారు. మల్లినాథసూరి, కుమారస్వామి, ధర్మసూరి, రూప గోస్వామి, రాఘవభట్టు, వాసుదేవుడు వంటి ప్రసిద్ధ వ్యాఖ్యాతలు దీనిని ప్రామాణిక గ్రంథంగా పేర్కొన్నారు. నాట్యశాస్త్రం, దశరూపకం, భావప్రకాశం దీనికి ఆదర్శ మైన గ్రంథాలు.

ఈ గ్రంథంలో రంజకోల్లాసం, రసికోల్లాసర, భావ కోల్లాసం (రూపకోల్లాసం) అనే మూడు ఉల్లాసాలు గలవు.

రంజకోల్లాసం :

దీనిలో నాయికా, నాయకుల స్వరూపం, భావాది చేష్టలు, విభావ, సాత్త్విక, రీతి, వృత్తి, ప్రవృత్తి, గుణాలు, శృంగారరస విభావాలు లక్షణ ఉదాహరణలతో వివరించ బడినవి.

రసికోల్లాసం :

దీనిలో వ్యభిచారీ భావాలు, స్థాయీభావాలు, రసా శ్రయ వివేకం, సంభోగం, విప్రలంభ శృంగార రసభేదాలు, రససంకరం విచారం జరుపబడినాయి.

భావకోల్లాసం (రూపకోల్లాసం) :

దీనిలో నాట్యస్వరూపం లాస్యాంగాలు, దశవిధ రూప కాలు వాటి అంగాలు, భాష, పరిభాష ఉదాహరణలతో చర్చించబడినవి.

రసార్ణవ సుధాకర అవతారికలో దుర్గుణాలగు కఠిన్యాదులను వర్ణించిన ఒక ఘట్టం.

"తస్మిన్ శాసతి సింగభూమిరమణే క్షామన్న పోతాత్మజే
కాఠిన్యం కుచమండలే తరులతా నేత్రాంచలే సుభ్రువామ్

వైషమ్యం త్రివలీషు మందపదతా లీలాల సాయంగతే
కౌటీల్యం చికురేషు కించ కృశతా మధ్యేపరం లభ్యతే" (అవతారిక 43)

శాంతరసాన్ని కాదని ఇతర ఎనిమిది రసాలను మాత్రమే అంగీకరించిన సందర్భంలోనిది క్రింది శ్లోకం.

"అష్టతా సచ శృంగార హాస్యవీరాద్భుతా అపి
రౌద్రః కరుణ భీభత్స భయానక ఇతీరీతః
ఏ ఘాత్తరన్తు పూర్వ స్మాత్వం భూతో విష మాత్సమః"

కవులను చతుర్విధాలుగా పేర్కొని మనస్సులో గూఢమైన అభిమానం ఉన్నవాడు ఉదాత్తుడని, పరనిందతో స్వోత్కర్షను తెలిపేవాడు ఉద్ధతుడని, యధోచితంగా గొప్పతనాన్ని తెలుపుకొనేవాడు ప్రౌఢుడని, వినయంతో తన అవకర్షను తెలియచేసేవాడు వినీతుడని తెలిపిన సందర్భంలోనిది క్రింది శ్లోకం.

"కవయస్తు ప్రబంధారః తే భవేయశ్చతుర్విధాః
ఉదాత్త ఉద్ధతాః ప్రౌఢో వినీత ఇతి భేదతః"

శృంగారరసాన్నీ దాని భేదాల్ని చెప్పిన సందర్భంలోనివి క్రింది శ్లోకాలు

విభావైరనుభావైశ్చ సాత్త్వికై వ్యభిచారిభిః
నీతాసదస్య రస్యత్వం రతిః శృంగార ఉచ్యతే
సవిప్రలంభ ః సంభోగ ఇతి ద్వేధా నిగద్యతే
ఆయుక్త యోస్తరుణ యోద్యోనురాగః పరస్పరమ్.
అభీష్టాలింగానా దీనా మనవాప్తి ప్రకృష్యతే
సవిప్రలంభో విజ్ఞేయః సచతుర్ధానిగద్యతే
నీతా సదస్య రదస్య రస్యత్వం రతిః శృంగార ఉచ్యతే.

అని శృంగార రసభేదాలు వివరించాడు.

రీతిః స్యాత్పద విన్యాసభంగీ సాతు త్రిధా మతా
కోమలా, కఠినా, మిశ్రా చేతి స్యాత్తత్ర కోమలా

(పదాలు కూర్చే పద్ధతి రీతి. అవి కోమల, కఠిన, మిశ్రమం అని 3 రకాలు)

'విచార సుందరో నైషమార్గః' స్వాదిత్యుదాస్మహే
కైశికీవృతి భేదానాం నర్మాదీనాం ప్రకల్పనమ్
యతః కరుణమాశ్రిత్య రసాభాసత్వ కారణమ్
రసాభాస ప్రకరణే వక్ష్యతే తదితం స్ఫుటమ్
తత్త్వ న్యాయ ప్రవీణేన న్యాయమార్గాను వర్తినా
దల్మీతం సింగభూపేన స్పష్టం వృత్తి చతుష్టయమ్.

రుద్రటుడు కైశికిని ననువృత్తిని చేసి శృంగార, హాస్య, కరుణముల పరిపోషణ సిద్ధికొరకు రసకోవిదులు ఈ వృత్తి (కైశికి)ని ప్రయత్నపూర్వకంగ ప్రయోగించాలని చెప్పిన విషయాన్ని సింగభూపాలుడు సరియైనది కాదని కైశికి వృత్తి భేదాలయిన నర్మాదులను నిరూపించుటవలన కరుణరసంలో చొప్పించినట్లయితే రసాభాసత్వం కలుగుతుందని అంటూ సింగభూపాలుడు ఆయా శాస్త్రాలను బాగుగా నెరిగినవాడననీ, న్యాయమార్గ ప్రవర్తనుడననీ తనకు తానే తెలుపుకున్న సందర్భంలోనిది.

వాగంగ సత్త్వయుక్తా యేజ్ఞేయాస్తే వ్యభిచారిణః
సంచారయన్తిభావస్య గతిం సంచారిణోపితే

అని సంచారి భావాలను నిర్వచిస్తూ, వ్యభిచారులు వాక్కు, అంగసత్వాలతో కూడినది. భావంయొక్క గమనాన్ని సంచరింపజేయడంవలన నివి సంచారులని పేర్కొన్న సందర్భంలోనిది.

విషయ వివేచనంలో గ్రంథకర్త భోజదేవుడు మున్నగు అలంకారికుల మతంను సంయుక్తకంగా నిరాకరిస్తూ, భరత ముని మతంను అనేకసార్లు వివరిస్తూ కొన్ని సిద్ధాంతాలను ప్రతిపాదించాడు. సింగభూపాలుడు దృశ్యకావ్యోదహరణములకు వివిధ నాటకాలలోని ఉదాహరణలు ఇచ్చినను మిగతా రసభావాధికములకు మూడువంతుల ముప్పాతిక కావ్యాలనుండి గ్రహించిన వానినే ఉదహరించెను. రఘువంశం, కుమార సంభవం, శిశుపాల వధల నుండి చాలా గ్రహించెను. నాటకాలైన మాళవికాగ్నిమిత్ర, శాకుంతల, విక్రమోర్వశీయాలను చాలా చోట్ల ఉదహరించెను. ఇతరులవలె పద్యాలనేగాక, నాటక

గద్యభాగాలను కూడ చదివేవారికి సులభంగా అవగాహన అయ్యేవిధంగా ఉదహరించెను. ఇది ఒక విశేషంగా చెప్పవచ్చును. ఈ రచనలోని ఉదాహరణలనుబట్టి సింగభూపాలునికి కాళిదాసకవిపట్ల అమితగౌరవం కలదని తెలుస్తుంది.

సంగీత సుధాకరం :

శార్గదేవుడు 13వ శతాబ్దంలో 'సంగీత రత్నాకరం' అనే సంగీతశాస్త్ర గ్రంథాన్ని రచించాడు. దీనికి సింగభూపాలుడు 'సంగీత సుధాకరం' అనేపేరుతో వ్యాఖ్యాన గ్రంథాన్ని రచించాడు. సంగీత రత్నాకరానికి కేశవుడు మరియు కల్లినాథుడు, విఠలుడు కూడా వ్యాఖ్యానాలు రాశారు. ఈ అన్ని వ్యాఖ్యానాలలో సింగభూపాలుని సంగీత సుధాకర వ్యాఖ్య సులభంగాను అర్థవంతంగానూ ఉంది. నృత్త రత్నావళిని రచించిన జాయపసేనాని, గీతరత్నావళి పేరుతో మరియు వాద్యరత్నావళిపేరుతో వ్యాఖ్యాన గ్రంథాలు రచించానని తెలుపుకున్నాడు కాని ఆ గ్రంథాలు అలభ్యం.

సంగీత రత్నాకరంలో ఏడు అధ్యాయాలున్నాయి. అవి క్రమంగా స్వర, రాగ, ప్రకీర్ణ, ప్రబంధ, తాళ, వాద్య, నృత్య విభాగాలు. సింగభూపాలుడు మొదటి ఆరు అధ్యాయాలకు సంగీత సుధాకర వ్యాఖ్యను, ఏడవ అధ్యాయానికి సంస్కృత, కన్నడ భాషలలో 'లాస్యరంజనం' పేర వ్యాఖ్యానం రచించాడు.

సంగీతంలో క్లిష్టమైన విషయాలను తెలుసుకోవడానికి సింగభూపాలుని సంగీత సుధాకర వ్యాఖ్య ఎక్కువ ఉపయోగకారిగా ఉంది. గ్రామ రాగాలను వివరించే సందర్భంలో సింగభూపాలుడు. పార్శ్వదేవ, మాతంగ, భరతచార్యుల రచనలనుండి శ్లోకాలను ఉదహరించాడు. స్వరాధ్యాయం, రాగాధ్యాయం, ప్రకరణాధ్యాయాలలో 'పార్శ్వదేవుని' సంగీత సమయ' సారాన్ని అనుసరించి ఆయన శ్లోకాలను ఉదహరించాడు. కల్లినాథుడు తన వ్యాఖ్యానంలో త్రిస్థాయి, స్వరాలను సత్త్వ, రజ, తమో గుణ ప్రేరితాలుగా భావించి వ్యాఖ్యానించాడు. అందువల్ల "శరీరే ప్రతిస్థాన ముక్తా సంఖ్యాక నాఓ సన్నివేశ స్సతత్రశ్రుత్యు త్రాధ స్వచ" అని అంటాడు. నాద విద్యా ప్రశస్తిని గూర్చి తెలుపుతూ "పరమేశ్వరా రాధనార్థం గీయమానం గానం ధర్మహేతుః తస్మాత్ గాయంతం; స్త్రీయః కాయయన్తే" అని అంటాడు. ఈ విషయాన్ని గూర్చి సింగ భూపాలుడు సంగీత సుధాకర వ్యాఖ్యలో "గీతోప జీవనమర్థసాధనం శృంగార స్రాద్ధీపన విభావ రూహు తృత్కామ సాధనం" అని అంటాడు. ధ్వని ఉత్పత్తిని గూర్చి సింగభూపాలుడు సంగీత సుధాకర వ్యాఖ్యతో తెలుపుతూ ఏదేని అది వస్తుస్పందన మూలకమని అనుకరణాత్మకమని" పేర్కొన్నాడు.

శార్గదేవుడు 12 వికృతి స్వరాలను గుర్తించి ద్వాదశ వికృతాల పేర్కొన్నాడు. అవి చ్యుత, షడ్జ, అచ్యుతషడ్జ, సాధారణ ఋషభ, సాధారణ గాంధార, అంతర గాంధార, చ్యుతమధ్యమ, అచ్యుత మధ్యమ, త్రిశృతి, పంచమ, కైశికీ పంచమ, చతుశృతి దైవత, కైశికినిషాద, కాకలీ నిషాదములు. వీటిలో దోషాలను తెలుపుతూ సింగ భూపాలుడు సంగీత సుధాకర వ్యాఖ్యలో "తధాస్వరా అపిస్థాన విశేషణీత్యర్థః నను యధాషడ్జా దీనాం సప్తానాం స్వరాణాం స్థానవిశేషణవ బేస్తాత్వికః ప్రతీయః" అంటూ వికృత స్వరాలు శృతిస్థాన విశేష సంజాతములంటారు. అచ్యుతస్వరాలు శుద్ధమునకు భిన్నముకావని అది ఒక స్థానంలోనే ఉన్నాయని అంటూ సింగభూపాలుడు "తేశు దా సప్తస్వర ఏవ వికృతావస్థావికారం ప్రాప్తా ద్వాదశ సంఖ్యాకా భవంతి" అని ప్రశ్నిస్తూ తానే "అచ్యుత స్తుత స్వామేవ శృతావ వస్థితః పూర్వశృతి విహేనేకయా వికృతోభవతి" యద్యపి పూర్వశృతి విహీనత్వేత స్థాన స్థిత తత్వాత్ ధ్వని వికారోనాస్తి" అంటూ సమాధానం చెప్తాడు.

ఈ దృష్టితో చూసి ఆధునిక సంగీతకారులు షోడశ స్వరాల పదహారింటిలో శుద్ధస్వరాలు 7 గాక మిగిలిన స్వరాలను వికృత స్వరాలని గుర్తించారు. ఒకస్థాయిలో గల 16 స్వరాలకు షోడశ స్వరాలని పేరు. అవి 12

స్వరస్థానాలలో పుడతాయి. సింగభూపాలుడు శార్గదేవుడి సంగీతరత్నాకరంలో ఏడవ అధ్యాయమైన నృత్యభాగానికి 'లాస్యరంజని' పేరుతో సంస్కృత కన్నడ భాషల్లో వ్యాఖ్యానం రచించాడు. కన్నడభాషలో నాట్యశాస్త్రంలో స్వతంత్రంగా రచించిన గ్రంథాలు లేవు అని చెప్పవచ్చు. లాస్యరంజనిలో గల 868 పద్యాల్లో 778 పద్యాలు కందంలో రచించబడ్డాయి. దీనిలో నృత్య లక్షణాలను తెలుపుతూ సింగభూపాలుడు భావ, తాళ, లయ యుక్త మైన అభినయమే నృత్యం అని అంటాడు.

సంగీత సుధాకరంలోని కొన్ని శ్లోకాలు శైలికొరకు.....

సంగీత రత్నాకర నామధేయ గ్రంధస్యటికాం స్ఫుట
దర్శితార్ధం
శ్రీ సింహభూపః స్వకుల ప్రదీపస్తనోతి సంగీత
సుధాకరాఖ్యమ్ 7
దుర్బోధ భరతాదిభిర్విరచితం శాస్త్రం చిరాభ్యాసతః
సంగీతాగమ సార విద్భిరఖితాః సార్ధం విచార్య
స్ఫుటమ్ 8
విద్యాజాత విశారదః సహృదయః శ్రీసింహ
పృథ్వీపతిః
లోకానుగ్రహ వాంఛయా వివృణుతే సంగీత
రత్నాకరమ్ ॥ 9
అతిగంభీరే విషయే కలిపయవేద్యేత్విహ గ్రంథే
సమ్యగ్భా ఖ్యాన కుశలః సర్వజ్ఞః సింహ భూప
ఏవైకః 11
ఇతి శ్రీమదంద్ర మండలాధీశ్వర ప్రతిగండభైరవ
శ్రీ అనపోత
నరేంద్ర నందన భుజబల భీమశ్రీ సింహ భూపాల విర
చితాయాం సంగీత రత్నాకర టీకాయాం సుధాకరా
ఖ్యాయామ్.

సంగీత రత్నాకరానికి 'సుధానిధి' అనే వ్యాఖ్య వ్రాసి దానిలో సింగభూపాలుడు స్వయంగా 'సమ్య గ్వ్యాఖా కుశలః సర్వజ్ఞ సింహభూప ఏవైకః" అని తెల్పుకున్నాడు.

కువలయావళి :

కువలయావళికే మరొకపేరు రత్నపాంచాలిక. ఈ నాటిక శ్రీహర్షుడు రచించిన 'రత్నావళి'కి కొంత పోలిక ఉన్నా ఇది స్వతంత్ర గ్రంథం. సంస్కృతభాషలోని కమ్మని పలుకులతో రసపేటిక అయిన 'రత్నపాంచాలిక'ను రచించానని తన గురించి తాను గ్రంధాంతంలో తెలుపు కున్నాడు.

"పూర్ణేయం సింగభూపేన గ్రధితా మధుజల్పితైః ।
రత్న పాంచాలకా నామ నాటికా రసపేటికా॥"

కువలయావళి నాలుగు అంకాల నాటిక. శ్రీకృష్ణుడు కువలయావళిగా అవతరించిన భూదేవిని పెళ్ళి చేసు కోవడం ఇందులో ఇతివృత్తం. ఇది స్వతంత్ర రచన. రాచకొండలోని వ్రవన్న గోపాలుని వసంతోత్సవ సమయంలో దీనిని ప్రదర్శించేవారు. ఈ నాటకంలో కథ, పాత్రచిత్రణ, రసపోషణ ఔచిత్యవంతంగా తీర్చిదిద్ద బడ్డాయి.

సింగభూపాలుడు వైదికమార్గం వృద్ధిపొందాలని అంటూ ముల్లోకాలు సుఖంగా ఉండాలని కవులు సరస మైన సాహిత్యాన్ని మాత్సర్యములో మునిగిన హృదయాలు గలవారు కళంకాలు పలుకకుండా ఉండే విధంగా రాయాలని కోరుతున్నాడు.

"కళ్యాణమస్తు జగతాం సతతం త్రయాణం
సంవర్ధితో భవతువైదిక ఏవ మార్గః
సారస్వతాని సరసాని కవీశ్వరాణాం
మత్సర్యదిగ్ధ హృదయా నకలంకయంతి"

ఈ రత్న పాంచాలికలో ఎన్నో చక్కని శ్లోకాలను సింగ భూపాలుడు రచించాడు. వాటికి ఉదాహరణ.

ఉత్ఫుల్ల గండయుగ ముద్ధత మందహాస।
ముద్వేల రాగముర రీకృతి కామతంత్రమ్ ॥
హస్తేన హస్త మవలంబ్య కదాను సేవే
సల్లాప రూప మమృతం సరసీరు హాక్ష్యాః॥

రాజత్కోరక కంటకా మధుకరీ ఝంకార హుంకారిణీ
రాలోలన్తబ కస్త నీరవిరలా నున్న ప్రవాలాధరాఃl
ఆలింగంతి లతౌ వధూరతి తరా మాన మ్రశాభాకరై
రత్యారూఢ రసా రసాల రసికాఃకాంతా వసం తోత్సవే.

నాందీ శ్లోకాలు :

శృంగార వీర సౌహార్ధ, మౌర్ధ్య వయ్యార్ధ్య సౌహృదమ్
లాస్యతాండవ సౌజన్యం దాంపత్యమ్ తద్భజామహే
1 - 1

బీజావాప ముపేయివాన్ న్మృతి వశాద్రా గోష్మణోద్భేదవాన్
అన్యోన్యన్య కరాంగుళీ ఘటనయా ప్రాప్త ప్రవాలోద్గమఃl
విశ్రంభేణ వికాసవాన్ సఫలతామైక్యేన సంభావయన్
కల్యాణం భవాతాం కరోతు శివమోరానంద కల్పద్రుమఃl
1 - 2

ప్రస్తావన :

అహాసాహిత్య సౌభాగ్యం శ్రీసింగధరణీపతేఃl
శ్లాఘాయై యస్య సన్నద్ధా విశ్వేశ్వర సరస్వతి 1 - 3
నేతామన్మథ కారణం యదుపతిఃశ్రీయన్న పోతాత్మజో
నాట్యాలంకృత నిర్మితౌ వరిణతఃశ్రీ సింగ భూపక్కవిఃl
ఏషాపండిత మండలి రసకలా సామ్రాజ్య సంజీవని
పుణ్యేనద్యా పురాకృతేన ఫలితోమేనాట్య విద్యాశ్రమఃl
1 - 4

భరతవాక్యం :

కల్యాణమస్తు జగతాం సతతం త్రయాణాం
సంవర్ధితో భవతు వైదిక ఏవమార్గఃl
సారస్వతాని సరసాని కవీశ్వరాణాం
మాత్సర్య దిగ్ధ హృదయాన కలంకయంతు

కందర్ప సంభవం :

ఇది రూపక భేదాల్లో ఒకటైన భాణం. మన్మథుని జననం ఇందులోని ఇతివృత్తం. ఈ గ్రంథం అలభ్యం. 'రసార్ణవ సుధాకరం'లో స్నేహాన్ని వివరిస్తూ దీనిలోంచి ఉదహరించిన ఒక శ్లోకం మాత్రమే లభిస్తున్నది.

"ఉభే తదానీ ముభయోస్తుచిత్తే
కదుష్టని ఃశ్వాస చరిష్ణుకేన
యేకీ కరిష్యన్నను రాగశిల్పీ
రాగోష్మణైవ ఁదవతా మనైషీత్

సింగభూపాలునికి వివిధ శాస్త్రాలందు గల పాండిత్యం అపారమని చెప్పొచ్చు. అతనికి వ్యాకరణ శాస్త్రమందు, సంగీత శాస్త్రమందు, రసాలంకార నాట్యశాస్త్రంలో అసాధారణమైన ప్రజ్ఞగలదు అని అనుటకు ఈ కావ్యాలే ఉత్తమ ప్రమాణాలుగా చెప్పవచ్చు. సింగభూపాలుడు వసంతోత్సవాలను ఏర్పాటుచేసి రాజ్యంలో ఉన్న కవి పండిత, గాయకులను, శాస్త్రాచార్యులను దీవించి సన్మానాలు చేసేవాడు.

తెలుగు సాహిత్య చరిత్రలో రేచర్ల పద్మనాయక యుగం ముఖ్యఘట్టం. కాకతీయుల పతనాంతరం కోస్తాంధ్రలో ఆవిర్భవించిన రెడ్డి-రాజులతో, రాయలసీమ పరిసర ప్రాంతాలలో ఏర్పడిన విజయనగర రాజులతో సమ ఉజ్జీగా రాచకొండ రాజులు తెలుగు సాహిత్యాన్ని ప్రోత్సహించారు. కాని తెలుగు సాహిత్య చరిత్రలో రెడ్డి రాజులకు, విజయనగర రాజులకు దక్కిన కీర్తి రాచకొండ రాజులకుగాని, వారు ప్రోత్సహించిన కవులకుగాని దక్కలేదు.

రాచకొండ గొప్ప సాహిత్య సంపదకు, ఉద్దండ కవి పండితులకు, ప్రజాసాహిత్యానికి నిలయమని ఇట్టే తెలిసిపోతుంది. ఒక్కమాటలో చెప్పుకోవాలంటే రాచకొండ కవులు తెలుగు సాహిత్యానికి, తెలంగాణ సాహిత్యానికి చేసిన సేవ ఎనలేనిది

BHAVAVEENA
Vol. 17, Issue. 7, July 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

దాశరథి రంగాచార్య నవలలు - ఇతివృత్త వైవిధ్యం

- డా॥. కొల్లు సుభాష్ చంద్రబోస్

ఏ విధమైన ప్రమాణాలలో అంచనా వేసిచూసినా, రాశరథి రంగాచార్య 20వ శతాబ్ది తెలుగు నవలా రచయితల్లో ఒక విశిష్టమైన వ్యక్తి. ఆయన వృత్తి రచయిత కాదు. నవలా రచన ద్వారా జీవనభృతిని సాధించుకోవాలని ఆయన ఏనాడూ యత్నించలేదు. అయితే, ఆయన నవలా రచనారంగంలో ప్రవేశించేనాటికి ఇటువంటి వృత్తి రచయితలు కొంతమంది తెలుగులో ఉండేవారనే సంగతిని గుర్తించాలి. రంగాచార్య ఏదో ఒక సిద్ధాంతాన్ని, లేదా దృక్పథాన్ని పరిమిత స్థాయిలో వీక్షించే పిడివాదాన్ని ఆశ్రయించలేదు. ఆయన మౌలికంగా ఆత్మీయుడైన వ్యక్తి, మానవ సంబంధాల పట్ల ఆర్ద్రమైన దృష్టి కలిగిన మనీషి అందువల్ల ఆయన సిద్ధాంత నిబద్ధతలకన్నా మానవ అనుబంధాలు ఆత్మీయతలకే అధిక ప్రాధాన్యతను చూపించారు. ఏదో ఒక సిద్ధాంతాన్ని బాగా ప్రచారంలోనికి తీసుకొని రావడమే రచయిత బాధ్యత అని భావిస్తున్న 1960వ దశకపు సాహిత్య వాతావరణంలో రంగాచార్య తన రచనా జీవితాన్ని ఆరంభించారు. వృత్తి రచయితగా మారకపోవడం, ఏదో ఒక సిద్ధాంతానికి గిరిగీసుకొని నిబద్ధుడు కాకపోవడం రంగాచార్య విశిష్టతల్ని గట్టిగా పరిచయం చేస్తున్నాయి. ఆయన జిజ్ఞాసువు. అందుకే ఉత్తమమైనవిగా భావించిన పలు విషయాలను అధ్యయనం చేశారు. వీటిని తనకు సాధ్యమైన రీతిలో కథనాత్మకంగా వివరించి రాశారు. శుష్కమైన మూఢ నమ్మకాలను ఖండించారు. పరిపూర్ణమైన సామాజిక న్యాయాన్ని ఆకాంక్షించారు. ఆస్తికుడుగా ఉన్నారు. దేవుడినికోరికలు కోరే భక్తితత్వాన్ని తీవ్రంగా నిరసించారు. తాను నగరంలోనే వున్నప్పటికీ పల్లెతల్లి ముచ్చట్లను మరచిపోలేదు. బాల్యంలో అమ్మఒడిలో నేర్చుకున్న అచ్చమైన తెలంగాణ మాండలికాన్ని విస్మరించలేదు. అదే మాండలికంలో నవలా రచన సాగించేందుకు సాహసించారు. తన నవలల ద్వారా రాయలసీమ, కోస్తాంధ్ర ప్రాంతీయులకు సైతం తెలంగాణ మాండలికాన్ని బాగా పరిచయం చేసిన తొలి నవలా రచయిత దాశరథి రంగాచార్య.

దృక్పథ రహితమైన రచన ఖచ్చితంగా వ్యాపార సాహిత్యమే అవుతుంది. ఇది కాలక్షేపంతో ముగుస్తుంది. అందువల్ల ప్రతి సాహితీవేత్త ఏదో ఒక దృక్పథాన్ని ఎంపిక చేసుకోవలసి ఉంటుంది. కందుకూరి వీరేశలింగం పంతులు సంఘ సంస్కరణ దృక్పథంతోనే రచనలు చేశారు. ఆయన ఆరంభించిన వివేకవర్ధిని పత్రిక, రచించిన నవలలు, ప్రహసనాలు స్వీయ జీవిత చరిత్రతో సహా సకల వాఙ్మయము సంఘ సంస్కరణ దృక్కోణంతో అల్లుకున్నది. సాహిత్యాన్ని సంఘ సంస్కరణకు ఉపకరణంగా వీరేశలింగం భావించారు. సమకాలీన సాహిత్యంలో ప్రసిద్ధులైన ముళ్ళపూడి వెంకటరమణ హాస్య చమత్కారాలను తన రచనా వస్తువులుగా తీసుకున్నారు. ఇందులో 'సీరియస్' అంశాలకు తావు ఉండదు. సంఘ సంస్కరణకూ హాస్యానికీ మధ్య ఎంతో వ్యత్యాసం ఉంటుంది. అంత మాత్రంచేత హాస్య దృక్పథాన్ని తేలిక రీతిలో చూడవలసిన అవసరంలేదు. సంస్కరణ ద్వారా సమాజాన్ని మరమ్మతు చేస్తానని వీరేశలింగం భావిస్తే హాస్యంతో వ్యక్తి గత ఆనందాన్ని అందిస్తానని ముళ్ళపూడి చెబుతూ ఉండవచ్చు. స్వర్గీయ నోరి నరసింహశాస్త్రి పలు నవలలు రచించారు. ఆయన రచించిన నవలలన్నీ చరిత్రకాంశాలే. కవిత్రయాన్ని గురించి రాసినా, రుద్రమదేవిని వర్ణించినా, అంతటా చారిత్రక దృక్పథమే కన్పిస్తుంది. నిజానికి, ఆయన ఆ దృక్పథాన్ని దాటలేదు. అడవి బాపిరాజు కూడా నవలా రచన చేశారు. చారిత్రక నవలల్ని రచించారు. అయితే ఆయనలో చారిత్రక దృక్పథం తక్కువ. ఇంతకు మించిన సౌందర్య దృక్పథం బాపి

రాజులో కన్పిస్తుంది. మిగతా వాటికి భిన్నంగా ఇది నిసర్గ రూపంలో ఉంటుంది.

విశ్వనాథ సత్యనారాయణ పదుల కొద్ది నవలలు రాశారు. అయినా వాటన్నింటి నేపథ్యం సనాతాన భారతీయ ధార్మిక పరిరక్షణ ఇదొక బలమైన నైరూప్య దృక్పథంగా ఆయనలో రూపపు దిద్దుకుంది. కొడవటి గంటి కుటుంబరావు సమాజవాది. ఆయన దృక్పథం మార్క్సిస్టు సూత్రాలతో నిబద్ధింపబడింది. ఆయన వాటిని దాటలేదు. ఆయన రచనల్లో మార్క్సిస్టు సామాజిక దృక్పథమే కన్పిస్తుంది. చలంలో స్త్రీ అభ్యుదయాకాంక్ష దృక్పథంగా రూపొందింది. ఆర్.ఎస్.సుదర్శనం, వడ్డెర చండీదాస్, కొంతమేరకు గోపీచంద్‌ల రచనల్లో నిగూఢమైన తాత్విక దృక్పథం ఉంటుంది. చింతనను ప్రధానంగా తీసుకున్న రచయితలు కనుక వీరు ఈ రకమైన అభిమతాన్ని ఏర్పాటు చేసుకొని ఉండవచ్చు. రంగాచార్యలో సమాజవాది ఉన్నాడు. ఆయనలో సనాతన వాది కూడా కన్పిస్తాడు. సౌందర్య పిపాసి ఆయనలో దాగి కన్పిస్తాడు. సమాజాని కన్నా ముందు వరుసలో నిలబడే చిత్ర కారుడు దర్శనమిస్తాడు. ఇట్లా పలురకాలైన సకారాత్మక గుణాలతో పాటు తాత్విక పరిపుష్టి కూడా ఉంటుంది. స్థూలంగా చెబితే, ఆయన సిద్ధాంత నిబద్ధుడు కాదు. ప్రతి సిద్ధాంతంలోనూ ఏదో ఒక లోపం ఉంటుంది కనుక, అది జీవితాన్ని మించదని రంగాచార్యకు తెలుసు. అందువల్లనే ఆయన రచనలకు జీవితమే చుక్కాని అయింది. అదే ఆ రచనలను నడిపించింది. అందుకే రంగాచార్య రచనల్లో పుష్టికరమైన జీవన దృక్పథం ఉంటుంది. రంగాచార్య జీవన దృక్పథంలో విభిన్న అంశాలున్నాయి. విద్య, సామాజిక, మత, రాజకీయ, పోరాట, దళిత, మానవ సంబంధ, భూదానోద్యమ ఆర్థిక తదితర దృక్కోణాలు కలిపి రంగాచార్య రచనల్లోని జీవిత దృక్పథమవుతుంది.

చిల్లర దేవుళ్ళు :

తెలంగాణా జన్మనిచ్చిన సాహితీ మూర్తులతో అగ్రగణ్యుడు దాశరథి రంగాచార్యగారు. వారి సాహిత్యంలో నజీవతతో అద్భుతంగా తీర్చిదిద్దిన నవల 'చిల్లర దేవుళ్ళు'. నాటి తెలంగాణాలోని వాస్తవ జీవిత పరిస్థితులను అప్పటి నిజాం నవాబు తాబేదారుల, గ్రామాధికారుల దౌర్జన్యాన్ని, వారిదోపిడి గుణాన్ని వారి అవినీతిని, రాచరిక వ్యవస్థలోని కుళ్ళును, 'బాంచను నీకాల్మొక్త' అన్న సామాన్యుల నిస్సహాయతను పాఠకుల మనసులు కలచి వేసే విధంగా సరళంగా చిత్రించారు రచయిత ఈ నవల్లో. ఈ నవలను శ్రీమాడపాటి హనుమంతరావు పంతులు గారికి అంకితమిచ్చారు.

చిల్లరదేవుళ్ళు నవలలో రామారెడ్డి, ప్రధాన పాత్ర. అతని అహంకారం ఉన్నా కాస్తమెత్తని మనసు వుంది. రామారెడ్డి మాట ఆ గ్రామంలో వేదవాక్కు. కరణం, రామారెడ్డికి కుడిభుజం, వారు గ్రామంలో స్వతంత్రంగా వ్యవహరిస్తూ గ్రామ ప్రజల స్వాతంత్ర్యాన్ని హరిస్తూ వుంటారు. రామారెడ్డి అరాచకానికి గురైన ఆడబాప కూతురు రెండవ తరంలో ఆడబాప వనజ రామారెడ్డి స్వంత బిడ్డ మంజరి వీరిద్దరికి మంచి సఖ్యత వుంటుంది. సారంగపాణి రామారెడ్డి గదిలోకి ప్రవేశించడంతో కథ ప్రారంభమౌతుంది. సారంగపాణి సంగీతం అధ్యాపకుడుగా రామారెడ్డికి పరిచయమౌతాడు. వనజ సారంగపాణిని ప్రేమిస్తుంది. మంజరి సారంగపాణినే ప్రేమిస్తుంది. కథానేపథ్యంలో సారంగపాణి టౌనుకి వెళ్ళడం చీర తేవడం, దానిని అందుకోవాలని వనజ అనుకోవడం, మంజరి ఇష్టపడడంతో ఆ చీరను మంజరికి ఇవ్వడం ఒకత్యాగానికి ప్రతీకగా తెలియజేశారు రచయిత. ఊర్లో మాల, మాదిగలు తురకల్లో కలవడం. గ్రామంలో కల్లోల పరిస్థితులేర్పడడం సినిమా రీలులా ఒక దాని వెంట ఒకటి జరిగి పోతుంటాయి.

వనజ సారంగపాణిని మొదట్లో ప్రేమించినా చివరికి తన ప్రేమను అతనిపై సోదర ప్రేమగా మార్చుకుంటుంది. తాయారు సారంగపాణిచేత నిరాకరింపబడి వైష్ణవాచార్యులతో బంధం ఏర్పరుచుకుంటుంది. సారంగపాణి ఇంద్రారెడ్డి కొడుకు చంద్రశేఖర్‌రెడ్డిగా, మంజరీ బావగా

గుర్తింపు పొందడం నిజానికి ఈ నవల కథ ముగిసినా రచయిత మాత్రం రామారెడ్డి గొంతు క్యాన్సర్ వ్యాధితో అది అంతా తన పాపాల ఫలితంగా వచ్చిందేనని చివరి క్షణాల్లో పశ్చాత్తపపడ్తాడు. కరణం లంబాడీల చేత దారుణంగా హత్యగావించబడ్తాడు. రామారెడ్డి మరణంతో కథ ముగుస్తుంది. ఆ గ్రామానికి వెలుగు వస్తుంది.

మోదుగు పూలు :

ఈ నవలలో రచయిత తెలంగాణా ప్రాంతంలో జాగీర్లు, దానిని పాలించే జాగీర్‌దార్ల పరిస్థితులను కళ్ళకు కట్టినట్లు చేశారు. కథ అంతా పీడనకు, దాని నెదిరించే విషయంలో జరిగే పోరాటానికి నడుమ నడుస్తుంది. తెలంగాణా సాంస్కృతిక, రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాలను ప్రత్యేకంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు పడే పాట్లను యువకులు తెగించి చేసే పోరాటాలను ఇందులో చిత్రించారు. రఘు అనే విద్యావంతుడు హైదరాబాద్ నుండి చదువు ముగించుకొని స్వగ్రామం రావడంతో కథ ప్రారంభమవుతుంది. రచయిత జాగీర్ పరిస్థితులను తెలియజేయడానికి ఒక సంఘటన (పేపర్‌కు సంబంధించినది) ప్రవేశపెట్టి, రానున్న కథ దిశను చక్కగా తెలియజేశారు. జాగీర్లలో అడుగుపెట్టిన రఘు అక్కడి ప్రజల దయనీయస్థితిని, జాగీర్‌దార్ల దమననీతిని రెంటిని చూస్తాడు. పీడ నుంచి బైటపడడానికి ఆలోచనతో పోరాట మార్గాన్ని ఎంచుకుంటాడు. అతడికి జానకి (మేనమామ కూతురు) నాగేశ్‌లు సహకరిస్తారు. జానకి రఘులు ప్రేమించుకుంటారు. నాగేష్‌ను ప్రేమించిన రుక్మిణిని తాసిల్దార్ కొడుకు రషీద్ (రజాకార్ల నాయకుడు) మానభంగం చేస్తాడు. రుక్మిణి ఆత్మహత్య చేసుకుంటుంది. జానకిని కూడా రషీద్ మానభంగం చేయబోతే జానకి అతడ్ని చంపుతుంది. దుండగులు జానకిని కాల్చి చంపుతారు. జనం అంత తాసిల్దారుపై పగతీర్చుకుంటారు. ఈ నవల్లో కథ బరువైన సంఘటనలతో చోటు చేసుకుని సాగుతుంది.

జనపదం :

బలరామయ్య దొర ఊరికి పట్టిన రాక్షసపీడ. అతని ఘాతుకాలకు ఎందరో బలౌతారు. ఎందరో ఆడవాళ్ళ శీలం అతని దాహానికి బలైపోతుంది. పూర్వ వైభవం, అధికారం పోతుంది. అందరూ దూరమౌతారు. ఎదిరించే వాళ్ళు అధికమౌతారు. పోలీసుల రక్షణలోనే అతడి మనుగడ సాగుతుంది. చింత చచ్చినా పులుపు చావ లేదన్నట్లు అతడిలో రాక్షస ప్రవృత్తి వయసు పైబడ్తున్నా తగ్గదు. గడీలో వైభవం పోతుంది. ఎన్నో ఉపద్రవాలు అతగాడ్ని క్రుంగదీసినా ఎదిరిస్తాడు. అతనికెదురు తిరిగిన వాళ్ళు అంతా మృత్యువుకు ఎర అవుతారు.

దొరలాంటి రాక్షసులపై యువకులు ఉద్యమం లేవదీస్తారు. ప్రకాశం నాయకత్వం వహిస్తాడు. గీత అతనికి సాయపడ్తుంది. దొరకు తాళం వేసే శేషయ్య ప్రకాశం వైపు యువకులు మొగ్గు చూపడంతో గాంధీకి డబ్బిచ్చి ప్రకాశాన్ని చెడుగా చిత్రించే ప్రయత్నం చేస్తాడు. ప్రకాశం విప్లవ బాటననుసరిస్తాడు. పోరాటాలతో ప్రజలమన్ననలు పొందుతాడు. చివరికి పోలీసులతో నేరుగా యుద్ధం చేసి వారి చేతిలో మరణిస్తాడు. ప్రజా విప్లవం రావాలని, ప్రజలు మంచి చైతన్యాన్ని పొందాలని కాంక్షించాడు. ఆఖరి క్షణం వరకు విప్లవం కోసం పోరాడి అస్తమించాడు. ఇదే జనపదం నవల కథాంతర్భాగం.

రానున్నది ఏది నిజం :

ఈ నవల విశాలాంధ్ర దినపత్రిక 1973 వారం వారం సీరియల్‌గా వచ్చింది. ఈ నవలలో కథ వాస్తవం, కథ కదలిక వాస్తవం. గతకాలపు పోరాటాలు దేశ పరంగానూ, ప్రాంత పరంగాను ఎంత శ్రమించినా వచ్చిన మార్పు ఏ మాత్రం ఆ కష్టానికి ఫలితం ఇవ్వలేదు ఐగా దోపిడీ సమాజం ఏర్పడి సామాన్య మానవుడ్ని కష్టాలపాలు చేశాయి.

విద్య, వైద్యం వ్యాపారంగా మారాయి. సేవాభావం ధనస్వామ్యంలో కొరవడింది. ఉత్పత్తి ధనస్వామ్యంలో

డిమాండు అనుసరించడంలేదు. ఆర్థిక మాంద్యంలో ఆసియా దేశాలు అల్లాడుతున్నాయి. ఈ స్థితిలో సోషలిజం రావడం సాధ్యమేనా. వికృతంగా వున్న ప్రస్తుత పరిస్థితుల్లో రానున్న కాలంలో ఏది నిజం, అది సోషలిజమేనా అన్న కవి ఆకాంక్ష ఈ నవల కథకు మూలం, కథనానికి మూలం. పాత్రపరంగా చూస్తే అవి వాస్తవాలకు ప్రతీకలే. మంత్రిగారి దురాలోచన దూరాలోచనగా మారడంతో ఈ నవలకథ నవల రెండూ ముగుస్తాయి.

పావని :

1978 జూన్ చతురలో నవలగా వచ్చి ప్రశంసలందుకుంది. రంగాచార్య గారి పావని. కథ విషయం పరిశీలిస్తే గౌరినాథశాస్త్రిగారి కూతురు పావని మేనమామల ఇంట్లో చదువుకుంది. బి.ఏ.పాసైంది. టీచరుగా ఉద్యోగం సంపాదించింది. తండ్రి తను వున్న వూరికి కూతురు పావనిని బదిలీ చేయించమని ఊరి పెద్ద శివయ్యను అడగడం అతగాడు కాదనడం జరిగిపోతాయి. శివయ్య ఆ గ్రామానికి ఒక రావణాసురుడు. చదువు లేక పోయినా లోక వ్యవహారం తెలుసు. డబ్బు సంపాదించి ఆ గ్రామాన్ని కొనేశాడు. ఆ గ్రామస్తులను అణచివేశాడు. అతని అధికారానికి ఆ ఊరు తలవంచింది. పావని తండ్రి ఊరికి పంతులమ్మగా బదిలీపై వస్తుంది. శివయ్యకు ఎదురు తిరుగుతుంది. గ్రామంలో బడిపెట్టి అందరిని విద్యావంతులను చేయాలనే సత్కార్యానికి శ్రీకారంచుడ్తుంది. శివయ్యను ఒక సంఘటన ద్వారా మూఢనమ్మకాల వల్ల జరిగే అనర్థాన్ని వివరిస్తుంది. శివయ్య ఆ వూళ్ళో ప్రభుత్వం కట్టినబడిన ఆక్రమించుకొని ధాన్యం గిడ్డంగి చేసుకున్నాడు. పావన్ని యివన్నీ తెలుసుకొని శివయ్య నెదిరించింది. అతనికొక కొరకరాని కొయ్యగా మారింది. ఊరి చింత చెట్టు కొంద బడి ప్రారంభించింది. ఊరి వాళ్ళు కూడా పావని సత్కార్యానికి ప్రోత్సాహమిచ్చారు. శివయ్య అంటే ఏమిటో వాళ్ళకి అర్థమైంది. గూడెంలో జరిగిన ప్రమాదంతో అందరూ కళ్ళు తెరిచారు. పావని సంకల్పం, సేవ వారికి అర్థమైంది. వారు బ్రతుకుతున్న బ్రతుకు నుండి మంచికోసం మారాలని ప్రయత్నించారు. వ్యవసం (సారా) మానేశారు.

శివయ్యకి పతనదశ ప్రారంభమైంది. ఏదైనా తనకు మేలు జరుగుతుందేమోనని పట్నం వెళ్ళాడు. అయినా అక్కడ కూడా చుక్కెదురైంది. భూసంస్కరణల భూతం కొత్తగా అతడిపై పడింది. ఆస్తిదక్కించుకోవాలనే తపనతో ఆలిని చంపాడు. మల్లమ్మ, శివయ్య వద్ద వున్న గ్రామస్తుల బానిసత్వాన్ని, ఆధారాలను అగ్నికి ఆహుతి చేసింది. పావని మల్లమ్మను ప్రశంసించింది. గ్రామం యావత్తూ శివయ్యను చంపాలని నిశ్చయించుకుంది. వారి యత్నాన్ని పావని ఆపింది. శివయ్య దగ్గర నమ్మకంగా పనిచేస్తున్న నర్సింహ శివయ్య దుర్మార్గం గుర్తించి అతడిని తన బల్లెంతో చంపేస్తాడు. పావని ఆశయం ఫలిస్తుంది. గ్రామం సరస్వతి నిలయం అవుతుంది. అవిద్య, అజ్ఞానం వున్న గ్రామాలు శివయ్య వంటి రాక్షసుల వల్ల ఎలా నాశనం అవుతున్నాయో తెలియజేస్తూ రచయిత పావని వంటి విద్యావంతురాలి సదాశయం వల్ల మంచి సంస్కరణ వస్తుందని నిరూపించారు.

మాయజలతారు :

డా॥. దాశరథి రంగాచార్యగారి 'మాయ జలతారు' నవల 6-1-1971 నుండి 21-4-71 వరకు ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో సీరియల్‌గా వచ్చింది. 1973-76లో ఈ నవలను విశాలాంధ్ర ప్రచురణాలయం వారు ప్రచురించారు. ఈ నవలలో రచయిత జీవితంలోని 1959 ప్రాంతం గతం అంతా ఒక జ్ఞాపకంగా కథ నడుస్తుంది. పోచయ్య, పెంటయ్య, పరమయ్య, ఇస్తారి, ఎల్లమ్మ, మల్లమ్మ, మాంకాళమ్మలు ఉంటారు. అందరి మధ్య బంధాలు బంధుత్వాలు వుంటాయి. అందరూ ఒకరికోసం ఒకరు అన్నట్లు ఉంటారు. అందరికి పనిపాట, ఆట ఇదే జీవితం ఎంత అయినా మనుషులే కాబట్టి వారి జీవిత సంధ్యల్లో అప్పుడప్పుడు చీకట్లు కమ్ముడం అంతలోనే వెలుగు రావడం ఇది మాయజలతారు నవల కథాతర్భాగం. ఈ మాయజలతారు నవల్లో కథాపరంగా చూస్తే ఉస్మాన్

అనే కబ్జాదారు పెత్తనం చేయడం మురికివాడల్లోని గుడిసెలను పీకేయాలని చూస్తాడు. అక్కడున్న వీళ్ళు అతని ఆగడాలను ఎదిరించడానికి పోరాట మార్గం ఎంచుకుంటారు. ఉస్మాన్ వల్ల నష్టపోయిన వాళ్ళ ఉసురు తగులుతుంది. ఉస్మాన్ జైలుకు పోతాడు. అంతా ఊరట చెందుతారు. అయితే ఈ కథలో అనేక మలుపులు సంఘటనలు చోటుచేసుకొని తెలంగాణా సాంస్కృతిక, సామాజిక, ఆర్థిక విషయాలను దర్శింప చేస్తాయి. ఈ నవలకు పేరు పెట్టింది నార్ల చిరంజీవిగారు. ఈ నవల్లో కథ మనం మాయలో జీవిస్తున్నాం, వాస్తవం చూడనీయని సమాజం ఇది. మనం జీవించడం మానేసి నటిస్తున్నాం భ్రమలో కొట్టుమిట్టాడ్తూ జీవితపు వెలుగును చూడలేని అంధకారంలో వున్నాం అనే సత్యాన్ని తెలియ జేస్తుంది.

శరతల్పం :

నారాయణ స్వామి, నాంచారమ్మలు సనాతన వైష్ణవ సంప్రదాయ కుటుంబానికి ప్రతినిధులు. గురవయ్యతో నారాయణస్వామికి అనుబంధం బలపడ్తుంది. నారాయణస్వామి, నాంచారమ్మలు గురవయ్య భార్యతో అనుబంధం పెంచుకుంటారు. ఊరూవాడా ఏకమైన నారాయణస్వామి గురవయ్యను ఆదరిస్తాడు. గురవయ్య కల్లాకపటం ఎరుగని వ్యక్తిత్వం, ప్రతిఫలం ఆశించని మనస్తత్వం, సాయపడేగుణం నారాయణ స్వామి కుటుంబానికి చేరువ చేస్తుంది. నాంచారమ్మలో గురువయ్య కడజాతివాడనే భావం ఉన్నా భర్త నారాయణ స్వామి బోధతో మారుతుంది. నారాయణ స్వామి కొత్తింటి వెళ్తాడు. గురవయ్య రోగానికి గురౌతాడు. భాగవత సప్తాహ సమయంలో నాటి పరిక్షిత్ మహారాజులా నారాయణైక్యం చెందుతాడు. గురవయ్య భార్య పిచ్చమ్మ గురవయ్యను చేరడంతో ఈ శరతల్పం నవల కథ ముగుస్తుంది.

పోరాటానికీ - రంగాచార్య నవలలకూ మధ్య అవినా భావ సంబంధం ఉన్నదేమో అనే అభిప్రాయం కలుగు తుంది. ప్రతి నవలలోనూ పోరాట వాదులున్నారు. అయితే వారి దృక్పథాలు భిన్నమైనవి. స్థూల దృష్టితో చూసినపుడు వీరందరూ అన్యాయానికి విరుద్ధంగా విస్ఫులింగాలు అవుతారు. 'పావని' నవలలో పాఠశాల ఉపాధ్యాయిన పావని గ్రామ పెద్ద శివయ్యపై పోరాటం జరుపుతుంది. పాతికేళ్లు నిండని సంప్రదాయ కుటుంబానికి చెందిన యువతి ఊరిపెత్తం దారుపై ధర్మయుద్ధాన్ని ప్రకటించడం ఒక గొప్ప సాహసం. నిరక్షరాస్యులైన గ్రామీణులు చైతన్యాన్ని సంతరించుకోవడం పావని నవలలోని పోరాటం. మాయా జలతారు నవలలో పోరాట స్వభావం మారో రకంగా ఉంది. పొట్ట చేత బట్టుకొని పట్నానికి వచ్చిన బీద దళిత వర్గాల వారు నగరంలోని కబ్జాదారును ఎదురించే నేపధ్యంలో ఏకం కావడం ఇందులోని పోరాట సారం. ఇవి రెండూ ప్రజా ఉద్యమాలు. వీటిలో సిద్ధాంతాలు, సాయుధతత్వానికి ఎట్లాంటి ప్రమయం లేదు. రచయితకు బాగా ఇష్టమైన మోదుగుపూలు నవలలో సాయుధ విప్లవ వాదికి - ప్రజా ఉద్యమ పక్షపాతికి మధ్య జరిగే సంఘర్షణను అత్యంత సమతూకంలో వర్ణించడం జరిగింది. జనపదం నవలలో కూడా ఇటువంటి భిన్నవ్గాల సంఘర్షణల్ని రచయిత చిత్రించారు.

❁❁❁

BHAVAVEENA
Vol. 17, Issue. 7, July 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

ప్రసార మాధ్యమం భాషలో మార్పుల ప్రభావాల విశ్లేషణ

- యం.సి. కేశవ మూర్తి , ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

ప్రసార మాధ్యమం ప్రభావం వల్ల భాష వాడకంలో రెండు తరాలలోనే భారీ మార్పు ఏర్పడి ప్రజల భాషలో మార్పు మరియు నవీన పదజాలం వాడకాన్ని విస్మరించ లేము. ప్రస్తుత వ్యాసం ఈ మార్పులను విశ్లేషించి ముద్రణ, సాంఖ్యిక మరియు సాంఘిక మాధ్యమాల వలన కలిగే మార్పుల ప్రభావాల గురించి చర్చిస్తుంది.

ప్రధానంగా మూడు రకాల ప్రసార మాధ్యమాలకు సంబంధించి వార్తాపత్రికలు, పత్రికలు, పుస్తకాలు, గమనికలు, కరపత్రాలు మొదలైనవి ముద్రణ మాధ్యమంలో; రేడియో, టెలివిజన్, చలనచిత్రాలు మొదలైనవి సాంఖ్యిక మాధ్యమంనందు; మరియు జాలగూళ్ళు, వీడియో మరియు ఆడియో స్ట్రీమింగ్ ప్లాట్‌ఫారమ్‌లు (వరుసగా వ్లాగ్‌లు మరియు బ్లాగులు), ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ మొ. సాంఘిక మాధ్యమం పరికరాలుగా చూడ వచ్చు.

ఈ రకంగా ప్రసార మాధ్యమ వేదికలు అధిక సంఖ్యలో అభివృద్ధి చెంది సమాచార ప్రసారం మార్గంలో మరియు భాషల వాడకంలో వైవిద్యాలు పుట్టుకొచ్చాయి. సమాచారం మొత్తం విస్తృత ప్రపంచానికి చేరుకున్నప్పటికీ, తక్షణ అనువాదం కోసం వివిధ సాంకేతిక పురోగతుల కారణంగా భాషా అవరోధాలు, అంతరాలు తగ్గుతున్నట్లు గమనించవచ్చు. సమాచార ప్రసారం కూడా రాతపూర్వక వార్తలకు మాత్రమే పరిమితం కాక, ఛాయాచిత్రాలు, భావ ముఖచిత్రాలు (ఎమోటికాన్లు లేదా ఎమోజిలు), హ్యాష్‌ట్యాగ్ భాష ద్వారా ఒకరితో ఒకరు సంధానమయ్యే మార్గాన్ని కనుగొన్నారు. సమాచారం యొక్క వివిధ మాధ్యమాల భాషలలో దీనిని వివిధ దశలలో గమనించ వచ్చు.

ముఖ్యాంశాలు : ప్రసార మాధ్యమం, భాష, ముద్రణ ప్రసార మాధ్యమం, సాంఘిక మాధ్యమం, సాంఖ్యిక ప్రసార మాధ్యమం, సమాచారం, ప్రసారం, భాషాశాస్త్రం.

ప్రసార మాధ్యమం భాష :

ప్రసార మాధ్యమం భాషా వినియోగం గురించి అధ్యయనం చేస్తే భాషా వినియోగాన్ని అభిజ్ఞ మరియు సామాజిక సమాచార పద్ధతుల మధ్య ముఖ్యంగా సంస్కృతి, వ్యవస్థల మధ్య అనుసంధానంగా భావించవచ్చు. ప్రసార మాధ్యమం భాష ఒక నిర్దిష్ట ప్రసార మాధ్యమం ఉపయోగించే భాష మరియు వాటి పదాల ఎంపికను మాత్రమే కలిగి ఉండదు. ఇది ప్రసంగ ప్రవర్తన, పాల్గొనే వారు, ప్రసార మాధ్యమ పాఠ్యం యొక్క ఉత్పత్తి మరియు ప్రయోగం గురించి అధ్యయనం చేస్తుంది. భాష మరియు సంస్కృతి యొక్క పోకడలలో వచ్చిన మార్పులతో ఒక భాష దాని సంక్లిష్ట నిర్మాణాలతోపాటు మారుతున్న లక్షణాల అధ్యయనం గురించి ప్రసార మాధ్యమ భాషా శాస్త్రం ఆశక్తి చూపుతుంది. అంతర్జాలం యొక్క ఆవిర్భావం మరియు సామాజిక మాధ్యమం నెట్వర్క్ పర్యవసానంగా, బ్లాగులు, ట్వీట్లు, ఫేస్‌బుక్ పోస్టులు, వాట్సాప్లు మరియు లింక్డ్‌ఇన్ ప్రొఫైల్స్ లాంటి సరికొత్త రకాల రాతపూర్వక భాషల ప్రయోగాలలో విప్లవాత్మకమైన పెరుగుదల ఏర్పడి హ్యాష్‌ట్యాగ్ భాష వాడకం ప్రపంచ సమాజంలో ఇటీవలి కాలంలో విప్లవాలు చేసింది.

ముద్రణా ప్రసార మాధ్యమం :

ముద్రణ ప్రసార మాధ్యమం వారి శైలి పట్ల సాంప్రదాయ విధానానికి ప్రసిద్ధి చెందింది. ముద్రణ ప్రసార మాధ్యమం ప్రధాన రూపాలు వార్తాపత్రిక, పత్రికలు, పుస్తకాలు మొదలైనవి. పత్రికలు ముద్రణ ప్రసార మాధ్యమం యొక్క అత్యంత ప్రాచుర్యం పొందిన రూపం. ఇది సరసమైనది మరియు చాలా మందికి

చేరుకుంటుంది. ఒక నిర్దిష్ట సమూహాన్ని లక్ష్యంగా చేసుకునే వివిధ రకాల వార్తాపత్రికలు సమాజంలో ఉన్నాయి. పత్రికలు రాజకీయ, సాధారణ, చారిత్రాత్మక లేదా జీవనశైలి, ఆటలు, సినిమా మొదలగు వివిధ రకాల కథనాలను అందిస్తాయి. పత్రికలు, దిన, వార, మాస, త్రైమాసిక, అర్ధవార్షిక లేదా వార్షిక సంచికల రూపంలో ప్రచురించబడతాయి. ఈ విధంగా పుస్తకాలను నిర్వచించడం కష్టం. పుస్తకాలు సాహిత్య శైలి, ప్రక్రియ, అంశం మొదలైన అంశాలను సృశిస్తూ అనేక విధాలుగా విభిన్నంగా ఉంటాయి. వార్తాపత్రికలు తమ దత్తాంశాన్ని సరళమైన భాషలో ప్రదర్శిస్తాయి. చదవడానికి ఆసక్తికరంగా ఉండటానికి అవి నిర్మాణాత్మక పద్ధతిలో కూర్చబడతాయి. చాలా మంది వార్తాహారులు పాఠకులను ఆకర్షించే ముఖ్యాంశాలను ఉపయోగించి 'ఆకట్టుకునే పదబంధానికి' ప్రాముఖ్యతనిచ్చి దృష్టిని ఆకర్షించడానికి నివేదిక నుండి కొన్ని అంశాలను ఎత్తి చూపుతారు. నమూనా నివేదికలోని అంశాలకు వార్తా నివేదికలు తప్పనిసరిగా వివరణాత్మక సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. వార్తా పత్రికల పుటవిన్యాసం జాగ్రత్తగా రూపొందించబడుతుంది. మొదటి పేజీ కుంభకోణాలు, రాజకీయ వ్యవహారాలు, విషాదాల వంటి వార్తా విలువలను కలిగి ఉంటుంది. మొదటి పేజీ వార్తాపత్రిక యొక్క ముఖం అయితే, సంపాదకీయం గుండె లాంటిది. వార్తాపత్రిక యొక్క అసలైన చర్చనీయాంశం ఏమిటో సంపాదకీయం మాట్లాడుతుంది. పత్రికలు ముఖ్యంగా రోజువారి పరివర్తనలు మరియు వినోదం లాంటి అంశాలతో మన ముందుకు వస్తాయి. రచనా శైలి సహజంగా, ఆహ్లాదంగా మరియు సృజనాత్మకంగా ఉంటుంది. ఇది ఆరోగ్యం, వ్యాపారం, వినోదం, క్రీడలు, కీర్తి మరియు ఆధునికతలకు సంబంధించిన వార్తలను ఆకర్షనీయంగా ప్రస్తుతించాలి. సాంఘిక మాధ్యమాల తరంగం ప్రవాహం పత్రికల యొక్క మార్గాన్ని కమ్మేసే ప్రమాదం ఉంది. అయితే ఇప్పటికీ కొన్ని ముద్రణా మాధ్యమాలు సృష్టించిన వారసత్వం మరియు దాని ప్రభావం కారణంగా ఎక్కువగా కోలుకున్నాయి. ప్రస్తుత మరియు తాజా వార్తలు ఎల్లప్పుడూ ప్రతి రకమైన ప్రసార మాధ్యమంలోనూ చాలా ముఖ్యమైనవిగా ఉంటూ ఇక్కడ కూడా వాటి ప్రాముఖ్యత మారలేదు.

ఒక పుస్తకం ఎల్లప్పుడూ ప్రత్యేకమైనదే. అందులో ఏముందనేదికూడా, ప్రారంభించడానికి, పతాక విశ్లేషణ, శీర్షిక మరియు మొదటి పుట నుండి మొదలవుతుంది. మొదటి పుటను పాత్ర ఆధారితంగా, ఏదైనా ఉద్దేశాలు, చిహ్నాలు మొదలైన వాటి దృష్ట్యా చిత్రించవచ్చు. చాలా పుస్తకాలు స్పష్టమైన కారణాల వల్ల ముఖ పుటనందు ప్రసిద్ధ విమర్శకుల సమీక్షల శీర్షికలను జోడిస్తాయి. రచయిత మరియు ప్రచురణ సంస్థ యొక్క విశ్వసనీయత పుస్తకాలకు సహాయపడే ఇతర ముఖ్య విషయాలు. ముద్రణ ప్రసార మాధ్యమం భాషలో మూడు ప్రధాన అంశాలు ఉన్నాయి. వచనం, చిత్రాలు మరియు రంగు. పాఠ్యం యొక్క సంస్థితి, పరిమాణం మరియు ఖతుల రకాలు చాలా ముఖ్యమైనవి. ఇది ఆకర్షణీయంగా ఉండి అదే సమయంలో పాఠకులకు సౌకర్యంగా ఉండాలి. చిత్రాలు పాఠ్య విషయంతో సమానంగా ఎలా వస్తాయో వాటి వరకు విలువైనవిగా మరియు అనుకూలంగా ఉండాలి. దాని నాణ్యత కూడా లెక్కించబడుతుంది. రంగులు అర్థాలను లేదా చిహ్నాలను తెలియజేస్తాయి. పాఠ్య విషయం యొక్క తీవ్రతను పెంచడానికి వాటిని జోడించవచ్చు.

సాంఖ్యిక (Digital) ప్రసార మాధ్యమం:

ముద్రణ ప్రసార మాధ్యమం గ్రాహకుడి యొక్క ఆసక్తి, పాఠ్య లభ్యత, అక్షరాస్యత మరియు విద్య వంటి అంశాలపై ఆధారపడి ఉంటుంది. సాంఖ్యిక ప్రసార మాధ్యమం ముద్రణ ప్రసార మాధ్యమం కన్నా ఎక్కువ ప్రాచుర్యంలోకి ఎందుకొచ్చిందంటే ఇది చదువురానివారు కూడా అర్థం చేసుకోవడం సులభం మరియు సాంఖ్యిక ప్రసార మాధ్యమం దృశ్య నిజరూప (వర్చువల్) ప్రపం

చాన్ని సృష్టించినప్పుడు దాని ప్రజాదరణ స్థాయి పెరిగింది. ఉద్దేశించిన అర్థంతో ప్రసార మాధ్యమంకు ప్రత్యేకమైన నియమాలు, ఆకృతులు మరియు నిర్మాణాలు ఉన్నాయి. దీన్ని సరళతరం చేయడానికి, సాంఖ్యిక ప్రసార మాధ్యమం సంకేతాలను ఉపయోగిస్తుంది. వీటిలో సాంకేతిక సంకేతాలు, శబ్ద సంకేతాలు మరియు ప్రతీకాత్మక సంకేతాలు ఉన్నాయి. సాంకేతిక సంకేతాలు ప్రసార మాధ్యమం యొక్క భౌతిక నిర్మాణంలో భాగమవుతాయి. పాఠ్యం యొక్క భాష ఎలా ప్రాతినిధ్యం వహిస్తుంది అనేదే శబ్ద సంకేతం. ప్రతీకాత్మక సంకేతాలు పాఠ్యం వెనుక అసలు అర్థాన్ని సూచిస్తాయి.

సాంఖ్యిక యుగంలోకి ప్రవేశించిన మొట్ట మొదటిది రేడియో. ఇతరులు దీనిని అనుసరించారు. కేవలం వార్తలు మరియు ప్రకటనల ప్రారంభ రోజుల నుండి, ఇది వినోదంవైపు కూడా వేగంగా దూసుకెళ్లింది. సంగీతం మరియు రేడియో పరిశ్రమలు చేతులు కలిపి ఎదిగాయి. చెవులు మానవుల అతితెలివైన జ్ఞానేంద్రియాలు. మీరు ఒకే ఒక్కసారికి మాత్రమే విన్నదాన్ని నమోదు చేయడం అనేది అపరిమితమైన పని. రేడియో మొదట ఈ పరిమితిని అధిగమించాల్సి వచ్చింది. శ్రోతలు అర్థం చేసుకోవడానికి వచనం చిన్నది ఐనా సరళంగా ఉండాలి. దీన్ని సరళంగా మరియు క్లుప్తంగా ఉంచడం ఎల్లప్పుడూ ఉత్తమ మైన మార్గమే. వచనాన్ని ప్రదర్శించేటప్పుడు ప్రతిదీ శబ్దాలలో ప్రాతినిధ్యం వహిస్తుంది కాబట్టి శ్రోతలు వింటున్నదేదో సరిగ్గా అర్థం చేసుకోవాలి. ధ్వని ప్రభావాలు (సౌండ్ ఎఫెక్ట్) ఈ సమస్యకు పరిష్కారం కాగలవు. వారు వివిధ ధ్వనులు, సంకేత శబ్దాలను జోడిస్తూ నేపథ్య సంగీతంతో అసలు పాఠ్యాన్ని మరుగు పరచకుండా చూసుకుంటారు. రేడియో వచనంలో శబ్ద సంకేతాలు చాలా ముఖ్యమైన భాగం. రేడియో జాకీ పాఠ్యం యొక్క నేపథ్యం మరియు విషయాన్ని బట్టి వారి పదాలను దానికి సరిపడా తెలివిగా ఉపయోగించాలి. రేడియోను అంధ మాధ్యమం అని కూడా అనొచ్చు. చాలా మంది శ్రోతలు రేడియో వింటున్నప్పుడు వేరే పని చేస్తుంటారు. టెలివిజన్ అనేది ప్రేక్షకులలో అత్యంత ప్రభావవంతమైన అవిష్కరణ. విస్తృత శ్రేణి వినోద సౌకర్యాల తర్వాత టీవీ ఒక సాధారణ దృగ్విషయంగా మారింది. వార్తలు, ప్రకటనలు, వినోదం మొదలైనవి నెమ్మదిగా ప్రజల మనస్తత్వం మరియు ఆలోచనా శైలిని ప్రతిబింబించడం ప్రారంభించాయి. టెలివిజన్ ఉత్పత్తిలో పూర్వ ఉత్పత్తి, ఉత్పత్తి, ఛాయాగ్రహణం, పరఉత్పత్తి వంటి ముఖ్యమైన ప్రక్రియలు ఉన్నాయి. టెలివిజన్ యొక్క విస్తృత కార్యక్రమాలే అది ప్రసిద్ధి చెందడానికి ఒక ప్రధాన కారణం. ప్రేక్షకుల ఆదరణ కోసం వారు చక్కటి వ్యాపారం చేసుకున్నారు. టెలివిజన్ వారు ప్రసారం చేసే కార్యక్రమాలకు సమయపాలన ఉంటుంది. మతపరమైన, జీవనశైలి, చలనచిత్రాలు మొదలైన ఉదయపు కార్యక్రమాలనే భావన ఉంది. టెలివిజన్ ఛానెళ్ల ప్రకారం సాయంత్రం 7 నుండి 10 గంటల మధ్య సమయం ప్రధాన బంగారు సమయం లాంటిది. ఈ సమయంలో ప్రజలు టెలివిజన్‌ను ఎక్కువగా చూస్తారు. వైవిధ్య కార్యక్రమాలు, యదార్థ కార్యక్రమాలు, నాటకాలు, సినిమాలు, విద్యా కార్యక్రమాలు, ప్రత్యేక పిల్లల కార్యక్రమాలు, సంకలనాలు మరియు బోధన వంటి అనేక రకాల కార్యక్రమాలు ఉన్నాయి. మార్కెటింగ్ మరియు ప్రకటనల యొక్క ఏకైక ఉద్దేశ్యంతో సృష్టించబడిన ఛానెల్‌లు ఉన్నాయి. నిర్మాతలు కొన్ని ఛానల్స్ వారి ప్రకటనలు మరియు విక్రయాల కోసం ప్రేక్షకులను లక్ష్యంగా చేసుకుంటారు. ఈ రకంగా కొంతమంది ప్రభావిత ప్రేక్షకులకోసం నిర్మాతలు కార్యక్రమాలను రూపొందిస్తారు. దానితో ప్రేక్షకులు నిజంగా సంధానం అవ్వగలిగితే విజయం ఉంటుంది.

సినిమాలు కూడా సాంఖ్యిక ప్రసార మాధ్యమంలో భాగంగా పరిగణించవచ్చు. సినిమా రకాన్నిబట్టి, తారాగణం యొక్క కీర్తి లేదా సినిమా ఎంత సందర్భోచితంగా ఉంది అన్న విషయాలను బట్టి చిత్రాలు భిన్నంగా

మారకం చేయబడతాయి. వీటికి టీజర్లు మరియు ట్రైలర్స్ మొదటి సందేశాలు. ఇది గ్రాహకుల్లో ఉత్సుకతను రేకెత్తించాలి. వారు ఎక్కువగా చూపించేది సినిమా యొక్క సంగ్రహావలోకనం మరియు దేనిపై దృష్టి పెట్టాలి అనే దాని గురించి.

సామాజిక ప్రసార మాధ్యమం :

సామాజిక ప్రసార మాధ్యమం దాని నిర్మితి గురించి విశ్లేషణ ఇవ్వలేనంతగా దాని పరిధి విభిన్నంగా ఉంటూ చాలా లోతుగా చొచ్చుకుపోయింది. అంతర్జాలం, ప్రపంచ వ్యాప్త జాలం (వరల్డ్ వైడ్ వెబ్)కు సంధానం అయినప్పుడు సామాజిక మాధ్యమం యొక్క యుగం ప్రారంభమైంది. గూగుల్ వేదికగా ఇప్పుడు అవి విశ్వంలో అత్యంత శక్తివంతమైన పేర్లుగా నిలిచాయి. అనేక ఆన్‌లైన్ సొసైటీలు మరియు అనేక సామాజిక మాధ్యమం చాట్ రూమ్‌లు ఉన్నప్పటికీ ఫేస్‌బుక్‌ను ప్రపంచానికి పరిచయం చేయడం ద్వారా సామాజిక మాధ్యమం వేదికలు విప్లవాత్మకంగా మారాయి. సంధానానికి మీరు రెండు అడుగుల దూరంలో లేదా రెండు ఖండాంతరాలలో ఉన్నా ఈ సామాజిక మాధ్యమం జాలస్థలుల (సైట్లు) ప్రాథమిక దృష్టి భాగంపంచుకోవడమే (షేరింగ్). సామాజిక మాధ్యమం జాలస్థలులు కూడా ప్రకటనలకు మంచి వేదికగా మారాయి. సామాజిక మాధ్యమంలో రాతలు మనము ఎన్నడూ చూడని మరియు అనుభవించని విషయాలను చూపించి రాత్రికిరాత్రే ప్రజలను ప్రసిద్ధులను చేసింది. 1990ల చివరి నుండి సామాజిక మాధ్యమం పరిమాణం మరియు ప్రజాదరణ పెరిగింది. ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు "ఫేస్ బుక్ మెసెంజర్" వంటి తక్షణ సందేశ అనువర్తనాల ద్వారా ఒకరికొకరు సందేశాలను, సమాచారాలను పంపించు కుంటున్నారు. పిల్లి మీసాలు, కుక్క చెవులతో, కుక్క ముక్కుతో ఒకరికొకరు వెర్రి చిత్రాలను మరియు "స్నాప్ చాట్" వంటి అనువర్తనాలతో ఒకరినొకరు మెసేజ్ చేస్తూ వివిధ మీమ్స్‌లో ఒకరినొకరు ట్యాగ్ చేస్తున్నారు. ఫేస్‌బుక్ మరియు ఇన్స్టాగ్రామ్ ఇటీవల సామాజిక మాధ్యమం ప్రవేశ పెట్టడంతో, ప్రజలతో కమ్యూనికేట్ చేయడం గతంలో కంటే సులభం అయింది. ఒక మీట నొక్కడంతో ప్రజలు ప్రపంచవ్యాప్తంగా ఇతరులతో క్షణంలో సంభాషించు కోగలుగుతున్నారు. సామాజిక మాధ్యమం ఆవిష్కరణతో, "LOL, ROFL, మరియు LMAO" వంటి పదాలను ఉపయోగించి కొత్త నకిలీ భాష సృష్టించబడింది. అంతిమంగా, ఆధునిక యుగంలో ఒక సమాజంగా మనం ఎలా సంభాషించాలో సామాజిక మాధ్యమం మార్చేసింది. అయితే ఇటీవలి సంవత్సరాలలో అంతర్జాలం ద్వారా బలోపేతం చేయబడిన సమాచార మార్పిడితో, మన ముఖాముఖి సంభాషణ నైపుణ్యాలు తగ్గిపోయాయి అన్నది వాస్తవం.

సామాజిక మాధ్యమం జాలస్థలులు ఆకట్టుకునే విషయం ఏమిటంటే, మనము దానిలో ఏమేమి చేస్తున్నామో గమనిస్తూ మనం ఎక్కువగా ఆన్‌లైన్‌లో ఉండటానికి మనం చేస్తున్నదానికి సంబంధిత విషయాలను తీసుకురావడానికి ప్రయత్నిస్తాయి. జాలస్థలుల వలె వర్చువల్ సమాజాలు పెరిగాయి. ఇప్పుడు ఆటలు, విపణి జాలస్థలులు ఇంకా మరెన్నో ఉన్నాయి.

ప్రభావాలు :

ప్రసార మాధ్యమం యొక్క పెరుగుదల మొత్తం విస్తృత ప్రపంచాన్ని తీవ్రంగా ప్రభావితం చేసింది. ఇది వారి రోజువారీ జీవితంలో ప్రజలు ఉపయోగించే భాషలో తీవ్ర ప్రభావాన్ని చూపింది. ప్రసార మాధ్యమం ద్వారా భాషాశాస్త్రం చాలా ప్రాముఖ్యతను సంతరించుకుంది మరియు సమాచార ప్రసారంలో ప్రసార మాధ్యమం ద్వారా భాషలో గుణాత్మకమైన మార్పును గమనించ వచ్చు. సాంకేతికత మరియు ప్రసార మాధ్యమం పురోగతి ఎక్కువగా ఇంగ్లీషు భాషను అన్నింటికన్నా ఎక్కువగా ప్రభావితం చేశాయి. ప్రపంచవ్యాప్తంగా అమెరికన్ ఇంగ్లీష్, ఆస్ట్రేలియన్ ఇంగ్లీష్, ఇండియన్ ఇంగ్లీష్ వంటి అనేక రకాల ఇంగ్లీషులు ఉంటూ ప్రపంచ భాషగా ప్రసార

మాధ్యమ ఇంగ్లీషు మాన్యువల్ భాషగా విస్తృతం అయ్యింది. కొత్త లక్షణాలు కనిపించినప్పుడు దీనికి కొత్త పేరు వస్తుంది. 'సెల్ఫీ' అనే పదాన్ని ఆక్స్ఫర్డ్ ఇంగ్లీష్ డిక్షనరీ సంవత్సరపు పదంగా ప్రకటించింది. సెల్ఫీ అనేది స్వీయ ఛాయాచిత్రం, ఇది సాధారణంగా స్మార్ట్ ఫోన్లలో లేదా డిజిటల్ కెమెరాలలో తీయబడుతుంది. ఈ పదం ఉద్భవించి 'గ్రూప్ ఫై' వంటి కొత్త పదాలు కూడా ఏర్పడ్డాయి. గ్రూప్ఫీ అనేది ఒక క్లిక్లో వ్యక్తుల సమూహం తీసుకున్న సెల్ఫీలు. అదేవిధంగా, 1977లో, కంప్యూటర్లలో పాఠాల పైకి క్రిందికి కదలడాన్ని సూచించడానికి స్క్రోలింగ్ అనే పదాన్ని మొదట ఉపయోగించారు. ఇది కొంతకాలంగా ఎక్కువగా స్మార్ట్ ఫోన్లలో స్క్రోలింగ్కు సంబంధించి వాడుకలో ఉంది.

ప్రసార మాధ్యమం యొక్క పెరుగుదల వాస్తవానికి దూరం తగ్గడానికి కారణమైంది. పైన పేర్కొన్న ఈ పెరుగుదల జీవన విధానాన్ని మాత్రమే కాకుండా, మనం మాట్లాడే లేదా భాషను ఉపయోగించే విధానాన్ని కూడా ప్రభావితం చేసింది. భాష ప్రతిరంగంలో తన రెక్కలను విస్తరించింది. సంగణక శాస్త్రం, భాషాశాస్త్రం మరియు అభిజ్ఞా విజ్ఞాన శాస్త్రం యొక్క సమ్మేళనం సంగణక భాషా శాస్త్రం. ఈ రోజు మరియు చాలావరకు మనం చూసే అనేక సాంకేతిక పురోగతిలో సంగణక భాషాశాస్త్రం యొక్క ప్రధాన పాత్ర ఉంది. ఎనిగ్మా కోడ్ నుండి నేటి పరిపూర్ణ కృత్రిమ వివేకం (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) వరకు అన్ని మైలు రాళ్ళు దాని ద్వారా అభివృద్ధి చెందాయి. భాషా శాస్త్రానికి ఎటువంటి అవరోధాలు లేవు. ఇది మానవ మనస్సులను, సంఘాలను మరియు వ్యక్తిగత ప్రవర్తనలను అధ్యయనం చేస్తుంది. ప్రసార మాధ్యమం యొక్క భాష, సాంఖ్యిక, ముద్రణ లేదా సామాజిక ప్రసార మాధ్యమాలు ఉపయోగించే భాషపై దృష్టి పెడుతుంది. 21వ శతాబ్దం ఫేస్బుక్, ఇన్స్టాగ్రామ్, స్నాప్చాట్ వంటి సామాజిక మాధ్యమాల జాలస్థలుల పెరుగుదల శిఖరాగ్రంలో నిలుస్తుంది. అందరి దినచర్యలో ప్రసార మాధ్యమం ఇప్పుడు ప్రధాన భాగంగా మారింది. వార్తా పత్రిక చదివేటప్పుడు ఉదయం కప్పు కాఫీ తాగడం నుండి నెట్ఫ్లిక్స్లో రాత్రిపూట ప్రదర్శనలను చూడటం వరకు. ప్రసార మాధ్యమం ఇప్పుడు మనల్ని మాత్రమే కాకుండా ప్రపంచాన్ని శాసిస్తుందని చెప్పవచ్చు.

భాష ప్రయోగం మరియు సమాచార ప్రసారాల్లో పాత మరియు యువ సమాజాల మధ్య విస్తృతమైన అంతరం ఏర్పడింది. భాష మరియు సమాచారం చాలా తీవ్రంగా మారిపోయాయి. పాత తరానికి చెందిన చాలామంది సమాచారం యొక్క కొత్త భాషను అర్థం చేసుకోలేక ఇబ్బంది పడుతుంటారు. పాత తరాల వారు ఉపయోగించిన కొన్ని పదబంధాలు మరియు పదాలు కొన్నిసార్లు కొత్త తరం తప్పుగా అర్థంచేసుకోవడం జరుగుతుంది. అంతేకాక, బహిరంగంగా ఉపయోగించినప్పుడు నిషిద్ధ పదాలుగా భావించిన పదాలు ఇప్పుడు సాధారణమైనవిగా పరిగణించబడుతున్నాయి. సంవత్సరాలుగా భాష మరియు సమాచార పద్ధతుల్లో మార్పు ఈ విధంగా ప్రభావం చూపుతుంది.

ముగింపు :

ప్రసార మాధ్యమం మరియు భాష ఎలా కలిసిపోతాయి అనే దానిపై ఇది ఒక విశ్లేషణ. ప్రజలు సమాచారం ఇవ్వడానికి మరియు వారు కోరుకున్నదాన్ని వ్యక్తీకరించడానికి ప్రజల అవసరం ఫలితంగా ప్రసార మాధ్యమం ఉద్భవించింది. మానవ నిర్మిత ప్రతి వస్తువులాగే, ప్రసార మాధ్యమం కూడా భాషపై ఎక్కువగా ఆధారపడి ఒకదానినొకటి ప్రభావితం చేసుకుంటాయని చెప్పవచ్చు. ప్రసార మాధ్యమం ముద్రణ, విద్యుత్, సాంఖ్యిక, సాంఘిక మరియు అంతర్జాల రూపాలలో గుర్తించబడి, అతి తక్కువ వ్యవధిలో అభివృద్ధి సాధించింది. వీటి పెరుగుదల సమాజం మరియు ఆర్థిక వ్యవస్థపై భారీ ప్రభావాన్ని చూపింది. దీంతోపాటు సంస్కృతి, రాజకీయాలు, మనస్తత్వాలు భావజాలాలలో అవగాహన మార్పు వంటివి కూడా ప్రభావితమయ్యాయి.

ప్రసార మాధ్యమం ప్రేక్షకులను లక్ష్యంగా ఆకట్టు కోవడంలో వారి అల్గోరిథం మరియు వ్యూహాలను వాడు తుంది. క్రమంగా, ప్రసార మాధ్యమం ప్రతిదానిలో ఒక భాగంగా మారి ప్రతిచోటా ఉంది. భాషాశాస్త్రం పరంగా ప్రసార మాధ్యమంను విశ్లేషించగలిగితే, వారు భాషను వారి ప్రయోజనం ఎలా ఉంటుందో అలాగే వాడుకుంటు న్నారు. లిపి, స్వరం, విషయం, యాసలు, మాట్లాడే పదాలు, పాఠ్యం యొక్క రకం ఎలాంటివి అవసరమో దాని ప్రకారం ఉపయోగించబడుతున్నాయి. ప్రసార మాధ్యమం మన జీవితాన్ని అనేక విధాలుగా ఉద్ధరిం చిందన్నది నిజం.

ప్రసార మాధ్యమం సంవత్సరాలుగా అభివృద్ధి చెంది ప్రజల వాడుక భాషలో భారీ ప్రభావాన్ని చూపింది. సాధా రణ భాషలో ఉపయోగించని అనేక పదాలు మరియు పదబంధాలు సాధారణీకరించబడ్డాయి. మాట్లాడే విధానంలో మార్పు మరియు మాటల స్వరం కూడా ప్రసార మాధ్యమం ఆవిర్భావం మరియు పరిణామంతో మార్పుచెందాయి. ప్రసార మాధ్యమం ద్వారా సమాచార ప్రసారం యొక్క కొత్త పద్ధతుల ప్రభావం వల్ల ఎప్పటి కప్పుడు భాషా వాడకంలో తరాల అంతరాలు తొలగి పోయాయి. ప్రసార మాధ్యమం పెరుగుదల భాష చాలా శక్తివంతం అవ్వడానికి దారితీసింది. భాషను ఉప యోగించే విధానాలు మునుపటి కంటే ఇటీవలి సంవత్స రాలలో అనేక విప్లవాలకు అవకాశం ఇచ్చి మార్గదర్శకం అయ్యాయి. ప్రసార మాధ్యమ భాషాశాస్త్రం చాలా విలువైన అధ్యయనంగా మారడమే కాక, సమాజ స్వభా వాన్ని అర్థం చేసుకోవడానికి ఇతర విభాగాలలో కూడా దోహదపడింది. ప్రసార మాధ్యమం వారి పరిధిని ముద్రణ నుండి సాంఖ్యికం అలాగే సాంఘిక మాధ్యమానికి విస్తరించడంతో, పాత పదాలకు కొత్త అర్థాన్ని ఇవ్వడం నుండి కొత్త పదాలను సృష్టించడం వరకు ప్రతిదానిపై దాని ప్రభావం మరింత లోతుగా పెరిగింది. ప్రసార మాధ్యమ భాషాశాస్త్రం కొంతమందికి కొత్తది కావచ్చు కానీ, ప్రసార మాధ్యమం వారి గొంతును వివిధ రంగాలకు భిన్నంగా ఉపయోగించడం ప్రారంభించినప్పటి నుండి ఇది ఇక్కడ ఉంది. ఒక్కమాటలో చెప్పాలంటే, ప్రపంచవ్యాప్తంగా సామాజిక మాధ్యమం భారీ విజయాన్ని సాధించిన తరువాత ఆంగ్ల భాషలో (ఇది సామాజిక మాధ్యమం అనువర్తనాల్లో ఎక్కువగా ఉపయోగించబడే భాష) జరిగిన మార్పును మీరు నిశితంగా పరిశీలిస్తే అది ఎలా పనిచేస్తుందో స్పష్టంగా తెలుస్తుంది. చివరగా విశ్లేషణలో, భాష యొక్క చైతన్య స్థితిని తెలుసుకోవాలంటే ప్రసార మాధ్యమంకు సంబంధించి మరియు సమాజంలో దాని వ్యాప్తికి సంబంధించి అధ్యయనం చేయవచ్చు.

ఆధార గ్రంథాలు :

1. Abercrombie, N. 1996. Television and Society. Cambridge: Polity Press.
2. Jean Aitchison and Diana M. Lewis. 2004. New Media Language. Routledge, London.
3. Lunt, P., and Livingstone, S. 2001. Language and the media: An emerging field for social psychology. In H. Giles and P. Robinson (Eds.), The New Handbook of Language and Social Psychology, 2nd edition. London: John Wiley.
4. Thompson, J. B. 1995. The media and Modernity: A social theory of the media. Cambridge.
5. https://www.zhaw.ch/en/linguistics/research/media-linguistics/
6. https://en.wikipedia.org/wiki/Media_linguistics

BHAVAVEENA
Vol. 17, Issue. 7, July 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

మినీ కవితకు సరికొత్త రూపం 'రవ్వలు'

– డా॥. ఎన్. ఈశ్వరరెడ్డి, అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు శాఖ, యోగి వేమన విశ్వవిద్యాలయం, వేమనపురం, కడప.

తెలుగు సాహిత్య ప్రవాహం విభిన్న పాయలుగా చీలి ప్రవహిస్తున్నా మంచిని బోధించడమనే లక్ష్యాన్ని మాత్రం మరవలేదు. ప్రాచీన కాలం నుండి నేటి వరకు వచ్చిన అనేక ప్రక్రియలు ఈ సత్యాన్ని తెలియజేస్తున్నాయి. సమాజం ఆయా కాలాల విలువల్ని నిర్ణయించినట్టే, సాహిత్యం కూడా ఆయా సమాజ విలువలకు ప్రతి బింబంగా సాగుతోంది.

పురాణాలు, ఉపనిషత్తులు వాటి ప్రభావంతో వచ్చిన ప్రబంధాలు, శతకాలు, ఉదాహరణలు, రగడలు, ద్విపదలు మొదలైనవన్నీ ప్రక్రియా వైవిధ్యంతో వచ్చాయి. పద్య రూపంలో ఉన్నా, వాటిని కూర్చిన విధానాన్ని బట్టి, పాటించిన నిర్మాణ, అభివ్యక్తి మార్గాన్ని బట్టి వాటికి ఆయా ప్రక్రియా గౌరవాలు లభించాయి. ఆధునిక కాలంలో వచ్చిన సాహిత్యం, నేపథ్యాన్ని మార్చుకున్నట్టే రూపాలనూ మార్చుకుంది. దేవుడు, దెయ్యం, వరం, శాపం, స్వర్గం - నరకం, పాపం - పుణ్యం మొదలైన భావజాలం ప్రాచీన సాహిత్యానికి పునాదిగా నిలిస్తే, మనిషి, కష్టం, సుఖం, కుటుంబం, సమాజం, విద్య మొదలైన అంశాల నేపథ్యంతో ఆధునిక సాహిత్యం ముందడుగు వేసింది. ప్రాచీన సాహిత్యంలో కథ, కవిత్వం కలిసి నడిచాయి. ఆధునిక కాలంలో కథ నుండి కవిత్వం విడిపోయింది. నవల, వ్యాసం, జీవిత చరిత్ర, స్వీయచరిత్రలుగా ఆధు నిక సాహిత్యప్రక్రియలు ఏర్పడ్డాయి. కవిత్వం పద్య రూపంలో కొనసాగుతున్నప్పటీ వచన కవిత, గేయ కవితలు విభిన్న రూపాలను సంతరించుకున్నాయి. దీర్ఘకవితగా, మినీ కవితగా, హైకూగా, గజల్‌గా, నానీగా, రెక్కలుగా, ఎస్టీడీలుగా, మెరుపు తీగలుగా... ఇలా ఎంతో మంది ప్రయోగ వైవిధ్యంతో రచనలు చేస్తున్నారు. సమాజాభివృద్ధిని కాంక్షిస్తూ, జనం మెచ్చే భాషలో, నచ్చే యాసలో రాస్తే తప్పక ఆదరిస్తారని గతం తెలియజేస్తోంది. అదే కోవలో వచ్చిన మరొక కవిత్వ ప్రక్రియ 'రవ్వలు'.

శాస్త్ర సాంకేతిక రంగాలలో వస్తున్న మార్పులు మనిషిని సాహిత్యానికి దూరం చేస్తున్నాయి. చదివే సమయం తగ్గిపోతోంది. తక్కువ సమయంలో చెప్ప దలుచుకున్న విషయాన్ని సూటిగా, చమత్కారంగా, రొటీన్‌కు భిన్నంగా చెప్పాలనే సంకల్పం 'రవ్వలు' లాంటి ప్రయోగాలకు ఊతం ఇస్తోంది. సంక్షిప్తత, కొత్తదనం, భావగాంభీర్యం, సూటిదనం, చమత్కారం వంటి లక్షణా లతో మినీ కవిత కొత్త కొత్త రూపాల్లోకి మార్పు చెందు తోంది.

కవిత్వం మినీ తత్వంలోకి అడుగుపెట్టేవేళ హైకూ ముందుకొచ్చింది. హైకూ అనుభూతి ప్రధానమైంది. హైకూకు కొన్ని లక్షణాలు ఉన్నాయి. శీర్షిక లేకపోవడం, మూడు పాదాలూ ఒకే భావాన్ని అందించేవిగా ఉండడం, ముక్తకంలా ఏ హైకూకు ఆ హైకూ వేరు వేరు భావాల్ని ప్రసరించడం, జపాన్ భాషలోని 'ఓన్‌జి'ని అనుసరించి, ఇంగ్లీషు వారి సిలబల్స్‌ను బట్టి 17 అక్షరాల్లో రాయాలనే అక్షరనియమం ఉండడం హైకూ లక్షణాలు. ఇది జపాన్ దేశం నుండి దిగుమతి అయినట్టు లెక్క.

దీని తర్వాత వచ్చిన నానీలకు కూడా కొన్ని లక్షణాలను నిర్దేశించారు. నాలుగు పాదాలు ఉండడం, 20 అక్షరాలు మించకుండా ఉండడం అనేవి దీని ప్రధాన లక్షణాలు.

'రెక్కలు'గా విచ్చుకున్న మరో ప్రక్రియలో పాద సంఖ్య ఆరుకు చేరినా, అక్షరాలు, పదాలు అత్యల్పంగా వాడడం ఇందులోని ప్రత్యేకత. ఒక్కో పాదం రెండు పదాలకు ఎనిమిది అక్షరాలకు మించకుండా సాగడాన్ని సుగమ్ బాబు రెక్కల్లో చూడవచ్చు. 'తొలి నాలుగు పాదాలు ఒక యూనిట్‌గా, మలి రెండు పాదాలు ఒక యూనిట్‌గా

ఉంటాయి. మొదటిది ప్రాతిపదికగా ఉంటే రెండోది నేపథ్యంగా నిలుస్తుంది. ఇది ఉపమాన ఉపమేయాల్లా, బింబ ప్రతిబింబాల్లా పరస్పర పూరకాలుగా ఉంటాయి. రెక్కలు' కేవలం సాహిత్య ప్రక్రియ మాత్రమే కాదు, జీవితాన్ని ప్రక్షాళించే తాత్విక ప్రక్రియగా సుగమ్‌బాబు చెప్పుకున్నారు.

అత్యల్ప పదాలలో అనల్పార్థాన్ని పొదగాలనే ప్రయత్నమే చిన్నచిన్న కవిత్వ ప్రక్రియలకు మూలంగా భావించవచ్చు. మూడు పాదాలలో ఒక భావనను పొందు పరిచి, నాలుగో పాదంలో ఆ భావనకు గల నేపథ్యాన్నో, కారణాన్నో, సందర్భాన్నో, ముగింపునో, పరిష్కారాన్నో తెలిపే విధంగా రాయడం 'రవ్వలు' ప్రక్రియలో కనిపించే లక్షణం. నాలుగు పాదాల నియమం ఉంది. అక్షర నియమం లేదు. ఏ రవ్వకు ఆ రవ్వ ప్రత్యేక భావస్ఫోరకంగా ఉంటూ, ఒక దానిపై మరొకటి ఆధారపడి అర్థం చేసు కోవాల్సిన అవసరం ఉండదు. ప్రత్యేక శీర్షికలు ఉండవు. మనసులో కదిలిన భావానికి నాలుగు పాదాల్లో సూక్ష్మంగా చెప్పడమే దీనికున్న ప్రత్యేకత. క్లుప్తంగా 'రవ్వల' లక్షణాలు ఇవే.

"పద్యమో గద్యమో
వచనమో లఘు రూపమో
ఆలోచింప జేస్తే చాలు
- జనంలో బతుకుతుంది. (రవ్వ-101)

అనడంలో జనం పట్ల రచయితకున్న దృక్పథాన్ని తెలియజేస్తుంది. వేమన పద్యంలా జనహృదయంలోకి వెళ్ళిన రచనలకు చావుండదు.

రూపం
ఏదయితే నేం
మలుపు తిప్పింది
- రోగం కుదిర్చే మందు (రవ్వ-102)

అంటున్న 'రవ్వలు' రచయిత విశ్వేశ్వర వర్మ భూపతి రాజు, కొత్త ప్రక్రియకు పునాదులేశాడు. రవ్వల పట్ల ఆయనకు ఒక ప్రత్యేక దృక్పథం ఉంది. ఆలోచింప చేసేవిగా ఉండడం, బతుకును లేదా వైఖరిని మార్చే విధంగా ఉండేవి 'రవ్వలు' గా ఉంటాయని ప్రకటిం చారు.

వస్తు విశ్లేషణకు వస్తే, కాదేదీ కవితకనర్హం అన్న శ్రీశ్రీని గుర్తు చేస్తూ, అనేక అంశాలపై తనదైన అభి ప్రాయాన్ని ప్రకటించారు. తను చుట్టూ ఉన్న సమాజం ఇచ్చిన అనుభవంలోంచి పొంగిన వాక్యాలు రవ్వలుగా మెరిసిపోతాయి.

'చల్లగాలికి చలించింది
మేఘం
పరవశం నీటి చుక్కయింది
- భూమి సిగ్గుల మొగ్గయింది' (రవ్వ-2)

ప్రకృతిని మనసారా అనుభవించిన సందర్భం పై వాక్యాల్లో తొంగిచూస్తుంది. ఇందులో నీటి చుక్కకు, భూమికి గల అనుబంధాన్ని సరళసుందరంగా చిత్రిం చాడు కవి.

'ఆకలి
కాలేకడుపు
వేట మొదలయింది
- అగ్నిని ఆపడం ఎవరితరం?' (రవ్వ-3)

అన్నప్పుడు ఆకలి, పేదరికం మనిషిని బతుకుదారుల అన్వేషణకు పురికొల్పుతాయని తెలియజేస్తాదు. అంతే కాదు, కాలే కడుపుకు, రగిలే మంటకు సామ్యం కుద ర్చడం ద్వారా భావచిత్రం మరింత ఆర్ద్రంగా మారి పోయింది.

నెలలు నిండని వసికందుల మీద చేస్తున్న అఘాయిత్యాలను నిరసిస్తూ -

"మనిషి
మృగమైన వేళ
తల్లీ, చెల్లీ కనబడదు-
- కళ్ళు తెరవాలి విచక్షణ' (రవ్వ-5)

అంటాడు. నైతికంగా దిగజారిపోతున్న మనిషి మానవ విలువలకు, గుణాలకు విలువ ఇవ్వడం లేదు. తల్లి దండ్రులు, గురువులు, పెద్దలు, చట్టాలు, శిక్షలు మొద లైన ఏ భయమూ లేకపోవడం, విచక్షణ తెలిపే విద్యను అభ్యసించక పోవడం మానవ మృగత్వానికి కారణాలుగా గుర్తించవచ్చు.

అమ్మపై రాసిన రవ్వలు అమ్మ గొప్పతనాన్ని పట్టి స్తాయి. అమ్మను దైవంగా, ప్రేమకు ప్రతిరూపంగా నిల బెడతాయి. వ్యక్తిత్వాని తీర్చిదిద్దే వాక్యాలు 'రవ్వలు' పుస్తకమంతా విస్తరించి ఉన్నాయి.

'సర్వశక్తినీ
కేంద్రీకరిస్తే
ఫలితం అందిన తియ్యని ద్రాక్ష -
- విజయాన్ని మించింది లేదు'. (రవ్వ-18)

అన్నప్పుడు చిత్రశుద్ధితో శ్రమిస్తే, విజయం చేతికి తప్పక అందుతుందనే నమ్మకం కలుగుతుంది.

'జరగలేదంటే
నిరాశ
ఆశకు శత్రువు -
- నిరాశను దాటి తేనే గెలుపు'. (రవ్వ-147)

అపజయం ఎదురైనప్పుడు నిరాశలో కూరుకుపోయే వారికి ఇదొక జ్ఞానబోధగా నిలుస్తుంది.

'పారేసిన
ప్లాస్టిక్ ఏరుకుంటూ
బతుకుతున్నారు -
- వ్యర్థ పదార్థం ఏదీ కాదు'. (రవ్వ-163)

ప్లాస్టిక్ వ్యర్థాలు కూడా కొంతమందికి బతుకు తెరువు నిస్తున్నాయి. అలాంటిది మనిషి తనను తాను చిన్న బరుచుకోవడం, ఆత్మవంచన చేసుకోవడం మంచిది కాదనే సందేశాన్ని ఇస్తాడు కవి.

ఇలాంటివి నేటి యువతకు ప్రేరకంగా నిలుస్తాయి. 'కష్టజీవి'కి అటు - ఇటు నిలబడే వాడే కవి అని శ్రీశ్రీ అన్నట్టు, వర్మగారి కవిత్వం సాధారణ మనిషిని కవిత్వం వస్తువుగా స్వీకరించింది. మానవీయతకు పట్టం కట్టింది.

"రాళ్ళు
కొడుతున్నంత మాత్రాన
రాతి మనుషులు కారు -
- మనసున్న మనుషులే" (రవ్వ-161)

అన్నప్పుడు శ్రామిక సౌందర్యం గుప్పుమంటుంది. 'ఇంకొక చోట, బలహీనుడిపై బలవంతుని కండబలం - కత్తిపీటకు గుమ్మడి కాయ లోకువ' అన్నప్పుడు కవి వర్గదృక్పథం కనిపిస్తుంది.

'గంజినీళ్ళ కోసం
చమటోడిస్తే
గంజీ, చమటా కలిపి తాగేశారు
- దొంగలు దొరలయ్యారు' (రవ్వ-111)

శ్రమదోపిడిని చాలా స్పష్టంగా చెప్పిన మాటలు ఇవి.

'భుక్తి కోసం
కూలి కెళితే
దోచుకున్నారు -
- కన్నెర్ర జేయడం తత్వం కావాలి' (రవ్వ-114)

దోపిడిని నిలువరించడం బాధితులు నేర్చుకోవాలి. ఆ చైతన్యం లేకపోతే నిరంతరం బానిసలుగా మిగిలి పోతారు.

ఇలాంటి వ్యక్తీకరణలు వర్మను అసలు సిసలైన అభ్యుదయ కవిగా నిలబెడతాయి. తాడిత - పీడిత వర్గాల వైపు నిలబడి, పీడకులను ఎదిరించాల్సిన అవసరం ప్రతి రచయిత మీద ఉంది.

'రవ్వలు' అనేక రాజకీయ, సామాజిక అంశాలపై విమర్శ ఎక్కు పెట్టింది. ప్రశ్నించడం, పరిష్కారాలు చూపడం, వైఖరిని మార్చుకోమనడం వంటి ముక్తా యింపులతో రవ్వలు ఆకట్టుకుంటాయి. ఆలోచింప చేస్తాయి. సమాజాన్ని ఎడ్యుకేట్ చేయడంలో కవిత్వం కూడా తనదైన పాత్ర పోషిస్తుంది.

విశ్వేశ్వర వర్మ రాసిన కవిత్వం మంచిని బోధించడానికి, చెడును తిరస్కరించడానికి బాగా ఉపయోగపడుతుంది. 'ఇల్లు చక్కబెట్టుకోవడం అవినీతి కాదు - నీతిని పాటించు' (రవ్వ-50). 'బక్కోణ్ణి బతక నీయరు, మనిషి చచ్చిపోయాడు - బలవంతుడు బతికినట్టా?' (రవ్వ-92). 'ఎత్తుకు ఎదిగిన నువ్వు ఎగరడానికి ఆధారం భూమి - భూమికి నమస్కారం' (రవ్వ-132) వంటి వాక్యాలలో భావద్వైవిధ్యం, సమన్వయ సంక్లిష్టతలు కనిపిస్తాయి. మరింత పదునైన వాక్యాలతో, మనసును పులకింప చేసే 'రవ్వలు' ఒక కవిత్వ ప్రక్రియగా రావడం ఆధునిక కవుల నూతన చైతన్యానికి నిదర్శనం. ఈ కోవలో మరిన్ని ప్రక్రియలు, రచనలు వస్తాయని ఆశిద్దాం.

ఆధార గ్రంథాలు :

1. విశ్వేశ్వర వర్మ భూపతిరాజు - రవ్వలు (2019)
2. సుగమ్ బాబు (రెక్కలు సమగ్ర సంపుటి) - రెక్కలు (2017)
3. ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి - తెలుగు సాహిత్య చరిత్ర (4 సంపుటాలు) (1996)
4. ఆచార్య జి. నాగయ్య - తెలుగు సాహిత్య సమీక్ష (1983)
5. కొత్తపల్లి వీరభద్రరావు - తెలుగు సాహిత్యముపై ఇంగ్లీషు ప్రభావము (1986)
6. డా॥ సి. నారాయణరెడ్డి - ఆధునికాంధ్ర కవిత్వము, సంప్రదాయములు : ప్రయోగములు (2001) (సినారె సమగ్రసాహిత్యం-16వ సంపుటం)



BHAVAVEENA
Vol. 17, Issue. 7, July 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

ఆంధ్ర మహాభారతం - స్త్రీ పాత్రల విశ్లేషణ

- డా॥. యస్. చిన్నరెడ్డయ్య, అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు శాఖ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

భగవంతుడు ఈ భూమిపై స్త్రీ పురుషులను సమాన దృష్టితోనే సృజించాడని చెప్పవచ్చు. కానీ పునరుత్పత్తి కోసం పురుష స్త్రీ శరీరంలోని అవయవాల్లో కొన్ని మౌళిక తేడాలు న్నాయి. పశు పక్ష్యాదులన్నిటిలోనూ ఇలాంటి తేడాలను చూడవచ్చు. ఇది భగవంతుని సృష్టి లీలలో ఒక భాగం. అయితే సత్త్వరజస్తమో గుణాలు కలిగినవారు స్త్రీలని ఆధ్యాత్మిక విదులు అంటున్నారు. ఆది మానవుని దశలో స్త్రీ పురుషులు సమాన భాగస్వామ్యం కలిగి ఉండేవారు. ఆ తర్వాత మాతృస్వామ్య వ్యవస్థలో స్త్రీకి అధిక ప్రాధాన్యం ఇవ్వబడింది. అటు తరువాత పురుషాధిక్యత కొనసాగుతూ వస్తున్నది. అయితే నాటి నుంచి కూడా స్త్రీలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో ముందుంటూ తన ప్రజ్ఞా పాటవాలను నిరూపించు కుంటున్నారు. ఈ దృక్పథంతో చూసినపుడు రామాయణ, భారతాది గ్రంథాల్లో స్త్రీలు విశిష్టమైన స్థానాన్ని పొందా రనవచ్చు. అయితే అదే క్రమంలో వారు కొన్ని సమస్యలు కూడా ఎదుర్కొన్నట్లు తెలుస్తున్నది.

రామాయణ, భారత వృత్తాంతాలు స్త్రీని కేంద్రంగా చేసుకొని నడిచినట్లు తెలుస్తున్నది. రామాయణంలో సీత, భారతంలో ద్రౌపది కేంద్రకంగా నిలిచారు. వీరిని ఆశ్రయించుకొని మరెన్నో స్త్రీ పురుష పాత్రలు తమ వంతు పాత్రను పోషించాయి. స్త్రీలు మహారాణి పాత్రనుంచి దాసి వరకు వివిధ స్థాయిల్లో నిలిచారు. కొందరు స్త్రీలు నది రూపం ఎత్తారు. కొందరు రాజవంశాల్లో పుట్టినా మునులను వివాహం చేసుకున్నారు. మునుల కడుపున పుట్టిన కొందరు స్త్రీలు రాజులను వివాహం చేసుకున్నారు. ఆనాడే కులపట్టింపులు లేకుండా వివాహాలు జరిగాయి. మహా భారతంలో వందలాది స్త్రీ పాత్రలున్నాయి. వాటిలో ప్రధానమైన పాత్రలు తక్కువగానే ఉన్నాయి. చిన్న పాత్రలు చాలానే ఉన్నాయి. వాటిలో కొన్ని పాత్రలు నామ మాత్రంగానే ఉన్నాయి. అలాంటి చిన్న పాత్రలను ఎన్నుకొని ఇక్కడ విశ్లేషించడం జరిగింది. భారతంలోని చిన్న స్త్రీల పాత్రలను స్వభావాల రీత్యా 25 విధాలుగా వర్గీకరించడమైనది. ఈ 25 రకాల స్త్రీలను, వారి పేర్లను ఇక్కడ పేర్కొనడం జరిగింది.

రాణి పాత్రలు :

మహాభారతకాలం నాడు స్త్రీలు పొందిన అత్యున్నత స్థానం, హోదా రాణి స్థానం. రాణి రాజుకు భార్య. రాజు తర్వాత ప్రజలు రాణికి అంత గౌరవం ఇచ్చేవారు. వీరు చిన్న రాజు, పెద్దరాజు లేదా సామంతురాజుల భార్యలైనా కావచ్చు. ఆనాటి సంప్రదాయం ప్రకారం ఒక రాజుకు ఎందరో భార్యలుండేవారు. అయితే పెద్ద భార్య పట్ట మహిషి, గౌరవం పొందేది. తరువాత వారందరిది రాణి స్థానమే. ఆనాటి చరిత్రను పరిశీలిస్తే రాణి కావటానికి రాజు అనగా క్షత్రియుని కూతురు లేదా భార్య కానవసరం లేదు. రాజు ఏ కులం వాడైనా కావచ్చు. అతనికి కొంత రాజ్యముండాలి. అతనికి భార్య అయిన స్త్రీ రాణిగా చెలామణి అయ్యేది. ఆమె ఏ కులం వర్గం స్త్రీ అయినా కావచ్చు. ఆమె తల్లిదండ్రులు వివిధ కులాలకు చెందిన వారైనా కావచ్చు. ఇలాంటి రాణి పాత్రలు భారతంలో చాలా ఉన్నాయి. అయితే అందులో చిన్న పాత్రలు 43 ఉన్నాయి. వాటిని ఇక్కడ పేర్కొని వివరించడం జరిగింది. అవి- 1. ఇల, 2. సాత్వతి, 3. భానుమతి, 4. ఉత్తరాదేవి, 5.దుస్సల, 6. శుభాంగి, 7.చిత్రాంగద, 8. వపుష్ట, 9. విజయ, 10. శుభ, 11. రథంతరి, 12. రేవతి, 13. రోహిణి, 14. మాద్రి, 15. ముదిత, 16.యశోధర, 17. బృహద్భాస, 18. భాసి, 19. మండోదరి, 20. దేవకి, 21. దేవిక, 22. నికృతి, 23. నిశ, 24.దమయంతి,

25.జలంధర, 26. జాంబవతి, 27. గాంధారి, 28. గిరిక, 29. కైకేయి, 30. కైకేయి, 31. కోకిలాదేవి, 32. కామ, 33. కాళింది, 34. కుమారి, 35. ఋక్ష, 36. కరంభ, 37. కరేణుమతి, 38. కాక్షీవతి, 39. అజిత, 40. అనంత, 41. అంగి, 42.ఇంద్రసేన.

ఉదాహరణకు -

ఇల :

భారతదేశాన్ని పరిపాలించిన రాజులెందరో ఉన్నారు. వారిలో హరిశ్చంద్రుడు, నలుడు, పురూరవుడు, పురు కుత్సుడు, సగరుడు, కార్తవీర్యార్జునుడు అనేవారు ప్రముఖులు. వీరిని షట్చక్రవర్తులు అంటారు. ఈ షట్చక్రవర్తులలో పురూరవునికి జన్మించినది ఇల. దక్షుడి కుమార్తె అదితికి కశ్యపుడికి వివస్వంతుడనే కొడుకు పుట్టాడు. వివస్వంతునికి వైవస్వతుడనే మనువు, యముడు, శని, యమున, తపతి అనేవారు పుట్టారు. వారిలో వైవస్వతమనువుకు బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు మొదలైన మానవులు పుట్టారు. ఇంకా వేనుడు మొదలైన యాభై మంది రాజులు జన్మించి వంశాన్ని వృద్ధిచేసి చివరకు తమలో తాము పోరాడి మరణిస్తారు. ఆయనకు ఇల అనే కూతురు కూడా పుడుతుంది. ఆ ఇలకు చంద్రుని కొడుకైన బుధుడికి పురూరవుడు జన్మించాడు. అతడు చక్రవర్తి అయినాడు.

సాత్వతి :

ఈ పాత్ర ప్రస్తావన 'సభాపర్వం ద్వితీయాశ్వాసం'లో ఉంది. సాత్వతికి వింత శిశువును కని బాధపడుతుంది. ఈమె శిశుపాలుని తల్లి. శిశుపాలుడు శ్రీకృష్ణుని గొప్పదనాన్ని సహించక విమర్శిస్తుంటాడు. నూరు తప్పులు పూర్తి కాగానే శ్రీకృష్ణుడు అతన్ని వధిస్తాడు. సాత్వతి దమఘోషుని భార్య. వీరి కుమారుడు శిశుపాలుడు. వీరిది చేది వంశం. పుడుతూనే శిశుపాలుడు నాలుగు భుజాలు, నొసటి కన్ను, గాడిద కంఠధ్వనితో ఏడ్చాడు. తల్లిదండ్రులు అది చూచి భయపడ్డారు. ఆశ్చర్యపోయారు. ఈ బాలున్ని ఇతరులెవ్వరూ చంపలేరు. ఎవరైతే ఇతన్ని ఎత్తుకోగానే, ఎక్కువగా ఉన్న రెండు చేతులు, కన్ను అణగిపోతాయో అతడే ఇతడి పాలిట యముడు అంటుంది. అశరీరవాణి ఆ విధంగా చెప్పేసరికి శిశుపాలుని తల్లి దండ్రులు ఆశ్చర్యపోయారు. చూడ వచ్చిన వాళ్లందరి చేతికి ఎత్తుకోవటానికి ఆ బాలున్ని ఇవ్వసాగారు. బలరామ కృష్ణులిద్దరూ వికార రూపంతో ఉన్న శిశుపాలున్ని, మేనత్త అయిన సాత్వతిని ప్రియంతో చూడాలని బంధువులతో మంత్రులతో, మిత్రులతో కలిసి ఒకనాడు చేది భూపతి పట్టణానికి వెళ్లారు. సాత్వతి బలరామకృష్ణులను ప్రీతితో గౌరవించి బాలుడైన శిశుపాలున్ని ఎత్తుకోవటానికి బలరాముని చేతికి ఇచ్చింది. ఆ తరువాత శ్రీకృష్ణుని చేతికి ఇచ్చింది. కృష్ణుడు శిశుపాలున్ని ఎత్తుకోగానే, అందరూ చూస్తుండగా, ఆశ్చర్యకరంగా అధికంగా ఉండే అతని చేతులు కన్ను ఒక్కసారిగా అణగిపోయాయి. దానిని చూసి సాత్వతి ఆశ్చర్యపోయింది. అశరీరవాణి చెప్పిన మాటలను తలచుకున్నది. శ్రీకృష్ణుని వల్లనే తనకొడుకుకు మరణం తప్పదని తెలుసుకుంటుంది. ఈ బాలుడు చెడుమార్గంలో నడిచే వాడై అపకారం చేసి నీకు అప్రియుడైన - నీ మరది చేసే తప్పులు నూరింటిని దయతో క్షమించు అని కోరుతుంది. ధర్మరాజు తలపెట్టిన రాజసూయయాగంలో శిశుపాలుడు శ్రీకృష్ణుని ఔద్ధత్యాన్ని సహించలేకపోతాడు. అతనికి అగ్రాసనాధిపత్యం ఇవ్వడానికి అభ్యంతరం చెబుతాడు. ఇక వీలుపడదని భావించిన శ్రీకృష్ణుడు తన చక్రాన్ని ప్రయోగించాడు. ఆ సుదర్శన చక్రం శిశుపాలుని కంఠాన్ని ఖండించింది.

భానుమతి :

భారతంలో ప్రధాన పాత్రధారి దుర్యోధనుడు. అయితే ఆయన భార్యకు మాత్రం చాలా స్వల్పమైన పాత్ర ఉంది. భానుమతి పట్టమహిషి. కురురాజ్య అధిపతి దుర్యోధనుని భార్య, ధృతరాష్ట్రుని పెద్ద కోడలు. భానుమతి దుర్యోధనుని భార్య. లక్ష్మణునికి తల్లి. కురుక్షేత్ర యుద్ధ మరుభూమిలో భర్త, కుమారుని శవాలను చూసి తల్లడిల్లిపోయింది. భానుమతి వేదనను గాంధారి

శ్రీకృష్ణునికి చూపుతూ ఇలా చెబుతుంది. 'కృష్ణా! చూడుము. ఈ భానుమతి తన కొడుకును చూచి ముఖం అల్లాడిస్తూ, భర్తముఖం వైపు చూచి అరచేతితో తన తలమీద పలుమార్లు బాదుకొంటున్నది. మళ్లీ కొడుకు వైపు మనసుపోగా దుఃఖంలో మునిగి పోయి అందమైన అతడి ముఖం మీద తన ముఖం పెట్టి మూర్ఛపోయింది. తెలివి వచ్చాక భర్త శవం వద్దకు వెళ్లి రొమ్ము మీద తలను బాదుకొంటున్నది. ఆమె వేడి కన్నీటితో భర్తదేహం తడిసి పోయేటట్లు ఒరిగిపోయింది. నిశ్చేష్టురాలై మౌనంగా ఉండిపోయి మళ్లీ తనతోటి స్త్రీలతో కలిసి ఏడవడం మొదలు పెట్టింది. జడ విడిపోయి దేహమంతా వ్యాపించగా పిచ్చిదానివలె బయట తిరుగుతున్నది'' అంటుంది. 'కృష్ణా! సన్నని నడుము కలిగిన భానుమతి ఆ సుయోధనుడి ఉన్నత బాహువుల నీడలో బుజ్జగింపబడి, అతిశయించిన ప్రేమతో సంతోషంగా కనిపించేది. ఇకపైన ఈ ముగ్ధరాలిని ఎట్లా చూడగలం చెప్పుము? ఇది భరించ రాని విషయం' అంటుంది.

ఉత్తరాదేవి :

ఈ పాత్ర 'విరాటపర్వం, స్త్రీపర్వం'లో ప్రస్తావించ బడింది. విరాటపర్వంలో అర్జునుడు బృహన్నల రూపంలో ఉన్నపుడు ఈమెకు నాట్యం నేర్పిస్తాడు. ఉత్తర అభిమన్యుని భార్య. విరాటరాజు కూతురు. కురు క్షేత్ర యుద్ధంలో మరణించిన భర్త అభిమన్యుని చూచి గుండెలు పగిలేలా రోధించింది. కృష్ణా! ఉత్తరాదేవి తన భర్త రొమ్ము మీద వాలిపోయిన ముఖం మీద ముఖం మాటి మాటికి అనిస్తోంది. యుద్ధానికి మునుపు అభిమన్యుడిని చూడగానే చెలికత్తెల చాటుకు సిగ్గుతో పారిపోయేది. మరి ఇప్పటి స్థితిలో అతి దుఃఖం వలన ఇట్లా అయింది. ప్రియుని చూచి గట్టిగా కౌగిలించుకొని మోకాళ్లపై తలను వాల్చి అరచేతులతో మొగాన్ని మొత్తుకుంటూ నిన్ను చూడగానే మరింత దుఃఖానికి లోనై కంటి నీరు తుడుచుకుంటూ శోక మహా సముద్రంలో మునిగి పోయింది.

అప్సరస పాత్రలు :

అప్సరసలు దేవేంద్రుని ఆస్థానంలో ఉంటారు. వీరు నర్తకీమణులు. అందచందాల్లో వీరికి సాటిరాగల స్త్రీలు లేరని విజ్ఞులు అంటున్నారు. రంభ, ఊర్వశి, మేనక, తిలోత్తమ అనే నలుగురు అప్సరసలుగా పరిగణించ బడ్డారు. వీరు దేవేంద్రుడు, ఇతర దేవతలు కొలువై నపుడు నృత్యం చేసి వారిని ఆనందింపజేసేవారు. దేవేంద్ర పదవిని కోరి మునులు, ఋషులు, రాజులు ఎవరైనా ఘోరతపస్సు చేస్తుంటే దేవేంద్రుడు అప్సరసలను పంపి వారి తపస్సును భంగపరుస్తుండేవాడు. ఈ అప్సరసలకు భవబంధాలుండవు. వావి వరుసలు అస్సలుండవు. ఇలాంటి అప్సరస పాత్రలు కొన్ని భారతంలో ఉన్నాయి. వాటి నిక్కడ పేర్కొని చర్చించడం జరిగింది. అవి - 1. ఘృతాచి, 2. లత, 3. మేనక, 4. రంభ, 5. పంచచూడ, 6. తిలోత్తమ, 7. జలపద, 8. అద్రిక. ఉదాహరణకు -

ఘృతాచి :

ద్రోణుని పాత్ర భారతంలో ప్రధానమైనది. అతడు కౌరవ పాండవులకు అస్త్ర శస్త్రాది విద్యలు నేర్పాడు. భరద్వాజముని ఒకనాడు గంగానదికి స్నానానికి వెళ్లాడు. అక్కడ ఘృతాచి అనే అప్సరస స్నానం చేస్తుంటుంది. ఆమె మహా విలాసంతో జలక్రీడలాడుతుండగా పెనుగాలి చేత ఆమె ధరించిన చీర తొలగుతుంది. అపుడు ఆమె నిర్మలమైన దేహం కనిపిస్తుంది. ఆమెను భరద్వాజుడు కామిస్తాడు. మన్మథరాగాతిశయంచేత ఆ క్షణంలోనే అతనికి వీర్యస్ఖలనం జరుగుతుంది. దాన్ని ఆ ముని ఒక కలశంలో పెడతాడు. దానినుండి శుక్రుని అంశతో ద్రోణుడు పుడతాడు. ద్రోణుని పుట్టుకకు హేతువు ఘృతాచి. ఒక గొప్ప గురువు, యుద్ధ విద్యా నిపుణుడు, ధీశాలి అయిన ద్రోణుని జన్మకు మూల కారణం ఘృతాచి.

మేనక :

ఈమె వృత్తాంతం 'ఆదిపర్వం చతుర్థాశ్వాసం'లో ఉంది. ఈమె విశ్వామిత్రుడి తపోభంగానికి పోయి

శకుంతలను కన్న అప్సరస. విశ్వావసుడనే గంధర్వరాజుకు ప్రమద్వరను కన్నది కూడా ఈ మేనకయే. ఈమె కశ్యప ప్రజాపతికి కపిల యందు జన్మించింది. మునుల తపస్సు భంగం చేయుటకు ఇంద్రుడు ఈమెను పంపుతుంటాడు. ఈమె మునుల తపస్సుకు భంగం కలిగిస్తుంది. వారి ద్వారా పుత్రికలను కంటుంది. వారినక్కడే వదలేసి పోతుంది.

రంభ :

ఈ పాత్ర వృత్తాంతం 'అరణ్యపర్వం'లో ఉంది. ఈమె ఒకానొక అప్సరస కాంత. ఈమె కుబేరుడి కుమారుడు నలకూబరుడికి అనుంగు చెలి. ఈమెను రావణుడొకసారి బలాత్కరించి అనుభవించాడు. ఆవిషయం తెలిసిన నలకూబరుడు 'ఇక మీదట ఇష్టంలేని వనితను బలాత్కరిస్తే నాశనమవుతావు' అని రావణుని శపించాడు. ఈమె కుబేర సభలో ఉంటుంది. ఈమె దేవకన్యలలో కెల్ల అందమైనదని ప్రసిద్ధి. విశ్వామిత్రుడు బ్రహ్మర్షి కాగోరి ఉగ్రమైన తపస్సు చేశాడు. అతని తపస్సు భంగం చేయుటకు దేవతలు రంభను పంపారు. ఈమె భయపడుతూనే వస్తుంది. తన తపస్సు భంగం చేయుటకు వచ్చిన ఆమెను విశ్వామిత్రుడు శిలవై పదివేల సంవత్సరాలు ఉండుమని శపించినట్లు రామాయణం తెలుపుతున్నది.

దాసి పాత్రలు :

దాసి అంటే సేవకురాలు అని అర్థం. రాణి చెప్పే అన్ని పనులు వీరు చేసేవారు. రాణుల వద్ద వీరు బానిసలుగా ఉంటూ చెప్పిన పనులన్నీ చేస్తుండేవారు. దాసి నిరంతరం రాణిని వెన్నంటి ఉండాలి. అలాంటి దాసి పాత్రలు భారతంలో ఎన్నో ఉన్నాయి. వాటిలో చిన్న స్థానం కలిగిన పాత్రలను ఇక్కడ పేర్కొనడం జరిగింది. అవి - 1. ధాత్రేయిక, 2. మందర, 3. కేశిని. ఉదాహరణకు

ధాత్రేయిక :

ఈ పాత్ర 'అరణ్యపర్వం షష్ఠాశ్వాసం'లో ఉంది. పాండవులు ఆశ్రమంలో లేని సమయంలో సైంధవుడు ద్రౌపదిని బలవంతంగా ఎత్తుకొని వెళ్లే సందర్భంలో ఈ పాత్ర ప్రస్తావన ఉంది. సేవకురాలికి యజమానురాలి పట్ల ఎంత భక్తి ప్రపత్తులు ఉండాలో, వారి రక్షణపట్ల ఎంత జాగరూకత ఉండాలో ధాత్రేయిక పాత్ర ద్వారా మనకు తెలుస్తున్నది. ద్రౌపది దాసి ధాత్రేయిక సైంధవుడు బలాత్కారంగా ద్రౌపదిని ఎత్తుకొని వెళ్లినపుడు ఆమె భూమిపై పొర్లాడుతూ బిగ్గరగా ఏడుస్తుంది. అంతలో ధర్మరాజు సారథి ఇంద్రసేనుడు వచ్చి ఆమె దుఃఖానికి కారణం ఏమిటో తెలుసుకుంటాడు. సైంధవుడు ద్రౌపదిని బలాత్కారంగా రథం మీద తీసికొనిపోయాడని చెప్పి బిగ్గరగా ఏడుస్తుంది. ఓ ఇంద్రసేనా! జయద్రథుడు ఇపుడిపుడే కొన్ని నిమిషాలకు ముందు వెళ్లాడు. అతడు దూరంగా పోకుండానే మిక్కిలి వేగంగా మీరు రథాలనెక్కి సమర సన్నాహంతో పొండి. అస్త్రశస్త్రాలు సమకూర్చుకొని ప్రయోగానికి సిద్ధంగా పెట్టుకొనండి. కవచాలను ధరించండి. ఎడతెగని దివ్య బాణాలను ప్రయోగించి శత్రువును సంహరించండి. ద్రౌపదిని చెరనుండి రక్షించండి అంటుంది.

బూడిదలో పోసిన నిండు హోమద్రవ్యంవలె, కుక్కతోలు తిత్తిలో నింపిన కపిలగోవు పాలవలె, శ్మశానంలో పడిన పూలదండవలె, మదిరాక్షి అయిన ద్రౌపది ఆ దుర్జనుడైన జయద్రథుడిచేత అపవిత్రం కాకముందే మీరు వేగంగా వెళ్లి ఆమెను కాపాడండి. మంచి వేద ఋక్కుల చేత పవిత్రం చేయబడిన యజ్ఞంలో హోమం చేయుటకై, తయారు చేయబడిన అపూపము కుక్కకు తగునా? పద్మాల పరిమళం చేత గుబాళించే సరోవరంలో క్రీడించడం క్రుళ్ళిన శవాలను తినే నక్కకు సిసి ఔతుందా? సౌందర్య చతుర భావభంగిమ గల ద్రౌపది ఆ దుర్జనుడైన జయద్రథుని బారిన పడటం తగునా? అని ఆవేదన చెందుతుంది. పాండవులు వెళ్లి సైంధవుని ఓడించి ద్రౌపదిని తీసుకుని రావడంతో పరమానంద భరితురాలవుతుంది.

రాక్షస పాత్రలు :

మనుషుల స్వభావాన్ని బట్టి కవులు స్త్రీ పురుషులను రెండు రకాలుగా విభజించారు. అందులో మొదటి వారు మానవులు, రెండో వర్గం వారు రాక్షసులు. మానవత్వం కలిగిన వారు మానవులు. క్రూరత్వం కలిగిన వారు రాక్షసులు. అయితే మనుషుల్లో రాక్షసలక్షణాలు, రాక్షసుల్లో మనుషుల లక్షణాలు కలిగిన వారెందరో ఉన్నారు. భారతంలో ఎన్నో రాక్షసి పాత్రలున్నాయి. వాటిలో చిన్న పాత్రలను ఇక్కడ పేర్కొనడం జరిగింది. అవి - 1. పూతన, 2. త్రిజట, 3. త్రిస్తని, 4. త్ర్యక్షి, 5. కృత్తి, 6. ఏకలోచన, 7.అజిహ్వ. ఉదాహరణకు -

పూతన :

ఈ పాత్ర ప్రస్తావన 'సభాపర్వం ద్వితీయాశ్వాసం'లో ఉంది. ఈమె ఒకానొక రాక్షస స్త్రీ. కంసుడి సేవకురాలు. కంసుడి కోరికపై కృష్ణుడు బాలుడుగా ఉన్నపుడు గోకులానికి పోయి తన విషపు చనుబాలు ఆ కృష్ణుడికి తాపింది. కృష్ణుడు ఆమె చనుబాలతో పాటుగా ఆమె ప్రాణాలను కూడా అపహరించినాడు.

త్రిజట :

ఈ పాత్ర ప్రస్తావన 'అరణ్యపర్వం'లో నామమాత్రంగా చెప్పబడింది. ఈ పాత్ర రామాయణ పాత్ర. అశోకవనంలో సీతకు కావలిగా రావణుడుంచిన రాక్షస స్త్రీలలో ఒకతె.

దేవత పాత్రలు :

ఆపదల్లో ఉన్నవారిని ఆదుకొని, వారికి మంచి చేసే వారు దేవతలు. వీరు మంచిని ఉద్ధరించుట కోసం చెడును హింసా మార్గం ద్వారానైనా తుదముట్టించుటకు పూనుకుంటారు. భారతంలో అలాంటి దేవత పాత్రలు ఎన్నో ఉన్నాయి. వాటిలో చిన్నపాత్ర స్థాయి కలిగిన ఏడు పాత్రలను పేర్కొని చర్చించడం జరిగింది. అవి-1. ఉపశ్రుతి, 2. శచీ, 3. పౌలోమి, 4. తపతి, 5. జ్యేష్ఠ, 6. జ్యేష్ఠ, 7. ఘృతాచి. ఉదాహరణకు-

ఉపశ్రుతి :

పరోపకారం కోసం ప్రమాదాలను సైతం లెక్కచెయ్యకుండా ముందు కెళ్లాలని ఉపశ్రుతి పాత్ర తెలుపుతున్నది. ఉపశ్రుతి శచీదేవిని వెంటబెట్టుకొని వెళ్లి దేవేంద్రుడు ఉన్న చోటును చూపిస్తుంది. ఇక్కడ ఉపశ్రుతి పరోపకారగుణం కలిగిన పాత్రగా చిత్రించబడింది. ఇంద్రుడు మహావిష్ణువు సహకారంతో వజ్రాయుధంతో వృత్రాసురుని సంహరిస్తాడు. అలా చేయడం బ్రహ్మహత్యాపాతకంతో సమానమని పంచభూత సమూహం అంటుంది. వారి శాప మూలంగా రాజ్యశ్రీ నశిస్తుంది. దాంతో ఇంద్రుడు ఎక్కడికో వెళ్లి దాక్కుంటాడు. దేవతలు నహుషుని దేవేంద్రుని స్థానంలో కూర్చోబెడతారు. శచీదేవి అతనికి దేవేరి కావలసి వస్తుంది. అయితే తన భర్త ఇంద్రుడు ఉన్నాడో, లేడో తెలుసుకున్నాక నహుషునితో కలుస్తానంటుంది. అదేవిషయాన్ని నహుషునితో అంటుంది. అతడు అంగీకరిస్తాడు. దేవతలు మునులతో కూడి రహస్యంగా విష్ణుమూర్తి వద్దకు వెళ్లి ఇంద్రుని పాపం పోగొట్టమనికోరతారు. అపుడు విష్ణువు అశ్వమేధయాగం చేసి తనకు ప్రీతి కలిగిస్తే ఇంద్రునికి పుణ్యం వస్తుందంటాడు. వారందరూ ఇంద్రుని వద్దకు వెళ్లి అలాగే చేస్తారు. దాంతో అతని బ్రహ్మహత్యాపాపం తొలగిపోతుంది. నహుషునంతటి శక్తి తనకు లేకపోవుటతో మళ్లీ ఎక్కడికో వెళ్లి దాక్కుంటాడు. దాంతో శచీదేవి తన భర్త ఎక్కడున్నాడోనని కలత చెంది దుఃఖిస్తుంది. ఒకరోజు రాత్రివేళ ఉపశ్రుతిని పూజిస్తుంది. అపుడు ఉపశ్రుతి ప్రత్యక్షమై, తన వెంట వస్తే దేవేంద్రుని చూపుతానంటుంది. అందుకు శచీదేవి అంగీకరిస్తుంది. ఉపశ్రుతి శచీదేవిని వెంటబెట్టుకొని హిమవంతానికి ఉత్తరంగా మంజుమంత అనే పెద్ద పర్వతం వద్దకు వెళ్లి, దానిలో నూరామడల వైశాల్యంగల కొలనులో ప్రవేశించి, అక్కడ వికసించిన అయిదు రంగుల సుందర పద్మాలతో ఒక దాని కాడను చీల్చి తాను ముందు ప్రవేశిస్తుంది. శచీదేవి కూడా వెంటనే వెళ్లి దాని దారాల నడుమ సూక్ష్మరూపంలో

ఉన్న ఇంద్రున్ని చూస్తుంది. ఆ వెంటనే ఉపశ్రుతి మాయమైపోతుంది.

శచీ :

ఈమె పులోముని కుమార్తె. ఇంద్రుని భార్య. నహుషుడు ఇంద్రుడైనపుడు అతడు శచీదేవిని తన కోరిక తీర్చమంటాడు. అపుడు ఆమె అంగీకరించక ఉపశ్రుతి నాశ్రయించి ఇంద్రుని కలుసుకొని నహుషుడాడిన మాట లను చెబుతుంది. పిమ్మట శచీదేవి నహుషుడు సప్త ఋషులు మోసుకొని వచ్చిన పల్లకి ఎక్కి వస్తే అతనితో కూడ తానంటుంది. అపుడు నహుషుడు అగస్త్యాది మునులను తనను మోసుకెళ్లాలని కోరుతాడు. మునులు కోపపడి నహుషుని శపిస్తారు. దాంతో శచీదేవి నహుషుని బారి నుండి బయట పడుతుంది.

చెలికత్తె పాత్రలు :

రాజకుమార్తెలకు చెలికత్తెలుంటారు. వారిని స్నేహితురాండ్రు అని నేటి పరిభాషలో చెప్పవచ్చు. వారు ఏ సమస్య వచ్చినా ఎక్కడికి వెళ్లాలన్నా చెలికత్తెలు వారికి సహకరిస్తుంటారు. వివాహాది కార్యక్రమాలకు చెందిన అభిప్రాయాలను రాజకుమార్తెలు వారికే తెలియ జేస్తుంటారు. వారి ద్వారా తల్లిదండ్రులైన రాజు రాణికి తెలుస్తుంటుంది. భారతంలో ఎందరో చెలికత్తె పాత్రలున్నారు. అయితే ప్రాధాన్యం పరంగా చిన్న స్థాయి కలిగిన చెలికత్తె పాత్రలను ఎన్నుకొని ఇక్కడ చర్చించడం జరిగింది. అవి - 1. వంద, 2. బుద్ధద.

వంద :

ఈ పాత్ర ప్రస్తావన 'ఆదిపర్వం అష్టమాశ్వాసం'లో ఉంది. ఈమె కుబేరుని చెలికత్తె అయిన ఒకానొక అప్సరస. సౌరభేయి, సమీచి, బుద్బద, లత ఈమె చెలికత్తెలు. ఈ చెలికత్తెలతో భూలోకానికి వచ్చి ఒక బ్రాహ్మణుని తపస్సు విఘ్నం చేయ ప్రయత్నిస్తుంది. అతని శాపంతో మొసళ్లుగా మారిపోతారు. తమ శాపాన్ని గూర్చి నారదునితో చెప్పుకుంటారు. అపుడు నారదుడు వారితో అర్జునుడు తీర్థయాత్రకు వచ్చి మిమ్మల్ని గట్టున వేస్తాడని, దాంతో శాపవిమోచనం కలుగుతుందంటాడు ఆ తర్వాత అలాగే జరుగుతుంది.

బుద్బుద :

ఈ పాత్ర ప్రస్తావన 'ఆదిపర్వం అష్టమాశ్వాసం'లో ఉంది. ఈమె కుబేరుని చెలికత్తెలు అయిదుగురిలో ఒకతె. వారయిదుగురూ శాపవశాత్తు సౌభద్రము, పౌలోమము, కారందము, ప్రసన్నము, భారద్వాజము అనే దక్షిణ సముద్రతీరంలోని పంచతీర్థాలు - అనే పుణ్యతీర్థాలలో మొసళ్ళై ఉండి అర్జునుడి వల్ల శాప విముక్తులయినారు.

సూత స్త్రీ పాత్రలు :

అనాడు సూతకుల ముండేది. వీరి ప్రధానవృత్తి గుర్రాల ఆలనా పాలన చూడడం. ఇది అనాటి వృత్తులలో ఒకటి. భారతంలోని సూత స్త్రీ పాత్రను ఇక్కడ పేర్కొని చర్చించడం జరిగింది.

రాధ :

ఈ పాత్ర "ఆదిపర్వం పంచమాశ్వాసం"లో చెప్పబడింది. కుంతి వదలిన పెట్టెను సూత దంపతులు నదిలో నుంచి తెచ్చుకుంటారు.కుంతి తన కుమారుడైన కర్ణుని పెట్టెలో పెట్టి గంగానదిలో వదులుతుంది. ఆ నది దిగువ ప్రాంతంలో రాధ, సూతులు గుర్రాలు శుభ్రం చేస్తూ ఉంటారు. ఆ సమయంలో వారికి ఒక పెట్టె నదిలో పోతూ కనిపిస్తుంది. దాన్ని తెచ్చి తెరచి చూసి మురిసిపోతారు. రాధ ఒక సూతుని భార్య. ఈ దంపతులకు సంతానం లేదు. వీరు ఒక రోజు గంగానది ఒడ్డున ఉంటారు. వారికి నదిలో కొట్టుకువస్తున్న ఒక పెట్టె కనిపిస్తుంది. సూతుడు నదిలో దిగి ఆపెట్టెను ఒడ్డుకు తెస్తాడు. ఆ దంపతులు ఆ పెట్టెను తెరిచి చూసి, అందులో ఉన్న కుమారుని చూసి సంతోషిస్తారు. అపుడు ఆమెలో మాతృ భావం ఉప్పొంగుతుంది.

కం॥ తన భార్యకు రాధకు ని, చ్చిన నదియును గరము
సంతసిల్లి కుమారుం

గని చన్నులు సేపిఁ ముదం, బునఁ బెనిచెను సుహృదు లెట్టి పుణ్యమొ యనగన్

పెట్టెలోని బాలుని చూచి రాధ సంతోషించింది. అపుడు ఆమె చన్నులు చేపగా అతనికి పాలిచ్చింది. అదంతా నీపుణ్యం అని చెలులు ఆమెను పొగడుతారు. ఆమె ఆ బాలుని అల్లారు ముద్దుగా పెంచింది. తన కడుపున పుట్టకపోయినా పరాయి బిడ్డలనయినా కన్నబిడ్డల్లాగా చూడాలనే హితాన్ని, నీతిని రాధ పాత్ర తెలుపుతున్నది.

నాగ జాతి స్త్రీ పాత్రలు :

ఆనాడు మనుషుల స్వరూప స్వభావాలను బట్టి నాగజాతి, పక్షి జాతి వంటి వివిధ వర్గాలుగా విభజించారు. నాగజాతి నాగుపాము వంటి స్వభావం కలిగిన వారని దీనర్థం. దీనిని లక్ష్యార్థంగా తీసికోవాలే కాని వాచ్యార్థంగా తీసికోరాదు. భారతంలో ఎందరో నాగజాతి స్త్రీలున్నారు. అయితే వస్తు ప్రాధాన్యం, నిడివి ఆధారంగా చేసుకుని ఒక పాత్రను ఎన్నుకొని చర్చించడం జరిగింది.

ఉలూపి :

ఈ పాత్ర 'అరణ్య పర్వం, అశ్వమేధ పర్వా'ల్లో ప్రస్తావించబడింది. ఉలూపి నాగ కన్యక. తన భర్త అర్జునున్ని రాబోయే ఆపదనుండి చాకచక్యంగా కాపాడింది. కురుక్షేత్ర యుద్ధానంతరం ధర్మరాజు చేయతలపెట్టిన అశ్వమేధ యాగం అశ్వం వెంట అర్జునుడు వస్తుంటాడు. ఆ అశ్వం మణిపూరమనే పట్టణం దగ్గరకు చేరుతుంది. ఆ రాజ్య పాలకుడు బభ్రువాహనుడు. తన తండ్రి అర్జునుని రాక తెలిసి ఎదురెళ్లి అతని కాళ్లకు ఆనందపూర్వకమైన భక్తితో మొక్కాడు. కానీ అర్జునుడు బభ్రువాహనుడిని ఆదరించ లేదు. తన తండ్రి ఎందుకలా చేస్తున్నాడో తెలియక బభ్రు వాహనుడు చింతిస్తుంటాడు. అతని వాలకాన్ని గుర్తించిన అర్జునుడు రాజ ధర్మాన్ని పాటిస్తూ గుర్రాన్ని నిలువ రించాలిగానీ, అలా మిన్నకుండిపోరాదని అంటాడు. అపుడు బభ్రువాహనుడు తండ్రిని అనుసరిస్తాడు. అర్జునుడు తన కుమారినితో అన్న మాటలను ఉలూపి దివ్యజ్ఞానంతో తెలుసుకుంటుంది. ఉలూపి బభ్రువాహనుడి దగ్గరకు వెళ్లి "నాయనా! నేను మీ తల్లిని. నాగరాజు పుత్రిని. నాపేరు ఉలూపి. నీకు మేలు కలిగించే మాట చెప్పవలెననే బుద్ధితో వచ్చాను. నా మాట వినుము. మీ తండ్రి ఆనతి శిరసావహించుము. రాజోచిత ధర్మమైన యుద్ధం చేయుము. కురువంశ శ్రేష్ఠుడైన మీ తండ్రికి తనతో పోరాడడం మహానందం కలిగిస్తుంది" అంటుంది. ఉలూపి సూచనతో బభ్రు వాహనుడు యుద్ధం చేయడానికి అంగీకరిస్తాడు. తల్లిని రాజ లాంఛనాలతో తన మేడకు పంపుతాడు. ఆ తర్వాత తండ్రీ కొడుకులిద్దరూ యుద్ధం చేస్తారు. ఇద్దరూ ప్రయోగించుకొన్న బాణ ప్రయోగాలతో మూర్చనొందుతారు. కొంత సేపటికి బభ్రువాహనుడు తేరుకొని లేస్తాడు. అర్జునుడు ఎంతకూ లేవడు. తన భర్త అర్జునుడు లేవనందుకు చిత్రాంగద బాధ పడుతుంది. ఎలాగైన భర్తను బ్రతికించమని కోరుకుంటుంది. అపుడు ఉలూపి తిరిగి బ్రతికించే సంజీవన మణిని స్మరిస్తుంది. ఆమె స్మరించిన వెంటనే నాగజాతి వారికి ప్రియమైన ఆ సంజీవనమణి ఉలూపి అరచేతిలో నిలిచింది. అపుడు ఆమె బభ్రు వాహనుడి ముఖం చూచి ఇలా అంటుంది.

వెర్రులారా! ఇంద్రుని చేతనైనా అర్జునుడు చని పోతాడా? నేను ఇతడికి గొప్ప మేలు చేయాలని కోరాను. అదీగాక నీ శక్తిని పరీక్షించాలనే తలంపుతో నీతో యుద్ధం చేయ నిశ్చయించిన ఇతడి కోర్కె నెరవేర్చ నిర్ణయించాను. ఈ రెండు హేతువుల వలన మూర్చపోయేటట్లుగా మాయాప్రయోగం చేశాను. అర్జునుడు నారాయణుడే. ఇతడి తేజస్సు చాలా గొప్పది. దానిని నశింపజేయటం ఎవ్వరికీ సాధ్యం కాదు. మీ విచారం తొలగించటానికి ఈ కౌరవ శ్రేష్ఠుడు ఇప్పుడే లేస్తాడు. ఇది మాయా ప్రయోగమే కాని మరొకటి కాదు అంటుంది. ఆ మాటలు విన్న వారందరూ సంతోషించారు. అప్పుడామె ఆమణిని బభ్రువాహనుడి అరచేతిలో ఉంచి 'దానికి మహాత్ముడైన అర్జునుడి హృదయస్థానాన పెట్టు'మని పలికింది. ఆ

బభ్రువాహనుడు ఆమె చెప్పినట్లే చేశాడు. అర్జునుడు తిరిగి బ్రతికాడు.

తాపసి వనిత పాత్రలు :

కొందరు స్త్రీలు తపస్సు చేస్తారు. అలాంటి పాత్రలు భారతంలో ఎన్నో ఉన్నాయి. అయితే వస్తు ప్రాధాన్యం పాత్ర నిడివిని ఆధారంగా చేసుకొని ఇద్దరు తాపసి స్త్రీ పాత్రలను ఎన్నుకొని ఇక్కడ చర్చించడం జరిగింది. అవి - 1. శాండిలి, 2. ప్రభావతి.

శాండిలి :

ఈమె వృత్తాంతం 'ఉద్యోగపర్వం తృతీయాశ్వాసం'లో ఉంది. ఈమె ఒకానొక తాపస వనిత. ఈమె సముద్రం మధ్యలో ఒక కొండపై ఉండేది. ఈమె ఈ కొండపైకి గాలవుడితో బాటుగా వచ్చిన గరుత్మంతుని శపించగా రెక్కలు రాలిపోయి అనుగ్రహించగా తిరిగి రెక్కలు మొలిచాయి.

ప్రభావతి :

ఈమె వృత్తాంతం 'శల్యపర్వం ద్వితీయాశ్వాసం'లో ఉంది. ఈమె భరద్వాజుని కూతురు. ఈమె ఇంద్రుని భర్తగాకోరి తపస్సు చేస్తుంది. ఇంద్రుడు వశిష్ఠుని రూపంలో వచ్చి ఈమెను పరీక్షించి, నిజరూపం చూపి ఆమె భక్తి శ్రద్ధలకు మెచ్చి స్వర్గానికి తీసికొని పోతాడు. ఆప్రాంతం బదరీ పాంచమను తీర్థమయింది.

ముని పుత్రి పాత్రలు :

భారతంలో ఎందరో మునులున్నారు. వారిలో చాలా మందికి పుత్రికా సంతానం ఉంది. అలాంటి ముని పుత్రికల పాత్రలను ఎన్నుకొని ఇక్కడ చర్చించి వివరించడం జరిగింది. అవి - 1. కృపి, 2. రేణుక, 3. లపిత, 4. లోపాముద్ర, 5. యోగ సిద్ధి, 6. ప్రభావతి, 7. ప్రాప్తి, 8.భార్గవి, 9. దాక్షాయని, 10. జటిల, 11. గుహువు, 12. గౌతమి, 13. కృత్తి, 14. కృష్ణ.

కృపి :

కృపి పాత్ర భారతంలో స్వల్ప పరిమాణంలోనే ఉంది. ఈమె ద్రోణుని భార్య. కృపాచార్యుని చెల్లెలు. కురుక్షేత్రయుద్ధభూమిలో తన భర్త శవాన్ని అతి దగ్గరగా తీసుకుంటుంది కృపి. విరబోసిన జుట్టుతో తలమీద ముసుగుతో పలవరిస్తూ రోదిస్తుంది. ద్రోణుల శిష్యులు తక్కిన వారు చూచి ఆ మహా యోధుడి అమ్ములు, బాణం, శస్త్రాలు, రథం, అవయవాలు వీటి నన్నిటిని ప్రోగుచేసి, చితిపేర్చి, సామ వేదం చదువుతూ ఉండగా సాక్షాత్తు అగ్నిదేవుడే సామం పాడజొచ్చాడు. ఈ విధంగా చితినేర్పరచి గురువుగారినే మరొక అగ్నివలె ఆ చితిలో చేర్చి దహనానికి సిద్ధం చేశారు. కృపి ముందు నడుస్తుండగా శిష్యులు ఆ చితికి అప్రదక్షిణంగా తిరిగి శోకంతో దీనత్వంతో కూడిన శరీరాలతో నదిలో స్నానాలు చేయటానికి వెళ్లారు. ఈ భూలోకంలో ఇక బాణవిద్య లుప్తమై పోయినట్లే నని ఆమె దుఃఖిస్తుంది.

రేణుక :

ఈమె ప్రసేనజితుడనే రాజు కూతురు. జమదగ్నికి భార్య. ఈమె కుమారులు రుమణ్వంతుడు, సుషేణుడు, విశ్వావసువు, రాముడు అనే నలుగురు. ఈమె చిన్న కుమారుడు రాముడే పరశురాముడు. ఈమె చిత్రరథుడనే రాజుతో వ్యభిచరించెనని ఈమెపై భర్తకు ద్వేషం కలిగింది. తన కుమారులను పిలిచి ఆమెను వధించమని ఆజ్ఞాపిస్తాడు. నలుగురు పెద్ద కుమారులు మాతృవధ చేయమనిరి. కానీ పరశురాముడు ఈమెను వధించాడు. జమదగ్ని పరశురాముని ఎంతగానో మెచ్చుకుంటాడు. ఏదైన వరం కోరుకోమంటాడు. తల్లిని బతికించమంటాడు. జమదగ్ని ఆమెను బ్రతికిస్తాడు. ఈమె భర్తను కార్తవీర్యార్జునుడు చంపగా రేణుక సతీసహగమనం చేయాలని నిశ్చయించుకుంటుంది. ఆమె ప్రయత్నాన్ని ఆకాశవాణి వారిస్తుంది. భృగుడు వచ్చి జమదగ్నిని బ్రతికిస్తాడు.

లోపాముద్ర :

ఈ పాత్ర ప్రస్తావన 'అరణ్యపర్వం ద్వితీయాశ్వాసం'లో ఉంది. ఈమె విదేహ రాజు కుమార్తె. అగస్త్యుని భార్య. ఈమె ఏడేండ్లు గర్భం ధరించి దృఢాశ్వుడు అనే

కొడుకును కన్నది. ఈమెను తనకిచ్చి వివాహం చేయుమని రాజును అగస్త్యుడు కోరాడు. అడవిలో తిరుగుతూ కంద మూలాలు తినే వారికి తన కూతురిని ఎట్లా ఇచ్చేదని రాజు సందేహిస్తుంటాడు. అపుడు ఆమె తనను అగస్త్యునికి ఇచ్చి పెళ్లి చేయమంటుంది. దాంతో రాజు వారికి పెళ్లి చేస్తాడు. అగస్త్యుడు ఆమెతో సంయోగానికి యత్నించగా, ఆమె అభ్యంతరం చెప్పి ముందుగా తనకు వస్త్రాలు, ధనం, భూషణాలు తెచ్చివ్వమంటుంది. అతడలాగే తెచ్చి ఇస్తాడు. ఆతరువాత వారికి సంగమం జరుగుతుంది.

యోగసిద్ధి :

ఈ పాత్ర ప్రస్తావన 'ఆదిపర్వం తృతీయాశ్వాసం'లో ఉంది. బ్రహ్మ మానసపుత్రులలో ఒకడైన అంగిరసుడి కుమార్తె. ఈమె ప్రభాసుడనే అష్టవసువుకు భార్య. వీరి కుమారుడు విశ్వకర్మ. ఈమె ఇష్టసఖి ఉశీనర రాజపుత్రి జితవతి. ఈమె కొరకై యోగసిద్ధి తన భర్త ప్రభాసుని ప్రేరేపించి వశిష్ఠుని హోమధేనువును అపహరింపజేసింది - ఆ కారణంగా కలిగిన శాపంతో ప్రభాసుడు దేవ వ్రతుడుగా జన్మించి, తరువాత భీష్ముడయ్యాడు.

పరిచారిక పాత్రలు :

పరిచారికలు అంటే సేవకులని అర్థం. వీరు రాణికి అవసరమైన అన్ని వసతులు సమకూర్చాలి. అవసరమైతే బయటకు వెళ్లి అయినా సమకూర్చుకొని వచ్చి రాణికి అందజేయాలి. కేవలం ఇంటిలో ఉండి సేవలు చేస్తామంటే కుదరదు. ఇలాంటి పరిచారిక పాత్రలు భారతంలో చాలా ఉన్నాయి. అలాంటి వాటిలో నాలుగు పాత్రలను ఎన్నుకొని ఇక్కడ చర్చించడం జరిగింది. అవి- 1.బక, 2.పుష్పోత్కట, 3. ఘూర్ణిక, 4. గండ.

బక :

ఈ పాత్ర ప్రస్తావన 'అరణ్యపర్వం షష్ఠాశ్వాసం'లో ఉంది. వైశ్రవణుని చేత విశ్రవసుడికి పరిచారికలుగా సమర్పించబడిన ముగ్గురిలో ఒకతె. ఈమెకు ఖరుడూ, శూర్పనఖలు - మిథునంగా జన్మించారు.

పుష్పోత్కట :

ఈ పాత్ర ప్రస్తావన 'అరణ్యపర్వం షష్ఠాశ్వాసం'లో ఉంది. ఈ పాత్ర రామాయణ పాత్ర. వైశ్రవణుడు విశ్ర వసుడికి సమర్పించిన ముగ్గురు పరిచారికలలో ఒకతె. ఈమెకు రావణ కుంభ కర్ణులు జన్మించినారు.

ఘూర్ణిక :

ఈ పాత్ర వృత్తాంతం 'ఆదిపర్వం తృతీయాశ్వాసం'లో చెప్పబడింది. వృష పర్వుని నగరంలోని శుక్రుని కుమార్తె దేవయానికి పరిచారిక. దేవయాని శర్మిష్ఠ చేత బావిలో తోయబడగా ఈ ఘూర్ణిక వెదకుతూ వస్తుంది.

ప్రజాపతి భార్య పాత్రలు :

ప్రజాపతి శబ్దానికి బ్రహ్మ, రాజు, ఒక బ్రహ్మ తండ్రి, గ్రామ పెద్ద అనే అర్థాలను శబ్దార్థ రత్నాకరము ఇస్తున్నది. భూమిపై బ్రహ్మదేవుడు కశ్యపుడు వంటి కొందరు ప్రజాపతులను నియోగించాడని ఆధ్యాత్మిక విదులంటు న్నారు. వారు ఆయా కాలాల్లో ప్రజలను శాసిస్తారు. అలాంటి ప్రజాపతులకు భవబంధాలుంటాయి. కొందరు ప్రజాపతుల భార్యల పాత్రలను ఇక్కడ పేర్కొని చర్చించడం జరిగింది. అవి - 1. రత, 2.పులోమ, 3. ప్రభాత.

రత :

ఈ పాత్ర ప్రస్తావన 'ఆదిపర్వం తృతీయాశ్వాసం'లో ఉంది. ఈమె దేవుడనే ప్రజాపతి భార్య. ఈమె కుమారుడు అహుడు. ఇతడు అష్ట వసువులలో ఒకడు.

పులోమ :

ఈ పాత్ర ప్రస్తావన 'అరణ్యపర్వం చతుర్థాశ్వాసం'లో ఉంది. ఈమె కశ్యపుడి భార్యలలో ఒకతె. ఈమె కుమా రులు పౌలోములు. వీరు హిరణ్యపుర నివాసులు. వీరిని అర్జునుడు వధించినాడు.

ప్రభాత :

ఈ పాత్ర వృత్తాంతం 'ఆదిపర్వం తృతీయాశ్వాసం'లో ఉంది. ఈమె దేవుడనే ప్రజాపతి ఏడుగురు భార్యలలో

ఒకతె. ఈమె కుమారులు ప్రత్యూషుడు, ప్రభానుడు అనేవారు. వీరు ప్రజాపతి పుత్రులైన ఎనిమిది మంది వసువులలో చిన్నవారు.

ప్రజాపతి పుత్రిక పాత్రలు :

ఈ అధ్యాయంలో ప్రజాపతి పుత్రికల పాత్రలను పేర్కొని చర్చించడం జరిగింది. అవి - 1. దేవసేన, 2. ధృతి, 3. జ్వాల, 4. ఘృతాచి, 5. క్రూర, 6. క్రోధ, 7. కాల, 8. కీర్తి, 9. కపిల.

దేవసేన :

ఈ పాత్ర వృత్తాంతం 'అరణ్యపర్వం పంచమాశ్వాసం'లో చెప్పబడింది. ఈమె అరిష్టనేమి అనే ప్రజాపతి రెండవ కుమార్తె. ఆమెను కేళి అనే రాక్షసుడు బలాత్కారంగా తీసుకొని పోతూ ఉండగా ఇంద్రుడు రక్షించాడు. ఆ తర్వాత ఈమె కుమారస్వామిని వివాహమాడింది. ఈమె అగ్ర సోదరి దైత్య సేన.

ధృతి :

ఈ పాత్ర వృత్తాంతం నామమాత్రంగా 'ఆదిపర్వంలో చెప్పబడింది'. దక్ష ప్రజాపతికి ధరణి యందు కలిగిన మూడవ కుమార్తె. ఈమె ధర్ముని వివాహమాడింది.

జ్వాల :

ఈ పాత్ర ప్రస్తావన నామమాత్రంగా ఆదిపర్వం చతుర్థాశ్వాసంలో ఉంది. ఈమె దక్ష పుత్రిక. చంద్రవంశంలోని ఋక్షుడి భార్య. వీరి కుమారుడు మతినారుడు.

ఘృతాచి :

ఈ పాత్ర ప్రస్తావన 'ఆదిపర్వం ప్రథమాశ్వాసం'లో ఉంది. అమృతం కొరకు పాల సముద్రాన్ని చిలికినపుడు పుట్టిన వాటిలో ఒకతె. ఈమె యందు భృగు వంశజుడైన ప్రమతికి రురుడు పుట్టినాడు. ఈమె కుబేరసభలో ఉంటుంది.

క్రూర :

ఈ పాత్ర వృత్తాంతం 'ఆదిపర్వం తృతీయాశ్వాసం'లో ఉంది. ఈమె దక్ష ప్రజాపతికి ధరణియందు కలిగిన యాభైమంది పుత్రికలలో నలభై తొమ్మిదవది. ఈమె కశ్యప ప్రజాపతి భార్యలలో ఒకతె. ఈమె పుత్రులు సుచంద్రుడు, చంద్రహంతలు.

క్రోధ :

దక్ష ప్రజాపతికి ధరణియందు కలిగిన యాభైమంది కుమార్తెలలో నలభై ఏడవది. ఈమె కశ్యప ప్రజాపతి భార్యలలో ఒకతె. వీరికి కలిగిన సంతానం క్రోధగణం లేదా క్రోధవశగణం.

కాల :

ఈ పాత్ర వృత్తాంతం 'ఆది, అరణ్య పర్వా'ల్లో చెప్పబడింది. ఈమె దక్ష ప్రజాపతికి భూమిపై కలిగిన యాభై మంది కుమార్తెలలో నలభై ఒకటవది. ఈమె కశ్యపున్ని వివాహమాడింది. ఈమె పుత్రులు కాలకేయులు. వీరు ఎనిమిది మంది. వీరు హిరణ్యపురంలో నివసిస్తారు. వీరిని అర్జునుడు ఇంద్రుడి కోరికపై వధిస్తాడు. ఈమెను కాలక అని కూడా అంటారు.

కీర్తి :

ఈ పాత్ర ప్రస్తావన 'ఆదిపర్వం తృతీయాశ్వాసం'లో చెప్పబడింది. దక్ష ప్రజాపతికి ధరణియందు కలిగిన యాభైమంది కుమార్తెలలో మొదటిది. ఈమెను ధర్ముడు అనే మనువు వివాహమాడాడు.

కపిల :

ఈ పాత్ర ప్రస్తావన 'ఆదిపర్వం తృతీయాశ్వాసం'లో ఉంది. ఈమె దక్షప్రజాపతికి ధరణియందు కలిగిన యాభైమంది పుత్రికలలో నలభై అయిదవది. ఈమెకు అమృతమూ, గోగణాలూ, బ్రాహ్మణులూ, ఘృతాచీ, మేనక మొదలైన అప్సరసలు జన్మించారు.

మునిపత్నిపాత్రలు :

భారతంలో ఎందరో మునులు, వారి పత్నుల పాత్రలున్నాయి. అయితే ఇక్కడ కొన్ని పాత్రలను మాత్రమే ఎన్నుకొని చర్చించి వివరించడం జరిగింది. అవి - 1. ఇంద్రసేన, 2. మదయంతి, 3. ప్రద్వేషిణి, 4. పులోమ.

ఇంద్రసేన :

ఈ పాత్ర 'అరణ్యపర్వం ద్వితీయాశ్వాసం'లో చెప్ప బడింది. ఈమె నలదమయంతుల కూతురు.

మదయంతి :

ఈ పాత్ర వృత్తాంతం 'ఆదిపర్వం పంచమాశ్వాసం'లో చెప్పబడింది. ఈమె సుదాసుడి కుమారుడు సౌదాసుడి భార్య. ఈమెయందు సౌదాసుడు వశిష్ఠునివల్ల అశ్మకుడన్న కుమారుని పొందాడు. ఈమె ఉదంకునికి కుండలాలు ఇచ్చింది.

ప్రద్వేషిణి :

ఈ పాత్ర నామ మాత్రంగా 'ఆదిపర్వం చతుర్థా శ్వాసం'లో ఉంది. దీర్ఘతముడి భార్య. గౌతముడి తల్లి.

పులోమ :

ఈమె వృత్తాంతం 'ఆదిపర్వం ప్రథమాశ్వాసం'లో చక్కగా చిత్రించబడింది. ఈమె భృగువు భార్య. పులోముడు అనే రక్కసుడు పంది రూపం ధరించి గర్భవతి యైన ఈమెను ఎత్తుకొని పోతూ ఉండగా, ఆమె ఏడుస్తూ పోయింది. ఆమె కన్నీరు నదియై భృగువు ఆశ్రమ ప్రాంతంలో పారింది. ఆ నదికి వధకర అనే పేరు కలి గింది. ఆమె గర్భం నుండి 'చ్యవనుడు' అనే కుమారుడు వెలువడినాడు. ఆ బాలకుని చూచి పులోముడు కాలి బూడిద అయినాడు.

మనుపత్నిపాత్రలు :

మనువు శబ్దానికి మంత్రము, పదునాలుగు సంఖ్య, ధర్మ నిర్ణేత అనే అర్థాలున్నాయి. ఆధ్యాత్మిక గ్రంథాలు మనువులు పదునాలుగురని చెబుతున్నాయి. వారిలో ప్రముఖులు స్వాయంభువుడు, స్వారోచిషుడు, ఉత్త ముడు, తామసుడు, రైవతుడు, చాక్షుసుడు, వైవ స్వతుడు, సూర్యసావర్ణి, దక్షసావర్ణి, బ్రహ్మసావర్ణి, ధర్మ సావర్ణి, రుద్ర సావర్ణి, రౌచ్యుడు, భౌచ్యుడు. వారి భార్యల పాత్రలను ఇక్కడ పేర్కొని వివరించడం జరిగింది. అవి- 1. మతి, 2. మనోహర.

మతి :

ఈ పాత్ర ప్రస్తావన 'ఆదిపర్వం తృతీయాశ్వాసం'లో ఉంది. దక్ష ప్రజాపతికి ధరణి యందు కలిగిన యాభై మంది పుత్రికలలో ఈమె పదవ కుమార్తె. ఈమె ధర్ముడనే మనువును వివాహమాడింది.

మనోహర :

ఈ పాత్ర వృత్తాంతం 'ఆదిపర్వం తృతీయాశ్వాసం'లో చెప్పబడింది. ఈమె సోముడనే మనువు భార్య. ఈమె యందు సోముడికి వర్చసుడు, శిబిరుడు, ప్రాణుడు, రమణుడు అను కుమారులు పృధ అనే కుమార్తె జన్మించారు.

మనుపుత్రిపాత్రలు :

మనువుల పుత్రికల పాత్రలను కొన్నింటిని పేర్కొని వాటిని ఇక్కడ వివరించడం జరిగింది. అది - క్రియ. ఈ పాత్ర 'ఆదిపర్వం'లో నామమాత్రంగా చిత్రించబడింది. దక్ష ప్రజాపతికి ధరణి యందు కలిగిన యాభైమంది కుమార్తెలలో ఏడవది. ఈమె ధర్ముడనే మనువును వివాహమాడింది.

నదిపాత్రలు :

భారతంలో నదులు స్త్రీ రూపం ధరించినట్లు, స్త్రీలు నదిరూపం ధరించినట్లు కొన్ని పాత్రలున్నాయి. అలాంటి పాత్రలను ఇక్కడ పేర్కొని చర్చించడం జరిగింది. అవి - 1. కాళింది, 2. ఓఘవతి, 3. గంగ

కాళింది :

ఈ పాత్ర ప్రస్తావన 'ఆదిపర్వం చతుర్థాశ్వాసం'లో ఉంది. ఈమె చంద్రవంశంలోని త్రసుడి భార్య. వీరి కుమారుడు కిలులుడు.

ఓఘవతి :

ఈ పాత్ర ప్రస్తావన అనుశాసనిక పర్వం ప్రథమా శ్వాసంలో ఉంది. ఈమె ఓఘవంతుడి కుమార్తె. ఈమె తన తండ్రి ఓఘవంతుడికి పితామహుడైన సుదర్శనున్ని వివాహ మాడింది. ఆమె తనలోని సగభాగంతో ఓఘవతి నదియై ప్రవహించింది.

గంగ :

ఈ పాత్ర ప్రస్తావన 'ఆదిపర్వం చతుర్థాశ్వాసం'లో ఉంది. ఒకానొక గొప్ప నది. ఒకనాడు ఈమె స్త్రీ రూపం ధరించి బ్రహ్మసభకు పోయింది. ఆ సభలో గాలిచేత ఆమె చీర ఎగురుగొట్టబడి, ఆమె ఊరు మూల బయట పడింది. అప్పుడక్కడున్న మహాభిషుడు అనే ఇక్ష్వాకు వంశపు రాజు ఆమెను అభిలాషగా చూశాడు. అందుకు బ్రహ్మ అతనిపై కోపించి, అతన్ని తిరిగి మనుష్యుడుగా పుట్టమని శపించాడు. ఆశాపంవల్ల అతడు చంద్రవంశం లోని ప్రతీపుడికి శంతనుడనే పుత్రుడుగా జన్మించాడు. మహాభిషుడి రూపలావణ్యాలను చూచి, అతడికి తన యందుగల అభిలాషను గుర్తించి, గంగ శంతనుని వరించి స్త్రీరూపం ధరించి వచ్చి, అతన్ని వివాహమాడి దేవవ్రతు డనే పుత్రున్ని కన్నది. అతడే ఆ పిమ్మట భీష్ముడైనాడు.

వసు పుత్రి పాత్రలు :

వసువు శబ్దానికి బంగారం, ధనం, రత్నం, కిరణం, అగ్ని, ఒకరాజు, మధురము, గణ దేవతా విశేషము అని నిఘంటువులు అర్థాల్నిస్తున్నాయి. పురాణాలు అష్ట వసువు లను పేర్కొంటున్నాయి. ఆపుడు, ధ్రువుడు, సోముడు, అధ్వరుడు, అనిలుడు, ప్రత్యూషుడు, అనలుడు, ప్రభా సుడు. ఇక్కడ వసువు అంటే రాజని అర్థం. అలాంటి రాజుల పుత్రికల పాత్రలను ఇక్కడ పేర్కొని వివరించడం జరిగింది. అవి-1. పృథ, 2. జితవతి.

పృథ :

ఈమె పాత్ర నామమాత్రంగా 'ఆదిపర్వం తృతీయా శ్వాసం'లో ఉంది. సోముడనే వసువుకు మనోరమ యందు జన్మించిన పుత్రిక

జితవతి :

ఈ పాత్ర వృత్తాంతం 'ఆదిపర్వం చతుర్థాశ్వాసం'లో చెప్పబడింది. ఈమె ఉశీనరుడి కుమార్తె. అష్టమ వసువు ప్రభాసుడి భార్య బృహస్పతి సోదరి అయిన యోగసిద్ధికి అనుంగు చెలి.

గంధర్వ స్త్రీ పాత్రలు :

గంధర్వ శబ్దానికి గుఱ్ఱము, మగ కోయిల, ఒక రకపు మృగము, అంతర పిశాచము అని నిఘంటువులు అర్థాల్నిస్తున్నాయి. అదే విధంగా గంధర్వుడు అనే శబ్దానికి గాయకుడు, దేవ యోని విశేషము అని అర్థాలున్నాయి. పురాణాల్లో గంధర్వులను ఒక జాతి వారిగా పేర్కొన్నారు. వీరు వననివాసులు. వీరు మాయారూపంతో యుద్ధం చేసి శత్రువులను ఓడించే నేర్పు కలిగి ఉంటారు. అటు వంటి గంధర్వ స్త్రీ పాత్రలను ఇక్కడ పేర్కొని వివరించడం జరిగింది. అవి - 1. దుంధుభి, 2. కుంభీనసి.

దుందుభి :

ఈ పాత్ర వృత్తాంతం 'అరణ్యపర్వం షష్ఠాశ్వాసం'లో ఉంది. ఈ పాత్ర రామాయణ పాత్ర. ఈమె ఒక గంధర్వ స్త్రీ. బ్రహ్మ ఈమెను 'కుబ్జ రూపంలో మంధరగా జన్మించి దేవకార్యం నిర్వహించమని చెప్పి పంపాడు. ఆమెయే కైకేయి దాసి అయిన మంథర.

కుంభీనసి :

ఈ పాత్ర 'ఆదిపర్వం సప్తమాశ్వాసం'లో చెప్పబడింది. ఈమె అంగారపర్ణుడనే గంధర్వరాజు భార్య. ఈమె అర్జునున్ని ప్రార్థించి అతని చేత ఓడింపబడిన తనభర్తను రక్షించుకున్నది.

వేశ్య పాత్రలు :

పొట్ట కూటి కోసం కొందరు స్త్రీలు తమ శరీరాన్ని పర పురుషులకు అమ్ముకుంటున్నారు. ఈ దుష్ట వృత్తి వేలాది సంవత్సరాలనుంచి ఉంది. వేల సంవత్సరాలకు ముందు ఈ వృత్తి గుర్తింపు, గౌరవం పొందినట్లుగా చరిత్ర, వాఙ్మయం ద్వారా తెలుస్తున్నది. అలాంటి వేశ్య పాత్ర భారతంలో ఉంది. ఈ పాత్రను ఇక్కడ వివరించడం జరిగింది. అది - 1. పింగళ

పింగళ :

ఈమె వృత్తాంతం 'శాంతిపర్వం చతుర్థాశ్వాస'ంలో ఉంది. ఈమె మిథిలానగరములోని ఒక గణిక. ఈమె

ఒకానొక వేశ్య. ఈమె తనకు ఇష్టుడైన విటుడి కొరకు వేచి, అతడు రాక పోగా వచ్చిన వాడితోనే తృప్తి పడ్డాను గాక! అనుకొని శాంతించింది. ఈమె భర్తకు మోసం చేసి ఎక్కువ డబ్బు ఇచ్చువానితో చేరేది. నారాయణుని నిష్ఠతో చింతన చేసి కైవల్యం చేరవచ్చునని భావించేది. చివరికి తన శయన స్థానాదికమును విడిచి దేహము మెరుపు వంటి చంచలమైనదని భావించి పరమేశ్వరుని యందు చిత్తము నిలిపి ముక్తిని పొందింది.

వానరస్త్రీ పాత్రలు :

పురాణకాలం నాటికి ముందే మనుషుల స్వభావాలను బట్టి రాక్షసులు, వానరులు అని ఆనాటి కవులు విభజించారు. రామాయణంలో రాక్షసులు, వానరుల ప్రాధాన్యమే ఎక్కువ. అది భారతంలో నామ మాత్రంగా ఉంది. అలాంటి వానర స్త్రీ పాత్రలను కొన్నింటిని ఇక్కడ పేర్కొని చర్చించడం జరిగింది. అవి - 1. తార, 2. అంజని.

తార :

ఈ పాత్ర నామమాత్రంగా 'భారత అరణ్యపర్వం షష్ఠాశ్వాసం'లో చెప్పబడింది. ఈ పాత్ర రామాయణ పాత్ర. వానరరాజు వాలి భార్య.

అంజని :

ఈ పాత్ర ప్రస్తావన 'భారతారణ్యపర్వం'లో ఉంది. ఈ పాత్ర రామాయణపాత్ర. ఈమె ఒక వానర వనిత. కేసరి అనే వానర నాయకుని భార్య. వాయుదేవునికి ఈమె యందు హనుమంతుడు జన్మించాడు.

సైరంధ్రి పాత్రలు :

సైరంధ్రి శబ్దానికి అంతఃపుర కావలి కత్తె, సంకర జాతి స్త్రీ అనే అర్థాలను నిఘంటువులు ఇస్తున్నాయి. భారతంలోని కొన్ని సైరంధ్రి పాత్రలను ఎన్నుకొని ఇక్కడ వివరించడం జరిగింది. అది - 1. గట్టువాలు.

గట్టువాలు :

ఈ పాత్ర ప్రస్తావన 'విరాటపర్వం ప్రథమాశ్వాసం'లో ఉంది సైరంధ్రి జాతి స్త్రీ. పరుల ఇంట ఉండి వారిని గంధపుష్పాదుల చేత అలంకరించే స్వతంత్రమైన స్త్రీ జాతి.

బ్రాహ్మణ స్త్రీ పాత్రలు :

సమాజంలో అనాటి నుండి ఈనాటి వరకు అత్యున్నత గౌరవం పొందుతున్న వారు బ్రాహ్మణులు. వారిని భూదేవులన్నారు. అలాంటి గౌరవం పొందిన బ్రాహ్మణ స్త్రీ పాత్రనొక దానిని తీసుకొని ఇక్కడ చర్చించడం జరిగింది. అది - 1. గౌతమి.

గౌతమి :

ఈమె వృత్తాంతం 'అనుశాసనికపర్వం ప్రథమాశ్వాసం'లో చెప్పబడింది. కురుక్షేత్రయుద్ధంలో మరణించిన వారందరి చావుకూ తానే కారణమని దుఃఖిస్తున్న ధర్మరాజుతో భీష్ముడు 'వధించడానికి మనుష్యుడు కర్త కాదు' అని చెబుతూ ఈ గౌతమి వృత్తాంతాన్ని చెప్పాడు. ఈమె మిక్కిలి ఓర్పు కలిగిన ఒకానొక బ్రాహ్మణ స్త్రీ. ఆమె కుమారుడు పాము కాటుచేత మరణించగా, ఆమె దుఃఖిస్తూ ఉండగా, ఒక అర్జునకుడు ఆ పామును త్రాటితో కట్టి తెచ్చి 'చంపుతాను' అన్నాడు. అందుకామె 'ఆ పామును చంపినా తన కొడుకు బ్రతకడు, అందుచేత ఆ పామును వదలమని చెప్పింది. బోయడు అంగీకరించ లేదు. అప్పుడు పాము 'నేను మృత్యువు వంశంలో ఉండినందున కరిచినానే కాని నాకు ఎలాంటి రాగ ద్వేషాలు లేవు" అన్నది. దానికి కిరాతుడు 'నీవు మృత్యువు నకు తగిన సాధనమైనందున నిన్ను చంపవచ్చు' అన్నాడు. అందుకాపాము 'నేను కుమ్మరి సారెవంటి దానను. మృత్యువు ఆ సారెను త్రిప్పే కోల వంటిది. కోల త్రిప్పితే సారె తిరిగినట్లుగా మృత్యువు ఆదేశించగా నేను కరచినాను. అంతే కాని తప్పు నాది కాదు అన్నది. అందుకా అర్జునకుడు 'వేసే వాడుంటే బాణం స్వయంగా తానేం చేయగలుగుతుంది' అనుకొని ఆ బాణాన్ని త్రుంచకుండా ఉంటాయా? త్రుంచితే పాపం కలుగుతుందా? అందువల్ల నిన్ను చంపడంలో తప్పు లేదు' అంటాడు.

అప్పుడు మృత్యువు అక్కడకు వచ్చి పాముతో 'నిన్ను నేను ఆదేశించినట్లు గానే నన్ను కాలుడు ఆదేశించినాడు. అందుచేత ఈ బాలుడి చావుకు నీవు నేను కూడా కారణం

కాదు. ఇదంతా కాలుని పని. ఈ విషయం తెలిసి కూడా నీవు దోషం నామీద పెడతావెందుకు? అన్నది. అందుకు పాము 'నీ మంచి చెడ్డలను గూర్చి నేనేమి చెప్పడం లేదు. నీవు పంపగా నేను కరచినాను' అన్నాను. అంతే' అంటుంది. పాము మృత్యువుతో అట్లా అని బోయతో విన్నావు కదా? నేను దోషినంటావా? అంటుంది. అందుకు బోయ మీరిద్దరూ పాపాత్ములే అంటాడు. అపుడు కాలుడు అక్కడకు వచ్చి పాము, మృత్యువు, నేను కూడా ఈ బాలుడి చావుకు కారకులం కాము. ఇతడి చావుకు ఇతడు మునుపు చేసిన కర్మయే కారణమన్నాడు.
కాలుని మాటలు విని గౌతమి కూడా అట్లే చెప్పింది. అర్జునకుడికి అప్పటికి జ్ఞానోదయమై పామును వదలినాడు.

జంతు స్వభావ పాత్రలు :

భారతంలో మనుషులు శాపవశాత్తు జంతువులుగా, నదులుగా మారతారు. తిరిగి పూర్వ రూపం దాలుస్తారు. ఇక్కడ జంతు స్వభావం కలిగిన స్త్రీ పాత్రను ఒక దాన్ని ఎన్నుకొని చర్చించడం జరిగింది. అది - 1. గంధర్వి.

గంధర్వి :

ఈ పాత్ర నామమాత్రంగా 'ఆదిపర్వం తృతీయా శ్వాసం'లో చెప్పబడింది. ఈమె సురభి కుమార్తె. ఈమెకు గుర్రాలు పుట్టాయి.

శూద్ర స్త్రీ పాత్రలు :

పూర్వం బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర అనే నాలుగు కులాలు సమాజంలో ఉండేవి. అందులో చివరిది శూద్ర కులం. వీరికి సమాజంలో గౌరవం, ప్రాధాన్యం ఉండేది కాదు. పురుషులకైనా, స్త్రీలకైనా ఒకేరీతిగా ఉండేది. ఈ కులాలు రూపు దాల్చుటకు వేదాది గ్రంథాల్లో ఎన్నో వృత్తాంతాలు చెప్పబడ్డాయి. భారతంలో కూడా శూద్ర స్త్రీల పాత్రలున్నాయి. వాటిని ఇక్కడ పేర్కొని వివరించడం జరిగింది. అది-1.ఔశీనరి. స్థలాభావం చేత కొన్నింటిని గురించి మాత్రమే ఈ వ్యాసంలో వివరించడం జరిగింది.

ఔశీనరి :

ఈ పాత్ర ప్రస్తావన 'సభాపర్వం ప్రథమాశ్వాసం'లో ఉంది. గౌతముడనే ఋషివల్ల కాక్షీవుడిని కన్న ఒకానొక శూద్ర స్త్రీ. ఈ విధంగా ఈ వ్యాసంలో మొత్తం 125 స్త్రీ పాత్రలను పేర్కొని వాటి స్వరూప స్వభావాలను విశ్లేషించాను.

ఉపయుక్త గ్రంథాలు :

1. కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతం, ప్రచురణ : తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి, 2008.
2. శ్రీమదాంధ్ర మహాభారత నామ సర్వస్వం - రేవంతీయం, రచన : పుత్తా పుల్లారెడ్డి, స్వీయ ప్రచురణ, 2010
3. శబ్దరత్నాకరము - సం॥ బహుజనపల్లి సీతారామాచార్యులు
4. శబ్దార్థ రత్నాకరము - సం ॥ వారణాసి వేంకటేశ్వర్లు, బాలసరస్వతీ బుక్ డిపో, చెన్నై, 1982
5. ఇదండీ మహాభారతం - రంగనాయకమ్మ, స్వీట్ హోమ్ పబ్లికేషన్స్, హైదరాబాద్ - 500 033, 2014.

BHAVAVEENA
Vol. 17, Issue. 7, July 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

అనంతపురము జిల్లా కురువల జీవన సంస్కృతి - ఒక పరిశీలన

- డా. ఎన్.ఆర్. సదాశివారెడ్డి
సహాయ ఆచార్యులు, శ్రీకృష్ణదేవరాయ
విశ్వవిద్యాలయం, అనంతపురం.

- కొంకా మల్లికార్జున,
పరిశోధక విద్యార్థి, ఎస్కే. యూనివర్శిటి,
అనంతపురం.

అనంతపురం జిల్లా ఆంధ్రప్రదేశ్‌లో విస్తీర్ణంలో అతిపెద్ద జిల్లా. ఈ జిల్లా విభిన్నసంస్కృతులకు, సంప్రదాయాలకు, ఆచారవ్యవహారాలకు నిలయమైనది. ఇతర రాష్ట్రాలకు సరిహద్దుగా ఈ జిల్లా కలిగి ఉండటం వలన ఆయా రాష్ట్రాలలోని సంస్కృతి, సంప్రదాయాలను తనలో ఇముడ్చుకొని తనదైన ముద్ర వేసుకుంది. ఇక్కడ నివశించే ఇతర కులాలతో పోలిస్తే కురువ కులం జనాభా అధికంగా ఉన్నారు. గొర్రెల పెంపకం, కంబళ్ళునేయటం ప్రధానవృత్తిగా కలిగి వీరు నిరంతరం కొండగుట్టలలో, అడవులలో అధికంగా జీవిస్తున్నారు. వీరు అడవులలో నివశిస్తూ అక్కడ దొరికే ఆకులు, అలుములు, దుంపలు, కందమూలాలు తింటూ గొర్రెల పెంపకమే జీవనాధారంగా కలిగి వాటి నుంచి తీసిన ఉన్నితో కంబళ్ళు నేసుకొని వాటిని అమ్మగా వచ్చిన సొమ్ముతో జీవనం సాగిస్తున్నారు. వీరు గొర్రెలను మేపడానికి ఎక్కడా పచ్చిక బయల్లు ఉంటే అక్కడకు తమ గొర్రెలను తోలుకొని పోయి మేపు కుంటారు. ఈ క్రమంలో కొన్ని సంవత్సరాల పాటు భార్యాపిల్లలకు దూరంగా ఉంటూ ఎండా, గాలి, వానకు తట్టుకొని దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నారు. ఈ క్రమంలో తమ జీవాల (గొర్రెలు, మేకలు)ను ఒక్కొక్కసారి దున్నలు ఎత్తుకుపోయినా, తోడేళ్ళు, ఇతర క్రూర మృగాల వంటివి తినేసినప్పుడు నష్టం వాటిల్లినా తమ జీవన వృత్తిని వదలకుండా గొర్రెలు, మేకలను పోషిస్తున్నారు. ఒక్కొసారి వీరి అనారోగ్యం పాలైనా, అడవులలో విషసర్పాలకాటుకు గురైనప్పుడు సరైన వైద్యం అందక ప్రాణాలనుసైతం కోల్పోతున్నారు.

కురువలు విభిన్నమైన సంస్కృతిని తమకంటూ ఏర్పర్చుకొని తమకు ఆనందం కలిగినప్పుడు ఎగిరి దూకడం, దు:ఖం వేసినప్పుడు తమ దేవుడిని తలచుకోవడం పరిపాటిగా మారింది. ఇలా జీవిస్తూనే తన జీవితంలో డొల్లు నృత్యం, గొరవయ్యలనృత్యాల వంటివి ఏర్పర్చుకొని తమ ఇష్టదైవమైన బీరప్పస్వామి ముందు తన నైపుణ్యంతో నృత్యం చేస్తాడు. వీరు మొదట బీరప్పస్వామిని ఎక్కువగా గెరిగలు, (గిరిగలు) లింగరూపంలో ఆరాధించేవారు. కాల క్రమేణా గుర్రంపైన కూర్చున్న వీరభద్రున్ని వలె బీరప్ప స్వామిని కొలుస్తూ తాము ఎక్కడికి వెళ్ళినా తమ స్వామిని తీసుకెల్తూ మొత్తం భారతదేశమంతా విస్తరించి తమ బీరప్పస్వామిని పరిచయం చేశాడు. ఈ బీరప్పస్వామినే వివిధ ప్రాంతాలలో వివిధ పేర్లతో పిలుస్తున్నారు. ఉదా బీరప్ప, బీరన్న, మల్లేశ్వర, మైలారలింగేశ్వర, యేల్కోటమై లార, మల్లప్ప, మల్లయ్యస్వామి మొదలైనవి.

కురువలు తమ ఇష్ట దేవున్ని పండుగలు, జాతరలు, ఉత్సవాల సమయంలో మెరవణి చేస్తారు. ఈ సందర్భంలో వీరు తమ దేవుడిని పొగుడుతూ, తమ స్వామి యొక్క ఇతివృత్తాన్ని తెలియజేసే విధంగా గేయాలను, ఖడ్గాలను, అలుగుకీర్తనలను, మంగళహారతి వంటి పాటలను పాడతారు. ఈ గేయాలలో ఎక్కువగా కన్నడ పదాలే మనకు కన్పిస్తాయి.

"బారయ్య శివనే నన్నాలీదామొదలే - మొదలాద
కోనిగే నూరయ్యా
సిద్దులు పుట్టింది రుద్రాల భూమి - శ్రీరామయ్య
పుట్టింది అయోధ్య

శ్రీరామ బంటు హనుమయ్య పెట్టే - లంకాకీ దారి పోగెను
బరకూత రెండు సోరుగూత మూడు - దొరవారికి దొడ్డ బంటెనూ
గర్భీశ పిండములు లాడరణమయ్య - కుంభకారు నికి గండు హనుమన్న"

పై విధంగా వీరు పాడుకొనే గేయాలలో కులమతా లకు అతీతంగా తమ దేవుని పాటలే కాకుండా ఇతర దేవుళ్ళను కూడా తలుస్తూ, తమ దేవుని ముందర పాడు కుంటారు.

అలుగుకీర్తన :

స్వామి గరనాటి గండ్రబోలి - అవుదే
ఎలినాటి ఎబ్బిలి - అవుదే
మరనాటి మంత్రి - అవుదే
భూత భూతర గండ - అవుదే
భూపాల సిద్ద - అవుదే
పండమేటి పడశాలి - అవుదే
కోగిలి రామన్న - అవుదే
రాయినాటి ఉజ్జినీ - అవుదే
వన్న దురుగుదు రాయ - అవుదే
వన్న వతకల్లు - అవుదే
విజయనగర మోడ - అవుదే
ఇటుకునాల కరియన్న - అవుదే
నల్లమల నాట దొర - అవుదే
యర్రమల వేటకాడ - అవుదే
చెంచిలి చెలివేటకాడ - అవుదే
డిల్లీ దేవగిరికి పోతిన నేవు - అవుదే
యలలేని సముద్రానికి - అవుదే
స్నానానికి పోతిన నేవు - అవుదే
గురుడా హరి గరుడా - అవుదే
సద్గురుడా - అవుదే
శివన్నారాయణమూర్తి - అవుదే
ఆదినారాయణ మూర్తి - అవుదే
- - - - -

అంటూ కురువలు తమ ఇష్టదేవుణ్ణి మెరవణి చేసే సందర్భంలో ఎంతసేపటికి స్వామి ఒళ్ళోకి రాకపోతే రెండు కత్తులు జంటగా కట్టినటువంటి అలుగుతో వీరు తలకు కడుపుకి బాదుకోవడం జరుగుతుంది. దీనినే కురువలు అలుగు అంటారు. తమ స్వామిని ఒళ్ళోకి తెప్పించే సందర్భంలో గేయాలు పాడుతూ ఈ అలుగుతో గుద్దు కోవడం జరుగుతుంది.

కురువలు తమ కురువ కులం ఆవిర్భావానికి సంబం ధించి కూడా పాటలు తమ దేవుని ముందర ఈ క్రింది విధంగా పాడుకుంటారు.

"బారయ్య శివనే నన్నాలీదామొదలే - మొదలాద కోనిగే నూరయ్యా
నరసంచారము పుట్టిన తరువాత - కురువోల్ల కులమే పుట్టింది
కురువోల్ల కులమే పుట్టీనా తరవాత - కరియాన దేవుడే పుట్టేన్న
కరియాన దేవునికి పూజాలు పబ్బాలు - ఆటలు పాటల పాడల్లా
రొక్కూతూ కుమ్ముతూ - గెంతూతూ వస్తోంది కోనంగి
కోనంగి క్రిందానా గడ్డాలపైనా చిలుకూతూ వస్తోంది కోనంగి
సిరియాన ముక్కంటి దేవతాలంతా గొప్పగొప్ప నిధులకెక్కేరూ
- - -
- - - -

కురువలు తమ గొర్రెలను రైతుల కోరిక మేరకు తమ భూమి మరింత సారవంతం కావాలని కృత్రిమ ఎరువులకు బదులు గొర్రెల, మేకలను తోలించుకోవడం వలన తమ భూమి సారవంతం అవుతుందని రాత్రి వేళల్లో గొర్రెలను

ఒక చోట తోలి నిల్వ ఉంచుతారు. ఈ సమయంలో రైతులు కొంతమంది గొర్రె కాపర్లుకు అన్నం పెట్టించడం జరుగుతుంది. అప్పుడు గొర్రెకాపర్లు అన్నం పెట్టించిన వారు ఆయు ఆరోగ్యాలతో, అష్టైశ్వార్యాలతో, సిరిసంపదలతో, పిల్లాపాపలతో అందరూ బాగుండాలని ఆశీర్వదిస్తూ గేయాలు క్రింది విధంగా పాడుకుంటారు.

భూదేవతాస్వామి వానదేవుడా - గొర్లమంద పడకపండేనా "అవుదే"

రామలక్ష్మన్నగారు గెలిమికట్టేరా -"అవుదే"

సాలుసాలుకు తప్పకుండా గెలిమి తోలేరూ -"అవుదే"

సీతమ్మదేవి విత్తనం విత్తేనా - "అవుదే"

కురుబ కాపులు గెలిమి కట్టితోలేరా - "అవుదే"

కురుబోళ్లమంద పడక పండేనా - "అవుదే"

ఎద్దు తొక్కిన అడుగులో కాగుడు గంటపగిలీనా - "అవుదే"

నల్లగొర్ల మంద పడక పండివేపుట్లు పండేనా - "అవుదే"

ఎర్ర గొర్ల మంద పడక పండి వెయ్యి పుట్ల పండేనా-"అవుదే"

పశిగొర్లమంద పడకపండి పదివేలపుట్లు పండేనా - "అవుదే"

- - - - - - - - - -

మంగళి హారతి పాటలు :

కురువలు తమ దేవుని ఊరేగింపు సమయంలో కొంత మంది నలుగు వేయించడం చేస్తారు. అనగా స్వామి ముందు నల్లకంబడిని పరచి దాని మీద తాంబూలాన్ని ఉంచి (తమలపాకు, వక్కలు, బెల్లం, రూక) దాని చుట్టూ గొరవయ్యలు లేదా డొల్ల నృత్యకారులు నృత్యం చేస్తూ పద్యాలు పాడతారు. దీనినే నలుగువేయడం అంటారు. ఇలా వేయడం వలన తమ ఇంటిల్లి పాదికి సుఖ సంతోషాలు ఆయు ఆరోగ్యాలు తమ దేవుడు ఇస్తాడని ఆనందంతో తమ దేవుడు ఇంటి దగ్గరకు వచ్చినందుకు నలుగు వేయిస్తారు. ఈ నలుగు వేసిన తర్వాత ఎవరైతే ఈ నలుగును వేయిస్తారో వారు ఇంటిలో నుంచి కలిశం(దీపంతో కూడిన ఎరుపు, నలుపు, పసుపు, సున్నం కలిపిన నీళ్ళు)ను తీసుకొని వస్తారు. ఈ కలిశంను పూజారి దేవునికి హారతినిచ్చి ఇంటివాళ్లకు ఇవ్వడం జరుగుతుంది. ఆ ఇంటిల్లిపాది ఆ దీపాన్ని ముక్కుకొని ఆ నీటిని తమ ఇంటికి ఇరువైపులా దుష్టశక్తులు రాకుండా పోస్తారు. ఈ కలిశంతో కూడి స్వామికి తిప్పేటప్పుడు పాడేటువంటి పాటలనే మంగళహారతి పాటలుగా పిలుస్తారు. ఈ మంగళహారతి అనేటువంటి దేవుణ్ణి మెరవణి అనంతరం గుడిలో తిరిగి పెట్టే సమయంలో కూడా దుష్టశక్తులు నరదృష్టి పోవాలని మంగళహారతి పాటలు పాడతారు. ఈ పాటలు క్రింది విధంగా ఉంటాయి.

మంగళ హారతి పాటలు :

1. విదిగండా విధినాధునికి మెండు చెలోచెల్లు దండ వరి గండా
   బలమంతా బల్లిదేవ పుతురు పుతురు శని వారదయ్య కిరిగండ
   నసులు పటుదరి వరస ఎల్లాడు బందుదేవా
2. ఎల్లాడు బంధుదేవ దేవేంద్ర దేవ హరిబాసదేవ గురుమాలప్ప
   నీ పాదాను శరణు ఎల్లాడు బందుదేవా
3. సతనుపమంగళ సబ్బోసి లింగన్న అంగలింగమదేవ హరివాసదేవ జంగమ కోనికి నోరి లింగన్నకే

- - - - - - - - - - -

ముగింపు :

పైన చెప్పిన విధంగా తరతరాల సంస్కృతి, సాంప్రదాయాలను కురువలు పాటిస్తున్నారు. పండుగలు, జాతరలు, ఉత్సవాల సమయాలలో పాతకాలం నాటి సంప్రదాయాలను నేటి నాగరికతా ప్రపంచంలో కూడా తమ కుల సంస్కృతిని కాపాడుకుంటూ వస్తున్నారు. అంతేగాకుండా వీరు ఆహారపు అలవాట్లు, తమ నృత్య కళారూపాలను, వేషభూషణాల వంటి ఆచారాలను పాటిస్తున్నారనటంలో ఎలాంటి అతిశయోక్తి కాదు.

BHAVAVEENA
Vol. 17, Issue. 7, July 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

శ్రీ తిరుమల రామచంద్ర చారిత్రక దృష్టికోణం

– డా॥. సనుగుల సునిల్ కుమార్, సీనియర్ అకడమిక్ ఫెలో, తెలుగు విభాగం, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

'పత్రికార శిరోమణి' శ్రీ తిరుమల రామచంద్ర గారి 'హంపీ నుంచి హరప్పాదాక' స్వీయ చరిత్ర కావ్యం. స్వీయ చరిత్ర అంటే 'ఒక వ్యక్తి తన చరిత్రను తానే రాసుకుంటే' దానినే స్వీయచరిత్ర అంటారు. ఆత్మకథ, ఆత్మచరిత్ర, అనుభవాలు జ్ఞాపకాలు, గతస్మృతులు మొదలగు పేర్లతో స్వీయ చరిత్రను పిలుస్తారు. ఇది ఆంగ్ల సాహిత్య ప్రభావంతో తెలుగు సాహిత్యంలోకి ప్రవేశించిన ప్రక్రియ. ఆంగ్లంలో వెలువడిన స్వీయ చరిత్రలు అన్నీ వచనంలోనే ఉన్నాయి. కాని తెలుగులో కొన్ని పద్యంలోనూ, కొన్ని వచనలోనూ రచించారు. స్వీయ చరిత్ర వలన తోటి మానవుల కష్టసుఖాలపట్ల సానుభూతి, అవగాహన కలుగుతాయి. మనం ఎలా ప్రవర్తించాలో తెలుస్తుంది. జీవిత సత్యాలను తెలుసుకోవడానికే స్వీయచరిత్ర చదవాలి. స్వీయ చరిత్ర మానవుల చరిత్ర. అంటే దేశ చరిత్ర, సమాజ చరిత్ర. స్వీయ చరిత్ర అంటే మానవ ప్రవృత్తుల సింహావలోకనం సమాహార స్వరూపమన్నమాట. అలాంటి రామచంద్ర గారు రాసుకున్న తన స్వీయ చరిత్రలోని కొన్ని చారిత్రక సంఘటనలను చర్చించుకోవడం ఈ పరిశోధన పత్ర ముఖ్య ఉద్దేశం.

రామచంద్ర గారు శ్రీమతి జానకమ్మ, శ్రీ శేషాచార్యులకు 1913, జూన్ 17వ తేదీన అనంతపురం జిల్లా, ధర్మవరం తాలూకా రాగంపల్లె(రేగటిపల్లె)లో జన్మించారు. వీరు పత్రికా సంపాదకుడుగా, రచయితగా, స్వాతంత్ర్య సమరయోధుడుగా, భాషావేత్తగా, అందరికి సుపరిచితులే. తిరుమల రామచంద్ర మాతృభాష తెలుగుతో పాటు కన్నడ, తమిళ, సంస్కృతం, ప్రాకృతాది భాషల్లో ప్రావీణ్యం కలిగిన బహుభాషావేత్త. వివిధ అనుభవాలు సంపాదించి విస్తృత లోకానుభవశాలిఐన రామచంద్ర తనను తాను వినమ్రంగా 'భాషాసేవకుడు' అని అభివర్ణించుకునేవారు. ద్వితీయ ప్రపంచ యుద్ధ కాలంలో సైన్యంలో హవల్దార్ గుమాస్తాగా, "భారతి" మాసపత్రిక ఇన్‌చార్జ్ ఎడిటర్‌గా వివిధ రంగాలలో పనిచేసి వీరు 1997, అక్టోబర్ 12న హైదరాబాద్‌లో పరమపదించారు.

'హంపీ నుంచి హరప్పాదాక' ఒక విలక్షణమైన కావ్యం. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం (2002) లో పొందిన అపురూప స్వీయ చరిత్ర గ్రంథం ఇది. ఇందులో తన జీవితంలో మూడోవంతు సంఘటనులు మాత్రమే ఆయన మనతో పంచుకున్నారు. వివిధ శీర్షికలతో 61 ధారావాహిక భాగాలుగా పత్రికలలో వెలువడింది. ఇప్పటికి ఈ రచన మూడవ ముద్రణను పూర్తి చేసుకుంది. దీని తొలిముద్రణ ఆయన పరమపదించిన రెండు నెలల తరువాత ప్రచురించబడింది. దీనిని అజో- విభో - కందాళం(యు.ఎస్.ఏ.) ప్రచురణలు వారు 12- 12 - 1997న ముద్రించారు. అక్కిరాజు రమాపతిరావు ఈ పుస్తకానికి ముందుమాట రాస్తూ, ఇది ఎంతో విలక్షణమైనదీ, విశిష్టమైనదీ. చారిత్రాత్మక స్వీయ చారిత్రాత్మక కథనంగా పేర్కొన్నారు.

సాధారణంగా స్వీయ చరిత్రలలో వాస్తవాలకు ఎక్కువ ప్రాదాన్యత ఉంటుంది. కల్పనలకి అవకాశం తక్కువ. తన నిజ జీవితంలో జరిగిన వాస్తవాలను రాయటం అంత సులవైన విషయమేమికాదు. ఒకరకంగా కత్తిమీద సాము లాంటిదనే చెప్పాలి.

ఏరోజుకారోజు రాసిన స్వీయ చరిత్రే డైరీ. డైరీనే 'దిన చర్య' అని తెలుగులో వ్యవహరిస్తారు. గురజాడ డైరీలను 'మహాకవి డైరీలు' అనే పేరుతో, కె.వి. రమణారెడ్డి గారి డైరీని 'డిడెన్యూ డైరీ' పేరుతో ప్రాచుర్యంలో ఉన్నాయి. రామచంద్ర గారికి చిన్నప్పటినుంచి డైరి రాయడం అలవాటుగా ఉండేది. రోజు వారీ కార్యక్రమాలను డైరీలో పొందుపరస్తూ ఉంటారు. కాని ఇది కొంతకాలమే

వీలుపడింది. ఆవిషయాన్ని ముందుమాటలో ఈ విదంగా పంచుకున్నారు. ''నేను తిరుపతిలో శ్రీ వేంకటేశ్వర సంస్కృత కళాశాలలో విద్యార్థిగా ఉన్నప్పుడు దినచర్య వ్రాసే వాడిని. ప్రతిదినమూ ఏదైనా మంచి పనిచేయాలనే నియమం పాటించేవాడిని. రాత్రి పడుకోబోయే ముందు దినచర్యను ఒక పెద్దల సూక్తితో ముగించేవాడిని.

స్వాతంత్ర్యోద్యమంలో క్రియాశీల కార్యకర్త అయిన పిదప, ఆనాటి పనులన్నీ దినచర్యలో చేరేవి. అది పోలీసుల చేతుల్లో పడి, న్యాయస్థానంలో నాకే కాక, నా మిత్రులకూ ప్రతికూల సాక్ష్యం ఇచ్చే పరిస్థితి ఏర్పడింది. అప్పటి నుంచి దినచర్య వ్రాయడం మానుకున్నాను. ఈ 'హంపీ నుంచి హరప్పాదాక' పర్యటనలో తిథుల వారీగా సంఘటనలను గుది గుచ్చడం, అందువల్లనే సాధ్యం కాలేదు; నాకు జ్ఞాపకం ఉన్నంతవరకు ఇందులో పేర్కొన్నాను'' అని తెలిపారు.

క్రీ.శ. 13 నుండి 15వ శతాబ్దం వరకు 'హంపీ' రాజధానిగా విజయనగర సామ్రాజ్యం ఉండేది. గొప్ప కళా కండాలతో, శిల్ప సంపదతో అలరారుతున్న హంపీ ప్రాంతాన్ని ముస్లిం రాజులు కొల్లగొట్టారు. నేటికి అనేక అవశేషాలు హంపీకి తలమానికగా నిలుస్తాయి. తిరుమల రామచంద్ర అనంతపురం జిల్లా ధర్మవరం తాలూకా రేగటిపల్లెలో జన్మించిన రామచంద్ర హంపి సిధిలాలలోని గ్రామమైన కమలాపురంలో తన బాల్యం గడిపారు. వీరు సాక్షాత్తూ విజయనగర సామ్రాజ్యంలో కానవచ్చే తాతాచార్యుల వంశీయులు. వీరి పూర్వులు వివిధ రాజుల వద్ద మతగురువులుగా పనిచేశేవారు. వీరిలో తాతాచార్యులు ప్రముఖులు కావడం వల్ల తాతాచార్యుల వంశమని వీరి వంశానికి పేరొచ్చింది. విజయనగరం పతనమయ్యాక వీరిని తాడిమర్రి రాజులు ఆదరించారు.

'తాడిమర్రు' ఆంధ్ర ప్రదేశ్, అనంతపురం జిల్లాలోని ఒక చిన్న గ్రామం. విజయనగర రాజుల కాలంలో తాడిమర్రు సంస్థానంగా విలసిల్లేది. ఈ ప్రాంతాన్ని వ్యాధులు రాజ్యం చేస్తూ విజయనగర పాలకులకు అనుకూలురుగా వ్యవహరిస్తారు. రామచంద్ర ముత్తాత రామస్వామి తాతాచార్యులు వీరిదగ్గర మత గురువుగా పనిచేశారు. తాడిమర్రు బ్రిటీషువారి స్వాదీనం అయ్యాక రామచంద్ర తాత తిరుమల తాడిమర్రి నరసింహాచార్యులు తమ అత్తగారి ఊరైన హంపీ సిదిలాలలోని గ్రామమైన కమలాపురానికి తిరిగి వచ్చారు. రామచంద్ర అమ్మమ్మ గారు కూడా తాడిమర్రు రాజుల అనుయాయులే తాడిమర్రు రాజులు వీరి అమ్మమ్మగారి పేరుమీద ఊరునే దానం చేశారు. అదే ఇప్పుడు రాఘవమ్మ పల్లె. ఇది అనేక మారులు రూపాంతరం చెంది రాగంపల్లె, రేగటిపల్లెగా మారిపోయింది. ఇది తాడిమర్రుకు 12 క్రోసుల దూరంలో ఉంటుంది. ఈ వంశ చరిత్ర అంతా రామచంద్ర మొదటి అధ్యాయం 'గుండ్రాయి చెప్పిన గాథ'లో తెలిపారు.

రామచంద్ర ఆంధ్రప్రభ దినపత్రికలో పనిచేస్తున్న ప్పుడు, సంపాదకులు నార్లగారు హంపీ వెళ్లివచ్చి "హంపీ చూచివచ్చాను. ఫతేపూర్ శిక్రీ నన్ను ఇంప్రెస్ చేసినంతగా హంపీ ఇంప్రెస్ చేయలేదు" అని తనతో అన్నప్పుడు తనకు చాలా కష్టం కలిగింది. "దానికి దీనికీ పోలిక ఏమిటండీ? ఫతేపూర్ శిక్రీ చెక్కు చెదరకుండా ఉంది. అక్కడి ప్రజలు సహృదయులు గనుక పరరాజుల దాడి ఎంత మాత్రమూ లేదు గనుక. ఒక రాజు తన శత్రువును జయించిన తర్వాత, తన వాంఛితం తీరింది గనుక జయించిన ప్రాంత ప్రజలను, కట్టడాలను తక్కిన కళాఖండాలను తనవేననే భావనతో రక్షించుకోవడం సంప్రదాయం. కాని, బహమనీ సుల్తానులు విజయనగరం అంటేనే భయపడే వారు గనుక, జనం మళ్లీ ఎదురు తిరుగుతారనే సంశయంతో, నగరాన్ని ముక్కలు ముక్కలు చేశారు. జనాన్ని చావగొట్టారు. పాడుపట్టం చేశారు. ఎలాగో కొన్ని ఆ దాడి నుంచి మిగిలాయి. జపాపా ఎన్‌క్లోజర్‌లోని గజశాల, కమలాపురం పొలిమేరలోని లోటస్‌మహల్, ఉగ్రనరసింహ, శిల్పమయమయిన హజార రామస్వామి గుడి, హేమకూట వినాయక విగ్రహం, విఠలస్వామి గుడి, అప్పటి శిల్పవాస్తు సౌందర్యానికి తార్కాణాలుగా

నిలిచాయి. చాలదా?'' అన్నానని తనే 11 అధ్యాయం తెనాలి రామన మంటప' లో తెలిపారు.

రామచంద్ర గారిది ఉమ్మడి కుటుంబం అందరూ కలిసి కమలాపురంలోనే జీవించేవారు. వీరి తాతగారికీ, నాన్నగారికి, పినతండ్రికీ హంపీ శిథిలాలలోని ప్రతి రాతిముక్క పుట్టుపూర్వోత్తరాలూ తెలుసు. చరిత్రకెక్కని ఎన్నో విషయాలు వారు చెప్పగలిగేవారు. వారి ద్వారా తెలుసుకున్న కొన్ని మనతో పంచుకున్నారు. -

తెనాలి రాముడు గొప్ప హాస్యగాడు. రాయలు అష్ట దిగ్గజకవులలో ఒకడని అనేక ఐతిహ్యాలు నానుడిలో ఉన్నాయి. రాయలవారు, చిన్నాదేవితో ఏకాంతంగా ఉన్నప్పుడు ఆమె 'చిచ్చిచిచ్చిచ్చో' అని పెద్దగా తుమ్మిందట. దానికి రాయలవారు వైరస్యంతో వెళ్లిపోవడం తెనాలి వారి చెవిన పడి ఊరంతా ఆ విషయాన్ని చాటించాడట. దానికి కోపంతో రాయలవారు తెనాలి వారిని ముఖం చూపించ వద్దని ఆజ్ఞాపించారట. మరుసటిరోజు భువన విజయం మంటపంకి ఎదురుగా ఉన్న మంటపంలో తిరునామాలు వీపుకు పూసుకుని ముఖం చూపకుండా తెనాలివారు కూర్చున్నాడట. ఆ వింతను గమనించి రాయలు తెనాలివారిని క్షమించారట. అప్పటినుంచి ఆ మంటపానికి తెనాలి రామన మంటప అనే పేరొచ్చింది.

విరిగిన పాడుగాటి రాతి తొట్ల గురించి చెపుతూ విజయనగర సార్వభౌముల సైన్యంలో గజదళాలు, పదాతిదళాలే ఎక్కువ. బహమనీ సుల్తానులకు అశ్విక బలం ఎక్కువ. అందువల్లనే వారు యుద్ధాలలో సులభంగా విజయం పొందేవారు. ఈ రహస్యం గుర్తించిన రాయలవారు, పశ్చిమ సముద్ర తీరంలోని గోవాను పట్టుకొని, విదేశాల నుంచి మంచి జాతి గుర్రాలను దిగుమతి చేయించుకుని అశ్విక దళాల బలం పెంచుకొన్నారు. గుర్రప్పిల్లలను దిగుమతి చేయించుకొనేవారు. వాటికి పాలు తాపడానికి రెండడుగుల వెడల్పు రెండడుగుల ఎత్తు, పది పదిహేనడుగుల పొడవు రాతి తొట్లు మలిపించారు. విరిగిపడి ఉన్న ముక్కలు వాటివే. ఒకక్క తొట్టి మాత్రం భద్రంగా మిగిలింది. దానిని పూరా తత్వ శాఖవారు హజారరామస్వామి గుడి సమీపంలో భద్రపరచారు.

కొన్ని సార్లు వ్యక్తుల పేర్లనుబట్టి కాక వారు చేసే పనినిబట్టి వారు వెలుగులోకి వస్తుంటారు. రాయవాచకం రాసిన విశ్వనాథ స్థానాపతి, వాకిటి కావలి తిమ్మన్న మొదలైనవి. వాటిలో ఒకటి గొడుగుపాలుడు కథ. గొడుగు ఎప్పుడూ పట్టుకొని ఉండేవాడిని గొడుగు పాలుడు అంటారు. రాయలవారికి నిత్యం వెన్నంటి ఉండి గొడుపడుతూ ఉంటాడు. రాయల వేసవి విడిది పెనుగొండ నుండి హంపీకి సారంగమార్గం 80 మైళ్ల దూరం గొడుగుపట్టుకొని గుర్రంతో పాటు వేగంగా ప్రయాణించి తన రాజ భక్తికి చాటుకున్నాడు. దానికి రాయలు మేచ్చుకొని అతని కోరిక మేరకు ఒక రోజు రాజ్యపాలన ఇచ్చాడట. ఆరోజు అతని పేర అనేక దాన ధర్మాలు జరిగాయి. దానికి ఆనవాలుగా అక్కడక్కడ గొడుగు పట్టుకుని నిలుచున్న రాతి విగ్రహాలు సాక్ష్యంగా రామచంద్రగారు తన 12వ అధ్యాయం 'గొడుగు పాలుడు'లో తెలిపారు.

విజయనగరం వేదాలకు వ్యాఖ్యలు వెలసిన విద్యా నగరం, తెలుగు సాహిత్యానికి స్వర్ణయుగమైన సరస్వతీ పీఠం, అష్టదిగ్గజ కవుల, వేదవేదాంగ పారంగతుల, వైద్యవంతసుల, రాజనీతి కోవిదుల గ్రంథాలయాలు ఏమయ్యాయి అని మానవల్లి రామకృష్ణ కవి గారితో చర్చకు వచ్చినప్పుడు ''విజయనగర సామ్రాజ్య పతనానంతరం అక్కడి పండితులంతా అనంతపురం, కడప జిల్లాలకు కాందిశీకులై వచ్చారయ్యా! మీ అనంతపురం జిల్లాలో తాడిమర్రి, చిగుళ్లరేవు, దంపెట్ట, దాడితోట, కొండాపురం, కుంటిమద్ది, పెనుకొండ, మర్రిమాకులపల్లి మొదలయిన ప్రాంతాలను బాగా గాలించాలయ్యా. అపూర్వమైన శాస్త్ర సంబంధ గ్రంథాలు దొరుకుతాయి'' అని సలహాయిచ్చేవారు. ప్రముఖ పురాతత్వ శాస్త్రజ్ఞులు రంగస్వామి సరస్వతిగారూ ఇదేమాట అనేవారని తన 11 వ అధ్యాయం 'తెనాలి రామన మంటప' తెలిపారు.

చిత్తూరు జిల్లా కాంగ్రెస్ ప్రచారంలో భాగంగా

కరపత్రాలను పంచిపెట్టి శాసనోల్లంఘనం చేసి తిరుచిరాపల్లి కారాగార శిక్షను అనుభవించారు. ద్వితీయ ప్రపంచ యుద్ధ కాలంలో సైన్యంలో హవల్దార్ గుమాస్తాగా పనిచేసి నిజమైన దేశభక్తుడుగా తన వంతు నిస్వార్థ సేవను ప్రదర్శించాడు. చరిత్ర పుటల్లో తన పేరు చిరస్థాయిగా నిలుపుకున్నాడు.

తెలుగులో చాలా ఆత్మకథలు వచ్చినప్పటికీ తిరుమల రామచంద్ర గారి స్వీయ కథ అయిన 'హంపీ నుండి హరప్పాదాక' రచన కొంత ప్రత్యేకతను సంతరించుకోవడానికి కారణం, ఆయన చారిత్రక దృష్టే. చరిత్రపై తనకున్న అభిలాషే. తన సొంత అనుభవాలను చెబుతూనే, పెద్దల దగ్గర తాను తెలుసుకున్న శిథిలమైపోతున్న అనేక చారిత్రక సంఘటనలను తిరుమల రామచంద్ర తన ఆత్మకథలో నిక్షిప్తం చేసుకున్నాడు.

ఆధునిక కాలంలో చరిత్ర పరిశోధనలపై ఎలాంటి భావాలున్నాయో తిరుమల రామచంద్ర తాతగారి మాటలు అక్షర సత్యం అనిపిస్తుంది. "కాలం చాలా కఠోరమైంది. ఎంత వారినైనా తన పొట్టలో పెట్టుకుంటుంది. అదృష్టవంతుల పేర్లు పైకి వస్తాయి. దురదృష్టవంతులవి అట్టడుగున పడిపోతాయి. మనదేశంలో ఎందరో పండితులు, కవులు, వీరులు ఉదయించారు. వారిలో అజ్ఞాతంగా కాలగర్భంలో మరుగైపోయినవారు పెక్కుమంది. పేరు ప్రఖ్యాతలు పొందినవారు వేళ్లపై లెక్కించదగినవారు మాత్రమే. ఇలాంటి వారినైనా చరిత్రకారులు గురిస్తారా, లేదు. వారికి లోకం నాలుకపై ఉన్నవి కేవలం వదంతులు, అప్రామాణికాలు, రాయో రప్పో ప్రమాణం కావాలి. ఊరూరా కనిపించే వీరగల్లులు కొండగుర్తులు మాత్రమే, కవుల పుణ్యమా అని ఏ చాటువో, లోకం పుణ్యమా అని ఏ కట్టుకదో ప్రచారంలో ఉంది కాబట్టి అలాంటి వారిని ఇంత మాత్రమైనా స్మరిస్తున్నాము." ఇలాంటి మాటలు కూడా తిరుమల రామచంద్రలో చారిత్రక దృష్టికోణాన్ని నిద్రలేపాయి.

రామచంద్ర ఈ ఒక్క రచనలోనే కాక తను రాసిన రచనలలో కూడా చారిత్రకాంశాలు తొంగిచూస్తున్నాయి. రామచంద్ర ఎన్నో దేశభక్తి గీతాలు; భాషాచరిత్రకే తలమానికం అయిన 'మనలిపి పుట్టుపూర్వోత్తరాలు'; విశ్వకవి రవీంద్రుడు, ఎం.ఎస్. సుబ్బలక్ష్మి, దావిపర్తి పిచ్చహరి, విస్సా అప్పారావు, చిలుకూరి నారాయణ రావుగారు ఇలా ఎందరో గొప్ప చారిత్రక వ్యక్తులమీద పరిశోధన వ్యాసాల సంపుటి 'అహం భో అభివాదయే'; ప్రాకృత కవులు, బౌద్ధ రచనలను పరిచయం చేసే ప్రాకృత వాఙ్మయంలో రామకథ; కాటమరాజు కథ; మరుపురాని మనీషులు ఇలా అనేక రచనలు చారిత్రక దృష్టితో గావించారు.

వేటూరి ప్రభాకరశాస్త్రికి ఏకలవ్య శిష్యునిగా చెప్పుకుంటున్న తిరుమల రామచంద్ర విద్వాన్ విశ్వం వంటి సహాధ్యాయులతో పనిచేశాడు. పాత్రికేయుడిగా అనేక పత్రికా రంగాలలో పనిచేసి తర్వాత మీజాన్‌లో చేరి ఆ పత్రికా సంపాదకుడు, అనేక చారిత్రక నవలల రూపకర్త అడవి బాపిరాజు శిష్యరికంలో రాటుతేలి, ఒక చారిత్ర కారుడిగా మనకు కనిపిస్తారు.

తెలుగు సాహిత్య సృజనను చారిత్రక దృష్టితో చేసిన తిరుమల రామచంద్ర తెలుగు సాహిత్యానికి హితోదిక సేవ చేశాడు. నేటి కాలానికి ఆయన రచనలు ఎంతో విలువైనవిగా విశేషమైనవిగా నిలిచిపోయాయి. తెలుగు భాషా సేవకుడిగా, సాహిత్యాన్ని చారిత్రక కోణం నుండి చూసిన రచయితగా తిరుమల రామచంద్ర శాశ్వత కీర్తిని గడించాడు.

ఆధార గ్రంథాలు :

1. ఆంధ్రుల సంక్షిప్త చరిత్ర - ఏటుకూరు బలరామమూర్తి 2. తెలుగు సాహిత్య చరిత్ర - డా॥ ద్వా.నా. శాస్త్రి
3. తెలుగు సాహిత్యవిమర్శ - ఆచార్య బూదాటి వేంకటేశ్వర్లు 4. విజయనగర సామ్రాజ్యం - డా॥ కె.యస్. కామేశ్వరరావు
5. హంపీ నుంచి హరప్పాదాక - శ్రీ తిరుమల రామచంద్ర

BHAVAVEENA
Vol. 17, Issue. 7, July 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

తెలంగాణ స్త్రీల కవిత్వం - సామాజిక చిత్రణ

- డా॥ వి. త్రివేణి, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు అధ్యయన శాఖ, తెలంగాణ విశ్వవిద్యాలయం, నిజామాబాద్.

'సమానత్వం, సమానత్వం అంటూ ఉంటే నా చిన్ని బుద్ధికి అదే అందకుండా ఉంది. ఆనకుండా ఉంది. అర్థం కాకుండా ఉంది నాకు. ఒక వేళ పురుషులు పురుషులకి పుట్టినట్టయితే, స్త్రీలు స్త్రీలకు పుట్టినట్టయితే సమాన మనడంలో అర్థం ఉంది. అట్లా కాదే... సృష్టే సృష్టిని ఆడవారి చేతిలో పెట్టింది. అంటే సృష్టే సృష్టి అంటే దేవుడనే వాడు ఒకడుండి సృష్టిని సృష్టించి ఆ సృష్టిని ఆడవాళ్లకి పెట్టిందని నా దృక్పథం. కనుక మరి ఆడవారికి జన్మ ఆడదే ఇస్తుంది. మగవారికి జన్మ ఆడదే ఇస్తుంది. మరి శరీరంలో ఉండే రక్తమాంసాలన్నింటిని కరిగించి వారికి జన్మనిచ్చే ఆడది గొప్పదా? జేబులో చేతులు పెట్టుకొని తిరిగే మగవాడు గొప్పవాడా? కనుక నా దృక్పథంలో... నా దృక్పథంలోనే కాదు అది యదార్థం, సత్యం, ఒప్పుకొని తీరాల్సిందే సమాజం ఒకరోజు'.

టి.ఎన్.సదాలక్ష్మి - నల్లపొద్దు సంకలనం (1952 సాధారణ ఎన్నికలలో కరీంనగర్‌లోని సుల్తానాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుండి రిజర్వుడు సభ్యురాలిగా పోటీచేశారు)

She is not born, She is made

- Saiman D Bihevar

'స్త్రీ స్త్రీగా పుట్టదు/ స్త్రీగా పెంచబడుతుంది'.

-సైమన్ డి బిహేవర్

17, 18వ శతాబ్దంలో చెప్పిన ఈ నినాదమే అసలైన స్త్రీవాదానికి లేదా స్త్రీ సాధికారతకు తెరతీసింది. జర్మనీ దేశానికి చెందిన ఫెమినిస్ట్ సైమన్ డి బిహేవర్. ఆమె చూపిన ఉద్యమ భావజాలం పునాదిగా చేసుకొనే ప్రపంచ వ్యాప్తంగా మహిళా పోరాటాలు జరిగాయి. 1910లో కొపెన్ హగెన్‌లో జరిగిన అంతర్జాతీయ శ్రామిక మహిళా సదస్సు దీనికి శ్రీకారం చుట్టింది. ఈ సదస్సులో జర్మనీకి చెందిన ప్రముఖ కార్మికోద్యమ నేత, సోషల్ డెమోక్రటిక్ నాయకురాలు కార్లా జట్కిన్ "మహిళా దినోత్సవం" ప్రతిపాదన ముందుకు తెచ్చారు. ఆమె తీర్మానాన్ని సదస్సు ఏకగ్రీవంగా ఆమోదించింది. 1911, మార్చి 19న తొలిసారి జర్మనీ, డెన్మార్క్, స్విడ్జర్లాండ్, ఆస్ట్రేలియా దేశాలలో మహిళా దినోత్సవాన్ని మొట్టమొదటి సారిగా నిర్వహించారు. దీనికంటే ముందుగానే 1900 సంవత్సరంలో పారిశ్రామిక విధానం రావడం, సంక్షోభ పరిస్థితులు ఏర్పడటం, జనాభా విపరీతంగా పెరిగిపోవడం, అతివాద భావజాలం ఏర్పడటం వంటి పరిస్థితులల్లో మహిళల సమస్యల పట్ల గొంతెత్తిన వారే లేని స్థితి. పెట్టుబడిదారీ వ్యవస్థ వేళ్లూనుకుపోయిన ఇటువంటి స్థితిలో మహిళలు పిల్లలతో బండచాకిరి చేయించుకొని తక్కువ జీతాలు ఇచ్చేవారు. శ్రమదోపిడి యధేచ్ఛగా సాగింది. దీనిలో అణచివేత, వివక్ష దోపిడికి వ్యతిరేకంగా మహిళా కార్మికులు, శ్రామికులు కూడా గళమెత్తారు. కార్మిక ఉద్యమాల్లో జోరుగా పాల్గొన్నారు. ఇదే మహిళా దినోత్సవానికి ప్రధాన భూమిక. 1908లో అమెరికాలోని న్యూయార్క్ నగరంలో 15వేల మంది మహిళలు ర్యాలీ నిర్వహించి, పనివేళలు తగ్గించాలని, సమానమైన, మెరుగైన వేతనం ఇవ్వాలని, మహిళలకు ఓటు హక్కు కల్పించాలని ఉద్యమించారు. 1909 ఫిబ్రవరి 28న సోషలిస్టు పార్టీ ఆఫ్ అమెరికా ఆధ్వర్యంలో అమెరికాలో తొలిసారి మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. 1913 చివరివారం వరకు (ఫిబ్రవరి) అక్కడ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. 1913, ఫిబ్రవరి చివరివారంలో రష్యాలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. మొదటి ప్రపంచ యుద్ధంలో సైనికులు చనిపోయినప్పుడు వారి భార్యలకు, పిల్లలకు ప్రభుత్వం ఆదరణ కల్పించాలని నినదించారు. సోషలిస్టు ఉద్యమం ప్రపంచ వ్యాప్తంగా విస్తరించిన తర్వాత అన్ని

దేశాలలో మహిళా దినోత్సవం నిర్వహించడం జరిగింది. 1975లో ఐక్యరాజ్య సమితి "అంతర్జాతీయ మహిళా దినోత్సవం" ప్రకటించి ప్రతియేటా మార్చి 8న నిర్వ హించడం ప్రారంభించింది.

క్రమంగా మహిళా సాధికారత కోసం ప్రయత్నం జరి గింది. 'ఆకాశంలోసగం, అవనిలోసగం, అవకాశాల్లో సగం' అంటూ సామాజిక, రాజకీయ, ఆర్థిక, వైజ్ఞానిక విషయాల యందు సమానమైన ప్రతిపత్తిని సాధించడం జరిగింది. మహిళా ఉత్పత్తిపైన, మహిళా పునరుత్పత్తిపైన, ఆర్థిక రాజకీయాధికారంపైన మహిళా చైతన్యం సాధించడమే మహిళా సాధికారికతగా భావించవచ్చు. ఇదంతా ప్రజాస్వామ్య, శాస్త్రవిజ్ఞాన సమాజం నుండి ఏర్పడిందని ఖచ్చితంగా చెప్పవచ్చు. దీనివల్ల మహిళలకు 'స్వేచ్ఛ... స్వేచ్ఛ నుండి విరామం... విరామం నుండి ఆలోచన... ఆలోచన నుండి విద్యావశ్యకత... విద్యావశ్యకత నుండి ప్రపంచావగాహన' కలిగింది. వంద సంవత్సరాల క్రితం ప్రశ్నించడమే తెలియని మహిళ, సమాజంలోని ఆచార పరంపరలను, మత సంప్రదాయ ధోరణులను, 'యజ మాని' ఆధిపత్య నియమాలను మౌనంగా భరించింది. స్వతంత్ర ఆలోచనాశక్తి వల్ల, స్వతంత్రజీవన విధానం వల్ల పురుషాధిపత్య మూఢత్వం నుండి బయటపడింది.

ఆడపిల్లపై అధీనత్వం సమాజం నుండి, కుటుంబం నుండియేగాక స్త్రీగా పుట్టకముందు నుండే ఏర్పడింది. తత్ఫలితంగా లింగనిర్ధారణ పరీక్షలు, భ్రూణహత్యలు, ఆడపిల్లల మరణాలు, అమ్మకాలు, అనారోగ్యం, అక్ష రాస్యతాలోపం, వరకట్న మరణాలు, లైంగిక వేధింపులు, కిడ్నాపులు, కాల్‌గర్ల్ వంటి సమస్యలతో మహిళ కూరు కొనిపోయింది. వీటన్నింటిని అధిగమించడానికి మహిళ లకు శాస్త్రీయమైన విజ్ఞానం, విద్య, స్వావలంబన అవసర మైంది.

స్త్రీవాద సాహిత్యం సాధికారతను సాధించడానికి ఎంతగా స్త్రీచైతన్య పురోభివృద్ధి జరిగిందో ఈ క్రమాన్నిబట్టి అవగతం చేసుకోవచ్చు. ఏ స్త్రీవాద సాహిత్యం (కవిత్వం, కథ, నవల, నాటకం)లోనైనా ఇటువంటి పరిణామమే తరచుగా వస్తుంది. నేటి ఆధునిక స్త్రీగా ఆమెను నిల బెట్టడానికి విభిన్న ప్రక్రియలు బాసటగా నిలిచాయి.

మొదటి తరం స్త్రీ :

తొలినాళ్ళలో స్త్రీ ఒక సంప్రదాయ చట్రంలో అనేక సామాజిక కట్టుబాట్ల మధ్య నలిగిపోయింది. పురుషాధి పత్య సమాజం కింద అణగిమణిగి ఉండిపోయింది. సాంఘిక దురాచారాలైన వరకట్నం, కన్యాశుల్కం వంటి వాటికి సంబంధించిన దురాచారాలకు బలి అయ్యింది. సామాజిక అవరోధాలన్నీ నాడు స్త్రీ కేంద్రకంగానే ఉద్భ వించాయి. పర్యవసానాలన్నీ స్త్రీని అంతర్గతంగా అవ హేళన చేశాయి. వీటన్నింటికి ప్రధాన కారణం నాటి రాజ కీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక పరిస్థితుల ఫలితాలే నని ఖచ్చితంగా చెప్పవచ్చు.

రెండవ తరం స్త్రీ :

సంస్కారవంతమైన సమాజం ఏర్పడి స్త్రీలలో ఉత్తమ గుణాలను గుర్తించి గౌరవించడం జరిగింది. స్త్రీ ఉత్తమ గృహిణిగా నిలిచింది. అత్తా, మామలపట్ల, భర్తపట్ల, పిల్లలపట్ల సేవా తత్పరతను ప్రదర్శించింది. ఒక్కోసారి తనకు తాను త్యాగం చేసే దశకు చేరుకుంది. ఇది కూడా సంప్రదాయం పద్ధతిలోనే సాగింది. కానీ అంతకుముందు బానిసత్వ సంకెళ్ళ నుండి, గాఢాంధకార ఛాయల నుండి స్త్రీని తప్పించి ఉత్తమ సంస్కారాలను, గుణాలను ఆమెపై సమాజం పులిమింది.

మూడవ తరం స్త్రీ :

సంస్కరణవాదం బలీయమైన శాఖగా ప్రభావం చెందింది. స్త్రీకి విద్యావశ్యకతను గుర్తించింది. సంఘ సంస్కర్తల ఉన్నత భావాల వల్ల స్త్రీ విద్య ప్రోత్సాహం పెంపొందింది. ఇంట్లో ఉండే అక్షరజ్ఞానం పొందింది. పత్రికల్లో వచ్చే వార్తలను చదివి చైతన్యం పొందింది. మూఢనమ్మకాలు, అంధ విశ్వాసాల నుండి బయటపడే మార్గాలను అన్వేషించింది.

నాల్గవ తరం స్త్రీ :

స్త్రీ పురోభివృద్ధి వేగవంతమైంది. పాఠశాల స్థాయి నుండి ఉన్నత చదువుల వరకు స్త్రీ ఎదిగింది. ఉద్యోగాలు చేసి ఆర్థిక స్వావలంబన సాధించింది. నాటి సామాజిక కోణాలన్నింటిని ఆకలింపుచేసుకుంది. సాంస్కృతిక పురోభివృద్ధికి ప్రతిబంధకంగా ఉన్న నాటి పరిస్థితులను విశ్లేషించింది.

ఐదవ తరం స్త్రీ :

స్త్రీ అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్దేశింపబడింది. ఐక్యరాజ్య సమితి ప్రపంచవ్యాప్తంగా మహిళా సాధికారతా దశాబ్దోత్సవాలు (1975-85) నిర్వహించింది. స్త్రీల సర్వతోముఖాభివృద్ధికి బాటలు వేసింది. స్త్రీ స్వేచ్ఛకు, స్వాతంత్ర్యానికి అవకాశం కల్పించింది. విద్యా, ఉద్యోగాల్లో సాధికారత సాధించి రిజర్వేషన్ పొందింది. సామాజికపరమైన తన శక్తిని నిరూపించుకుంది. స్త్రీవాద భావజాలాన్ని సాహిత్య కోణాల్లో ఆవిష్కరించింది.

ఈ విధంగా స్త్రీ ప్రత్యేకమైన స్వయం సమృద్ధిని పొందిన పరిణామక్రమాన్ని విశ్లేషించుకోవచ్చు. కాని వీటిమధ్య ఒక నిబద్ధమైన కాలాన్ని నిర్దేశించుకోలేము. తొలినాళ్ళలో మందగొండిగా సాగిన స్త్రీ అభ్యున్నతి ఐక్యరాజ్య సమితి హక్కుల నేపథ్యంలో తరువాతి కాలంలో వేగం అందుకొంది. ఒక్కో తరానికి విభజించుకుంటూ పోతే స్త్రీ సమగ్ర అభివృద్ధి అంశాలు ఒక వరుస క్రమంలో అవగతమవుతాయి. కానీ ఈ అభివృద్ధి మాటున స్త్రీ అనంతమైన మానసిక సంఘర్షణ, శారీరక అణచివేతలు, నిరంతర వేదన, అంతర్గత సంవేదన వంటివి ప్రస్ఫుటమవుతాయి. మారుతున్న సమాజంలో యాంత్రికీకరణ, ప్రపంచీకరణ ప్రమాణాల మీద మానవ సంబంధాల లేమిని స్త్రీ అనుక్షణం అనుభవించింది.

సాహిత్యంలో వచ్చిన స్త్రీవాదాన్ని విభిన్న కోణాల్లో ఆవిష్కరించారు. స్త్రీవాద సాహిత్యంలో తెలుగులో బహుముఖాలుగా విస్తరిల్లింది. మార్క్సిస్టు ఫెమినిజం, రాడికల్ ఫెమినిజం, సోషలిస్ట్ ఫెమినిజం, రాడికల్ హ్యూమనిస్ట్ ఫెమినిజం... ఇలా విభిన్న రూపాల్లో అభివ్యక్తి కలిగి చివరికి డెమోక్రటిక్ ఫెమినిజం (లిబరల్ ఫెమినిజం) ఆమోదింపబడింది. తెలంగాణ అస్తిత్వ ఉద్యమాల సాహిత్యంలో కూడా స్త్రీవాద భావజాలం పరి పరి విధాలుగా ప్రస్ఫుటమైంది.

సెక్స్ - జండర్ మధ్య వ్యత్యాసముంది. సెక్స్:

పుట్టుకలో శారీరకంగా పురుషుల మధ్య ఉన్న అవయవ నిర్మాణంలో ఉన్న తేడా సెక్స్. జండర్ : బాల బాలికలు పెరిగే కొద్ది అలవాట్లలో, ఆచారాలలో, నీతులలో ఆపాదిస్తున్న తేడా. పితృస్వామ్యం - లింగ వివక్ష స్త్రీవాద అస్తిత్వ ఉద్యమంలో ప్రధాన అంశాలుగా నిలిచాయి. పితృస్వామ్యం : వందల సంవత్సరాలుగా సమాజంలో పురుషుడితే అధికారం, అన్ని రంగాలతోపాటు సమాజానికి కేంద్ర బిందువుగా నిలిచిన కుటుంబంలో కూడా పురుషుడిదే అధికారం అన్న న్యాయం కొనసాగుతూ వస్తుంది. లింగవివక్ష : పితృస్వామ్య సమాజం నడవడికను, నీతులను, సూత్రాలను, ధర్మాలను విడివిడిగా నిర్దేశించింది. దుస్తులు, తండ్రి, ఆటలు ఇంటా బయట చేయవలసిన పనులు, వివాహం వంటివి విడివిడిగా నిర్దేశించబడ్డాయి.

ఫెమినిజమ్ అనే ఆంగ్ల పదానికి సమానార్థకంగా తెలుగులో వాడుకలో ఉన్న శబ్దం స్త్రీవాదం. మానవ సమాజంలోని సగభాగమైన స్త్రీలు లైంగిక వివక్ష కారణంగా అణచివేతకు గురి అవుతూ పురుషుల కంటే తక్కువ సాంఘిక స్థితిలో ఉండడాన్ని ప్రశ్నిస్తూ స్త్రీ విముక్తిని కాంక్షిస్తూ అభివృద్ధి చెందిన సిద్ధాంతం.

1975-85 మధ్య కాలంలో అంతర్జాతీయ మహిళా దశాబ్దంగా ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. 1975 నాటికే అంతర్జాతీయ అవసరాల రీత్యా, ఐక్యరాజ్య సమితి సూచనల ప్రకారం సామాజికార్థిక రంగాలలో స్త్రీల పాత్రను గురించిన అధ్యయనాలు ప్రారంభమయ్యాయి.

1981 నాటికి మహిళా జీవన అధ్యయనం అనేది ప్రత్యేకంగా అభివృద్ధి చెందింది.

పాశ్చాత్య భాషా సాహిత్యాలలో స్త్రీవాద అస్తిత్వ భావ జాలాన్ని బలంగా చాటినవారు - సైమన్ ది బిహేవర్, మంతర్ లాంట్, డి.హెచ్. లారెన్స్, క్లాడెల్, బ్రెటెల్, స్టెన్డాల్.

తెలుగులో వివిధ సాహిత్య ధోరణులలో స్త్రీవాదాన్ని వెలువరించినవారు - రంగనాయకమ్మ, ఓల్గా, జయప్రభ, కొండేపూడి నిర్మల, పి.సత్యవతి, శిలాలోలిత, ఘంటసాల నిర్మల, పాటిబండ్ల రజని, విమల, మందరపు హైమావతి, మల్లీశ్వరి.

తెలంగాణ ప్రాంతంలో స్త్రీవాద గొంతుకను వినిపించినవారు - కాత్యాయని విద్మహే, పాకనాటి జ్యోతి, రావి ప్రేమలత, ముదిగంటి సుజాతారెడ్డి, మాదిరెడ్డి సులోచన, పొల్కంపల్లి శాంతాదేవి, కె.శ్రీలక్ష్మి, అనిశెట్టి రజిత, జ్వలిత, కె.రామలక్ష్మి, కందాళ శోభారాణి, గీతాంజలి, రత్నమాల, కొల్లాపురం విమల, భండారు సుజాత, రావి ప్రేమలత, తిరునగరి దేవకిదేవి, నామని సుజనాదేవి, కొలిపాక శోభారాణి, జి.కనకదుర్గ.

పితృస్వామ్య వ్యవస్థకు, సాహిత్యానికి మధ్య ఉన్న సన్నిహిత సంబంధాన్ని గుర్తించడం, పితృస్వామ్య సమాజాన్ని ధిక్కరించడం స్త్రీవాద కవిత్వంగా భావించవచ్చు. స్త్రీ అస్తిత్వం, ప్రయోజనం వంటి వాటిని పునాదిగా చేసుకొని, తదనంతరం స్త్రీవాదం బలంగా ముందుకొచ్చింది. సంస్కరణ, జాతీయోద్యమాలు, అభ్యుదయ, విప్లవ చైతన్యాల నుండి మార్పుకు అనువైన నేపథ్యాన్ని ఏర్పరుచుకొని స్త్రీలు ముందుకొచ్చారు. స్త్రీవాద కవిత్వాన్ని వెలువరింపజేశారు. ఈ ఉద్యమాలు స్త్రీలలో ఒక సిద్ధాంత పరమైన ఆలోచనాశక్తి, ప్రాపంచిక జ్ఞానం, పోరాట స్ఫూర్తి, ఉద్యమ భావజాలం పెంపొందింపజేశాయి. స్త్రీవాద సాహిత్యం 1975 తర్వాతనే ఒక నిర్దిష్టరూపాన్ని దాల్చింది. 1975 కంటే ముందున్న సాహిత్యం కూడా స్త్రీ చైతన్యం, స్త్రీ అభ్యుదయం మీద వెలువడింది. తెలుగులో వచ్చిన మొదటి ప్రక్రియ 'కవిత్వం'. కవితా ప్రక్రియ ద్వారా స్త్రీవాద అస్తిత్వ ఉద్యమం ఒక సమగ్రమైన రూపాన్ని సంతరించుకొన్నా; కథలు, నవలల్లోనే విస్తృతమైన నేపథ్యాన్ని సంతరించుకొంది. ఈ ప్రక్రియలు స్త్రీ సమస్యలలోని రాజకీయ స్వభావాన్ని గానీ, పితృస్వామ్య భావజాల మూలాలను గానీ, జండర్ రాజకీయాలను గానీ లోతుగా అధ్యయనం చేశాయి. స్త్రీవాద రూపురేఖల్ని బహుముఖాలుగా విస్తరింపజేశాయి.

కవిత్వం :

స్త్రీవాద కవితా ధోరణులతో వెలువడిన కవితా సంకలనం 'నీలిమేఘాలు'. 1972-92 మధ్యకాలంలో రచించబడినవి ఇందులోని కవితలు. వీటికంటే ముందుగానే 'మాకు గోడలు లేవు', 'మూడుతరాలు', 'సవాలక్ష సందేహాలు', 'మనకు తెలియని మన చరిత్ర' వంటి పుస్తకాలు వెలువరింపబడ్డాయి.

స్త్రీవాద కవిత్వం ప్రదర్శించిన వస్తుతత్వం సాహిత్యాన్ని విభిన్నమైన కోణాల్లో నిలబెట్టాయి.

స్త్రీవాద కవిత్వాన్ని ప్రభావితం చేసిన అంశాలు:

- శరీరం, శరీర రాజకీయాలు, సౌందర్యాత్మకహింస
- స్త్రీ, పురుష సంబంధాలు, లైంగిక స్వేచ్ఛ
- భావజాల రూపంలో స్త్రీలు చేసే చాకిరి, శ్రమ
- రకరకాల రూపాల్లో స్త్రీలు అనుభవించే హింస, వేదనలు, భ్రూణహత్యలు, అబార్షన్
- మాతృత్వం, రజస్వలకావడం
- లైంగిక దోపిడి, అత్యాచారాలు, వ్యభిచారాలు
- గృహహింస, వరకట్న సమస్య, లైంగిక వేధింపులు
- కవిత్వంపై దాడి, అణచివేత పట్ల తిరుగుబాటు
- పునరుత్పత్తి శక్తి, అస్తిత్వ పునర్వివేచన
- స్త్రీ జీవితంలోని 'ఆర్థికం', ఆర్థిక స్వావలంబన

తెలంగాణలో 1990-2009 మధ్య కాలంలో వివిధ అస్తిత్వ ఉద్యమాలలో స్త్రీవాదం బలంగా ప్రస్ఫుటమవుతుంది. ఈ కాలంలో స్త్రీవాద సాహిత్యం బహుముఖాలుగా

విస్తరించింది. వచన కవిత్వంలో స్త్రీవాద భావజాలం కులమత అస్తిత్వాలకు ప్రాతిపదికంగా నిలిచింది. విభిన్న కవిత్యోద్యమాలు స్త్రీవాదంలో చోటుచేసుకున్నాయి. పితృ స్వామ్య వ్యవస్థను ధిక్కరిస్తూ వచ్చిన స్త్రీవాదకవిత్వంలో దళిత స్త్రీవాదం, మైనారిటీ స్త్రీవాదం, బీసీ స్త్రీవాదం వంటివి ప్రవేశించాయి. అదేస్థాయిలో స్త్రీల మీద జరుగు తున్న దాడులు, అత్యాచారాలు, హత్యలపై ధిక్కారం కవిత్వంలో బలమైన గొంతుకగా మారాయి.

అనిశెట్టి రజిత పితృస్వామ్య సంస్కృతి మీద తన కవితలతో తిరుగుబాటు చేశారు. స్త్రీల జీవితాలు ఏ విధంగా శాసింపబడుతున్నాయో, సంప్రదాయం అచా రాలు, సనాతన సంస్కృతికి హేతువులైన స్త్రీల ప్రాతి నిథ్యాన్ని ఆమె ఒక విధంగా ఖండించారు. స్త్రీల జీవితాలు ఈ కాలంలోనే బానిస స్థితిలోకి దిగజార్చుతున్నాయని ఆమె ఆరోపించారు. ఆమె కవితా సంపుటిలో 'గులాబీలు జ్వలిస్తున్నాయి'. 'నేనొక నల్లమబ్బునవుతా', 'చెమట చెట్టు', 'ఉసురు', 'అనగనగా కాలం', 'నిర్భయాకాశం కింద' వంటివి పురుషాధిపత్య సమాజంపై ధిక్కార స్వరాన్ని పలికించినవి.

శారీరకంగా స్త్రీ అస్తిత్వం కంటే కూడా సామాజిక పౌరసంబంధాల నేపథ్యంగా ఆమె కవిత్వం ఒక నూతన ఒరవడిని ఏర్పరుచుకుంది. స్త్రీ చైతన్యం, తిరుగుబాటు ధోరణి, బానిస వ్యవస్థను బంధ విముక్తం చేయడానికి సంక్లిష్టరూపాలుగా ఉన్న సమస్యలను ఛేదించి సాధనంగా కవిత్వాన్ని పండించారు. అనిశెట్టి రజిత పేర్కొనే స్త్రీ సమూహంలో శ్రామిక పేద వర్గాల మహిళలు, దళిత బహుజన మహిళలు పడుతున్న కష్టాలు ప్రత్యేకంగా నిలుస్తాయి. రాజ్యం విధిస్తున్న హింస, పీడన అంతర్గతంగా ఈ కవిత్వంలో పేర్కొనదగింది. స్త్రీలను ఒక బానిస చట్రంలోకి దింపిన వరకట్నపు ఆత్మహత్యలు, హత్యలు, అత్యాచారాలను గూర్చి సమష్టి సంకల్పితంగా తిరుగు బాటు ధోరణి ఏర్పడింది. 2012 డిసెంబర్‌లో డిల్లీలో జ్యోతిసింగ్‌పై జరిగిన అత్యాచారం, ఆమె మరణం పట్ల వెల్లువెత్తిన నిరసన జ్వాల ప్రతిఘటన కవిత్వాన్ని ఎర్రసూరీడు కురిపించిన అగ్ని శకలాలుగా మార్చాయి.

ఈ సందర్భంలోనే అనిశెట్టి రజిత రచించిన కవిత్వం 'అవును మౌనాన్ని మాట్లాడుతున్నాను". "నిత్యగాయాల జ్యోతిలా మండుతూ, ఉద్యమ భాషపై మాట్లాడు తున్నాను". అంటూ ఆక్రోశాన్ని ప్రకటించారు. "ఉద్విగ్న, జిగార్" వంటి కవితా సంకలనాలకు సంపాదకత్వం వహించి రుద్రమ ప్రచురణల పక్షాన ప్రచురించారు. "నిర్భయాకాశం కింద" కవితా సంపుటిలో స్త్రీల జీవితంలో గల ఆశను, ఆకాంక్షను పెంపొందింపజేశారు. నిర్భయ చట్టం అమలు, పునరావాస కేంద్రం, పనితీరు పట్ల ప్రత్యేక శ్రద్ధను తీసుకొని సక్రమంగా నిర్వహించే విధంగా చర్యలు, సూచనలు చేశారు. నిర్భయ చట్టంలో డొల్లతనాన్ని, ఆ చట్టం వచ్చికూడా అత్యాచారాలు ఆగకపోవడాన్ని ఆమె నిరసించారు. నిర్భయాకాశం కింద శరీర సౌందర్యం, పురుషాధిపత్య ధోరణి, బానిస బతుకు, చిత్రహింసల జీవనం, అణగారిన జీవనఛాయ, సుఖతత్వం వంటి భావజాలం నుండి విప్లవ పిడికిళ్ళు ఎత్తిన చేతుల వరకు పరోక్ష పోరాటం చేసింది. అందులోని ఒక ఖండిక : 'గులాబీలు జ్వలిస్తున్నాయి'.

'చలింపజేసే సౌందర్యం తమ సొత్తని
మత్తెకించే మాధుర్యం తమ నైజమని
అనుభూతీ అనుభవాలే తమ ఉనికియని
మృదువైన తాజా స్పర్శతో
తన్మయులజేసే ఆ పూతా...
చిదిరి వేయబడిన అత్తరు కావడమే
వాటి జీవిత ధ్యేయం కాబోలని
అందరివలె నేనూ భావించిన - ఆ రోజులో'

ఆడజన్మ మీద ఉన్న ఆంక్షలు, స్త్రీ ఒక సౌందర్య రాశిగానో, శరీర కాంక్షను తీర్చే ఒక మోహనాంగి గానో భావించే స్థితి నుండి బయటపడాలనే ఒక ఉత్తేజం, చైతన్యం మనకు కనిపిస్తుంది. దేశం కట్టుబొట్లు, సనాతన ఆచారాల వల్ల ఆడపిల్ల జన్మ మీదనే వక్రభాష్యం ఏర్పడిన

స్థితిని ఆమె తన కవితల్లో పేర్కొన్నారు. ప్రపంచమంతా ఆడజన్మ పట్ల ఒక బానిస గొడుగు కింద నిరసిస్తుందని, స్త్రీవాదం సైద్ధాంతిక నేపథ్యంలో ప్రపంచ నిర్ణీత సంద ర్భాలు నిలిచి ఉంటాయని చిత్రీకరించారు. అది మనకు 'ఒక ఆడపిల్ల జన్మించిన వేళ!' అనే కవితలో తెలుప బడింది. ప్రపంచ ప్రమాదాల మీద ఏర్పడిన స్త్రీవాదానికి PURD రచించిన 'INSIDE THE FAMILY' అనే కవిత్వాన్ని అనువదించి అంతర్జాతీయ స్థాయిలో కవితా కోణాల్ని ఆవిష్కరించారు.

'నీవు పుట్టిన రోజున నా చిన్నితల్లి
ఓహ్ దేవుడా ! నా కడుపు లోయల్లోకి
ఏదో కూరుకుపోతున్న అనుభూతి
నీవు పుట్టిన ఆ రోజున నా చిన్నితల్లీ!
అది నీరసించిన చీకటిరాత్రి
నా అత్తా ఆడబిడ్డా దీపాలు
వెలిగించడానికి కూడా నిరాకరించారు
మరి నా పతిదేవుడూ యజమాని
నన్ను కఠినంగా ఏమేమో అన్నాడు
ఓహ్ నీ పుట్టుకకు వైభవం
చేకూరనియ్ నా చిన్నితల్లీ!
ఆ సమయాన దేవుళ్ళంతా
ఈ భూమ్మీద నుండి వలసబోయారు'

స్త్రీ అనేక కోణాల నుండి అణగారిపోయిన దుస్థితిని వెల్లడించే ధోరణిలో శతాబ్దాల బానిస శృంఖలాలను తప్పించడానికి స్వేచ్ఛ సమరానికి శంఖం ఊదారు. బానిస సమాజంలో దాసిగా, రాచరిక భూస్వామ్యంలో ఒక అలంకారపు బొమ్మగా, పెట్టుబడిదారి వ్యవస్థలో అంగట్లో మరకపు సరుకుగా, సామ్రాజ్యవాద పాలనలో స్వార్థపు కామక్రీడా వలయంలో స్త్రీ కూరుకుపోయిన విషయాన్ని తెలియజేశారు. సమాజంలో గల సంబంధిత భావాల పరంపరంగా మగ్గిపోతున్న స్థితికి ఇదొక మార్గంగా అనువదింపజేసే ప్రయత్నంగా స్త్రీవాద కవిత్వం ముందుకుపోయింది. పాతివ్రత్యం, సహనం, శాంతం, క్షమా, దయా, త్యాగం, శీలం, అబలత్వం, అణుకువ, అర్హత, మూగతనం వంటివి స్త్రీకి బానిస సంకెళ్ళుగా చిత్రీకరించింది. స్త్రీవాదం నిర్ణయించిన లక్షణాలతో ఉన్నతీకరించే అంశాలను కవిత్వం స్పష్టం చేసింది. బానిస సంస్కృతిలో బతుకు ఈదుతున్న కాలాన్ని తప్పించే ప్రతి ఘటన దీనినుంచే వచ్చింది. బానిసకు బానిస అనే శతాబ్దాల శృంఖలాలను ద్రవీభవింపజేయడం వీరి ప్రధాన ధ్యేయం.

స్త్రీవాద కవిత్వం సాధారణ జనజీవన సమస్యలను ఏకరువు పెట్టింది. స్త్రీ సమాజపరంగా ఎదుర్కొంటున్న స్థితికి కవిత్వం ఒక రూపం ఇచ్చింది. కుటుంబ పోషణలో ఆడవారి భాగస్వామ్యం అధికమే. నిత్యావసర ధరల పెరుగుదల, ఉపాధి కరువు, నిరుద్యోగం, ఇతర సదు పాయాలలేమి అనేవి రాజ్యం వరంగా ఏర్పడి సమస్యలుగా పేర్కొనవచ్చు. దృక్పథం స్త్రీవాద కవిత్వం బలంగా తీసుకొచ్చింది. రాజ్యం నెరవేర్చని సదుపాయాలు, సంక్షేమ పథకాల పట్ల స్త్రీపరంగా చేసే ఆలోచన రాజకీయ వ్యవస్థనే ప్రశ్నిస్తుంది. అవగాహన, రాజకీయ ఆకాంక్ష ప్రకృతి నివేదికలపై సంవీక్షణం వంటి వాటిపై స్త్రీకి సాధికారతను కవిత్వం నిర్దేశించింది. ఇది మనకు అనిశెట్టి రజిత కవిత్వంలో కనిపిస్తుంది.

కవిత్వం పురుషాధిపత్య సమాజాన్ని నిరసించడమే స్త్రీవాదం కాకపోవచ్చు. చుట్టూ సామాజిక స్థితి, రాజ్యం ఆధీనత్వం ప్రధాన హేతువని స్త్రీవాద కవిత్వం పేర్కొం టుంది. రాజకీయ నేపథ్యం స్త్రీవాద వైద్ధాంతికతపై ఆంక్ష లను ఏర్పరిచి చుట్టూ ఒక సంక్లిష్టమైన రేఖతో బంధిం చింది.

స్త్రీ, పురుష సంబంధాలలో ఉన్న డొల్లతనాన్ని ప్రశ్నిస్తూ ప్రగతిశీల భావజాల కవయిత్రిగా గుర్తింపు పొందినవారు జ్వలిత. స్త్రీవాద కవిత్వానికి స్పష్టమైన రూపురేఖల్ని నిర్దేశించింది. సబ్బండ వర్ణాల స్త్రీల సమస్యలను, యాంత్రి కీకరణ దాంపత్యం, కార్పొరేట్ మోజులోపడి కొట్టు మిట్టాడుతున్న కుటుంబాలు, ఆర్థిక వ్యవస్థ వంటివి స్త్రీ

జీవితాలపై అనితర ప్రభావాలను చూపింది. కవిత్వం ఆ దిశగా దృష్టి సారించింది. జ్వలిత రచించిన 'కాలాన్ని జయిస్తూ నేను', 'సుధీర్ఘ హత్య', 'అగ్నిపాపి' వంటివి స్త్రీవాదాన్ని బలంగా చూపిన సంపుటాలు. ఆడ శిశువులు బాల్యంలోనే అనాధలుగా మిగిలిపోతున్న స్థితిని, దానికి గల పరిస్థితులను స్త్రీవాద కవిత్వం సమస్యా అన్వేషణ సాగించింది. దీనికి ఆర్థిక రాజకీయ కారణాలు గానే చిత్రీకరించే ప్రయత్నం సమకాలీన కవిత్వం చేసింది. అనాధ బాల్యంగా ఆడపిల్ల గడుపుతున్న జీవితం, ఆమెపై గల ఆంక్షలు సమాజం సృష్టించిందా? లేక పరోక్ష రాజకీయ ప్రతిబంధకమా? ఈ సమస్యను చాలా గట్టి గొంతుకలలో స్త్రీవాద కవయిత్రులు వెల్లడించారు. అనంతసాగరాల చెలియలికట్టలు అధిగమించే స్వేచ్ఛ లైంగికత్వం ఒక శిశువుని ఏ విధంగా అనాధగా మార్చుతుందో నేటి కవిత్వం చూపుతుంది. దీనినుంచి బాల్యపురోదన విశ్వ మహిషి చెవిన వీణాగానంగా చిత్రీకరించింది. నాన్నమ్మల, అమ్మమ్మల అరణ్య రోదనగా నిలిచింది. 'బాల్యాన్ని పాతరేసిన చోట' జ్వలిత ఆక్రోశించిన కవిత.

అత్యాధునిక యాంత్రిక యుగంలో సమాజంలో చోటుచేసుకున్న విషమ సంస్కృతి ఎంతటి వికృత పరి ణామాలకు దారి తీస్తుందో స్త్రీవాద కవిత్వం స్పష్టం చేసింది. స్వేచ్ఛా లైంగికత, వివాహం కాకుండానే తల్లి కావడం, తల్లి వివాహిత కాకపోవడం, తల్లి సమాజం నుండి వెలివేయబడటం, 'సరోగసి' విధానం, 'గే' సంస్కృతి వంటివి ఆడ శిశువు పుట్టుకకు గుదిబండలాగా మారినాయి.

ఆడపిల్లల కిడ్నాపింగ్, ట్రాపింగ్ వంటివి ఈ రోజుల్లో స్త్రీవాద కవిత్వానికి ఒక పెద్ద సవాలుగా మారింది. కవిత్వం ఆడ పిల్లలు కనుమరుగవుతున్న వైనాన్ని ప్రదర్శించింది. ఏకపక్షంగా ముక్తకంఠంగా కవయిత్రులు ఈ సమస్యమీద స్పందించారు. కిడ్నాప్, యాసిడ్ దాడి, అత్యాచారం, వేట కొడవళ్ళతో హత్య చేయడం, వరకట్న కోరల్లో చిక్కు కోవడం అంతర్జాతీయ స్థాయిలో రక్షణ చట్రాన్ని కబలిస్తున్న సమస్య "కిడ్నాపింగ్". "కనుమరుగవుతున్న నేను"లో జ్వలిత "నవ నాగరికత నగ్న నృత్యమాడుతున్నది కిడ్నా పింగ్ అంతర్జాతీయ క్రీడ" అంటూ ఎద్దేవా చేశారు. రాజ్య అలక్ష్యం, స్త్రీ రక్షణ మార్గంలో విబేధింపబడుతున్న రాజ్యంగ చట్టాలు స్త్రీవాద కవిత్వానికి వస్తువులుగా మారాయి.

అందమైన పువ్వులను
రెక్కలు రెక్కలుగా ముక్కలు ముక్కలుగా
కుత్తుకలు కత్తిరించడం
కొత్త ప్రక్రియ ఇప్పుడు
యాసిడ్ బాంబులు
ఉగ్రవాదుల ఆయుధం గతంలో
ఆమ్ల జల్లులు
అబలలను మార్చడం చూస్తున్నాం.

'స్త్రీకనుమరుగవుతుంది..!' ఈ హెచ్చరిక భవిష్యత్తు మానవ జన్మకు ప్రశ్నార్థకంగా మారింది. భారత జనాభా గణన ప్రకారం కొన్ని నిర్దేశిత ప్రదేశాలలో మగవారి కంటే ఆడవారి నిష్పత్తిరేటు తక్కువగా ఉన్నట్లు గుర్తించింది. ఈ సూచిక రాబోయే తరానికి హెచ్చరికగా భావిస్తుంది. అందుకే చెట్టు, చెరువులను సహజవనరులుగా ఏ విధంగానైతే కాపాడుకుంటున్నామో, సృష్టికి సహేతుకులైన స్త్రీలు కనుమరుగు కాకుండా రక్షించుకోవాలనే ఆకాంక్ష స్త్రీవాద కవిత్వం అంతర్గతంగా సూచించింది.

స్త్రీవాద కవిత్వం అంటే పురుషాధిపత్య సమాజంపై ధిక్కారస్వరం ప్రకటించడమే అవుతుంది. అనేక విధాలుగా స్త్రీపడుతున్న బాధ, వారిపై హింస, పీడన అది పురుషాధిపత్య భావజాలం నుంచే కలుగుతుంది. కుటుంబ పెత్తనం నుండి రాజకీయ వ్యవస్థ వరకు ప్రతి నిర్ణయాత్మకశక్తి పురుషుడి ఆధిపత్యంపైనే ఉంటుంది. పౌరహక్కులు, పంచాయతీ వ్యవస్థ, రాజ్యాంగ సవరణలు పురుషుడి భావజాలం దిశగా సాగుతున్నాయని స్త్రీవాదులు ప్రతిఘటిస్తున్నారు. రాజకీయ ప్రభావంతో ధ్వంధ్వవైఖరిని ప్రదర్శిస్తున్న వివిధ పార్టీలు, ప్రభుత్వం అన్నీ స్త్రీల

హక్కుల మీద నీళ్ళు చల్లుతున్నాయని విమర్శించారు. జ్వలిత 'రోగగ్రస్త స్తన్యం' కవితలో...

వెనకకు నెట్టబడి నెట్టబడి
నేను శతాబ్దాలుగా
రోగగ్రస్త స్తన్యాన్ని కుడుస్తున్న శాపగ్రస్తను
కూటికి గుడ్డకే కాదు
బ్రతికే హక్కును కోల్పోతున్న
గంధర్వ పతులు లేని సైరంధ్రిని
కొత్త కలలు కంటున్న త్రిజటని
జండర్ అంటే వర్గం కాదని
రాయితీలు రిజర్వేషన్లు
మనకు చెందబోవడం లేదని
కొత్త కాంక్షకాని పాత అవసరాన్ని
నిజం చేసుకోవటానికి
చట్టం చెయ్యి కాల్చక ముందే
ఆకులు వెదకాలి రండి

అంటూ రాజ్యం మహిళలపై చూపుతున్న అలసత్వాన్ని, నిర్లక్ష్యాన్ని స్త్రీవాద కవిత్వం దుయ్యబట్టింది. పార్లమెంట్‌లో మహిళా బిల్లును ఆమోదించలేకపోవడానికి రాజకీయంగా పురుష సంస్కృతి బలమైన ప్రభావాన్ని చూపుతుందని తెలియజేసింది. మహిళల రిజర్వేషన్లపై అవకతవకలకు పాల్పడడం, మహిళల ఆత్మగౌరవాన్ని, హక్కులను కాళ్ళ రాయడమే అవుతుందని మండిపడింది. సంవత్సరాలుగా కొనసాగుతున్న రాజకీయ హక్కుల సాధన మీద పోరాటాన్ని అంతమొందించడానికి కుట్ర జరుగుతుందని, మహిళా రిజర్వేషన్ల బిల్లుపై ఆంక్షలు ప్రతిబంధకాలు రాజకీయ పార్టీలు సృష్టిస్తున్నాయని ఖండించింది. సాలెగూళ్ళ లాంటి రాజ్యపాలన ఈ దుర్భర పరిణామానికి నిదర్శనం. 'కోటాలో కోటా లేదంటూ... కొల్లగొడుతున్న కొల్లాలు వాదం' అనేది మహిళా బిల్లుపై చూపుతున్న అవ్యక్త ప్రతిపాదిత కవిత్వం.

'మునుం' తెలంగాణ కవితా సంకలనంలో కొల్లాపురం విమల 'శాల' కవితలో స్త్రీత్వాన్ని అందరికంటే భిన్నంగా, శక్తివంతంగా ఆవిష్కరించిన విధానం ఈ కవితలో చూడవచ్చు.

పూసిన మోదుగుపూల అగ్గిసెగలో
మోహపు కొలిమి రగిలి
మనసు విరిసి
మొట్టెలు పారాసిన వివశను
ఎల్లమ్మను
కరుడు గట్టిన కాలాన్ని సైతం
శిశువుగా మార్చే నగ్న సౌందర్యం నాది

పితృస్వామ్య వ్యవస్థలోని ప్రతిఫలనాలు తల్లి పెంపకంలో కనబరిచే స్త్రీ పురుష వివక్షను నెల్లుట్ల రమాదేవి తన కవిత్వంలో వెలువరించారు. అమ్మాయిలు వివక్షకు గురవుతున్న స్థితిని 'కొత్త కాంతి ఎప్పుడో' కవితలో తెలియజేశారు. మగ, ఆడ బిడ్డల మధ్య తారతమ్యతను విభేదించారు.

నాగరిక సమాజం వికృత రూపం దాల్చిన వ్యాపార సంస్కృతిలో స్త్రీని ఒక ఆట వస్తువుగా మారుస్తున్న వేళ, స్త్రీని సౌందర్యాత్మక హింసకు బలిచేస్తున్న సమాజంపై నిరసన వ్యక్తం చేసిన కవిత 'మనస్సు భాష' కవితా సంపుటిలో ఉంది.

పోరాడాల్సిన శత్రువు చేతికి
మనమే ఆయుధమైనప్పుడు
విజయం మాటెక్కడ
జాలరి పట్టే చేపలమూ మనమే
ఎరలమూ మనమే
ఈ నాగరిక అరణ్యంలో
వేటాడబడుతున్న లేళ్ళమూ మనమే
వేటగాడి బాణాలమూ మనమే

ఎన్.అరుణ తన 'మౌనమూ మాట్లాడుతుంది' అనే కవితా సంకలనంలో స్త్రీ తరతరాలుగా అణచివేయ బడుతున్న దుస్థితిని వివరించారు.

ఇప్పుడు విచారించేం లాభం
ఆ మాటల గారడీ తీరే అంత

'సుకుమారి' అంటే
అవుననుకున్నాను
'లతాంగి' అంటే
మెలికలు తిరిగిపోయాను
'అసూర్యంపశ్య' అంటే
గదిలోకి వెళ్ళి తలుపేసుకున్నాను
పాతివ్రత్యం, మాతృత్వం
సెంటిమెంట్ ప్యాకింగుల్లో
ఎంత నలిగిపోయానో!
వ్యక్తిత్వం, ఆత్మగౌరవం
ఎన్నిసార్లు గాయాలకు గురయ్యానో!

స్త్రీలపై జరిగే అత్యాచారాల విషయంలో పితృస్వామ్య వ్యవస్థకు ఎంత పాత్ర ఉందో పురుషుడికి అంతే పాత్ర ఉందని భండారు విజయ అభిప్రాయం. రాజ్యం పురుషుడికి అధికార పగ్గాలను ఇచ్చిందంటారు. రాజ్యం, పితృస్వామ్యం రెండూ ఒక్కటేనన్న భావనను వెల్లడించారు. సూటిగా, పదునైన మాటలతో అత్యాచారాల వికృత సమాజాన్ని వ్యక్తీకరించారు. 'ఆహ్వానం' కవితలో అత్యాచారాల కోణాన్ని ఖండించారు.

పురుషాధిపత్య సమాజంలో ఆడవాళ్ళు ఎలా అవమానాలకు, అత్యాచారాలకు గురవుతున్నారో పై కవిత నిరూపిస్తుంది. రాజకీయ వ్యవస్థను తీవ్రంగా పరిగణిస్తూ, రాజ్యాంగం ఇచ్చిన హామీని నిలబెట్టుకోని సందర్భాలను గుర్తుచేశారు. స్త్రీల సంక్షేమం పట్ల రాజ్యవ్యవస్థ ద్వంద్వ వైఖరిని కవిత్వంలో వ్యతిరేకించారు. పురుషుడిలో అసందర్భంగా పుట్టే వికృత కామవాంఛను భండారు విజయ తన కవిత్వంలో చాలా గట్టిగానే ప్రతిఘటించారు.

'వాడికి ఒళ్ళంతా అంగాలే
వాడి మనసంతా రాటుదేలిన విషపు ముళ్లే
వాడికి మనోవికారం ఎప్పుడు పుడుతుందో
వాడి అంగం ఎప్పుడు నిక్కబొడుస్తుందో
ఎప్పుడు మొనదేలి ఎగిరి పడుతుందో
ఎవరివైపు తిరిగి చీల్చివేస్తుందో
వాడిని చిత్రించిన వాడికి కూడా తెలియదు'

స్త్రీత్వ భావనను తెలంగాణ రచయిత్రులు తమ కవిత్వంలో అద్భుతంగా ప్రదర్శించారు. కొలిపాక శోభారాణి గతవైభవ కీర్తిని ప్రశంసిస్తూ తెలంగాణ బిసి పోరాట మహిళలు చూపిన తెగువ, సాహసం ఎటువంటివో తెలిపారు. స్త్రీత్వ భావనలో ధైర్యం, సామర్థ్యం చూపిన వీర వనితల ప్రశస్తిని అవలోకించాలి. భర్తను, కొడుకును పోగొట్టుకున్న తల్లులు, పిల్లలు, బాలింతలు సైతం ఆనాడు నైజాం ముష్కరుల దాడులకు ఎదురొడ్డి నిలిచిన సంఘటనలు పోరాటానికి ప్రత్యక్ష సాక్షి భూతంగా నిలిచాయి. ఆడపిల్ల ఆడపులిగా తిరగబడి నిలిచిన చిట్యాల అయిలమ్మ చారిత్రక స్ఫూర్తిని కొలిపాక శోభ క్రింది కవితలో వివరించారు.

స్త్రీలను, సంసారాలను
ఆగవలాగం చేసి సంసారాలు
తెగిన ప్రాణాలు
కొల్లగొట్టిన బ్రతుకులు

అయిలమ్మ త్యాగాలను కీర్తిస్తూ కొలిపాక శోభారాణి తెలంగాణ స్త్రీత్వ భావనను ముద్రించారు. 'తొడగొట్టి ఎదురొడ్డి నిలిచింది, చిట్యాల అయిలమ్మ, ఆమె పాల కుర్తి కోడలమ్మ' అంటూ తెలంగాణ సాయుధ పోరాటంలో స్వశక్తిని చూపిన మహిళగా చిత్రించారు.

'కాలజ్ఞానం' అనే కవితలో గోగు శ్యామల తెలంగాణ ఉద్యమ రూపురేఖలను వివరించారు. అన్యాయమైన తెలంగాణ స్థితిగతులను, సెల్కలు ఎడారి అయిన విధానాన్ని తెలియజేశారు.

"చాకలి ఐలమ్మ తెగింపు
యాదవ సంగం లక్ష్మీబాయి నీతి
మాదిగ సదాలక్ష్మి నాయకత్వం
మాల ఈశ్వరీబాయి పౌరుషం

వంటివి తెలంగాణ తరుణికి మెండుగా ఉన్నాయని కవయిత్రి ధీమా వ్యక్తం చేశారు.

'తెగించి కొట్లాడుడే' అన్న కవితలో తిరునగరి దేవకీదేవి

'అచ్చమాంబనై ఆయుధం పట్టిన దాన్ని
పాలకుర్తి అయిలమ్మనై
నా పాలు గింజల్ని దక్కించుకున్నదాన్ని
పోరాటమే ఊపిరిగా వడిసెలతో
శత్రువును ఉక్కిరి బిక్కిరి చేసినదాన్ని'

అంటూ తెలంగాణ ఉద్యమ పంథాను వివరించారు. తెలంగాణాలో జరుగుతున్న అక్రమాలను, నీళ్ళులేక - నిధులందక రైతులు పడుతున్న అగచాట్లను, ఆంధ్రుల దురాక్రమణలతో కొనసాగిస్తున్న వ్యాపారుల లబ్ధిని పేర్కొన్నారు.

'ధిక్కార' సంకలనాన్ని చంటి ప్రసన్న కేంద్రం ట్రస్ట్ వారు ప్రచురించారు. ఇది అత్యాచారాలపై అగ్నిధార, అంకుశం సంధించి ఉరి బిగించిన ఘీంకారగా అభివర్ణించారు. 'ఉద్విగ్న' కవితా సంకలనాన్ని రుద్రమ ప్రచురణలు వెలువరించారు. అత్యాచార భారతంపై ఓరుగల్లు కవుల నిరసనను ప్రకటించారు.

కులం పుట్టిన నాటి నుండి కుల పితృస్వామ్య పీడనకు గురి అవుతూ దళిత స్త్రీవాదం వెలువరింప బడింది. దళిత స్త్రీలు అనుభవిస్తున్న శారీరక, మానసిక హింసను కవిత్వంగా నివేదించారు. స్త్రీవాదం జండర్ వర్గంతో పోరాడితే దళిత స్త్రీవాదం జండర్ వర్గంతో పాటు కుల వర్ణాలను కూడా ఎదురుకోవలసి వచ్చింది. సాంఘిక ఆర్థిక సామాజిక అంశాలను జండర్ దృక్పథంలో దళిత స్త్రీవాద ఉద్యమానికి అనుసరణీయంగా నిలిచాయి. ఈ నేపథ్యంలోనే దళిత స్త్రీవాదం ఒక సాహిత్యంగా బయట పడింది. దళిత కవయిత్రిల జండర్ స్పృహకు శతాబ్దాల పోరాటాలలో చాలా దగ్గరి సంబంధం ఉంది. సామాజిక ఉద్యమాలు, దళిత పోరాటాల ఉద్యమం నుంచి నేటి ఆత్మగౌరవ ఉద్యమాలు, దళిత మానవ హక్కుల ఉద్యమాలు, వాటి లక్ష్యాలు, లక్ష్యసాధనకు అవి అవలంభించిన విధానాలు, వాటి భావజాలాలన్నీ కూడా దళిత కవయిత్రులు తమ భావాలను వ్యక్తీకరించడానికి నేపథ్యాన్ని అందించాయి.

గోగుశ్యామం, జాజులగౌరి, జూపాక సుభద్ర, చల్లపల్లి స్వరూపారాణి, మేరీ మాదిగ వంటివారు వర్తమాన దళిత స్త్రీవాద కవిత్వాన్ని వెలువరిస్తున్నారు. 'మాకు గోడలు లేవు' అన్న స్త్రీవాదులు కులం గోడలను పదిలిపెట్టలేకపోయిన స్థితిని దళిత స్త్రీవాదులు ఎత్తిచూపారు. దళిత స్త్రీ తాము తమ కుటుంబ పురుషాధిపత్య సమాజం నుండి గాక, అగ్రవర్ణ స్త్రీల ఆధిపత్యం నుండే పీడన, హింస ఎదుర్కొంటున్నాయని వారి వాదన. నీలిమేఘాలలో ప్రచురింపబడిన వంటిల్లు విమల కవిత్వాన్ని చెల్లపల్లి స్వరూపారాణి దళిత స్త్రీవాదంలో ప్రతిఘటించిన స్థితి 'ఆహ్వానం' కవితలో గమనించవచ్చు.

వంటిల్లు - విమల :

'మా అమ్మ, అమ్మమ్మ
ఇంట్లో అమ్మలంతా ఇక్కడే స్త్రీలయారంట
గిన్నెలు, డబ్బాలు, బస్తాలలో
రకరకాల శవాలు నిండిన స్మశానంలా
మా వంటిల్లు
తడి కట్టెలపొగ మేఘాల మధ్య
మా వంటిల్లు వేలాడుతూ ఉంటుంది
భయం, భయంగా, నిశ్శబ్దంగా, నిరాశగా
మా అమ్మొక ప్రేతంలా తేలుతూ ఉంటుందిక్కడ
అసలు అమ్మే నడుస్తున్న వంటగదిలా ఉంటుంది'

ఆహ్వానం - చల్లపల్లి స్వరూపారాణి

'కురవడం నేర్పిన నా నీలిమేఘమా
నీ ప్రశ్నల చినుకులు
అన్నీ అమలిన వంటింటి దాకా వచ్చాయి గానీ
అసలు యిల్లే లేని మా వాడు
రాళ్ళపాయ్యి గుమ్మమైనా తొక్కలేదేం'

అదే నీలిమేఘాలలో ప్రచురింపబడిన జయప్రభ 'పైటను తగలెయ్యాలి' కవిత్వానికి నిరసనగా జూపాక

సుభద్ర 'కొంగున బొబ్బెమీద కావలుండే బొంత పేగ్గాడు' దళిత స్త్రీవాద నేపథ్యంలో కవిత్వాన్ని వెలువరించారు.

జయప్రభ - పైటను తగలెయ్యాలి
పైట। ఊబిలో నన్ను గుంజేస్తూ ఉంటుంది
పైట। సుడిగాలిలా నన్ను తోసేస్తూ ఉంటుంది
నామీద। తరాల నుండే మోపిన। అపనిందపైట
నన్ను అబలని చేసిన। పితృస్వామ్య
అదృశ్యహస్తం పైట
దోపిడీ సంస్కృతి। నా వ్యక్తిత్వాన్ని శవంగా
చేసిన దానిపైన కప్పిన తెల్ల దుప్పటి పైట
నేను నడితే శవాన్ని కాకుండా ఉండాలంటే
ముందుగా పైటని తగలెయ్యాలి
పైటని తగలెయ్యాలి.
జూపాక సుభద్ర - కొంగునా బొబ్బెమీద కావలుండే
బొంత పేగ్గాదు.
కొంగు నా ఆకలిని ముడేసుకొని
నా గడుపు కర్సుకొని కట్టుమీని మైసమ్మోలె
కావలి బంటది
కూలినాలికి నేను సెమట కాల్వనైతే
పిల్లగాలై అద్దుకుంటుంది
కాయగడ్డలకు, గాసం గింజలకు
కోమటి దినుసులకు
సుక్కల్ని పొదుపుకున్న సందమామోలె
నా నెత్తిన మాటై మెరస్తది
సేండ్లల్ల సెల్కల్ల అలిసి సొలిసి పుల్ల సీలితె
పక్క బట్టై పుర్సతిస్తది

సామాజిక ఉద్యమం మొదట విశాల ప్రాతిపదిక మీద సామూహిక సాధారణ దృక్పథంలో నుండి పుడుతుంది. తరువాత సామాజిక వైరుధ్యాలు బయటపడుతాయి. ఉద్యమం నడుస్తున్న క్రమంలో ఒక నిర్దిష్టత రూపు దిద్దుకుంటుంది. దీనికి తెలంగాణ స్త్రీవాదం ఒక మంచి దృష్టాంతం. మొదట స్త్రీలందరూ ఒకటే అన్న భావనతో ప్రారంభమయింది. అందరూ పీడిత వర్గానికి చెందినవారే. ఆ క్రమంలో నుండి దళిత స్త్రీవాదం ఉద్భవించింది. తెలంగాణ దళిత స్త్రీవాదం బలమైన అస్తిత్వాన్ని ప్రదర్శించింది. 'మట్టిపూలు' ద్వారా బహుజన భావజాలం నిర్దిష్టతను పేర్కొన్నది. జూపాక సుభద్ర కవిత్వం తెలంగాణ దళిత స్త్రీ వాదానికి సైద్ధాంతిక బలాన్ని చేకూర్చింది. స్త్రీలందరూ ఒక్కటి కాదు, స్త్రీలు కూడా కులం పేరుతో విభేదింపబడుతున్నారని పేర్కొన్నది. తెలంగాణ దళిత స్త్రీ వాదానికి తాత్వికతను అందించే కవిత ఇది.

జాజుల గౌరి నల్లపొద్దు కవితా సంకలనంలో దళిత స్త్రీ ఎంతటి నీచమైన బతుకును సాగిస్తుందో తెలియ జేశారు. సమాజంలో కడజాతి స్త్రీ అగచాట్లను ఏకరువు పెట్టిన కవిత ఇది.

తరతరాల చరిత్ర పుటల్లో
తగలెయ్యబడ్డ వాస్తవాన్ని
అమాయకత్వపు అంచున నిలిచి
దగాకోరుల దర్పానికి
మగ అహంకారానికి
బలైపోయిన దళితురాలిని
అభం శుభం తెలియని బేలతనాన్ని

పోరాటాలు, ఉద్యమాలు దళిత స్త్రీలు చేస్తుంటే వాటి ప్రయోజనాలు గౌరవాలు పొందేది పురుషులు, అగ్రవర్ణ స్త్రీలు అంటూ ఆక్రోశాన్ని ప్రకటిస్తూ మేరీ మాదిగ కవిత రచించారు.

ఉద్యమాలు ఊపందుకునే వరకు
దళిత స్త్రీలను ఉపయోగించుకుంటారు
ఉద్యమానికి ఊపిరి పోసిన వారి ఊసే ఉండదు
బాధలు మావి ప్రయోజనాలు వారివి

షహనాజ్ ఫాతిమా, షాజహానా, షంషాద్, యాస్మిన్ బేగం, జరీన్‌బేగం, రజియాసుల్తానా వంటి కవయిత్రులు కవిత్వం రచించారు. ముస్లిమేతరులైన రాజ్యలక్ష్మి, గీతాంజలి వంటివారు ముస్లిం స్త్రీవాద కవిత్వం రచించారు. షాజహానా రచించిన 'అమ్మ నవ్వేది నాన్న' కవితలో

ముస్లిం స్త్రీల ఆవేదన కనిపిస్తుంది. సామాజికంగా, ఆర్థికంగా చితికిలబడిన ముస్లిం కుటుంబాలలో ప్రతి ముస్లిం గృహిణి అనుభవిస్తున్న స్థితి కళ్ళకు కడుతుంది.

నాన్నా... నాన్నా...!
అమ్మ మొహంలో జీవం లేదేం?
ఎప్పటిదో మీ ఇద్దరి బ్లాక్ అండ్ వైట్ ఫోటోలో
అమ్మ
నెలవంకలా నవ్వుతుంటే
ఎంతందంగా నవ్వుతుందో
మళ్ళీ ఒకసారి అమ్మని నవ్వమని
అచ్చం అలానే నవ్వమని చెప్పవా...!
ఇప్పుడిక ఎవరూ అలా నవ్వలేరు
రేష్మా నవ్వింది చిన్నప్పుడు
కల్తీ లేని నవ్వు
ఇప్పుడు దానికి ఇరవయ్యేళ్ళు
అప్పటికీ ఆ నవ్వులో ఎన్ని రంగులో కలిపి
దాన్నవ్వు అది మర్చిపోయింది
అందరం ఎక్కడ మర్చిపోయామో...!
ఇన్ని నవ్వుల్ని ఒక్క దగ్గరే పోగేస్తే ఎలా ఉంటుంది
స్వర్గం అంటారే... అది కనబడదు!!
కానీ ఇలాంటి స్వర్గాలు నీకక్కర్లేదు నాన్నా!
నీకు పక్కింటి ఆంటీ నవ్వు కావాలి
ఖాదర్ బీ డబ్బు కోసం నవ్వే కక్కుర్తి నవ్వు కావాలి
ఆ ప్లాస్టిక్ నవ్వులకు పాకులొడ్డం
అలవాటయిన నీ కళ్ళకి
అమ్మ నవ్వు రెక్కల్రాల్చుకుందని గానీ
అమ్మమనసు కన్నీళ్ళు రాలుస్తుందని గానీ
అక్కర్లేదు నాన్నా...

ముస్లిం కుటుంబాలలో ఉన్న బహుభార్యత్వం, బుకఖా పద్ధతి, అసంఖ్యాక సంతానం, పేదరికం, గల్ఫ్ వలసలు, ముస్లిం ముసల్మాన్ వృద్ధులలో ముస్లిం బాలికల షాదీలు, తలాఖ్ వ్యవస్థ, పురుషాధిపత్యం, పితృస్వామ్యం వంటివి కవితా వస్తువులుగా ముస్లిం స్త్రీవాద కవిత్వం వెలువరింపబడింది.

దక్షిణ భారతదేశంలో సామాజిక పరివర్తన వేగం పుంజుకున్న సమయంలోనే సాహిత్యంలో విభిన్నాంశాల మీద కవిత్వం వెలువరింపబడింది. జ్యోతిరావుపూలే, సావిత్రీబాయి పూలే సంఘసంస్కరణ ఉద్యమాలు బహు జన వాదాన్ని పటిష్టపరిచాయి. కులసమస్య, అంటరాని తనం, ఉత్పత్తి కులాల జీవితాలు, కుల వృత్తులు, సిద్ధాంత దృక్పథాలు చర్చించబడ్డాయి. ఆ క్రమంలోనే బీసీ కులాల జీవితాలు, సమస్యలు, సిద్ధాంత దృక్పథాలు కూడా చర్చనీయాంశాలుగా రూపుదాల్చాయి. బీసీ సాహిత్య ఉద్యమం వేగం పుంజుకుంది. సాహిత్యాన్ని మళ్ళీ కొత్త చూపులే అధ్యయనం చేయడం మొదలైంది. సామాజిక సంస్థల ఐక్యవేదిక అందించిన సిద్ధాంత భూమిక నుండి సామాజికోద్యమాలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ ఉద్యమాలు, సాహిత్య ఉద్యమాలు తెలుగు సాహిత్యంలో కవిత్వ ధోరణిగా ఏర్పడ్డాయి. ఆ క్రమంలో ఉద్భవించిందే బీసీ స్త్రీవాద కవిత్వం.

అనిశెట్టి రజిత, తాయమ్మ కరుణ, జ్వలిత, వడ్డ్యాల సూర్య, సమ్మెట ఉమాదేవి, దాసోజు లలిత, నామని సుజనాదేవి, అడువాల సుజాత, శారదా హన్మాండ్లు, కొలిపాక శోభారాణి, త్రివేణి బీసీ కులాలు, కులవృత్తులు, బీసీ స్త్రీల జీవితాలు, బాధలు కష్టాలను కవిత్వంగా చిత్రించారు. దళిత స్త్రీవాద కవిత్వం అగ్రవర్ణ స్త్రీ మానసిక, శారీరక పీడన, హింసను ప్రశ్నిస్తూ ఏవిధంగా వెలువ రింపబడిందో అదే విధంగా బీసీ స్త్రీవాద కవిత్వం కూడా అగ్రవర్ణ స్త్రీల అహంకారపు కోరలను ప్రతిఘటించడానికి సిద్ధంగా ఉంటుందని కవయిత్రులు ప్రతిన పూను తున్నారు. ఇది జ్వలిత కవిత్వంలో ప్రత్యక్షమవుతుంది.

'నాపై ఒక మహిళ అత్యాచారం చేసూంది' కవిత్వంలో జ్వలిత దశాబ్దాలుగా అగ్రవర్ణ స్త్రీల మనోభిమతంతో వేగలేక విసిగి వేసారి ఆకావికలమైన మనసును ఆవిష్క రించారు.

నాపై ఒక మహిళ అత్యాచారం చేసూంది
ఒక సమూహ 'రుడాలీ'లు నా శవం చుట్టూ

స్నేహం నటిస్తూ కల్లబొల్లి కన్నీళ్ళు కారుస్తూ
నరకంలో రెక్కలు తొడుక్కునే అనాథ కథా
నాయికకు
ఏకైక సామూహిక స్వలింగ అత్యాచారం నాపై...
నేనంటే పని అని
పడకంటే పని మాత్రమే అని ఒకటి
నన్ను వెంటాడి వేటాడి బలి తీసుకుంటూ
అనేక మొగ్గ ఆమెలు
వేటకు బలియై అభియోగించబడుతూ నేను
తండ్రి ఆస్తిలో హక్కు అడుగుతానని ఒకటి
తన కులం పేరుతో
నా కులం మీద అత్యాచారం
కులుకే గాని 'పలుకే' లేదని
అసలు నాకు ఉనికే లేదని ఒకటి
ఎక్కడ ఏ గడ్డినా మేసి
నా దొడ్లే ఈ నీతే చాలంటూ
కొత్తగా అస్పష్టంగా మరో అత్యాచారం
పోస్ట్‌మార్టానికి సిద్ధం చేస్తూ...

తెలంగాణ మట్టి పరిమళాన్ని తెలుగు నేలకంతటికి విరజిమ్మిన కథా రచయిత్రి అనిశెట్టి రజిత. బిసి కులాలలోని మహిళల కడగండ్లు, కష్టాలు కథా రచనల్లో వెల్లడించారు. ఆమె కథలు కల్పనలు కావు. వివిధ వాస్తవ సంఘటనలు, విషయాలు ఆమె కథలకు వస్తువైంది. రచయిత్రి స్వాభావిక నేపథ్యం ఆమె కథల్లో ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. నూరేళ్ళ కథా సాహిత్యరచనలను పరిశీలించి అపారమైన లోకజ్ఞానాన్ని పొంది, తదనుగుణమైన కథా రచనకు స్ఫూర్తిని సాధించారు.

❁❁❁

BHAVAVEENA
Vol. 17, Issue. 7, July 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

తెలంగాణ రాష్ట్రంలో దళిత ఉద్యమ కవిత్వం

- గైని రవి, రీసెర్చ్ స్కాలర్, తెలంగాణ విశ్వ విద్యాలయం, డిచ్‌పల్లి, నిజామాబాద్

'మాఊరి సఫాయే సిపాయి' లక్షలు గురిప్తిం... మీ చేత మలాన్నెత్తగలరా? / మానవీయతను పొక్కిస్తం... పాకీవృత్తిని చేపడతారా?" (పు: 29, సఫాయిలం) అని ఈ నవ సమాజాన్ని అడగడం అనేది గొప్ప ధైర్య సహసమే అవుతుంది. ప్రతీ ఊల్లో సఫాయి కర్మచారులు ఉంటారు. ఈనాడు కరోనా కోవిద్-19 ప్రపంచ వ్యాప్తంగా ఎంత కల్లోలం చేస్తుందో అందరికీ తెలుసు. ప్రాణ భయంతో ఇంట్లోనే ఉండు, సేఫ్‌గా ఉండు అనే నినాదాన్ని కళ్ల ముందు నిలబెట్టుకొని బతుకు జీవనం కొనసాగిస్తున్నారు. ఇటువంటి పరిస్థితిలో సఫాయిల పాత్ర అత్యంత అమోఘమైంది. అటువంటి సఫాయి తరపున కవి నిలదీసి అడుగుతుండడం పై పంక్తులలో మనకు కనపడుతుంది. ''.....తల్లావు తన్నిన దగ్గర్నుంచి/ దాని లండు సూపులకస్త్ర/ నా "అన్నలంతా" దూరంగా "సెట్లల్లోకి పారి పోయారు" (పు:9 మాదిక్కేక) అని గ్రామాల్లో పెద్ద పెద్ద చదువులు చదువుకున్న వారంతా గ్రామాల్లో ఉండలేక అడవుల్లోకి పోయి వారి శేష జీవితాన్ని గడుపేవారని కవి ఆలోచన. అనగా మేధావులైన వారి సాధికార ఆలోచనంతా అడవిలో కాచిన వెన్నెలగా అయిందని తెలిపారు. "దేశాన్ని పర్యావరణ విపత్తుకు బలిసేసే పశువా! తాటాకు కబురులు కట్టిపెట్టి/ ఏకువనే లేసి ఏతాము పట్టగలవా?/ రేయింబవళ్లు గూడేయగలవా?/ పానుపులకు పరిమిత మైన నీ తనువు/ పడిగాడుపు లుండగలదా? / ఉంటే నీవన్నట్లు నేను లేజీ ఫెలనే" (పు: 15 మాదిక్కేక) అని తనను ఈసడించుకున్న వారిని, పర్యావరణాన్ని పాడు చేసిన ద్రోహులను ప్రశిస్తున్నాడు కవి. ''సచివాలయ ఆల్మారాల సాక్షిగా/ అట్టడుగున పడిన ఫైళ్లలో / వేల బ్యాక్‌లాగ్ పోస్టుల చూస్తూ/ మూలుగుతున్న అస్థి పంజరాలు వేలాడి పోతున్నాయి/ ప్రాణాలు బిగబట్టుకున్న యూనివర్సిటీలో యువనెత్తురు/ నీరై కారిపోతుంది" (పు31, వర్గీకరణే హైటెక్ ఔషధం) అని నిరుద్యోగ యువత భవిష్యత్తే కాదు దేశానికి వారొనర్చే శక్తులన్నీ నాశనం చేయబడుతున్నాయని కవి ఆవేదన చెందుతున్నాడు డా॥. గుండెడప్పు కనకయ్య.

తెలంగాణ విశ్వవిద్యాలయం తెలుగుశాఖలో డా॥. పి.కనకయ్య 2011 నుండి ఆచార్యులుగా పని చేస్తున్నారు. కరీంనగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల గోదావరి ఖనిలో అధ్యాపకులుగా 1996 నుండి కొనసాగుతున్నారు. హైదరాబాద్‌లోని యాకుత్‌పుర ఓల్డ్‌సిటీలో గల ధర్మవంత్ కాలేజ్ ఆప్ సైన్స్ అండ్ కామర్స్‌లో అధ్యాపకులుగా సీనియర్ అధ్యాపకులుగా (యూజిసీ స్కేల్) బోధనను కొనసాగించి 2008 మార్చిలో తెలంగాణ విశ్వవిద్యా లయంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగంలో చేరాడు. ఈయన 2002 ఏప్రిల్ నుండి నేటివరకు అనగా 18 సంవత్సరాలుగా తెలుగు శాఖాధ్యక్షులుగా కొనసాగడం విశేషం. వివిధ కారణాల వలన చదువు వదిలేసిన వారికి చదువు చెప్పించి ప్రయోజకులను తయారు చేసే సికింద్రాబాద్‌లోని అరుంధతీయ ఎడ్యుకేషనల్ సంస్థలో డైరెక్టర్‌గా పనిచేసారు. అలాగే తెలంగాణ విశ్వవిద్యా లయంలో ఒక ఫిల్లర్‌గా 2008 నుండి వైస్ ప్రిన్సిపాల్‌గా ఒక సంవత్సరం, ప్రిన్సిపాల్‌గా 5 ఏండ్లు, అడ్మిషన్ డైరె క్టర్‌గా 5 ఏండ్లు, కంట్రోలర్ ఆప్ ఎగ్జామినేషన్స్‌గా ఒక సంవత్సరం, కళల విభాగపు డీన్‌గా 7 ఏండ్లు పనిచేసారు. ప్రస్తుతం తెలంగాణ విశ్వవిద్యాలయంలో తెలుగు అధ్య యన శాఖకు అధ్యక్షులుగా, చైర్మన్ బిఓఎస్‌గా, కళల విభాగపు డీన్‌గా, అకాడెమిక్ ఆడిట్ సెల్‌కు డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. అలాగే తెలంగాణ రాష్ట్ర సామాజిక ఆర్థిక సాంస్కృతిక పరిశోధనా అధ్యయన సంస్థకు డైరెక్టర్‌గా 2012 నుండి కొనసాగుతున్నారు.

పబ్లికేషన్స్ మొత్తం 22 గ్రంథాలు:స్వీయ రచనలు:

తెలంగాణ రాష్ట్రంలో దళిత సాహిత్య ఉద్యమ నేపథ్యంగా వచ్చిన మొట్టమొదటి రచనలు : 1) మాదిక్కేక-మొదటి దళిత మాదిగ కవితా సంపుటి -1997, 2) మేమిట్లుండం -మొదటి దళిత కథల సంపుటి - 1998, 3) వీణవంక -నవరసాలను చిత్రించిన మొదటి దళిత కవితా సంపుటి -2000, 4) రాజశేఖరా మోజు తీరలేదురా! -దీర్ఘ దళిత కవితా సంపుటి -2008, 5) ఛేంజ్ -1995 దళితేతరులలో పరివర్తన కోరే కవిత్వం, 6) దళిత దరువులు -ఎస్సీ వర్గీకరణ మీద మొదటి దళిత నానీల కవితా సంపుటి -2008, 7) వర్గీకరణే హైటెక్ ఔషధం -ఎస్సీ వర్గీకరణ మీద మొదటి దళిత దీర్ఘకవితా సంపుటి -2008, అర్జునుడు మాదిగోడే పరిశోధనా గ్రంథం, దళిత రత్న నవల, మేమిట్లుంటాం కథలు, పండుగలు పుట్టు పూర్వోత్తరాలు పరిశోధన, మావూరు నవ్వింది నవల మొదలగునవి.

విమర్శనాత్మక పరిశోధనా రచనలు :

ప్రజలమనిషి నవల -తెలంగాణ జీవితం -1996, 9) సమసమాజ నిర్మాణంలో జానపద సాహిత్యం- విమర్శనాత్మక పరిశోధన-1996, 10) సమసమాజ నిర్మాణంలో దళిత నవలా సాహిత్యం- విమర్శనాత్మక పరిశోధన -1997, 11) సమసమాజ నిర్మాణంలో భారతీయ దళిత సాహిత్యం -తులనాత్మక విమర్శ -1997, 12) వట్టికోట ఆళ్వారు స్వామి ప్రజలమనిషి, పెరల్స్ బక్స్ ది గుడ్ ఎర్త్ నవలల్లో సామాజిక స్పృహ- తులనాత్మక అధ్యయనం -(ఎంఫిల్ పరిశోధనా గ్రంథం) 1998, 13) తెలంగాణ భాషా సౌందర్యం (కరీంనగర్ జిల్లాకు పరిమితి)-2000, 14) దళితగీత -(పరిశోధనాత్మక వ్యాసాలు) -2002, 15) తెలుగు కన్నడ నవలల్లో దళిత సమస్యలు -తులనాత్మక అధ్యయనం (డా॥ కేశవరెడ్డి, డా॥ ఎస్ ఎల్ భైరప్ప నవలకు పరిమితి - 2002), 16) తెలంగాణ భాష -సామాజికాంశాలు - చర్చ (2006), 17) తెలుగు సాహిత్యంలో విమర్శకులు - తులనాత్మక విమర్శ - (సినారె-ఇనాక్ -జీవిఎన్‌లకు పరిమితి-2009), 18) కనకపు పత్రాలు తెలుగు సాహిత్యంలో కొత్త కోణాలు : పరిశోధనా వ్యాసాలు. (2009).

సంపాదకత్వంలో వచ్చిన గ్రంథాలు :

ఎదురుచూపులు - మొట్టమొదటి దళిత కథల సంకలనం - 1998, 20) కడుపుమీద కొట్టకుండ్రి -మొదటి దళిత కవితాసంపుటి -1995, 21) దండోర దరువు -భారత దేశంలో 139 మంది ఒకే కులానికి చెందిన కవులు ఒకే సమస్య మీద స్పందించి రాసిన మొదటి దళిత కవితా సంకలనం-2005, 22) గుండె డప్పు -హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో విద్యార్థులు రాసిన మొదటి కవితా సంకలనం-1997.

పత్రికానుభవం : ఎడిటర్ 1) అరుంధతీయ వాణి (మాస పత్రిక) 2) దండోరా (మాసపత్రిక), 3) దళిత లైబ్రరీ -మొట్టమొదటి దళిత లైబ్రరీ కడియం శ్రీహరి చేతుల మీదుగా డా॥. సినారె ఆధ్వర్యంలో ప్రారంభించబడింది.

అవార్డులు : 1) తెలంగాణ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు - 2015 - తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, 2) ఉగాది పురస్కారం - 2016 - మానస ఆర్ట్స్ థియేటర్స్ హైదరాబాద్., 3) 121వ జాషువా జయంతి జాతీయ అవార్డు - 2016 - ది యునైటెడ్ ఫోరం, వరంగల్ సాహితీ, 4) వ్యాస మహర్షి పురస్కారం - 2016 జ్ఞాన సరస్వతీ దేవస్థానం, డిప్యూటీ కలెక్టర్, బాసర, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, 5) గురుబ్రహ్మ నేషనల్ అవార్డు - 2015 - మదర్ థెరసా సోషల్ వెల్‌ఫేర్ సంస్థ, విశాఖపట్నం., 6) భగవాన్ బుద్ధ నేషనల్ ఫెలోషిప్ అవార్డు - 2012 - బి.డి.ఎస్సే, న్యూఢిల్లీ., 7) తెలుగు భాషా విశిష్ట సేవా పురస్కారం - 2012 - కలెక్టర్, నిజామాబాద్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం., 8) మహాత్మా జ్యోతిభాపూలే నేషనల్ ఫెలోషిప్ అవార్డు - 2011 - బి.డి.ఎస్సే, న్యూఢిల్లీ., 9) దళితరత్న అవార్డు -2009- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, హైదరాబాద్. 10) డా॥ బి.ఆర్.అంబేద్కర్ నేషనల్ ఫెలోషిప్ అవార్డు - 2008 - బి.డి.ఎస్సే, న్యూఢిల్లీ., 11) అక్షర

వివేకానంద ఉత్తమ వాలంటీర్ అవార్డు -1992- కలెక్టర్, కరీంనగర్, అక్షర ఉజ్వల సమితి., 12) ఎం ఏ తెలుగులో 8వ ర్యాంకు - 1994, రూ॥4500 పారితోషికం, ఆంప్ర ప్రభుత్వ సోషల్ వెల్‌ఫేర్ తదితరాలు..24 ఏండ్ల బోధన, 20 ఏండ్ల పాలనానుభవం, తెలుగు అధ్యయన శాఖాధ్యక్షులుగా 16 సదస్సులు నిర్వహించారు. వివిధ జాతీయ అంతర్జాతీయ సదస్సులలో ...86 సెమినార్లలో, 17 కాన్ఫరెన్సుల్లో పత్ర సమర్పణ చేసారు. వివిధ పత్రికలలో 86 పరిశోధనా పత్రాలు రాసారు. 9 ఎడిటర్ షిప్‌లు, రీసెర్చ్ గైడెన్స్ 8 పిహెచ్.డి.లకు పర్యవేక్షకులుగా ఉన్నారు. ఒక రీసెర్చ్ ప్రాజెక్టు పిడిఎఫ్ సమర్పితం. 2 పిహెచ్.డిలు అవార్డయ్యాయి. వివిధసంస్థల్లో 16 ఎక్స్ టెన్షన్ లెక్చర్స్ ఇచ్చారు. వివిధ ప్రక్రియలకు సంబంధించిన 52 గ్రంథాలకు ముందుమాటలు రాసారు. వివిధ ప్రక్రియల్లో వచ్చిన 63 పిహెచ్.డిలకు ఈ వాల్యేటర్‌గా జడ్జ్‌మెంట్ చేసారు. వివిధ సంస్థలలో 20 ప్రొఫెసనల్ మెంబర్ షిప్, 32 జనరల్ మెంబర్‌షిప్‌లు కలిగి ఉన్నారు. ఒక ఓరియెంటేషన్, రెండు రిఫ్రెసర్ కోర్సులతో పాటు రైట్ టు ఇన్‌ఫర్మేషన్ 2005 ఆక్టుమీద కూడా రిఫ్రెషర్ కోర్సు చేసారు. పిజి మరియు డిగ్రీలెవల్ రీసోర్స్ పర్సన్‌గా, ప్రభుత్వ టెక్స్‌బుక్ రైటింగ్స్, వర్క్‌షాప్స్ కండక్టు చేయటం, పేపర్‌సెట్టింగ్స్, ఎమినెంట్ స్పీకర్‌గా, సబ్జెక్టు ఎక్స్ ఫర్ట్‌గా,అన్ని కాన్ఫిడెన్షియల్ పనులకు రీసోర్స్‌పర్సన్‌గా వ్యవహరించడం ఇతని ప్రత్యేక అంశాలు.

తెలంగాణ విశ్వవిద్యాలయంలోని సౌత్ క్యాంపస్‌లో తెలుగు అధ్యయన శాఖలో తులనాత్మక సాహిత్య శాఖ పేరిట ఒక శాఖను ఏర్పాటు చేయించటంలో సఫలుర య్యారు. తెలుగుతో పాటు హిస్టరీ, పొలిటికల్ సైన్స్ శాఖలను ఏర్పాటు చేయటంలో జి.కేది ప్రధాన పాత్ర. గ్రంథం పేరే ఇంటిపేరుగా మారిన గుండెడప్ప కనకయ్య ఆధునిక తెలుగు సాహిత్యంలో విమర్శకుడుగా, పరిశోధ కుడిగా, కవిగా వ్యాసకర్తగా ప్రఖ్యాతి గడించాడు. ముఖ్యంగా తెలుగు దళితసాహిత్యంలో ధిక్కార స్వరం. అలాగే తెలుగు జానపద సాహిత్యంలో సుమారు 50 పరిశోధన వ్యాసాలు రాయగా కొంతమంది జానపదమా! ఆధునికమా! అని తమ అక్కసును వ్యాస రూపంలోనే వెల్లబోసుకున్నారు. ముక్కునూటిగా విమర్శించే జి.కె. వ్యాసాలు చదివిన కొంతమంది సాహితీ మేధావులు అనుకునే వారికి సహృదయత కలగాలని కోరుకుంటాడు.

ఆకలి తీర్చుకోలేని సమయాల్లో తనకున్న జ్ఞానాన్ని కవిత్వం రాయటానికి ఉపయోగించాడు. సమస్యలు తీరి పోవాలంటే చదువు, జ్ఞానమే ఏకైక మార్గమని నమ్మిన వ్యక్తి. 1994లో ఎంఏలో చేరిన తర్వాత తాను రాసుకున్న "నల్లోని దండోరా" కవితను అన్ని నోటీసు బోర్డుల్లో అంటించటం వల్ల అక్కడున్న చాలామంది కవులకు, రచ యితలకు ఒక స్ఫూర్తివంతమైన చైతన్యం ఉద్భ వించింది. ఈ కవిత దళిత ఉద్యమ పరమైన కవితల్లో మొట్టమొదటి కవితగా రూపు దిద్దుకుంది. జీవితంలో మరిచి పోలేని మృధు మధురమైన సంఘటన, జి.కేలో సాహిత్య పిపాసను ఎప్పటికప్పుడు తట్టి మేల్కొలిపే అత్యంత కీలకమైన విషయం ఏమిటంటే... ఎం.ఏలో కె.కె. రంగనాథాచార్యులు చెప్పే క్లాసులు వింటున్నప్పుడు... జి.కే రాసుకున్న కవిత్వం, జి.కె. కథలను, వేసుకున్న పుస్తకాలను, వారు చేస్తున్న ఉద్యమాన్ని వారికే క్లాసుల్లో ఆచార్య కె.కె. రంగనాథాచార్యులు చెప్తుండగా వినటం అపూరూపం. గొప్ప విశేషం. ఇంకొక గొప్ప విశేషం ఏమి టంటే... జీవితంలో మరిచి పోలేని ఒక గొప్ప అనుభూతి కేంద్రీయ విశ్వవిద్యాలయంలో తాను చదువుకున్న తెలుగుశాఖకు తానురాసిన వీణవంక కావ్యాన్ని అంకితం ఇవ్వటం కూడా ఒకగొప్ప అనుభూతేనని జి.కే. అంటు న్నారు. ఇది ఒక సంచలనమే సృష్టించింది. ఇన్ని సంచలనా లను సృష్టించిన ఈ రచయితకు అకాడెమిక్ బాధలు ఇప్పటికీ క్షోభపెడుతున్నాయి. నేనేకాదు ఎంతోమంది మేధావులకు ఉద్యోగాలు లేక రోడ్డుమీద ఏదైనా దిక్కు దొరుకుతుందేమోనని తిరుగుతున్నారు. వారికి చెప్పలరిగే పరిస్థితి వెన్నంటి నడుస్తుంది. కొన్ని చోట్ల అనగా తెలంగాణ విశ్వవిద్యాలయం లాంటి అత్యున్నతమైన విశ్వవిద్యా లంలో కొంతమంది ఫేక్ సర్టిఫికెట్లతో అధికారులుగా

ఉండటం మనసుకు బాధ కలిగించే విషయం. ఉదా:- కేవలం ఇంటర్మీడియెట్ అర్హతలతో ప్రొఫెసర్‌గా చేరి రిజిస్ట్రార్‌లుగా, అధికారులుగా ఉండటం ఇప్పటికీ క్షోభపెడుతున్న విషయమంటున్నారు.

"సమాజాన్ని మరింత సంఘటితం చేయటానికి అభివృద్ధికర మార్గాలలో పరిణమించేటట్లు చేయటానికి దళిత సాహిత్యం దోహదం చేస్తుంది. సమాజాల వికాసక్రమంలో అభివృద్ధి చెందిన ఆదర్శాలు, విశ్వాసాలు, సాంఘిక ఆర్థిక, రాజకీయ, మత సాంస్కృతిక భావాలకు రూపకల్పన క్రమంలో సమాజం, సాహిత్యం విడదీయరాని సంబంధం కలిగి ఉంటాయి. ఇటువంటిదే దళిత సాహిత్యం. ఇటువంటి దళిత సాహిత్యానికి సంబంధించిన సమస్యల మీద కేంద్రీయ విశ్వవిద్యాలయంలో పిహెచ్‌డి చేసి అతి పిన్నవయసులో అతి పెద్ద పొజిషన్‌లోకి వెళ్లి యూనివర్సిటీలో ఒక ప్రముఖుడుగా వెలుగొందుతున్న నా శిష్యుడు కనకయ్య " అని ఆచార్య పరిమి రామనరసింహం గారు అభిప్రాయపడ్డారు. దళితేతరులైన ఇద్దరు రచయితలు రాసిన నవలల్లో దళిత సమస్య ప్రధానమైంది. ఆనాడు దేశంలో ప్రధాన చర్చనీయాంశం అయినటువంటి దళితుల సమస్యలను పరిశీలిస్తూ... దళితేతరులు కూడా దళిత సాహిత్యాన్ని రాయాలి, వారు రాసింది కూడా దళిత సాహిత్యమే అవుతుంది అనే అంశానికి తులనాత్మక పరిశీలన ద్వారా నిర్ధిష్టతను చేకూర్చటానికి ఈ పిహెచ్‌డి సిద్ధాంత పరిశోధనను చేసారు. ఆధునిక సాహిత్యంలో దళిత సాహిత్యానికి సంబంధించిన తెలుగు కన్నడ భాషల్లో తులనాత్మకశాఖ యందు వెలువడ్డ మొట్టమొదటి పరిశోధనా గ్రంథం. దళితుల సమస్యలను ఒకచోట చిత్రీకరించిన మొట్టమొదటి గ్రంథం, దళిత సాహిత్యాన్ని క్లుప్తంగా మొత్తం ఒకచోట క్రోఢీకరించిన మొదటి గ్రంథం. దళితేతరులు కూడా దళిత సాహిత్యాన్ని సృజించవచ్చునని సిద్ధాంత పరంగా చెప్పిన మొదటి పరిశోధనా గ్రంథం, రీసెర్చ్ చేసే విద్యార్థులకు ముఖ్యంగా తులనాత్మక పరిశీలన చేసే విద్యార్థులకు రిఫరెన్స్ గ్రంథంగా దోహదపడే ఒక మంచి సిద్ధాంత గ్రంథం అని ప్రశంసలు పొందింది. ఈ సిద్ధాంత గ్రంథం "తెలుగు కన్నడ నవలల్లో దళిత సమన్యలు - తులనాత్మక అధ్యయనం (డా॥. కేశవరెడ్డి, డా॥ ఎస్ ఎల్ భైరప్ప నవలకు పరిమితి)" (హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో తులనాత్మక అధ్యయనశాఖలో వచ్చిన మొట్టమొదటి దళిత సాహిత్య పరిశోధనా గ్రంథం -2002). అని ఆనాడు ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్‌గా వచ్చిన ఆచార్య జి.ఎస్. మోహన్ ఆరోజే ప్రకటించటం విశేషం. ఇంకా ఈ గ్రంథంలో అనేక విషయాలు చోటు చేసుకోవటం విశేషం.

కవిత్వం, కథలు, నవలలు, పరిశోధనలు, వ్యాసాలు ఇలా ఒకటి అన్ని ప్రక్రియలను స్పృశించిన డా॥. గుండె డప్ప కనకయ్య కవికి దళిత జీవితమే దళితసాహిత్య వస్తువైంది. దళిత సాహిత్యానికి సొంత భాష ఉందని అంటాడు "నాకు రాత పూతలను దూరం సేసి/ నీవెక్కడ రాసుకుంటావో రాసుకో... నా భాషకు ఏతుల బడటం రాదు/ పుడింగులు గొట్టడం తెల్వనే తెల్వదు/ కుండలు బద్దలు గొట్టినట్లు సెప్పే సరళ భాష" (పు: 20 కడుపుమీద కొట్టకుండ్రి) అని తన భాష గొప్పదనాన్ని చెప్పుకుంటాడు. దళితులు వేసే ప్రతీ అడుగులో బోలెడంత సాహితీ నేపథ్యం కనపడుతుందని అంటారు. బౌద్ధం, జైనం, చార్వాకం, వీరశైవం, భక్తి ఉద్యమం, శతక కవుల అధిక్షేపం, పోతులూరి, సిద్ధప్ప లాంటి తత్వాలు దళిత సాహిత్యానికి కావలసినంత తాత్విక నేపథ్యాన్ని సమకూర్చాయంటాడు. దేశ సామాజిక జాడ్యాల, అణిచివేత, ఆవేదనల, అవేశాల నుంచి తమ హక్కులను ప్రశ్నించిన నూతన చైతన్యమే దళిత వాదానికి ప్రధాన భూమికగా పనిచేసింది అంటాడు. దళిత సాహిత్య స్వభావంలో స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, సామాజిక న్యాయం వంటి విలువలుంటాయంటాడు. దళిత జీవిత వాస్తవికత వాస్తవిక భావజాలం దళిత సాహిత్యంలోనే సాధ్యమంటాడు. అందుకే సంస్కరణ భావాలకు సాధనం కావటం వల్ల దళిత సాహిత్యం మానవతా వాదానికి పెద్ద పీఠ వేయటానికి జి.కే. కవిత్వం ఎంతగానో దోహద పడిందని చెప్పాడు.

BHAVAVEENA
Vol. 17, Issue. 7, July 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

బంజారాల సంస్కృతి జీవన వ్యవస్థ

– డా॥. నెల్లూనాయక్, పి.డి.ఎఫ్ స్కాలర్, ఉస్మానియా యూవర్సిటి, హైదరాబాద్.

బంజారాలు శతబ్దాల తరబడి తమదైన ప్రత్యేక సంస్కృతిని రక్షించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. బంజారాలు సాధారణంగా గుంపులు గుంపులుగా ఊరికి దూరంగా, కొండకోనల దరిదాపుల్లో జీవిస్తుంటారు. వీరి నివాసాలను 'తండా' లని పిలుస్తుంటారు. తండా అంటే లంబాడీల సమూహం, సరకు నింపిన గోనె సంచుల సమూహమునే అర్థాలను నిఘంటువులు పేర్కొన్నాయి. 11వ శతాబ్దికి చెందిన దండి 'దశకుమార చరిత్ర'లో కడ వీరి ప్రస్తావన కన్పిస్తుంది. అంతేగాక వివిధ కథనాల, చారిత్రక ఆధారాల ప్రకారం 11, 12 శతాబ్దాల నుండి ముస్లిం దండయాత్రలకు ముందు కూడ వీరికి వ్యాపారమే ముఖ్యవృత్తిగా ఉన్నట్లు బుజువవుతుంది. అంతేగాక మహమ్మదీయ సేనకు వెచి కొంతకాలం అడవుల్లో తలదాచుకొని తండాలుగా జీవించినారని విదితమవుతుంది.

తండా ప్రజలు తండా నాయకుని, కార్‌బార్ (కార్య దర్శి) అనే ఇద్దరి నాయకుల అదుపు ఆజ్ఞలలో ఉం టారు. తండా ప్రజలందరు సమాన ప్రతిపత్తి ఉంటుంది. స్వేచ్ఛగా మాట్లాడే హక్కు ఉంటుంది. తమ ఆచార వ్యవహారాలను, పుట్టుక, నుండి గిట్టే వరకు జరిగే సంస్కారాలను, పండుగలను, కట్టుబాట్లను, తండా జనుల నియమ పూర్వకంగా ఆచరిస్తుంటారు. కష్టసుఖాల్లో తమ తండా జనులతోనే కలిసి జీవిస్తారు. మాది 'గోర్‌జాతి' అని; 'రాజపుత్ గోర్ బంజార' అని గొప్పగా చెప్పుకుంటారు. లంబాడీలు కాని వారిని 'కోర్‌జాతి' వారని వ్యవహరిస్తుం టారు. గోర్‌మాటి అంటే బంజారా పురుషుడు, గోర్‌బాయి లేదా గోర్ని అంటే బంజారా అని అర్థం. తమ తెగ కట్టుబాట్లను సంస్కృతిని గొప్పగా చెప్పుకోవడంలో వీరికి వీరే సాటి. పెళ్ళి సందర్భంలో భోజనం చేసేటప్పుడు, పలికే పలుకుల్లో, "రామ్ బాంధో ఘూంట్ జనపంచో సోడ్ సఖే, పంచ్ బ్యాసన్ బాంధే ఘూంట్ రామేర్ బూత్ చుటీకోణి", అంటే "శ్రీరాముడు కట్టిన ముడిని లంబాడీ పెద్దలు విప్పవచ్చు, లంబాడీ పెద్దలు కట్టిన ముడిని విప్పడం శ్రీరామునికి కూడా సాధ్యం కాదు"; అని అర్థం. శ్రీరాముణ్ణి దైవంగా నమ్మే లంబాడీలు రాముని బాణా నికి, మాటకు ఎంత విలువ ఉందో అంతకంటే లంబాడీ పెద్దల మాటలకు విలువ ఉన్నదని సగర్వంగా చెప్పు కుంటారు.

తెలుగు జానపదులకు దగ్గరగా ఉన్న తండాలలో తెలుగు జానపద సంస్కృతి కొంత కన్పిస్తుంది. ఇప్పుడిప్పుడే ప్రభుత్వం ఏర్పరచిన విద్యా, వైద్య మొదలైన సౌకర్యాల వల్ల నాగరికతా ప్రభావం లంబాడిలపై ప్రసరిస్తున్నది. అయినా రావలసినంతగా మార్పు రాలేదనే చెప్పాలి.

ఒక్కొక్క తండాలో సుమారు ఇరవై కుటుంబాల వరకు ఉటాయి. కుటుంబాలు ఎక్కువైనపుడు కుటుంబాల మధ్య తగాదాలు ఏర్పడినపుడు, విడిపోయి కొత్త తండాను ఏర్పాటు చేసుకుంటారు. తండాలు నాయకుల పేర్లతోనే గాక పరిసర ప్రాంతాల పేర్లతో కూడ పిలువబడుతుంటాయి. గ్రామాల్లో నగరాల్లో స్త్రీలు అర్ధరాత్రి తిరగడం అపాయమని భయపడతారు. కానీ తండాల్లో మాత్రం స్త్రీలు అర్ధరాత్రి సమయంలో కూడ స్వేచ్ఛగా ధైర్యంగా తిరుగుతారు. తండాలో ఏ సంఘటన జరిగినా అందరికీ తెలుస్తుంది. అందరు కలిసికట్టుగా ఎదుర్కొంటారు.

సాధారణంగా తండాలోని ఇళ్ళెక్కువగా పూరిళ్ళే ప్రభుత్వం వారీ మధ్య ఇళ్ళను కట్టించి ఇస్తున్నారు. ధాన్యాలను కర్రపారకతో చేసిన గరిసెల్లో నిలువ చేసు కుంటారు. వంటకు ఎక్కువగా మట్టిపాత్రలనే ఉప

యోగిస్తుంటారు. వీరిలో కంచు గిన్నెలకు విలువ ఎక్కువ. ఇతరులను తెగలో కలుపుకునే సమయంలో కంచు పళ్ళెంలో కలిసి భుజించడం ఆచారం. వండిన పదార్థాలను ఉట్లపైన భద్రపరచుకుంటారు. పడుకోవడానికి కూర్చోవడానికి చాపలు, గోనెసంచులు, మంచాలను, మంచెలను ఉపయోగిస్తుంటారు. పరచుకోవడానికి, కప్పుకోవడానికి దుప్పట్లు, కంబళ్ళు, బొంతలు వాడుతారు. గొఱ్ఱెలను, మేకలను కుక్కలను కోళ్ళను మొదలైన వాటిని పెంపుడు జంతువులుగా జాగ్రత్తగా పెంచుకుంటారు.

ప్రస్తుతం కొన్ని తండాలలో తుల్జాభవాని, సేవాభాయ మొదలైన దేవాలయాలను నిర్మించుకోవడం కన్పిస్తుంది. ఈ ఆలయాలలో భగత్ (పూజారి) లను నియమించుకుంటారు. తండాలో బగత్‌కు మిక్కిలి గౌరవముంటుంది. భగత్ లేని తండాలలో పూజారి విధానం తెలిసిన పెద్దలే పూజా కార్యక్రమాలను నిర్వహిస్తుంటారు.

లంబాడీల్లో తండా నాయకునికి ప్రముఖ పాత్ర ఉంటుంది. తమ నాయకుని ఆజ్ఞను తండా ప్రజలు వినయ విధేయతలతో ఆచరిస్తారు. తండా ప్రజలు ఒకరి కష్టసుఖాలలో మరొకరు పాలు పంచుకుంటారు. 'ఐక్య మత్యమే మహాబలం' అనే సామెత కనుకూలంగా ప్రవర్తిస్తారు.

ఆర్థిక పరిస్థితులు :

లంబాడీల్లో కొందరు తొలి వ్యాపారులుగానే ఉన్నామని చెప్పుకుంటారు. వీరి మూలస్థానమైన రాజస్థాన్ నుండి గుజరాత్, మాల్వా, పంజాబ్, ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక మొదలైన రాష్ట్రాల్లోనే దాదాపుగా భారతదేశంలోని అన్ని రాష్ట్రాలలో వాణిజ్య రీత్యా వలస వెళ్ళారు. ఈనాటికీ లంబాడీలు కొందరు ఎడ్లపైన ఉప్పు వ్యాపారం చేస్తూనే ఉన్నారు. ఈ ఆధునిక యుగంలో ప్రయాణ సౌకర్యాలు అభివృద్ధి చెందడం వల్ల వీరి వ్యాపారం క్రమంగా తగ్గిపోయింది.

పృథ్వీరాజు, రాణా ప్రతాపుడికి అనుచరులుగా ఉండి అడవులలో అతి కష్టాలను అనుభవించిన కొందరు రాజపుత్రులు రాజస్థాన్, మాల్వా ప్రదేశాలను వదలి దక్షిణ ప్రాంతాలకు వచ్చి సంచార వ్యాపారులుగా జీవితాన్ని గడిపారు. నిత్యావసర వస్తువులను గోనె సంచుల్లో నింపుకొని ఒక ప్రదేశం నుండి మరొక ప్రాంతానికి సరఫరా చేస్తూ జీవనం సాగించారు. ఇంతేగాక వీరి ధైర్య సాహసాలను కన్నులార కాంచిన మొగలు నవాబులు, నిజాం నవాబులు, వీరిని తమ సైన్యానికి ఆహార పదార్థాలను అందించడానికి నియమించుకున్నారని చరిత్ర చెబుతుంది. వీరు దట్టమైన అడవుల గుండా ప్రయాణించే సందర్భంలో క్రూర మృగాలను దోపిడీ దొంగల నుండి ఎదురయ్యే ప్రమాదాలను కూడ వీరు లెక్క చేయలేదు. 17వ శతాబ్దంలో రైల్వే మార్గాలను ప్రవేశపెట్టిన తర్వాత, వాహనాలు పెరిగినందువల్ల లంబాడీల వ్యాపారం క్షీణించిపోయింది. అందువల్ల లంబాడీల ఆర్థిక వ్యవస్థ దెబ్బతిన్నది. అప్పటి నుండి వీరు నేటి వరకు సంచార జీవితానికి స్వస్తి పలికి స్థిర నివాసులై తండాలలో పశుపోషణ, వ్యవసాయం ప్రధానవృత్తిగా చేపట్టినారు. పశువులు, పొలాలు లేనివారు కూలి పని చేస్తున్నారు. మరికొందరు అడవుల్లోని విలువైన ఔషధాలు, తేనె, జిగురు, జీడిగింజలు, జీడిపండ్లు, చిల్లగింజలు, ఇప్పపూవు, ఇప్పపరక, మొర్రి, చిటమొట మొదలైన అడవి దినుసులను దళారులకు అమ్ముతున్నారు. దళారులు తగిన ధరలు ఇవ్వక ఈ అమాయకుల పొట్టలు కొట్టి, వారు డబ్బు సంచులను నింపుకుంటున్నారు. వంట చెరుకును పట్టణ వాసులకు అమ్ముతారు. కానీ తగిన ధరలు లభించక బాధపడుతుంటారు. అంతేగాక ఇప్ప పూవు పూచే సమయంలో పూవునే ఆరబోసికొని సంచుల్లో నింపుకొని నిల్వ ఉంచుకుంటారు. దీని నుండి సారా తీసి అమ్ముకొని జీవనం సాగిస్తున్నారు. ఒకప్పుడు లంబాడీలు దొంగతనాలు చేసేవారని అంటారు. కాని ప్రస్తుతం వీరు పట్టణ ప్రాంతాలకు వలసపోయి కూలీనాలీ చేసి బ్రతుకుతున్నారు. 'రెక్కాడితే గాని డొక్కనిండని' పరిస్థితులు వీరిలో నేడు నెలకొని ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో

తేది 27-07-1977 సంవత్సరం నుండి లంబాడీలను షెడ్యూల్డ్ ట్రైబ్స్‌గా ప్రభుత్వం గురించింది. అప్పటి నుండి వీరికి విద్యావకాశాలు, ఉద్యోగావకాశాలు కల్పించడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. కాని విద్యా వకాశాలు సక్రమంగా ఎక్కువ సంఖ్యలో విని యోగించు కోకపోవడం వల్ల వీరు ఉద్యోగావకాశాలను వినియోగించు కోలేకపోతున్నారు. వీరు అభివృద్ధి చెందక పోవడానికి కారణం నిరక్షరాస్యతయే అని చెప్పవచ్చు. ఇప్పుడిప్పుడే కొందరు తమకు ప్రభుత్వం సమకూరుస్తున్న విద్యా వకాశాలను వినియోగించుకుంటూ, ఉద్యోగాలను సంపాదించుకుంటున్నారు. అయినా వీరు ఇంకా అభివృద్ధి చెందవలసినది ఎంతగానో ఉన్నదని చెప్పవచ్చు.

ఆధార గ్రంథాలు :

1. తెలుగుజానపద గేయ సాహిత్యం - రామరాజు.
2. తెలుగు లంబాడీల గేయ సాహిత్యం - జనపాల శంకరయ్య.
3. భారతదేశ చరిత్ర సంస్కృతి - డా॥ ఎ. బొబ్బిలి.
4. బంజారా చరిత్ర సంస్కృతి ప్రగతి - చినియా నాయక్.
5. సుగాలి సంస్కృతి భాషా సాహిత్యాలు - ఎం.జి.నాయక్.
6. కర్నాటక లంబాణి గళు ఒందు సంస్కృతి అధ్యయనం - ఖండోబా.
7. నవీన బంజారా సాంఘిక సంకీర్తనలు - భూక్య బాలాజీదాసు.
8. బంజారా సాహిత్యం-జీవన చిత్రణ - సూర్యధనుంజయ్.
9. బంజారా గేయ సాహిత్యం-తెలుగు ప్రభావం - నెహ్రూనాయక్.
10. లంబాడీల ఆచార వ్యవహారాలు - జనపాల శంకరయ్య.
11.భారతదేశం-గిరిజన సముదాయాలు - మజుందార్.

BHAVAVEENA
Vol. 17, Issue. 7, July 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

పులుమద్ది పెద్దమ్మ జాతర - వైశిష్ట్యం

- మోత్కూరి అనిల్‌కుమార్, పరిశోధక విద్యార్థి, జానపద కళల శాఖ, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, నాంపల్లి, హైదరాబాదు.

మన దేశంలో జానపదుల సంస్కృతి, సంప్రదాయాలు ప్రత్యేకమైనవి. జానపదులు స్త్రీ దేవతలను ఆరాధించడం అనాదిగా వస్తుంది. దేవతల అనుగ్రహం కలిగితే గ్రామం ఆరోగ్యంగాను పాడిపంటలతో తులతూగుతుందనే విశ్వాసం అంతటా ఉంది. ఇదే క్రమంలో నిత్యం కొలిచే గ్రామ దేవతలు ఆగ్రహిస్తే అతివృష్టి, అనావృష్టిలతో పాటు కరువు కాటకాలు, అంటువ్యాధులు, ఆకస్మిక మరణాలు వంటి విపరీత సంఘటనలు జరుగుతాయనే నమ్మకం ఇప్పటికీ కలదు. కాబట్టి దేవతల అనుగ్రహం కోసం జానపదులు జాతరలు జరపడం అనవాయితిగా వస్తుంది. వ్యవసాయక ప్రధానమైన దేశంలో సఫలతాస్థితి గ్రామదేవతారాధనగా మరీ ఉండటంలో ఆశ్చర్యంలేదని 'హెన్రీ వైట్ హెడ్' తన మార్గ దర్శక రచన "village of south india" అనే గ్రంథంలో పేర్కొనడం గమన్హారం. ప్రాచీన కాలంలో శివ, వైష్ణవులతో సమానంగా 'దైవత్రయి' లో శక్తి దేవతలు తన స్థానాన్ని పొందినదని పూర్వ పరిశోధన వల్ల అవగతం అవుతుంది. సింధూ నాగరికత కాలంనుండే శక్త్యారాధాన భారతదేశంలో ఉందనడానికి అక్కడ త్రవ్వకాల్లో బయటపడ్డ స్త్రీ మూర్తి విగ్రహాలే ఆధారమని డా. పుష్పేంద్రకుమార్ "sakti cult in ancient india" అనే గ్రంథంలో వివరించారు.

జాతర శబ్ద చర్చ :

జాతర అనే శబ్ధం యాత్రా శబ్దం నుండి పుట్టింది. యాత్రా శబ్దానికి "యనేనత్రాయత ఇతి యాత్ర" పుణ్య క్షేత్రాలకు వెళ్లేవాళ్లను రక్షించునది యాత్ర అనే ఈ శబ్దాల యొక్క వ్యుత్పత్తి. యాత్ర అనగా ఇప్పుడు పుణ్యక్షేత్రాలనే కాక, దేశ విదేశాలను చూడడానికి చేసే ప్రయత్నమని చెప్పవచ్చు. సాధరణంగా విశిష్ట దేవతలకు ఏడాదికి ఒక్క సారి జాతరలు జరపడం అనవాయితీ. అదే క్రమంలో వికారాబాద్ జిల్లాలో అనేక జాతరలు జరుగుతున్నాయి. ఈ జాతరలు జరిగే తీరును పరిశిలించినట్లైతే దాదాపుగా దేశమంతట కూడా జాతర నిర్వహణ ఒకే విధంగా ఉంటుంది.

పెద్దమ్మ జాతర :

వికారాబాద్ జిల్లా... మండలంలోని పులుమద్ది గ్రామంలో పెద్దమ్మ తల్లి జాతర అత్యంత వైభవంగా జరుగుతుంది. గ్రామానికి నైరుతి దిక్కున పెద్దమ్మ తల్లి ఆవిర్భవించిందనట్లు ఇక్కడి పెద్దలు వివరిస్తారు. అమ్మవారంటేనే ప్రకృతి,ప్రకృతి ఎక్కడైతే ఆరాధించ బడుతుందో, గౌరవించబడుతుందో అక్కడ అమ్మవారు నివసిస్తుంది. ఈ విధంగా 1982-84 మధ్య కాలంలో అమ్మవారు ఈ గ్రామంలో వెలసింది. గ్రామానికి చుట్టు ముట్టు కొండలు, అనంతగిరి పర్వత సమీపం, బుగ్గరామేశ్వర స్వామి క్షేత్రం, సంగమేశ్వర స్వామి దేవాలయం ఉన్నాయి. పులమద్ది గ్రామంలో మొదట అమ్మవారు,తర్వాత అయ్యవారు ఉన్నారు. ఈ విధంగా పులమద్ది గ్రామం చుట్టూ కొండలు మధ్యలో గుట్ట కలదు. గ్రామానికి ఎటు చూసినా రెండు మూడు కిలోమీటర్లు వరకు అనంతగిరి కొండలే కనిపిస్తాయి. పులుమద్ది గ్రామానికి ఉత్తర భాగంలో దుర్గం చెరువు , వెల్‌చాల్, గేట్ వనంపల్లి, మీనెపల్లి, మాదారం, తూర్పు భాగంలో కుమ్మరి కూడెం, నావాబ్ పేట్, దక్షిణ భాగంలో ఎర్రవల్లి, మదులపల్లి, మోత్కుపల్లి గ్రామాలు ఉన్నాయి. పడమటి భాగంలో చాలా దూరం వరకు గుట్టలు విస్తరించి ఉన్నాయి. పులుమద్ది గ్రామం వికారాబాద్ జిల్లా కేంద్రానికి 12 కి.మీ దూరంలో ఉంది. జాతరకు వెళ్లడానికి ఆర్టీసీ బస్సులు, ఆటోలు, జీపుల సౌకర్యం కలదు. వికారాబాద్ పట్టణానికి

హైదారాబాద్, సికింద్రాబాద్ నుండి రైలు,బస్సు సౌకర్యాలు కూడా కలవు.

గ్రామ జనాభా :

2011 జనాభా లెక్కల ప్రకారం 3405 మంది నివ సిస్తున్నారని అంచనా. గ్రామంలో కుమ్మరి, కమ్మరి, మంగలి, అవుసల, బలిజ, ఊరడి, రెడ్డి, బోయిని, బిల్లపాటి, ముదిరాజ్ , మాల, మాదిగ మరియు ముస్లిం మొదలైన కులాల వారు కొందరు కులవృత్తులను ఆధారంగా చేసుకోగా, మరికొందరు వ్యవసాయం,ఇతర పనులపై ఆధారపడి ఉన్నారు. ఇక్కడ వ్యవసాయంపై ఆధారాపడి జీవించేవారే ఎక్కువ గ్రామంలో నల్లరేగడి, ఎర్ర రేగడి, సెలక భూములు సేద్యానికి ఉపయోగ పడుతున్నాయి. కందులు , మొక్కజొన్న, జొన్న, పత్తి, పెసర పంటి పంటలతో పాటు కూరగాయలు, పూల తోటలు కూడా సాగు చేస్తున్నారు. అలాగే పశుసంపద కూడా ఎక్కువగానే ఉంది. ఆవులు, ఎడ్లు, గేదలు, మేకలు, గొర్రెలు ఉంటాయి. వ్యవసాయ సాగునీటికై బావులు, గొట్టపుబావులు ఎక్కువగా ఉపయోగిస్తారు.

వికారాబాద్ జిల్లాలోని ప్రముఖ జాతరలు :

లక్ష్మీ నరసింహస్వామి జాతర (వెల్ చాల్), మల్లన్న జాతర (దుర్గంచెరువు), అనంతపద్మనాభస్వామి జాతర (అనంతగిరి), ఎల్లకొండ జాతర (శంకరుడు) (ఎల్లకొండ). దుర్గమ్మ జాతర (మోమిన్ పేట్), ఎల్లమ్మ జాతర (పోలె పల్లి), ఎల్లమ జాతర (ముద్దాయిపేట్), ఈదులమ్మ జాతర (నస్కల్), బండవెల్కి చెర్ల జాతర (నాగదేవత) (పాంబండ), రామేశ్వరం జాతర (బూర్గుపల్లి).

పెద్దమ్మ తల్లి చరిత్ర :

పార్వతీదేవి మరో రూపమే పెద్దమ్మ తల్లిగా ఇక్కడి భక్తులు పేర్కొంటారు. ఆదిమ మానవుడు గావించుకున్న భగవంతుని రూపకల్పనలో మొట్టమొదట ఊహించినది పార్వతిదేవి. ఈ పార్వతీదేవి ప్రాచీన సాహిత్యంలో కనిపించే ఉమా, అంబిక అనే నామాలు కలిగి ద్రవిడ శబ్దమైన అమ్మకు మారు రూపాలుగా సాహితీవేత్తలు పేర్కొంటారు. గ్రామ దేవతగా పేరొందిన పెద్దమ్మ, పోచమ్మ, ఎల్లమ్మ, మైసమ్మ , దుర్గమ్మ మొదలైన దేవతల పేరు మీదుగా వికారాబాద్ జిల్లాలోని వివిధ గ్రామాల్లో, ప్రాంతాల్లో జాతరులు జరుగతూ ఉంటాయి.

పూర్వం గ్రామంలో వేంకటేశ్వరస్వామి భజన బృందం, వీరబ్రహ్మేంద్రస్వామి భజన బృందాలు ఉండేవి. వీరు చరిత్రకు సంబంధించిన నాటకాలు వేసేవారు. వీరిలో చాలా మందికి పెద్దమ్మతల్లి తలంపు కలిగి పెద్దమ్మ తల్లిని ప్రతిష్టించాలని నిర్ణయించుకున్నారు. ఇదిలా ఉండగా గ్రామానికి 30 కి.మీ చేరువలో ఉన్న తాండూరు పట్టణంలో పెద్దమ్మ తల్లి జాతర ఉత్సవాలు జరిగేవి. పులుమద్ది గ్రామ ప్రజలు అక్కడికి వెళ్లి అమ్మవారికి బోణం సమర్పించేవారు. ఈ తంతు ప్రతీ సంవత్సరం కొనసాగేది అయితే ఒక సంవత్సరం అలా సమర్పించిన బోణాన్ని కడగకుండా గ్రామంలోకి తీసుకువచ్చారని, అలా వచ్చినవారి వెంట పెద్దమ్మ తల్లి వచ్చిందని గ్రామస్తుల నమ్మకం. చాలా మందికి కలలో కూడా వచ్చిందని చెప్పుకోవడం వలన గ్రామస్థులంతా అమ్మవారికి ఆలయం నిర్మించాలని అనుకొని, 1982-84 మధ్య కాలంలో అమ్మవారి విగ్రహాన్ని కలపతో పులిపై కూర్చునటు వంటి ఆకారాన్ని తయారు చేయించి ఊరి వెలుపల ఈశాన్య భాగంలో ఒక పాన్న చెట్టు కింద పెట్టి పూజించడం ప్రారంభించారు. కొన్ని సంవత్సరాల తర్వాత ఆ విగ్రహం శిథిలమై పోతుండటం గమనించి అదే రూపంలో పెద్దమ్మ తల్లి విగ్రహాన్ని రాతితో తయారు చేయించి గుడిలో ప్రతిష్టించి పూజలు చేశారు. ఇలా కొన్ని సంవత్సరాలు గడిచిన తర్వాత గుడిని పెద్దదిగా కట్టాలని నిర్ణయించు కున్నారు. గ్రామంలో కోందరు. కలిసి పనులు ప్రారంభిం చారు. గుడిపైన గోడలపై నాలుగు వైపుల పులి విగ్రహాలు ఉండేవిధంగా నిర్మించారు. ఆ తర్వాత అమ్మవారికి జాతరను వేడుకగా జరపడం ప్రారంభించారు.

జాతర జరుపుకునే విధానం :

ప్రాథమికంగా వైధిక ధర్మం ప్రకారం పూజా క్రతువు లల్లో యజ్ఞయాగాలు చేయడం పరిపాటి. అందులో మద్యమాంసాలు, డప్పులు వాయించడం నిషిద్ధాలు. అయితే గ్రామ దేవతల ఉత్సవాలలో మాత్రం వాటికే మాత్రం ప్రముఖ స్థానం ఉంటుంది. కాబట్టి పశుపోషణకు ప్రాధాన్యతనిస్తారు. అందువల్ల జాతరలో ఎడ్లబండ్లతో ఊరేగిస్తూ జరుపుకుంటారు.

పెద్దమ్మ తల్లి జాతరను గ్రామంలో ప్రతి సంవత్సరం ఉగాది తర్వాత వచ్చే చైత్రశుద్ధ పౌర్ణమి రోజున జరుపు కుంటారు. అదే విధంగా ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి జాతరలో భాగంగా గ్రామంలోని అన్ని దేవతలకు ఉత్స వాలు జరుపడం అనవాయితీ. గ్రామదేవతలకు ఉత్స వాలు చేసినపుడు జాతర 5 రోజులు జరుగుతుంది. లేక పోతే ప్రతి సంవత్సరం 3 రోజులకే జాతర ముగుస్తుంది. జాతరకు 5 రోజులకు ముందుగానే మంచి మూహూర్తం చూసి గ్రామంలో ఉన్న అన్ని దేవాలయాలకు రంగులు వేసి అందంగా అలంకరిస్తారు. జాతరకు ముందురోజే ఆలయాన్నింటినీ విద్యుద్దీపాలతో అలంకరిస్తారు. చాకాలి, మంగలి,ఊరడి కులాల వారు ఈ పనిని పూర్తి చేస్తారు.

జాతర ప్రారంభం మొదటి రోజు :

పూర్వం గ్రామాన్ని నిజాం రాజులు పరిపాలించేవారు. వారి కాలంలో గ్రామ వ్యవస్థలో దొరలు , పట్వారీలు, పోలీస్ పటేల్, మాలిస్ పటేల్, ఊరకాపు పాలనలో ఉండేది. జాతర ఉత్సవాలలో వారు మాత్రమే బండ్లను కట్టి ఊరేగించేవారు. ఇప్పటకి కూడా వారి పేర్లు మీదు గానే బండ్లను కట్టి ఊరేగించడం జరుగుతుంది. జాతర మొదటి రోజున మధ్యాహ్నం 12 గం. బండ్లను ఊరిలో గల హనుమాన్ మందిరం దగ్గర వరుస క్రమంలో మొదటి బండి దొరలది, రెండవది పట్వారీలది. మూడవది పోలీస్ పటేల్, నాలుగవది మాలీస్ పటేల్, ఐదవది ఊరకాపుది నిలబెడతారు. ఈ విధంగా ఐదు బండ్లను నిలబెట్టి ఎవరి బండ్లను వారు వివిధ రకాల అలంకరణ సామాగ్రితో అందంగా అలంకరిస్తారు. సాయంత్రం 6 గం సమయానికి డప్పులతో ఊరేగింపుగా వెళ్లి వారి ఇంటి దగ్గర అందంగా అలంకరించి ఉన్న ఎడ్లను వరుస క్రమంలో తీసుకువచ్చి బండ్లకు కట్టి, బండ్ల కింద కుంభం పెట్టి పూజలు చేసి ముందుగా హనుమాన్ మందిరం చుట్టూ తిరిగి తర్వాత వరుసగా ఊరడమ్మ, దుర్గమ్మ , బొఱమ్మలు ఆలయాలు చుట్టూ ఐదు సార్లు తిరిగి చివరగా పెద్దమ్మ తల్లి ఆలయానికి వెళ్లే ముందు గుడికి చేరువలో ఉన్న బావి నుండి జల్తి కడవను తెస్తారు. (జల్లి కడవ అంటే కొత్త కుండలో నీరు తేవడం)

బావి చరిత్ర :

పూర్వం పోద్దమ్మ తల్లి ఈ బావిలో రోజూ వెళ్లి స్నానం చేసేదని అందుకే ఆ బావికి పెద్ద బావిగా పేరు వచ్చింది. అందుకే ఆ బావి నుండి జల్తి కడవలో నీళ్లు తెస్తారు. కుండల్లో నీళ్లు ఎత్తుకున్న వ్యక్తి ఎడ్ల బండ్ల ముందు వెళ్తూ పెద్దమ్మ ఆలయం చూట్టూ ఐదు ప్రదక్షణలు చేసి తర్వాత కుండలోని నీళ్లతో పెద్దమ్మకు అభిషేకం చేసి ఎడ్ల బండ్లను పెద్దమ్మ గుడి ముందు వదిలి ఇంటికి వెళ్తారు. ప్రతి బండి దగ్గర ఒక కాపలాదారుడు ఉంటాడు. అదే రాత్రి ఎడ్లబండ్ల ప్రదర్శన ముగిసిన తర్వాత అమ్మవారికి బోణాలు సమర్పిస్తారు.

బోనం తయారీ :

కావలసిన సామాగ్రి- కొత్త చీర, కొత్త రవిక, కల్లు, రెండు దీపాంతలు, పసుపు, కుంకుమ, నిమ్మకాయలు, ఉల్లిగడ్డ, సున్నం, పత్తి, నూనె, అగర్బత్తీలు, సాంబ్రాణీ, పూలు, ఐదు కొబ్బరికాయలు, ఒకటింపావు సేరు బియ్యం, ఒక కుండ , రెండు ముంతలు ఆకులతో తయారు చేసిన కంకణాలు ఈ పూజకు అవసరం. బోనం చేయడానికి కుండను ఉపయోగిస్తారు. తక్కినవి పూజలలో ఉపయోగిస్తారు. ఈ రోజుల్లో అందురు కుండకు బదులుగా ఇత్తడి, స్టీలు కడవలను ఉపయోగిస్తారు. బోనం ఎత్తుకునేవారు తలంటు పోసుకొని, కొత్త వస్త్రాలు ధరించి, బోనాన్ని తలపై ఎత్తుకుని గడప దాటి వాకిలిలో

త్వారు ముఖంగా నిలబడతారు. నిండు కడవతో ఒక ముత్తైదువ ఎదురుగా వచ్చి బోనం ఎత్తుకున్న వారి కాళ్లు కడుగుతుంది. ఇలా చేసిన తర్వాత అందరూ ఒక దగ్గర చేరి వరుసగా అమ్మవారి గుడి దగ్గరకు డప్పుల శబ్దాలతో ఊరేగింపుగా వెళ్లి ఐదు ప్రదక్షణలు చేసి పెద్దమ్మకు సమర్పిస్తారు.

రెండవ రోజు రథం ఊరేగింపు :

అలంకరణ :

రథాన్ని పూర్వం కలపతో, చెక్కలతో జాతరకు 6 నెలల ముందుగా తయారు చేయడం ప్రారంభించి జాతర రోజున ఊరేగించేవారు. ఈ పనిని వడ్రంగి కులాల వారు చేసేవారు. కొన్ని సంవత్సరాల తరువాత రథాన్ని ఇనుముతో తయారుచేయించారు. ప్రస్తుతం గ్రామంలోని మంగలి కులానికి చెందినవారు రథాన్ని రంగురంగుల కాగితాలతో వివిధ రకాల పువ్వులతో, విద్యుత్ దీపాలతో సర్వాంగ సుదరంగా అలంకరిస్తున్నారు.

ఊరేగింపు :

జాతరలో భాగంగా రెండవ రోజు మధ్యాహ్నం 12 గం.లకు అన్న దాన కార్యక్రమం ప్రారంభమవుతుంది. గ్రామస్తులు, బంధువులు, ఇతర గ్రామస్తులు వచ్చి అన్న ప్రసాదం స్వీకరిస్తారు అన్న దానం పూర్తయిన తర్వాత మొదటి రోజు పెద్దమ్మ తల్లి గుడి దగ్గర వదిలిన బండ్లను సాయంత్రం 5గం. లకు ఊరేగింపుగా మొదట పెద్దమ్మ ఆలయం చుట్టూ తిరిగి, తర్వాత వరుస క్రమంలో బోనమ్మలు, దుర్గమ్మ , ఊరడమ్మ ,చివరగ హనుమాన్ ఆలయం చుట్టూ ఐదు ప్రదక్షణలు చేయించి బండ్లను వదులుతారు. బండ్ల ప్రదర్శన ముగిసిన తర్వాత అదే రోజు (పౌర్ణమి) రాత్రి 9 గం.లకు రథం ఊరేగింపు ప్రారంభమవుతుంది. ఊరేగింపులో చిన్నలు, పెద్దలు, బంధువులు పాల్గొంటారు. రథోత్సవం చూడటానికి చుట్టూపక్కన గ్రామాల వారు కూడా వస్తారు. గ్రామంలో కొంతమంది కోలాటం, అడుగుల భజన, పండరి భజనలు చేస్తూ భక్తి శ్రద్ధలతో రథాన్ని హనుమాన్ మందిరం దగ్గర్నుండి పెద్దమ్మతల్లి గుడి వద్దకు తీసుకుపోతారు. అమ్మవారి గుడి చుట్టూ ఐదు ప్రదక్షణలు చేసి రథాన్ని గుడి దగ్గర వదిలి వస్తారు.

మూడవ రోజు రథం తీసుకురావడం :

రెండవ రోజు పెద్దమ్మ గుడి దగ్గర వదిలిన రథాన్ని మూడవ రోజు సాయంత్రం 6 గంలకు డప్పులతో ఊరే గింపుగా వెళ్లి రథాన్ని తిరిగి హనుమాన్ మందిరం వద్దకు తీసుకువస్తారు. సాధారణంగా ఈ జాతర మూడు రోజులలో ముగుస్తుంది. గ్రామదేవతలకు ఉత్సవాలు చేసినపుడు మాత్రమే జాతర ఐదు రోజులు జరుగుతుంది

4, 5 వ రోజు జాతర :

ఐదు రోజులు జాతరలో నాలుగవ రోజు ఊరడమ్మకు దున్నపోతులు, మేకపోతులు, కోళ్లను బలిస్తారు. ఆ రోజు పోతురాజు ఎరుకలసాని ముఖ్యపాత్రలు ఉంటాయి. పోతురాజు, భవినివారితో గావు పట్టడం ఉంటుంది, 5వ రోజు దుర్గమ్మ గుడి దగ్గర మేకలను, కోళ్లను బలిస్తారు. పోతురాజు గావు పడతాడు. ఎరుకల సాని గ్రామ భవి ష్యత్తు వాణి చెబుతుంది. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఉంటారు. గ్రామానికి సంబంధించిన మంచి చెడులు తెలుసుకుంటారు. చివరగా 5వ రోజు రాత్రి గ్రామం చుట్టు పాలి చల్లడంతో జాతర ముగుస్తుంది.

పూజారులు :

బ్రాహ్మణులే పురోహితం, పూజలు చేయాలని ఏమీ లేదు. ఎవరైనా చేయవచ్చు. జానపద సంబంధితమైన జాతర పూజ కాబట్టి ముదిరాజ్ కులానికి చెందిన ఊరడి వంశస్తులు అమ్మవారికి పూజలు చేస్తారు. జాతర రోజున అభిషేకం, వస్త్రాభరణం మొదలగునవి వారే చేస్తారు. మిగతా గ్రామ దేవతల ఆలయాల దగ్గర కూడా వారే ఉంటారు. వీరు వంశపారంపర్యంగా పూజలు చేస్తున్నారు.

మొక్కుబడులు, బలులు :

గ్రామీణ ప్రాంతాలలో నివసించే ప్రజలకు దేవతలపై ఎక్కువ సమ్మకం ఉంటుంది. కాబట్టి తమ ఇంట్లో

ఎవరికైనా జ్వరం వచ్చినా, పంటలు బాగా పండక పోతే, మరి వివిధ సందర్భాలలో అమ్మవారికి మొక్కుకుంటారు. తమకు మంచి జరిగినా తర్వాత అమ్మవారికి మొక్కుబడి చెల్లిస్తారు. కొందరు గ్రామ దేవతలకు మేక, గొర్రెలను బలిస్తామని మొక్కుకున్నవారు జాతర ఐదు రోజులు జరిగే సమయంలో నాలుగవ, ఐదవ రోజు మొక్కుబడులు చెల్లిస్తారు.శరీరంలో కండ్లు, కాళ్లు మరే భాగానికైనానొప్పి లేదా బాధా కలిగిన భక్తులు దేవతకు మొక్కుకోవడం తమకు నయమైన తర్వాత వెండితో ఆయా భాగాలను చేయించి పెద్దమ్మ తల్లికి సమర్పించుకుంటారు

సాంస్కృతిక కార్యక్రమాలు :

జాతర సందర్భంగా గ్రామస్థులలోని కొందరు వ్యక్తులు రామాయణ, మహాభారత ఘట్టాలను నాటకాలుగా ప్రదర్శించేవారు. రథం ఊరేగింపు రోజు పలు సంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తారు. యువకులు కోలాటం, పెద్దవారు భజనలు చేస్తారు. ఈ ప్రధర్శనాలు చూడటానికి చుట్టుప్రక్కల గ్రామాల వారు రథోత్సవం రోజున భారీగా తరలి వస్తారు. గ్రామంలో అనేక రకాల వస్తువులు, తిను భండారాలు, ఆడవారికి గాజులు, చిన్నపిల్లలకు బొమ్మలు మొదలగు ఏర్పాటు చేస్తారు. జాతరకు వచ్చిన వారంతా తమకు కావాల్సిన వస్తువులకు కొనుకుంటారు. ఈ దుకాణాలు జాతర చివరి రోజు వరకు ఉంటాయి.

మగింపు:

వికారాబాద్ జిల్లాలోని పులుమద్ది గ్రామంలో నాలగు దశాబ్దాల క్రితం ప్రారంభమైన పెద్దమ్మతల్లి జాతర ఇప్పటికి అంగరంగ వైభవంగా నిర్వహించడం విశేషం. అమ్మవారి పేరుమీద గ్రామంలో ఇనాం భూములు, చెట్లు మొదలైనవి ఏమీ లేకపోయినా గ్రామస్తులు ఇంటికి కొంత మొత్తం వేసుకుని స్వచ్ఛందంగా ఉత్సవాలు నిర్వ హించడం వారికి అమ్మవారిపైనా ఉన్న భక్తిని రుజువు చేస్తుంది. జాతరలో జాతి , కుల, మత, వర్గ, వర్ణ, లింగ బేధాలు లేకుండా అందరూ కలసికట్టుగా జరుపుకోవడం గ్రామస్తుల ఐకత్యను తెలియజేస్తుంది. రోజురోజుకు అమ్మవారి ప్రాశస్యం నలుమూలలూ వ్యాప్తి చెందడంతో చుట్టు ప్రక్కల గ్రామాల వారే కాకుండా జిల్లా వ్యాప్తంగా భక్తులు రావడం, మొక్కులు చెల్లించుకోవడంతో ప్రాథా న్యతను సంతరించుకుంటుంది. జాతర ఇంకా అభివృద్ధి చెందాలంటే దేవాదాయ శాఖ ఆధీనంలో ఉండటం గానీ, ప్రభుత్వ సహకారం గానీ ఉంటే బాగుటుంది.

విషయ దాతలు :

కమ్మరి శంకరయ్య (72), తిమ్మాపురం శివ రామిరెడ్డి (78) ఈడిగి బాలయ్య (72), బోయిన శివయ్య(40), తిమ్మాపురం మాధవరెడ్డి(60), గొల్ల బక్కయ్య(49) కోలాటం పంతులు, మట్టపల్లి మల్లేషం(42).

ఉపయుక్త గ్రంథాలు :

1. మహబూబ్‌నగర్ జిల్లా గ్రామదేవతలు - డా . యం ఇందిరాదేవి (Ph.D),
2. అయినవోలు మల్లన్న జాతర-2017 -భట్టు రమేష్, గడ్డం వెంకన్న.
3. మేడారం సమ్మక్క -సారక్క జాతర -2015 - ఆచార్య భట్టు రమేష్.
4. నందిగామ తాలూకా దేవాలయలు, కృష్ణా జిల్లా - డా. ముసుగు శ్రీనివాసరావు.
5. పాలమూరు దేవాలయాలు - కపిలవాయి లింగమూర్తి
6. హిందువుల పండుగులు - సురవరం ప్రతాపరెడ్డి.
7. గ్రామ దేవతల జాతరలు (జనవరి-జూన్,1991).
8. అర్ధవార్షిక పరిశోధన పత్రిక - పొన్న లీలావతమ్మ.

BHAVAVEENA
Vol. 17, Issue. 7, July 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

జాషువా కవిత్వం - మానవత్వం

-వైదయ్య మల్లెపాకుల, డిగ్రీ లెక్చరర్, శ్రీ ఉమామహేశ్వరీ డిగ్రీ కాలేజ్, కొండనాగుల, నాగర్‌కర్నూల్ జిల్లా, తెలంగాణ.

ప్రపంచంలో అత్యున్నత సాహితీవేత్తలెవరికీ తీసిపోని మహాకవి - గుర్రం జాషువా. మానవతావాదం, మానవ సంవేదనల గురించి వ్రాసిన పాశ్చాతులు గానీ, జాషువా ముందూ తర్వాత జీవన మూల్యాలను అక్షరబద్ధం చేసిన ఎంతోమంది కవులు గానీ, జాషువా అక్షర ఆయుధం ముందు నిలువగల స్థాయి వున్నవాళ్ళు కాదు. ఇందులో అతిశయోక్తి లేదు. ఇది అతస్యం కానే కాదు.

పల్నాడు సీమలోని గుంటూరు జిల్లా వినుకొండలో 1895 సెప్టెంబర్ 28న ఆయన జన్మించారు. జాషువా తల్లి లింగమ్మ మాదిగ - జాతికి చెందిన స్త్రీ. ఆయన తండ్రి వీరయ్య యాదవ కులస్తుడు. ఆయన లింగమ్మను వలచి పెళ్లిచేసుకున్నాడు. వీరయ్య క్రైస్తవాన్ని స్వీకరించి చర్చి పాస్టర్‌గా సుదీర్ఘకాలం పనిచేశాడు. తల్లి దండ్రుల వారసత్వంతో పుట్టుకతో క్రైస్తవుడు అయిన ప్పటికీ ... జాషువాకి తక్కువ కులం అనే అవమానాలు తప్ప లేదు. అందుకే జాషువా చిన్ననాటినుండే ఈ కుల వ్యవస్థకు వ్యతిరేకంగా ఆలోచించడం మొదలు పెట్టాడు. ఈ కుల వ్యవస్థని దిక్కరించి తన కవితా గళాన్ని ఎక్కు పెట్టాడు జాషువా. తెలుగు సాహిత్య చరిత్రలో మొత్తం బ్రాహ్మణ ఆధిపత్య కవిత్వమే నడుస్తున్న కాలంలో వాస్త వికతకు దూరమైన భావ కవిత్వ ప్రవాహంలో అందరు కొట్టుకు పోతున్న తరుణంలో ఒక్క జాషువా మాత్రం సామాజిక ప్రజాస్వామ్యం కోసం రచనలు చేశాడు.

కవి అంటే తత్వవేత్త, శాస్త్రవేత్త, సత్యాన్వేషకుడు, పరిశోధకుడై ఉండి, సమస్త ప్రకృతిని, మానవుణ్ణి,అతని అంతరంగాన్ని, మానవ సంబంధాల్ని, పదార్థాల్ని, దాని గుణాన్ని, మర్మాన్ని కూడ వెలికి తీసే మాంత్రిక లక్షణం కలిగి ఉండాలి. దాన్ని అత్యంత ప్రతిభావంతంగా సుందరంగా ప్రజలకు తెలియజేయడం కవిధర్మం. కవిత్వం అంటే కవితత్వం ఇవన్ని కలిగిన వాడు జాషువా.

వందల వేల సంవత్సరాలుగా తెలుగు సాహిత్యం అగ్రవర్ణ బ్రాహ్మణ ఆధిపత్యంలోనే కొనసాగింది. కథ కులు వాళ్ళే, విమర్శకులు వాళ్ళే నవలా కర్తలు వాళ్ళే. ఇలాంటి సందర్భంలో సామాజిక అసమానతలను తన కవిత్వంలో స్పష్టంగా ఎత్తిచూపి, ఒక సాంఘిక విప్లవాన్నే సృష్టించాడు జాషువా. జాషువా అయినా, రవిదాస్ అయినా, వేమన అయినా, వీర బ్రహ్మం అయినా వీరి కంఠం నుండి, కలం నుండి అనంతమైన కవితా జల పాతం కురవడానికి, మెరవడానికి కారణం వీరు ఈ ప్రపంచాన్ని మోస్తున్న బాధిత సమాజం నుండి వచ్చారు కాబట్టే.

మహాకవి గుర్రం జాషువా ఈ దేశంలో కష్టపడుతున్న వారికి ఫలితం దక్కడం లేదన్నాడు. ఆధిపత్య కులాల దోపిడీ నడుస్తుందన్నాడు. కులాల పేరుతో సాటి మనిషిని పశువు కన్నా హీనంగా చేసే ఈ లోకం హృదయం లేని దన్నాడు. కుట్ర చేసి ఈ దేశ మాదిగ కులస్తుడి కులాన్ని, ధనాన్ని కబళించారనీ, అతని దేహాన్ని పీల్చి పిప్పి చేస్తున్నా రని ప్రకటించాడు. ఈ దేశంలో ఆధిపత్యం వెలగబెడు తున్న వారి పాదాలు కందకుండా చెప్పులు కుట్టి ఇచ్చి జీవిస్తున్నాడు. తనకు ఇంత అన్యాయం చేసినా ఎప్పుడూ అతడు సేవలందించేందుకు నిరాకరించలేదని, అందు వల్ల ఈ భారత దేశం అతని సేవలకు అప్పు వడ్డదని చెప్పాడు జాషువా. నిచ్చెన మెట్ల కుల వ్యవస్థలో అఖరి మెట్టుమీద నిలబడి సమస్త ప్రపంచపు బరువును మాదిగలే మోస్తున్నారు. చెమటోడ్చి ప్రపంచానికి అన్నం పెడుతున్నాడు కానీ, అతనికి బ్రుక్కెడు బువ్వ లేదని అవేదన చెందుతాడు.

ఈ మాదిగ పేద రక్తం తాగి ఇనుప గజ్జెల ఈ దోపిడీ వ్యవస్థ జీవిస్తుందంటాడు. ఈ చాతుర్వర్ణ వ్యవస్థను

ఆయన నాలుగు పడగల హైందవ నాగరాజు అని వర్ణించాడు. ఈ పంచమున్ని చూడంగనే హైందవ నాగ రాజు కసరిబుసకొడుతుందంటాడు. ఈ లోకంలో పంచ ముడి కన్నా నీచమైన జంతువేది లేదని కన్నీరు కారుస్తాడు. జాషువా జ్ఞానతృష్ణ అపారమైనది. క్రైస్తవ ధర్మాన్ని చిన్ననాటి నుండి జాషువా తండ్రి సమక్షంలో అభ్యసించాడు. బైబిల్ పఠనం వల్ల ఆయన వ్యక్తీకరణ శక్తి విపరీతంగా పెరిగింది. ఆయన అభివ్యక్తి చతురత బ్రాహ్మణ పండితులను సైతం ఆశ్చర్య పరిచేది. జాషువా బైబిల్‌తో పాటు భారత, ఇతి హాస పురాణాలు చదివాడు. ఆ ఇతిహాస కథలలోని చిన్న ఇతివృత్తాలను తీసుకొని తన శైలిలో కావ్య ఖండికలు రాశాడు. అంలంకార శాస్త్రం నిర్దేశించిన సూత్రాలు ఒంట బట్టించుకున్నాడు. ఛందస్సులతో ఆటలాడుకున్నాడు. పద్యాలను తన పాదాక్రాంతం చేసుకున్నాడు. అప్పుడు బ్రాహ్మణ పండితులందరు మొనగాడవు జాషువా అని మెచ్చుకున్నారు.

అంటరానివాడు "కవిత్వం" రాయకూడదని శాసిస్తున్న సమాజంలో తన కవితా వధూటిని లోకానికి ఎత్తిచూపాడు. బ్రాహ్మణ,క్షత్రియా వర్ణం వాల్లే కావ్య నాయికా, నాయ కులుగా వుండాలనే నియమాన్ని ధిక్కరించాడు. బహిష్కృతుడైన మాదిగను కావ్య నాయకునిగా చేశాడు. జాషువా రాసిన "గబ్బిలం" ప్రపంచానికి కొత్తనడకను చూపించింది. పుట్టరాని చోట పుట్టడం వల్ల చిక్కు చీకటి వనసీమల్లో చిక్కుకొని కోయిల పాట ఎంతో వృధా అయ్యిందనీ కటిక కొండల మీద మిటకరించి ఎన్నో వెన్నెల వాగులింకి పోయాయనీ, మురికి తెన్నెల మీద పరిమళించి ఎన్ని కస్తూరి జింక లీడేరెనో అని రాశాడు. ఎంత గంధ వహనం, ఎంత తంగెటిజున్ను, ఎంత రత్న కాంతి, ఎంత శాంతి ప్రకృతి గర్భములో భగ్నమై పోయిందో అని వ్యాకుల పడ్డాడు.

వ్యక్తిగత ఆస్తికి వ్యతిరేకంగా రచనలు చేసిన రచయితలు కూడా ఆస్థులు కూడబెట్టుకున్నారు. కానీ జాషువా మాత్రం ఆలు, బిడ్డల కోసం ఏ ఆస్తులు కూడబెట్టలేదు. నేను ఆచరించని నీతులు బోధించి రాని రాగము తీయలేను. సంసారయాత్రకు చాలినంతకు మించి గుడ్డి గవ్వయు కోరుకొనను నేను అని ప్రకటిం చాడు. అలాగే జీవించాడు వ్యక్తిగత ఆస్తులు లేని అసలు, సిసలు సామ్యవాది జాషువా.

మహాకవి జాషువా బౌద్ధం గురించి కావ్యం రాశాడు. బుద్ధుని మీద ఆయన రాసిన కావ్యం అపురూపమైనది. నాగార్జున సాగర్ మీద ఆయన రాసిన కావ్యంలో పల్నాడు సీమలో వికసించిన బౌద్ధ విప్లవాన్ని వర్ణించాడు. కాల కఠోర బూరి పరిఘాహతి కూలిన నాటి బౌద్ధ విద్యాలయ భగ్నసీమల యందు ననంత శతాబ్ద గర్భ నిద్రాలస సంస్కృతీరమ తథాగతు పుణ్య కదాన కంబులన్ జాలిగ బాడుచున్నది, దిశల్ పులకింప వినపించి మీటుచున్ అని రాశాడు. క్రైస్తవ ధర్మాన్ని బైబిల్ వాక్యరూపంలో చెబు తుంది. ఆ వాక్యాన్ని పద్యంలోకి తెచ్చి "క్రీస్తు చరిత్రను" రాశాడు మహాకవి జాషువా. క్రీస్తు చరిత్రను అద్భుతమైన ఖండ కావ్యంగా తీర్చిదిద్దాడు. కానీ క్రైస్తవ ధర్మాధి పతులు మాత్రం జాషువాను హిందూవాదిగ చిత్రించి వెలేశారు. తలదాచుకోవడానికి ఆయన మజీదును ఆశ్రయించాడు. ఒక మసీదులో ఉంటూనే తనరచనా వ్యాసంగాన్ని కొన సాగించాడు. షాజహాన్ ముంతాజ్ ప్రేమను "ఆయన ముంతాజ్ మహల్లో" అద్భుతంగా చిత్రించాడు. జాషువాకు మత పిచ్చి లేదు, మత బేధం లేదు, సర్వమానవ సోదర భావమే ఆయన ఆచరించిన సూత్రం.

జాషువా డా॥అంబేడ్కర్ సమకాలికుడు. కలడు అంబేడ్కరుడు నా సహోదరుడు అని జాషువా చెప్పు కున్నాడు. 1920 నుండి 1932 వరకు జాషువా తీవ్రమైన జీవన్మరణ పోరాటంలో ఉన్నాడు. కటిక దారిద్ర్యాన్ని అనుభవించాడు. వినుకొండలో ఆయన టీచరు ఉద్యోగంలో స్థిరపడ్డాక కొంత ఆర్థిక ఇబ్బందులు తగ్గాయి.

స్వాతంత్ర్యానంతరం గాంధీని హత్య చేసినప్పుడు, ఆయన స్మృత్యర్థం "బాపూజీ" అనే కావ్యం రాశాడు.

ఆయన ఎమ్మెల్సీ గ వున్న సమయంలో చట్టసభల్లో నాయకత్వ స్థానాల్లో వున్న వాళ్ళదే పెత్తనమనే సంగతి తెలిసొచ్చింది. ఆయన మెల్లగా రాజకీయాలకు దూర మవుతూ వచ్చారు. కవిత్వంలో నవయుగ కవి చక్రవర్తి మహాకవి జాషువా కుల, మతాల పరిధిలో ఇమడ లేనని మొత్తం ప్రపంచం ఏమనుకున్నా సరే .. నాకు తరుగు లేదు, నేను విశ్వనరుడను అని ప్రకటించుకున్నాడు. విశ్వజనీన సోదర భావాన్ని కోరుడు.

జీవితం తెలియాలి అంటే ముందు మరణం గూర్చి తెలియాలి. ఇది ఎరిగిన జాషువా "సత్యహరిశ్చంద్ర నాటికి - స్మశాన వాటికలో పేదలు, ధనవంతులనే తేడా లేకుండా మానవదేహాలన్నీ, ఎలా తగలబడి బూడి దౌతాయో వివరిస్తూ ... ఇచ్చోటనే అనే పద్యాన్ని తరచూ వాడుతూ అందరిగతి చివరికి చితే కాదా అనీ ....

ఇచ్చోటనే సత్కవీంద్రుని కమ్మని
కలము నిప్పుల లోన కఱిగి పోయె
ఇచ్చోటనే భూములేలు రాజన్యుల
యధికార ముద్రిక లంతరించె
ఇచ్చోటనే ... ఏ లేత ఇల్లాలి నల్ల
పూసల సొరు గంగల గలసి పోయె
ఇచ్చోటనే ... ఎన్నిపేరెన్ని కల్గన్న

చిత్రలేఖకుని కుంచియ నశియించె - అంటూ జాషువా ఎంతటివాడైనా చివరికి ఇక్కడ బూడిద కావల సిందే అంటూ మానవ జీవితానికి వున్న ఎన్నో పార్శ్వాలను స్పృశించాడు.

జాషువా కవిత్వంలోని భావం, దు:ఖం, లయ, శృతి, శబ్ద సౌందర్య తరంగాలు ఎవరో విశ్వాధినేతకు నివేదించి న్యాయం అడుగుతున్నట్లుగా అనిపిస్తుంది. గుండెలోని ప్రతి అణువులో ప్రకంపనలు సృష్టిస్తుంది. జాషువా కవిత్వం సంఘంలోని ప్రతిబాధితుడి హృదయ స్పందన, రోదన.

జాషువా ఒక సారి రైలులో ప్రయాణిస్తున్నప్పుడు ప్రకృతిని, మానవుణ్ణి అద్భుతంగా తన కవితా శక్తితో వర్ణిస్తున్నప్పుడు ఆ రైలు పెట్టెలోని వారందరు జాషువా ప్రతిభకు ముగ్ధులైపోయారు. చివరికి నీదేకులం అని జాషువాని అడిగి'మాదిగ' ని చెప్పంగనే అప్పటి వరకు భళీ - భళీ అన్నవారే తన కులం తెలియగానే సరస్వతీ మైలపడిపోయిందన్నారు. ఆ రైలు పెట్టె నుండి అందరు పరుగులు తీశారు.

నా కవితా వధూటి వదనంబు నెగాదిగ జూచి రూపురే
ఖా కమనీయ వైఖరుల గాంచి భళీ-భళీ యన్న వాడే నీ
దే కులమన్న ప్రశ్నవెలయించి చివుక్కున లేచి పోవుచో
బాకున గ్రుమ్మినట్లగును పార్థివ చంద్ర! వచింప సిగ్గగున్.

జాషువా ఒంటరిగా కూర్చొని రోధించాడు. గుండెలు పగిలేలా ఏడ్చాడు. ఇలా తన జీవితంలో ఎన్నో అవ మానాలకు గురయ్యాడు జాషువా.

ఆ తర్వాత విశ్వనాధ సత్యనారాయణ, శ్రీశ్రీ, ఆరుద్ర అప్పటి సమకాలీన అగ్రకుల కవులందరూ ఆయనను అడుగడుగున అవమాన పరిచారు. ఒకే వేదికపై కూర్చొని అనేక సాహితీ సభలలో పాల్గొనే వారు కానీ ... జాషువాకి మాత్రం అదే వేదికపై దూరంగా ఒక కుర్చీ వేసేవారు. ఈ కవులతో కలిసి భోజనం పెట్టేవారు కాదు. ఇది ఎంతటి అవమానం .....

ఇలా అనేక సందర్భాల్లో జాషువా ఎన్నో అవమానాలను భరిస్తూ ... ఆవేదన చెందాడు.

రాజు మరణించె ఒక తార (నేల) రాలిపోయె
సుకవి మరణించె ఒక తార గగన మెక్కే
రాజు జీవించె ఖాతి విగ్రహము లందు
సుకవి జీవించె ప్రజల నాలుకల యందు
ఈ జగతికి అతిధిగా వచ్చిన జాషువా !
ఓ విశ్వనరుడా ....
నీ సాహితీ వనంలో పూవునై పూస్తాను.

BHAVAVEENA
Vol. 17, Issue. 7, July 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

ప్రజా జీవన చిత్రానికి దర్పణం వట్టికోట ఆళ్వారు స్వామి రచనలు

- మేరోజు బ్రహ్మచారి

వట్టికోట ఆళ్వారుస్వామి చిన్న తనంలో పెద్దగా చదవుకోలేదు. చదువు ఆయనకి అబ్బలేదని అంటారు. ఆ రోజుల్లో హైదరాబాద్ నుండి సురవరం ప్రతాపరెడ్డి గారి సంపాదకత్వంలో వెలువడుతున్న గోల్కొండ పత్రికలో 'ప్రూఫ్ రీడర్' గా ఉద్యోగంలో చేరారు. నెలకు పదిహేను రూపాయల జీతం. ఆ తర్వాత ఆ నౌకరీ వదలి, విజయ వాడలో ఒక హోటల్ 'సర్వర్' గా కొంతకాలం పనిచేశారు. విజయవాడలో ఉద్యోగం చేసుకుంటూ స్వయంకృషితో తెలుగు, ఇంగ్లీషు సాహిత్యంపై అభాలాష పెంపొందించు కున్నారు. తనకు వచ్చే నెలసరి జీతంలో సగభాగం అనేక సాహిత్య పత్రికలు కొనడానికే ఆయన ఉపయోగించుకునే వారని ఆయన మిత్రులు చెప్తారు.

శ్రీ ఆళ్వారు స్వామి కొంతకాలం 'తెలుగు తల్లి' పేరిట ఒక మాన పత్రికను ప్రచురించారు. అనంతరం సికింద్రా బాద్‌లో స్థిరపడ్డ శ్రీ ఆళ్వారుస్వామి అనాటి నిజాం వ్యతిరేక ఉద్యమాల్లో, భారత స్వాతంత్ర్య సమర సత్యాగ్రహంలో చురుకైన పాత్ర పోషించారు. అనాడు సికింద్రాబాద్‌లో గల ఏకైక జాతీయ నాయకుడుగా శ్రీ ఆళ్వారు స్వామి ప్రఖ్యాతి చెందారు.

ఆళ్వారు స్వామి రెండు నవలలు రాశాడు. మొదటిది 'ప్రజల మనిషి' రెండోవది 'గంగు' గంగు అసంపూర్తి నవల. 1930 నండి 1938 వరకు అంటే అనాటి హైద్రాబాద్ సంస్థానంలో ఇండియన్ నేషనల్ కాంగ్రేస్ ఆవిర్భావం వరకు జరిగిన పరిణామాల్ని చిత్రిస్తూ ఆయన రచించిన మొదటి నవల 'ప్రజల మనిషి' ఆ తర్వాత రచించిన రెండవ నవల గంగు. 1948 నుండి 1951 వరకు జరిగిన పరిణామాల్ని చిత్రిస్తూ ఆయన మూడవ నవల రాయాలనుకున్నాడు. కానీ గంగు నవలను మూడొంతులు మాత్రమే పూర్తిచేశాక ఆయన ఆకస్మాత్తుగా గుండెపోటుతో మరణించాడు.

తెలంగాణ వాస్తవికతను నిర్దిష్టంగా ప్రతిబింబించిన రచయిత వట్టికోట ఆళ్వారుస్వామి. తెలంగాణ ఉద్య మంలో మునిగితేలిన ఆయన తెలంగాణ నవలకు విశిష్ట మైన స్థానాన్ని కల్పించాడు. ఆయన నిబద్ధత మాత్రమే కాకుండా నిమగ్నత ఆయన నవలలకు నిర్దిష్ట వాస్తవికతకు దోహదం చేశాయి. వట్టికోట ఆళ్వారుస్వామి కళాదృష్టి వల్ల అవి సార్వజనీనతను సంతరించుకున్నాయి. అందుకే ఆయన నవలల్లో కాలం, సమాజం, వ్యక్తులు పరిణామం చెందిన క్రమాన్ని చూస్తాం. ప్రజల మనిషిలోని కంఠీరవం మాత్రమే కాదు, గంగు నవలలోని నాగభేషణం, అంతమ్మ, సుజాత, నీలవేణి వంటి పాత్రలు కమ్యూ నిష్టులుగా రూపుదిద్దికునే క్రమం అత్యంత సహజంగా చిత్రితమైంది.

నిజాం పాలనలో దొరలు ప్రజలను అణచివేసిన తీరును, దోపిడికి ఎదురయ్యే అడ్డంకులను అధిగమించ డానికి వారు చేసే కుట్రలను, అన్యాయాలను ఆయన ప్రజల మనిసి నవలలో చిత్రిక కట్టారు. మతమార్పిడు లను, వాటిని ఆపడానికి చేసిన ప్రయత్నాలను ఆయన వాస్తవికంగా ప్రతిబింబిచాడు. ఈ క్రమంలో ప్రజల మనిషి నవలలో కంఠీరవం అనే ఒక సామాన్య వ్యక్తి ప్రజల మనిషిగా ఎదిగిన పరిణామక్రమాన్ని సహజత్వం ఉట్టి పడేలా రాశారు. 1935 నుండి 40 వరకు తెలంగాణ ప్రజాజీవితాన్ని ప్రజల మనిషి నవలలో వట్టికోట ఆళ్వారు స్వామి చిత్రించాడు.

ఇక ఆయన రెండో నవల 'గంగు' ఒక యువతి తెలం గాణ విమోచనోద్యమం ద్వారా చైతన్యం పొంది కమ్యూ నిస్టు పార్టీ వైపు వెళ్లడాన్ని చిత్రిస్తుంది. ఈ నవల 1940 నుండి 45 వరకు తెలంగాణలోని ప్రజాజీవితాన్ని ప్రతి బింబిస్తుంది. గంగు నవలలో ఇంట్లోంచి వెళ్ళిపోయి

కమ్యూనిస్టు పార్టీలో చేరిన భూస్వామ్యవర్గంలోని యువతి పాత్రను చిత్రించాడు. ఆ పాత్ర పేరు సుజాత. సూజాత పాత్రకు ప్రేరణ వేములపల్లి సత్యవతి అనే అమ్మాయి. నల్లగొండ జిల్లా సూర్యపేట సమీపంలోని బీబీగూడెం నుండి 15 ఏళ్ళ వయసున్న వేములపల్లి సత్యవతి అనే బాలిక కమ్యూనిస్టు పార్టీ పట్ల ఆకర్షితురాలై బెజవాడకు పారపోయింది. ఆమె వెళ్ళిపోయి ప్రసిద్ధుడైన పొట్లూరి వేంకటేశ్వరరావును ఆదర్శవివాహం చేసుకుంది. ఆమె 1943 నుండి 1948 వరకు కమ్యూనిస్టు పార్టీ మహిళా సంఘంలో పనిచేసింది.

గంగు నవలలో నవనీతం అనే ఉద్యమకారుడితో సుజాత ప్రేమను వట్టికోట ఆళ్వారుస్వామి చిత్రించారు. నవనీతం నల్లగొండ జిల్లాలోని రామన్నపేటలో వకీలు వృత్తి చేస్తున్న విశ్వనాథం పుత్రుడు. ఉద్యమ క్రమంలోనే వారి మధ్య ప్రేమ చిగురించడాన్ని రచయిత ప్రధానం చేసుకున్నాడు. గంగు నవలను వట్టికోట ఆళ్వారుస్వామి పూర్తి చేయలేకపోయాడు.

ఆళ్వారుస్వామి నల్గగొండ జిల్లాలోని సూర్యపేట ప్రాంతానికి చెందిన వాడైనప్పటికీ ప్రజలమనిషి లోని కథాకేంద్రం నిజామాబాద్ జిల్లా కామారెడ్డి తాలూకా దిమ్మగూడెం అనే గ్రామం. నవలలో కొంత కల్పన ఉండాలన్న లక్ష్యంతో ఆళ్వారుస్వామి కథాకేంద్రాన్ని నిజామాబాద్ జిల్లాలోని దిమ్మగూడెం అనే గ్రామానికి మార్చాడు. నిజానికి ఈ నవలలో చిత్రించబడిన సంఘటనలన్నీ నల్లగొండ జిల్లాలో జరిగినవే.

ప్రజలమనిషిలో ఎన్నో ముఖ్య పాత్రలున్నాయి. అందులో కొమరయ్య పాత్రకూడా ఒకటి. కొమరయ్య సన్నకారు రైతులకు ప్రతినిధి. అలాగే రామభూపాల్ రావు ఆనాటి దొరలకు, హైదర్ అలీ ఆనాటి అంజుమన్ ముసల్మీన్ ఉద్యమానికి, విజయదేవుడు ఆర్య సమాజానికి, వెంకటాచారి దొరల పంచన బతుకుతూ దొరలకు దాస్యం చేసేవారికి ప్రతినిధులు. నిజానికి 'ప్రజలమనిషి ప్రధానంగా ఉద్యమ నవల. పాత్రచిత్రణ కివ్వాల్సినంత ప్రాధాన్యాన్ని రచయిత ఈ నవలలో ఇవ్వలేకపోయాడని నాకనిపించింది. కాబట్టి ఈ నవల ఉద్యమ నవలగానే చూడాలి.

కంఠీరవాన్ని ఆ ఉద్యమ నాయకుడిగా, కొమరయ్యను ఆ ఉద్యమంలో కంఠీరవానికి అండగా నిల్చినవాడిగా చూడాలి.

గంగు నవలలో అన్ని రకాల ప్రజల జీవితాన్ని చూడవచ్చు. దళితుల(మాదిగల) వ్యథలున్నాయి. గిరిజనుల (లంబాడీల) వెతలున్నాయి. వెనుకబడిన వర్గాల(కాపు తెగల కంసాలి) వేదనలున్నాయి. బ్రాహ్మణులు ప్రాభవమూ ఉంది. ముసల్మానుల సహృదయతా ఉంది. అధికారులుగా వారి దాష్టీకం ఉంది.

గంగు శీర్షికతో ఆరంభమైన నవల గంగు పాత్ర పరిమితంగా ఉండగానే అర్ధాంతరంగా నిలిచిపోయింది. కంసాలి అయిన నాగభూషణం కుమార్తె గంగమ్మ. బాల్యంలో దొర ఆ పాప తల్లి అయిన అంతమ్మపై కన్నేసి ఆపాప బుగ్గలను ముద్దాడి ఉక్కిరిబిక్కిరి చేసిన సందర్భం. కాస్త పెద్దది అయి తండ్రి కమూనిస్టు పార్టీలో తిరుగుతుంటే ఆ పాటలు బాగా పాడుతూ ఉండటం. ఇలా రెండు పర్యాయాలు ప్రస్తావించాడు.

జైలులో వున్న ఈ కాలంలోనే వట్టికోట ఆళ్వారుస్వామి జైలు లోపల కథలను రచించారు. జైలు నుంచి విడుదల అయిం తర్వాత 1952 లో ఆ కథల సంపుటిని ప్రచురించారు.

ఆ కథలో నర్సయ్య బీదవాడు. తోటివిద్యార్థులు ఉన్నత విద్యకోసం దూరం కావటం వివాహమై భార్య పోషణ భారం మీదపడటంతో నర్సయ్య కష్టాల పాలయ్యాడు. చేయటానికి పని దొరకలేదు. ఉద్యోగ ప్రయత్నాలు విఫలమయ్యాయి. దాంతో లక్ష్మయ్య వంటి జేబు దొంగల సహవాసంతో నర్సయ్య విచలితుడయ్యాడు. చేయని నేరానికి పోలీసులు అరెస్టు చేసి జైలులో వేశారు. జైలునుండి బయటకి వచ్చింతరువాత చిన్న చిన్న నేరాలు

చేస్తూ, జైలుకు పోవటం అతని జీవితమైపోయింది. భార్య అతని ప్రవర్తనకు విసిగి దూరమైపోయింది. విధిలేక వేరే దారి లేక జీవన పోషణార్థం నర్సయ్య నేరగాడు అయ్యాడు. బీదతనం నిరుద్యోగం, పోషణభారం మనిషిని ఏవిధంగా నేరస్తున్ని చేస్తుందో నిదర్శనంగా నర్సయ్య పాత్ర చిత్రించ బడింది.

పరిగె కథలో ప్రధానపాత్ర మల్లయ్య. ఈ కథలో ఆళ్వారుస్వామి నిజాం పాలనలో గ్రామాల్లో హరిజనులు వెట్టిచాకిరికి గురయ్యేవారు. ఎంత కష్టం చేసినా భుక్తికి ఏమి దొరికేది కాదు. తినటానికి తిండిలేక పేదరికంతో కష్టాలపాలయ్యేవారు. అటువంటి బీదల, దీనుల అణచి వేతకు గురయినవాళ్ళ జీవిత వృత్తాంతాన్ని ఆళ్వారుస్వామి ఈ కథలో చిత్రించిండు. మల్లయ్య పాత్ర బీదవాడు, దీనుడు. ఒకరోజు మల్లయ్య వెట్టిచాకిరి పోయి ఇంటికి వస్తాడు. తండ్రి చనిపోయే పరిస్థితిలో వుంటాడు. చెల్లెలు ఏడుస్తూ వుంటుంది. ఆ రాత్రికి ఏ విధంగానైనా ఇంత తిండి సంపాదించాలని మల్లయ్య బయటికి పోయి ఒక వరిపోలంలో పరిగె కర్రలను ఏరుకుని రాత్రికి ఇంత కడుపుకు ఆదరువు దొరికిందని సంతోషంగో బయలు దేరుతాడు. కాని అక్కడే వున్న రైతు మల్లయంయను పట్టుకొని తన పొలంలో వరికర్రలను దొంగతనం చేశాడని పోలీసు పటేలుకు ఫిర్యాదు చేస్తాడు. మల్లయ్య దొంగతనం చేశాడని మూడు నెలల జైలు శిక్ష విధిస్తారు. ఒకరోజు జైలు పని మీద బయటికి పోయిన మల్లయ్యకు అతని తండ్రి చనిపోయాడని చెల్లెలు ఊరు విడిచి ఎక్కడికో వెళ్ళిపోయిందని, ఇల్లు పాడు పడిపోయిందని తెలుస్తుంది. మల్లయ్య నిస్సహాయంగా కుమిలి కుమిలి ఏడుస్తాడు. నిరంకుశ పాలనలో సామాన్యునికి న్యాయం జరగదని చెప్తూ ఆళ్వారు స్వామి నిస్సహాయుడైన మల్లయ్య పాత్రను చాలా వాస్తవికంగా చిత్రించారు. చిన్న వృత్తాంతంలో నిజాం క్రూరమైన రాచరిక పాలనలో ప్రజలు ఎట్లా కష్టాలు అనుభవించారో నిక్షిప్తం చేశారు.

ఆళ్వారు స్వామి కథలు సంఘటనలు సమస్యలు ప్రాధాన్యం గల కథలు. కాబట్టి సంఘటనలు నడిపే సమస్యలను చర్చించే పాత్రలను ఆయన సృష్టించారు. కథల్లో ఆళ్వారుస్వామి చెప్పదలచుకున్న భావజాలానికి ప్రాతినిథ్యం వహించే పాత్రలే కన్పిస్తాయి. ఒక్క పరిగె కథలో మాత్రం మల్లయ్య పాత్ర చర్మమాసాలున్న మనిషిగా సజీవంగా గోచరిస్తాడు. అతని జీవిత వృత్తాంతం పాఠకుల మనస్సులను కదలిస్తుంది. మిగతా పాత్రల లాగా ఆలోచింపజేయదు.

జైలులోపల కథల సంపుటిలోని కథలన్నీ జైలులో వున్నవారి వృత్తాంతాలే.

వట్టికోట ఆళ్వారుస్వామి రచనలలో చాలా తక్కువగా చర్చలోకి వచ్చిన గ్రంథం రామప్ప రభస.

వట్టికోట 1956 - 57 ల నాటి తెలంగాణ పట్ల, దేశ స్వాతంత్ర్యానంతర పరిస్థితుల పట్ల ఉన్న ఆలోచనలు, ఆశయాలను తెలియజేయడానికి యీ కథనాలలోని 'రామప్ప ' పాత్ర ఒక మాధ్యమం. రామప్ప రభస ఆళ్వారు స్వామి మండుతున్న గుండెకు అక్షరరూపం. రామప్ప రభస ద్వారా వ్యక్తమయ్యే ఆళ్వారుస్వామి వ్యక్తిత్వాన్ని తెలుసుకోవచ్చు

సమాజంలో కనిపిస్తున్న, పేరుకుపోతున్న కుళ్లును చూసి కుమిలి కశించే మనస్తత్వం గల మనిషి వట్టికోట. వ్యక్తుల స్వార్థం కింద, స్వప్రయోజనాల కింద దెబ్బ తింటున్న దేశశ్రేయస్సు, సమిష్టి ప్రయోజనం, అధికారుల్లో కనిపించే లోపాలు కారితనం, అన్యాయ ప్రవర్తన, రాజ కీయ అనినీతి, పోలిసుజులం వంటి అక్రమాల తాకిడికి నలిగిపోతున్న సామాన్యుల అనహాయతను గురించి మిత్రులకు రాసిన లేఖకథనంలో అవేదనను వ్యక్తం చేశాడు.

ఆస్తులను సంపాదించుకోవడానికి, సంపన్నులు కావ డానికి ఎక్కడి కక్కడ దేశస్వాతంత్ర్యోద్యమం, తెలంగాణ విమోచనోద్యమం తరువాతి సామాజిక, సాంఘీక అవసరా

లను తమ కనుకూలంగా మార్చుకొంటున్న స్వార్థపరులు, ఛోటా బడానేతల పరిపాలకుల అధికారుల అవినీతి, అక్రమ వ్యవహారాలను ప్రజల ముందుకు తేవటానికి ఆళ్వారుస్వామి ఎంత నిబద్ధుడయ్యాడో మనం యీ లేఖా కథనంలో రామప్పపాత్ర ద్వారా గుర్తించవచ్చు.

మధ్యతరగతి సమాజానికి సంబంధించిన సమస్త విషయాలను విమర్శాత్మకంగా స్పృశించడం కనిపిస్తుంది. రామప్ప రభసలో విమర్శ కంటె వాస్తవాలను బయటపెట్టే ప్రయత్నం అనేక ప్రజా సమస్యలను వాటి పరిష్కారాలతో పాటు ప్రజల ముందుంచే యథార్థ దక్పథం భూమికగా వుంది. 'రామప్ప రభస' శైలి నిరాడంబరమైంది.

రామప్ప రభసలో 1956 -- 57 ల నాటి తెలంగాణ ప్రజల జీవన వ్యవస్థలోకి ప్రవేశిస్తున్న, ప్రవేశించిన మెసపూరిత విధానాలు, రాజకీయ అక్రమాలు, అవినీతి పాలన వంటి అనేక అంశాలకు అక్షరరూపం ఇచ్చి 'రభస' చేశాడు ఆళ్వారుస్వామి. ఈ కాలమ్ కథనాలలో ఎప్పుడూ గొడవ మనిషిగానే ఆళ్వారుస్వామి కనిపిస్తాడు.

గ్రామీణ ప్రాంతాల్లోని నిరక్షరాస్యత వల్ల అనాదిగా వస్తున్న పెత్తందారీతనం వల్ల ప్రజలు పడుతున్న కష్ట నష్టాలను వివరిస్తూ చైతన్యం వైపు నడిపించే స్ఫూర్తిని ప్రజల్లో నింపాలన్న భావాలను కల్గించిండు ఆళ్వారు స్వామి. అందువల్ల తెలంగాణలోని ప్రజాజీవితం, గ్రామీణ వాతావరణం, మనుష్యుల మనోభావాల, ఆప్యాయతలు, ప్రేమలు, అధికారాలు, అణచివేతలు కలగలిపి తెలంగాణ ప్రాంతపు ప్రజల జీవితాలను ప్రతిబింబింప జేసిన నవల ప్రజలమనిషి.

నిజాం నిరంకుశ దోపిడి పాలన, గ్రామాల్లో ప్రభుత్వ అండదండలతో సహకారంతో సాగించే పెత్తందారీతనం, సామాజికంగా, ఆర్థికంగా ఘోరంగా పీడింపబడిన సామన్య ప్రజల జీవితం ఈ నవలలో చక్కగా చిత్రించబడింది. నిస్సహాయులైన ప్రజల్లో క్రమంగా చైతన్యం, తిరుగుబాటు తనం ఎలా వచ్చిందో ఈ నవలలో చక్కగా చిత్రించ బడింది. ముఖ్యంగా భూమి సమస్యనే ప్రధానాంశంగా తీసుకున్నడు ఆళ్వారుస్వామి, భూస్వామ్య వ్యవస్థకు ప్రజల స్వేచ్ఛాయుత భావాలకు మధ్య జరిగిన సంఘ ర్షణను తన నవలలో చక్కగా అక్షరబద్ధం చేసిండు. కుల మతాల అడ్డు గోడల్లో మానవ ప్రగతి ఎలా కుంటు పడుతుందో చక్కగా వివరించిండు. కులమతాల కతీతంగా సమ సమాజ స్థాపనే ధ్యేయంగా సాగిన అహింసా కమ్యూనిజం ఇందులో ప్రస్ఫుట మవుతుంది. నాటి సమాజంలో గల వర్ణ వ్యవస్థను మరింత దిగజార్చే విధంగా మతమార్పిడి జరగడం దానివల్ల వచ్చే చిక్కులు తెలుసుకొని ప్రజలు పశ్చాత్తాపపడడం కనిపిస్తుంది.

బాల్యంలోనే తండ్రిని కోల్పోయిన ఆళ్వారుస్వామి జీవన సమరంలో అనేక కష్టాలను చవి చూసి, ప్రజల పక్షాన పోరాటి ప్రజల మనిషిగా చిరస్మరణీయుడ య్యిండు. 1930 నుండి తెలంగాణ విముక్తిని పొందే వరకు జరిగిన ఆంధ్రోద్యమం, గ్రంథాలయోద్యమం, ఆంధ్రమహాసభలు, ప్రజాపోరాలు, కాంగ్రేసు పార్టీ రాజకీయోద్యమం, కమ్యూనిస్టు పార్టీ విప్లవ పోరాటం - ఈ పరిస్థితులన్నింటి ప్రభావం వట్టికోట ఆళ్వారుస్వామి పై చెరగని ముద్రవేసింది. గొప్ప సాహిత్యాభిలాష, సహృదయుడు, మానవతావాది, నిరక్షరాస్యత నిర్మూ లనకు కృషి చేసిన భాషా సేవకుడు శ్రీ ఆళ్వారుస్వామి తీవ్ర గుండె పోటుతో ఆకస్మికంగా 46 సంవత్సరాల పిన్న వయస్సులో 1961 ఫిబ్రవరి 5 న మరణించారు.

❁❁❁

BHAVAVEENA
Vol. 17, Issue. 7, July 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

కానూరి బదరీనాథ్ 'జుత్తిగ' రచన - పరిశీలన

- నెక్కలూరి భవాని, తెలుగు అధ్యాపకురాలు, సి.హెచ్.ఎస్.డి.సెయింట్ థెరిసా మహిళా డిగ్రీ కళాశాల, ఏలూరు.

చక్కని తెలుగు భాషను, చిక్కని తెలుగు సంప్రదాయాలను కలబోసుకున్న ఉభయగోదావరి జిల్లాలు ఎందరో సాహితీవేత్తలను మనకు పరిచయం చేసాయి. అలాగే మేటి సమకాలీన రచయిత కానూరి బదరీనాథ్‌గారిని, వారి రచనలను కూడా పరిచయం చేస్తుంది తణుకు గ్రామం. లోచూపు, అంతర్వాహిని, కౌటిల్యుని నిష్క్రమణం, కవిగారు, తణుకుతళుకులు వంటి రచనలతో పాటు జుత్తిగ, పానార విషయం వంటి క్షేత్ర మహిమలను కూడా రచించిన బదరీనాథ్‌గారి చారిత్రక పరిశీలనాశక్తి, రచనా పటిమ ప్రశంసించదగినది.

బదరీనాథ్‌గారు రచించిన జుత్తిగ రచన - 'జుత్తిగ'గా ప్రసిద్ధికెక్కిన దూతికాపురం గురించి వివరిస్తుంది. కాశీ క్షేత్రంలో ఉన్న కాశీ దుర్గ ముక్తిని ఇస్తే దూతిదుర్గ శక్తిని, ముక్తిని ఇచ్చే శివదూతి శక్తి అని అందుకే ఈ పురమునకు దూతికాపురము అనే పేరు వచ్చిందని దూతికాపురము నామ ప్రాశస్త్యాన్ని తెలియజేశారు. జుత్తిగను ఆనుకుని ఉన్న శంబూక రామేశ్వరం విశిష్టతతోపాటు త్రైలోక్య మోహన క్షేత్రం అనే పేరు ఉన్న "తణుకు"ని గురించి, చుట్టుపక్కల ప్రదేశాల గురించి, వాటి విశిష్టతల గురించి చారిత్రకంగా వివరించి క్షేత్ర మహాత్మ్యం గల శైవక్షేత్రంగా, దర్శనీయ ప్రదేశంగా జుత్తిగ క్షేత్రమును గురించి వివరించారు.

జుత్తిగలో కొలువై ఉన్న "శ్రీ ఉమావాసుకి రవి సోమేశ్వర స్వామి" వారి ఆలయ విశిష్టలను తెలియజేయడంలో బదరీనాథ్‌గారి ఆధ్యాత్మిక దృష్టి, పరిశీలనాసక్తి ప్రత్యక్షంగా ప్రస్ఫుటమవుతుంది. పవిత్ర గోస్తనీ నదీ తీరాన వెలసిన ఈ స్వామి యొక్క ఆలయ విశిష్టతలను, ఈ స్వామిని సేవించడం వలన కలిగే ప్రయోజనాలను, సోమేశ్వర లింగం యొక్క ప్రత్యేకతలను గురించి, స్వామి వారి లింగం యొక్క ప్రాచీనతలను గురించి వివరించి స్వామి యొక్క మహిమలను తన రచన ద్వారా ఎందరికో పరిచయం చేశారు.

జ్యోతిర్లింగాలు కొలువైన క్షేత్రములను ఆంధ్రప్రదేశ్‌లోని పంచారామాలను మాత్రమే ప్రత్యేకంగా భావించే భక్తజనులకు జుత్తిగ క్షేత్ర పరిచయం నిజంగా ఒక వరం లాంటిది. బదరీనాథ్‌గారి రచనా శైలిలో వారు ప్రకటించిన చారిత్రక సత్యములలో ఈ విషయం స్పష్టంగా స్పష్టమవుతుంది. ద్వాదశ జ్యోతిర్లింగములలో పేర్కొన్న ఘృశ్మేశ్వర లింగమునకు సంబంధించిన ప్రాచీన కథయు, జుత్తిగలో వెలసిన సోమేశ్వర లింగమునకు సంబంధించిన ప్రాచీన కథయు పూర్తిగా ఒకే విధంగా ఒకదానికొకటి పోలి ఉండిన తీరును గురించి బదరీనాథ్‌గారు సంక్షిప్త సుందరంగా వివరించారు. అంతేగాక జుత్తిగలోని లింగమును జ్యోతిర్లింగమని నిరూపించుటకు తగిన పౌరాణిక, చారిత్రకాధారాలను గురించి కూడా వివరించారు. స్వామి నదిలో ప్రత్యక్షమైన స్థలంలో అప్పుడున్న జమ్మిచెట్టు ఇప్పటికి ఈ ఆలయంలో ఉండటం, గ్రామంలో పార్థివ లింగాలు లభ్యం కావడం, స్థల పురాణ కథ, పౌరాణికుల ప్రముఖుల అభిప్రాయాలు వంటి వాటి ద్వారా జుత్తిగ క్షేత్ర మహిమను వివరించిన తీరు వారి పరిశీలనాదృష్టిని, జుత్తిగ క్షేత్రంపై ఆయనకు గల మమకారాన్ని స్పష్టపరుస్తుంది.

పవిత్ర గోస్తనీ నదీ తీరాన వెలసిన ఈ క్షేత్రమును కాశీతో సమానమైనదని, దక్షిణ కాశీ అని వివిధ పరిశీలనల ద్వారా, ప్రముఖుల అభిప్రాయాల ద్వారా స్పష్టంచేశారు. గోల్కొండ నవాబు అనుమతితో పునర్నిర్మించబడిన ఈ ఆలయం మత సహనమును, మత సామరస్యమును కలిగినటువంటి ప్రత్యేకమైన ఆలయమని, ఆలయంపై మరింత భక్తి, గౌరవం కలిగే విధంగా బదరీనాథ్‌గారు

వివరించారు. జుత్తిగ సోమేశ్వరుని లీలలు, మహిమలను కూడా ఈ రచనలో మనం గమనించవచ్చు. కోరిన కోర్కెలు నెరవేర్చే దైవంగా కొలువైన సోమేశ్వరుని గురించి విపులంగా చర్చించారు. సత్తివంశపు కులస్థులకు, తతిమా కులస్థులకు కులదేవతగా ప్రసిద్ధికెక్కిన పుత్రశక్తి అమ్మ వారిని గురించి ఈ రచనలో పొందుపరిచారు. విజయానికి సంకేతంగా, ఆది దంపతుల పుత్రుని చేత సృష్టించబడిన శక్తి స్వరూపంగా వెలసిన పుత్రశక్తి అమ్మవారు సుమారు 400 ఏళ్ళ నుండి పూజింపబడుతున్నట్లుగా తెలియజేసి శక్తి యొక్క మాహాత్మ్యాన్ని ప్రశంసించారు. బదరీ నాథ్ గారు 'దూతిక' నామం పై విశేష పరిశీలన చేసి దానిని జుత్తిగ, పానార విషయం రచనలలో కూడా పొందు పరిచారు.

మరే శైవక్షేత్రంలోనూ లేని విధంగా ఇక్కడ అమ్మవారు దూతిక నామంతో కొలువబడటం విశేషంగా కొని యాడారు. దూతికార్థాన్ని "మంత్రిణ్యంబా స్వరూపిణి"గా చెప్పవచ్చునని శ్రీ వల్లూరి విజయ హనుమంతువరావు గారి అభిప్రాయాన్ని జతచేశారు. జుత్తిగ శాసనములలో కూడా నాగరాజుల కులదేవత "మాణిక్యాంబ"గా పిలువబడే 'దంతేశ్వరి' కాలక్రమంలో దూతేశ్వరిగా మారి చివరకు దూతిక రూపంలో నిలిచిపోయి ఉంటుందనే విషయాన్ని ప్రస్తావించారు. 'పానార విషయం' రచనలో కూడా ప్రస్తావించిన కొన్ని గ్రామ నామాలలో 'దుత్తిక' శాసన గ్రామం నేటి 'జుత్తిగ'గా మారిందనే విషయాన్ని స్పష్టపరచారు. గ్రామనామ విషయంలో వారు కనబరిచిన ఆసక్తి, పరిశీలన నిజంగా ప్రశంసించదగినది.

దూతికాపురంలో కొలువైన ఇతర గ్రామ దేవతల గురించి కూడా ఈ రచనలో బదరీనాథ్‌గారు తెలియ జేశారు. మారెమ్మ, పోలేరమ్మ, అమ్మవార్లను భక్తులు కొలిచే విధానంతో పాటు గ్రామానికి వాయువ్యంలో కొలువున్న వల్లీ సమేత సుబ్రహ్మణ్యేశ్వర దేవాలయం గురించి కూడా ఈ రచనలో ప్రస్తావించారు.

ఈ విధంగా జ్యోతిర్లింగాలతో సమాన ప్రతిపత్తి గల జుత్తిగ క్షేత్రం ఒక మారుమూల గ్రామంగా మిగిలి పోకుండా తన రచన ద్వారా వెలుగులోకి తేవాలనుకున్న శ్రీకానూరి బదరీనాథ్‌గారి జిజ్ఞాస ప్రసంశనీయమైనది. పవిత్ర గోస్తనీ నదీ వర్ణన జుత్తిగతో పాటు పానార విషయంలో కూడా విస్తృతంగా వర్ణించి, నదీప్రాశస్త్యాన్ని ప్రశంసించారు. సమకాలీన సమాజంతో పాటు రాబోయే తరాలకు కూడా చక్కని సమాచారాన్ని జుత్తిగ క్షేత్రాన్ని దర్శించుకోవాలనే ఆతృతను కలిగిస్తూ తనదైన రచనా శైలిలో చక్కని రచనను మనకందించారు.

బదరీనాథ్‌గారు రచించిన ఈ జుత్తిగ, పానార విషయము రచనలను పరిశీలిస్తే మనదేశంలో ఇలాంటి మహిమాన్విత క్షేత్రములు మరెన్ని కలవో అనే ఆసక్తి కల్గు తుంది. అంతటి ఆసక్తి కలిగేవిధంగా చక్కని క్షేత్రములు గురించి మనకుపరిచయం చేసిన బదరీనాథ్‌గారి విషయ పరిజ్ఞానం, బహు ప్రశంసనీయం. జుత్తిగను గురించి వీలైనంత ఎక్కువ విషయసేకరణ చేసిన సమగ్రంగా సమాజానికి అందించాలనే వారి జిజ్ఞాస కొనియాడదగినది. కాబట్టి ఇలాంటి వాస్తవిక రచనలు మరిన్ని వెలుగులోనికి వస్తే మన చారిత్రక, వైశిష్ట్య ప్రదేశాలు మరింత అభివృద్ధి చెందుతాయి. దేశచరిత్రలో ఉన్నత శిఖరాలుగా మిగిలి పోతాయి. తద్వారా నేటి సమాజంతో పాటు రాబోయే తరాలకు కూడా ఆధ్యాత్మిక దృష్టి పెంపొందుతుంది.

ఆలయానికి సంబంధించిన వివరణలు కోసం ప్రముఖుల అభిప్రాయాలను, భక్తుల అనుభవాలను సేకరించి, సంబంధిత పురాణాలలోని సమాచారం పుణికిపుచ్చుకుని, వాటితో పాటు క్షేత్రానికి సంబంధించిన శాసనాల సమాచారాన్ని జతచేసి రచనలో పొందుపరచిన బదరీనాథ్‌గారి కృషి, పట్టుదల, రచనా పటిమ, ప్రశంస నీయం. ఇలాంటి దర్శనీయ ప్రదేశాల గురించి సమాజా నికి తెలియజేయాలనుకునే వారికి వీరి రచనలు ఆదర్శ ప్రాయం. ఇలాంటి విశిష్టత కల్గిన ఆలయాలు గురించి, విశిష్టమైన ప్రదేశాల గురించి తెలుసుకోవడం వలన చరిత్రలో ప్రసిద్ధి పొందిన స్థలాల యొక్క జ్ఞానం సంపా దించి, మన చారిత్రక ప్రదేశాలపై మరింత గౌరవభావాన్ని పెంపొందించుకోవచ్చు.

BHAVAVEENA
Vol. 17, Issue. 7, July 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

విద్యార్థి రచనలు సామాజికత

- ఎస్. గోదావరి

కాళన్న జీవితమే ప్రజలకొరకు ముడుపు కట్టబడ్డది. అట్లాంటి ప్రజాకవి తనకు ఆదర్శం కావడమే ఈ కవిలోని చైతన్యాన్ని ప్రజాపక్షపాతాన్ని తెలియజేస్తున్నది. విద్యార్థి మాటల్లోనే చెబితే కాళోజీ 'శతాబ్దాల్లోనే అరుదుగా ఎదురయ్యే వ్యక్తి' కాబట్టే తనకు ఆయన ఆదర్శం. తన కవిత్వానికి ఆయన ప్రేరణ. కవిత్వం తొలినాళ్ళలోనే ఇంతటి ప్రేరణ పొందాడు కనుకనే ఆయనలో అంత చైతన్యధార ప్రవహించింది. ఏ చైతన్యానికైనా, తనదైన ఏ వ్యక్తీకరణకైనా తొట్టతొలుత గట్టిపునాది పై ప్రేరణ నిలవాలి. అట్లాంటి ప్రేరణే అతని ప్రధాన కవిత్వధారగా మారి లోకంలోకి ప్రవహించి ఆ కవిని ఒక గొప్పకవిగా, నిత్య చైతన్యశీలిగా నిలబెడుతుంది.

విద్యార్థిగారు ప్రపంచంలో పలుదేశాల్ని, పలు ప్రాంతాల్ని ఏవేవో కారణాలవల్ల దర్శించే ఒక మంచి అవకాశాన్ని పొందారు. ఆయన మనసా, వాచా, కర్మణా స్వచ్ఛమైన కవి గనుక ఆయా సందర్శనల్ని కవితామయం చేసి, ఆ క్షణాల అనుభూతుల్ని అక్షరాల్లో ఒడిసిపట్టారు. మనకు అందించారు. మన ఆలోచనల్ని, వాటి పరిధిని పెంచే ప్రయత్నం చేశారు.

దాదాపుగా ఆయన అన్ని కవితా సంకలనాల్లోనూ, ఇతర విషయాలెన్ని ఉన్నా, నేలవిడిచి సాము చెయ్యని ఆయన కవిత్వం నిండా సమాజంపట్ల నిబద్ధత వ్యాపించి ఉంది.

ఏ కవికైన సామాజిక చింతనే ప్రధాన ధర్మం. అట్లాంటి చింతన ఉన్న కవిత్వమే ఆదరణీయ కవిత్వం. దాన్ని రచించి తన చైతన్యాన్ని సమాజపరం చేసి సామాజిక పురోగతికి తానొక మార్గం చూపిన కవి ధన్యుడే. కాబట్టే విద్యార్థి కూడా తన కవితల నేపథ్యమంతా సమాజం నుంచే స్వీకరించి, తిరిగి సమాజానికి, సమాజం కేంద్ర బిందువైన మనిషికి అంతో ఇంతో చైతన్యాన్ని కలిగించే యత్నం చేశాడు.

కవిత్వం 'రాశి'కన్నా 'వాసి'లో మిన్నగా ఉండాలి. అట్లా ఉండాలంటే కవికి సమాజం పట్ల పూర్తి నిబద్ధత ఉండాలి. అలా ఉంది కనుకనే విద్యార్థి సామాన్యుని కష్టం చిందించిన ఘర్మజలంలో సముద్రమంత వైశాల్యాన్ని చూడగలిగాడు. ఘర్మ సముద్రాన్నే సృష్టించగలిగాడు. విద్యార్థి, ఒక గ్రామానికి చెందిన వ్యక్తి కావడంచేత గ్రామాల్లో వచ్చిన మార్పుని కళ్ళముందు గమనించిన వారు. అంతేకాదు 'నగరాలు' అనే దృక్పథం వచ్చిన తర్వాత పల్లెతనం ఎలా మాయమైందో, అర్థం చేసుకుని ఆవేదన చెందినవారు. ఇందుకు 'రహదారి' కవిత మంచి నిదర్శనం. కాలిబాటను పొట్టను పెట్టుకుంటూ, వచ్చిన తారు రోడ్డు 'ఆక్టోపస్' లా కనిపించింది కవికి.

ఒక మారిపోతున్న వ్యవస్థ, మనిషి గుణాల్ని కూడా మార్చేస్తుంది. 'దోపిడి' అంటే తెలియనివాడు కూడా, ఆవైపుకే వెళ్తాడు. దానికి కారణం 'ఆకర్షణ' అనేది, అవగాహనతో చెప్పాడు కవి. 'మార్పు'లో ఎక్కడ 'ఆకర్షణ' 'వ్యామోహం', 'భ్రమ' ఉన్నాయో ఆవైపుగానే మనస్తత్వాలు మారిపోతాయి. ఈ అంశాన్ని ఈనాటి ప్రపంచీకరణ ప్రభావంతో విధ్వంసమౌతున్న విలువల నేపథ్యంలో చాలా స్పష్టంగా గమనిస్తున్నాం. ధన వ్యామోహం గ్రామాల్లోకి ప్రవేశించిన తర్వాత ఈ నాగరికత ప్రవేశించింది. సంస్కృతి వచ్చింది. 'ఆకర్షణ' ప్రధానమైన నగరీకరణ, ఒకరికి మరొకర్ని పరాయివాళ్ళుగా చేసింది. 'కాలిబాట మీది మట్టి వాసనల్నాఘ్రాణిస్తూ' ముందుకు వెళ్తానని, తన సంస్కృతి తాను మార్చుకునే ప్రసక్తి లేదని, కవితని ముగిస్తాడు.

విద్యార్థి కవిత్వంలోని ప్రబలమైన ఒక ప్రేరణ ప్రకృతి సౌందర్యం. అసంఖ్యాకమైన కవితల్లో, హృదయాహ్లాద కరంగా, సూక్ష్మ పరిశీలనతో, అందమైన భావచిత్రాలతో, తానెక్కడుంటే అక్కడి ప్రకృతి సౌందర్యాన్ని అక్షరీకరిస్తాడు. ప్రకృతిని వర్ణించడంలో మానవ చైతన్యాన్నీ, ప్రగతిశీలతనీ కూడా మేళవించి చెప్పడం ఎన్నోచోట్ల చూడగలం. విద్యార్థి, జీవితాన్ని, ప్రకృతినీ, సౌందర్యాన్ని, మానవాను బంధాల్నీ ప్రేమించే కవి. ప్రగతిశీల భావాలు కలిగి, అందరూ సుఖంగా ఉండాలని నిజాయితీగా భావించే కవి. కవితా సామాగ్రిని కూడా అందుకు అనుగుణంగా మలచుకొన్నకవి.

'నిరంతరం' మంచుకురిసే కాలం ముగిసే సందర్భంలో ప్రకృతి పరిణామ శీల సౌందర్యాన్ని ఆవిష్కరించింది.

నిన్నటి
వెండివాకిళ్ళు కరిగి
ఇవ్వాళ
చిగురు పచ్చబయళ్ళు
పరుచుకున్నాయి....."

అని ప్రారంభమయ్యే ఈ కవితలో మంచు కరిగి పచ్చగా ప్రకృతి వికసించటం జడత్వం కరిగి చేతనా విలాసం ఆవిష్కృతం కావటంగా నిరూపించబడింది.

"ఎప్పుడైనా పక్షి
గుక్కెడు నీళ్ళ
దాహాన్ని మీరిందా
గుప్పెడు గింజల
ఆకల్ని దాటిందా ?

ప్రాణధర్మం విస్మరించిందెప్పుడది" అన్న ప్రశ్నలతో కవి పక్షి నా ఆదర్శం అని ప్రకటించినట్లయింది. ఆశ, దురాశ, సంచయనేచ్ఛ, అధికార కాంక్ష గల మనిషిని అభిశంసించినట్లయింది.

వి.ఆర్.విద్యార్థిగా సుప్రసిద్ధుడైన కవి అసలు పేరు వేలూరి రాములు, విద్యార్థి 1966 నుండి కవిత్వం రాస్తున్నారు. తన భావ వ్యక్తీకరణకు 'వచన కవిత'ను వాహిక చేసికున్నారు. అప్పటికి అభ్యుదయ సాహిత్యోద్యమ ఉధృతి దాదాపు తగ్గిపోయినట్టే. 'వచన కవిత' ఒక ప్రక్రియగా నిర్దిష్టరూపం తీసికుంది. వచన కవిత ప్రక్రియను మొదట వ్యతిరేకించిన పద్య కవులు సైతం వచన కవిత రాస్తున్న కాలం నాడు ఎలాంటి ఇజాలకు కవిత్వం వేదిక కాదు. దిగంబర కవుల షాక్ ట్రీట్‌మెంట్ నుండి తేరుకునే ప్రయత్నంలో భాగంగా చేతనావర్త కవులు గళాలు సవరించుకున్నారు. శ్రీశ్రీ తరువాత కవిత్వంపై ఒక ప్రత్యేకముద్ర వేసిన తిలక్ అమృతం కురిసిన రాత్రి మాత్రం అన్ని రకాల కవులకు అప్పటికే ఆదరణీయంగానే ఉంది. మరోవంక ప్రజాస్వామ్య ప్రభుత్వపు కాళోజీ కవితా నిఘా కొనసాగుతూనే ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో వి.ఆర్.విద్యార్థి వచన కవితగా ప్రస్థానం ప్రారంభించాడు.

విద్యార్థిలో తాత్వికుడు వున్నాడు. స్వాప్నికుడున్నాడు. భావుకుడున్నాడు. సామాజిక నియమాల్ని దాటిన సాహసి వున్నాడు. ఆయన వైమానికుడుగా పనిచేశాడు. సంవత్సరాల తరబడి అమెరికాలో వున్నాడు. ఈ కారణంగా ఆయన కవితల్లో మనకు 'ప్రయాణికుడే' కనిపిస్తాడు. తన కంటిని తాకిన ప్రతిదృశ్యాన్ని అద్దంలా ప్రతిబింబిస్తాడు.

కానీ మనకు తెలియని ఆయన లోపలి ప్రపంచ
ముంది
'నా చుట్టూ నా లోపలా వ్యాఖ్యానించ నలవికాని
నిశ్చలత, నిశ్శబ్దం'

వున్నాయని ఆయనే చెప్పుకున్నాడు. తొలినాళ్ళలో అందరిలాగే సామాజిక కవితలు రాశాడు. పేదల బాధలు చూసి చలించాడు. మార్పుకోసం పరితపించాడు. అదే సమయంలో సమాంతరంగా తన అంతరిక చిత్రణ కూడా చేసుకుంటూ వెళ్ళాడు.

'అక్షరాలు ఈ భూగోళం చుట్టూ

స్వేచ్ఛా విహంగాలై ఎగరాలి
శాంతి గీతాలు పాడాలి' అన్నాడు.

అదే సమయంలో

''ఈ లోకంలో ఎవరి స్వార్థం వాళ్ళది' అంటూ
''ఈ ఆర్ద్ర నయనాలు ఎవరిలోనూ కల్సిపోలేక
నిశ్శబ్ద సముద్రాల మీదుగా సుదూర క్షితిజం వైపు
చూస్తుంటాయి'

అంటూ మార్మిక మహాలోకాల్లోకి వెళతాడు. వి.ఆర్. విద్యార్థి కవితలు అన్ని ప్రముఖ పత్రికల్లో, అనేక సాహితి బులెటిన్స్ లో, 'జలపాతం', 'లోవెలుగులు', 'సమర్‌పథే బంగ్లా', 'కవితా ! ఓకవిత, 'మరో కొత్త వంతెన', 'మంజూష', 'గుజరాత్ గాయం ', 'This Tense Time', 'More Voices on the Wing', 'Pride of place'', 'పాక్కిలి', 'భువనఘోష, (పాబ్లోనెరుడా కవిత్వపు అనువాదాలు) 'మరో ప్రపంచం' (మహజర్ మెహదీ ఉర్దూ అనువాదాలు), 'చిగుళ్ళూ - శిఖరాలూ', 'చైతన్య కవిత', 'మచ్చుతునకలు' ('తానా' సంకలనం, ఖూఫా), 'కబురు' ('ఆటా' సంచిక, ఖూఫా) మొదలగు సంకలనాల్లో ప్రచురితమైనవి.

వి.ఆర్.విద్యార్థి కవిత్వంలో ప్రకృతి, ప్రేమ, కరుణ, విశ్వసౌభాతృత్వం, తాత్వికత నిండి ఉంటాయి. ఈ లోకంలో 'హింస' ఒక్కటే పాపం అని వీరి అభిమతం.

రచనలు :

- ♦ అలలు (1987)
- ♦ పలకరింత (1996)
- ♦ ఘర్మ సముద్రం (2004)
- ♦ మంచుమైదానం (2005)
- ♦ ఖండాంతర కవిత్వం (2007)
- ♦ ఆస్మా కా లమ్స్ (2010)

(వి.ఆర్.విద్యార్థి తెలుగు కవితలకు డా॥ఖుత్బ్ సర్ షార్ ఉర్దూ అనువాదాలు)

- ♦ దిగంత(అచ్చులో)

లోకంకోసం వేసుకున్న ఇరుకు దుస్తులన్నీ విడిచేసి అనాధిగా రమ్మని మనిషిని ఆహ్వానిస్తున్నాడు.

నీతో ముచ్చటించాలని ఉంది
అయితే నీవు నేర్చుకున్న
భాషలన్నీ మరిచిపో
నీలో కలిసిపోవాలని ఉంది.
అయితే నీలోని నిన్ను నన్ను వదిలించుకొని
అనాచ్ఛాదితంగా రాదా...

అంటూ కవి ఈ కవితో ఉద్భోవించాడు.

నిన్ను నీవు నిలబెట్టుకొవాలని ఎంత తిప్పలు పడుతున్నావో, అదే నీమీద ఎన్నో ముసుగుల్ని కప్పుతుంది. ఈ తపనంతా నీ బహురూపాలమీదే ఉంది. సాటి మనిషి మీద లేదు.

ఇంకా నీవు ఆ మనిషిని ఎట్లా చేరుకుంటావు. అది సాధ్యం కాదు. అందరిని విడిచిన నీ ఒంటరి జీవతం శూన్యం మాత్రమే.

❁❁❁

BHAVAVEENA
Vol. 17, Issue. 7, July 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

దాశరథి రంగాచార్య జీవన రేఖలు -నవలల ప్రస్తావన

- పి. ఉమా భార్గవి

జీవితంలోని చీకటి వెలుగుల అనుభవాలను పరిపూర్ణంగా ఆస్వాదించగలిగిన సృజనశీలి మాత్రమే రచయిత అవుతాడు. అనుభవాలు అందించిన పరిణతివల్ల అతడి వ్యక్తిత్వం ఎదుగుతుంది. వికసించిన వ్యక్తిత్వం ఛాయలు రచనా రంగంపై ప్రతిబింబాలు చూపుతాయి. ఈ క్రమంలో ఉత్తమస్థాయి సాహిత్యం ఆయన లేఖిని నుండి వెలువడుతుంది. అంటే ఉత్తమ సారస్వత సృజనకు రచయిత జీవితపు అనుభవాలు మూల బిందువులు అవుతాయి. ఈ సూత్రానికి దాశరథి రంగాచార్య జీవితం ఒక తార్కాణం. రచనా రంగంలో ధృవ తారలుగా నిలబడిన రచయితలు యావన్మంది తమ జీవితంలోని ఏదో ఒక సందర్భంలో అతి క్లిష్టమైన సవాళ్ళను ఎదుర్కొని ఉంటారు. దాశరథి రంగాచార్య జీవితం ఇందుకు భిన్నమైనది కాదు. ఆయన జీవన యానంలో ఒక ప్రతిభావంతుడైన రచయిత. జీవన గమనం ఉంది. ఇందులో ఆరోహణలున్నాయి. అవరోహణలు కన్పిస్తాయి. ఆయన జీవితం వడ్డించిన విస్తరి కాదు.

'1928 ఆగస్ట్ 24వ తేదీనాడు రంగాచార్య జన్మించారు. స్వస్థలం వరంగల్లు జిల్లా చిన్నగూడూరు. నాటి అవిభక్త వరంగల్ జిల్లాల్లో వరంగల్ - ఖమ్మం మధ్య ఉంటుంది. జిల్లాకేంద్రం వరంగల్ అయినా ఖమ్మంలో సంబంధ బాంధవ్యాలు ఎక్కువ. ఆనాటి నిజాం సంస్థానంలో పలు విధాలైన పాలనారీతులు ఉండేవి. మెదక్, ఆదిలాబాద్ వంటి జిల్లాల్లో పిల్ల నవాబులు, పెద్ద జమీందార్ల దాష్టీకం తక్కువ. అయితే వరంగల్, నల్లగొండ జిల్లాల్లో ఇందుకు భిన్నమైన పాలనా స్వరూపం ఉండేది. ఈ రెండు జిల్లాలలోనూ భూస్వాముల పెద్దరికం అధికం. గ్రామాధికారులు, భూస్వాములు, ముస్లిం అధికారులు ఒక ఉమ్మడి అధికార గణం వలె ఉండేవారు. వారిలో వారికే విభేదాలు ఉండేవి. అయినా గ్రామీణ పేద ప్రజానీకాన్ని పీడించే విషయంలో వీరి మధ్య ఐకమత్యం వెల్లివిరిసేది. నిజాం సర్కారు రూపొందించిన ప్రభుత్వ ఆదేశ సూత్రాలకు వరంగల్, నల్లగొండ జిల్లాల్లో ఎటువంటి విలువలేదు. అక్కడ దాదాపు ఒక ఆటవిక రాజ్యం చలామణి అయింది!' ఈ సమాజ స్వరూపాన్ని రంగాచార్య తన బాల్యంలో చూశారు.

రంగాచార్యుల వారి తండ్రి వెంకటాచార్యులు. మంచి పండితుడు. పురాణాది ప్రవచన రంగంలో దిట్ట. వరంగల్ జిల్లాలో పేరున్నవాడు. హైదరాబాద్‌లోని ఆనాటి ప్రముఖులతో కూడా ఆయనకు చక్కని స్నేహ సంబంధాలు ఉండేవి. రంగాచార్య తల్లిగారు వెంకటమ్మ, పరమసాధ్వి ఆచార్యుల వారికి తన తండ్రితో కంటే తల్లితో అనుబంధం ఎక్కువ. దీనికి కారణం వెంకటాచార్యుల వారి తత్వం. ఆయనలో ఒక విధమైన పలాయనతత్వం కన్పించేది. కుటుంబ బాధ్యతల నుండి తప్పించుకుంటూ తిరిగే వారు. కుటుంబ పోషణ గురించి అంతగా పట్టించుకునే వారు కాదు. ఇంతటితోనే సరిపుచ్చుకోలేదు. ద్వితీయ వివాహం చసుకున్నారు. కుటుంబం వల్ల పూర్తి నిర్లక్ష్యంతో వ్యవహరించాడు. ఈ సమయంలో రంగాచార్య, ఆయన అన్నగారు కృష్ణమాచార్య పిన్న వయస్కులు. కుటుంబాన్ని పోషించే భారం వీరిపై పడింది. దాశరథి సోదరుల బాల్య జీవనానుభవాలు అన్న పోషణ కోసం కష్టపడిన స్థితినుండి ఆరంభమయ్యాయి. చేరుతో ఆరంభమైన పరిపూర్ణ జీవితం రంగాచార్యది.

ఆయనకు తన బాల్యంలో తగిన విద్యావసతి దొరకలేదు. తండ్రి గారికి కుమారుల చదువుపై శ్రద్ధ లేదు. రంగాచార్యను కూడా పురాణ ప్రవచన నిపుణుడిగా

తయారు చేయాలని వెంకటాచార్యులు సంకల్పించారు. ఆర్థికపరమైన ప్రయోజనాల కోసం ఆయన ఈ సంకల్పాన్ని పెట్టుకొని ఉంటారు. రంగాచార్యకు పురాణ ప్రవచనాలు ఇష్టం కాలేదు. స్వీయ అభిరుచుల ఆధారంగా జీవితాన్ని తీర్చిదిద్దుకోవాలని ఆయన నిశ్చయించుకున్నారు. రంగాచార్య కుటుంబానికి సంస్కృతంలో చక్కని పరిచయం ఉంది. అయితే నిజాం సంస్థాన పరిధిలో ఆ భాషకు ఎటువంటి విలువ లేదు. ఉర్దూ మాధ్యమంలో విద్యాభ్యాసం చేయాలి. ఇది తొలుత రంగాచార్యకు రుచించలేదు. అయినా ఇదొక అనివార్యమైన అంశం. అప్పటి పాఠశాలల్లో ఉర్దూ మాధ్యమం మాత్రమే అమలవుతూ ఉండేది. ఆ భాషను కాదనుకున్న వారికి విద్యావకాశాలు పూజ్యం. ఈ పరిస్థితుల్లో రంగాచార్య ఉర్దూలో చదివేందుకు నిర్ణయించుకున్నారు. ఆయన ప్రాథమిక విద్యాభ్యాసం ఖమ్మంలో శ్రీకారాన్ని చుట్టుకున్నది. చిన్ననాటి చదువు వీధిబడిలో జరిగింది. అది ఖమ్మం ప్రాథమిక విద్యకు పునాదిరాయి వలె ఉపకరించింది.

శ్రేయోభిలాషుల హితవు ఉపకరించింది. చక్కని భవిష్యత్తు కోసం ఉర్దూలో చదువుకోవడమే మంచిదని హితైషులు సలహా ఇచ్చారు. ఉర్దూ చదువు బాగానే సాగింది. ఆరవ తరగతి వరకు ఖమ్మంలోనే ముందుకు పోయింది. తన వయసు పసిపిల్లల కంటే భిన్నమైన ప్రవృత్తి రంగాచార్యలో నిండుగా వుండేవి. అన్యాయాన్ని ఎదిరించడం, పోరాడటం, అంతస్సాక్షి బోధనకు అనుగుణంగా నడుచుకోవడం ఆయనకు బాల్యం నుండే అలవాటులోకి వచ్చాయి. అప్పటి పాఠశాలల్లో ప్రత్యేక యూనిఫారం ఉండేది. అది నైజాం గులాం గిరిని ప్రతిబింబించేది. నీలి షేర్వానీ, తెల్లపైజామా, కుచ్చుటోపీలను ప్రతి విద్యార్థి విధిగా ధరించవలసిందే. ఇందులో ముస్లిమేతర వివక్షకు తావులేదు. స్కూల్ యూనిఫారంలో ఇస్లామిక్ సంస్కృతికి సంబంధించిన ఆహార్య రూపం సుస్పష్టం. ముస్లిమేతరులు - అంటే ప్రధానంగా హిందువులు తమ స్వీయ సంప్రదాయాన్ని ప్రతిబింబించే దుస్తులు ధరించడానికి వీలులేదు. అధికారులు అందుకు అంగీకరించకపోయేవారు. పాఠశాలలో విధిగా నిర్వహించవలసిన ప్రార్థన ఉర్దూలోనే ఉండేది. ఈ ప్రార్థనలోని ప్రతి వాక్యం నైజాం పాలితుల రాజభక్తికి ప్రతిధ్వనిగా అభివర్ణించవచ్చు. 'తాబెదె ఖాలి.. భే అలం ఏ హ్‌రియాన్ రఖే' (ఆ చంద్రార్కం ఈ రాజ్యాన్ని ఉంచుము అని దీని అర్థం) ఇది అప్పటి ప్రార్థన. రంగాచార్యకు ఈ ప్రార్థన రుచించ లేదు. అందులోని అమితమైన రాజభక్తి ఆయనకు అసహ్యంగా మారింది. నిజాం నవాబును కీర్తించడంలో అర్థంలేదని పదకొండేళ్ళ రంగాచార్యకు అన్పించింది. దీన్ని తప్పించాలని ఆయన అనుకున్నారు. బంకించంద్ర ఛటర్జీ రచించిన వందేమాతర గీతంలోని ఉద్విగ్నతను, పరమ పావన తత్వాన్ని ఆయన గుర్తించారు. ఈ గీతలాపన చేయాలని నిశ్చయించుకున్నారు. తనతో పాటు మరికొంత మంది విద్యార్థులను కూడా ఇందుకు సంసిద్ధం చేశారు. ఈయన వారికి నాయకుడయ్యారు. నిజాం నవాబును ప్రస్తుతించకూడదని ఉద్బోధించారు. రంగాచార్య ఆరంభించిన తొలి పోరాటం ఇక్కడ మొదలైంది. విద్యార్థులు సమ్మె చేశారు. కుచ్చుటోపీని త్యజించారు. ప్రత్యామ్నాయంగా గాంధీటోపీని పెట్టుకున్నారు. ప్రధానోపాధ్యాయుడితో ఈ మేరకు అనుమతిని సాధించుకున్నారు. వారం రోజుల వ్యవధిలో ఈ పోరాట విపరిణామాలు వెలుగులోకి వచ్చాయి. రంగాచార్య అధికార వర్గం లక్ష్యమయ్యారు. 'గద్దారికె సజా' పేరుతో ఆయనను పాఠశాల నుండి తొలగించారు. ఇది ఆకస్మిక పరిణామం. ఊహించి సంఘటన. రంగాచార్యను ప్రభుత్వ వ్యతిరేక శక్తిగా నిజాం సర్కారు యంత్రాంగం గుర్తించింది. నిజాం ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు అర్హత పోయింది. దీనితో రంగాచార్య తండ్రి వెంకటాచార్యులు తన కుమారుడిపై తీవ్రంగా ఆగ్రహించారు. ఇంట్లో నుండి వెళ్లగొట్టారు. ఇటువంటి కష్ట సమయంలో హమాలీ లింగయ్య అనే పేద వ్యక్తి రంగాచార్యను ఆదుకున్నాడు. ఆయన రచనల్లో

సుస్పష్టంగా కన్పించే సామాజిక న్యాయదృష్టి లింగయ్యతో ఏర్పడి అనుబంధం ద్వారా వచ్చినదే. 11 సంవత్సరాల వయసులో, 6వ తరగతిలో రంగాచార్య చదువు నిలిచి పోయింది.

బాల్యంలో వివాహం జరిగింది. ఈ వివాహం ద్వారా ఆయనకు వచ్చిన వరకట్నం అక్షరాలా 116 రూపాయలు. వాస్తవానికి రంగాచార్య వివాహం యాదగిరి గుట్టలో మరొక బాలికతో జరగవలసి ఉంది. ఈమేరకు నిశ్చయం జరిగిపోయింది. తండ్రి వెంకటాచార్యులు మరొక సంబంధం వైపు మొగ్గు చూపారు. వరకట్నం పట్ల ఉన్న మక్కువ మాత్రమే దీనికి కారణం. యాదగిరి గుట్టలో జరగవలసిన వివాహం సికిందరాబాద్‌లో జరిగింది. అప్పటికి రంగాచార్యకు పరిణయమంటే తెలియదు. బాధ్యతలను అందుకోలేని, అర్థం చేసుకోలేని బాల్యం. పెళ్ళికూతురు వయసు 7 సంవత్సరాలు. రంగాచార్య అంతకు నాలుగు సంవత్సరాలు పెద్ద వయసువారు. పెళ్ళి కూతురు ఎట్లా ఉంటుందో పెళ్ళి కుమారుడికి తెలియదు. తండ్రిని ఎదిరించే ధైర్యం రంగాచార్యకు లేదు. పెళ్ళికూతురు పేరు కమల. అప్పటికి బాల్య వివాహాలపై నిషేధం ఉంది. అయినా అవి యథావిధిగా జరుగుతూనే ఉండేవి. పెండ్లి తర్వాత రంగాచార్య జీవితం పలు మలుపులు తిరిగింది. వివాహం జరిగిన సంవత్సరంలోనే ఆయన తొలి ఉద్యమంలో పాల్గొన్నారు. అటు తర్వాత దశాబ్దాల పాటు అన్యాయాలపై పోరాటాన్ని ప్రకటించారు. 'సాధనమున పనులు సమకూరు ధరలోన' అనే సూక్తి రంగాచార్య జీవితానికి వర్తిస్తుంది. ఆరవ తరగతిలో అర్ధాంతరంగా చదువును ఆపివేసిన రంగాచార్య అనంతర కాలంలో అంచెలంచెలుగా ఎదిగారు. ఆయన అభివృద్ధి వెనుక చక్కని కృష్ణి ఉంది. అర్ధాంగి కమల సహకారం, తోడు అయింది. వివాహానంతరం బాధ్యతలు అవగాహనలోకి వచ్చాయి. తెలంగాణా విమోచన అనంతరం మనుషులు మారిపోయారు. వారి మనస్తత్వాలు మారిపోయాయి. విస్మయకరమైన మార్పు వచ్చింది. సామాజిక సంబంధాల్లో మార్పులు చోటు చేసుకున్నాయి.

రంగాచార్య కంటే ముందు తెలంగాణలో నవలా రచనలు చేసిన వారి సంఖ్య చాలా తక్కువ. సురవరం ప్రతాపరెడ్డి, శేషాద్రిరమణ కవుల సంపాదకత్వంలో వచ్చిన 'గోలకొండ కవుల సంచిక'లో కొంతమంది నవలా రచయితల పేర్లు దొరుకుతాయి. కొందరు నవలా రచయిత్రులు కూడా ఉన్నారు. అయితే వీటిలో పలు నవలలు అప్పటికి (నేటికి కూడ) అముద్రితాలు. మరికొన్ని నవలలు అపరాధ పరిశోధన, జానపదకథా స్థాయిలోనే ఉన్నాయి. ఆధునిక ప్రమాణాలలో చూసినపుడు వీటిని ఒకస్థాయి నవలలు అని చెప్పే అవకాశంలేదు. సురవరం ప్రతాపరెడ్డి 'శుద్ధాంతకాంత' అనే నవలను ఆరంభించి నట్టు, అది మధ్యలోనే ఆగిపోయినట్టు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి రాశారు. ఈ నవల కొక్కొండ వెంకటరత్నం రచించిన 'మహా శ్వేత' అనే నవల వంటిది. అయితే 'శుద్ధాంతకాంత' నవల వెలుగులోకి రాకపోవడం వల్ల దానిలోని వస్తువు, ఇతరేతర విశిష్టతలు మనకు పూర్తిగా తెలియకుండపోయాయి.

తెలంగాణలో తొలి సంపూర్ణ నవల 'ప్రజలమనిషి'. వట్టికోట ఆళ్వారుస్వామి ఈ నవలను రచించారు. ఇందులో కంఠీరవం ప్రధాన పాత్ర. రచయిత వట్టికోట ఆళ్వారుస్వామి సందర్భోచిత రీతిలో తెలంగాణ మాండలికాన్ని వినియోగిస్తూ ఈ నవలా రచనను సాగించారు. ఇందులోని ఇతివృత్తం యావత్తూ తెలంగాణ జన జీవితానికి సంబంధించినదే. తెలంగాణలో అప్పుడప్పుడే రెక్కలు విప్పుకుంటున్న జాగృతితో పాటు ప్రగతివాద, ప్రగతి నిరోధక శక్తుల మధ్య సంఘర్షణ, అన్యాయాలకు వ్యతిరేకంగా ప్రజలు సంఘటితం కావడం, ఐక్య పోరాటం ద్వారా సాధించగలిగే ఫలితాలు, సన్నజీవాల వంటి రైతులు భూస్వాములను ఎదిరించిన తెగువ - 'ప్రజల మనిషి' నవలలో ఎంతో సహజంగా చిత్రించబడ్డాయి. వట్టికోట రచించిన మరో నవల 'గంగు' ఇది అసంపూర్ణ మైనది.

ఎంతోమంది రచయితలు కోస్తాంధ్రలో జరిగిన

జాతీయోద్యమాన్ని చిత్రిస్తూ చక్కని నవలలు రచించారు. ఉన్నవ లక్ష్మీనారాయణ 'మాలపల్లి', అడవిబాపిరాజు 'నారాయణరావు', మహీధర రామమోహనరావు 'కొల్లాయి గట్టితేనేమి' ఇందుకు ఉదాహరణలు. కోస్తాంధ్రలో బ్రిటిష్ అధికారం చెలామణిలో ఉండేది. ఆ అధికారాన్ని ధిక్కరించే క్రమంలో ప్రజానీకం ఉద్యమాలు జరిపింది. త్యాగాలు చేసింది. ఈ నేపథ్యంలో రచించబడిన పలు సాహితీ ప్రక్రియలు నాటి కోస్తాంధ్ర సమాజాన్ని ప్రత్యక్షర వాస్తవంగా చిత్రించాయి. కానీ నిజాం ప్రభుత్వం ఏలుబడిలో ఉండిపోయిన తెలంగాణ పరిస్థితుల్ని చిత్రించేందుకు ఆస్థాయి ప్రయత్నాలు జరగలేదు. ఇందుకోసం వట్టికోట ఆళ్వారుస్వామి మాత్రమే ముందుకు వచ్చారు. ఆయన మరణానంతరం తెలంగాణ కథా వస్తువును స్వీకరించిన స్థానిక రచయిత కన్పించరు. వట్టికోట వారు ఆంధ్ర మహాసభ అవతరణ కంటే ముందునాటి పరిస్థితుల్ని తన నవలలో చూపించారు. అటు తర్వాత కూడా తెలంగాణలో ఎన్నో పరిణామాలు చోటుచేసుకున్నాయి. వాటిని తన రచనల్లో ప్రతిబింబించేందుకు రంగాచార్య కలం పట్టారు. నవలా పరంపరను రచించడం ద్వారా ఆయన తన సంకల్ప సాఫల్యాన్ని సాధించారు. రంగాచార్య తన రచనల ద్వారా తెలంగాణలోని అన్ని రంగాల్ని స్పృశించారు. ఆయన నవలల్లో స్వాతంత్ర్యానంతర కాలానికి సంబంధించిన తెలంగాణ ఎక్కువగా కన్పిస్తుంది. 'చిల్లర దేవుళ్ళు', 'మోదుగుపూలు' నవలలు మాత్రం తెలంగాణ విమోచన పూర్వస్థితిని అభివర్ణిస్తాయి. సమీపగతాన్ని, సమకాలీన చరిత్రను నవలా రూపంలో అక్షర బద్ధం చేయాలని కోరుకున్న మహారచయిత దాశరథి రంగాచార్య.

రంగాచార్య తన రచనల్లో తెలంగాణ మాండలికాన్ని పూర్తిస్థాయిలో ఉపయోగించారు. మాండలికంలో రచనలు చేయడం కత్తిమీద సాములాంటిది. ఎక్కడా ఎటువంటి అనౌచిత్యం రాకూడదు. ఒకవేళ అనౌచిత్యం ఏర్పడితే అది తీవ్రమైన విమర్శలకు దారితీస్తుంది. మాండలిక భాష పాత్రోచిత స్థాయిలో అతికినట్టుగా ఉండాలి. అప్పుడే ఆ నవలలో జీవం తొణికిసలాడుతుంది. తెలుగులో సమర్థవంతమైన రీతిలో మాండలిక రచన చేసిన నవలారచయితల సంఖ్య బాగా తక్కువ. రాచకొండ విశ్వనాధశాస్త్రి ఇందుకు మినహాయింపుగా కన్పిస్తారు. కళింగాంధ్ర మాండలికానికి సంపూర్ణమైన సాహిత్య గౌరవాన్ని సాధించి పెట్టిన ప్రతిభావంతుడు ఆయన. 'అల్పజీవి' నవల దీనికి చక్కని ఉదాహరణ. రావిశాస్త్రి వరుసలో స్థానాన్ని సాధించిన రెండవ రచయిత దాశరథి రంగాచార్య. వరంగల్లు - ఖమ్మం సరిహద్దుల్లోని మహబూబాబాద్, డోర్నకల్ ప్రాంత తెలంగాణ తెలుగు పరిమళాల రంగాచార్య నవలల్లో ఎల్లెడలా దొరుకుతాయి. ఇవి సగటు పాఠకునికి స్థానీయ భాషానుభూతిని అందిస్తాయి.

దాశరథి రంగాచార్య రచనా రంగంలో ప్రవేశించే నాటికి తెలంగాణ మాండలిక ప్రయోగం పట్ల సాహితీ రంగంలో ఆసక్తిలేదు. గురజాడ అప్పారావు 'కన్యాశుల్కం' నాటక రచనకు పూర్వం వాడుక భాష (వ్యావహారిక భాష) ఏ విధంగా ఉండేదో, రంగాచార్య రచనలకు ముందు తెలంగాణ మాండలిక స్థితికూడ అట్లానే ఉండేది. కోస్తాంధ్ర, రాయలసీమ తెలంగాణతో కలిపి ఆంధ్రప్రదేశ్ అవతరించిన క్రమంలో కోస్తాంధ్ర (కృష్ణా, గుంటూరు) భాషలే ప్రామాణిక భాషలుగా చెలామణిలో ఉండేవి. నేటికీ అదే పరిస్థితి కొనసాగుతోంది. ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తొలిరోజుల్లో కోస్తాంధ్ర ప్రాంత రచయితల ఆధిక్యం అధికంగా ఉండేది. ఈ పరిస్థితులలో తెలంగాణ మాండలిక ప్రయోగంతో రచనలు చేయడం గొప్ప సాహసం. ఈ సాహసాన్ని స్వీకరించి విజయపరంపరను సాధించుకున్న రచయితగా దాశరథి రంగాచార్యను అభివర్ణించవచ్చు. ఆయన రచించిన 'చిల్లర దేవుళ్ళు', 'మోదుగుపూలు', 'జనపదం' నవలలు బాగా ప్రచారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ మాండలిక ప్రయోగాలు పెరిగాయి. ఈ మాండలికంలో ప్రస్తుతం ఎన్నో రచనలు వస్తున్నాయి. ఈ రచనలకు స్ఫూర్తిదాత దాశరథి రంగాచార్య.

BHAVAVEENA
Vol. 17, Issue. 7, July 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

జానపద సాహిత్యంలో స్త్రీ పాత్ర చిత్రణ

- రొండి అర్జున్, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, తెలంగాణ విశ్వ విద్యాలయం, డిచ్‌పల్లి, నిజామాబాద్.

"ప్రాచీన మానవ సంస్కృతిని పరిశీలించడానికి జాన పద విజ్ఞానాధ్యయనం చాలా అవసరం. మానవుడు బుద్ధి జీవి. సంఘజీవి సంఘమంటే సంస్కృతిని ఆచరణలో ఉంచే మనుష్య సమాహారం" (పు: 176) అని జానపద విజ్ఞానాధ్యయనం అనే గ్రంథంలో డా॥ జి.ఎన్ మోహన్ తెలియజేసారు. "సాంఘిక జానపద ఆచారం మూడు రకాలని, అవి జానపదుల సాంఘికాచారాలు, క్రీడలు వినోదాలని, జానపద వైద్య విధానమని, మళ్లీ జానపదుల సాంఘికాచారాలు రెండు రకాలుంటందని, అవి నమ్మ కాలు మూఢ విశ్వాసాలని, పండుగలు ఉత్సవాలని. ఈ పండుగలు లౌకికాలు, మత సంబంధాలుగా కొనసాగు తున్నాయని వివరించారు.

ఎవరు జానపదులు అనే విషయంలో తర్జన భర్జనలున్నా, ప్రాచీన మానవులు లేదా నేటి గ్రామీణుల ఆచార వ్యవహారాలు, పండుగ పబ్బాలు, పద్ధతులు, అల వాట్లు ఉత్సవాలు, వేడుకలు, కళలు నేటి మన నవ నాగరిక సమాజాల్లోను వేరుతన్ని నిలిచి ఉండడాన్ని గమ నిస్తే నాగరీకులు కూడా జానపదుల సంప్రదాయాన్ని అనుసరిస్తూ ఉండడం విదితమవుతుంది. అందువల్ల జానపదం అనే పదాన్ని కేవలం ఒక నిర్దిష్టమైన సమాజానికి ముడిపెట్టడం కంటే, ప్రజల మానసిక స్థితిగతుల్ని సూచించే ఒక సంఘంగా పేర్కొనడం ఉత్తమం. "ఇక్కడ జానపదుని కంటె జనాపదత్వానికే ప్రాధాన్య ఇవ్వడం సముచితం" అని జిఎన్. మోహన్ అభిప్రాయం. అలాగే ఇంకా జి.ఎన్. మోహన్ మారియన్ బార్బీ అభిప్రాయాన్ని కూడా క్రోఢీకరించారు. "లాలిపాటలు, పొడుపు కథలు, పాటలు ఇత్యాదులు పాఠశాలలో పిల్లలకు బోధించే టప్పుడు, నృత్య గీతాలాపన గావించే టప్పుడు, తల్లి కుమార్తెకు వంటవార్చటం, కుట్టుపని, నేతపని మొదలైన వాటిలో శిక్షణ నిచ్చేటప్పుడు, తండ్రి కుమారుడికి వ్యావసాయిక సంబంధమైన విషయాలను బోధించే టప్పుడు, వడ్రంగి, కమ్మరి, కుమ్మరి, చెప్పులు కుట్టేవాడు మొదలైన వృత్తులవారు తమ పనివాండ్రకు ఆయా వృత్తులను నేర్పించేటప్పుడు, ప్రాచీనుల అనుభవాలు, అలవాట్లు, తెలివితేటలు, చాతుర్యాలు ఇత్యాదులు రాతపూర్వకంగా కాక మౌఖికంగానూ, ఉదాహరణ పూర్వకంగానూ తరతరాల వారికి సంక్రమించేటప్పుడు జానపద విజ్ఞానం అతి విస్తృతంగా మనకు గోచ రిస్తుంది". (పు : 25.)

మానవ మనుగడలో మాతృమూర్తిదే పై చేయి. అనాది కాలం నుండి తమ సంతానాన్ని పెంచి పోషించడం లోనూ, తెలివి తేటలు నేర్పించడంలోనూ మాతృదేవతదే అందెవేసిన నైపుణ్యం. మాతృస్వామ్య వ్యవస్థ కొనసాగిన కాలం నుండి నేటి వరకూ కూడా మాతృమూర్తికి తగినంత ఎక్కువ స్థానం ఈ సమాజం ఇస్తుంది. ఎన్నో విద్యలను నేర్చుకోటంలోనూ తల్లి పాత్ర అమోఘమైందేనని మన నవ సమాజం కూడా ఒప్పుకోక తప్పదు. ఆ గొప్పతనాన్ని చెప్పుకోకుండా ఉండ కూడదు. నవ నాగరీక సమాజం లోనూ ప్రముఖ కవి, రచయిత, విమర్శకుడు డా॥. గుండెడప్ప కనకయ్య తాను రాసిన దళిత సమస్యలు గ్రంథాన్ని తన మాతృమూర్తికి అంకితం ఇస్తూ... ఇలా చిత్రీకరించారు. "ఏదో చేయాలని/ ఏదేదో చేయాలని/ దేశానికి నన్నిచ్చిన పల్లెదేవత/ మాటలు నేర్పిన పాటల రాణి/ ఆకలి తీర్చిన అన్నపూర్ణ / గాయాలను మాన్పిన డాక్టర్/ ఆవేదనలను చల్లార్చిన మనస్విని (సైకాలిజిస్టు)/ సూక్ష్మాన్ని పసిగట్టే శాస్త్రవేత్త/ సంఘానికే సోషల్ ఫిలాసఫర్/ అన్నింటికీ మించి/ మట్టిలో అక్షర మాణిక్యాలను చూపించిన / చదువురాని నాతల్లికి... ".

అనగా అంకితం ఇచ్చి మాతృమూర్తిని తన హృదయంలో తలుచుకోటమే కాకుండా అక్షర రూపాన్నిచ్చి ఎంతో మందికి స్ఫూహను కలిగించటానికి కారకులయ్యారు.

రాతపూతల సహాయం లేకనే శుద్ధమైన వాక్పరంపరలో పుట్టి, పెరిగి జీవంతమైన సాహిత్యం జానపదుల సాహిత్యం. దీనికి కారకులు నిరక్షరాస్యులైన సామాన్యులు. ఆ సామాన్యుల్లో కొందరు చదువు సంధ్యలు నేర్చిన వారు కాని, లేఖకులు కాని వుంటే ఉండవచ్చు. ఇలా జానపద విజ్ఞానంలో మనం నేర్చుకున్న విజ్ఞానం మానవ మనుగడ కోసం అది ఒకతరం నుండి మరోతరానికి చరిత్రగా నిలిచి పోతుంది. ఈ విధంగా జానపదంలో స్త్రీ పాత్రను అత్యంత గొప్పగా చిత్రీకరించుకున్న తీరును పరిశోధించటం అత్యంత ఆవశ్యకం. జానపద విజ్ఞానానికి పలువురు పండితులు 21 నిర్వచనాలు ఇవ్వటం జరిగింది.

మానవుడు జీవులలోకెల్ల అత్యంత ఉత్తముడు. తెలివైన బుద్ధిజీవి. మానవుడు సంఘజీవి అని అరిస్టాటిల్ అన్నాడు. మనిషి సంఘంలో నున్న సంస్కృతిని ఆచరణలో పెట్టే మనుష్య సమాహారం. సంఘంలో ఒక సభ్యుడుగా మానవుడు ఆ సంఘంలో అలవాట్లను, ఆచార వ్యవహారాలను, కళా స్వరూపాలను గ్రహించడమని అర్థం. అలాంటి మానవ సంఘ సంస్కృతిని అధ్యయనం చేయటమే జానపద విజ్ఞానం అని చెప్పుకోవచ్చు. ఇంకా ఒక్క మాటలో చెప్పాలంటే మానవ సంఘ సంస్కృతినీ, జీవన విధానాన్ని, ప్రాచీన సంస్కృతినీ ప్రతిబింబించే దర్పణం వంటిది జానపద విజ్ఞానం. మనుష్య జాతిలాగే జానపద విజ్ఞానం కూడ అతి ప్రాచీనమైనప్పటికీ జానపదం అనే పదసృష్టి మాత్రం ఇటీవలిదే నంటారు. ప్రాచీనులు ఈ విజ్ఞాన సంబంధ విషయాల్ని జనప్రియాలైన ప్రాక్తన విషయాలు అని పిలిచేవారట. ప్రప్రథమంగా ఈ విజ్ఞానం పై ఆసక్తి చూపిన వారు మాత్రం గ్రిమ్ సోదరులైన విల్ హెల్మ్ మరియు జాకోబ్ అని జిఎస్ మోహన్ గ్రంథం ద్వారా తెలుస్తుంది.

జానపద సాహిత్యాన్ని ఔత్తరాహులు గ్రాహ్ సాహిత్య అని లోక్ సాహిత్య్ అనే నామకరణాలతో పిలుస్తారు. కన్నడంలో జనపద సాహిత్య అని అంటారు. ఏ సాహిత్యంలో అయినా మార్గ, దేశీ కవిత్వాలనే రెండు శాఖలు తమవే అయినా విశిష్ట లక్షణాల్ని కలిగి ఉండటాన్ని పరిశీలింపవచ్చు. తెలుగులో ఈ ద్వివిధాలైన కవితలు ఒక దాన్నొకటి పెనవేసి కొన్న కవితా లతలుగా మనకు కనిపిస్తాయి. రాజులు, రారాజులు, పండిత కవులు చేపట్టి ఆదరిరించిన సాహిత్యం మార్గ సాహిత్యం కాగా, కేవలం పామర జనులచే పోషింపబడ్డ సాహిత్యం దేశి అయింది. అయినా ప్రాచీన కవులు తమ మార్గ సాహిత్యంలో దేశిని అనుసరించి ఉండటాన్ని ఆయా కవుల గ్రంథాల నుంచి తెలునుకోవచ్చు. మార్గ సాహిత్యాన్ని నేడు ప్రౌఢ లేదా శిష్ట సాహిత్యమనీ, దేశి సాహిత్యాన్ని జానపద సాహిత్యమనీ వ్యవహరిస్తున్నాం.

అనాదరణీయ సాహిత్యంగా చూడబడుతున్నా గానీ, జానపద సాహిత్యం తన వ్యక్తిత్వాన్ని కోల్పోక నిత్య నూతన కామినిలా సర్వజనులకు హృదయాహ్లాదం కలిగించే దివ్య సంజీవనిలా ఉందనటంలో అతిశయోక్తి లేదు. నిత్య జీవితంలో సామాన్యుడనుభవించే సుఖ దు:ఖాలు, అనుభూతులు ఇలాంటివన్నీ ఒక్క మారుగా పొంగి పొరలి వచ్చిన రసమాధురియే జానపద గేయ సాహితి. నాటి సంఘ చరిత్రను, చారిత్రక విశేషాల్ని భాషా పరిణామాన్ని తనలో ఇముడ్చుకొన్న చైతన్య స్రవంతియే జానపద సరస్వతి. నెలవంక చంద్రికలుగా సంగీత సాహిత్యాలతో మేళవించిన కవితా ప్రకృతియే జానపద సాహిత్య చమత్కృతి. ఉవ్వెత్తున లేచే గోదావరీ తరంగిణిలా డెందంలో చిందులు తొక్కే నాట్య మయూరియే జానపద సాహితీ కళామవల్లి.

జానపద సాహిత్యంలో సాంస్కృతిక విషయాల్లో భారతదేశపు పాత్ర అగ్రగణ్యమైంది. ప్రపంచ భాషల్లో రుగ్వేద గ్రంథం అతి ప్రాచీనమైంది. దీంట్లో జానపద గేయాలు, వీరగాథలు పేర్కొనబడ్డాయి. అధర్వణ వేదంలో జానపదుల నమ్మకాలు, మూఢ విశ్వాసాలు, ఆచార

వ్యవహారాలు, మంత్రోచ్చారణలు, కర్మకాండలు విస్తారంగా తెలుపబడ్డాయి. పంచతంత్ర కథలు జానపద కథలకు, కట్టుకథలకు పెట్టింది పేరు. రామాయణ మహాభారతాలు జానపద కథలకు ఐతిహ్యాలకు మూల కేంద్రాలు. ఉపనిషత్తుల్లో, బౌద్ధ జాతక కథల్లోనూ అనేక గాథలు చిత్రీకరించ బడ్డాయి. బృహత్కథ, అష్టాదశ పురాణాలు లాంటి సాహిత్యంలో జానపద కట్టుకథలు, మతం, నమ్మకాలు, మూఢవిశ్వాసాలకు తావునిచ్చాయి.

జానపద సాహిత్య వర్గీకరణను టేకుమల్ల అచ్యుత రావు, శ్రీహరి ఆదిశేషువు, బిరుదురాజు రామరాజు, తంగిరాల వెంకట సుబ్బారావు, శ్రీమతి నాయని కృష్ణకుమారి, ఆర్వీఎస్ సుందరం లాంటి ప్రముఖ సాహితీ వేత్తలు వర్గీకరించారు. వీరి వర్గీకరణను బేరీజు వేసుకొని జానపద సాహిత్యంలో స్త్రీ పాత్ర చిత్రణ- సమగ్ర పరిశీలనను చేయటానికి ఉపక్రమించాను. జానపద సాహిత్యానికి సంబంధించిన ఈ పరిశోధనలో కొన్ని ప్రధాన సారూప్యం గల అంశాలను కొన్నింటిని పరిశీలిస్తే ఈ విధంగా కనపడుతున్నాయి.

జానపద జీవనం - జనపదాలు :

జనపదాలలో నివసించు వారు జానపదులు. జనపద మనగా జనులతో కూడినది అనగా దేశవిభాగం లేక గ్రామం. మరియు జనపదమనగా పల్లెటూరు. అందులో నివశించే వారిని పల్లెవాసులు అంటారు. "జానపదుల్ పురీ జనులని" ఎర్రన తన భారతారణ్య పర్వ శేషంలో గ్రామీణులుగా పేర్కొన్నారు. వీరి జీవన విధానం ప్రధానంగా సాంఘిక జీవనం. భారతదేశం జనాపద కళలకు పుట్టినిల్లు. వీరు ధరించే దుస్తులు ఆభరణాలు, ఆటలు వినోదాలు, ప్రదర్శన కళలు, వ్యవసాయం, ప్రాంతీయ వాతావారణం, కుటుంబ వాతావరణం ప్రాంతీయం వీరి జీవన విధానంగా చెప్పవచ్చు. జానపదుల మతాన్ని గమనిస్తే... జనపదాలలో వ్యక్తులు తమ చుట్టూ ఏవో కొన్ని అదృశ్య శక్తులు ఉన్నాయని విశ్వసించి ఒనర్చే కర్మకాండ ఆచార విశేషమే జానపద మతమని చెప్పవచ్చు. జానపదమతంలో గ్రామదేవతారాధన ప్రముఖస్థానం వహించింది.

జానపదుల నమ్మకాలు :

జానపదుల సంప్రదాయాలు ఆచారాలన్నీ వారి నమ్మకాలపై ఆధారపడి ఉన్నాయి. సామాన్య మానవులు తన మనుగడ కోసం నిరంతరం పోరాడుతున్నప్పుడు తనను మించిన మానవాతీత శక్తి ఏదో ఉందని అనుకుంటారు. జీవితంలో క్లిష్ట పరిస్థితి ఏర్పడినప్పుడు అంతా దైవాధీనం అని విశ్వసిస్తారు. ఈ నమ్మకాలలో కొన్ని మూఢ నమ్మకాలు అయితే మరికొన్ని అనుభవాల నుండి ఏర్పరచుకొన్నాయి. ఉదా: ఏదైనా పనికి ముందు, లేదా ప్రయాణానికి సిద్ధమైనప్పుడు ముందు తుమ్మితే... తుమ్ము మంచిది కాదు అని, పిల్లి ఎదురస్తే అశుభం అని, పాలపిట్ట ఎదురైతే శుభం అని జానపదుల విశ్వాసాలు నేటికీ కొనసాగుతున్నాయి.

జానపదుల ఆచార వ్యవహారాలు :

జానపదులు కొన్ని ఆచార వ్యవహారాలకు సంప్రదాయాలకు, కట్టుబడి తమ జీవితాలను కొనసాగిస్తారని కథల వల్ల తెలుస్తుంది. తరతరాల నుండి పూర్వీకులు ఆచరించి భావితరాలకు అందజేసిన సంస్కృతీ సంప్రదాయాలు, ఆలోచనా సరళి, కార్యకలాపాల్లో ప్రత్యేకతలు లాంటి వాటిని ఆచార వ్యవహారాలుగా పాత తరం నుండి లేదా వారివారి వారసత్వం నుండి పొందుతున్నారని చెప్పవచ్చు.

జానపదుల వైద్యం :

జానపదుల వైద్యాన్ని తమ తమ గ్రామాల్లో నాటు వైద్యం అనే పేరుతో ప్రచారంలో ఉంది. జానపదులు చెట్ల మూలకాలను ఉపయోగించి వైద్యం చేస్తారు. మూలకాల రహస్యాన్ని ఎవరికీ చెప్పరు. జానపదుల వైద్యం ఈనాటికీ గృహవైద్యంగా గ్రామాలలో కొనసాగుతుంది. వీరి వైద్యం సత్ఫలితాలను ఇస్తున్నాయి. కానీ కొన్ని చోట్ల వికటించటం ప్రాణ నష్టం కూడా జరుగుతుంది. జానపద

వైద్యులు, భూత వైద్యులు, గ్రామదేవతలు పూజార్లు ప్రధాన స్థానాన్ని ఆక్రమిస్తారు. ఉదా: అజీర్ణంగా ఉంటే జీలకర్ర ఉప్పు, అల్లం నూరి తింటారు. జలుబు చేస్తే శొంఠి మిరియాల కషాయం చేసుకొని తాగుతారు.

పైన తెలిపిన విద్వాంసులు చేసిన కొన్ని జానపద సాహిత్య విభజనల్లో స్త్రీల కథలకు గానీ, పాత్రలకు గానీ వీరత్వం లేనివిగా చెప్పారు. ఈ నా పరిశోధనలో తంగిరాల మరియు నాయని కృష్ణకుమారి జానపద సాహిత్య విభజనను పరిగణలోకి తీసుకోటం జరుగుతుంది. వీరిదృష్టిలో స్త్రీల పాటలు జానపద సాహిత్యం కంటె ఉన్నతమైన జాతిదేశికి సంబంధించినవి. నేటి అమెరికను విద్వాంసులు కూడా మౌఖిక సంప్రదాయంలో వుండే ప్రతి గీతాన్ని జానపద గీతమంటున్నారు. కాబట్టి జానపద సాహిత్యంలో స్త్రీ పాత్రను విశ్లేషించటానికి వీలుగా ఉంటుంది.

❁❁❁

BHAVAVEENA
Vol. 17, Issue. 7, July 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

రాచపూటి రమేష్ కథలు - జీవన చిత్రాలు

- యస్. చంద్రయ్య, పరిశోధక విద్యార్థి, ప్రాచ్య పరిశోధన సంస్థ, శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయం, తిరుపతి.

తెలుగు కథా సాహిత్యం ఈరోజు కొత్త కొత్త కథా వస్తువు లతో సమకాలీన సమాజాన్ని ప్రతిబింబచేస్తూ ముందుకు సాగుతుంది. ఈ క్రమంలో అనేక మంది కథా రచయితలు సమాజంపై ఉన్న నిబద్ధతో, బాధ్యతతో రచనా వ్యాసాం గాన్ని కొనసాగిస్తూ అద్భుతమైనటువంటి కథలను సృష్టిస్తున్నారు. తెలుగు ఉపాధ్యాయుడుగాను, అధ్యా పకుడుగాను, ఆచార్యుడుగాను ఉంటూ కథలు రాయడం కాకుండా, ప్రభుత్వ సంబంధమైనటువంటి అధికారులుగా భాద్యతలను నిర్వర్తిస్తూ అద్భుతంగా తెలుగు సాహిత్యానికి సేవ చేస్తున్న వారిలో వాడ్రేవు చిన వీరభద్రుడు మొదలైనటువంటి వారిని చెప్పుకోవచ్చు. ఆ కోవకు చెందినవాడే చేనేత జౌళిశాఖలో అభివృద్ధి అధికారిగా పనిచేస్తున్నటువంటి రాచపూటి రమేష్. ఆయన చదువుకుంది. ఎం.ఏ. ఇంగ్లీషు అయినప్పటికీ, ప్రవృత్తి రిత్యా చక్కనైనటువంటి కథలు రాస్తూ, తెలుగు శ్రోతలకు సందేశాన్నిస్తున్నాడు. కడప జిల్లా, రైల్వే కోడూరు సమీపంలోని బుడుగుంట పల్లెకి చెందిన ఈ రచయిత దాదాపుగా ఇప్పటి వరకు 5 కథాసంపూటాల్ని ప్రచురిం చాడు. అలాగే తనకు ఉన్నటువంటి ఆంగ్ల భాషా పరి జ్ఞానంతో ఆంగ్లం నుంచి ఎన్నో కథలను తెలుగులోకి అనువదించి, వివిధ పత్రికలలో ప్రచురింపజేస్తున్నాడు. ఆయన రాసిన గాలిగోపురం, అందమైన అబద్ధం, మైత్రీ వనం, వలయం, నెమలి కన్ను చీర వంటి కథా సంపూటాల్లో ఎన్నో జీవన చిత్రాలు మనకు కనిపిస్తాయి. ఎన్నో జీవనశిల్పాలు పాఠకుడికి దర్శనం ఇస్తాయి. ఈయన రాసిన రచనలు అన్ని మధ్య తరగతి జీవితానికి సంబం ధించినటువంటి ఇతి వృత్తాలు కావడం గమనించదగ్గిన విషయం. ముఖ్యంగా చేనేతవృత్తి కారులు నేటి సమాజంలో ఎదుర్కొంటున్న సవాళ్లతోపాటు, ఉద్యోగ వ్యవస్థలో అనేక మంది రకరకాల ప్రవర్తనలతో సాగిస్తున్న జీవనాన్ని కూడా రచయిత గ్రంథస్థం చేశాడు.

రాచపూటి రమేష్ రాసిన కథల్లో అట్టడుగుపొరల్లో నివసించే ప్రజల జీవనసరళి కనిపించకపోయినప్పటికీ, మధ్యతరగతి, ముఖ్యంగా ఉద్యోగజీవనంలో సగటు మనిషి ఎదుర్కొంటున్న సవాళ్లను, ప్రపంచీకరణ నేపథ్యంలో చిద్రమైపోతున్న మానవవిలువలను, గ్రామీణ వ్యవస్థ చిన్నాభిన్నమైపోతున్న తీరును గురించి లోతైనటు వంటి చర్చ చేశాడు రచయిత. ఈయన రచనలోని కథా వస్తువు నెల్లూరు, చిత్తూరు, కడప పరిసర ప్రాంతాల్లో సంచరిస్తుంది. ముఖ్యంగా తిరుపతి, నెల్లూరు, కడప వంటి ప్రాంతాలో జీవిస్తున్న ప్రజల జీవనచిత్రాలు, ముఖ్యంగా ఉద్యోగస్తుల మనస్తత్వాలు స్పష్టంగా కనిపిస్తాయి. రమేష్ కథల్లోని వస్తువు ఉద్యోగవ్యవస్థపైన కేంద్రీకరించడానికి కారణంగా ఆయన ఉద్యోగస్తుడుగా అనేక రకాలైనటువంటి జీవితాల్ని ప్రత్యక్షంగా పరిశీ లించడం కావచ్చు. ఈయన రాసినటువంటి కథా సంపూటాల్లో మానవత్వ పరిమళాలు గుభాళిస్తుంటాయి. స్వయాన వాటిని కళ్లతో చూసి రాశాడా అనిపిస్తున్నట్లు కొన్ని ఇతివృత్తాలు మనకు కనిపిపిస్తూవుంటాయి. ఆయన కథాసంపూటాల్లో నుండి మచ్చుకి కొన్ని కథల్ని ఎంపిక చేసుకొని అందులో ఏవిధంగా మానవ జీవనచిత్రాలు ప్రతిఫలిస్తున్నాయో చెప్పడం ఈ వ్యాసం ఉద్దేశం.

ఈయన రాసిన కథలకి ఎక్కువగా సాంప్రదాయ బద్ధమైన శీర్షికలను ఎంపిక చేసినప్పటకీ, కథల్లో ఉన్నటువంటి వస్తువు మాత్రం సామాజికమైనటువంటి సందేశంతో, మానవత్వం వైపు నడక సాగిస్తుంది. కథా సంపూటాలకి పెట్టిన పేర్లు గానీ, కథలకు ఎంచుకున్నటు వంటి శీర్షికలు గానీ, రచయితలోని సాంప్రదాయ భావాల

వాసనలకు గుర్తులుగా కనిపిస్తాయి. 'అద్వైతం' అనేకథ శీర్షిక చూడడానికి ఆధ్యాత్మిక సంబంధమైనదిగా కనిపించినప్పటికీ, మనిషి మానవత్వం విషయంలో ద్వంద్వవైఖరిని అవలంభించకూడదు అని తెలియజేస్తుంది. ఒక వ్యక్తి శ్రీకాకుళం ప్రాంతానికి వెళ్లి, తిరిగి రావడానికి చివరిదైన రైలును అందుకోవడం కోసం రిజర్వేషన్ కౌంటర్ దగ్గర నానా అగచాట్లు పడుతాడు. రిజర్వేషన్ చేసే ఉద్యోగి ఐదు నిమిషాలు వుండగానే కౌంటర్‌ను క్లోజ్ చేసి 'నేను ఇప్పుడు చేయలేను' అంటూ వెళ్లిపోయే సందర్భంలో తనను ఎదో ఒక విధంగా బస్టాండు దగ్గర అయినా దించమని బ్రతిమలాడుకుంటాడు. తన దగ్గర ఉన్నటువంటి పండ్ల బుట్టను మోయడానికి పనికి వస్తాడనే ఉద్దేశంతో బస్టాండు దగ్గర దించి అతనికి సహాయం చేసినట్లు నటిస్తాడు ఆ రైల్వే ఉద్యోగి. కాలం ఎప్పుడు ఒకేలా ఉండదు. అదే ఉద్యోగి మొక్కు తీర్చుకోవడం కోసం తిరుమల కొండపైకి వెళ్లి తన సూటేకేసు పొగొట్టుకుని, దిగాలు మోహంతో తిరుపతి చేరుకుంటాడు. అతనికి తెలిసిన వాళ్లు ఎవ్వరూ అక్కడ లేకపోవడంతో నానా యాతన పడుతాడు. చివరకు తనకు తెలిసి బ్యాంకు ఉద్యోగి ఉన్నాడు అని తెలుసుకొని అతనికోసం వాకబు చేస్తాడు. అతడు మైసూరు వెళ్లాడు అని తెలుసుకొని నిరుత్సాహపడుతాడు. ఆ సమయంలో ఒక వ్యక్తి ఆ ఉద్యోగిని ఆప్తుడుగా తీసుకువెళ్లి, తన ఇంట్లో ఉంచుకొని భోజనం పెట్టి, పరిశుభ్రమైనటువంటి గది ఇచ్చి, తెల్లవారి రైలు దగ్గర వదిలిపెడుతాడు. అప్పటికీ ఆ రైల్వేఉద్యోగికి ఆదరించిన వ్యక్తితో ఉన్నటువంటి సంబంధం ఏమిటో గుర్తించలేకపోతాడు. రైల్లో ఎక్కి బయలుదేరిన తరువాత చాలాసేపటికి గానీ ఆవిధంగా తనను ఆదుకొన్న వ్యక్తి ఒకప్పుడు రిజర్వేషన్ టికెట్టు ఇవ్వకుండా పంపించి వేసిన వ్యక్తిగా జ్ఞాపకం చేసుకుంటాడు. తమకంటే తక్కువ స్థాయి దున్నులు ధరించి వారిని తక్కువగా చూడడం, భాద్యతలు మరిచిపోవడం ముఖ్యంగా మానవత్వం విస్మరించడం ఎప్పటికీ మంచిది కాదు అనే విషయాన్ని తెలియజేస్తూ అద్వైతం అనే కథ ముగిస్తాడు రచయిత.

అలాగే నీతిగా బ్రతకడాని పలుభాషలతో పరిచయం అవసరంలేదు అనే విషయాన్ని చెప్తూ 'బహు భాషా కోవిదుడు' అనే కథరాశాడు. ఒక ప్రవేటు కంపెనీలో ఉద్యోగం చేసేటటువంటి ఉద్యోగస్తుల సగటు మస్తత్వం ఎలా వుంటుంది, పై అధికారిని మెప్పించి ఉన్నత స్థితిలోకి ఎదగాలని సగటు ఉద్యోగి ఎలా తాపత్రయ పడుతాడు, వంటి విషయాలు తెలియజెప్పే కథ ఇది. ఆఫీసులో పనిచేసే ఒక ఉద్యోగి మేనేజర్‌ను రకరకాల భాషా పాండిత్యాలతో బుట్టలో వేసుకుని, ప్రమోషన్ కోసం ప్రతిభావంతుల్ని తొక్కేటువంటి పరిస్థితి ఈ కథలో కనబడుతుంది. తోటిమనిషికి సహాయం చేసే విషయంలో పక్క వారిని ఆదుకొనే విషయంలో అతనికి మనస్సు లేదని తెలుసుకున్న మేనేజర్ అతనిని ప్రమేషన్‌కి అనర్హుడుగా ప్రకటిస్తాడు.

నగర జీవనంలో భాగంగా మనషులు మధ్య సంబంధాలు యాంత్రికంగా మారుతున్నతీరును 'అంతరాలు' అనే కథలో వివరిస్తాడు రమేష్. తాను 5సం॥ నుంచి తమ ఊరికి దూరంగా ఢిల్లీలో నివసిస్తూ ఉండడం వల్ల బాంధవ్యాలకు, అనుబంధాలకు దూరమై ఉంటాడు ఓ ఉద్యోగి. ఆ సమయంలో తన పెదనాన్న కొడుకు ఢిల్లీకి ట్రాన్స్‌ఫర్ మీద వస్తున్నాడని తెలుసుకొని ఎంతో ఆనంద పడుతాడు. వరుసకు అన్న అయిన అతనికి కుటుంబం కోసం వారంరోజులు తిరిగి మంచి ఇల్లు చూసి పెట్టి వారిని సకల లాంఛనాలతో ఆ ఇంట్లో ప్రవేశపెడుతాడు. ఎంతో అప్యాయంగా అనుబంధంగా వారితో మసలుకుంటాడు కానీ, వారికోసం అంతశ్రమపడ్డా సోదరుడు మాత్రం తమ్ముడు గురించి ఒక్క క్షణం కూడా ఆలోచించడు. తన ఊరి నుంచి వచ్చిన అన్నా వదిన పిల్లలతో ఉండాలి అనే ఉద్దేశంతో ఒక ఆదివారం తీరిక చూసుకొని వారి ఇంటికి వచ్చిన ఆ ఉద్యోగికి చేదు అనుభవం ఎదురౌతుంది. మద్యాహ్నం 2గం॥లకు తప్పని పరిస్థితుల్లో పనికి మాలిన పదార్థాలతో ఆహారం పెట్టి, మొక్కుబడి చెల్లిస్తారు. దాంతో ఎంతో భాదపడ్డ ఆ సగటు ఉద్యోగి

అనుబంధాలు నాగరికత ముసుగులో మూసుకు పోయాయని భాదపడుతాడు. అలా వెళ్తుతున్న క్రమంలో తనకు తెలియని వ్యక్తి పలకరించడంతో ఆశ్చర్యపోతాడు. అతడు తన తండ్రి దగ్గర చదువుకున్న ఒక విద్యార్థిగా తెలుసుకుంటాడు. అతని బలవంతపై వారి ఇంటికి వెళ్లి వారితో కలిసి భోంచేస్తాడు. ఆ వ్యక్తి చూపించిన ఆప్యాయతలు, అనురాగాలు వంటి వాటి ముందు తన సోదరుడు చేసినటువంటి అవమానాన్ని గుర్తు చేసు కుంటాడు. ఎప్పుడో తన తండ్రి చేసినటువంటి ఉప కారాన్ని గుర్తుపెట్టుకొని ఈవిధంగా తనను గౌరవించడం ఆ ఉద్యోగికి ఆశ్చర్యం కలిగిస్తుంది. యాంత్రిక యుగంలో పక్క వారిని పలకరిస్తే తమకు ఏమి లాభం, చిరునవ్వు నవ్వితే తమకేమి ఉపయోగం అని ఆలోచించే వ్యవస్థలో కూడా ఆలాంటి తులసి మొక్క లాంటి వ్యక్తులు ఉం డడం మానవత్వానికి నిదర్శనం అని చెప్పడానికి రచ యిత ఈ కథను రాశాడు.

అలాగే రాచపూటి రమేష్ రాసినటువంటి మరొక కథ 'అంచనాలు'. ఎదుటి వ్యక్తులు గుర్తుంచుకోవడం కోసం సహాయం చేసినట్లు నటించే తత్వంగల వ్యక్తులు కొంతమంది సమాజంలో ఉంటారు. అలా కాకుండా తమ జీవనంలోను తోటి మనిషికి సహాయం చేయాలి అనే తత్వాని జీర్ణించుకున్న వ్యక్తులు మరికొంతమంది ఉంటారు. ఈ విషయాన్ని కథలో తెలియజేశాడు రచయిత. ఇప్పటికీ చాలా గ్రామాల్లో పేద విద్యర్థులను, ఆర్థికంగా చదువు కోవడానికి వెసులుబాటు లేనటువంటి విద్యార్థులని ఆదరణతో చదివించే ఉపాధ్యాయులు కొంత మంది ఉన్నారు. అయితే ఇటీవల కాలంలో మానవ సంబంధాలు ఆర్థిక అంశాలు చుట్టూ తిరుగుతూ వుండడం వల్ల ఇలాంటి ధోరణి కరువౌతుంది అని చెప్ప డానికి ఈ కథను రాశాడు రచయిత. ఒక టీచర్‌గా బరువు బాధ్యతలులేని రోజుల్లో పేద విద్యార్థులకు సహాయం చేసిన ఒక ఉపాధ్యాయురాలు, తరువాత కాలంలో కుటుంబ బరువుబాధ్యతల నేపథ్యం, ఆర్థిక పరిస్థితులు సహకరించక పోవడంతో పేద విద్యార్థినికి సహాయం చేయలేకపోతునని బాధపడుతుంటుంది. గతంలో రాజేశ్వరి అనే విద్యార్థికి తాను చేసిన సహాయంవల్ల ఆమె గవర్నమెంటు కాలేజిలో అధ్యాపకురాలు కావడం, పేద పిల్లలకు సహాయం చేస్తాను అని హామి ఇవ్వడంతో ఈ ఉపాధ్యాయురాలు సంతోషిస్తుంది. ఆమె భరోసాతో గౌరి అనే విద్యార్థిని చదివించడానికి పూనుకుంటుంది. అయితే ఉపాధ్యాయురాలు ఆ విషయమై నేరుగా మాట్లాడటానికి రాజేశ్వరి ఉంటున్న ఊరుకు వెళ్లి ప్రయత్నిస్తుంది. అయితే ఆ సమయంలో ఆమె ఇంట్లో లేక పోవడంతో, ఇంట్లో పని చేసే వ్యక్తుల ద్వారా తాను వచ్చిన సమాచారాన్ని చేరవేస్తుంది. ఆ తరువాత కొంత కాలానికి రాజేశ్వరి టీచర్‌కు 40 వేల రూపాయలు డి.డి పంపించి, గౌరి అనే విద్యార్థిని చదివించమని కోరుతుంది. తరువాత ఎప్పుడూ ఆమె తన టీచర్‌కి ఫోన్ చేయడం గానీ, ఎలాంటి ప్రస్తావన చేయకపోవడంతో గర్వం పెరిగింది అని అభిప్రాయ పడుతుంది టీచర్. అయితే తరువాత కొంతకాలానికి తనకు తెలిసినటువంటి స్నేహితురాలు ద్వారా రాజేశ్వరి కిడ్నీ సంబంధిత వ్యాధితో భాదపడుతూ చనిపోయిందని, తాను చనిపోవడానికి కొద్ది రోజుల ముందే తన చేతి గాజులు అమ్మి, ఆ డబ్బు ఎవ్వరో పేద పిల్లను చదివించడానికి డి.డి తీసి పంపిందని అని తెలుసుకొని టీచర్ విచారిస్తుంది. చేసిన సహాయాన్ని తప్ప తనకున్న సమస్యలను చెప్పుకోని ఆదర్శవంతమైనటు వంటి మానవతా విలువలు కలిగిన వ్యక్తులు ఈ నాటి సమాజంలో కూడా ఉన్నారని చెప్పడానికి రచయిత ఈ కథను రాశాడు.

సాధారణంగా అధికారులు కఠినస్వభావం కలిగి ఉంటారని, మానవతావిలువలు లోపించి వుంటాయని ఒక విమర్శ వుంది. అయితే మన సమాజంలోను యస్.ఆర్. శంకరన్ లాంటి కలెక్టర్లు, ఎంతో మంది ప్రభుత్వం అధికారులు ప్రజలతో మమేకమై సేవలు చేసిన విషయాన్ని మన గుర్తుంచుకోవాలి. అక్రమంలోనే

రాచపూటి రమేష్ రాసిన 'నిలువుటద్దం' అనే కథ అధికారుల్లో మానవ విలువలు ఎలా ఉంటాయి అనే విషయాన్ని వివరిస్తుంది. తాను చదువుకునే రోజుల్లో జ్వరంతో భాదపడుతూ ఆసుపత్రి ముంగిట్లో విలవిల లాడుచున్న సమయంలో ఆనాటి డిప్యూటి కలెక్టరు ఆకస్మికంగా ఆసుపత్రిని సందర్శించి తనకు ఆరోగ్యంతో పాటు జీవితాన్ని ప్రసాదించిన విషయాన్ని గుర్తుంచుకున్న చంద్రశేఖర్ ఇంట్లో ఆడంబరాలకు పోకుండా పిల్లల్ని పెంచి పెద్ద చేస్తాడు. ప్రతి నిత్యం ప్రజాసేవలోనే నిమగ్నం అవుతాడు. చివరకు తన పిల్లల పుట్టిన రోజున కూడా ఇంట్లో వుండనటువంటి పరిస్థితి. ఈ విషయాన్ని ఇంట్లో కుటుంబ సభ్యులందరూ ఒకసారి నిలదీసి ప్రశ్నించినప్పుడు వారిని నేరుగా ఒక ఆసుపత్రికి తీసుకువెళ్లి, అక్కడ ఉన్నటువంటి రోగులను వాళ్ల సమస్యలను వినిపించి, ఇలాంటి పరిస్థితుల్లో నుండే తాను వచ్చినాన్ని, అందుకే ఖచ్చితంగా తాను ఇలాంటి విలువలకు కట్టుబడి వుంటానని, అందరూ అర్థం చేసుకోండని తన భార్య బిడ్డలకు వివరిస్తాడు. ఇలాంటి నిబద్ధత కలిగినటువంటి, మానవతా విలువలు కలిగినటువంటి అధికారుల తత్వాన్ని వివరిస్తూ రచయిత చక్కటి సందేశాన్ని ఇచ్చారు.

రచయిత 2006సం॥లో రాసినటువంటి 'చేదు నిజం' అనే ఈ కథ అనేక రూపాలతో ఇటీవల కాలంలో వాట్సప్ గ్రూపుల్లో బాగా ప్రసిద్ధి పొందింది. మానవ సంబంధాలు అనేవి ప్రపంచీకరణ నేపథ్యంలో ఎలా విచ్ఛిత్తిని పొందుతున్నాయో దాదాపుగా 14సం॥లు క్రితమే రాచపూటి రమేష్ గుర్తించాడు. తనకు విద్యాబుద్ధులు నేర్పించి ప్రయోజకుడ్ని చేసిన తండ్రిని ఎంతో ఇష్టంగా చూసుకోవలసిన ఓ కొడుకు, భార్య సూటి పోటి మాటలతో, నిరాసక్తతో తండ్రిని ఎలా వదించుకోవాలో ఆలోచించడం 'చేదు నిజం' కథలో వస్తువు. తనకు జీవితాన్ని ఇచ్చిన తండ్రి మనస్సు ఎలా ఉందో అర్థం చేసుకోలేక పోతాడు ఆ కొడుకు. మొదట చాటుగా, ఆ తరువాత బహిరంగంగా తన మామ ఇంట్లో వుండడం ఇష్టం లేదని చెప్పిన భార్యను సముదాయించలేకపోతాడు. ఆమెకు సమస్యను విప్పిచెప్పలేకపోతాడు. బిడ్డగా తండ్రిని జాగ్రతగా చూసుకోవలసిన బాధ్యత వుందని విడమరచి చెప్పలేకపోతాడు. చివరకు అతని తండ్రే ఒక రోజు తాను ఆశ్రమంలో జీవించాలపిస్తుందని చెప్పినప్పుడు మౌనంగా తండ్రిని స్కూటర్‌పై ఎక్కించుకొని వెళ్లుతాడు. ఆశ్రమానికి తీసుకెళ్తాడు. ముందు తండ్రి దిగి కొడుకును వెళ్లిరమ్మని వీడ్కోలు చెప్పుతాడు. చివరకు ఆ తండ్రి లోపలకి వెళ్లిన కొద్దిసేపటి తరువాత ఈ కొడుకు మేనేజర్ రూంలోకి అడుగుపెట్టబోతుంటే అక్కడనుంచి కొన్ని మాటలు వినిపిస్తాయి. 'పాతికేళ్ల క్రితం మీరు ఒక మూడేళ్ల బాబును తీసుకెళ్లారు పెంచుకోవడానికి ఆ బాబు ఎలా ఉన్నాడు' అని తన తండ్రి మేనేజర్‌ను ప్రశ్నిస్తూంటాడు. అప్పుడు అనాథగావున్న తనను తీసుకు వెళ్లింది, ఇంతవాడ్ని చేసింది సొంత తండ్రి కాదని తెలుసుకొని ఆ కొడుకు తనను క్షమించమని తండ్రి కాళ్లపై వాలి పోతాడు. మానవతా విలువలు మంటగలుపుతున్న బిడ్డలు, తండ్రులను వృద్ధాశ్రమాల్లో చేర్చి గొప్పలు చెప్పుకునే బిడ్డలు ఈనాడు వీధికొక్కరు పుట్టుకొస్తున్న సమాజంలో అలాంటి బిడ్డలకు చెంపదెబ్బ లాంటి కథను రాశాడు రచయిత.

ఇలా చెప్పుకుంటూ పోతే చేనేత కార్మికుల జీవిత చిత్రాలను సంపూర్ణంగా ఆవిష్కరించిన కథాసంపూటి 'నెమలికన్ను చీర'. ఇందులో చేనేత కార్మికుడు రెక్కాడితే డొక్కాడని పరిస్థితుల్లో ఇబ్బందిపడుతున్న తీరును ఆ వృత్తిలో ఎదురౌతున్న అనారోగ్య సమస్యలను, ఆ వృత్తి చేసేటువంటి వారిని మోసగిస్తున్న దళారీల వ్యవస్థని, ప్రభుత్వం వారి కోసం అందచేసిన సొమ్మును ఏలా కాజేయాలి అని ఆలోచిస్తున్న కొందరు అధికారుల్ని ఇలా రకరకాల కోణాల్లో మావతా విలువలని ఆవిష్కరింప చేసాడు రాచపూటి రమేష్. ఈ విధంగా మధ్యతరగతి జీవితాలను, వారి జీవితంలో ఉన్నటువంటి ఓడిదుడుకులను, వారి సంబంధబాంధవ్యాలను ఆవిష్కరిస్తూ రచనలు చేస్తూన్న వర్ధమాన రచయిత రాచపూటి రమేష్ మరిన్ని కథలు రాయగలడి ఆశిద్దాం.

BHAVAVEENA
Vol. 17, Issue. 7, July 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

నిర్మల్ జిల్లా కవుల రచనలలో సామాజిక కోణం

- గడ్డం సత్యపాల్ రెడ్డి , తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, దిలావర్‌పూర్.

చదువుల తల్లి సరస్వతీదేవి కొలువైన నిర్మల్ జిల్లాకు ఎంతో ప్రశస్తి ఉంది. నిమ్మనాయుడు పాలించిన కారణంగా " నిర్మల్ " అనే పేరు వచ్చింది. పచ్చని ప్రకృతితో అలరారే ఈ జిల్లాలో ఎందరో కవులు, కళాకారులు ఉన్నారు. ముఖ్యంగా తెలంగాణ తల్లి రూపశిల్పి శ్రీ బైరోజు వేంకట రమణాచారి గారు నిర్మల్ వాస్తవ్యులే. జిల్లా అడవులలో దొరికే పానికి కర్రతో చెక్కిన అద్భుతమైన నిర్మల్ కొయ్యబొమ్మలు, ఇక్కడి కళాకారులు చిత్రించిన నిర్మల్ చిత్రాలు ప్రపంచ ప్రసిద్ధిగాంచాయి. ఈ జిల్లాలో ఎందరో కవులు కూడా సాహిత్య సేవలో ఉన్నారు.

నేటి సమాజం అనేకమైన సమస్యలతో సతమత మవుతూ ఉంది. ముఖ్యంగా కులం, మతం, శ్రమదోపిడి మొదలగునవి. వ్యక్తుల మధ్య ప్రేమానురాగాలు తగ్గి, స్వార్థం పెరిగిపోయి అన్ని రుగ్మతలకు కారణం అయ్యాయి. ప్రతి రోజు ఎక్కడో ఒకచోట అత్యాచారాలు, యాసిడ్‌దాడులు జరుగుతున్నాయి. ప్రాంతీయ బేధాలతో ఆచార వ్యవహారాలు, భాషయాసలపై హేళన చేయడం జరుగుతుంది. ఇటువంటి పరిస్థితులలో సమాజంలో మార్పు కొరకు సామాజిక ఉద్యమకారులు మరియు సాహిత్యకారులు కృషి చేస్తున్నారు. ముఖ్యంగా కవులు తమ రచనల ద్వారా సమాజంలోని సమస్యలపై పోరాటం చేస్తున్నారు. నిర్మల్ జిల్లాలోని నేటితరం కవులు తమ రచనలలో సామాజిక అంశాలనే ఇతివృత్తంగా స్వీకరించి రచనలు చేస్తూ సమాజంలో మార్పుకొరకు కృషి చేస్తున్నారు. ఆ కవులను గుర్తించి, వారి రచనలు సేకరించి, అందులోని సామాజిక అంశాలు గుర్తించి, అవి సమాజానికి ఏవిధంగా దోహదపడుతున్నాయో తెలియజేయడమే ఈ వ్యాసం ముఖ్య ఉద్దేశం. నిర్మల్ జిల్లాకు చెందిన ప్రముఖ కవి. డా॥ దామెర రాములు గారి రచనలపైన ప్రస్తుతం రెండు సిద్ధాంత పరిశోధనలు (గ్రామ్య.ణ) జరుగుచున్నవి.

డా॥. దామెర రాములు గారు :

వైద్య చికిత్సనే కాదు సామాజిక చికిత్స తెలిసిన వ్యక్తిగా తన కవిత్వం ద్వారా ప్రజలను జాగృత పరుస్తూ ఉన్నారు. వృత్తి రీత్యా వైద్యుడు అయినా సాహిత్యంపై అపారమైన ప్రేమ కలిగి సుమారుగా 13కు పైగా పుస్తకాలు రాయడం జరిగింది. వీరిపై ప్రస్తుతం రెండు సిద్ధాంత పరిశోధనలు కూడా జరుగుతున్నాయి. యుక్త వయస్సులోనే విప్లవ భావజాలానికి ఆకర్షితుడై దేశంలో అత్యవసర కాలంనాటి పరిస్థితులపై తన "కోరస్"ను వినిపించాడు. ఇది తరువాతి కాలంలో కూడా అప్రకటిత అత్యయిక స్థితిలాంటి నిర్భంధ వాతావరణంపై "కోరస్"గా కొనసాగింది. తరువాత "నెత్తుటి వెన్నెల" ద్వారా కష్టజీవుల బాధామయ జీవితాలను చిత్రీకరించడం జరిగింది. "జయహే తెలంగాణ" ద్వారా దోచుకొనే ఆంధ్రావాళ్ళను మా ప్రాంతాలను వదిలిపెట్టి మీమీ ప్రాంతాలకు వెళ్ళిపొండ్రి లేదా మేమే వెళ్ళగొడతాం అని ఉద్యమ స్వరాన్ని వినిపిస్తాడు. "కొర్రాయి" ద్వారా తెలంగాణ ఉద్యమ తీరుతెన్నులు, కులం అనే విషపు బీజం గురించి, ఉద్యమంలో యువకుల బలిదానాలు మొ॥ విషయాలపై చర్చిస్తాడు. అసలు ముఖం అనే పుస్తకం ద్వారా ప్రతి మనిషికి రెండు ముఖాలుంటాయని, ఎవరికైనా అనలు ముఖమే సౌకర్యంగా ఉంటుందని అంటాడు. వైద్యవృత్తిలో తీరిక లేకుంట ఉన్నప్పటికి తన సాహితీ వ్యాసంగం ద్వారా ప్రజలను జాగృతపరుస్తూ సమాజాన్ని ఉద్ధరిస్తూ ముందుకు సాగుతూ ఉన్నారు.

డా॥. అప్పాల చక్రధారి గారు :

నిర్మల్‌లో ప్రముఖ పిల్లల వైద్యునిగా పేరందుకున్న

డా॥. అప్పాల చక్రధారి గారు అవును నేను "ఆదిలా బాదోన్నే " అను పుస్తకం ద్వారా మన భాష, యాసలపై హేళన చేస్తున్న వారిపై ఎదురుదాడి చేసారు. ఆదివాసీల ప్రాంత జీవన సంస్కృతినీ, నిష్కల్మషమైన హృదయాలు ఉండే మానవీయ విలువల మనుషులతో నిర్మలంగా సాగే యాసపై హేళన చేస్తూ ఉంటే "అవును నేను ఆది లాబాదోన్నే" అంటూ ధీటైన సమాధానం ఇచ్చారు. వారి రెండవ పుస్తకం "జలగ" ద్వారా రాజకీయ చదరంగం వికృత రూపాన్ని, ప్రజల్ని ఎలా తప్పుదోవ పట్టిస్తున్నాయో, ఎలా విషవలయంలోకి తోస్తున్నాయో కూలంకషంగా చర్చించారు. ధనం, మద్యం, బూటకపు వాగ్దానాలు ఎలా రాజకీయ జలగలు గుప్పిస్తున్నాయో కళ్ళకు కట్టినట్లు చిత్రీకరించారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు నాల్గోస్తంభమైన మీడియా ప్రజల పక్షం నుండి తప్పుకుని పాలక పక్షానికి, వలస ఆధిపత్య భావజాల పక్షాన నిలిచి తన అసలు ఉనికి కోల్పోయాయి. చివరిగా భావితరాలకు మంచి రాజ కీయ వారసత్వం ఇవ్వండని కోరుకుంటాడు.

మునిమడుగుల రాజారావు గారు :

వీరు గత 20 సం॥ల నుండి సాహితీ వ్యాసంగంలో ఉన్నారు. ముఖ్యంగా మొదట్లో వచన కవితల ద్వారా తరువాత కాలంలో వ్యాసాల ద్వారా తమ రచనలను కొనసాగిస్తున్నారు. వృత్తిరీత్యా జీవిత భీమా కంపెనీలో పనిచేస్తున్నప్పటికి సమాజాన్ని పూర్తిగా అవగాహన చేసుకొని రచనల ద్వారా సమాజంను జాగృత పరుచుటకు కృషి చేస్తున్నారు. వీరు సమాజంలోని కులసమస్య, శ్రామిక దోపిడి, అస్థిత్వ ఆధిపత్యం కాపాడుకొనే ప్రక్రియలో అమానవీయ అణిచివేత ప్రక్రియలను రూపుమాపే దిశలో రచనలు చేస్తున్నారు. మొదట్లో "దు:ఖనది" కవితా సంపుటి ద్వారా సమాజంలోని అనేక సమస్యలపై స్పందిం చడం జరిగింది. అటు తరువాత సత్యమంటే ఏమిటి, సత్యం వైపు పయనం అను రచనల ద్వారా ప్రజలను ప్రేమ వైపుకు మళ్ళించడం ద్వారా వారిలోని మాన వత్వాన్ని తట్టి లేపే విధంగా రచనలు చేస్తూ ఉన్నారు.

తుమ్మల దేవరావు గారు :

వృత్తిరీత్యా ఉపాధ్యాయులు అయిన వీరు గత 23 సం॥లుగా సాహితీ వ్యాసంగంలో కొనసాగుతూ అనేకమైన కవితలు, కథలు, చరిత్ర కథలు, బుర్ర కథలు, పాటలు, హైకులు రాయడం జరిగింది.

"కచ్చురం" కవితా సంపుటి ద్వారా గ్రామీణ నేపథ్యాన్ని, పల్లె ప్రజల జీవన విధానాన్ని చక్కగా చిత్రీక రించడం జరిగింది. భూదేవి, చెరువుకట్ట, ఇడుపుకాగితం, వాన నేను ఆకాశం మొ॥లగు కథల ద్వారా గ్రామీణ ప్రాంతంలో పెద్ద మనుషులుగా చెలామణి అవుతున్న వారి కుట్రలను, కుతంత్రాలను చక్కగా వివరించడం జరిగింది. ఇంకా సారానిషేధంపై పాటలు, బుర్రకథల ద్వారా సారవల్ల కలిగే కష్టనష్టాలను కళ్ళకు కట్టినట్టు చూపించారు. పిల్లల కోసం అనేక పాటలు, నాటికలు రాసి వారిలో చైతన్యం కోసం కృషిచేస్తున్నారు. వీరు అనేకమైన చరిత్రకథలను రాసి నిర్మల్ చరిత్రను వెలికి తీయడం జరిగింది.

అంబటి నారాయణ గారు :

వీరు వృత్తిరీత్యా ఉపాధ్యాయులు. ప్రవృత్తిగా సాహితీ వ్యాసాంగం కొనసాగిస్తున్నారు. గత 25 సం॥లుగా తన రచనల ద్వారా సమాజంను జాగృతం చేస్తూ అనేక సాహితీ అవార్డులు పొందడం జరిగింది. వీరు రాసిన "తడి" కవితా సంకలనంలో "కూత" అనే కవిత నందు అంతరించి పోతున్న ప్రేమతత్వాన్ని, వలస బతుకులు, శ్రమజీవి చమట తడిని గురించి ఎంతో ఆర్ద్రంగా వివరించారు. "మోత" అనే పుస్తకంలో అనేక సంఘటనలపై ప్రతి స్పందించారు. "యువనేస్తం" పుస్తకం ద్వారా యువత మేల్కొంటేనే సమాజం బాగుంటుందని అంటారు. విద్యా వికాసం అను పుస్తకంలో మనిషి విద్యను అభ్యసించడం ఎంత అవసరమో అలాగే ఉత్తమ సంస్కారాన్ని అలవర్చు కోవడం అంతే అవసరమని సూచన చేస్తాడు. ఈ కవి తన స్వగతం గురించి, అట్టడుగు జనాల గురించి, వాస్తవ సజీవ సత్యాల గురించి తన కవిత్వంలో రాయడం జరిగింది.

కడారి దశరధ్ గారు :

కడారి దశరధ్ గారు వృత్తిరీత్యా తెలుగు పండితులు. ప్రవృత్తిగా సాహిత్యవ్యాసంగాన్ని ఎంచుకొని, సాహితీ సేవ చేస్తున్నారు. వీరు రాసిన " కడారిశతకం ", కైతిక క్షేత్రం రెండూకూడా సామాజిక అంశాలపై బాణాలను సంధించాయి. కడారిశతకం నందు యువత దుర్వ్యసనాలు సిగరెట్, బీడి, గుట్కా, మత్తు మందు గురించి, ఉద్యోగులలో లంచగొండితనం గురించి, రైతులు, డాక్టర్లు, నర్సుల త్యాగశీలత గురించి చక్కగా తెలియజేశారు. అలాగే ప్రకృతిని కాపాడాలని వృక్షాలు పెంచాలని సమాజానికి సూచిస్తారు. మరొక పుస్తకం కైతిక క్షేత్రం నందు మనుషులు నీతిగ బ్రతకాలని, ప్రశ్నించే తత్వాన్ని పెంచుకోవాలని, అంటరానితనం, కులంకన్న గుణం గొప్పది అని తెలియజేస్తూ ఇంకా అనేక విషయాలపై స్పందించారు.

కారం శంకర్ గారు :

కారం శంకర్ గారు పోలీసు శాఖలో ఉద్యోగం చేస్తున్న ప్పటికి వారి మనసు ఎప్పుడూ సాహితీవ్యాసంగం మీదె ఉంటుంది. సుమారుగా 30 సం॥లుగా తెలుగు సాహిత్యానికి సేవలందిస్తున్నారు.సాహిత్య చరిత్రలోనే ఇది వరకు ఎవ్వరూ చేపట్టని వినూత్నమైన కార్యక్రమం "కవియాత్ర" ను చేపట్టి ప్రేమ, శాంతి, కరుణ, జ్ఞానంతో జీవించే ఆదర్శవంతమైన సమాజ నిర్మాణం కొరకు పరితపిస్తున్నారు. అలాగే "కవియాత్ర" సమూహాన్ని ఏర్పరిచి కవులను ప్రోత్సహిస్తున్నారు. వీరి కలం నుండి వచ్చిన పుస్తకాలు "మళ్ళీ వసంతంలోకి", "అక్షరశ్వాస", "అశ్రు చైతన్యం", "సూర్యుడి కన్న ముందే అక్షరం" (నానీలు) అన్నీ కూడా సామాజిక అంశాలపై స్పందనాలె. ముఖ్యంగా వీరి సాహిత్యం మానవతావిలువలు పరిమళించుటకు, సమా జాన్ని చైతన్యపరుచుటకు ఎంతగానో ఉద్దేశించింది. వీరి సాహిత్యం అంతా కూడా కుల, వర్ణ వివక్షతపై స్వార్థం, వలసబతుకులు ఇంకా తన ఉద్యోగంలో చూసిన సమా జపు దీనస్థితిని గురించి ఆర్ద్ర హృదయంతో స్పందించారు. వీరి "మళ్ళి వసంతంలోకి" అనే పుస్తకంలో "తప్పిపోయిన మనిషి" సాహితీ వైద్యం, దు:ఖాల చెట్టు, బతుకు యాత్ర, పనిమనిషి, ఆడజన్మ ఇలా ఇంకా ఎన్నో సామాజిక అంశా లపై స్పందించారు.

తెలుగు సాహిత్యానికి కృషిచేస్తున్నపై కవులను అభినందిస్తూ, నిర్మల్ జిల్లాలో ఇంకా అనేక మంది కవులు తమ సాహిత్యం ద్వారా సమాజంలో ఏర్పడిన సమస్యలపై ఎప్పటికప్పుడు గళం ఎత్తుతూ ప్రజలను జాగృత పరుస్తున్నారు. ఇంకా కూడా కవులు తమ కవిత్వం ద్వారా ప్రజలను జాగృత పర్చాలని, తెలుగు సాహిత్యంలో నిర్మల్ జిల్లాకు ప్రత్యేక స్థానాన్ని నిలుపాలని ఆశిస్తూ నమస్కారం.



BHAVAVEENA
Vol. 17, Issue. 7, July 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

నిజామాబాద్ జిల్లాలో జానపదుల ప్రదర్శన కళారూపాలు

- తిరునగరి వెంకటేశ్, పరిశోధక విద్యార్థి, తెలంగాణ విశ్వ విద్యాలయం, డిచ్‌పల్లి, నిజామాబాద్.

మానవుడు భౌతికంగా జీవించడానికి గాలి, నీరు, వెలుతురు, ఆహారం ఎలా అవసరమో సంగీతం సాహిత్యం, కళ అనేవి కూడా మానవుడు మానసికంగా, ఉల్లాసంగా జీవించడానికి అంతే అవసరం. జానపద కళలన్నీ మన జానపదుల శ్రద్ధాసక్తుల వల్లనే నేటికీ నిలదొక్కుకుని ఉన్నాయి. తమ తమ పూర్వీకులకు సంబంధించిన బిరుదులను పఠించటానికి, తమతమ ప్రశస్తిని కీర్తించటానికి పూర్వ కాలంలో రాజులు తమ తమ ఆస్థానంలో జానపద ప్రదర్శనా కారులను, గాయకులను పోషించే వారు. కళా పోషకులలో సౌందర్యోపాసన ఉండేది. వారు సౌందర్యోపాసనను అనుభవిస్తూ తమ ప్రజలకు కూడా అనుభవించటానికి దోహదం చేసేవారు.

డా॥. శ్రీమంతుల దామోదర్ తమ పరిశోధన గ్రంథం అయిన జానపద సాహిత్యం-తోటి సంస్కృతి"లో ఇలా వివరించారు. "జానపద కళలు చాలా వరకు ప్రకృతి నుండే ఉద్భవించాయి. ఆ ప్రకృతిలో మనస్సుకు కాని బుద్ధికి కాని ఆనందానిచ్చే ఒక దృశ్యం లేదా ఒక భావన కళోపాసకునికి గోచరిస్తే తద్వారా అతను పొందే ఆవేదన వల్ల, తపన వల్ల ఒక కళా స్వరూపం ఆవిర్భవిస్తుంది. కళాత్మక విలువలకు మూలం సౌందర్యోపాసన అని దీని మూలంగా మనస్సు పొందే దిశ స్పందన అని చెప్పవచ్చు. ఈ రెండింటి కలయిక వల్లే కళా సృష్టి జరుగుతుందని భావించవచ్చు. అందువల్ల మానవుని మనోముద్రకు సౌందర్య స్వరూపాన్ని ప్రసాదించడమే కళ అవుతుంది" (పు : 2).

నిజామాబాద్ జిల్లాకు సంబంధించిన కళాకారులను పరిశోధిస్తే ... ఎరుకల సాని, కోయలు, గంగిరెద్దుల వారు, గారడి విద్యలు, గొల్ల సుద్దులు, గోండు నృత్యాలు, చిందులు, భజనలు, కోలాటాలు, తోలుబొమ్మలాట, దేవర వెట్టి, దొమ్మరాటలు, దూలా, పాములవాడు, పోతరాజు, పిట్టల దొర, బైండ్లవారు, బాల సంతులు, బుర్రకథలు, బుడబుడక్కలవారు, బాగోతులు, లంబాడ నృత్యం, సాధనాశురులు, కాకిపడగల, శారదకాండ్రు, కప్పతల్లి ఆటలు, డక్కలి, మాష్టి పటం ప్రదర్శనలు, పాండవుల వారు, ఒగ్గులు, మందెచ్చుల వారు మొదలగు వారు జానపద కళా ప్రదర్శనలు చేసేవారిలో ప్రముఖులుగా చెప్పుకోవచ్చు. వీరు దాదాపుగా ఆశ్రిత కులాలే. ఇటువంటి జానపద కళారూపాల్లో కళాకారులే కాకుండా తమ ప్రదర్శనలో ఇతర జీవుల సహకారం తీసుకొని ప్రదర్శించడం కనపడుతుంది. వీరిలో పది రకాల ప్రదర్శన కళాకారుల గురించి స్పృహమాత్రంగా వివరిస్తాను.

మందెచ్చులవారు :

మందపిచ్చి, మందెచ్చు, మందుచ్చ, మందహెచ్చు అనే పర్యాయ పదాలతో వీరికి గుర్తింపు ఉంది. కథలు చెప్తూ మట్టి బొమ్మలు చూపిస్తూ తెరపై బొమ్మలు ప్రదర్శిస్తూ వచన రూపంగా ముచ్చట్లు లాగా కథా గానాలు చేస్తూ సంచార జీవనం చేస్తుంటారు. వీరు యాదవులను ఆశ్రయించి జీవన కొనసాగిస్తారు. ఇత్తడి బొమ్మ, చిన్న డమరుకం, పెద్దడోలు, రణభేరి, గంటకట్టిన త్రిశూలం, చిన్న శృతినిచ్చే హార్మోన్యం, పెద్ద తాళాల జత, డోళ్లు, తిత్తి తాళాలు మొదలగునవి వాయిద్యాలుగా వాడుతారు. వస్త్రాలంకరణ/ ఆహార్యం విషయంలో వీరిలో ప్రధాన కథకుడు తెల్లని ధోవతి, అంగీ, నెత్తికి రుమాలు, చేతిలో ఒక గజం లేదా అర్ధ గజం వెండి పాన్ను కర్ర, కాళ్లకు గజ్జెలు, చెవులకు పోగులు, ఎర్రరాళ్ల పెద్ద కమ్మలు, ముక్కుకు పోగు, వెండి గొలుసులు, భుజానికి దండ

కడియాలు, కాళ్లకు మెట్టలు, కుడి కాలుకు బేడీలు ధరిస్తారు. ప్రతీ ప్రదర్శన కళా రూపంలో ఉన్నట్లే దేవతా స్తుతి వీరు కూడా ఆచరించే సంప్రదాయం ఉంది.

కథా ప్రారంభానికి ముందుగా శారదను, గణపతిని, గంగను, శ్రీకృష్ణున్ని, వివిధ క్షేత్రాలలో నెలకొని ఉన్న మల్లన్న దేవున్ని ప్రత్యేకంగా ప్రార్థించుకుంటూ ఇతర ప్రాంతీయ దేవతలను కూడా ప్రార్థించుకున్న తర్వాతే కథను మొదలు పెడుతారు. వీరు కాటమరాజు కథ, పెద్దరాణి, గంగరాజు, హల్లిరాణి, సింహాద్రి, నలగామరాజు మొదలగు కథలను జానపదులకు వినిపిస్తారు.

కాకిపడగల వారు :

వీరు పట ప్రదర్శన గాయకులు. కాకి బొమ్మను పడగ మీద పతాకంపై కలవాళ్లుగా కాకి పడగల వారు అని కాకి రెక్కల వాళ్లు అని కూడా అంటారు. వీరు ముదిరాజు, ముత్రాజు, బెస్తవారు, తెనుగు మొదలగు వారిని యాచించటం వీరి ఆనవాయితిగా కొనసాగుతుంది. వీరు పటం ప్రదర్శించి, కథలు యక్షగానాల పద్ధతిలో గానం చేస్తారు. వీరు ప్రదర్శించే పటం నిర్మాణం చూసినట్ల యితే.... 40 నుండి 45 అడుగులు పొడవు, 3 నుండి 4 అడుగుల వరకు వెడెల్పు ఉన్నటువంటి పటం చుట్ట బడి ఉంటుంది. ఈ పటం వెనుక భాగానికి అంతా ఎరుపు రంగును కలిగి ఉంటుంది. ఒక అడుగు లేక ఒకటిన్నర అడుగు వరకు చిత్రాలు చిత్రీకరించబడి ఉంటాయి. ఈ పటాన్ని వై ఆకారం గల రెండు కట్టెల పంగల్లో పెట్టి పటాన్ని పైకి తిప్పుతూ ప్రదర్శిస్తారు. ఇక వీరు ఉ పయోగించే వాయిద్యాలను చూసినట్లయితే... మద్దెల, తాళాలు, శృతి హార్మోన్యం, తాళాలు, కాళ్లకు గజ్జెలుం టాయి.

చిందువాళ్లు :

చిందువాళ్లకు చిందోళ్లు, సిందోళ్లు, అనే నామ కరణాలున్నాయి. వీరు ప్రధానంగా మాదిగలను యాచించి బతుకు కొనసాగిస్తారు. ఈ మధ్య కాలంలో వీరు సకల కులాలను భిక్షమడిగి వీరి ప్రదర్శనలను చేస్తున్నారు. ప్రజలకు అత్యంత సమీపంలో ప్రతీక్షించే భిక్షక గాయకులు. వీరు మహాభారతానికి చెందిన ఘట్టాలను, రామాయణ భాగవతానికి చెందిన ఘట్టాలను ప్రదర్శి స్తారు. ఆరెమరాటీలు, బాలనాగమ్మ, ఇద్దరు మిత్రులు, సారంగధర లాంటి చరిత్రలను కూడా వీరు యక్షగాన రూపంలో ప్రదర్శిస్తారు. వీరు మాదిగలను త్యాగం అడుక్కుంటారు. రెండు లేదా మూడేండ్లకు ఒకసారి వీరు మాదిగ గూడెములకు వచ్చి త్యాగం పేర వీరు మాదిగలను భత్యం కూడా అడుగుతారు. ఐదు కథలను ప్రదర్శించి ఆరవ రోజున ఎల్లమ్మ కథను ప్రదర్శించటం వీరి ఆనవాయితి. వీరు మాదిగలు ఇచ్చే దినుసును, బియ్యంను, బట్టలను సాయంత్రం కాగానే అన్నమును కూడా అడుక్కొని తిని సంచార జీవనాన్ని కొనసాగిస్తారు. చిందువాళ్లు వేసే ప్రదర్శనలో ఎల్లమ్మ కత చాలా ప్రధానమైంది. చిందువాల్ల గృహిణిలులో ఒక స్త్రీ ఎల్లమ్మ వేషాన్ని కడుతారు. ముఖం నిండా పసుపు రాసుకొని నుదుటి మీద పెద్ద బొట్టును పెట్టుకుంటుంది. కాళ్లకు గజ్జెలు, నెత్తికి కిరీటం పెట్టుకుంటుంది. మెడలో గవ్వల దండను వేసుకుంటుంది. చేతిలో డాలు పట్టుకుంటుంది. వేపాకుల దండ కూడా ఉంటుంది. బొట్లు పెట్టిన బోనం కూడా ఉంటుంది. ఈవిధంగా దర్శనమిచ్చే ఎల్లమ్మను చూసి గ్రామీయులు పరవశించి పోతారు. తెలుగు దళిత సాహిత్యంలో చిందుల గురించి, డక్కలి వారి గురించి మరియు మాష్టీలను గురించిన కవిత్వాన్ని, అలాగే యక్షగానం పేర కథలను, డక్కలి ఎత శీర్షికన వీరిని మొట్ట మొదట చిత్రీకరించిన వారుగా డా॥ గుండెడప్ప కనకయ్య తెలుగు దళిత సాహిత్యంలో మనకు కనపడ తారు.

గంగిరెద్దుల వాళ్లు :

ఎద్దుల వేషం ప్రధానంగా అపురూపంగా కనపడే ప్రదర్శనా కళా రూపం. యాదవుల తెగల్లో ఉండే ఒక తెగకు చెందిన వాళ్లే గంగిరెద్దుల వాళ్లు. యాదవుల తెగలోని పూజగొల్లలు ఎక్కువగా గంగిరెద్దులను ఆడించే

వృత్తిలో ఉన్నట్లు తెలుస్తుంది. వీరి ఆహార్యం అత్యంత సుందరమైంది. గంగిరెద్దుల వాళ్ల వేషం చాలా అందంగా ఉంటుంది. నొసట పంగ నామాలు లేదా బస్మం రేఖలు, కుంకుమ బొట్లు పెట్టుకుని తెల్లని దోవతి కట్టి చిక్కాలపై నల్లని కోటు ధరించి, తలకు ఎర్రని తలపాగ పెట్టుకుని వీధుల గుండా సన్నాయి వాయిస్తూ... దర్శనమిస్తారు. నడుముకు వెండిబిల్లలు గల మొలతాడు కట్టుకొని, పెద్దలు అతనికి ఇచ్చిన వెండి ఇత్తడి పతకాలను తన కోటుకు అలంకారంగా తగిలించుకుంటారు. కాశ్మీరు శాలువ వేసుకొని ఆర్భాటంగా సన్నాయి ఊదుతూ మధ్య మధ్య గంగిరెద్దు పాటలు పాడుతూ ప్రతి ఇంటికి వెళ్లి భిక్షాటన చేస్తారు.

సాధనాపరులు :

పద్మశాలీలను మాత్రమే యాచిస్తారు. వీరి ప్రదర్శన ఇంద్రజాలానికి సంబంధించింది. వీరి ప్రదర్శన పగటి పూటనే జరుగుతుంది. వీరి రంగస్థలం గ్రామ కూడలి ప్రాంతాల్లో ఉన్న విశాలమైన స్థలంలో ప్రదర్శనను కొనసాగిస్తారు.

కూనపులి వాళ్లు :

వీరిని పడిగె రాజుల వాళ్లు అంటారు. పడిగెలవాళ్లు, చామరుల వాళ్లు, పులిజెండావాళ్లు, సయ్యాంవాళ్లు, సైనోళ్లు అనే పేర్లతో వీరిని పిలుస్తారు. వీరు పద్మశాలి వంశచరిత్రను కులోత్పత్తి విషయాలను వర్ణిస్తూ కథలుగా గానం చేస్తూ సంచార జీవనం కొనసాగిస్తారు. వీరు మార్కండేయ పురాణాన్ని అత్యంత అద్భుతంగా ప్రదర్శిస్తారు. వీరు కథ చెప్పేటపుడు పటం ఉపయోగిస్తారు. పటానికి వాడే వస్త్రం మూడు అడుగుల వెడెల్పు 30 నుండి 40 గజాల పొడవు ఉంటుంది. అటు ఇటు రెండు పంగల కర్రలు పాతి వాటి మధ్యలో ఈ పటాన్ని ఉంచి సినిమా రీలులా లాగుతూ అందులో నిక్షిప్తం చేయబడి ఉన్న చిత్రాల్ని చూపిస్తూ కూన పులులు వివిధ కథల్ని చెప్పటం అనవాయితీగా కొనసాగే ప్రదర్శన రూపం.

ఒగ్గు వాళ్లు :

ఒగ్గు కథ తెలుగు దేశపు జానపద ప్రదర్శన కళా రూపాల్లో తలమానికం వంటిది. ఒగ్గుకథ మౌఖిక సంప్రదాయానికి చెందినదే అయినా తర్వాత కాలంలో యక్షగాన ప్రభావానికి లోనై నాటకీయతను సంతరించుకొని దృశ్య కావ్యంగా రూపు దిద్దుకున్నది. వీరి వాయిద్య నిర్మాణం పరిశీలించినట్లయితే... స్థూపాకారంలో ఉన్న ఒక ఇత్తడి లోహపు పరికరం రెండు వైపులా మేకతోలుతో మూయబడి ఉంటుంది. 45 సెం.మీ. పొడవు 95 సెం.మీ. చుట్టూ కొలత కలిగి ఉన్న పరికరాన్ని ఒగ్గు అంటారు. సుమారు 6 నుండి 8 మంది కథకుల వరకు టీంలాగా ఉంటారు. ముగ్గురు కథకులు వేదిక మీద తక్కువల తక్కువ ముగ్గురు తెరవెనుక ఉంటారు. ముగ్గురు కథకుల్లో ఒక ఆడవేషం ఉంటుంది. ప్రధాన కథకునితో పాటు ఒక వంతకుడు ఉంటాడు. మిగతావారు డోలు, తాళాలు ఇతర వాయిద్యాలు వాడుతూ సుతి పాడుతారు.

కాటిపాపల వాళ్లు :

జానపదుల కళాకారుల్లోని బుడిగె జంగం శాఖకు పుట్టిన రెమ్మయే కాటిపాపలు. వీరు ఇంద్రజా విద్యను ప్రదర్శించి ప్రజల నుండి జీవితానికి సరిపడా త్యాగాన్ని లేదా భత్యాన్ని పొందుతారు. కాడుకు లేదా స్మశానానికి వెళ్లి తమ విద్యను ప్రదర్శించి చనిపోయిన బంధువులను ఓదారుస్తారు. వీరి వేషధారణను చూస్తే... చెవులకు ఇత్తడి లేదా రాగివి పెద్ద పోగులు ధరించి నెత్తిమీద నాగఫణి కిరీటాన్ని తగిలించుకుని ఉంటారు. షేర్వాణీ లాంటివి ధరిస్తారు. నడుముకు తోలుతో చేసిన పట్టెడను లేదా బెల్టును పెట్టుకుంటారు. దానికి ఇత్తడి గజ్జెలు ఉంటాయి.

బుడుబుడుకల వాళ్లు :

సర్వ కులాల వారిని భిక్షమెత్తి తమ కళా రూపాన్ని

ప్రదర్శించే వాళ్లు బుడబుడకల వాళ్లు. వీరు వాయించే వాయిద్యం హుడుక్కు లేదా ఉడుక. మధ్య రాత్రి 2 గంటల నుండి తెల్లవారు ఝామున 5 గంటల వరకు బుడుబుడుక అనే చిన్న ఢమరుకం వాయించుకుంటూ శకునాలు చెబుతూ పాటలు పాడుతూ గ్రామాల్లో ప్రతి ఇంటికి తిరుగుతూ యాచించటం వీరి కుల ఆనవాయితి. వీరి వేషధారణను గమనించినట్లయితే... ఎనిమిది గజాల పొడవు గల రంగు రుమాలును ధరించి తెల్లని అంగి ధరిస్తారు. దానిపై ఏదైనా రంగు కోటును వేసుకొని శాలువాను పైనా గుండ్రంగా కట్టుకుంటారు.

పాండవుల వాళ్లు :

కిన్నెరను వీనుల విందుగా వాయిస్తూ అభినయ పూర్వకంగా హావభావాలను ప్రదర్శిస్తూ కథాగానం పసందుగా చేసే జానపదులలో పాండవుల వాళ్లు ఒక తెగకు సంబంధించినవారు. వీరు మహాభారతంలోని కథలను సుమారు 41 రోజులు చెప్తారు. ముగ్గురు వ్యక్తులు వారి వారి వాక్ఫుషణా చాతుర్యంతో ప్రేక్షకులను పరమ ముగ్ధులను గావించటం వీరి ప్రదర్శనలో ఉన్న గొప్ప గుణం. ఇలా నిజమాబాద్ జిల్లాలో సుమారు 35 రకాల ప్రదర్శన కళారూపాలు ఉన్నాయి.

❁❁❁

BHAVAVEENA
Vol. 17, Issue. 7, July 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

మానవజీవనంలో ఆధ్యాత్మిక సోపానాలు

- డా॥. వేదాంతం యమ్.యమ్.ఆర్.యస్.టి.కె ఆచార్యులు

ఈ విశ్వసృష్టిలో అన్ని ప్రాణులకెల్లా మానవజన్మ ఉత్తమమైనది మరియు దుర్లభమైనది. భాగవతంలో ఇదే విషయాన్ని తెల్పుతూ - 'జంతూనాం నరజన్మ దుర్లభః' అని పేర్కొనబడింది. ఎంతో ఉత్తమమమైన మానవ జన్మను సార్ధకత చేసుకోవడమనేదే మనిషికి లభించే పరమ ప్రయోజనం. ఆ ప్రయోజనాన్ని సాధించడానికి ఆధ్యాత్మికతను అనుసరించడమే ఏకైక మార్గము. అయితే మనిషి ఆధ్యాత్మికతను అనుసరించడమే ఏకైక మార్గము. అయితే మనిషి సాధారణంగా 'నేను' అనే భౌతిక భావనతోనే నిరంతరం కోట్టుమిట్టాడుతూ జీవన పరమార్ధ మేమిటన్న విషయాన్ని గ్రహించకుండా కాలాన్ని గడుపుతూ ఉంటాడు. అందుకే మానవులకి జన్మ సార్ధకతను పొందడానికి వీలుగా మన భారతీయ ఋషులు మహర్షులు ఉన్నతమైన ఆధ్యాత్మిక మార్గాన్ని నిర్దేశించారు. మనిషి నిత్యం ఆ మార్గంలో పయనిస్తూ, ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పొందడం ద్వారా జీవిత పరమార్ధాన్ని సాధించగలగుతారు. "మనిషి మానసికంగా, ఆత్మపరంగా పరిణతి పొందినప్పుడు అతనికి సహజంగా గోచరించే జ్ఞానమే ఆధ్యాతిష్మక జ్ఞానము".

ఆధ్యాత్మిక జ్ఞానమనేది సులభంగా లభ్యమయ్యే విషయం కాదు. కానీ నిరంతర సాధన ద్వారా లభించడమనేది సాధ్యమవుతుంది. జ్ఞానసాధనలో భాగంగా మనిషి నిత్యజీవనంలో ఆధ్యాత్మిక సోపానాలను అనుసరిస్తూ, ఆచరించాలి. ఆధ్యాత్మిక సోపానాలు ఏమిటన్నవి పరిశీలిస్తే - అంతఃకరణాలను అదుపులో ఉంచుకోవడం, మనో నిగ్రహాన్ని కలిగి ఉండడం, ధర్మాన్ని ఆచరించడం అనునవి లోక ప్రసిద్ధమైనవిగా ఉన్నాయి. వాటిని గురించి వివరంగా తెలుసుకుందాం.

అంతఃకరణముల నియంత్రణ :

మనస్సు, బుద్ధి, అహంకారము అను మూడింటిని కలిపి అంతఃకరణములు అంటారు. మనలో అంతర్లీనంగా ఉన్న ఈ మనోబుద్ధి అహంకారములు నిత్యం మనం చేసే పనులన్నింటిలో ప్రధాన భూమికను పోషిస్తుంటాయి. అంతఃకరణాలను అదుపులో ఉంచుకోవడం ద్వారా ఆధ్యాత్మిక జ్ఞానసాధన సులభతర మౌతుంది.

మనస్సు :

'మనయేవ మనుష్యాణాం కారణం బంధ మోక్షయోః' అని భగవద్గీతలో చెప్పబడింది. అంటే మనిషి యొక్క భౌతిక బంధాలకైనా, ఆధ్యాత్మిక సాదనకైనా మనసే ముఖ్యకారణం. అయితే మనస్సు సహజంగా చంచల స్వభావాన్ని కలిగి, ఏదో ఒక మనోవృత్తి ద్వారా మనిషిని ప్రవర్తించేట్లుగా చేస్తుంది. తద్వారా మనిషి భౌతిక విషయాలతోనే గడపడం జరుగుతుంది. చంచలమైన మనస్సును అదుపులో ఉంచినప్పుడే అలౌకిక విషయాలపై దృష్టి సారించడం సాధ్యమౌతుంది. కాబట్టి జ్ఞాన సాధనకై మనిషి మనోనిశ్చలతను పొందడం ఎంతో అవసరం.

బుద్ధి :

మన పెద్దలు 'మనస్తు పరాబుద్ధిః' అన్నారు. అంటే మనస్సు కన్నా బుద్ధి ప్రధానమైనది అని అర్థం. ఆధ్యాత్మిక మార్గంలో పయనించడానికి మనస్సుతో పాటు బుద్ధిని కూడా అదుపులో ఉంచుకోవడం ఎంతో ముఖ్యం. మనస్సు వలెనో బుద్ధి కూడా చలించే స్వభావం కలిగి ఉంటుంది. ఇప్పుడైతే బుద్ధి చలన స్వభావాన్ని వీడి, పరమాత్మ యందు స్థిరముగా నిలిచి ఉంటుందో అప్పుడే ఆత్మసాక్షాత్కారానికి మార్గం సుగమమవుతుంది.

అహంకారము :

మానవాభ్యున్నతికి అన్ని విధాలా నిరోధకమైన అంశం అహంకారాము. అహంకారంతో కూడిన మనస్సు చెడు తలంపులతో నిండి మనిషిని అధర్మ మార్గంలో నడిపి

స్తుంది. ఏ విషయంలోనూ సక్రమమైన నిర్ణయాలను తీసుకోనివ్వదు. కాబట్టి మనిషి అహంకార భావాన్ని త్యజించి, నమస్కార విధిని అనుసరించాలి.

మనోనిగ్రహసాధన :

'సర్వే మనో నిగ్రహ లక్షణాంతాః' అని వ్యాస మహర్షి మనో నిగ్రహాన్ని గురించి వివరించారు. అంటే సర్వకాల సర్వావస్థల యందు మనస్సును నిగ్రహించుకోవడం ఉత్తమమని అర్థం. మనోనిగ్రహమనేది ఒకేసారిగా సాధ్యమయ్యే విషయం కానప్పటికీ, అభ్యాసము, వైరాగ్యము అను వాటిని అనుసరించడం వలన సాధ్యమేపుతుందని పతంజలి మహర్షి యోగశాస్త్రంలో వివరించారు. అభ్యాస, వైరాగ్యాల గురించి తెలుసుకుందాం.

అభ్యాసము :

'నిలకడలేని మనస్సును నిగ్రహించి, దాన్ని యందు లగ్న పరుచుటకు చేయు ప్రయత్నమనే అభ్యాసము' అంటారు.

ఈ అభ్యాసంలోని అంశములే అష్టాంగములు. యమము, నియమము, అగునము, ప్రాణామాయము, ప్రత్యాహారము, ధ్యానము,ధారణ, సమాధిస్థితి అనునవి అష్టాంగ మార్గములు.

యమము :

అహింస, ఎప్పుడూ సత్యాన్నే మాట్లాడటం, ఇతరుల వస్తువుల్ని అపహరించకపోవడం, ఇతరుల నుండి ఏదీ ఆశించకపోవడం, బ్రహ్మచర్యము వంటి లక్షణాలన్ని 'యమ' శబ్దం చేత చెప్పబడతాయి. వాటన్నింటినీ ఆచరించడమే యమము. 'యమం' వలన మనస్సుకు స్థిరత్వం కలగడం, భౌతిక జీవనశైలిలో మార్పు రావడం వంటి ప్రయోజనాలు సిద్ధిస్తాయి.

నియమము :

శౌచము, సంతోషము, తపస్సు, స్వాధ్యాయము, ఈశ్వర ప్రణిదానము అనునవి నియమములుగా చెప్పబడుతున్నాయి. మనిషి శారీరకంగానూ, మానసికంగానూ పరిశుద్ధతను కలిగి ఉండడమే శౌచము. సంతోషాన్ని ఎల్లప్పుడూ కలిగి ఉండడంతోపాటు నిత్యం తపస్సును ఆచరించాలి. తపస్సు అంటే ఆత్మదర్శనం కోసం తపించడమని అర్థం. భగవంతుడిని అర్చించడం, స్మరించడం, సత్పురుషుల సాంగత్యం చేయడం వంటివి తపస్సుకు ఉపకరణాలు.

స్వాధ్యాయము అంటే వేదాలను పవిత్ర గ్రంథాలను పారాయణ చేయడం. నిత్యం మనం చేసే ప్రతి పనిని పరమాత్మకు సమర్పణ భావనతో చేయడం ఈశ్వర ప్రణిదానము. నియమము వలన మనోస్థిరత్వం లభించడంతోపాటు మానసిక జీవనశైలిలో మార్పు కలుగుతుంది.

ఆసనాలు :

ఆధ్యాత్మిక మార్గంలో జనధ్యానాలను అవలంభించడానికి ఆసనములు ప్రధానమైనవి. శరీరాన్ని స్థిరముగా, సుఖంగా ఉంచడాన్ని ఆసనం అంటారు. ఆసనాలు ఎనభై నాలుగు (84) రకాలు ఉన్నప్పటికీ జపధ్యానాధులకు ఉపయుక్తమైనవి నాలుగు (4) ఆసనాలు. అవి 1. సుఖాసనము, 2. సిద్ధాసనము, 3. పద్మాసనము, 4. స్వస్తికాసనము. వీటిలో ఏదో ఒకటి అనుసరించి సాధన చేయడం ద్వారా మనస్సు యొక్క చంచలస్థితి పోయి, సాత్వికబుద్ధి అలవడుతుందని, శారీరకారోగ్యం కూడా కలుగుతుందని 'హఠయోగ ప్రదీపిక' గ్రంథంలో వివరించారు.

ప్రాణాయామము :

ప్రాణ వాయువును నిరోధించడమే ప్రాణాయామము. అంటే మనసుకు నిలకడ లభించిన తర్వాత శ్వాసపద్ధతిని అదుపు చేయడానికి ప్రాణాయామాన్ని ఆచరిస్తారు. ప్రాణాయామం చేసేటప్పుడు 'ఏకాగ్రత' దైవం ఉంచాలి. అలా కొంతకాలం పాటు నిత్యం కొంతసేపు ప్రాణాయామాన్ని చేయడం వలన ఏకాగ్రతాశక్తి పెంపొంది, తద్వారా మనోనిగ్రహాన్ని కూడా పొందుతారు.

ప్రత్యాహారము :

సాధారణంగా బాహ్య విషయాలపై దృష్టి ఉండే ఇంద్రియాలను, బాహ్య విషయాల నుండి మరల్చి అంతరాత్మ విషయాలపై లగ్నము చేయునట్లుగా సాధన

చేయడమే ప్రత్యాహారము. దీని వల్ల ఇంద్రియ నిగ్రహం కలుగుతుంది.

ధారణము :

ఇంద్రియ నిగ్రహం పొందిన తర్వాత, మనస్సును ఒకే లక్ష్యంపై చలనం లేకుండా ఏకాగ్రతను నిలపడాన్నే ధారణము అంటారు. దీనివల్ల మనస్సుకు స్థిరత్వం ఏర్పడుతుంది.

ధ్యానము :

ధ్యానము అంటే ధ్యాస. అనగా ఒకే వస్తువు మీద మనస్సును ఏకాగ్రముగా నిలపడాన్ని ధ్యానం అంటారు. ధ్యానం అనేది పట్టుదల, నిరంతర కృషి వలన సాధ్యమౌతుంది. ధ్యానానికి సంధ్యాకాలం అనగా సూర్యోదయ, సూర్యాస్తమయ సమయాలు శ్రేష్ఠమైనవిగా మహర్షులు నిర్ణయించారు. ధ్యానం వలన శారీరక ఒత్తిడులు తొలగి, మానసిక శాంతి లభిస్తుంది. 'పరిపూర్ణత' అనే సమాధి జ్ఞానం కలుగుతుంది.

సమాధి స్థితి :

అరక్షణం పాటు ఆకార రహితమైన కాంతి కన్నుల ముందు గోచరించిన అనుభవాన్ని పొందడమే సమాధిస్థితి. ధ్యాన ఫలితంగా లభించిన సమాధిస్థితి వలన కైవల్య ప్రాప్తిని పొందుతారు.

వైరాగ్యము :

పరమాత్మ విషయాల పట్ల తప్ప ఇతర, ఏ ప్రాపంచిక విషయాలపైన కోరిక లేకుండా ఉండడమే వైరాగ్య భావన. వైరాగ్య భావన కలిగినప్పుడు 'మనస్సు కోరుకునే విషయ వాంఛల ఫలితం 'దుఃఖమే' నన్న వాస్తవం అవగతమవుతుంది. దీనివల్ల జీవనం సుఖమయమవుతుంది. దీనితోపాటు సాత్విక, మితాహారములను పాటించడం, ఉపవాస దీక్షలను ఆచరించడమనేవి కూడా మనోనిగ్రహం పొందడానికి తోడ్పడే అంశాలుగా చెప్పవచ్చు. మనోనిగ్రహ సాధన ద్వారానే మనిషికి ఆధ్యాత్మిక కోన్నతి కలుగుతుంది.

ధర్మాచరణము :

ఆధ్యాత్మిక జీవనంలో పాటించవలసిన మరొక ముఖ్యమైన సోపానం ధర్మాచరణము. బ్రహ్మచర్యం, సత్యాన్నే పలకడం, దానం చేయడం, నియమాలు పాటించడం, క్షమ, అహింస, శౌచం, శాంతి వంటి సాత్విక భావాలు కలిగి ఉండడం, ఇతరుల సొమ్మును అసహరించకపోవడం వంటి పది (10) లక్షణాలను కలిపి 'ధర్మము' అంటారు అని పద్మపురాణం తెలియజేస్తోంది. ఈ విధమైన లక్షణాలతో కూడిన ధర్మాన్ని మనిషి నిత్య జీవితంలో ఆచరించడం, ప్రచారం చేయడం ధర్మాచరణ అవుతుంది. ధర్మాచరణ వలన మనిషిలో సద్గుణాలు వికసించి, సమతా భావన పెంపొందుతుంది. ఎల్లప్పుడూ పరహితాన్ని కోరే స్వభావం అలవడుతుంది. ఈ విధమైన భావన కలవారే పరమాత్మ ప్రాప్తి పొందుతున్నారనుట వేదాంత నిశ్చయం.

లోక ప్రసిద్ధమైన ఈ ఆధ్యాత్మిక సోపానాలను మనిషి నిత్య జీవితంలో భాగంగా చేసుకొని, భక్తి, జ్ఞాన, కర్మ, యోగ మార్గాల్లో ఏదో ఒక దానిని అనుసరిస్తూ 'ఆత్మజ్ఞాన' ప్రాప్తికై కృషి చేయాలి. శరీరాన్ని, మనస్సుని, బుద్ధిని, ఇంద్రియాలని, ఆత్మని సమన్వయం చేసుకొనే విధంగా సాధన చేయాలి. అప్పుడే ఆత్మజ్ఞాన ఫలం లభిస్తుంది. జన్మసార్థకత చేకూరుతుంది.

ఉపయుక్త గ్రంథాలు :

1. ఆధ్యాత్మిక జ్యోతి - పి. రామచంద్ర దయానిధి.
2. భగవద్గీత - ఏ.సి. భక్తి వేదాంత ప్రభుపాదులవారు, ఇస్కాన్ ప్రచురణ.
3. హఠయోగ ప్రదీపక
4. యోగశాస్త్రం - పతంజలి మహర్షి.

BHAVAVEENA
Vol. 17, Issue. 7, July 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

తెన్నేటి లక్ష్మీనరసింహమూర్తి గారి కథా సంపుటి - పరిశీలన

-వై. అరుణ రత్నకుమారి, తెలుగు అధ్యాపకురాలు, సి.హెచ్.ఎస్.డి. సెయింట్ థెరిస్సా మహిళా డిగ్రీకళాశాల, ఏలూరు.

ఆధునిక తెలుగు సాహిత్యంలోని ప్రక్రియలలో అనేక రచనలు చేస్తున్న సమకాలీన రచయితలలో తెన్నేటి లక్ష్మీనరసింహమూర్తి గారు ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించిన గొప్ప వ్యక్తి.

తెన్నేటి లక్ష్మీనరసింహమూర్తి గారు అక్షర కిరీటి అనే బిరుదాంకితులు. ఈయన కవి, రచయిత, నటుడు, దర్శకుడు, సభావ్యాఖ్యాత, ప్రయోక్త. నేర్చుకునే హృదయం వుంటే సృష్టిలో ప్రతిదీ ఒక పాఠమే ప్రతిభావంతులకు ఎల్లలు లేవు, వీరి సేవలకు పరిధులు ఉండవు అనడానికి తెన్నేటి మాస్టారి జీవితం నిదర్శనం.

తెలుగులో యుగ ప్రవక్తలైన కందుకూరి, రాయప్రోలు, గురజాడ, శ్రీశ్రీ, మధునా పంతుల వారి సాహిత్య ప్రభావంతో తెన్నేటి వ్రాసే కవితలు, వ్యాసాలు, ఇతర రచనలు ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి, అస్త్రం, నేటి నిజం, స్ఫూర్తి, తెలుగు విద్యార్థి మొదలైన పత్రికలలో ప్రచురింపబడుతూనే ఉన్నాయి. ఒక ప్రక్క బడిపంతులుగా ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ, మరో ప్రక్క సమాజంలో విజ్ఞానాన్ని పెంపొందించటం కోసం, సామాజిక అవగాహన కల్పించడం కోసం ఎన్నో కథలు, నాటికలు, కవితలు వ్రాస్తూ ప్రముఖుల ప్రశంసలు పొందారు.

తెన్నేటి వారు వక్కపొడి, సిగరెట్, అమ్మ అక్షరం ఆయుధంగా, డబ్బు భలే జబ్బు, విశ్వమానవ ప్రేమ, రక్తదానం వగైరా కవితలు సుమారు 1000 వరకు వ్రాశారు. ఈయనకు "నవసాహితీ విశారద", "అక్షరకిరీటి", "సాహిత్య సేవారత్న", "సాహితీ వల్లభ", "సాహితీ సభా సామ్రాట్" మొదలగు చాలా బిరుదులు అందుకున్నారు.

ఈయన కవితలు, కథలు, వ్యాసాలు ఒక చేత్తో అవలీలగా వ్రాస్తూనే శ్రవణం కన్నా వీక్షణమే ప్రజలలో ఎక్కువ కాలం గుర్తు ఉంటుంది అనే భావంతో సుతిమెత్తని హాస్యం, మృదు మధుర సంభాషణ, జనరంజకమైన కథనంతో, చక్కని పాత్ర చిత్రణతో రాశారు.

సర్ధుకుపోవాలి రా సుబ్బారావు :

ఈ కథానికలో సుబ్బారావు పాత్రను సరికొత్త రీతిలో చాలా చక్కగా, హాస్యంతో రసాత్మకంగా రాయడం జరిగింది. ఈ కథానికలో సుబ్బారావు, తన తల్లిదండ్రులకు సంతానంలో మధ్యవాడు. మధ్యవాడు అనగానే తన పరిస్థితి ఎలా ఉంటుందో మనం ఊహించవచ్చు. ఈ కథలో మధ్యవాడిగా సుబ్బారావు ఎదుర్కొన్న సమస్యలను చాలా చక్కగా చెప్పారు.

తనకంటే ముందు పుట్టిన అన్నగారు చదివి వదిలేసిన పాత పుస్తకాలు చదువుకోవాల్సి వచ్చేది. ఒకవేళ అవి చిరిగిపోయిన, కొత్తవి కొనమంటే నువ్వు మంచోడివి కదా మళ్ళీ కొత్తవి కొనాలంటే డబ్బులు ఎక్కడినుంచి వస్తాయి, అని సర్దుకుపోవాలి రా అనేవారు తల్లిదండ్రులు. అవే పుస్తకాలు జాగ్రత్తగా పుస్తకాలను వాడుకుంటే తమ్ముడికి ఉపయోగపడేవిగా అని కేకలు పెట్టి తమ్ముడికి కొత్తవి కొనేవాళ్ళు.

ఆట వస్తువుల విషయంలో కూడా సర్ధుకోమనే వాళ్ళు. ఇలా చిన్నతనం నుంచి ప్రతీ విషయంలో కూడా సర్ధుకుపోవాల్సి వచ్చింది.

పెద్దబ్బాయికి బాగా చదువు వస్తుందని మంచి పుస్తకాలు కొని ప్రయివేట్ కాలేజీల్లో చదివించి ఇంజనీర్ చేశారు. సుబ్బారావుని చదువు విషయంలో డబ్బులు లేక తల్లిదండ్రులు నువ్వు ఇంకా "సర్ధుకుపోవాలిరా" అన్నారు చిన్న చదువు చదివేడు కాబట్టి గుమస్తాగా స్థిరపడ్డాడు.

ఇలా చదువు ఉద్యోగం విషయంలో సర్ధుకుపోయిన సుబ్బారావు పెళ్ళి విషయంలో ఎన్నో కోరికలు, ఆశలు

ఉన్నప్పటికీ పరిస్థితుల వలన సర్ధుకుపోయాడు. ఇలా జీవితంలో ప్రతిదీ సర్ధుకుపోయేవాడు సుబ్బారావు పెళ్ళి తరువాఆత మగపిల్లలు కావాలంటూ చూస్తుంటే వరుసగా నలుగురు ఆడపిల్లలు పుట్టేసరికి ఇంకా సర్ధుకుపోవటం నా వల్ల కాదంటూ భార్య సుందరికి ఆపరేషన్ చేయించేశాడు. ఇలా తన జీవితంలో ప్రతి విషయంలో సర్ధుకు పోయే సుబ్బారావు కథ ద్వారా ప్రతి ఇంటిలో మధ్యవాని పరిస్థితి ఎలా వుంటుంది అనే విషయాన్ని రచయిత సుబ్బారావు పాత్రలో చక్కగా చూపించాడు.

నేను సైతం కథానికలో రచయిత శ్రీశ్రీ ''నేను సైతం ప్రపంచాగ్నికి సమిధ నొక్కటి ఆహుతిచ్చాను. కవితను ప్రేరణగా తీసుకుని ''నేను సైతం'' అనే చిన్న హాస్య కథను వ్రాశారు తెన్నేటి వారు.

ఈ కథ నేను సైతం ప్రపంచానికి పనికి వచ్చే పని చేయాలనే ఆలోచన తపనతో ఉన్న ఒక వ్యక్తి చేసిన ప్రయత్నమే. ఒక వ్యక్తి ''నేను సైతం'' పనికొచ్చే పని చేయాలనే ఆలోచనతో అవకాశం కోసం ఎదురు చూస్తున్నాడు ఒక వ్యక్తి. ఆర్.టి.సి బస్ ఎక్కాడు. టికెట్ తీసుకుని కూర్చున్నాడు అసలే చలికాలం అందరూ నిద్రపోతున్నారు. బస్‌లో లైట్ తీసేశారు.

బస్సు కదులుతూ ఉండగా సడన్‌బ్రేక్‌తో బస్ ఆగింది. ఒక అగంతకుడు అయిదు నెలలు పిల్లవాడితో బస్సు ఎక్కటం, కండక్టర్ టికెట్ ఇవ్వడం బస్సు చీకటి మయం అయింది. కాసేపటికి పిల్లవాడు ఏడవసాగాడు ''నేను సైతం'' అనే వ్యక్తి ఒక్కసారిగా ఎలర్ట్ అయి పోయాడు. జాగ్రత్తగా గమనిస్తున్నాడు. ఆ పిల్లాడు ఏడుపు ఆపలేదు. అవకాశం కోసం ఎదురు చూస్తున్నాడు. ''నేను సైతం''కు ఏదైనా చేయాలనే తపన ఏదో సాధించాలనే గుర్తింపు నలుగురిలో రావాలి.

అదే ఆలోచనతో ఏమాత్రం ఆలోచించకుండా ఒక్కసారిగా సీటులో నుండి లేచి ఆ అగంతకుడి చేతులో నుండి పిల్లవాడిని లాక్కుని ''చెప్ప పిల్లవాడిని ఎక్కడ్నుంచి ఎత్తుకొచ్చావ్'' అని గట్టిగా అన్నాడు నేను సైతం ఆ పిల్లవాడిని అలా గభాలున లాగి పుచ్చుకునే ముందు నేను సైతం కండక్టర్ దగ్గరకు వెళ్ళి బతిమాలి లైట్స్ వేయించాడు. బహుశా ఆ సమయంలో హీరోని అయిపోయాను అనుకుని వుంటాడు కాబోలు.. ఇంత మంది బస్సులో వున్నా ఆ పని ఎవరు చేయలేదు ''నేను సైతం'' మంచి పని చేస్తున్నాను అని.. అందరూ హీరోగా చూడాలి అని తెగ ఫోజులిచ్చేస్తూ ఆ అగంతకుడిని గదమాయించాడు.

''ఏంటి సార్ వాడు నా పిల్లవాడే'' అని అన్నాడు ఆ మాట విన్న హీరో గారికి ఆవేశం ఇంకా పెరిగిపోయి, ''నేను సైతం'' డ్రైవర్ గారు బస్సు పోలీస్ స్టేషన్‌కు పోనివ్వండి అని అరిసాడు అప్పుడు అగంతకుడు నా భార్య ఊరు వెళ్ళటం చేత ఏడుస్తున్నాడు అంటూ జరిగిన సంగతి చెప్పి అందుకు సాక్ష్యం ఈ బస్సులోని కండక్టర్ గారే... ఏవండీ కండక్టర్ గారు చెప్పండి అన్నాడు ఆ వ్యక్తి.

అంతలో రావులపాలెం స్టేజీరావటం, చంటి పిల్లాడ్ని తీసుకుని ఆ వ్యక్తి బస్సు దిగి పోవడం జరుగుతుంది. అందరూ నేను సైతం అంత వరకూ చేసిన హడావుడి, హీరోత్వానికి పగలబడి నవ్వసాగారు.

నేను సైతం కథలో సమాజానికి పనికి వచ్చే ఏదో మంచి పని చేయాలనుకునే వారు వెనుకా ముందు ఆలోచించి పనులు చేయండి అనే సందేశాన్నిస్తుంది.

ఈ విధంగా మంచి సందేశంతోపాటు హాస్యాన్ని జోడించి మృదుమధురంగా రాశారు తెన్నేటి వారు.



BHAVAVEENA
Vol. 17, Issue. 7, July 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

ఎరుకుల పుట్టుక - జీవన విధానం

- ఎన్. రాజేశ్వకుమార్‌రెడ్డి , ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

భారతీయ సంస్కృతి ప్రపంచదేశాల్లో తలమానికమై తనదైన విశిష్ట నేపథ్యం కలిగి వున్న సంస్కృతి. ప్రాచీన నాగరికతా కాలంనుండి వేలాది సంవత్సరాలుగా ఎన్నో ఒడిదుడుకులను అనుభవించినప్పటికీ తన అస్తిత్వాన్ని అది ఏనాడూ కోల్పోలేదు. ఋగ్వేద ఆర్యుల కాలంనాటి నుండి బ్రిటీష్ వలస పాలకుల పరిపాలన దాకా కాలాను గుణంగా, చారిత్రాత్మకంగా ఎన్నో మార్పులు సంభ వించినా భిన్నత్వంలో ఏకత్వం సిద్ధించుకొన్న సంస్కృతిగా భారతీయ సమాజం నిలిచిపోయింది. సనాతనధర్మం, వేద విజ్ఞానం, పురాణ సాహిత్యం వంటి అర్వాచీన ధోరణులు మొదలు ఆధునిక విజ్ఞాన రీతులదాకా భారతీయులు వర్తమాన కాలంలో జాతీయంగానూ, అంతర్జాతీయంగానూ తమదైన గౌరవాదరాలను ఎన్నింటినో పొందగలిగారు. ఈ నేపథ్యంలో భారతీయ సంస్కృతీ, సాహిత్యాల్లో ప్రత్యేక స్థానాన్ని సంతరించుకొన్నట్టి పలు అంశాలలో ప్రముఖంగా తనదైన విలక్షణతను, ప్రత్యేకతను కలిగివున్న అంశం గిరిజన సంస్కృతి.

భారతదేశంలో వేలాది సంవత్సరాలుగా పర్వత ప్రాంతాలు, అరణ్యాలకు మాత్రమే పరిమితమైపోయి నాగరిక ప్రపంచంతో సంబంధం ఏమాత్రమూ లేని మానవ సమూహాలు గిరిజనులు. అనాదికాలంనుండి ఎంతో ప్రాచీనతను సంతరించుకొన్న వీరిని 'ఆదివాసీలు' అని వాడుకలో వ్యవహరిస్తారు. సభ్యసమాజానికి దూరంగా పూర్తిగా తమదైన ప్రత్యేకతగల జీవన విధానంతో ప్రకృతితో మమేకమై జీవించే జీవన రీతులు గిరిజనులు కలిగి వుంటారు. గిరిజనులు సాధారణంగా అరణ్యాలు, పర్వ తాలు, నదీ తీరాలు వంటి ప్రాంతాల్లో నివాసం వుండే తెగలుగా వుండటం వల్ల వారు ''వనచరులు, పర్వతేయులు, ఆటవికులు'' అనే పేర్లతో పిలువబడు తున్నారు నిత్యజీవితంలో ఆహార సంపాదన మార్గాలలో వారికి వేట ప్రధానమైన అంశంగా వుండటం చేత గిరిజను లను 'మృగయులు, వేటకారులు' అని కూడా పిలుస్తారు. అధిక జనాభా ఒత్తిడి లేకపోవడం వల్ల, నాగరిక ప్రపం చానికి వెలుపల జీవించడం వల్ల ఎంతో స్వచ్ఛమైన సంస్కృతి, అస్తిత్వం గల గిరిజనుల సమూహాలపై నాగరిక సమాజం తమ విలువలను వీరిచే బలవంతంగా అవలం భింప చేయాల్సి అవసరం ఏమాత్రం లేదని సామాజిక శాస్త్రవేత్త హైమెన్‌డార్ఫ్ భావిస్తాడు.

1. ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి గారు తన పరి శోధనలో ఐతరేయ బ్రాహ్మణంలో ఆంధ్రుల పుట్టుకను గురించి ఒక కథ ప్రసిద్ధంగా చెప్పబడింది. క్రీ.పూ. 600 నం॥ ఐతరేయ బ్రాహ్మణంలో తొలిసారిగా ఆంధ్ర ప్రస్తావన జరిగింది. (ఆంధ్ర ప్రసక్తి - అధ్యప్రకృతి చూ. చరిత్ర చర్చ 1989, పుటలు 7-8).
2. ఎరుకల భాష మీద మనకు తెలిసినంత వరకు తెలుగు శాఖలో జరిగిన పరిశోధన ఆచార్య ఎం. నంపత్‌కుమార్ గారిదే. వీరు మధురై విశ్వ విద్యాలయంలో ఎరుకల బంధువాచకాల మీద (1986) ఎం.ఫిల్ పట్టాకోసం, ఎరుకల భాషమీద పిహెచ్.డి (1989) పట్టా కోసం కృషి చేశారు. వీరికి ముందు జరిగిన కృషిని వారే సమీక్షించారు. వీరిచ్చిన వివరాలను బట్టి కొంతమంది విద్యాంసులు ఈ భాషను తమిళ మాండలికంగా గుర్తిస్తున్నారని, మరి కొందరు ఇది ప్రత్యేక భాష అంటున్నారని కొంత మంది రచయితల పేర్లు చెప్పారు. అవి గ్రియర్‌సన్, గైట్, శ్రీనివాస వర్మ మొదలైనవారు ఈ భాషను తమిళ మాండలికంలో అన్నారు. సి.వి. గురురెడ్డి,

డి.ఎన్.ఎస్.భట్, ఎం. అండోనోన్, జి.వి.ఎస్.ఆర్. కృష్ణమూర్తి ఎరుకల భాష ప్రత్యేకం అంటున్నారు. (Census of India) (Vol. I, Part - XI (1) 1961, p. 372. Yerukala Dialect, P.XIII) (చూడు ఎం. సంపత్ కుమార్, ఎం.ఫిల్., 1986 పు. 17-18)

3. E.H థర్‌స్టన్ గ్రంథలో (Caste and Tribes of South India) ఒక వంద సంవత్సరాల క్రితం ఉండి కొరవ, కొరిచ, ఎరుకల తెగలను గురించి ఆయన రాసిన విషయాలే కొన్ని స్థానిక వైవిద్యాలలో ఇప్పటికి అక్కడక్కడ కనిపిస్తూ ఉండటం వల్ల ఈయన ప్రచురణలో మొదటిది అబ్బేడు బోయి (1770 - 1848) ఈయన రచన 'Hindu Manners, Customs and Cermonics' ఈయన సంస్కృతి మీద భారతీయ సంస్కృతి పట్ల, ఆచార వ్యవహారాల పట్ల, కర్మకాండల పట్ల విశేష కృషి 1795-1823 ప్రాంతంలో చేశారు. వీరి గ్రంథంలో కురువర్, కురువ అనే పేర్లలో దక్షిణ భారతంలో కనిపించే ఒక జనజాతిని వివరించాడు.

4. 1901 సం॥లో వీ ప్రకారం దక్షిణ భారతదేశంలో కొవలు తమిళ దేశం, కర్నూలు, సేలం, కోయం బత్తూరు, దక్షిణ ఆర్కాటు జిల్లాలలో వీరు ఎక్కువగా కనిపిస్తారు అని ఈ వీ తెలియజేస్తుంది. కొరవ, ఎరుకల వీరు సంచార జీవులేనని వీరికి బుట్టలు అల్లడం, సోది చెప్పటం, వీరి వృత్తులని మరియు వీరు తమిళభాష మాట్లాడుతారని అయితే వీళ్ల మూలజాతి ఒకటేనని ఈ రిపోర్టులో చెప్పబడింది.

5. పిరాట్ల సుబ్రహ్మణ్యశాస్త్రి గారు తన పరిశోధనలో ఒకటైన కొండరెడ్లను గూర్చి పరిశోధన చేసి 'ది కొండ రెడ్డీస్ ఆఫ్ బైసిన్ హిల్స్' అనే గ్రంథంలో పాశ్చాత్య శాస్త్రవేత్త 'హెమెండార్ఫ్' ఉభయ గోదావరి, ఖమ్మం జిల్లాలోని కొండరెడ్లు, నల్లమలలోని చెంచులు, తెలుగు మాతృభాషగా, కుల ఆదిమ తెగలని వర్ణించారు. (గిరిజన గేయాలు సామాజిక పరిశీలన, 1992, పు. 14).

6. శ్రీరాములు, జి. మరియు బ్రహ్మానంద, హెచ్.ఎస్. వీరి అభిప్రాయం ప్రకారం 'ద్రోణాచార్యులు గురువుల గురించి ఈ సందర్భంగా తెలియజేస్తూ ద్రోణాచార్యులు విలువిద్యా గురువు వారి తండ్రి భరద్వాజుడా? లేదా తాత ఉతద్యుడా? లేదా మరి ప్రత్యేకమైన ఎవరైనా ఆచార్యులా? అనే అంశం మీద అనేక ప్రశ్నలు ఉద్భవిస్తాయి. కాని సమాధానం ఉండదు. అయితే ఈ అంశం గురించి ఎరుకుల వారితో చర్చించినప్పుడు ద్రోణాచర్యుల గురువు గురించి చర్చించినప్పుడు అనేక ప్రశ్నలు వస్తాయి గాని సమాధానం ఉండదు అని ఎరుకులలో కొందరి అభిప్రాయం. (ఎరుకుల భాషా సంస్కృతి, సాహిత్యం, పరిశోధన, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, 2010, పు. 36.)

7. ఆచార్య సంపత్ కుమార్ మరియు క్రీ.వే. చల్లా రాధాకృష్ణ శర్మ గారు ఎరుకలవారి భాషపై పరిశోధన జరిపారు. వీరి పరిశోధనలో భాగంగా తమిళనాడు మరియు కర్ణాటకలో జరిగిన పరిశోధన వివరాలు తెలుసుకుంటే వీరిద్దరి పరిశోధన ద్వారా నేను ఇక్కడ అనంతపురం జిల్లాలోని బందలాయిల కుటుంబాలకు చెందిన ఎరుకల వారి భాషా పదజాలాన్ని సేకరించి పూర్వ పరిశోధనల సేకరణతో పోల్చి చూసి ఈ సిద్ధాంత వ్యాసాన్ని రచించాను. ఈ పరిశోదన ఫలితంగా ఎరుకుల భాష విశిష్టమైన భాష అని, ఇందుకు వారి సంస్కృతే వారికి తార్కాణం అని తెలిసింది.

8. వీ అభిప్రాయం ప్రచారం ఎరుకల శబ్దార్థ విషయంగా వారు ఎర్రగా ఉంటారని చెప్పాడు. ఎరుక అంటే జ్ఞానం అందుకే వీరికి భవిష్యత్తు చెప్పే వీరికి ఆ పేరు వచ్చిందని అభిప్రాయం వ్యక్తం చేశారు. వీ అభిప్రాయం ప్రకారం 'కుర్రు' లేక 'కుర్ర', 'కొండజాతి' అని సూచించడం జరిగింది. కుర్రు జాతి వారికి కూడా భవిష్యత్తును చెప్పే శక్తి సామ

ర్థ్యాలు ఉన్నాయి. అందుకే వీరిని కూడా ఎరుకల వారు అని పిలవటం జరిగింది. ఎరుకల వారికి అతి ప్రాచీన కాలం నుండి తెలుగు తెలుసునని చెప్పవచ్చు. ఎందుకంటే ఎరుకల స్త్రీలు సోదె చెప్పేటప్పుడు 'ఎరుకోయమ్మ ఎరుక' అనే అంటుం దని ఆ కాలంలోనే గుర్తించారు.

ఎరుకల వారి ఆర్థిక, సామాజిక పరిస్థితులు :

ఈ అధ్యాయంలో ఎరుకల వారి ఆర్థిక సామాజిక పరిస్థితులు గురించి ప్రస్తావించినప్పుడు ప్రపంచంలో వచ్చిన మార్పులు ప్రపంచీకరణ నేపథ్యంలో ఒక గ్రామం ప్రపంచంగా చెలామణి అవుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఎరుకల అభివృద్ధి అనేది మన సమాజంలో అన్ని వర్గాల జాతులను స్పృశిస్తుంది. ప్రస్తుత పరిస్థితులు గమనిస్తే ఎరుకల జాతిలో విద్యావంతులు సంఖ్య దశలవారీగా పెరుగుతూనే వుంది. కానీ వీరి యొక్క జాతి సంపూర్ణ అభివృద్ధి సాధించడానికి ఇంకా చాలాకాలం పడుతుందని చెప్పవచ్చు. ఎందుకంటే.. వీరు సంచార జీవులు మరియు మారుమూల ప్రాంతంలో జాతి ఇంకా అభివృద్ధి చెందక పోవడం, రేవటితరంలో సైతం అట్టడున జీవన పరిస్థితులు ఉండటమే కారణం.

ఎరుకల వారికి స్థిర నివాసం అంటూ ఏమీలేదు. వీరు ఎక్కువగా ఎక్కడైతే తమకకు అనుకూలమైన పరిస్థితి ఉంటుందో అక్కడ వాళ్ళ జీవన సాగించేవారు. ఇలా ఎరుకల వాళ్ళు సంచార జీవితం సాగిస్తుంటారు. ప్రస్తుత పరిస్థితులలో వారి జీవన విధానంలో మార్పులు రావడం వల్ల వారి ఆర్థిక, సామాజిక పరిస్థితులు అభివృద్ధి చెందుతున్నాయి. వీరు ఎక్కువగా గ్రామ ప్రాంతాలలోనే నివసిస్తున్నారు. వీరికి మరికొన్ని అనగా ముగ్గ ఎరుకల, కుంటు ఎరుకల తెగలవారు నేటికి సంచార జీవనాన్నే గడుపుతున్నారు. మరికొన్ని తెగలవారు అనగా దబ్బ ఎరుకల, ఈత ఎరుకల వాళ్ళు స్థిరనివాసాలను ఏర్పరచు కొని, కొన్ని ప్రాంతాలలో బలమైన వర్గాలుగా ఏర్పడుతూ నాగరికతను క్రమంగా అభివృద్ధి చేసుకుంటున్నారు. వీళ్ళలో కొందరు మంచి విద్యావంతులుగా మరియు ఉద్యోగస్తులుగా ఎదగడం జరిగింది. ఈ విధంగా నేటికీ జీవన విధానం మరియు ఆర్థిక, సామాజిక విధానాలలో అనేక మార్పులు చోటుచేసుకుంటున్నాయని చెప్పవచ్చు.

ఎరుకుల వారు సంచార జీవితం సాగించేటప్పుడు ప్రధానమైనవి వస్తువులు మాత్రమే వెంట వుండేవి. వీరు తప్పనిసరిగా 'గుడారాలు' ఏర్పర్చుకుంటారు. వాటితో పాటు మట్టిపాత్రలు, తెడ్డు, తిరగలి, కత్తులు, తాళ్ళు, బోనులు, వలలు, ఉచ్చులు, గొడ్డళ్ళు, కొడవళ్ళు, సూదులు, దబ్బళాలు మొదలైనవి వారి జీవనాధార వస్తువులుగా పేర్కొనవచ్చు. వీటితోపాటు కొన్ని జంతువులు కూడా ఉండేవి. అవి గాడిదలు, కుక్కలు, పిల్లులు, ఆవులు వీరి వెంట ఉండటం గమనించాల్సి విషయం. వీటితోపాటుగా 'కుండలగంప' అనే ఒక పెద్ద అరిక సాధనాన్ని వీళ్ళ వెంట ఎల్లప్పుడు తీసుకొని వెళ్తుంటారు. ఎరుకుల వారు రవాణాకు ప్రధానంగా గాడిదను ఉపయోగించేవారు. వీరు నివాస స్థలం మార్చే టప్పుడు వారి ప్రధాన వస్తువులను కుండ గంపలో జాగ్రత్తగా అమర్చి దాన్ని గాడిదవీపు మీద అటు ఇటు పడిపోకుండా జాగ్రత్తగా ఒక క్రమపద్ధతిలో వ్రేలాడ గట్టేవారు. వారి వస్తువులతోపాటు చిన్నపిల్లలను మరియు ముసలివాళ్లను ఈ గంపలో కూర్చోబెట్టుకుని ప్రయాణం చేసేవారు. ఇలాంటిదే గోనె మూటల 'పెదిల్' సాధానాన్ని కూడా వీళ్ళు ఉపయోగించేవారు. (శ్రీరామ మాల కొండయ్య 'కుర్ర చరిత్ర', పు. 26).

ప్రస్తుత పరిస్థితులను ఆధారంగా చేసుకొని పరిశీలిస్తే వారి జీవన విధానంలో గుడారాలు, వస్తువులు సాధా రణంగా కనిపిస్తున్నప్పటికీ కుండ గంపలు, పెదికులు దాదాపుగా కనుమరుగై పోయాయి. జంతువుల విషయంలో మనం గమనిస్తే నేటికి గాడిదను వాళ్ళు పెంచుకుంటున్నారు. గాడిద పాలు చిన్న పిల్లలకు మంచిది అనే భావన సమాజంలో ఉన్నది కనుక వారు ఆ పాలతో కొందరు వ్యాపారం చేస్తున్నారు.

ఎరుకల తెగలు, వృత్తులు :

ఎరుకల వారి తెగలు, వృత్తులను ఆధారంగా చేసుకొని విభజించటం జరిగింది. ఆంధ్రప్రదేశ్‌లోని ఎరుకల జాతి చాలా తెగలుగా విభజించడమైనది. ఆ వివరాలు క్రింది విధంగా ఉన్నాయి.

దబ్బ ఎరుకల :

దబ్బ ఎరుకల వారు అడవిలో దొరికే బొంగులను తీసుకొని వస్తారు. ఈ బొంగులను నాలుగు వైపుల జాగ్రత్తగా పగలుకొడతారు. తరువాత పగలుకొట్టిన దబ్బల్ని తయారుచేస్తారు. ఈ దబ్బల్ని అనేక రకమైన వస్తువులుగా తయారు చేస్తారు. అంటే బుట్టలు, తట్టలు, జల్లలు, తడికెలు, బొంగుమంచాలు మొదలైనవి. వీటిలో ముఖ్య మైనవి 'జల్ల గంపలు', 'తడికలు'.

జల్లగంపలను వ్యవసాయదారుల కొరకు తయారు చేస్తారు. ఇది ప్రాచీన కాలంలో ప్రధానమైన ఉపకరణం తడిక వ్యవసాయదారులకు అతి ముఖ్యమైనది. ప్రస్తుత కాలంలో వ్యవసాయంలో ట్రాక్టరును ఉపయోగిం చడంవల్ల తడిక వాడకం క్రమంగా తగ్గింది. దీనిని అవసరాన్ని బట్టి వినియోగించడం జరుగుతుంది. సవారి తడక దీనిని ఎద్దులబండిపై గుడారంలా అమర్చేవాళ్ళు. పూర్వకాలంలో కార్లు, జీపులు లేవు కనుక వీటిని జమీందారులు, దొరలు, భూస్వామి కుటుంబాలు ఎక్కువగా ఉపయోగించేవారు. ప్రస్తుత ఆర్థిక పరిస్థితిలో మనిషి దైనందిన జీవితంలో నిచ్చెన ఎంతో అవసరం. ఇనుప నిచ్చెనలు మార్కెట్‌లో వచ్చినప్పటికి బొంగు నిచ్చెనే వాడేవారు.

వీటి అన్నింటిని దబ్బలవారు 'సంత'లో విక్రయిస్తుం టారు. వీరి ఆర్థిక జీవన విధానంలో దబ్బ ఎరుకల వారికి వడ్రంగం పనులలో కూడా నైపుణ్యత ఉన్నది.

ప్రస్తుత పరిస్థితులలో వీరి యొక్క ఆర్థిక పరిస్థితులను గమనిస్తే ఎరుకల వాళ్ళు చాలా వరకు పేదవాళ్ళే అయినప్పటికీ వారి యొక్క ఆర్థిక పరిస్థితిని మెరుగు పరుచుకోవడానికి ప్రయత్నిస్తూ ఉంటారు. ఆ క్రమంలో వీరిలో కొందరు కొన్ని మైదాన ప్రాంతాలలోను, మరి కొందరు గ్రామాలలో నివసిస్తూ వారి యొక్క వృత్తి పనులను మెరుగుపరుచుకుంటూ జీవన విధానాన్ని సాగిస్తారు. ఈ క్రమంలోనే వాళ్ళు సమాజంలో మమేకమై జీవిస్తున్నారు.

రాయలసీమ ప్రాంతాల్లో ఎరుకల వాళ్ళు నివసించే ప్రదేశాలను ఎరుకల వీధి, ఏకలవ్య, శుంకలయ్య... గా పిలుస్తుంటారు. వీర వాడలు సమాజంలో చాలా చిన్నవిగా ఒకటి నుండి ఐదారు కుటుంబాల వరకు ఉంటారు. ప్రస్తుత పరిస్థితులను గమనిస్తే వీరు గ్రామాలలో వీరి కుటుంబ సంఖ్య పెరుగుతూ వస్తుంది. అయినప్పటికీ వలసల కారణంగా వీరి కుటుంబాల సంఖ్య గణ నీయంగా తగ్గుతూ వస్తుంది.

ఎరుకల వారు వలస వెళ్ళడానికి ప్రధానమైన కారణం ఒక్కటి ఉంది. అది వృత్తి పనులు. వీరు ఒకే ప్రదేశంలో ఉండటం వల్ల వాళ్ళ వ్యాపారాలు, కొనుగోలు మధ్య పోటీ ఏర్పడుతుంది. కాబట్టి వారి ఆర్థిక పరిస్థితి దిగ జారుతుంది. అనే భావనతో వీరు వలస వెళ్ళడం అనేది ప్రాధాన్యత సంతరించుకుంది.

ఈతకట్టి ఎరుకల :

వీరి యొక్క ప్రధానమైన వృత్తిలో ముఖ్యమైనది "ఈతచెట్టు" అందుకే వీరిని 'ఈత ఎరుకల' అని పిల వడం జరుగుతుంది. ఎరుకల వారికి సమీపంలో ఉన్న అడవులు మరియు గ్రామ చివరిలో ఉన్న ఈతకట్టెను సేకరిస్తారు. ఈ సముదాయాన్ని వీరు 'ఈతబరి' అని పిలుస్తారు. ఈత కట్టెలతో కొన్ని వస్తువులను తయారు చేస్తారు. ముఖ్యంగా వీరు ఇంటిపై భాగాన అనగా ఇంటి కప్పుకు వాడతారు. అలాగే ఈతచాపలు, చీపుర్లు (పొరకలు), పేడ తట్టలు, చుట్టకుదుర్లు, సిబ్బిలు, గద్దెకు మొదలైన వాటిని వీరు ప్రత్యేకంగా తయారుచేసి వాటిని సంతలో విక్రయిస్తుంటారు. ప్రస్తుత పరిస్థితులను గమనిస్తే వారి యొక్క ఆర్థిక విధానంలో మార్పులు

వచ్చినట్లు చూడవచ్చు. వీరు తయారు చేసే స్థానంలో కొత్త ఆధునిక పద్ధతులు వస్తున్నాయి. కాబట్టి వాటికి సమానంగా వీరు ఆధునిక పద్ధతులను ఉపయోగించు కుంటూ వారి యొక్క వస్తువులను తయారు చేస్తున్నారు.

కూటు ఎరుకల :

ఈ ఎరుకుల వారి యొక్క ప్రధానవృత్తి గరిసిల్ని తయారు చేయడం ప్రత్యేకం గరిసి. అంటే గడ్డిని ఉప యోగించి ధాన్యం నిలువచేయుటకు గరిసిల్ని తయారు చేస్తారు. ఇవి వ్యవసాయదారులకు ఎంతో ఉపయోగ కరంగా ఉంటాయి. ఆధునిక పద్ధతులు సమాజంలో ఉపయోగించడం వల్ల గరిసె అనేది కనుమరుగవుతుంది. ఈ నేపథ్యంలో వీరు వేరు వృత్తులకు వెళ్ళి జీవన మరియు ఆర్థిక స్థితిని మెరుగుపరచుకుంటున్నారు.

ఉప్పు ఎరుకల :

వీరి యొక్క ప్రధానమైన వృత్తి ఉప్పు తయారు చేసి సంతలో అమ్మడం. అందుకే వీరికి ఉప్పు ఎరుకల అనే పేరు వచ్చింది. ఎరుకల వారి జీవన విధానంలో ఉప్పు వ్యవసాయం ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. వీరి యొక్క ఆర్థిక సామాజిక పరిస్థితి గమనిస్తే కొన్ని ప్రధానమైన ప్రాంతాలలోనే నివసిస్తుంటారు.

ఎద్దుల ఎరుకల :

ఎద్దుల ఎరుకల వారిని మనం ఎక్కువగా గ్రామ ప్రాంతాలలో చూస్తుంటాము. వీరు ఎక్కువగా ఎద్దులను ఆడిస్తూ వుంటుంటారు. అందుకే వీరిని ఎద్దు ఎరుకల అంటారు. ఎద్దు ఎరుకల వారు ఎద్దులను జాతరలలో, సంతలలో, జన సముదాయం ఎక్కువగా ఉన్నచోట్ల వాటిని ఆడించడం జరుగుతుంది. ఇలా ఆడించినప్పుడు వచ్చిన సొమ్మును వారి ఆర్థిక అవసరాలకు ఉపయోగిం చుకుంటారు.

ధడంత్రి ఎరుకల :

వీరు సన్నాయిని తయారుచేసి దాని సహాయంతో పాటల్ని రాగయుక్తంగా పాడుతూ ఇల్లిల్లూ తిరిగి అడు క్కొని జీవనం సాగిస్తూ ఉంటారు. ఒకప్పుడు వీరు ఎక్కువగా గ్రామీణ ప్రాంతాలలో కనబడేవారు. ప్రస్తుత ఆర్థిక పరిస్థితులలో గ్రామంలో కూడా వీరు కనిపిస్తూ ఉంటారు. వీరిలో కొందరు నల్లకోటు ధరించి, తమ వేషధారణలో వైవిధ్యం కనబరుస్తుంటారు.

తాళ్ళ ఎరుకల / నార ఎరుకల :

తాళ్ల ఎరుకల వారు ఎక్కువగా కర్ణాటక ప్రాంతంలో జీవిస్తుంటారు. వీరు రాయలసీమ ప్రాంతంలో... గ్రామంలో ఈ తాళ్ళ ఎరుకల వారు ఉన్నారు. వీరి యొక్క ఆర్థిక పరిస్థితుల ఆధారంగా ఇరు ప్రాంతాలవారు ఇచ్చి పుచ్చుకోవడం వలన వారు ఇక్కడ స్థిరపడి నివాసాలను ఏర్పరచుకొని తాళ్ళను అనేక రకాలుగా తయారుచేస్తూ వాటిని సంతలలో విక్రయిస్తూ తద్వారా వచ్చిన సొమ్ముతో జీవనం సాగిస్తున్నారు. తాళ్ళను తయారుచేసే విధానాలు పరిశీలిస్తే పాత చీరెను తీసుకొని వాటిని అంచు దగ్గర నుండి ఒక క్రమ పద్ధతి ప్రకారం పది నుండి పదిహేను ముక్కలు జాగ్రత్తగా చీలుస్తారు. ఈ ముక్కలన్నింటిని ఒక క్రమపద్ధతిలో వ్రేలాడదీస్తారు. ఈ విధంగా వ్రేలాడదీసిన తరువాత వారు తమ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తారు. చీరె ముక్కలు బిగుసుకొని పోయి పెనవేసుకొని తాడు మాదిరిగా తయారు అవుతుంది. పాత చీరలలో కాకుండా ప్లాస్టిక్ బ్యాగులతో కూడా ఈ పద్ధతి ప్రకారంగానే తాళ్ళను తయారు చేస్తారు.

ముగ్గురు ఎరుకల :

వీరు సమీపంలో ఉన్న అడవుల నుండి ముగ్గును సేకరించి వారి సమీప ప్రాంతాలలో విక్రయిస్తుంటారు. కాబట్టి వీరిని ముగ్గుల ఎరుకల అని పిలుస్తుంటారు.

కావల ఎరుకల :

కావల జాతి వారి ఎరుకలలో ఒక తెగకు సంబంధిం చిన వారు. వీరు ప్రధానంగా కోతులను ఆడిస్తుంటారు. వీరు అడవుల్లోంచి కోతులను పట్టుకొని, వాటిని శిక్షణ ఇస్తారు. తరువాత ఆ కోతులను దుస్తులు ధరింపజేసి

గ్రామాలు, ఊర్లు తిరుగుతూ వాటిని ఆడిస్తూ వారి ఆర్థిక జీవనాన్ని సాగిస్తారు. వీరు మనదేశంలో కన్నా శ్రీలంకలో ఎక్కువగా ఉన్నారు.

కొత్త ఎరుకుల :

వీరు ఎక్కువగా ఉత్తరాంధ్ర ప్రాంతమైన విశాఖలో కనబడుతుంటారు. వీరు తమ అవసరాలకు అనుగుణంగా కొత్త కొత్త వృత్తులను అవలంభిస్తారు. కాబట్టి వీరిని 'కొత్త ఎరుకల' అని పిలుస్తుంటారు.

కావలి ఎరుకల :

ఈ ఎరుకలవారు పూర్వం జమీందారులు, రాజులు, భూస్వాములు మరియు దేశముఖ్ దగ్గర సేవకులుగా పనిచేస్తూ నమ్మకంగా ఉండేవారు. వీరి మీది నమ్మకంతో వీరిని 'నిఘా'గా గ్రామానికి లేదా రాజ్యానికి వుంచేవారు. ఈ విధంగా వీరి వృత్తి ధర్మాన్ని పరిపూర్ణంగా నెరవేర్చేవారు. ప్రస్తుత ఆర్థిక పరిస్థితి వీరు గ్రామ పటేల్, పట్వారీల దగ్గర కావలిగా పనిచేస్తున్నారు.

ఈ ఎరుకల వారు గ్రామంలోనిగాని ఇంకా వీరు నివసిస్తున్న ప్రదేశాలలోగాని భూతగాదాలు, ఆస్థిపాస్తులు కొట్లాటలు మరియు అన్నదమ్ముల కొట్లాటలు వచ్చినప్పుడు ముందుగా బాధితులు కావలి వాళ్ళకు చెప్పుకొనేవారు. కావలి వాళ్ళు ఆ విషయాన్ని గ్రామపెద్ద వరకు తీసుకొని వెళ్ళేవారు. ఇలా మధ్యవర్తిత్వం వహించడంలో మంచి పరిణతిని సాధించారు. ప్రస్తుత కాలంలో కావలితనం అనేది ఉద్యోగంగా మారిపోయింది. ఈ ఎరుకల వారి ఆర్థిక పరిస్థితి మెరుగు పరచుకోవడానికి ఎక్కువ అవకాశం లభించినట్టయింది. నాగరికతలో జీవించడానికి కూడా వీరికి ఎక్కువగా అవకాశం లభించినట్టయింది.

కరివేపాకు ఎరుకల :

ఈ ఎరుకుల వారి ప్రధాన వృత్తి అడవుల్లోంచి కరివేపాకును సేకరించి గ్రామాలలో విక్రయిస్తుంటారు. కాబట్టి వీరిని కరివేపాకు ఎరుకల అంటారు. వీరు ఆర్థికంగా స్థిరపడటానికి వారు సేకరించిన కరివేపాకును సంతలలో అమ్ముతూ వుంటారు.

కుంచపురి ఎరుకల :

వీరు ఉచితంగా లభ్యమయ్యే తాటినార, కలబంద నార, చీశనారలను సేకరించి వాటితో వెదర్లు, ఉట్లు, తాళ్ళు, నులకలు, సిబ్బిలు మొదలైన వాటిని తయారు చేసి సంతలలో విక్రయిస్తుంటారు.

వూర ఎరుకల :

వూర ఎరుకల అంటే సంచార జీవితం గడిపేవారు. వీరు అడవుల్లో ఒకప్పుడు నివసించేవారు. వీరు కాల క్రమేణా ఊళ్లల్లోకి వలసవచ్చి నివాసం ఏర్పరచుకున్నారు. వీరి యొక్క ప్రధానవృత్తి 'భిక్షాటనం' గ్రామాలలో వీరిని బిచ్చగాళ్ళుగా వ్యవహరిస్తుంటారు. ఇతరులు పెట్టిన అన్నాన్ని, దుస్తుల్ని ప్రేమగా అందించుకుంటారు. వీరిలో కొందరు రోళ్ళు చెక్కుతుండగా మరికొందరు సవరాలు అల్లుతుంటుంటారు.

మంత్రసాని ఎరుకల :

వీరికి సమాజంలో ఒక్క మంచి గుర్తింపు ఉంది. ప్రస్తుత ఆర్థిక పరిస్థితులను మనం గమనిస్తే వీరియొక్క వృత్తి చాలావరకు పరిమితమైనది. పూర్వకాలంలో స్త్రీకి పురుడుపోయాలి అంటే మంత్రసాని ఉండవలసిందే. కానుపు చేసినందుకు గాను మంత్రసానికి బియ్యం, పప్పు, ఉప్పు, సరుకులతోపాటు కొంత డబ్బు కూడా కానుకగా ఇచ్చేవారు. మంత్రసాని కుటుంబానికి ఇవి ఎంతగానో సహాయపడేవి.

ప్రస్తుత పరిస్థితులను మనం గమనించినట్లయితే మంత్రసాని యొక్క ఆదరణ క్రమంగా తగ్గుతూ వస్తుంది. గ్రామీణ ప్రాంతాలలో ఏరియా మరియు ప్రైవేటు ఆసుపత్రులు రావడం వలన డెలివరీల కోసం వీటిని ఆశ్రయిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితులలో వీరు ఆర్థికంగా గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. అయినప్పటికి కొన్ని మారుమూల మరియు కొండ ప్రాంతాలలో వీరినే నమ్ముకొని వున్నారు. సమాజంలో కొందరు మంత్రసాని చేసిన సేవలు మరిచిపోలేక వారికి పండుగలు, పర్వ

దినాలు వచ్చినప్పుడు వారిని పిలిచి కొత్త బట్టలు మరియు పిండివంటలు కొంత డబ్బు వంటి కానుకల్ని సమర్పించు కోవడం జరుగుతుంది. ప్రస్తుత ఆర్థిక పరిస్థితులలో మంత్రసానులు జీవనోపాధికి వేరు వేరు వృత్తుల్ని ఆశ్రయిస్తున్నారు.

బేరగాళ్ళు :

వీరు ఎద్దులను, గాడిదలను కొనడం మరియు అమ్మడం జరుగుతుంది. కాబట్టి వీళ్ళని బేరగాళ్ళు అంటారు. వీరు తక్కువగా కొని కొంత లాభానికి అమ్ము కుంటూ తమ ఆర్థిక పరిస్థితిని తమకు అవకాశం ఉన్నం తలో ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుచుకుంటున్నారు.

పాముల ఎరుకల :

ఈ ఎరుకల వారు పాములు పట్టడం వాటికి కోరలు వీకి ఆడించడం నేర్పుగా చేస్తుంటారు. పాముల సయ్యాటని చూసిన ప్రజలు తృణమో ఫణమో ఇచ్చు కుంటూ వుంటే దానితో వీరు తమ జీవితాన్ని కొనసాగిస్తుం టారు.

కొరవంజి :

ఎరుకులకు కొరవంజులనియు, కొరవత, కొరలు అను పేర్లున్నట్లు చెంగల్వరాయ విరచితమగు 'ఎరుకల కథ' ఆధారంగా తెలుస్తుంది. కొరవంజి పదాన్ని మొదట కావ్యంలో వాటిని తెలుగుకవి అయ్యలరాజు రామ భద్రుడు (1500-1580). కొరవంజి ఎరుకల యక్షగానాలు చేస్తూ భిక్షాటన చేసి జీవిస్తుంటారు. ఈ పదాన్ని గమనిస్తే కొరవ అంజె అనే పదంలో 'అంజె'కు అడుగు అనే నృత్యవిశేషం వుందని, వారు ప్రదర్శించే దృశ్య రచనలకు కొరవంజునే పేరు వచ్చిందని శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి గారు అభిప్రాయపడ్డారు. నాటకాల్లో ఎరుకల వేషంతో ప్రవేశించే సింగి, సింగని పాత్రలుపై అభిప్రాయాన్ని బల పరుస్తున్నారు. ఈ తెగవాళ్ళు అడవిలో దొరికే దినుసుల్ని నగరాలకు తీసుకెళ్ళి, నృత్యం చేస్తూ ప్రజల్ని ఆకర్షితుల్ని చేసి విక్రయిస్తూ వుంటారని ప్రత్యక్ష సాక్షులు కథనం. కొరవంజి స్త్రీలు, సోది చెప్పి బియ్యం, డబ్బు సంపా దిస్తారు. (ఎరుకా ఎఱుక యటంచుం గొరవంజి, Vol. II, పు. 287-288)

సెటిల్‌మెంట్ ఎరుకల :

ఈ ఎరుకుల జాతి వారిని రెండు రకాలుగా విభజించ వచ్చు. 1) వైట్‌కాలర్ నేరము, 2) భ్లూ కాలర్ నేరము. వీరి యొక్క జీవన విధానంలో దొంగతనము, దోపిడీలను వృత్తిగా చేసుకొని జీవించేవారు. ఈ తెగ వారిని సెటిల్‌మెంట్ ఎరుకలగా పేర్కొంటారు.

1. వైట్ కాలర్ నేరము :

వీరు చిన్న చిన్న దొంగతనాలు కూడా, ముఠాలు కట్టి పెద్ద పెద్ద దోపిడీలు చేస్తారు.

2. భ్లూకాలర్ నేరము :

వీరు జేబులు కొట్టడం, పశువుల్ని దొంగలించడం వంటివి చేస్తారు. ఈ తరహా దొంతగనం చేసేవాళ్ళని కత్తి రోళ్ళని కూడా పిలుస్తారు.

ఎరుకలవారి వృత్తి రీత్యా ఎంత హింసించినా నిజం చెప్పరు. అంతేకాకుండా వంశపారంపర్యం పేరుతో తమ పిల్లలకు దొంగతనం చేసే పద్ధతులన్నీ నేర్పుతారు. ఈ నిర్దిష్ట జాతుల మీద పరిశోధన చేసిన ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త ప్రొఫెసర్ వై.సి. సింహాద్రి ఇలా అంటారు. 'ఇక్కడ స్త్రీలు కూడా నేరాలు చేయడం, లేదా నేరం చేయువారికి సహాయం చేయటం జరుగుతుంది. వీరు చిన్న చిన్న దొంగతనాలు మొదలు, పెద్ద నేరాలు అంటే బస్సులు, రైళ్ళు ఆపి దోచుకోవటం, దేవాలయాలు, ఇండ్లలోని నగలు దోచుకోవడం వరకు దాదాపు అన్ని రకాలైన నేరాలు చేస్తారు.

ఎరుకల గురించి ఒక గ్రంథంలో సామాన్యంగా మనిషిని గాయపరచడం అను గ్రంథంలో రాస్తే డా॥. గిడుగు వెంకట సీతాపతి గారు 'ఎరుకల దొంగతనం చేసిన వస్తువుల్ని చిన్నవి నోటిలోను, గొంతుకలోను, కడుపులోను మరియు మర్మస్థలాలలోను దాచేశక్తి స్త్రీ

పురుషులకు ఇద్దరికి కలదు'. తన 'ఆదిమ నివాసులు' అనే వ్యాసంలో తెలియజేశారు. వీరు దొంగతనాలతో పాటు హత్యలు కూడా చేస్తారు. (ఆంధ్ర సర్వస్వము, అధ్యాయం - 10, పు. 101-112)

పిట్టల ఎరుకల :

ఎరుకల వారి ప్రధానవృత్తి పిట్టలు పట్టడం. వీరు సమీపంగా ఉన్న అడవుల్లోకి వెళ్ళి పిట్టల్ని పడుతుంటారు. వీరు బురక పిట్టలు, ఉడుములు, కుందేళ్ళు, కౌజు పిట్టలు వీరి వేటలో ప్రధానంగా వుంటాయి. వీరి ఆర్థిక పరిస్థితి మెరుగు పరచడానికి వాటిని అమ్మగా వచ్చిన సొమ్ముతో కుటుంబ అవసరాల్ని తీర్చుకుంటారు.

ఈ ఎరుకుల వారు తాబేళ్ళు, కొంగలు, దుప్పులు, అడవి పందులు, చేపలు.... మొదలగువాటిని కూడా వేటాడుతారు. వీరు ఒక్కొక్క జీవుల్ని వేటాడటంలో ఒక్కో నైపుణ్యాన్ని ప్రదర్శిస్తారు. (మిర్యాలజ్యోతి, 'సోది ఒక పరిశీలన' ఎం.ఫిల్. అముద్రిత సిద్ధాంత గ్రంథం) పద్నాలుగు ఎరుకల తెగల్ని మాత్రమే పేర్కొన్నారు. నేను ఎరుకల నాగన్న లింగాల గ్రామస్థుడిని ఇంటర్వ్యూ చేయగా, అలాగే కొన్ని సిద్ధాంత గ్రంథాలను పరిశీలించడం ద్వారా ఆదనంగా మరో నాలుగు జాతుల్ని కూడా పేర్కొన్నారు.

ఎరుకల వృత్తి :

ఎరుకల జాతిలో వివిధ రకాల తెగలు మరియు వృత్తులు, ఎంతో వైవిధ్యాన్ని కనబర్చే అంశం ఆసక్తి దాయం! వీరి యొక్క వృత్తి విధానాన్ని గురించి కొంచెం లోతుగా పరిశీలిద్దాం.

వ్యవసాయం :

దేశంలో వ్యవసాయం అనేది ఒక గౌరవప్రదమైన సాంప్రదాయ విధానం. ఈ విధానం ప్రధానంగా రాయల సీమ కడప జిల్లా. మండలంలో ఎరుకల వారి జీవన విధానాన్ని పరిశీలిస్తే వ్యవసాయదారులు చాలామంది కనిపిస్తారు. వీరు పొడు వ్యవసాయం చేస్తారు. వర్షాలపై ఆధారపడి పంటలను కొనసాగించే వీరి వ్యవసాయంలో ప్రధానంగా యొక్కజొన్నలు, రాగులు, జొన్నలు, సజ్జలు, ఆముదాలు మొదలైన పంటలు పండిస్తారు. పారేగులు, కాలుము, వీళ్ళ కల్పతరువులు. ఆ నీటిని తమ వ్యవ సాయంలో ఉపయోగించుకుంటూ వీటికి వర్షం తప్పని సరి. వర్షాలు పడకపోతే వీరి వ్యవసాయం నెమ్మదిస్తుంది. వీరు స్వయంగా వ్యవసాయానికి కావలసిన తాళ్ళను పేనుకుంటుంటారు.

ఎరుకల జీవితాల్లో అడవులు :

ఎరుకలలో కొన్ని జాతుల వారు వ్యవసాయంలో పాటు 'దొంగతనం' కూడా చేస్తూ వుంటారు. వారు ఎక్కువగా దొంగతనములు అడవుల్లో చేస్తారు. వీరు అడవిలో దొరికే కర్ర అనగా టేకు, నారపి, తుమ్మ, వేప, నల్లతుమ్మ, సిరియాను, పెద్దగి, చెన్నగి వంటి కర్రలను దొంగలించి వారికి నమ్మకస్తులైన వారికి అమ్ముకుంటారు. కాబట్టి వారి దొంగలించే కర్రకు ఎప్పుడూ డిమాండ్ తగ్గడం.

ఎరుకల వారి కులవృత్తి :

ఎరుకల వారి కులవృత్తి గురించి చెప్పుకుంటే బీరు ఎక్కువగా పందులను, బాతులను పెంచుకుంటుంటారు. ఎరుకల వారి గురించి చెప్పుకుంటే ప్రస్తుతం వీరు ఎన్నో రకాల వ్యాపారాలు చేసినా, ఉద్యోగాలు చేస్తున్నవారు మాత్రం ఎక్కువ శాతం పందుల పెంపకంపై ఆధార పడతారు. వీరు రెండు రకాల పందులను పెంచుతారు. అవి సీమపందులు మరియు ఊరపందులు, తెల్ల పందుల వలన వీరికి ఎక్కువ సంపద చేకూరుతుంది. ఇవి కొల్లాపూర్, నాగరకర్నూల్, అచ్చంపేట తాలుకాలకు సంబంధించిన ప్రాంతాలలో సమీపందులు ఎక్కువగా పెంచుతుంటారు. వీరు బయట దేశాలకు కూడా ఎగుమతి చేస్తారు.

ఎరుకల వారు తమ పందులకు 'కుర్తి'ని ఆహారంగా అందిస్తూ ఈ ఆహారాన్ని పందుల ప్రేమగా స్వీకరిస్తాయి.

కుర్తి తయారు చేయడంకోసం ఒక పెద్ద డబ్బాగాని, కుళాయిగాని, కుండగాని ఉపయెగిస్తారు. వీటిల్లో నిర్దేశించిన ఏదో ఒక్క ప్రాంతంలో వాటిని ఏర్పాటు చేస్తారు. అలా ఏర్పాటు చేసిన దగ్గర బియ్యం కడిగిన నీళ్ళు గంజి, కుర్తిని అన్ని రకాల కూరగాయాలు, పందులు మరియు సన్నని నూకను కలిపి రాత్రంతా దానిలో నానబెడతారు. ఈ ద్రవ పదార్థంగా బాగా పులుస్తుంది. ఉదయాన్నే పందులకు ఆదరంగా అందిస్తారు.

ఎరుకల వారు బాతులను పెంచుటకోసం వారి యొక్క నివాసాన్ని నీటి వనతి ఉన్న ప్రదేశంలో నిర్మించుకుంటారు. వీరు వ్యవసాయం జరుగుతున్న ప్రాంతాలలో నీటికోత సమయాన్ని ముందుగా తెలుసు కొని వీరు అక్కడికి వెళ్ళి వాటిని పెంచుతారు. వీరు ఈ వ్యాపారం కోసం వట్టి వ్యాపారస్తుల దగ్గర అప్పు తీసుకొని కొద్దిపాటి ఆస్థిని తాకట్టు పెట్టి బాతుల పిల్లల్ని కొంటారు. చెయ్యిపెట్టి తీయాలి. అలా చేసిన వ్యక్తికి నూనెలోకి మునిగినంత వరకు గుడ్డచుట్టాలి. కొంతసేపు అయిన తరువాత అందరి సమక్షంలో చుట్టిన గుడ్డ తొలగించి వడ్లు నలపాలి. చేతులు కాలి బొబ్బలెక్కినా వడ్ల నీరు పడి చర్మం ఊడినా తప్పు చేసినట్లుగా నిర్ణయిస్తారు. కాకపోతే అతనిని నిర్దోషిగా తీర్మానించి వాడిని శిక్షించి ఖర్చంతా అతని నుండి రాబడతారు.

గడ్డపారను విధానాన్ని పరిశీలిస్తే ఆవుపేడతో చేసిన పిట్టకలతో వీటి గడ్డపారను ఎర్రగా కాల్చుతారు. పై చెప్పిన కుండ పరీక్ష విధానంగానే అన్ని కట్టుబాటు చేస్తారు. ఎర్రగా కాచిన గడ్డపారను కూడా పై పద్ధతిలోను చేతులతో పైకెత్తి దుయ్యాలి. ఈ పద్ధతిలో ఒక్కొక్క సారి ప్రాణాపాయం సంభవిస్తుంది. తెలిసినప్పటికీ లెక్కచేయక మూఢత్వం ఇంకా వీళ్లని వెంటాడుతూనే ఉంది. ఈ విషయాన్ని ధృవీకరిస్తూ విజ్ఞానం సర్వస్వం (పుట - 500) నందు 'నిర్దోషిని బుజువు చేసుకోవలసిన నేరస్తుడు సలసల మరుగుతున్న నూనెలో కాని కణకణలాడే నిప్పులోకాని చేతులు, కాళ్ళు చొప్పించవలెను. లేదా ఎర్రగా కాలిన గడ్డపారను చేతిలో తియ్యాలి. ఇందువలన హాని కలిగితే నేరస్తుడిలా కాకపోతే నిర్దోషి' అని వ్రాసి వుంది. ఎరుకల వారి ఆర్థిక సామాజిక జీవనంలో మారు తున్న పరిస్థితులలో మారక ఇంకా ప్రాచీన మన పద్ధతిలో అనుసరిస్తూ జీవిస్తున్నారని యం. బాపూజీ తన 'బలహీన వర్గాల సంక్షేమం' అనే వ్యాసంలో పేర్కొన్నారు. ప్రతి వాదనలు ఎన్ని రోజులైనా పట్టవచ్చు. అంతవరకు గ్రామ పెద్దలకు అయ్యే ఖర్చు అంతా వాది, ప్రతివాది ఇద్దరూ సమానంగా భరించాలి. ఈ విచారణలో సాక్ష్యముల కన్నా, ప్రమాదాలకు ఎక్కువగా విలవనిస్తాయి. ఈ కాడ్డికొట్టే ఆచారం, నాగరికుల కోర్టులో పిటీషన్ దాఖలు చేసే విధంగా ఉంటుంది.

ఎరుకల వారి వ్యసనాలు :

ఎరుకల వారి జాతిరీత్యా ఆటవికులు కావడం వలన నష్టం మరచిపోవడానికి మత్తు పదార్థాలు సేవిస్తారు. కాని తెగల్లో స్త్రీ పురుషులతో సమానంగా కల్లు తాగుతారు. ఆ కల్లు లేకపోతే వట్టినాట మాట్లాడకూడదు". అనే సామెత వీరు ఎరుకల కట్టుబాట్లలోని త్రాగుడు సంప్ర దాయం తెలియజేస్తుంది. వీరు పొగాకు నములుతారు. చుట్ట పీలుస్తారు. ఆకు వక్క అలవాటు వుంటుంది. వేటా డటం, సొమ్ము విచ్చలవిడిగా ఖర్చు చేయటం వంటి వ్యసనాలు కూడా ఎరుకలలో చూడవచ్చు.

కుల కట్టుబాట్లు - న్యాయం :

న్యాయవ్యవస్థ ఒక ఉన్నతమైన వ్యవస్థ. ఇక్కడ న్యాయస్థానం, న్యాయవాదులు, న్యాయమూర్తులు ఉండరు. ఎరుకల సామాజిక పరిస్థితులను గమనిస్తే వీరి జీవన విధానాలు వ్యక్తీకరించే కులం కట్టుబాట్లు ఉం టాయి. దీనినే వీరు న్యాయం అని అంటారు. దాదాపు అన్నీ గిరిజన తెగలలో ఇలాంటి సాంప్రదాయం ఉం టుంది. అయితే ఎరుకల జాతిలో ఒక నిర్దుష్టమైన కుల పాలన ఉంటుంది. ఏదైనా ఒక సమస్య వచ్చినప్పుడు మాత్రం తాత్కాలిక సంఘాలు ఏర్పడి న్యాయం చేస్తారు.

ఎరుకల కట్టుబాట్లు మనం గమనిస్తే దొంగతనం, వ్యభిచారం, సంఘ తీర్మానాలు తిరస్కరించడం, స్థిరాస్తి గొడవలు, కొట్లాటలు వంటివి నేరంగా పేర్కొంటారు.

ఎరుకల వారి యొక్క ఆర్థిక పరిస్థితుల ఆధారంగా వారి మెడలలో ఆభరణాలు, పూసల దండలు ధరిస్తారు. సోది చెప్పే స్త్రీలు పచ్చ పూసల దండ ధరిస్తారు. ఈ పూసల మధ్యలో వెండి ధరించడం జరుగుతుంది.

ఎరుకవల వారి ఆహార్యం :

పూర్వకాలంలో ఎరుకల ఆహారాన్ని పరిశీలిస్తే వారి యొక్క కట్టుబాట్ల గురించి చెప్పాలంటే వస్త్రాలంకరణ లోను, ఆభరణాలు ధరించటంలోను, కేశాల్ని అలంకరించుకోవటంలోనూ వీరికి అంటూ ఒక ప్రత్యేకత ఉన్నది! ప్రస్తుత ఆర్థిక సామాజిక పరిస్థితులను పరిశీలిస్తే ఆధునిక ప్రపంచానికి అనుగుణంగా నగరికతతో పోటీ పడుతున్నట్లు గమనించవచ్చు. అయినప్పటికీ గ్రామీణ ప్రాంతాలలో పరిశీలిస్తే వీర సాంప్రదాయకమైన కట్టు బాట్లలో ఇంకా ఎందరో కనబడుతూనే ఉంటారు. వీరి జీవనశైలిలో మార్పులు రావడం వలన వీరి యొక్క అక్షరాస్యత సంఖ్య పెరుగుతున్నప్పటికీ నిరక్షరాస్యుల సంఖ్య తగ్గలేదు. ఈ నిరక్షరాస్యులు చాలా వరకు తమ సంప్రదాయ అలంకరణాన్ని శాస్త్రీయంగా పాటిస్తుండటం విశేషం.

ముసలివారి శ్రమ :

ఎరుకల వారి కుటుంబంలో ముసలివారి శ్రమ అధిక ప్రాధాన్యం ఉంటుంది. ఒకరకంగా చెప్పాలి అంటే "తిని తిరిగే పనిలేని బాపతులు" అనేది వాస్తవం. వీరు తమ కుటుంబంలో ఉన్న చిన్న పిల్లల్ని జాగ్రత్తగా చూసుకుంటారు. వీరికి అన్ని వేళల అన్నపానీయాలు అందిస్తారు. మరియు ఆడిస్తూ పాడిస్తుంటారు. వీరు అమ్మను మైమరిపించే విధానంగా ఉంటారు. వీరితోపాటు పందులను కూడా వీరు చూసుకోవలసి వస్తుంది. ఇలాంటప్పుడు ముసలివారు అటు పిల్లల్ని, ఇటు పందుల్ని చూసుకుంటూ వీరు ఉన్న నమీపాల్ని కాపాడుకుంటూ ఎక్కువగా శ్రమ పడాల్సి వస్తుంది. (పాలికొండ రంగమ్మ, వయసు 75, మొలచింతపల్లి గ్రామం, మహబూబ్‌నగర్ జిల్లా).

ఎరుకలవారి ఆహారం :

ఎరుకల వారి ఆహార అలవాట్లు విభిన్నతని కనబరుస్తారు. వీరి యొక్క అలవాటు ఈ విభిన్నతకి అద్దం పడుతుంది. ఆహారం అనేది సమాజంలో ప్రతి జీవికి తప్పని సరి! సమాజంలోని మాంసాహారులు, శాఖాహారులు అనే రెండు రకాలవారు ఉంటుంటారు. మాంసాహారాన్ని పరిగణలోకి తీసుకుంటే వీరు తీసుకొనే విధానమునకు ప్రత్యేకమైన వైవిధ్యాన్ని కనబరుస్తారు. వీరు ఎక్కువగా వేటమాంసాన్ని ఇష్టపడతారు. వీరు ఈ క్రింది మాంసము అలవాట్లను గుర్తించవచ్చు.

వేట మాంసము :

పూర్వకాలంనుండి ఎరుకలవారు ఎక్కువగా మాంస ప్రియులు. ఎందుకంటే వీరికి వేట అనేది ఈ జాతి వారికి పుట్టుకతోనే వచ్చిన ఒక పరిపూర్ణమైన విద్య. వీరు ఎక్కువగా వేటాడే మాంసమును ఇష్టంగా తీసుకుంటారు. వీరు మూడు రకాలైన మాంసాహారాలను తీసుకుంటుంటారు. అవి -

1. అడవిలో సంచరించే జంతువుల మాంసము
2. పక్షి జాతులైన ఆహారము
3. జలచరాలైన జీవిలు

అడవిలో సంచరించే జంతువులను అంటే అడవి పందులు, ముంగీసులు, ఉడతలు, ఉడుములు, అడవి పిల్లులు, కుందేళ్ళు, కొండముచ్చులు, నక్కలు మొదలైన వాటిని విరివిగా వేటాడి వచ్చి ఆహారంగా స్వీకరిస్తారు. వీటితోపాటు వీరు అవుజాతి, గేదెజాతి జంతువుల్ని కూడా తింటారు. గొర్రెలు, మేకలు వంటి జంతువుల్ని చచ్చిన వాటిని సైతం తినడానికి ఇష్టపడతారు. అలాగే వీరు స్వయంగా పెంచుకొనే ఊరపందుల్ని పండుగల సమయా

ల్లోను బంధువులు వచ్చిన సమయాల్లోను వండుకుని తింటారు. వీరు అడవి జంతువులు వేటాడేటప్పుడు ఉడములను కుక్కల సహాయంతో వేటాడుతారు.

పక్షిజాతులైన ఆహారము అంటే కోయిలలు, అడవి కోళ్ళు, నాటుకోళ్ళు, కొంగలు, బాతులు, కౌజులు, బురక పిట్టలు మొదలైనవి వీరికి ప్రియమైన ఆహారంగా చెప్పవచ్చు. వీరు వేటాడేటప్పుడు కముజుల్ని ఆవు సహాయంతో వేటాడుతారు. వక్షులను టబ్బుల సహాయంతో, కొన్ని చిన్న జంతువులను బోనుల సహాయంతో ఇలా ఒక్కొక్క పద్ధతిలో వీరు వేట సాగిస్తారు.

జలచరాలైన జీవులు అంటే చేపలు, పీతలు వీరి ఆహారం క్రమంలో ప్రత్యేక స్థానాన్ని ఆక్రమించుకొని ఉన్నాయి. వీరు వేటాడేటప్పుడు చేపల్ని, పీతల్ని వల లేదా గాలం సహాయంతో మరియు కొన్ని చేపల్ని వేటాడే టప్పుడు కర్రకు వానపాముల్ని గుచ్చి వాటి సహాయంతో చేపల్ని వేటాడుతారు.

శ్రమ జీవనం :

ఎరుకలవారు శ్రమ జీవులు. వీరి కుటుంబాలలో చిన్న, పెద్దలు అందరూ ఎక్కువ శ్రమ పడతారు. అందుకే వీరిని ఒకరకమైన మంచి బుద్ధిజీవులు? నిజమే. వీరు తమ కులవృత్తిని కొనసాగించడంలో మరియు వీరి యొక్క నైపుణ్యాన్ని సాధించడంలో అంత బుద్ధికుశలతను ప్రదర్శిస్తారు. కాబట్టి వీరి వృత్తి ధర్మాల్లో మంచి ఫలితాలు సాధిస్తారు. ప్రపంచీకరణ నేపథ్యంలో మార్పులు రావడం వలన వీరు కులవృత్తులపై ప్రభావం చూపిస్తున్నాయి. వీరు తయారు చేసే వస్తువులలో చాలా వరకు ప్లాస్టిక్ వస్తువులు రావడం వలన వీరు తయారు చేసే వస్తువులు మార్కెట్ లేదా సంతలో పోటీ పడలేకపోతున్నాయి. అయినా ఎరుకల వారు శ్రమపడుతూనే వున్నారు.

ఆధార గ్రంథాలు :

1. ఆంధ్రసర్వస్వము, అధ్యాయం - 10.
2. అబ్బేడు బోయి 1770 - 1848 'Hindu Manners, Customs and Cermonics'.
3. థర్స్టన్ E.H. Caste and Tribes of South India.
4. శ్రీరాములు, జి. మరియు బ్రహ్మానంద, హెచ్.ఎస్. 2010, ఎరుకల భాషా సంస్కృతి, సాహిత్యం, పరిశోధన, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం.
5. శ్రీరామ మాలకొండయ్య 'కుర్ర చరిత్ర'
6. సంపత్ కుమార్, ఎం. 1986 ఎం.ఫిల్. డిసర్టేషన్.
7. సుబ్రహ్మణ్య శాస్త్రి, పిరాట్ల, 1992. గిరిజన గేయాలు సామాజిక పరిశీలన.
8. Census of India, Vol. I, Part - XI (1) 1961, p. 372, Yerukala Dialect.

BHAVAVEENA
Vol. 17, Issue. 7, July 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

సామాజిక, మత, సాంస్కృతిక అంశాలపై కోవిడ్-19 ప్రభావం

- కందగట్ల శ్రవణ్ కుమార్, పరిశోధక విద్యార్థి, సోషియాలజీ అండ్ సోషల్ వర్క్ విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్.

పోలియో, మశూచి, ధనుర్వాతం లాంటి ప్రాణాంతక వ్యాధులను నిర్మూలించడంలో భారత దేశ ప్రజారోగ్య వ్యవస్థ అద్భుతమైన ఫలితాలను సాధించింది, అయినా మన దేశంలోని పౌరులందరికీ సమర్థవంతమైన ప్రజారోగ్య సంరక్షణను అందించడంలో ఇండియా ఇప్పటికీ వెనక బడి ఉంది. ప్రపంచంలోని వివిధ దేశాలలో ప్రబలి ప్రజల ప్రాణాల్ని హరిస్తున్న కోవిడ్-19 (కరోనా వైరస్) తీవ్రత మన దేశంలో కుడా అధికంగానే ఉంది. భారత దేశంలో జనాభా పరిమాణంతో పోలిస్తే మరణాల సంఖ్య చాలా తక్కువగా ఉంది. భారతదేశ ఆరోగ్య మౌలిక సదుపాయాలు దేశ ప్రజలందరికి సరిపోవు అనడంలో ఎటువంటి సందేహం లేనప్పటికీ, ఈ సంక్షోభాన్ని ఎదుర్కోవడంలో ఆరోగ్య కేంద్రాల మౌలిక సదుపాయా లకు బాధ్యతాయుతమైన సామాజిక, మత,సాంస్కృతిక అంశాలు తోడైతే ఈ మహమ్మారిపై విజయం సాధించడం చాలా వరకు ఆధారపడి ఉంటుందని చెప్పవచ్చు. ఆసు పత్రులు, ఆరోగ్య కేంద్రాలు, విస్తారమైన ప్రజా ఆరోగ్య సంరక్షణ ఉపకరణాలకు విరుద్ధమైన మత, సామాజిక, సాంస్కృతిక అంశాలు, ప్రజా వైఖరులు వైరస్ వ్యాప్తి చెందడంలో బలమైన ప్రభావాన్ని చూపిస్తాయి, అందువల్ల ఈ సంక్షోభాన్ని పరిష్కరించడానికి విధానపరమైన చర్యలను రూపొందించడంలో ప్రత్యేకమైన శ్రద్ధ చూపడం అవసరం.

సామాజిక, సాంస్కృతిక, మతపరమైన అంశాలు వైరస్ ప్రభావాన్ని క్లిష్టతరం చేసినా అనేక దేశాల మాదిరిగా కాకుండా, భారతదేశం భౌగోళిక విస్తారం దాని సామాజిక, సాంస్కృతిక, మత వైవిధ్యాలు, నమ్మకాలు, ఆచార సంప్రదాయాలు, ఆహారపు అలవాట్లు ప్రపంచ దేశాల కంటే భిన్నంగా ఉండటమే వైరస్ అధిక వ్యాప్తిలో ఉన్నా మరణాల రేటు స్వల్పంగా ఉండటానికి కారణం. మన దేశంలోని సామాజిక రుగ్మతలైన నిరక్షరాస్యత, పేదరికం, వలసలు, పారిశుధ్య పరిస్థితులు, బహిరంగ మల విసర్జన, మాన్యువల్ స్కావెంజింగ్ వంటి అంశాలు కోవిడ్-19 వ్యాధి తీవ్రతను మరింతగా పెంచాయి. ఈ సామాజిక అసమానతల సూచికలు ఇలాగే కొనసాగితే భారీగా సామూహిక వైరస్ వ్యాప్తి దేశ సామజిక, ఆర్థిక, రాజకీయ, ఆరోగ్య పరిస్థితులను మరింతగా దిగజార్చే స్థితికి తీసుకువచ్చే అవకాశాలున్నాయి, అంతే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా వివిధ సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ఆరోగ్య సమాచారాలు వేగంగా ప్రచారం కావడం జగిగింది, ఈ నేపథ్యంలో మన దేశంలో కూడా వివిధ సామాజిక మాధ్యమాల్లో వైరస్ కు సంభందించిన పలు తప్పుడు సమాచారాలు, అపోహలు చక్కర్లు కొట్టాయి. అలాగే భారతదేశ సంస్కృతిలో సనాతనంగా పెనవేసుకు పోయి ప్రజా జీవనంలో భాగమైన అనేక రకాల నాటు వైద్య చిట్కాలు, దేశీయమైన వంటింటి చిట్కాలు విస్తృతంగా ప్రచారం కావటం జరిగింది. దురదృష్టవశాత్తు ఈ తప్పుడు సమాచారాలు ప్రజలకు, ప్రభుత్వ సంస్థలకూ చేరాయి, వాటిని కొంతమంది ప్రజలు ఎటువంటి విచారణ, దృవీకరణ లేకుండా అనుసరించారు, అనుస రిస్తూనే ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా దేశీయమైన చిట్కాలలోని కొన్నింటిని కషాయం పేరుతో ప్రజలను అనుసరించాలని చెప్పింది. కొంతవరకు ఈ చిట్కాలు సత్ఫలితాలను ఇస్తున్నాయని చెప్పాలి, కానీ వ్యాధిని పూర్తిగా నివారించలేవు. ఈ శాస్త్ర, సాంకేతిక యుగంలో అత్యాధునికమైన వైద్య విధానాలు అందుబాటులో ఉన్నప్పటికీ, అశాస్త్రీయమైన సాంస్కృతిక, మతపరమైన విశ్వాసాలతో కూడిన తప్పుడు సమాచారాలు వ్యాధి

తీవ్రతను, వ్యాప్తిని పెంచుతాయి. వైరస్ నుండి రక్షణగా ఆవు మూత్రాన్ని తీసుకోవటం, యోగ చేయాలని చెప్పడం, పూజలు, ప్రార్థనలు, యాగాలు చేయాలని పిలుపునివ్వటం, ప్రముఖ వ్యక్తులు ఇచ్చే ఆశాస్తీయ నినాదాలు మొదలైనవి, భౌతిక దూరాన్ని నిరుత్సాహపరిచే మతపరమైన బాధ్యతలు, సామూహిక నిర్లక్ష్యం, నిబంధన లకు కట్టుబడి ఉండటానికి నిరాకరించడం వంటి దుస్సాహసాలకు ప్రేరేపిస్తాయి, కావున హిందువుల సాంప్ర దాయ పండగలు, ముస్లిం సమ్మేళన ప్రార్థనలు, క్రైస్తవుల ప్రార్థనలు, వివిధ ఇతర మత వర్గాల మధ్య సామూహిక సమావేశాలు దేశాన్ని ప్రాణాంతక వైరస్‌కు గురి చేసి సాముహిక వ్యాప్తిని అధికంగా ప్రేరేపిస్తాయి, ఇవన్నీ దృష్టిలో ఉంచుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దేశంలో ఉన్న అన్ని దేవాలయాలు, మసీదులు, చర్చీలు, ఇతర ప్రార్థనా మందిరాలు, సాముహిక సమావేశాలు లేకుండా పండగలని, ప్రార్థనలు వారి ఇంట్లోనే ఉండి నిర్వహించు కోవాలని ఆదేశాలు జారీ చేయటం జరిగింది, అయి నప్పటికీ కొంతమంది సాధువులు, మత భోధకులు శాస్త్రీయత లేని ప్రకటనలు చేయటం వల్ల మొదట్లో ప్రజలు అనేక అపోహలకు గురి అయినా తరువాత వైద్యుల సలహాలు మరియు సూచనలను పాటించారు. కొన్ని సందర్భాల్లో పూర్తిగా సాంస్కృతిక సమావేశాలను నిషేధించడం, దేవాలయాలు, మసీదులను, చర్చీలను మూసివేయడం జరిగింది, ఇలాంటి పరిస్థితి నిరంతరం కొనసాగితే ఆయా సమాజాలు,సముదాయాలు, మతాలు కలిగి ఉన్న ప్రత్యేకమైన సాంస్కృతిక గుర్తింపు కోల్పోయే ప్రమాదం ఉంటుంది, అందుకే సమతా ధర్మాన్ని పాటించే మన దేశం ఒక సమాజం, సముదాయం, మతం వాటి ప్రత్యేకతను చాటుకునేందుకు కొన్ని సడలింపులతో మత ధార్మిక కార్యక్రమాలకు నెలవైన మందిరాలను, దేవా లయాలను వివిధ దశల్లో తొలగించిన నిర్బంధంలో భాగంగా తెరుచుకునే అవకాశాన్ని కల్పించింది. వైరస్ గురించిన సత్యాసత్య ప్రచారాల విషయానికి వస్తే వాట్సాప్, ఫేస్ బుక్, ట్విట్టర్ మొదలైన సామాజిక మాధ్యమాల ద్వారా వేగంగా వ్యాప్తి చెందుతున్న గృహ ఆధారిత చిట్కాలు, సందేహాస్పద సలహాలు చాలా విస్తృతంగా ప్రచారం కావటం జరిగింది, ఇవి నివారణ సామర్థ్యంపై ప్రభావం చూపాయి, అంతేకాకుండా కరోనాపై భారత దేశ ఆయుర్వేద, యోగ & ప్రకృతి, యునానీ, సిద్ధ మరియు హోమియోపతి (ఆయుష్) మంత్రిత్వ శాఖ కరోనా వైరస్ కు సంబంధించిన జనవరి 29, 2020 తేదీన ఒక సలహాను విడుదల చేసింది. వైరస్ వ్యాప్తిపై పోరాడడంలో హోమియోపతి, ఆయు ర్వేదం, యునాని వంటి సాంప్రదాయ భారతీయ పద్ధతుల సామర్థ్యం వాటి ఉపశమనంపై సలహా ఇచ్చింది, కానీ అటువంటి వాదనలను ధృవీకరించడానికి బలమైన శాస్త్రీయ ఆధారాలు లేవు.

కానీ బీహార్ లోని పాట్నాకి చెందిన గత రెండు దశాబ్దా లుగా గిరిజనులపై అధ్యయనాలు చేస్తున్న "సొసైటీ ఫర్ ఎంపవర్మెంట్" (Society for Empowerment) ప్రభుత్వేతర సంస్థ (ఎన్.జి.ఓ.) జార్ఖండ్, ఛత్తీస్గఢ్ రాష్ట్రా లోని గిరిజనులపై చేసిన అధ్యయనాల్లో సాంప్రదాయ మూలికలు మరియు ఔషధాల వాడకం, గిరిజన సంస్కృతిలో పాతుకుపోయిన సామాజిక దూరం, సాంస్కృతిక పద్ధతులు వారి జీవన విధానం కరోనా వంటి వ్యాధిని ఎదుర్కోవడంలో ఉపయోగపడతాయని చెప్పింది, అంతేగాక బూడిదతో చేతులు కడుక్కోవడం, ఇంటి బయటే పాదరక్షలు వదిలి వేయడం, వ్యక్తుల-సమూహాల మధ్య గణనీయమైన దూరాన్ని పాటించడం లాంటి గ్రామీణ, గిరిజన సంస్కృతి యొక్క ఇతర అలవాట్లు కూడా కోవిడ్-19 అంటు వ్యాధులు నివారించ డానికి దోహదపడ్డాయని వారి అధ్యయనంలో వెల్లడిం చారు. భారతదేశంలో మత పరమైన సాంస్కృతిక వేడుకలు, విస్తారమైన కుటుంబ సభ్యులు, అల్లుకుపోయే బాంధవ్యాలు, పొరుగువారితో సన్నిహిత సంబంధాలు భౌతిక దూరాన్ని పాటించటం వైరస్ ని కట్టడి చేయటంలో ఉండే ముఖ్యమైన సామాజిక సవాళ్లు.

ప్రజారోగ్య సంస్థలు, ఎన్.జి.ఓ లు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో ప్రజల ప్రవర్తనల్లో గణనీయమైన మార్పు లను తీసుకురావడం అత్యవసరం, ప్రయోజనకరం కూడా. స్వల్ప కాల వ్యవధిలో ఇటువంటి మార్పులను ఎంతవరకు తీసుకరాగలమనేది చర్చనీయాంశం. ఆరోగ్య పరమైన సూచనలను, ప్రకటనల ద్వారా సమాచారాన్ని, అనుభవాల్ని అందించడంలో భాగంగా 'సామాజిక మరియు ప్రవర్తన మార్పుల సమాచారం'ని (Social and behavior change communication, SBCC) ఉపయోగించి స్వీయ గృహ దిగ్బంధం, భౌతిక దూరం వంటి నివారణ చర్యల ప్రభావం, ఆవశ్యకతను పెంచే వ్యూహంగా ప్రజల్లో చైతన్యం కలిగించాలి. సామాజిక మరియు ప్రవర్తన మార్పుల సమాచార లక్ష్యాలను నెరవేర్చ డానికి మాస్ మీడియా, కమ్యూనిటీ-స్థాయి కార్యకలా పాలు, ఇంటర్ పర్సనల్ కమ్యూనికేషన్ (క్లైంట్ ప్రొవైడర్ ఇంటరాక్షన్, గ్రూప్ ప్రజెంటేషన్ వంటివి), ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యునికేషన్ టెక్నాలజీలు, సామూహిక సమీకరణ లాంటివి ఉపయోగిస్తున్నారు. సాక్ష్యం ఆధారిత కమ్యూ నికేషన్ కార్యక్రమాలు విజ్ఞానాన్ని పెంచడానికి, వైఖరిని మార్చడానికి, ప్రజల ప్రవర్తనలను, వైఖరులను మార్చ డానికి దోహదపడతాయి. స్వీయ గృహ దిగ్బంధం, భౌతిక దూరం వంటివి పాటించడం నివారణ చర్యలుగా భావించి పుకార్లు, తప్పుడు సమాచారంతో భయాలు, మానసిక ఆందోళనలు చెందకుండా అప్రమత్తంగా ధైర్యంగా ఉం డాలి. కోవిడ్-19 వైరస్ సృష్టించిన విపత్కర విపత్తును ఎదుర్కోవడం అనేది సుదీర్ఘమైన యుద్ధం లాంటిది, ఈ వైరస్‌తో సహజీవనం చేయడమనేది కూడా ఒక యుద్ధమే, దీనిని సైన్స్, అధునాతన వైద్య విధానాలతో, సరైన ఆరోగ్య సంరక్షణతోనే పోరాడాలి అప్పుడే ప్రజలు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవడానికి వీలు కలుగుతుంది. దీర్ఘకాలంలో గణనీయమైన ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను నిర్మించడానికి మరియు పటిష్టం చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజారోగ్యంపై కేటాయించే వ్యయాన్ని పెంచాలి, దానికి అనుగుణంగా బడ్జెట్ ని కేటాయించాలి. ప్రజలకు ఆరోగ్య సదు పాయాలు వాటికి సంభందించిన అన్ని రకాల సౌకర్యా లను, మౌలిక వనరులను ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ప్రభుత్వాలపై ఎంతైనా ఉంది.

ముగింపు (Conclusion) :

కోవిడ్-19 (కరోనా వైరస్) కారణంగా ప్రపంచంలో, ఇండియాలో సామాజిక, మత మరియు సాంస్కృతిక పరమైన అంశాలలో మార్పులు సంభవించాయి. దేశం లోని దేవాలయాలు, మసీదులు, చర్చీలు మూసివేశారు. మత పరమైన సదస్సులు, సమావేశాలు నిర్వహణ కూడా ఆగిపోయాయి ఎందుకంటే కోవిడ్ -19 సాముహిక వ్యాప్తిపై సామాజిక, మత,సాంస్కృతిక అంశాల ప్రభావం ఉంది. వివిధ రకాల సంప్రదాయక మరియు జాతీయ పండుగలు కూడా సాముహికంగా జరపకుండా ఇంట్లోనే జరుపుకున్నారు. కోవిడ్-19 వల్ల ముఖ్యంగా నగర ప్రాంతాలలో గణనీయమైన సామాజిక, మత, సాంస్కృతిక ప్రవర్తన మార్పులు జరిగాయి, గ్రామీణ ప్రాంతాలలో ఈ మార్పు కొంతవరకే అని చెప్పవచ్చు. సునామీ, భూకంపం, వరదలు లాంటి ప్రకృతి విపత్కర సమయంలో కూడా పండుగలు, మతపరమైన ప్రార్ధనలు, సాంస్కృతిక సభలు-సమావేశాలు సామూహికంగా నిర్వహించినా కోవిడ్-19 వల్ల వాటికి ఆటంకం ఏర్పడింది. "సామాజిక మరియు ప్రవర్తన మార్పుల సమాచారం" (యన్.బి.సి.సి) దాని పద్ధతుల వల్లే వివిధ రకాల మాధ్యమాల ద్వారా ప్రజల్లో అవగాహనను పెంచి భౌతిక దూరంతో సామూహిక వ్యాప్తిని అరికట్టడానికి వీలు పడుతుంది. ఏది ఏమైనప్పటికీ కోవిడ్-19 ప్రభావం వల్ల ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం, సైన్స్ పై నమ్మకం పెరిగింది. సామాజిక, మత,సాంస్కృతిక అంశాలు మన జీవితంలో ఒక భాగమైనా, చివరికి విపత్కర పరిస్థితుల్లో వాటి నిర్వహణ మరియు ఆచరణలో కూడా మార్పులు, ఆటం

కాలు సంభవించాయి. కోవిడ్-19 వల్ల ఏర్పడిన "సామజిక దూరం" (Social Distance) భావనతో ప్రజల్లో సామాజికంగా కలిసి తిరగలేని పరిస్థితి ఏర్పడి ఇంట్లోనే ఉండటం వలన కుటుంబాలతో ఎక్కువ సమయం గడిపారు, ఎక్కువ సంఖ్యలో ప్రజలు నగర ప్రాంతాల నుండి గ్రామీణ ప్రాంతాలకు వెళ్ళటం జరిగింది.

పరిశీలనలు : (References)

1) అరుణ్ ఆనంద్, 2020. సోషల్, కల్చరల్ హబిట్స్ ఆర్ ప్రివెంటింగ్ స్ప్రెడ్ అఫ్ కోవిడ్ ఎమాంగ్ ఇండియాస్ ట్రైబల్, సర్వే ఫైండ్స్, జూలై 3, 2020, ది ప్రింట్ : https://theprint.in/india/social-cultural-habits-are-preventing-spread-of-covid-among-indias-tribals-survey-finds/453192.

2) మన్సౌరీ,ఫ్.,2020. ది సోషియో-కల్చరల్ ఇంప్లికేషన్స్ అఫ్ కోవిడ్ -19, మే 25, 2020, యునెస్కో : https://en.unesco.org/news/socio-cultural-implications-covid-19

3) ముఫ్సిన్, పి.పి. & ముహ్సిన్ పి.పి., 2020. సోషియో కల్చరల్ అండ్ రిలీజియస్ ఫాక్టర్స్ కాంప్లికేట్ ఇండియాస్ కోవిడ్-19 రెస్పాన్స్, మర్చి 25, 2020, ది దిప్లోమాట్: https://thediplomat.com/2020/03/sociocultural-and-religious-factors-complicate-indias-covid-19-response

4) https://en.wikipedia.org/wiki/Adivasi

❁❁❁

BHAVAVEENA
Vol. 17, Issue. 7, July 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

రెండు విభిన్న వాక్యాలు

– డా॥. వెల్దండి శ్రీధర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు అధ్యయనశాఖ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హయత్‌నగర్, జి. రంగారెడ్డి. తెలంగాణ.

కాలాన్ని కవిత్వీకరిస్తూ వెళ్తున్న కవుల్లో బిల్ల మహేందర్ కలానిది విభిన్నమైన శైలి. ఏ కవికైనా కొన్ని స్వప్నాలుంటాయి. వాటిని వాస్తవిక సందర్భాలకు అనుసంధానించి లోకాన్ని మరమ్మతు చేయాలనే ఆవేశం ఉంటుంది. ఆ ఆవేశానికి రసాత్మకమైన, అగ్ని సదృశమైన, గాయం తాలూకు నొప్పితో సమానమైన గొంతునిచ్చి మనసు వాకిట్లో నిప్పుకణికల్లాంటి అక్షరాలను పేర్చితే అది వర్తమాన సమాజపు కవిత్వమై నిలుస్తుంది. ఈ వ్యాకరణాన్నంతా తన వాక్యాలకు తినిపించి ఇటీవలనే రెండు భిన్నమైన కవితా సంపుటాలను మన ముందుకు తెచ్చాడు బిల్ల మహేందర్. అవి 'ఇప్పుడొక పాట కావాలి', 'తను నేను వాక్యం'.

'ఇప్పుడొక పాట కావాలి' అనేది నిజంగానే ఇప్పటి పాట. గత పదిహేను వందల రోజుల నుండి భారత దేశంలోని సామాజిక పరిస్థితులు సగటు మనిషిని కరోనా (కోవిద్ - 19) వైరస్‌లాగా నిర్దాక్షిణ్యంగా తినేస్తున్నాయి. ఊపిరి తీసుకోవడానికి కూడా లేదు. మనిషి చుట్టు ఏదో కనపడని ముళ్ల కంచె పర్చుకొని ఉంది. బతుకు మునుపున్నంత సరళంగా లేదు. రాళ్లు, ముళ్లు, గాయాలు, నెత్తురు, దుఃఖం నిండిన ఒక అవాంఛనీయ తోవ. వీటిని దాటాలని చేసిన ప్రయత్నమంతా ఎంతో నొప్పితో కూడుకున్నది. ఈ జ్ఞాపకాలు మదిలో మెదిలిన ప్రతిసారీ మహేందర్ ఒక కవితా వాక్యమై, ఒక వింతైన అనుభవమై పగిలిపోతాడు. ప్రశ్నలనెన్నింటినో మూటగట్టి అదృశ్య శక్తి మీద మందుపాతరలాగా కుమ్మరిస్తాడు.

"పోగుల్ని సరిచేసి కండెల్ని బిగించి రెక్కల్ని ఆడించి
అందమైన పట్టు పీతాంబరాలను నేసిన దేహమ్మీద
ఓ నూలుపోగైనా లేని వాడ్ని
ఏ గీతం పాడమంటావు?"

యుగాలుగా జరుగుతోన్న దోపిడి ఇంకా కొనసాగుతూనే ఉంది. చెప్పులు కుట్టేవాని కాళ్లకు చెప్పులుండవు. బట్ట నేసే కార్మికుని పెయ్యి మీద సరైన అంగి ఉండదు. గింజలు పండించే రైతు ఇంట్లో గింజ కరువవుతుంది. ఉత్పత్తి కులాల వారి కడుపులో పేగులు ఆకలి రాగం పాడుతుంటే ప్రశాంతంగా ఏ పాట పాడుతాం? ఇతర ఏ పాట మన చెవికి వినబడుతుంది? రాజ్యం శాంతి, భద్రతలకు భంగం కలగనీయకుండా జీవించుమంటుంది. దళారులు మెత్తగా తడిగుడ్డతో గొంతు కోసేస్తుంటారు. జీవితాలు అలా మన కళ్ల ముందే మట్టిలో కలిసిపోతుంటాయి. నిజంగా 'ఇప్పుడొక పాట కావాలి'. 'అది కన్నీళ్లను తుడిచి, గాయాల్ని చెరిపి గుండె గుండెల్లో మమతల్ని నింపి గుడిసె గుడిసెల్లో వెలుగుల్ని పూయించే ఓ కొత్త పాట కావాలి'. అలాంటి పాట కోసమే ఎన్నో ఏండ్లుగా ఉద్యమాలు చేస్తున్నాం. ప్రభుత్వాల్ని కూలుస్తున్నాం. అయినా ఇంకా ఆ పాట ఏదో మన దరిచేరడమే లేదు. బహుశా ఇప్పట్లో మన గుండెను తాకే పాట రాదు.

"వస్తూ ఉన్నప్పుడూ
పిడికెడు మట్టిని తెండి
మొలకెత్తడం నేర్చుకుందాం
.....
వస్తూ ఉన్నప్పుడూ
ఓ అనాథ ముంగిలిని ముద్దాడండి
ఇక ఎలాగైనా బతికేయవచ్చు"

ఇప్పుడున్న సంక్లిష్ట సామాజిక పరిస్థితుల్లో సకలాంగులకే బతుకు కొండ మీదికి బండను లాగినట్లుగా ఉంది. ఇక దివ్యాంగుల పరిస్థితి ఎలా? అనాథల పరిస్థితి ఎలా? అందుకే కవి గుప్పిట నిండా ఆత్మ విశ్వాసాన్ని ప్రోది చేసుకొని వచ్చి మన గుండె గదిలో విప్పుతాడు. ఒక్క

అనాథ జీవితం నుండి ఎన్నో బతుకు పాఠాల్ని నేర్చు కోవచ్చంటాడు. అప్పుడు నిజంగానే మొలకెత్తడం నేర్చు కుంటాం. పరిమళించడమెలాగో తెలుసుకుంటాం. స్వచ్ఛతను ఒంటి నిండా పూసుకుంటాం.

ఇప్పటి తక్షణావసరం నుండి తక్షణమే రూపుదిద్దుకొన్న కవిత్వమిది. ప్రాంతీయ సంఘటనల నుండి అంతర్జాతీయ సంఘటనల దాకా అన్నీ మహేందర్ కవిత్వంలోకి ఒక కొత్త కోణంలో, మానవీయ స్పర్శతో వచ్చి ఒదిగిపోతాయి. అంతేకాదు జీవితంలో తనను కదిలించిన ప్రతి సంఘ టనను కవిత్వీకరిస్తూ వస్తున్నాడు మహేందర్. మనం ఊహించని అతి సాధారణ సందర్భాలను కూడా ఎంతో వాస్తవికంగా, నిక్కచ్చితనంతో కవిత్వీకరిస్తాడు. ప్రతి సందర్భం వెనక ఎంతో సంఘర్షణ, ఆ సంఘర్షణ తాలూకు పర్యవసానాలు కవి ముందే చెప్పేస్తాడు. ఇందులోని వస్తు వైవిధ్యం చూస్తే నిజంగానే ఆశ్చర్యం కలుగుతుంది. కవి ప్రాపంచిక దృక్పథం అర్థం అవుతుంది. ఎన్నో సున్నితమైన అనుభూతులు, అంతకంటే సున్నితమైన జీవితాను భవాలు, ఎంతో లోతైన తాత్వికతతో కూడిన విషయాలు, ఎన్నో కుళ్లిపోయిన రాజకీయ విషయాలు, సగటు మనిషి ఆకాంక్షలు, అసంపూర్తులు, ఎన్నో సామాజిక విషయాలు కవిత్వంగా నిలబడి మనల్ని అచ్చెరువొందేలా చేస్తాయి. వస్తువు ఎంపికలోనే కాదు ప్రతి కవితలో పాటించిన ఎత్తుగడ, నిర్వహణ, ముగింపు అన్నీ కలిపిన ఒక విలక్షణ శిల్పం మహేందర్ కవిత్వాన్ని మన రక్తంలో కలుపుకునేలా చేస్తాయి. మరీ ముఖ్యంగా అతని సంభాషణ శైలిని ప్రత్యేకంగా చెప్పుకోవాలి. అతడు వాడిన ప్రతీకలు, భావ చిత్రాలు కూడా చాలా కొత్తగా అనిపిస్తాయి. దివ్యాంగు లను వారి జీవన పోరాటాన్ని మనం చాలా చిన్న చూపు చూస్తాం. కొన్ని సార్లు హేళనతో కూడా చూస్తాం. కాని ఇందులోని చాలా కవితల్లో తొంగిచూసిన దివ్యాంగుల మానసిక సంచలనం చూసి మనం కూడా చలించిపోతాం. కొన్ని వాక్యాలు వెంటాడి మనల్ని ఏదో విపత్కర జగత్తులోకి నెట్టేస్తాయి. గత కొంత కాలంగా దేశవ్యాప్తంగా విజృం భిస్తున్న 'నిర్భయ కాలాన్ని' నిరసిస్తూ 'ఇక నుండి ఎప్పుడైనా గడపదాటే ముందు మొలిచిన మీ అంగాల్ని ఇంట్లోనే వదిలి వెళ్లండి' అంటాడు. మామిడిపండు దొంగిలిం చాడని ఒక దళితుడిని కొట్టి చంపిన సంఘటనను చెప్తూ 'ఇప్పుడు నా దళిత బిడ్డలకు ఈ దేశపు జాతీయ ఫలం కూడా అంటరానిదేనని ఎలా బోధించను??' అని ప్రశ్ని స్తాడు. అడవిని గురించి చెప్తూ 'అడవి అంటే రాయి రప్పనే కాదు, గనులు ఖనిజాలు అంతకన్నా కావు, కొన్ని మన అడుగులు, ఇంకొన్ని ఆకు పచ్చని బతుకులు' అంటాడు. అన్యాయాల్ని ఎదిరించి హక్కుల గురించి మాట్లాడినా, ఒక దళితుడు అగ్రవర్ణ యువతిని ప్రేమించినా, బహు జనుడు కాసింత గర్వంగా బతికినా అదొక పెద్ద నేరమై కూర్చుంది ఇవాళ. అందుకే ఇపుడు ప్రతి మనిషికి యుద్ధం అనివార్యమేనంటూ ప్రొఫెసర్ సాయిబాబ గురించి 'నువ్విక్కడ కలాన్ని పట్టుకోకూడదు, అక్షరాల్ని జాలువార్చే లోపు నీ జాడ శాశ్వతంగా కనుమరుగై పోతుంది' అంటాడు. 'పచ్చని మొలకలన్నీ రాలిపడ్డ నెత్తుటి చుక్కల్ని తిలకంగా దిద్దుకొని కత్తులై పదునెక్కి పాటనందుకున్నయ్ వెళ్దాం వస్తారా...' అంటూ మహేందర్ ఈ కవితా సంపుటిలో మనల్ని అనేక కొత్తదారుల్లో నడిపిస్తాడు. చెమట చుక్కల మైదానాల మీదుగా, రక్తపుటేరుల గుండా, పీడన కొండల్ని దాటి చివరాఖరికి మనమొక కలల ప్రపంచంలోకి చేరుకుంటాం. అక్కడ కేవలం మనుషులే ఉంటారు. కేవలం మానవ పరిమళమే ఉంటుంది. కేవలం ఒక సున్నితత్వమే ఉంటుంది. కేవలం ఒక ఆనందమయ జీవితమే ఉంటుంది.

బిల్ల మహేందర్ కలం నుండి జాలువారిన మరొక అద్భుత కావ్యం 'తను నేను వాక్యం'. పురుషుడి బలం, బలహీనత స్త్రీయే కదా. అందుకే కవి 'ఇవన్నీ తను నేనై, నేను తనై సంభాషించుకున్న వాక్యాల నిర్మాణం. తనను ప్రేమిస్తున్నప్పుడో, తనతో ఘర్షణ పడుతున్నప్పుడో, తన గూర్చి ఆలోచిస్తున్నప్పుడో, తన కోసం సంఘర్షణకు లోనవుతున్నప్పుడో మదిలో మెదిలిన అక్షరాలే 'తను నేను

వాక్యం' అంటాడు. అంతేకాదు 'తను అనేక రూపాల సమూహం. తల్లిగా, అక్కగా, చెల్లిగా, సహచరిగా, స్నేహితురాలిగా నిత్యం వెన్నంటూ ఉండి నడిపిస్తున్న చైతన్య మూర్తి. నిజానికి తను లేనిది నువ్వూ నేను, ఈ సమస్త ప్రపంచం లేనే లేదు. తను ఈ సృష్టికి రూపం. జగతికి మూలం. గతాన్ని పరిశీలించిన, వర్తమానాన్ని విశ్లేషించినా, భవిష్యత్తును ఆలోచించినా తను లేని కాలం, తన అడుగులు లేని జాడలు ఎక్కడా ఉండబోవు. అలాంటి తనను వాక్యంగా మలచడం, కవిత్వాన్ని చేయడం ఆకాశానికి నిచ్చెనలు పరచడమే'. అంటాడు. స్త్రీలాగే ఇదొక దీర్ఘ కావ్యం. ఇందులోని ఏ కవితకూ శీర్షిక పెట్టలేదు. 44 ఖండికల భావకావ్యం. ఇదొక కొత్త ప్రయోగమే. ఈ కావ్యమంతా 'తను', 'నేను'ల మధ్య సాగే ఒక దీర్ఘ సంభాషణ. ఈ సంభాషణలోనే అనేక భావ శకలాలు మనల్ని ఆసాంతం తడి చేస్తాయి. ఎన్నో కొత్త కొత్త తీరాలకు మనల్ని చేర్చి ఒక భావనా ప్రపంచంలో విహరించేలా చేస్తాయి. ఆమె చుట్టూ అల్లుకున్న విశ్వమంత ప్రేమ, అతని నిస్సహాయత, సంఘర్షణ, సాన్నిహిత్యం, విరహం, సంయోగం, అనేక జ్ఞాపకాలు, అనుభూతులు, సంవేదనలు, సామాజిక, వ్యక్తిగత సంబంధాలు.. ఇలా ఎన్నో కోణాల్లో స్త్రీని చిత్రించిన కవిత్వమిది. ఇది కేవలం 'తను', 'నేను'ల సొంత గొడవ కానేకాదు. వారిరువురి చుట్టూ ఎంతో రాజకీయం, సామాజికం, ఎన్నో ప్రశ్నలు, ఎన్నో సమాధానాలు, ఎన్నో పెనుగులాటలు, ఎన్నో సముదాయింపులు, ఎన్నో అలకలు, ఎన్నో చిరునవ్వులు విస్తరించి ఉన్నాయి.

"నేను ఆమెను ఆకాశమంతా ఎత్తుకుందామనుకున్నాను
ఆకాశం నేలను దిగి వచ్చింది
ఆమె కన్నీళ్లను తుడిచివేయాలనుకున్నాను
దుఃఖం నదిలా పారుతూనే ఉంది
ఆమెను 'కవిత'గా మలుద్దామనుకున్నాను
మహాకావ్యమై నా ముంగిట నిలబడింది
ఆమెను వదిలి దూరంగా వెళుదామనుకున్నాను
దారి పొడవునా ఆమె గుర్తులే కనిపించాయి
ఆమెలేని జ్ఞాపకాల్ని రాసుకుందామనుకున్నాను
ఎన్ని పేజీలను తిప్పినా ఒక్క అక్షరం కనిపించలేదు
ఆమె దాహాన్ని తీర్చుదామనుకున్నాను
సప్త సముద్రాలన్నీ ఇంకిపోయాయి
నేను ఆమెలోకి పయనిద్దామనుకున్నాను
మొదటి అడుగులోనే నా జీవిత కాలం ముగిసింది"

ఆమే లేకపోతే ఈ భూమికెంత వికలత్వం ఏర్పడుతుంది? ప్రపంచమంతా సమస్తం ఆమె చుట్టే అల్లుకొని ఉంది. చదవగలిగితే ఆమెను మించిన మహాకావ్యం ఈ లోకంలో ఏదీ లేదని అంటుంటారు. ఆమెకు సాటిరాగల వస్తువేదీ ఇప్పుడీ జగత్తులో లేనేలేదు. అందుకే ఆమె సమగ్ర స్వభావాన్ని, స్వరూపాన్ని ఏ పురుషుడూ వర్ణించలేడు.

అంతటి మహాశక్తి ఏ మనిషికీ లేదు. సకలం తన చుట్టే ఇమిడి ఉంది. తన దుఃఖమో, ప్రేమో, కోపమో ఏదీ పూర్తిగా అర్థం కాదు. అర్థమయ్యిందనే భ్రమలోనే ఉండిపోతాం. ప్రకృతిని అర్థం పూర్తిగా చేసుకోనట్లే తనను గురించి కూడా పూర్తిగా అర్థం చేసుకోలేదు. భూమిలాగా స్త్రీ కూడా ఏ గాయాన్నయినా తనలో ఇముడ్చుకుంటుంది. నిజానికి తను నిరంతరం ఒక గాయం నుంచి మరో గాయానికి ప్రయాణం చేస్తూనే ఉంటుంది. కొన్ని పైకి కనిపించే గాయాలు. మరికొన్ని పైకి కనిపించి రక్తమోడే గాయాలు. కొన్నిసార్లు మట్టిలాగా, వానలాగా, వెన్నెలలాగా, నక్షత్రాల్లాగా తను అంతటా కనిపిస్తుంది. మరికొన్నిసార్లు ఎక్కడ చూసినా కనిపించదు. అంతా శూన్యం. తన తోడు లేకుండా ఒక్కటంటే ఒక్క అడుగు కూడా వేయలేం. అంతా ఒక ఖాళీతనం ఆవరించుకుంటుంది. దిగులు చీకటి దేహం మీద, మనసు మీద పరుచుకున్నప్పుడు తను వెన్నెలను వెలిగిస్తుంది.

"తను
'నువ్వెందుకు ఎరుపును ఇష్టపడుతావని' అడిగింది
నేను నవ్వుతూ ఊరుకున్నాను

మళ్ళీ
'నువ్వెందుకు ఎరుపునే రాస్తుంటావని' అడిగింది
నేను మళ్ళీ నవ్వుతూనే ఊరుకున్నాను
కోపంతో కళ్ళని ఎరుపు చేసుకుంటూ ఇంటివైపు కదిలింది
నవ్వుతూ నా అడుగుల్ని అడవి వైపుకు కదిలించాను
ఒకానొక ఉదయం
తన ఇంటి గుమ్మం ముందు హఠాత్తుగా
ఆమె నుదిటి బొట్టునెవడో కళ్ళముందే ఊరితీసి
వెళ్లిపోయాడు
ఇప్పుడు
ఆమెకు తెలియకుండానే
తన అడుగులు అడవి వైపుకు కదిలాయి''

అడవి ఎన్నింటికో సమాధానం. పోరాటాలు జరిగి పోయిన ఏ అన్యాయాలనో సరిచేయడానికి, లేదా ఇతరులకెవరికీ అలా జరగకుండా ఉండడానికి జరిగేవే కదా! ఎరుపు తత్వం బోధపడినాక అతనితో పాటు తను కూడా అడవి బాట పట్టింది. మట్టిలాగే అడవి కూడా ఎప్పుడో ఒకనాడు తప్పకుండా ప్రతీకారం తీర్చుకుంటుంది. కాక పోతే 'కాలంబు రావాలె'. ఎరుపే లేకుంటే మనిషికింత ఆత్మగౌరవం, కాసింతైన దుఃఖ రహితంగా ఉండేవాడు కాదేమో! అందుకే ఎరుపంటే అందరికీ ఇష్టమే. లోలోపల అందరి అసలు వర్ణం ఎరుపే కదా!

ఈ రెండు కవితా సంపుటులు బిల్ల మహేందర్ కవిత్వానికున్న రెండు భిన్న పార్శ్వాలను తెలిపేవి. ఒకటి సామాజిక కోణంతో పాటు అనుభూతి ప్రధానమైనదైతే మరొకటి స్త్రీ ప్రేమను, ఆమె ప్రాముఖ్యతను తెలిపే సున్నిత వ్యక్తీకరణ. వీటిలో రాయిలాంటి కరుకు పదాలతో పాటు పూవులాంటి సుతిమెత్తని పదాలను జమిలీగా వాడడం మహేందర్ సాధించిన కవిత్వపు పరిణతి. ఇప్పటి కాలాన్ని కవిత్వంలోకి అనువాదం చేస్తే అది మహేందర్ కవిత్వం అవుతుంది. రెండు భిన్నమైన వాక్యాలు కవితా ప్రపంచంలోకి రావడం అరుదైన విషయం. ఇవి పంచే భావ వీచికలను సహృదయ పాఠకులందరూ మనసు కెక్కించుకోవాలి.

❁❁❁

BHAVAVEENA
Vol. 17, Issue. 7, July 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

తెలుగు సాహిత్యంలో శంకరనారాయణ

- చొప్పరపు శ్రీనివాసరావు, పరిశోధక విద్యార్థి, తెలుగు & ప్రాచ్య బాషా విభాగం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

శారీరక, మానసిక ఉల్లాసానికి దోహదపడే హాస్యం చిన్న వారి నుండి పండు ముదుసలి వరకు ప్రయోగించబడి నవ్వూ నవ్వించు అన్నట్లుగా విరాజిల్లుతుంది. మన సమాజంలో హాస్యానికి అగ్రతాంబూలం ఇవ్వబడుతుంది. సినిమా రంగంలో కూడా నేడు హాస్యనటులు లేకపోతే సినిమా హిట్ కాదనే దాకా వచ్చింది. హాస్యం నిత్య వ్యవహారంలోనే కాకుండా సాహిత్యరంగంలోనూ ప్రయోగింపబడుతుంది అనడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు.

రాజకీయ రచనా రంగంలో :

శంకరనారాయణ రాజకీయ అంశాలమీద పేరడీలు రాశారు. నిజానికి ఈ రకంగా రాజకీయ వ్యంగ్యాస్త్రాలను సంధించిన వ్యక్తి ఎవరూ రాజకీయ రచనా రంగంలో లేరనే చెప్పవచ్చు. ఇలా రాజకీయ అంశాలపైన పేరడీలు రాసి తాను ఉద్దేశించిన అవగాహనను పాఠకులకు కలిగించడం శంకరనారాయణ విశిష్టత. 'ఫన్‌గన్' లో పేరడీ కవితే ఎత్తుగడగా ఉంచడం గమనించాల్సిన అంశం.

శంకరనారాయణ జాతీయ రాజకీయ నాయకులపై వ్యంగ్యాస్త్రాలు ప్రయోగించడానికి కారణం సామాన్య మానవులకు వారిపై అవగాహన కల్గించడానికే. పాఠకులకు వ్యంగ్యంగా అధిక్షేపిస్తే త్వరగా అర్థం చేసుకుంటారనే ఉద్దేశ్యంతోనే అని చెప్పక తప్పదు. తాను నమ్మిన ఈ అంశాన్ని ఆనాడు ఉన్న వాజ్‌పేయి, అద్వాని, సోనియా గాంధీ, పి.వి. నరసింహారావు, రాజ్‌నారాయణ వంటి వివిధ రాజకీయ నాయకులపై తనదైన శైలిలో పేరడీలను సృష్టించారు.

వాజ్‌పేయ్ :

ములాయం సింగ్ యాదవ్, లాలూ ప్రసాద్ యాదవ్‌లు ఢిల్లీకి గుండాలను తరలిస్తున్నారని అప్పటి ఢిల్లీ ముఖ్యమంత్రి సాహెబ్ వర్మ అనగానే అబ్బెబ్బే కొత్త గుండాలు అవసరం లేదు. ఉన్న గూండాలు చాలు అని వాజ్‌పేయి స్పష్టం చేశారు. ఈ రాజకీయ వార్తను పట్టుకొని శంకరనారాయణ పేరడీని సృష్టించారు.

కాళీ పట్నం చూడరబాబూ
కలకత్తా కాళిని చూడరబాబూ అనే పాటకు ఇది పేరడీ పాట ...
ఢిల్లీ పట్నం చూడరాబాబూ
గల్లీ గల్లీ గుండాలేనోయ్

అని నిజపేయ్ వ్యాసంలో వాజ్‌పేయ్ నిజాన్ని ఒప్పుకున్న విషయాన్ని ప్రస్తావించారు. ఈ పేరడీలో వ్యంగ్య హాస్యం చోటుచేసుకున్నాయి.

అద్వానీ :

అటల్ బిహారి వాజ్‌పేయికు ప్రియశిష్యుడు అద్వానీ. పి.వి. నరసింహారావు ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు అద్వానీ ప్రతిపక్షనాయకుడిగా ఉన్నారు. పి.వి. నరసింహారావును అద్వానీ స్వాతంత్ర పూర్వపు విలువలున్న స్వాతంత్రానంతర నాయకుడన్నారు. ఆయన పి.వి. నరసింహారావును ఎందుకన్నారో బి.జె.పి. కార్యకర్తలకు కూడా అర్థం కాలేదు. మళ్లీ తలలు బ్రద్దలు కొట్టుకుంటూ అద్వానీ రెండు నాల్కల ధోరణిని ఆశ్చర్యంతో నోరెళ్లబెట్టి చూచారు. దీనినే శంకరనారాయణ 'ద్వంద్వానీ' అని పేరడీలో అధిక్షేపించారు. శంకర నారాయణ ఇటువంటి విషయాలను సేకరించి మరీ పేరడీలు వ్రాయడం మనకు కన్పిస్తుంది.

అద్వానీ హోంమంత్రిగా ఉన్న సమయంలో 'వెళితే అయోధ్య వెళ్లాలి... చదివితే రాజ్యాంగం చదవాలి." అంటూ కితాబిచ్చారు. ఇది 'తింటే గారెలే తినాలి వింటే భారతమే వినాలి' అన్న దానికి పేరడీ.

పి.వి. నరసింహారావు :

కాంగ్రెస్ పార్టీ అధికారం చేజిక్కుంచుకోలేక పోయినప్పుడు మాజీ ప్రధాని పి.వి. నరసింహారావు అధికారంలోనే లేమని ఫీలు కావద్దు, అంతేగాక అధికారం లేకపోవడం కాంగ్రెస్‌కు కొత్తేమీ కాదు అని ఒకసారి తిరస్కరించిన జనం మనకే పట్టం కడతారని ప్రజానాడి తెలిసిన శాస్త్రవేత్తగా చెప్పారు. ఈ విషయాన్ని శంకరనారాయణ.

'కనులు లేవని నీవు
కలత పడవలదు
నా కనులు నీవిగా చేసికొని చూడు'

అనే సినిమా పాటకు పేరడీ రాస్తూ అన్వయించారు.

'పవరు లేదని నీవు
షివరు కావలదు
భవిష్యత్తు నీదిగా చేసుకొని చూడు'

అంటారు. శంకరనారాయణ రాసిన పేరడీ కవితలు ఈ పుస్తకానికే హైలెట్ అని చెప్పక తప్పదు. ముఖ్యంగా రాజకీయ నాయకుల గురించి ఆయన రాసిన విషయాలు చదివితే ఆయన వారిని ఎంత లోతుగా పరిశీలించారో అర్థం అవుతుంది. పి.వి. నరసింహారావు సోనియా గాంధీ పట్ల ఎంత వినమ్రుడుగా ఉంటాడో ఒక కవితలో వివరిస్తారు. అధికారం పోయిన మరలా తిరిగి వస్తుందని చెపుతారు. దీనిని శంకరనారాయణ పేరడీగా వర్ణిస్తారు.

'పడ్డవాడెపుడైనా
చెడ్డవాడగునా
తలవంచువాడేను
తలెత్తగలుగు'

అనే ఈ పేరడీ కవితతో పి.వి. నరసింహారావును పి. 'వినమ్ర' నరసింహారావుగా మార్చారు.

సోనియా గాంధీ :

అధికారం కోసం కాంగ్రెస్ ఎప్పుడూ తాపత్రయ పడదు. ఆయావ మాకు లేదు. బాధ్యత గల ప్రతిపక్షంగానే వుంటా అని సోనియా గాంధీ సోనైగాంధీ యై బోఫోర్స్‌గా చెప్పారు. ఎవరికి ఛాన్స్ ఇస్తే వారే డాన్స్ చేయాలన్నది సోనియా గాంధీ పాలసీ.

"ప్రజలు మెచ్చిన రోజే
పవరు వస్తుంది
గద్దెపై నుంచి
తిట్టిపోదురుగాక
నాకేటి వెరపు"

అని భీష్మించుకు కూర్చుందని చెప్తారు. ఇది కృష్ణశాస్త్రి కృష్ణపక్షంలోని పలుకులకు పేరడీ... అవి.

దిగిరాను దిగిరాను
దివి నుంచి భువికి
నవ్విపోదురుగాక
నాకేటి సిగ్గు అనే గీత భాగానికి పేరడీ... అనేది స్పష్టం.

అశోక్ సింఘాల్ :

విశ్వహిందూ పరిషత్ ప్రధాన కార్యదర్శి అశోక్ సింఘాల్ ఎలాగైనా బి.జె.పి.ని. అధికారంలోకి తీసుకు రావడానికి ప్రయత్నాలు చేశాడు. ఆ క్రమంలో విజయ దశమి, దీపావళి వరకు ద్వితీయ ఏకాత్మ యాత్రలు చేయాలని సంకల్పించాడు. నరసింహుడ్ని దింపేసి వాన నరేంద్రుడి వారసులను తీసుకురావాలనే కృత నిశ్చయంతో ఆయుధపు పూజ చేసి యాత్రకు పూనుకున్నాడు. దాని గురించి శంకరనారాయణ వ్యంగ్యంగా ఎలా చెప్పాడో చూడండి...

'ఏకాత్మత రథచక్రాల్
వస్తున్నాయ్ ఒస్తున్నాయ్
ఏడవకండేడవకండి
అధికారం అందిరాక
ఏడవకండేడవకండి'

అంటూ ఏక్ సింఘాల్ చెప్పింది. శ్రీశ్రీ మహా ప్రస్థానంలో జగన్నాథ రథచక్రాల్ గేయంలో

'జగన్నాథ జగన్నాథ
జగన్నాథ రథ చక్రా

లొన్తున్నాయొన్తున్నాయి' అనేదానికి పేరడీగా కన్పిస్తుంది.

పాట మొత్తాన్ని పేరడీ చేయకుండా పల్లవినో, కొన్ని చరణాలనో అనుకరించి దానిని రాజకీయ అర్థంలో చెప్పడం శంకరనారాయణలోని విశేషం. ఈ విధంగా చెప్పుకుంటూ పోతే అనేక విషయాలను శంకరనారాయణ తమ వ్యాసపరంపరల్లో వెల్లడిస్తారు.

రాజకీయ నాయకుల పేర్లను మార్చడంలో శంకర నారాయణ దిట్ట. ఫన్‌గన్ నిండా ఇలాంటి పేర్లు కన్పి స్తాయి. ఇంత విస్తృతంగా నామకరణం చేసిన రచయిత మరొకరు లేరంటే అతిశయోక్తికాదు. అయితే ఆయన కేవలం నామకరణాలు మాత్రమే చేయలేదు. వాటికి సంబంధించిన రాజకీయ పరమైన విషయాలను కూడా అక్కడ వ్యక్తం చేయడం విశేషం. శంకరనారాయణ బాషాపరమైన శైలీ విన్యాసాలలో ఇది ఒక మచ్చు తునక. ఆంధ్రప్రదేశ్‌లోని నాయకుల నుండి ప్రపంచంలోని ప్రముఖుల వరకు ఆయన బారిన పడని నాయకులు లేరంటే ఆయన ఎంతగా రచనల్లో పేర్లను మార్చారో తెలుస్తుంది. ఇది ఆయన భాషా, రాజకీయ క్రీడ అని కూడా మనం చెప్పవచ్చు. ఇలా పేర్లను మార్చడంలో ఆయనకు ఎలాంటి భయాలు లేవు. కేవలం భాషా పరమైన వినోదాలేతప్ప ఆయన ఎలాంటి అపశృతులు రాయలేదనడానికి ఆయన పేర్లు మార్పిడి ప్రక్రియను గమనిస్తే మనకు తెలుస్తుంది.

ఆయన ఉటంకించిన పేర్లను గమనిద్దాం.... శంకర నారాయణ చేతిలో వాజ్‌పేయ్ 'వ్యాజ' పేయి, వాజ్‌పే'యి, 'మోజు' పేయి, ... అని ఇక ఎల్‌కె అద్వానీని రధ్వాణి, ద్వంద్వాణి, నిల్.కె. అద్వానీ అని ఇక పి.వి. నరసింహా రావును పి 'విజయుడు', పి. వినమ్రనరసింహారావు, సోనియాగాంధీని సో'నై' గాంధీ, 'షో'నియాగాంధీ అని... ఎన్.టి. రామారావును తారక 'భ్రమ'రావు అని వై.యస్. రాజశేఖరరెడ్డిని 'రోజ్' శేకరరెడ్డి, పయ్యస్ రాజకీయ శేఖర్‌రెడ్డి, 'ధ్వజ' శేఖరరెడ్డి, 'తాజా' శేఖరరెడ్డి, 'నైఎస్' రాజశేఖరరెడ్డి, ఇలా పలుపేర్లతో నారా చంద్రబాబు నాయుడును 'చంద్ర'బాబు, 'అర్ధచంద్ర'బాబు, 'కేంద్ర' బాబు, 'ఆంధ్ర' బాబు, 'నిషేద' చంద్రుడు, ఆనాటికే ఆయన తరచూ విదేశాలకు వెళ్ళేవాడు కాబట్టి వి'దేశ' చంద్రుడు, 'బంగారు' బాబు అని ఆయన ప్రముఖులను ప్రస్తావించారు.

జాతీయ నాయకులలో విశ్వనాథ్ ప్రతాప్‌సింగ్‌ను వేదాంత ప్రతాపసింగ్, లాలూ ప్రసాద్ యాదవ్‌ను 'డాలు' ప్రసాద్ యాదవ్, ఐకె. గుజ్రాల్‌ను హైకె. గుజ్రాల్, జ్యోతిబసును జ్యోతి 'బ్రేష్' అని జార్జ్ పెర్నాండెజ్‌ను 'ఫైర్' నాండెజ్ అని, దేవగౌడను భావగౌడ అని రామకృష్ణ హెగ్డేను సినిమా కృష్ణ హెగ్డే, వెంకయ్య నాయుడును 'జన'కయ్య నాయుడు అని జయలలితను 'నై'లలిత అని కాన్షీరామ్‌ను ఛాన్సీరామ్ అని సుష్మా స్వరాజ్‌ను చరిష్మా స్వరాజ్, నూక్ష్మ స్వరాజ్ అని ములాయం సింగ్ యాదవ్‌ను మల్లా గుల్లాయం సింగ్, ఉమాభారతిని ఉద్యమ భారతి అని ఉపేంద్రను ఉపాయేంద్ర అని అమెరికా అధ్యక్షులు బిల్ క్లింటన్‌ను బిల్లు క్లింటన్, జార్జి బుష్‌ను జార్జి బుష, ఆంధ్రప్రదేశ్ నాయకులు కోట్ల విజయభాస్కరరెడ్డిని, పోట్ల విజయభాస్కరరెడ్డి, సీట్ల విజయభాస్కరరెడ్డి, గాలి ముద్దు కృష్ణమనాయుడును గోలీ ముద్దు కృష్ణమనాయుడు అని రేణుకాచౌదరిని రణ్‌కా చౌదరి అని కోడెల శివ ప్రసాదరావును కీడెల శివ ప్రసాదరావు అని మైసూరారెడ్డిని మయసూరారెడ్డి అని మోహన్‌బాబును మోహన్ బాకు అని బాబూ మోహన్‌ను బాబు మోసం అంటూ మార్చిపారేశారు.

శంకరనారాయణ తన హాస్య రసస్ఫోరకమైన రచన లతో సమకాలీన రాజకీయ పరిణామాలను కళ్ళకు కట్టినట్లు చెప్పడం మాత్రమే కాకుండా తరచి చూస్తే రాజకీయ నాయకుల పేర్లను కూడా వారి జీవితంలో జరిగిన సంఘటనల ఆధారంగా మార్చి చెప్పడం అదీ హాస్యం ఉట్టిపడేట్లుగా చెప్పగలగడం గొప్ప విషయం,

ఫన్‌గన్‌లో సమకాలీన రాజకీయ చరిత్రకు అద్దం పట్టారని చెప్పవచ్చు. రాజకీయ పరమైన విశేషాలను భాషా చమత్కారాలతో చెప్పడం ఇందులో స్పష్టంగా కన్పిస్తుంది.

రకరకాల శబ్ద చతురతతో రాజకీయ నాయకులను శంకరనారాయణలాగా వారి పేర్లను వాడుకున్న వారు, వాటితో ఆడుకున్న వారు ఇంకొకరు లేరు. ఇది ఫన్‌గన్ రాజకీయ వ్యంగ్యాస్త్రముల సమూహం. తెలుగు సాహిత్య చరిత్రలో ఈ విధంగా హాస్యాన్ని జోడించి రాయడమే కాకుండా సమకాలీన రాజకీయ నాయకులను తూర్పారా బట్టడం కూడా ఇందులో కన్పిస్తుంది. ఈ విధంగా శంకర నారాయణ రాజకీయ హాస్యాన్ని పండించడంతో తెలుగు సాహిత్యరంగంలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నా రనవచ్చు.

హాస్యావధాని శంకరనారాయణ ప్రసంగాలు కూడా ఎంతో ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఆయన చేసిన ప్రసంగాలను తన అప్రస్తుత ప్రసంగాలు గ్రంథంగా ప్రకటించారు. అప్రస్తుత ప్రసంగాలు కూడా హాస్య భరితంగా ఉంటాయి. వాటిలో కొన్నిటిని చూద్దాం...

వ... సంత! అనే అప్రస్తుత ప్రసంగంలో ఆయన ఇలా అంటారు... కట్టుకున్న పెళ్ళాన్ని మీరు.. గారు అని పిలవక పోయినా కనీసం పూర్తి పేరుతో పిలిచినా 'పంచె' మహా పాతకాలు మగాణ్ణి అంటుకుంటాయి అంటారాయన. అందుకనే పుణ్యపురుషులు పెళ్లాం పేరులోని ముందరి రెండు అక్షరాలనో లేక చివరి రెండు అక్షరాలనో కలిపి పెత్తనం తమ చేతుల్లోనే కాదు తమ మూతుల్లోనూ ఉందని సంతృప్తి పడుతుంటారు. అటువంటి మహా పురుషుల్లో నా ఫ్రెండ్ ఒకరు పత్రికా స్వేచ్ఛ ఉందికదాని పేరు చెబితే ఆయనకు కోపం వస్తుంది కాబట్టి చెప్పను అంటారు శంకరనారాయణ. ఆ మహానుభావుని భార్య పేరు వసంత. ఇల్లాలిని పూర్తి పేరుతో పిలిస్తే కాపురుష సూక్తం ఒప్పుకోదు కాబట్టి ఆయన భార్య పేరును కట్ చేశాడు. ఆమె పేరు వసంత అయితే సంత, సంత అని పిలవడం మొదలుపెట్టాడు. భార్యను సంత.. సంత అని పిలవడం అందరికీ వింత అనిపించినా ఆ పెద్ద మనిషిని కుట్టడానికి చీమలు కూడా క్యూకట్టలేదు. వసంతగానం చేయవలసినవాడు సంతగానం చేస్తే ఏమనుకోవాలి... తల ఏ గోడకేసి కొట్టుకోవాలి అంటారు శంకరనారాయణ.

శంకరనారాయణ రచించిన పలు గ్రంథాలలో కూడా హాస్యం ధ్వనిస్తుంది. 'ఫన్ పరాగ్' శంకరనారాయణ రచనలో ఒక గ్రంథం. దీనిలోని కొన్ని విషయాలను వివ రిస్తాను. శంకరనారాయణ రచనలో విరుపులు ఎలా ఉంటాయో ఈ రచనలో మనకు స్పష్టంగా తెలుస్తుంది. ఉదాహరణకు మొదట్లోనే ఎలా చెబుతారో చూడండి.

కరెంటు వారికి మించిన సినీ దర్శకులు లేరు. కట్ వారికి వైర్లతో పెట్టిన విద్య అంటారు. గతం రాతియుగం... ప్రస్తుతం నాతి యుగం... నాటు వైద్యులు నాట్ వైద్యుల్... అల్లుళ్ళూ కొడుకులూ లేనివాడే ఆదర్శనాయకుడు. కాముడన్న పేరేగాని కామ్‌గా ఉండడు. ఉండనీడు.

అన్నం పున్నెం ఎరుగని వారు అభాగ్యులు. అందరూ చెయ్యి జూపేది హస్త సాముద్రికుడి దగ్గరే! 'అట్ట' హాసం లేకుంటే పుస్తకాలు అమ్ముడు పోతాయా? అర్థం కానిది ప్రాచీన కవిత్వం. అర్థం లేనిది ఆధునిక కవిత్వం. హిట్ లిస్టులో పడితే నేతలకు భయం, నిర్మాతలకు ఆనందం.

లాయర్లకు అవసరం లయ్యర్లు, పొరుగింటి 'పిల్ల' కూర రుచి, భార్య 'శారీ' అంటే భర్త 'సారీ' అంటాడు. 'వల్లకాడు' తప్పించుకోవడం 'వల్లకాదు'.

కూడు కూడు అనడమే మన మైనస్ పాయింట్. అందితే జుట్టు అందకపోతే జుట్టు ఇది కొందరు క్రికెటర్లు గేమ్! కారుషెడ్డు 'కారా' గారం !సైజు తగ్గడానికి ఎక్సర్ సైజు.

టిప్‌టాప్‌గా ఉండాలంటారు సర్వర్లు. 'నల్లా'లొచ్చాక 'వెల్' విషర్లు కరువయ్యారు. పెన్నుకు పెత్తనమిస్తే ఇంకి పోవడం ఖాయం. తలనయినా నేతలనయినా దువ్వక పోతే చిక్కులే. పోలీసు గన్ మ్యాన్, పొలిటీషియన్ స్లోగన్

మ్యాన్. కొన్ని పత్రికలది 'కసిధారావ్రతం'. కొర్రీతో తలగోక్కుంటాయి ఫైళ్లు. బీరువాలో బీరు భద్రం.

కండక్టర్ల 'కస్సు బుస్సులు' ప్రయాణీకులకే! పని లేకున్నా 'పనిష్మెంటే, దివాలీ తర్వాత దివాలా! మని యార్డర్ 'ఇమ్మని ఆర్డర్', వరుడు ప్రవరుడు కావాలని వధువు ఆకాంక్ష!, బుడ్డి మంతుడికి పిల్లనివ్వరు! చెత్త వీధి వైపరీత్యం అభ్యాసం 'కాసు' విద్య 'అన్నా'థరైజ్డ్ లీడర్లు తెలుగుదేశం నాయకులు. 'సారాం'శం తెలిసిన వారే 'మద్య'వర్తులు. ఏలినవారి శని ఐదేళ్లు. రిజర్వేషన్లతో పాటు డిజర్వేషన్లూ ఉండాలి! బూతులు వినడానికి, చూడడానికి లైసెన్సు ఉన్నవారు సెన్సారు వారే! ప్రియురాలు వేసేది 'మొహమాటం' బాంబు! చీరెలకు ముఖ్యం 'ఫాల్స్ ప్రిస్టేజ్'.

ఇలా చెప్పుకుంటూ పోతే ప్రతి పేజీలో ఇలాంటి ఫన్ డైలాగులు కన్పిస్తాయి. ఫన్ పరాగ్‌లో శంకరనారాయణ రచనలో అనేక పదవిన్యాసాలు కన్పిస్తాయి. మరికొన్ని ముఖ్యమైన పదాలను కూడా చూద్దాం. అంతేగాక ఈ పుస్తకంలోని శీర్షిక వాక్యాలు కూడా అద్భుతమైన పదాలను కలిగి, శంకరనారాయణ రచనాచాతుర్యాన్ని తెలుపుతాయి.

'గుడ్లప్పగించి' చూడడం పొల్టీలకు సహజం! ప్రభుత్వాలు చేసేది రుణాల మాఫీ నాయకులు చేసేది దారుణాల మాఫీ! గాలి కబుర్లు చెబుతున్నది వాతావరణ శాఖ! కుంభకర్ణుడివి 'పక్క' చూపులు ! మతకలహాల్లో 'ఖూనీ' రాగాలు, డాక్టర్లకూ రోగులకూ బాధరాయణ సంబంధం, ఈశ్వరుడికి హిమాలయాలు అత్తవారి 'హిల్లు', 'పొర'బడడం కళ్లకు సహజం. పతి నుంచి సతి కోరుకునేది సిం'పతి', ఇన్‌షర్టు చేయడమూ 'టక్కు' టమార విద్యే! అరబ్ షేకులు ఇం'ధనవంతులు', పళ్లు రాలగొట్టినా కేసులేనిది దంత వైద్యులకే!, బోర్లకోసం 'రిగ్గింగు' తప్పదు, బ్రహ్మదేవుడూ 'గీత' కార్మికుడే! కుళాయిల కొట్లాట పానీ పట్టు యుద్ధం, శారీ హౌస్‌కు స్త్రీలు 'చీర' పరిచితులే! కామెర్లు ఉన్నా లేకున్నా పచ్చగా కన్పించేది తెలుగుదేశం వారికే!

పాదరక్షల వ్యాపారంలో అన్నీ 'చెప్పు'డు మాటలే! డెయిరీ వారిది చిక్కని 'పాల'సీ!, నీరు పల్లమెరుగు ఈగ బెల్లమెరుగు!, హోటళ్లలో ఇడ్లీకి 'వడ' దెబ్బ, ఇపుడు 'యతుల' దర్శనం ఛందస్సులోనే, యూనివర్శిటీ డీనులు గొడవలొస్తే దీనులు, క్షణ క్షణముల్ గడియార చిత్తముల్, ఓన్ హౌసుల్లో చాలా మటుకు లోన్ హౌసులే, రైతులంతా 'ఎవర్ గ్రెయిన్ హీరోలు', 'మెల్ల'గా వస్తే కంటికి నచ్చదు, రోడ్డెక్కితే ఎవడయినా 'లెఫ్టిస్టే', పు'కారుకు' ప్రతివాడూ డ్రయివరే, బట్ట బయలు చేస్తేనే వస్త్ర వ్యాపారం.

చమక్కులు :

శంకరనారాయణ రచించిన పుస్తకాలలో అనేకం హాస్య రసస్ఫోరకంగా ఉంటాయి. అయన రచించిన పుస్తకాలలో మరొక పుస్తకాన్ని చూద్దాం.. అది 'చమక్కులు' అనేది. దీనిలో అనేక వ్యాసాలు ఉన్నాయి. ఆయన రాసిన ఈ వ్యాసాలు కూడా హాస్యాన్ని జోడించడం గమనించవలసిన అవసరం ఉంది. చమక్కులులో సుమారు 60 వ్యాసాలకు పైగా ఉన్నాయి.

చమక్కులు గ్రంథంలో వ్యాసాలలో కొన్నింటిని చూద్దాం. ముక్తికాంతాదాసులు అనే శీర్షికతో రాసిన వ్యాసంలో ఎంతవారలైనా కాంతాదాసులే అన్న త్యాగయ్య కాంతాదాసుడై ఆ మాట అనలేదు. ముక్తి కాంతాదాసుడై అన్నాడు. 'కాయల్ కాచె వధూ నఖాగ్రములచే కాయంబు' అని అష్టదిగ్గజాల్లో ఒకడైన ధూర్జటి ఎప్పుడో చెప్పాడు. 'కామిగాక మోక్షగామి కాడు' అని మన వేమన మనం పుట్టక ముందే కుండబద్దలు కొట్టేశాడు. యావత్ ప్రపంచంలోనే అత్యధిక అధికారాలు ఉన్న అమెరికా అధ్యక్ష పీఠమెక్కిన క్లింటన్ కూడా ముక్తికాంత వైపు దృష్టి సారించాడు. మోనికా లెవెనెస్కీ ఉదంతం కారణంగా తాను ఆధ్యాత్మికం వైపు మళ్ళిపోతున్నానని ఆయన అన్నాడు. ఇదొక తరహాఐతే భార్య గయ్యాళి అయి వేదాంతులైన వారు ఈ ప్రపంచంలో ఎక్కడబడితే అక్కడ తగులుతారు. దానికి ఉదాహరణ సోక్రటీస్. సోక్రటీస్ తన శిష్యుడొకతరికి పెళ్ళి చేసుకోమని సలహా యిస్తాడు. "గురువుగారూ! మీ

పరిస్థితి చూస్తూనే ఉన్నాను కదా, నన్ను కూడా పెళ్లి చేసుకోమంటారా? " అని అడుగుతాడు. దానికి సోక్రటీసు అతనికి సలహాయిస్తూ.. ఇలా అన్నాడు. "భార్య అనుకూలవతి అయితే గొప్ప భోగివవుతావు. అనుకూలవతి కాకపోతే గొప్ప వేదాంతివి అవుతావు ఎలాగైనా నీకు మేలే కదా!" అన్నాడు.

తాత్విక చింతన అనేది పొద్దువాలిన వారందరికీ ఉపయోగం అనుకుంటే పొరపాటే. 'పురుషులందు పుణ్య పురుషులు వేరయా' అన్నట్టు చిన్న వయసులో కూడా భగవంతుని మీద దృష్టి లగ్నం చేసినవారు ఉన్నారు. ఉదాహరణకు ప్రహ్లాదుడి సంగతి చూడండి... అని మొదటి వ్యాసంలో చెప్పారు శంకరనారాయణ.

మరొక వ్యాసం శీర్షిక.... 'ఎంతవారలైనా షికారుదాసులే' అనేది. కారులో షికారుకెళ్లాలని ఎవరికైనా ఉంటుంది. షికారు అంటే షికారు ఉండాలని పూర్వం అనేవారు. కాలినడకలో కూడా షికారు వుంది. జీవితం ఆ షికారుతో ముడిపడి ఉండి. మూడు ముళ్లు పడి ఉంది. 'సఖ్యం సాప్తదీనం' అని పెద్దలు చెబుతారు. హిందూ సాంప్రదాయంలో వధూవరులు కలిసి ఏడడుగులు వేస్తే తప్ప పెళ్లిగా అంగీకరించరు. టూరు లేని జీవితం బోరు అనిపిస్తుంది. ఈ సమస్య నుండి తప్పించడానికి సేదతీరి ఉల్లాసపరచడానికి షికారు అవసరం ఉంది. ఈ పరిస్థితుల్లో 'ఎంతవారలైనా షికారు దాసులే' అనిపిస్తుంది. చాలామంది ఎంత బిజీగా వున్నప్పటికీ పనుల్లో బిజీగా ఉన్నాం. షికారుకు కాల్షీట్లు ఇవ్వలేమనేవారు కొందరు రాజకీయ నాయకులు షికారుకు వెళ్తుంటారు. వారిని చూసి నేర్చుకోవలసిన అవసరం ఉందని చెబుతారు శంకరనారాయణ.

భోజనం తర్వాత ఒక మైలుదూరం షికారు చెయ్యమని ఇంగ్లీషువాడు ఆరోగ్య రహస్యం చెప్పాడు. అయితే బాగా షికారు కొట్టేవారిని 'టింగురంగా' అంటూ తిరుగుతున్నా డంటారు. ఈ విషయంలో ఒక సామెతను గుర్తు చేస్తారు శంకరనారాయణ. మగాడు తిరక్క చెడ్డాడని ఇది మగాడు చెప్పిన మాట. అంతమటుకు మాత్రమే అక్షర సత్యం.

'తిరగనివాడజ్ఞుండగు' అన్న మాట తిరుగు అన్న మాటే. షికారు అధిష్టాన దేవతలు ప్రేమికులేననడంలో సందేహం లేదు. అయితే ప్రేమ వికటించినప్పుడు షికారు చీకట్లు కమ్ముకుంటాయి. షికారు అంటే ప్రకృతితో మమేకం కావడమే అని తేల్చి చెబుతారు శంకరనారాయణ. చివరికి షికారు అనే మాటను వదులుకోవడమంటే మనల్ని మనం వదలేసుకోవడమే అంటారు.

'గాడిద'ప్పిన మనిషి అనే శీర్షికతో రచించిన ఒక వ్యాసంలో మనిషి దుర్మార్గానికి అంతు పొంతు లేకుండా పోతుంది. గాడిదను మరీ గాడిదను చేసేస్తున్నాడు. పూర్వం మానవులు మానవబాంబులు తయారు చేసే వారు. ఇప్పుడు గాడిద బాంబులు తయారు చేస్తున్నారు. అమధ్యనొక గాడిదను బి.ఎన్.ఎఫ్. జవానులమీదకి బాంబులు కట్టి పంపించాడట ఒక బెర్రరిస్టు.

ప్రపంచంలో గాడిదను మించిన కష్టజీవి మరొకటి ఉండదు. గాడిద మీదే కాదు శ్రమ మీద కూడా మనకు చిన్న చూపే కనుక 'గాడిద చాకిరీ' అనే మాట సృష్టించి రెండింటినీ అవమానిస్తుంటారు. చివరికి కొందరు గాడిదను కళారంగంలోకి లాగి అవమానం చేయడం మనిషి దుర్మార్గానికి పరాకాష్ట. ఎవరన్నా కర్ణకఠోరంగా పాడితే 'నీపాట వినడానికి గాడిదలు వస్తున్నాయ'ంటారు. గాడిదలు వినే పాటలను చూసి జనం నవ్వుకుంటారని అంటారు గదా!

అయితే శంకరనారాయణ మరొక విషయాన్ని చెపు తారు... గాడిదకు ప్రాథమిక హక్కులు లేకుండా పోయా యట! కనీసం నోరు తెరిచి స్వేచ్ఛగా పాడుకునే హక్కు కూడా లేకుండా పోయింది. శ్రీనాథుడు మహాకవి కదా అయన అన్నాడట... ఒకసారి గాడిద, ఒంటె ఎదురు పడ్డాయట. అప్పుడు 'సంగీతానికి నేను, సౌందర్యానికి నీవు' అని గాడిద ఒంటెతో అన్నదని అన్నాడు. గాడిదకు గొప్ప ఘన చరిత్ర ఉందని మనం విస్మరిస్తూ ఉంటాం అంటారు శంకరనారాయణ. కృష్ణ పరమాత్ముని తండ్రి వసుదేవుడు కూడా ఒక సందర్భంలో గాడిద కాళ్లు

పట్టుకుని పాడకుమా గార్ధభమా! అని ప్రాధేయపడ్డాడట. మనిషి బరువుకంటే ఎక్కువ బరువును మోస్తూ మనకు సేవ చేసే గాడిదను రకరకాలుగా అవమానించి, ఆట పట్టించే కుసంస్కారం మనిషిది.

'సిగ్గే సింగారం' అనే శీర్షికతో రాసిన ఒక వ్యాసం చూడండి... స్త్రీలకు సిగ్గు ముఖ్యమంటారు. ఆ సిగ్గే సింగారం అని ఒక నానుడి. బంగారమైనా సింగారమైనా సిగ్గు కొన్ని సార్లు ఒంటరిగా ఉండడానికి సిగ్గు పడుతుంది. సిగ్గు ఎగ్గును తోడు తెచ్చుకుంటుంది. సిగ్గు ఎగ్గు జంట పదాలై పెదవులపై తాండవమాడతాయి. నీకు సిగ్గూ శరం లేదా అని అంటారు. సిగ్గు వేసే బాణానికి కూడా తిరుగులేదు. సిగ్గును గుర్తుపట్టడానికి మనం వేసుకునే లేదా వేసుకోని డ్రస్సు ఉపయోగపడుతుంది. సిగ్గూకు, దుస్తులకూ మధ్య అన్వీచనీయమైన మైత్రి ఉంది. సిగ్గు విషయంలో కూడా కొన్ని పరిమితులున్నాయి. పెళ్లి చూపుల్లో సిగ్గుల మొగ్గయింది అంటారు కదా! ఆ తర్వాత జీవితంలో ప్రతి సిగ్గులోనూ సిగ్గు పడమంటే ఒకొక్కసారి బెడిసి కొట్టి మగరాయుడిలాగా సిగ్గే పోతుంది. అంతేగాక ప్రేమ వ్యవహారాల్లో కూడా సిగ్గు పాత్ర ఉంటుంది. సిగ్గు అందాన్ని పెంచుతుంది. సిగ్గు గలవాడు అంటే పరువుగల మనిషి అని అర్థం. సిగ్గు పోకుండా ఉండాలనే దానికోసం అతను ఎంతైనా ఇష్టపడతాడు. ఒక ముక్కలో చెప్పాలంటే సిగ్గు మన సంస్కృతి.

సిగ్గు పడడం కేవలం ఆడవాళ్ల పెటెంటు హక్కు అనుకుంటే పొరపాటే. కొమ్ములు తిరిగే మగరాయుళ్లలోనూ సిగ్గుపడేవాళ్లు ఉన్నారు. సిగ్గు పడడం వేరు సిగ్గు లేకపోవడం వేరు. సిగ్గు లేకుండా తినమంటే కంచాన్ని పక్కన పారేసి అన్నవాడిని తినేస్తాడు.

మరొక వ్యాసం 'గుణం తక్కువ గురువులు' అనే శీర్షికతో రాసిన వ్యాసం. గురి వుంటే గురువు అవసరం లేదు. గురి లేకపోతే గురువు ఉన్నా ప్రయోజనం లేదు. ఈనాటి ఓపెన్ యూనివర్శిటీలకు స్ఫూర్తి ఏకలవ్యుడే. ఏకలవ్యుడు గురువుకాని గురువు ద్రోణాచార్యుని కోసం వేలు పోగొట్టుకన్నాడు. ఈ నాటి శిష్యులు వేలూ లక్షలూ పోగొట్టుకుంటున్నా ద్రోణాచార్యులవంటి గురువులు దొరకడం లేదు. అర్జునుడిలాంటి శిష్యులూ రావడం లేదు. పరమానందయ్య శిష్యులకు మాత్రం లోటు లేదు.

గురు శిష్యుల్లో తక్కువ తిన్నవారెవరూ లేరు. దొందూ దొందే అనిపించుకోగల ప్రజ్ఞావంతులే. గురు శిష్యులు ఒకచోటికి విందుకు వెళ్లారట. త్రేన్పులు తీస్తూ బయటకు వచ్చారు. కింద తన చెప్పులు ఎక్కడున్నాయో చూడు'' అని శిష్యుని పురమాయించాడు. శిష్యుడు ఆకాశంలోకి చూసి గురువుగారూ మీ చెప్పులెక్కడా కనబడడంలే'' దన్నాడు. ఆకాశంలోకి చూస్తావేంట్రా బడుద్ధాయీ' అన్నాడు గురువు. 'తక్కువ తిన్నదెవరు గురువా' అన్నాడు శిష్యుడు. ఈ విధంగా చమత్కారంగా గిరుశిష్యులకు సంబంధించిన కథ చెప్తారు శంకరనారాయణ.

చివరగా ఒకప్పుడు గురుకులాలుండేవి. ఇప్పుడు గురువులు తగ్గి కులాలు మాత్రం పెరిగిపోయాయి. అప్పుడు గురువుగారు తిండి పెట్టి చదివించేవారు. అందువల్ల భయం భక్తి వుండేది. ఇప్పుడు శిష్యులు ఫీజులు కట్టి గురువులను పోషిస్తున్నారు. అందువల్ల శిష్యులు గురువులపు లెక్క పెట్టడం లేదు.

'టోపీ' చిరాయువు అనే శీర్షికతో మరొక వ్యాసం రచించారు. సాధారణంగా అందరూ పాపీ చిరాయువు అని అంటారు. కానీ శంకరనారాయణ టోపీ చిరాయువు అంటున్నారు. టోపీ పెట్టడం వేరు, టోపీ పెట్టుకోవడం వేరు. మనకు స్వాతంత్ర్యం వచ్చిందంటే దానికి కారణం టోపీ పెట్టుకోవడమే అంటారు శంకరనారాయణ. అలా సిద్ధించిన స్వాత్యంత్ర్యం అందవలసిన వారికి అందక పోవడానికి కారణం టోపీ పెట్టడం కారణం. ఈ రోజుల్లో ఇంగ్లీషు వాడికి టోపీకి విడదీయరాని సంబంధం ఉంది. టోపీ నమ్మిన వారికి ఏమైనా చేయగలదు. టోపీ పెట్టాలంటే ఎదుటివాడు గురువైనా అయి ఉండాలి. కనీసం బంధుమిత్ర సపరివార సమేతంలోనయినా ఉండాలి. లేకపోతే టోపీ పెట్టడానికి వారి తల సైజు

తెలియక తలతిక్క వస్తుంది. పైకి కన్పించే టోపీ వేరు దాని ఆత్మ వేరు అంటారు శంకరనారాయణ.

టోపీ తలకు రక్షణ కల్పించడమే కాదు, బుర్రలో తిరిగే పురుగులకు కూడా రక్షణ కల్పిస్తుంది. టోపీ బాధితుడికి నెత్తి మీద టోపీ కనిపించదు. అతను నెత్తి మీద గుడ్డ వేసుకొని తిరుగుతున్నాననుకుంటాడు. నీ జన్మమిక దుర్లభమురా అని చెవుల్లో అన్నట్లుంటుంది. ఎవరు వేశారు టోపీ అని కోపి అవుతాడు. అందుకే ఎల్లకాలం టోపీ వేయడం కల్ల.

'జేబులో హృదయం' అనే శీర్షికతో రాసిన ఒక వ్యాసంలో ఏవిధంగా చెబుతారో చూడండి... అయ్యయ్యో జేబులు ఖాళీ అయనే' అని మనం బాధపడతాం. కానీ మన కోరికలు తీరాయి కదా అని సంతోషించం. జేబు ఉన్నది మన కోరికలు తీర్చడానికే. అందుకనే జేబు హృదయానికి తగ్గరగా ఉంటుంది. మనకి బాగా సన్ని హితుడైన వాడిని 'జేబులో మనిషి' అంటాం. మన స్వార్థానికి జేబు నష్టపోతూ ఉంటుంది. దొంగతనం చేసేది డబ్బు కొంచెమైనా జేబు కత్తిరిస్తారు. వారిని జేబుదొంగ లంటారు తప్ప డబ్బు దొంగలనరు. అదే జేబు కర్మ విశేషం.

'జేబులో బొమ్మ' అనే పాటను విన్నారా, అంటే జేబులో ఉన్న డబ్బు అని... ఆ పాట విని పరవశించిపోతూ ఉంటారు. మనకు ఎప్పటికప్పుడు ఉపయోగపడే డబ్బును గురించి జేబులో బొమ్మ అంటూ పాడుకోవడం మనిషికి అలవాటు. జేబు మనిషికి మినీ బ్యాంక్ అంటారు శంకరనారాయణ. మనిషి సౌండ్ పార్టీనో కాదో జేబులు తేల్చేస్తాయి. అసలు మనిషికి ఇంత స్వార్థం ఉండడానికి కారణం జేబులు ఉండడమే. తన జేబులు నింపుకోవడానికే మనిషి నానా అక్రమాలూ చేస్తాడు. కొందరు 'నీ జేబులో చెయ్యి పెడతా, నా నోట్లో వేలు పెడతావా' అని అడిగేవారు ఉంటారు. దరిద్రుడినుండి దాల్మియా వరకు తన జేబుకు చిల్లి పడుతుందని భయపడుతూ ఉంటారు.

మనిషి హావభావాలను జేబులను చూసి చెప్పొచ్చు, మనిషి రెండు చేతులూ రెండు ప్యాంట్ జేబుల్లో పెట్టుకుని ఉన్నాడంటే దర్జాగా ఉన్నట్లే. అయినా జేబులు మనిషికి అడుగడుగునా పరీక్షలు పెడుతూ ఉంటాయి. విద్యార్థులు పరీక్ష హాల్లోకి అడుగు పెడితే చాలు వారి జేబులను తనిఖీ చేస్తారు. ఉద్యోగులు రెండు రకాలు. జాబు శాటిస్ఫాక్షన్ కోసం కొందరు పనిచేస్తే, జేబు శాటిస్ఫాక్షన్ కోసం కొందరు పనిచేస్తారు. ఎంత చెట్టుకు అంతగాలి అని ఇప్పుడు ఎవ్వరూ ఆలోచించట్లేదు. ఎంత జాబుకు అంత జేబు అన్న విషయాన్నే అంతా ఆలోచిస్తున్నారు. డబ్బు డాబు తెలియడానికి జేబు డాబును పరిశీలిస్తే చాలు. 'అగ్ని' పరీక్ష అనే శీర్షికతో శంకరనారాయణ ఒక వ్యాసం చూడండి. మనిషి పుట్టింది మొదలు చచ్చిపోయే వరకు అడుగడుగునా పరీక్షలే. ఈ పరీక్షలన్నింటిలోకి అగ్ని పరీక్ష గొప్పది. గుడిసెల్లో తలదాచుకునే అభాగ్యులకు ఎప్పుడూ అగ్ని పరీక్షలే.

దిక్కూ మొక్కూ లేనివారిని భయపెట్టే అగ్ని దేవుడికి మాత్రం ఓ దిక్కు ఉంది. అది ఆగ్నేయం అంటారు. అగ్ని మనదారిలోకి వచ్చినా కష్టమే. మనం అగ్నిదారిలోకి వెళ్ళినా కష్టమే. అగ్నిదేవుడికి సంతానం ఉందో లేదో తెలీదు కానీ భార్య మాత్రం ఉంది. ఆమె పేరు స్వాహా దేవి. అక్రమంగా డబ్బు మింగడాన్ని స్వాహా అంటారు.

ఈ రోజుల్లో కూడా నిత్యాగ్ని హోత్రులకు కొదవలేదు. ఆచారాల పొగగిట్టని వారు కూడా 'పొగతాగని వాడు దున్నపోతై పుట్టున్' అంటూ నిత్యం సిగరెట్టో చుట్టో వెలిగిస్తూ, తాము నిత్యాగ్ని హోత్రులమేనని పల్లి కిలిస్తుంటారు. మనకు స్వాతంత్ర్యం అగ్ని పాత్ర కూడా ఉంది. ఎలాగంటే విదేశీ వస్త్ర దహనం ఉధృతంగా కొనసాగింది. అన్నింటినీ దహనం చేసే అగ్నికి కూడా శత్రువులున్నారు. నీరు దానిని ఆర్పేస్తుంది. ఉప్పు దానితో తగాదా పడుతుంది.

మనిషి కనిపించే మంటలతోనూ కనిపించని మంటలతోనూ దహించుకు పోతుంటాడు. అదెలాగంటే

ఎదుటివాడు పైకి వస్తే మనకు వచ్చేది కడుపుమంట. తిండి దొరక్కపోతే వచ్చేది కడుపులో మంట అని అంటారు శంకరనారాయణ విశ్లేషిస్తూ.

మరొక వ్యాసం 'ఏ త్యాగం మాటున ఏ స్వార్థం దాగెనో?' అనేది దాని శీర్షిక. 'త్యాగం వల్లనే శాంతి లభిస్తుంది. స్వార్థం వల్లనే అశాంతి కలుగుతుంది. త్యాగం వల్లనే మనుషులకు నిజమైన స్వేచ్ఛ లభిస్తుంది. దానికి ఉదాహరణగా మన పెద్దల త్యాగాల వల్లనే మనకు స్వాతంత్ర్యం వచ్చిందన్న మాట మనకు ఎప్పుడూ విని పిస్తుంటుంది. ఈ సందర్భంలో ఈ దేశం మనకేమిచ్చిం దన్నది కాకుండా ఈ దేశానికి మనమేమిచ్చావని ఆలో చించమని హితవు చెబుతారు.

శంకరనారాయణ తన రచనలతో హాస్యపు విందులు కూడా చేస్తుంటారు మరి. మధ్య మధ్యలో సామెతలను కూడా చొప్పిస్తారు. రచనలు మాత్రం చేయి తిరిగిన రచయితలకు ఏమాత్రం తీసిపోనంతగా గుబాళిస్తాయి. పుకార్ల గురించిన ఒక చమక్కును చూడండి. దీని పేరు 'పుకారు చిచ్చు' దంతి కన్నా వదంతి పెద్దది అని ఒక కవి చెప్పాడని చెప్తారు. ఈ సందర్భంలో కూడా నేటి పుకారే రేపటి నిజం అని కూడా అనేవారు ఉన్నారని చెప్తారు శంకరనారాయణ. పుకారు ప్రవేశించని ప్లేసు లేదని అందుకనే దేనికీ భయపడని వారు కూడా పుకార్లకు భయపడడం సహజం. రాజకీయాల్లో పుకార్లకు పదవికి చేటనేది ఉంది. కాబట్టే పుకార్లంటే వారు భయపడతారు. అంతెందుకు భార్యాభర్తల మధ్య వదంతులు వేస్తే చివరికి ఒకరినొకరు వద్దనుకుంటారు.

పుకార్లనే ఒక్కొక్కసారి ఆకాశ రామన్న ఉత్తరాల్లో పురుడు పోసుకుంటాయి. గోడమీద రాతలుగా కూడా వస్తాయి. నిజానికి అనేక మతకలహాలు కూడా పుకార్ల మీద వ్యాప్తి చెందుతాయి. నిజం నిలకడ మీద తేలినా జరగవలసిన నష్టం మాత్రం జరిగిపోతుంది.

పుకార్లు ఈనాటివి కావు. రామాయణ కాలం నాటివి అని చెప్తారు శంకరనారాయణ. నిజానికి పుకార్లే లేకపోతే సీతమ్మకు అన్ని కష్టాలు వచ్చేవే కాదని చెప్తారు. కొంతమంది యువకులు పేర్లకీ పుకార్లకీ నిబద్ధులు అని అంటారు కదా శ్రీశ్రీ మహాకవి. దీనితోనే పుకార్ల కాలుష్యం ముక్కు పుటాలను అదరగొడుతుంది అని వ్యవహరిం చారు శంకరనారాయణ. ఈ విధమైన పలు రచనలను శంకరనారాయణ వివిధ పత్రికలలో రచించారు. హాస్యా నికి చెందిన ఈ రచనలతో శంకరనారాయణ స్థానం సుస్థిరంగా ఉంటుంది.

ఆధార గ్రంథాలు :

1) ఫన్‌గన్ - శంకరనారాయణ
2) అప్రస్తుత ప్రసంగాలు - శంకరనారాయణ
3) ఫన్‌పరాగ్ - శంకరనారాయణ
4) చమక్కులు - శంకరనారాయణ

❁❁❁

BHAVAVEENA
Vol. 17, Issue. 7, July 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

శ్రీనాథుడు పోతనల వ్యక్తిత్వం

– డా॥. వి. పళని, సహాయ ఆచార్యులు, తెలుగు మరియు అనువాద శాఖ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

శ్రీనాథుని సమకాలికుడు పోతన. వీరిద్దరి కవిత్వతత్వ ప్రవృత్తిలోను, జీవన దృక్పథంలోనూ స్పష్టమైన వైవిధ్యం ఉంది.

శ్రీనాథుడు కవి పండితుడు, సమస్త శాస్త్ర విజ్ఞాన సముపేతుడు. పోతన సహజ పాండిత్య సంశోభితుడు. భక్తి భావ లోలుడు. శ్రీనాథుడు ఈశ్వరార్చన కళా శీలుడు. పోతన భాగవత పురాణ ఫల రసాస్వాదన తత్పరుడు. శ్రీనాథుడు బుద్ధి వాది, వివాద కుశలుడు. పోతన హృదయవాది, శాంత స్వభావుడు. శ్రీనాథునిది రాజస ప్రవృత్తి. పోతన పరమ సాత్వికుడు. రాజాస్థానంలో మంత్రులు, సామంతుల తో స్వర్ణ పాత్రల్లో సహపంక్తి భోజనం చేసిన భోగి శ్రీనాథుడు. రాజాశ్రయం తిరస్కరించి నిజ దార సుతోదర పోషణార్థమై హాలికుడైన త్యాగి పోతన. శ్రీనాథుడు వేములవాడ భీమన భంగి నుద్దండ లీల వచియించిన ప్రౌఢ కవి. పోతన భాగవత మందార మకరంద మాధుర్యాన్ని తెలుగు తుమ్మెదలకు రుచి చూపిన భక్త కవి. ఈవిధంగా వీరిద్దరి మధ్య అనేక వైరుధ్యాలు ఉన్నాయి.కొంత విశదంగా పరిశీలిస్తే,

శ్రీనాథుని వ్యక్తిత్వం :

శ్రీనాథుడు ఉద్దండ పండితుడు మాత్రమే కాదు నిర్భీతి, నిజాయితీ కల స్వేచ్ఛా మనస్కుడు. తన యథార్థ వ్యక్తిత్వాన్ని తన రచనలో నిస్సంకోచంగా ప్రకటించే నిర్భీకత, నిజాయితీ ఆయన వ్యక్తిత్వానికి వన్నె పెడు తున్నాయి. శ్రీనాథుడు ఒకశైలిని నిర్మించి తన తదనంతర కవులకు మార్గ దర్శకుడైన యుగకర్త. గొప్ప సారస్వత కీర్తిని ఆర్జించి తన కాలం నాటికే సాహితీ గురు పీఠాన్ని అధిష్టించిన సారస్వతమూర్తి. రాజాస్థానంలో విద్యాధి కారిగా ఉండి నాటి కవుల సామర్థ్యాన్ని పరిశీలించగల ధీశాలి. ఆ కాలంనాటి ఆంధ్ర, కర్ణాటక రాజులతో ఆయనకు బంధం ఉంది. మంత్రులు, అమాత్యులతో మైత్రీ బంధం ఉంది. విస్తృతంగా దేశాటన చేసి లోకాను భవం గడించిన వ్యక్తి. ఆయన వివిధ భాషా ప్రాంతాల్ని దర్శించాడు. వివిధ భాషా పండితులతో పాండిత్య గోష్టి జరిపాడు. శ్రీనాథుని వంటి ప్రజ్ఞాశాలి, శాస్త్ర వైదుష్యం కల కవి పండితుడు తెలుగు సాహిత్యంలో అరుదు.

శ్రీనాథునికి మాతృ దేశాభిమానం, మాతృభక్తి ఎక్కువ. కాశీ ఖండం లోని నారద, వైశ్వానరుల మధ్య సంభా షణలో శ్రీనాథుడు రచించిన పద్యం ఆయన మాతృభక్తి దర్పణం లాంటిది.

> ''జననీ జనకుల గొలుచుట తనయునకును ముఖ్యమైన ధర్మము జననీ
> జనకుల గొల్చుట కంటెను దనయున కభ్యధికమైన ధర్మము గలదే''
>
> (కాశీ ఖండం 4 - 17)
>
> ''సర్వ తీర్థంబువుల కంటెను సమధికంబు పావ నంబైన జనయిత్రీ పాద జలము
> వరతనూజు కఖిల దేవతల కంటె జనని యెక్కుడు సన్నుతాచారనిరత''
>
> (కాశీ ఖండం 4-20)

శ్రీనాథుని వ్యక్తిత్వం విలక్షణమైందని చెప్పక తప్పదు.

శ్రీనాథుని కవితా తత్వం :

విద్వాంసులకు ఔషధం వంటి శృంగారనైషధాన్ని, అయః పిండం వంటి కాశీఖండాన్ని ఆంధ్రీకరించి తన వాగ్వైభవ ప్రాభవాన్ని చాటిన కవి సార్వభౌముడు శ్రీనాథుడు. స్వదేశాభిమానంతో ఆంధ్రుల జీవన విధా నాన్ని తనివితీరా పాడాడు. తెలుగు వీరుల శౌర్య పరాక్ర మాలను అందరూ పాడుకొని ఆనందించడానికి అనువుగా మంజరీ ద్విపదలో పల్నాటి వీరచరిత్రను గానం చేశాడు.

శ్రీనాథుడు తన రచనల ద్వారా వర్తమాన కవులకే కాక భవిష్యత్ తరాల వారికి కూడా స్ఫూర్తిని కల్గించిన కవి. శ్రీనాథుని రచనలు ఆ కాలం నాటి సాంఘిక జీవనం, జాతి ధర్మం స్పష్టంగా ప్రతిబింబిస్తాయి. ఆ కాలం నాటి కవిత్వంలో శైలి, ప్రక్రియ, వస్తువుల పరిణామం శ్రీనాథుని కవిత్వంలో చక్కగా కనిపిస్తున్నది. కవికి స్పందించే గుణం ప్రధానం. శ్రీనాథుడు తన పరిసర సమాజంలో కనిపించే ప్రాకృతిక సౌందర్యానికి విశేషంగా స్పందించిన కవి. స్త్రీ సౌందర్యానికి మరింతగా స్పందించిన సరస హృదయుడు. శ్రీనాథుని సౌందర్యారాధన అతని చాటువుల్లో పరాకాష్ట నందుకున్నది.

శ్రీనాథుడు కావ్యరచనను రస మార్గం పట్టించిన రస స్రష్ట. శ్రీనాథుడు శృంగారాన్ని వర్ణించిన అంతమాత్రాన ఆయన శృంగార పురుషుడు అని చెప్పడం అనుచితం. పింగళి లక్ష్మీకాంతం గారన్నట్టు శ్రీనాథుడు, "పుట్టుకచే సౌందర్య దిదృక్షువు. దానికి తోడు పరిహాస రసికుడు. చక్కని రూపము కంట బడినపుడు మనసార నానందించి నోరార వర్ణించుట యు, హాస్యరస పాత్రము కాదగిన వింత వస్తువునో, వింత రూపమునో చూచినపుడు తాను నవ్వి మనల నవ్వించుటయు అతని అతని స్వభావము". (ఆంధ్ర సాహిత్య చరిత్ర, పుట 440)

శ్రీనాథుని రచనలో భక్తి శృంగారముల సమతుల్యత గోచరిస్తుంది. శ్రీనాథుడు లౌకిక శృంగారాన్ని వర్ణించే సందర్భంలో సంపూర్ణ స్వేచ్ఛా మనస్కుడు. దివ్య శృంగారాన్ని వర్ణించే సందర్భంలో సంపూర్ణ భక్తి భావ బద్ధుడు. శ్రీనాథుని భక్తి భావ భరితమైన రచన అనుభవైక వేద్యంగా ఉంటుంది.

"ఆనందంబు నర్ధరాత్రములఁ జంద్రాలోకముల్ కాయఁగా
నానా సైకత వేదికా స్థలములన్ నల్దిక్కులన్ శంభుగా
శ్రీనాథున్ దరుణేందు శేఖరు శివున్ శ్రీకంఠునిం బాడుచున్
మేనెల్లం బులకాంకుర ప్రకరముల్ నిండార మిన్నేటి లోన్"

(భీమేశ్వర పురాణం 2 - 91)

అగస్త్య మహర్షి ఇసుక తిన్నెలలో శ్రీకంఠుని పాడుతూ శరీరమంతా పులకాంకురమైన ఈ సన్నివేశంలో మనకు కనిపించేది ఒళ్ళు మరచి, తన్మయత్వంతో శివుణ్ణి గానం చేస్తున్న శ్రీనాథుడే. శ్రీనాథుడు ఈశ్వరార్చన కళాశీలుడు అయినప్పటికీ అన్యమత ద్వేషికాడు. శ్రీనాథుడు జీవన కాలపర్యంతంలో ఎన్నడూ తన ఆత్మవిశ్వాసాన్ని కోల్పోయి అస్వతంత్రుడుగా కనిపించలేదు. చిట్ట చివరికి తన అవ సాన కాలంలో కూడా దివిజ కవివరు గుండియల్ దిగ్గ రనగ అమరపురికి వెళ్లిన ధీరుడు శ్రీనాథుడు.

పోతన కూడా శ్రీనాథుని వలె భగవంతుని నుతించే సందర్భంలో పారవశ్యాన్ని పొందడం కనిపిస్తుంది.

పరమ భాగవతోత్తముడైన ప్రహ్లాదుని భక్తి పారవశ్యాన్ని వర్ణించే సందర్భంలో పోతన ప్రహ్లాదునితో మమేకమైన తీరు ఇందుకు నిదర్శనం.

"అడుగడ్గునకు మాధవాను చింతన సుధా
మాధుర్యమున మేను మఱచు వాని
నంభోజ గర్భాదు లభ్యసింపఁగ లేని హరిభక్తి పుంభావ మైన వాని
మాతృగర్భము సొచ్చి మన్నది మొదలుఱుగా జిత్త మచ్యుతు మీఁదఁజేర్చు వాని
నంకించి తనలోన నఖిల ప్రపంచంబు శ్రీ విష్ణు మయ మని చెలఁగు వాని
వినయ కారుణ్య బుద్ధి వివేక లక్షణాది గుణముల కాట పట్టయిన వాని"

(భాగవతం 7-160)

భక్త కవి అయిన పోతన సాధన చేసినది కూడా ఇదే.

అంబరీషోపాఖ్యానంలో భక్తులకు రాజ్య భోగాలు కూడా నరకప్రాయమని చెప్పిన మాటలు కూడా పోతనకు సరిపోలుతాయి.

"హరిఁ గొల్చు చుండువారికి బరమేష్ఠి పదంబు మొదలు పద భోగంబుల్
నరక నమములను తలంవున ధరణీ రాజ్యంబుతోడి తగులము మానెన్"

(భాగవతం9-150)

పోతన కూడా భాగవత రచనను రాజులకు అంకిత మివ్వడం పడువు కూడు భుజించడం వంటిదని రాజాశ్ర యాన్ని తిరస్కరించిన భక్త కవి.

ఈశ్వరార్చన కళాశీలుడైన శ్రీనాథుని వలె పోతన కూడా విష్ణు కథామృతంలో మునకలు వేసినా పర మతాన్ని ద్వేషించిన వాడు కాడు.

"చేతులారంగ శివునిఱు బూజింపడేఁని
నోరు నొవ్వంగ హరి కీర్తి నుడువఁడేని
దయయు సత్యంబు లోనుగాఁదలపఁడేనిఁ
గలుగ నేటికిఁదల్లుల కడుపుఁజేటు" (భాగ, 1-14)

- అంటూ శివకేశవులకు భేదం ఎరుగని అద్వైతిగా పోతన కనిపిస్తాడు.

శ్రీనాథుడు పండిత కవి. ఉద్దండ పండితులతో పరివేష్టితమైన రాజాస్థానంలో ప్రశంశా పాత్రమైన ప్రౌఢ కవిత్వానికి శ్రీనాథుడు ఒరవడి పెట్టాడు. ప్రజా బాహుళ్యం ఆనందంగా పాడుకోవడానికి అనువుగా పల్నాటి వీర చరిత్రను మంజరీ ద్విపదలో గానం చేసిన వాడు శ్రీనాథుడు. పోతన సహజ పండితుడు, ప్రజాకవి. ఆయన ఉద్దేశ్యంలో భాగవత కథామృతాన్ని ప్రజలందరూ తనివి తీరా పాడుకుని ఆస్వాదించాలి, తరించాలి. అందుకే పోతన పండిత ప్రశంశ పాత్రమైన అర్థాలంకారాలకంటే, ప్రజారంజకమైన శబ్దాలంకారాలకే పెద్ద పీట వేశాడు.

"మామా వలువలు ముట్టకు
మామా కొనిపోకు పోకు మన్నింపు తగన్
మా మాన మేల కొనియెదు
మా మానస హరణ మేల మానము కృష్ణా"

(భాగ. దశ. పూ. భా. 882).

సందర్భోచితంగా అర్థాలంకారాలను కూడా అర్థ వంతంగా ప్రయోగించడంలో పోతన సిద్ధహస్తుడు.

వామనావతార ఘట్టంలో పోతన చూపిన ప్రతిభ అనన్య సామాన్యమైంది. మూలంలోని అర్థ సౌందర్యానికి పోతన శబ్ద సౌందర్యాన్ని కూడా జోడించి జన హృదయ రంజకంగా రచించాడు.

"ఇంతింతై వటుఁడంతయై ..."
" రవిబింబం బుమువమింప.."

- అంటూ, వామనుడు త్రివిక్రముడై పెరుగుతున్న తరుణంలో రచించిన రెండు పద్యాలు మూలంలో లేనివే.

అలాగే, గజేంద్ర మోక్ష ఘట్టం కూడా అత్యుత్తమ కవిత ప్రతిభకు తార్కాణంగా నిలుస్తుంది. ఆపదలో చెప్పిన భక్తుడు తనను రక్షించమని ఆర్తిగా ప్రార్థించే సందర్భంలో రచించిన

"ఎవ్వనిచేఁ జనించు..." పద్యం నిరాకార నిర్గుణ పరబ్రహ్మ స్వరూపాన్ని మన ముందు ఆవిష్కరిస్తుంది. ఆర్తితో పిలిచినప్పటికి దైవం కరుణించకుండా ఆలస్యం చేస్తున్న సందర్భంలో రచించిన

"కలఁడందురు దీనుల యెడఁ.."

- అన్న పద్యం మానవ సహజమైన సంశయాత్మక ధోరణి ప్రతీకగా కనిపిస్తుంది. ఈ సంశయాన్ని జయించి నిజమైన విశ్వాసంతో, ప్రపత్తితో

"లావొక్కింతయు లేదు ధైర్యము విలోలంబయ్యె..... నీవే తప్ప నితఃపరంబెఱుగ" నంటూ సర్వస్య శరణా గతుడైన భక్తుడు పిలిచిన మరుక్షణమే దర్శనమిచ్చే ఆర్త త్రాణ పరాయణుడు భగవంతుడని నిరూపించే విధంగా ఈ సన్నివేశాన్ని పోతన భక్తిరస వ్యంజకంగా తీర్చిదిద్దాడు.

గోపికలు శ్రీకృష్ణుని అన్వేషించే సందర్భంలో రచించిన

"నల్లనివాఁడు పద్మనయనంబుల వాఁడు కృపార సంబు పైఁజల్లెడు వాఁడు..."

(భాగ. దశ.పూ.భా1013)

వంటి పద్యాలలో పోతనలో నేటి భావ కవులకు సహజమైన ఆత్మాశ్రయ ధోరణి కూడా కనిపిస్తుంది.

మొత్తంగా శ్రీనాథుడు, పోతన ఇరువురిలోనూ భక్తులకు సహజమైన పారవశ్యం, కవులకు సహజమైన అలంకార ప్రియత్వం, పండితులకు సహజమైన రస ప్రీతి కనిపిస్తాయి. అయితే శ్రీనాథుని వ్యక్తిత్వంలో, కవిత్వంలో ఆత్మగౌరవ సంస్కారము, స్వేచ్ఛా ప్రియత్వం దర్శనమిస్తే, పోతనలో వ్యక్తిత్వంలో ఇవి దర్శనమిస్తాయి. పోతన కవిత్వంలో కన్పించే శరణాగతి ఆయనను ఆంధ్ర సాహిత్యంలో పరమ భాగవతోత్తమునిగా నిలుపుతోంది.

ఆధార గ్రంథాలు :

1. కవి జీవితములు - గురజాడ శ్రీరామమూర్తి, వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్, చెన్నై 1913
2. ఆంధ్ర కవుల చరిత్రము, ప్రథమ భాగము (పూర్వాంధ్ర కవులు)
3. హితకారిణి సమాజం, రాజమండ్రి - 1917
4. సమీక్షణం - డాక్టర్ సి.నారాయణరెడ్డి
5. పోతన - నిడదవోలు వెంకట్రావు నేషనల్ బుక్ ట్రస్ట్, 1961
6. ఆంధ్ర సాహిత్య చరిత్ర - పింగళి లక్ష్మీకాంతం
7. తెలుగు సాహిత్య సమీక్ష (మొదటి సంపుటం) - డాక్టర్ జి నాగయ్య.

BHAVAVEENA
Vol. 17, Issue. 7, July 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

యం.కె దేవకి గారి కథలు - స్త్రీలపై జరిగే అన్యాయాలు, వారి హక్కులు

- జి. శోభన కుమారి, పరిశోధక విద్యార్థి, తెలుగు అధ్యయన శాఖ, శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి.

మన నాగరికత మొదలైనప్పటి నుండి మహిళలు అన్నీ రంగాల్లోనూ పాల్గంటూనే ఉన్నారు. ఆధునికంగా నేటి మనిషి ఎంత అభివృద్ధి చెందినా స్త్రీ పురుషుల మధ్య వ్యత్యాసాలు అనేవి నిత్యం మనకు కనపడుతూనే ఉన్నాయి. విద్య, ఉద్యోగం, వేతనం, ఆస్తి, రక్షణ, విశ్రాంతి, ఆరోగ్యం ఇలా అన్నింటిలోనూ పురుషునికో నీతి, స్త్రీకో నీతి. ఆనాటి నుండి నేటి వరకు ముఖ్యంగా స్త్రీలపై అణచివేతను సాగిస్తున్నారు. అప్పటి నుంచి స్త్రీలు అనేక రకాల ఉద్యమాలను చేశారు ఇంకా చేస్తూనే ఉన్నారు.

యం.కె దేవకి గారి కథలలో స్త్రీలకు సంబంధించిన విషయాలనే ఎక్కువగా చూపించారు. ఒక స్త్రీ నిత్యం తల్లిగా, చెల్లిగా, భార్యగా ఇలా అనేక రకాల పాత్రలను పోషిస్తుంది. అయినా ఎందులోనూ స్త్రీకి సమానమైన హక్కును ఇవ్వలేదు. దేవకి గారు ఇలా స్త్రీ పడే ఆవేదన, ఆక్రందనలు ఆమెను కలచివేసాయి. వారి కష్టాలను, వారిపై జరిగే అన్యాయాలను ప్రజలందరికి తెలిసేలా రచనలు చేశారు. "ముళ్ళదోవ" అనే కథాసంపుటి ద్వారా ఒక స్త్రీ జీవితం ఎప్పుడూ ఒక ముళ్ళ కంచేనని, ఆమె దారి ముళ్లదారి అని దేవకి గారు తెలియజేశారు. అదే విధంగా మంటల ఒడిలో అనే కథాసంపుటి ద్వారా ఒక స్త్రీ హృదయంలో ఎప్పుడూ ఊహించని ఓ అగ్ని పర్వతం ఉందని అంటారు. స్త్రీ జీవితం కూడా కొంచెం తేడా వచ్చినా ఆమె మనసులో నిత్యం రగిలే జ్వాల ఉంటుందని తెలియజేశారు.

దేవకి గారు కొన్ని వ్యాసాల ద్వారా కూడా మరి కొన్ని విషయాలను గుర్తు చేస్తూ వాటిని మార్చాలని చెప్పారు. అవి "సాగుతున్న ఉద్యమాలు - ఆగని ఘోరాలు" తన రచనల ద్వారా స్త్రీలపై జరిగిన అన్యాయాలను ఇంకా జరగబోతున్న అన్యాయాలను ఆపాలని, స్త్రీలను కాపాడడం కోసం కొంతమంది ఉత్తమ పురుషులు కూడా పాటుపడ్డారని తెలిపారు. అదేవిధంగా అనేక మంది స్త్రీలు కూడా ఉద్యమాలు చేసి బాల్యవివాహాలను, సతీ సహగమనాన్ని, వితంతువుల వివాహాలను ఇలా అనేక కార్యాలను చేపట్టారు. మన సమాజంలో స్త్రీని కూడా పౌరునిగా గుర్తించాలని, ఆమెకు కొన్ని హక్కులు ఉండాలి అన్న విషయాలను తన రచనల ద్వారా తెలిపారు.

స్త్రీని ఒక ఆట వస్తువులా ఆమె అందంతో విచ్చల విడిగా వ్యాపారం చేస్తున్న వారిపై ఉద్యమాలు చేసినా వారిపై జరిగే ఘోరాలను ఆపటం వీలుకావడం లేదు. ఆది తీరని ఆవేదన. భారత రాజ్యాంగం స్త్రీలకు, పురుషులకు సమానమైన హక్కులను కల్పించింది. అలాగే ఒక స్త్రీ వైవాహిక జీవితంలో ప్రసవ సమయం రావటం ఆమెకు విశ్రాంతి పొందే హక్కు కలదు అని "ప్రగతి సాధన - ప్రసవ వేదన" అనే రచన ద్వారా ప్రజలందరికి తెలియజేశారు దేవకిగారు. ఆధునిక సమాజంలో మానవజాతి ఎదుర్కొంటున్న ఒక భయంకరమైన పిశాచి వరకట్నం. అదే విధంగా ప్రపంచ వ్యాప్తంగా స్త్రీలపై జరుగుతున్న హత్యాచారాలకు అంతులేకుండా పోయింది.

మానవ సమాజంలో సగంమంది స్త్రీలు ఉన్నారు. స్త్రీ, పురుషులు సమానంగా ఉన్న స్త్రీకి మాత్రం స్వేచ్ఛ హక్కు అనేది లేదు. కాబట్టి "ప్రపంచ స్త్రీలంతా ఏకంకండి" అని దేవకి గారు వారి రచనల ద్వారా పిలుపునిచ్చారు.

వందమంది ఉపాధ్యాయులకన్నా చదువుకొన్న ఒక తల్లి చాలా గొప్పది. అటువంటి ఆడపిల్లలకు విద్యా హక్కు అంటే విద్యను పొందే హక్కు కలదు అని, "ఆడపిల్ల చదువు-అవనికి వెలుగు" అని ప్రపంచం చాటి చెప్తుంది. స్త్రీ, పురుషులలో లైంగికత అనేది ప్రధాన పాత్ర వహిస్తుంది. ఈ విషయంలో పురుషునికి ఉన్నంత స్వేచ్ఛ

స్త్రీకి లేదు. ఆడపిల్ల పుట్టినప్పటి నుంచి అనేక రకాల నియమాలను విధిస్తూ తనలోని స్వేచ్ఛా హక్కును అణచి వేస్తూ వచ్చారు. అందుకే మన దేవకి గారు గౌరవంలేని స్వేచ్ఛ స్త్రీకి ఎందుకంటున్నారు. వారసత్వ విషయంలోనూ అంతే. తల్లిగా జన్మనిచ్చి, పెంచి, పాలిచ్చి పోషించిన స్త్రీని చిన్న చూపు చూస్తూ పెంచుతుంటారు. గర్భాన ఆడపిల్ల అని తెలియగానే అంతం చేస్తున్న రోజులు ఎన్నో చూసాము. స్త్రీకి గర్భంలోనే రక్షణ హక్కును పొందే అధికారం కలదని అందరికి తెలియజేయాలి. ఇది అందరి భాద్యత. కాని అలా జరగలేదు అన్న నిరాశే స్త్రీకి ఎదురౌతున్నది.

దేవకిగారు ముళ్ళదోవ కథాసంపుటిలో రాబందు కథలో ఒక భార్యకు భర్తను ప్రశ్నించే హక్కు ఎందుకు లేదని నేటి భార్యలలోని అందరిలో ఆలోచనలను రేకెత్తించారు. అలాగే దేవకి గారు కండకావరం, చీడపురుగు, గంగిరెద్దు, బోగిమంట, వ్రతం చెడినా... ఇలా అనేక కథల ద్వారా జరిగే అన్యాయాలను చూపిస్తూ వారికి కొన్ని హక్కులు కలవని తెలియజేశారు.

